

1959 జనవరి

# అభ్యుదయ

## సాహిత్య మాసపత్రిక

విళంబి - పౌష్యం

1959 - జనవరి

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం

విజయవాడ - 2.

అర్ధరూపాయి.

## Extracts From The Proceedings of The Director of Public Libraries, Andhra Pradesh – Hyderabad.

*R. C. No.* 1533 *M* 4/57. *Dated* 27-1-'58.

The following Monthly magazine is commended for use in all the Public Libraries in the State.

Name : "Abhyudaya"........................

★

## ఈ సంచికలో

బి. శశి, యం. వి. యస్. శర్మ, మాదిరాజు రంగారావు, డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావు, కాముఋషి సత్యనారాయణవర్మ, 'సత్యం', కొండపల్లి కోటేశ్వరమ్మ, సంజీవదేవ్, కొడవటిగంటి, దయానంద్, కొమర్రాజు వినాయకరావు, రమణశ్రీ, 'సుదర్శన'.

★

ముఖచిత్రం:
కళ్యాణ్ ప్రసాద శర్మ

University of Hyderabad
LIBRARY
No. 38421
4 MAY 1989
500 134

★

సంపాదకవర్గం:

*శ్రీరంగం శ్రీనివాసరావు, కొడవటిగంటి కుటుంబరావు, అనిసెట్టి సుబ్బారావు, తుమ్మల వెంకటరామయ్య, కె. వి. రమణారెడ్డి.*

# అభ్యుదయ

సంపుటి 5 ]   1959 - జనవరి   [ సంచిక 1

## శుభాకాంక్షలు

అనంతకాల చరిత్రలో ఒక సంవత్సరం అల్పమే కావచ్చు. కాని ఒక్కొకప్పుడు చారిత్రకంగా దాని ప్రాముఖ్యం అత్యంత ప్రాధాన్యం అవుతుంది. చావు పుట్టుకలవలెనే, సంవత్సరాంతాలూ, నూత్న వర్షాగమనాలూ కొందరికి అతి సామాన్య విషయాలుగా కన్పించవచ్చు. కాని గతించిన 1958 - ఇపుడిపుడే ప్రవేశించిన 1959 - అలాంటివి కావు. ప్రపంచేతిహాసంలో అత్యంత ప్రధాన పాత్ర నిర్వహించిన, నిర్వహించనున్న సంవత్సరాలివి. ప్రపంచ వ్యాపితంగా అవశేష దాస్య బంధాలను త్రెంచుకొని స్వేచ్ఛాగీతాలను ఆలపించుతున్న దినాలివి. పశ్చిమాసియాలో, ఆఫ్రికాలో, ప్రాచ్య దేశాలలో నూతన జాగృతి వెల్లివిరిసి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను చాటుకొన్న కాలమిది. కాలచక్రాన్ని వెనుద్రిప్పి, కూలిపోతున్న తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోడానికి మారణహోమానికి సిద్ధమై అడుగడుగునా అపజయాలు పొంది, చావుతప్పి కన్ను లొట్టపోయిన సామ్రాజ్యవాదం కాలగర్భంలో కలిసిపోతున్న సమయమిది. మానవుని చిరకాల అన్వేషణ, కృషి ఫలితంగా ప్రకృతిపై అపార విజయాలు సాధించుతున్న శుభసమయమిది. చంద్రునితో చెలిమి, సూర్యునితో పొత్తు మానవుని ఆటబంతులయ్యే నూతన యుగారంభానికి త్రోవవేసిన వత్సరాలివి. సంకెలలు విదలించుకొన్న స్వతంత్ర నవచైనా జనావళిలో నిద్రాణితమైయున్న అపార శక్తి మేల్కొని, పారంపర్య అనుభవానికి విజ్ఞానశాస్త్ర సంపదను జోడించి, పసిడిపంటల పండించి కరువు కాటకాలకు స్వస్తివచనం పల్కుతూ, వెలుగుబాట చూపుతున్న లోకసంక్రాంతి పర్వదినాలివి. అనంత త్యాగాల ఫలితంగా మానవుడు సాధించిన ఈ అపూర్వ విజయాలకు విఘాతం కల్పించేవారినొక కంట కనిపెట్టాలని కోరుతూ, శాంతి సుఖ విజ్ఞాన సుస్వప్నాలు ఫలించాలని నూతన పర్వదిన శుభాకాంక్షలను అందించుతున్నాం.

★

# కాలం జారదు కథ కదలదు

వి. శశి

గడియారం నోట్లో కాలం చిక్కబడి పోయింది. కాలాన్ని మొయ్యలేక కాస్సేపాపి పతికిలబడింది గడియారం. దూరంగా చీకటిలో వింతనిచూస్తూ రెండు నక్షత్రాలు అవీ ఆగిపోయాయి.

"ఎల్లాగా గడియారం నరాల్లో నత్తున పల్లబడిపోయింది. కదలవయ్యా కథ" అంటుంది గాని. దాని కంఠంలో నిర్జీవపు పొంగు. ఆ చూపుల్లో విషం గూపులు. (ఆ కదలికలో బాకల పొక్కులు రేగిన సలుపు.)

గాని కూడా కదలటం లేదు.

గడియారం గోడమీద కూర్చుని ప్రసవ వేదన పడబోయి, ఆగిపోతుంది. కాలాన్ని ప్రసవించితే, కథ కదులును. అది జారదు: ఇది కదలదు.

గోడ గడియారంపైకి చీకటిమూగి వేడిపుట్టించే యత్నాలు చేస్తుంది. అయినా కాలం ఊడి రాలిపడుతుందనే ఆశలేదు.

ఈ కాలంపైకి చీకటిమూగి లెక్కలేనన్ని సంవత్సరాలు గతించిపోయాయి. అయినా కాలం గుర్తించదు. చీకటి పేరుకుపోయి బెరడు కడుతుంది. కథ కదలదు.

బల్లమీద తెల్ల కాగితాలపై (ఆరోజుల్లో అయితే తామ్రశాసనాలూ, శిలా శాసనాలూ ను) పరుగెట్ట వలసిన కథ అలాగే ఆగిపోయి, గోడగడియారం ముఖంలోకి ఆశాదృక్కులు సారిస్తుంది. అదికాస్తా కదిలితే కథ కంచికో, పంచకో దారితీసును.

గడియారం చుట్టూ దుమ్ము చేరింది. అది రాలుతున్నప్పుడల్లా గడియారం మూలుగుతుంది. వ్యాధి ముదురుతుందో, స్వర్గముఖం పట్టిందో కూడా కథకి అర్థం కావటంలేదు.

(కథ పంపలు 'పరిగింది.' కంచెలు పరచిపోకపోవటానికి గుచ్చుకున్న ముళ్ల బాధ తప్పితే మరో కారణం లేదు. కాబట్టి కథ కంచికెలాగూ తిరిగి వెళ్ళలేదు.) కథ భవిష్యత్కార్యక్రమం ఆలోచించబోయి, అలాగే ఆగిపోయింది.

యోచించవలసింది మాత్ర మేముంది కథకి? కథ తానెక్కడ ఆగిపోయానో కూడా మరచిపోయింది. అంత కాలానంతరం పూర్వస్మృతులు మెదడులో బుసలు కొట్టి అలసిపోయి, ఆవులిస్తున్నాయి.

అవును. కథకి బాగా స్థూలకం వస్తున్నాయి.

పరమాణుశక్తిని, పరమాణువులు కూడ గట్టుకున్న తరవాత, భూమి నిట్టూర్పుల్లో వేడి చల్లారినప్పుడు కథ పుట్టింది. ఎయిం బాగా అవతరించి, న్యూక్లియస్‌లో జీవం పొంగి, రాత్రిందివాల పరిణామం చూచింది. ఆనందంతో ఊపొంగి అంగాలు చాచింది.

తరువాత కథ ముళ్ళదారుల్లో నడిచింది. కొండరాళ్ళలో పొర్లింది. చీకటి కోణాలలో నిద్రించింది. ఆ గాయాలింకా సలుపుతున్నాయి. ఆ సలుపు ద్వారానైనా ముందుకు కదలాలంటే, కాలం కదలదు!

[కథ తెల్లబోయి తెల్లకాగితంమీద, గోడమీద గండుపిల్లిలాగ కూర్చుని చూస్తుంది గడియారం ముఖ కవళికల్లోకి.

గడియారాని కేదో చెప్పాలనుకుంది. చెప్పాలి. కాని, చెప్పవలసింది మరిచి పోయేటంత బాధలో చిక్కుకుంది కథ. జీవన్మరణసమస్యతో సతమతమైపోతున్న కథ.]

నడిచిన దారులన్నీ చీకటిదారులే. రాళ్లూ, రప్పలూను. మంటలూ, పెంటలూ దారికడ్డంగా. కొత్తని అరకాలులో ఒత్తుకుపోవడానికి సిద్ధంగా ముళ్లు. అంధకారం గుప్పిట్లో అజ్ఞానిలాగ కథ ఖైదు చెయ్యబడింది. ఆకలి లయగా అరిచింది. బాధతో నినదించింది. అగ్నిలాగ జ్వలించబోయి చీకట్లో పల్లబడిపోయింది.

"నన్నిలాగ బంధించినవా రెవరు?"

తనలోనే ప్రశ్న.

"చీకటి ఆకలి!"

ప్రశ్న చుట్టూ సమాధానం.

చీకటి గుప్పిట్లో చిద్రుపలైపోతున్న జీవశక్తిని కూడగట్టుకుని, చేతులు విరుచుకోబోయింది కథ. చేతులు కదలలేదు. నోరుకూడా... చేతులనిండా అరదండాలు; చుట్టూ అంధకారం...

కథకే కనుకనబడింది కాదు.

మరొకరి కెలాగ కనబడుతుంది కథ?

కథ నడవాలని చూచింది. అన్నీ నల్ల రాళ్ళు. అంతేనా! కాళ్ళు కదలటం లేదు. పాపం! కాళ్లకి కూడా సంకెళ్లు. పాతరాతిపైన తన అచేతన స్థితికి కుందింది. కుందటం చేతగాక కుందింది. ఆ పరిస్థితిలోనే అలమటించింది కథ. ఆకలేసి చీకటి మేసింది. అజ్ఞానంతో ఇల్లు కట్టి, అందులో కాపరం పెట్టింది.

కథకు జీవితం నచ్చలేదు. ఎందుకు నచ్చలేదో దానికి అర్థం కాలేదు. చీకటిని ప్రశ్నించబోయి, చీకటికే సమాధానం చెప్పి, ప్రశ్న సమాధానంగా గ్రహించి, కథ పాతరాతిమీద తన పాదం మోపింది.

చుట్టూ కొండలు అల్లుకున్న పొదుల్లాగ చెల్లాచెదురై ప్రవహిస్తున్న నదులు, అడవులు. దెయ్యాల్లాగ తలలు విరబోసుకున్న చెట్లు, జంతువులతో కథ కదలబోయి, కదలాననుకుని సంతృప్తి పడింది. కథనిండా తృప్తి నల్లమందులాగ ఆవహించింది.

కథ వెనక తరుముకుంటూ సూర్యుడూ, సూర్యుడిని తరుముకుంటూ కథా పరుగెత్తారు. కాలం ప్రవహించింది. గాలి ప్రవహించింది. కథ స్లోయో మాకన్న కు వెళ్ళనంత సంబరపడింది. కథాంతం విషాదాంతమో, సుఖాంతమో తెలిసింది కాదు. 'సీక్రెట్' అయినా కావచ్చు. ఏదైతేనేం. కథకి మరొక ఆలోచన లేదు. ఆది గోళాల పరిభ్రమణంలో పోటీపడి పరుగెట్టింది.

సూర్యుని వేడినీ, వేగాన్నీ చూచి ఆశ్చర్యపడింది కథ. గాలి తీవ్రత చూచి భయపడింది.

ఎంత వేగం
ఎంత తీవ్ర స్వరూపం
ఎంత తేజం!

ఆ తరవాత కథ కూడా కదలాలని కదలలేకపోయింది. ఆదర్శం వెన్నమీద పొడుస్తుంది. ఆవేశం హృదయాన్ని దహిస్తుంది. ఆలోచన మెదడులో జ్వలిస్తుంది. ఆదర్శం బాహువులమధ్య పల్లవిస్తుంది. ఆశ అలసత్వాన్ని చీలుస్తుంది.

అంతవేగంగా పరుగెట్టాలి.

అంతే. అలాగ ప్రకాశించాలి.

అలాగ...అలాగ...అంతే సరీగా అలాగ.

ఎలాగో కథకి అర్థం కాలేదు. అయినా ఆలోచన చేస్తూ సాగింది.

కొండల్ని తొలిచి, బండల్ని నలిచి శక్తుల్ని మరింత దగ్గిరికి తెచ్చుకొని పరీక్షించింది. ప్రశ్నించబోయి, పరవశంలో కొండలకీ బండలకీ మొక్కి, బండబారిపోయింది కథ.

ఎన్నో బాగా గడిపిన రాత్రులూ, జంతువుల్లో జంతువుగా జాగారం చేసిన రాత్రులవంటి ఉదయాలూ స్మృతికి తెచ్చుకుంది. అందని కాంతికంటే అందిన అంధత్వం మేలని సంతృప్తిగా నిట్టూర్చింది. సంతృప్తి కథలో క్లోరోఫారం కోరింది. కథ కదలలేక బంధురాయిగా గుళ్ళపైనా గోపురాలపైనా అవతరించి ఆగిపోయింది.

ఆలోచనలే అసహ్యమనిపించాయి కథకి. స్త్రీని తరిమి, చుట్టూతిరిగి, జుట్టుపట్టుకొని చుట్టూ చెట్లలోపడి' నదులప్రక్కతూరి, ముళ్ళలో వాలిపోయినా సరే - ఆ స్త్రీతో అక్కడ - ఎంతో ఘోరం అనిపించింది. కథకి వేమీ నచ్చటంలేదిప్పుడు. అప్పుడు నవ్వుకున్నా, ఆ నవ్వు బాధ కలిగిస్తుందిప్పుడు.

గుడి మధ్యరాతిలో నగిషీల మధ్య నాణ్యంగా వెలిసి ఆగిపోయింది కథ.

ఆ రాళ్ళలోనే నిలబడి చేతులు విరుచుకోబోయింది. ఇంకా శృంఖలాబద్ధమై వున్నాయి. కదలటంలేదు.

ప్రక్కనేదో మెదిలింది.

"ఎవరు నువ్వు"

కథ ప్రశ్నించింది.

"నే నెవరినైతే నీకేం?"

"అదికానులే, నిన్ను చూస్తుంటే కదులుతున్నట్టుంది నాకు. ఇక్కడున్నావేం?"

"నా కవసరం."

"చెప్పకూడదా?"

కథ ప్రాధేయపడింది.

"బందీకి! ప్రాధేయపడే లక్షణం...!"

చిన్న నవ్వు. నవ్వులో హేళన. ప్రాణాలు పిండే హేళన.

"బందీని కాదు. బంధనాలు త్రెంచుకొనటానికే ప్రయత్నం. అందుకే బాధ. అందుకే ఆవేదన."

"నిజంగా!"

"ఊఁ!"

"నీకు నా ధన్యవాదాలుస్మీ!"

అంతవరకూ ముడుచుకున్న కథ ముఖంలో నవ్వులు నాట్యం చేశాయి.

"నువ్వు బంధనాలు ఛేదించుకో. అప్పుడే నాకు స్వేచ్ఛ. అబ్బ! ఈ చీకటి మధ్య మిణుకు మిణుకుమంటూ — ఏం సుఖం. కాని ......... నువ్వు నన్ను ప్రేమించలేవూ?"

"అంటే!" ఆశ్చర్యంగా అడిగింది కథ.

"ఏముంది. ఆ రాళ్ళని ప్రేమించానని భ్రాంతిపడుతున్నావ్. వాటిలో ఏదో వుందనుకుంటున్నావు. అయినా కొంత మేలే జరిగింది. ఆత్మ కోక శిక్షణ. నువ్వు నన్ను ప్రేమించు నేస్తం."

"అంటే!" కథ కింకా అర్థం కాలేదు. అదేదో క్రొత్త భాష వింటున్నట్టు అయ్యింది కథకి.

"నువ్వు నన్ను ప్రేమించు. అంటే - మనసిచ్చి పుచ్చుకోవటం ప్రేమ. మనసు

నిలపటం ప్రేమ. ప్రేమ పవిత్రం. పవిత్రత ప్రేమ. స్వర్గద్వారానికి తాళం చెవి ప్రేమ."

ఆ శక్తి దూరంగా నిలబడలేక పోయింది. కథయొక్క ఆలోచనల సాలె గూడు మధ్య శలభంలాగ చిక్కుపడి, సాలెపురుగు లాగ మారిపోయింది. ఆ అల్లికలలో వింత కాంతులు. వింత వింత నగిషీలు.

కథకంతా కొత్తగా కనబడింది. దాని హృదయాంతరాళంలో కొత్త జల్లు. నూతన భావాల మొలకలు.

చక చకా నడిచింది కథ.

పకపకా నవ్వింది కథ

నూతన భావాలతో పరిమళించింది కథ.

"ప్రభూ అన్ని దిక్కుల నుండి ఉత్తమ ఆశయాలు నాదగ్గిరికి చేరేటట్టు చెయ్యి" అని వేడుకుంది కథ.

మరొక రోజున —

"సమ్యక్ దృష్టి !"

సమ్యగ్దర్శనం !!

"సమ్యక్ సంస్కృతి !!!"

అని రాగంతీసింది కథ.

మూడవ రోజున —

"నీ పొరుగు వాడిని నీవలె ప్రేమించు"

అని నినదించి, పంచకోశ ప్రాణాలు పీకి గుప్పిట్లో పెట్టి అమరత్వం పొందింది.

కథ "ఎంత మార్పు" అని నిట్టూర్చి, "నథింగ్ యీస్ ఫైనల్" అని గొణుక్కుంది.

కథాగమనం మనోవేగంతో పోటీ పడి సాగింది. వెనక్కి తిరిగితే కనబడక కరిగిపోయే కాలంలాగ సాగింది కథ.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం" అని కేకలేసింది.

రెక్కలు కట్టుకుని ఆకాశంలోకి
ఎగిరింది;

దిక్కుల్ని దాటి ఫక్కున నవ్వింది.

చుక్కల్లోకి పరుగెట్టింది.

ఒక్కసారి జలాంతర ప్రదేశాలు సందర్శించింది.

ఒక్క కాలంలో భూనభోంతరాళాల్లో కథ.

ఒక్క త్రుటిలో సర్వాంతర్యామి అయిన కథ.

చెక్కిన బొమ్మకు రత్నజీర అంటుకున్నట్టు చక్కగా, సర్వాంగ సుందరంగా కథ.

నూతనగీతంలో ప్రాణశక్తి అయినకథ.

ఈథర్‌లో కథ. రేడియోలో, టెలివిజన్‌లో; టెలిపతిలో కథ.

స్పుత్నిక్‌లో కూర్చుని ఖండాంతర వాసం చేసి, గ్రహాలతో నేస్తం చేసి వచ్చిన కథ.

అణువులో పరమాణువును విడదీసి, విడదీసి, అద్భుతశక్తిని కలుసుకున్న కథ.

అంతగొప్ప కథ హఠాత్తుగా ఆగి పోయి, తెల్లకాగితంమీద కూర్చుని, గోళ్ళు గిల్లుకుంటూ గోడ గడియారంపై చూస్తుంది.

గడియారం ముఖంపైని మృత్యుధూళి రాలుతుంది. దాని విషహస్తంతో నిమురుతుంది కంఠం. కాలం కదలటంలేదు. గంటక్రితం ప్రేలిన అణుబాంబు చిమ్మిన మృత్యుధూళి. కథ వళ్ళంతా కాలిపోయింది. కడుపులో పేగులు నులిపెడు

తున్నాయి. కాళ్ళు తెగిపోయాయి కథకి. కదలలేక కూర్చుంది కథ.

తెల్లకాగితం అందుకొని ముక్కుతూ, మూలుగుతూ రాసింది తీవ్రవేదనతో.

“వెంటనే అణ్వస్త్రాలు నిషేధించాలి”

కాని, అదెవరు ప్రవేశపెట్టాలో, ఎలాగో కథకి అర్థం కాక, అలజడితో ఆగిపోయి తెల్లకాగితంమీద తెల్లబోయి కూర్చుని, గడియారంలో కాలాన్ని చూస్తుంది...

కాలచక్రం కాళ్ళకి అణుశక్తి బంధనాలు బిగించింది గడియారం. గుండెల్లో బాధ. కథాగమనంలో అడ్డంకులు, చెడ్డ దారులు.

ఆగిపోయిన కథకి అంతకాలం ఊతకర్రఅయి అరిగిపోయింది.

“కాలచక్రం కాళ్ళకి గుండుసూది కాదయ్యా; గండుమేకు గుచ్చుకొంది. సెప్టిక్ కూడా అయ్యింది. కదలదయ్యా కథ” అని గీపెడుతున్నాయి కథని చూస్తున్న రెండు నక్షత్రాలూను.

పువ్వొత్తుల్లా కాంతిని జిమ్మే నక్షత్రాలు రెండూ నల్లగా మారిపోయి, కొవ్వొత్తులకోసం వెదకబోయి, అవి కూడా ఆగిపోయాయి.

కాలం ఆగదు —

కథ కదలదు.

ఎలాగ ?

(ప్రపంచ పరిణామం: కథ; రెండు నక్షత్రాలు: సూర్య చంద్రులు)



# నాచన సోముని నవీన గుణములు

“శ్రీమత్సకల భాషాభూషణ సాహిత్య రసపోషణ, సంవిధాన చక్రవర్తి, సంపూర్ణకీర్తి, నవీన గుణసనాథ నాచన సోమనాథ” మహాకవి ప్రాచీనాంధ్ర కవిలోకానికి శిరోభూషణము. కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మాటలలో “నన్నయభట్టారకుని ధారాశుద్ధియును, తిక్కన భావగాంభీర్యమును గలయికఁజెంది మన సోమనాథుని కవిత నాశ్రయించిన దనవచ్చును.” ఇతరకవులెవ్వరును సాధారణముగా ప్రయోగించి యెరుగని యుపమానములను, అర్థాంతరన్యాసములను, దృష్టాంతములను నిండు ప్రయోగించినాడు. మాటలు తేటగా నున్నను, లోతుగా ఆలోచించి తేగాని అర్థముగానట్లుగా పద్యములు రచించినాడు. ఆంధ్రకవులలో చిత్రకవిత్వము నెలయించినవారిలో ఇతడే ప్రథముడని కూడ శ్రీ శాస్త్రిగారు వ్రాశారు. నాచనసోముని “ఉత్తరహరివంశము”నుండి కొన్ని అనర్ఘమణులను మీ ముందు వుంచుతున్నాము.

ఈ పద్యాలకు లఘువ్యాఖ్య కూర్చినవారు శ్రీ యం.వి.యస్. శర్మగారు. వీరు ఒంగోలులోని సి. యస్. ఆర్. కళాశాలలో ప్రధానాంధ్రోపన్యాసకులు. తాము కవులు పండితులైనందున, సోమనాథుని కవితలోని తీయందనాలతో బాటు లోతులను బయల్పరచగల సమర్థులు. వీరికి మా కృతజ్ఞత. —సంపాదకులు.

## దేవజాణతనము

ఉ. లంజెనుఁ గాను నేను, విను, లావున నీవమరేంద్రుఁ గెల్చి, న
న్నుం జెరవట్టి తెమ్మని వినోదము చేసితిగాక, చిత్తమె
ల్లం జెడియుండ, రిత్తయొడలం జవిచేరునె? చిల్కవోయినం
బంజర మేమిసేయు? రసభంగము సంగతి లోన మెత్తురే?

— ప్రథమాశ్వాసము

దేవేంద్రుణ్ణి జయించి, సుధర్మాసనం మీద కొలువుతీర్చి నరకాసురుడు ఊర్వశిని తోడితెమ్మని తన సేవకుల్ని పంపాడు. అమరావతీ పట్టణంలో అంతా వెదికి ఒప్పు తలొగ్గివున్న ఊర్వశిని సభలోకి తెచ్చారు – సేవకులు. అట్లా వచ్చిన ఊర్వశి దగ్గరకు పోయి క్రొత్త ఇంద్రుడైన నరకాసురుడు చేష్టలతో తన మురులు తెలియచేశాడు; మాటలతో ఆశలు కొలపటానికి యత్నం చేశాడు. ఊర్వశి జాణ. వాని స్థితికి తగినట్లుగా గడుసుగా మాటాడుతూ, "ఒక్కనాడైనా నీవు నీ విహరించు చోటికి నన్ను పిలిపించకూడదా! నాకీ మాత్రము వసువు చెల్లదా!" అన్నది. అప్పుడు దేవేంద్రుడు పగవాడు కనుక, అతని కొలువులోని ఆటకత్తెను తాను పిలిపించటము తగనిపని అని సమాధాన మిస్తూ 'ఇట్టి లంజమాటలు గలనే' – అని కూడా నాలుక జారాడు నరకుడు. ఆ పట్టున ఊర్వశి సమాధానం చెపుతో, "నేను లంజనే. యదార్థం చెపుతున్నాను విను. నీవు పరాక్రమించి యింద్రుణ్ణి గెల్చి నన్ను బంధించి తెమ్మని చక్రవర్తివి కనుక నేడు కగా అన్నావు. మనస్సుఅంతా బాధాస్పదమై, కల్లోలమై వుంటే పట్టి శరీరం కదిలిస్తే అందువల్ల యేమి రుచి కలుగుతుంది. హృదయం వున్న పొందువల్ల సుఖం చేకూరుతుంది; లేదా, లేదు. చిలుక లేని పంజరం వుండి ప్రయోజనం లేదు. రసజ్ఞులైనవారు కూడికలో రసాభాసాన్ని మెచ్చుకోరు' అని చెప్పింది. ఇక్కడ 'చిల్కవోయినం బంజరమేమి సేయు' అన్నచోట దేవేంద్రుడు చిలుక అనీ, అతని భోగానికి తాను నివాసస్థానం అనీ అంటోంది. 'చిలుక' అని చమత్కారంగా ఇంద్రుణ్ణి స్ఫురింపచేయాలి, కాని వాచ్యం చేస్తే నరకాసురుడు మండిపడి యేమిచేస్తాడో అని భయం. సామాన్యార్థం తన హృదయం చిలుక అయితే శరీరం పంజరమని చెప్పింది. ఆ చిలుక లేకపోతే పంజరంవలన యేమి ప్రయోజనం? అన్నది. రెండవది, 'రసభంగము సంగతిలోన మెత్తురే' అనుట – రసము బ్రహ్మానందము. దాన్ని పొందుట సంగతి – అంటే, జ్ఞానము. జ్ఞానమువల్ల పరమాత్మ సంబంధమైన బ్రహ్మానందాన్ని పొందవచ్చు. కాని మూర్ఖత్వంవల్ల ఆ పొందు కుదరదు. అంటే, నరకాసురునివంటి మొఱకువాడికీ, రసానందానుభూతికీ చాల దూరమని వ్యంగ్యంగా చెప్పింది.

## వీరశృంగారము

శా. సత్రాజిత్తనయా కరాంతర ధనుర్జ్యారావ, మైరావతీ
సూత్రానర్గళ నిర్గత స్తనితమై, సుత్రామ చాప ప్రభా
పాత్రి భ్రూలతికా విలాసముల కొప్పింగప్పు శార్ఙ్గాంబు ము
క్షిప్తి క్రూరమహాశనుల్ దనుజరాడ్గోత్రంబు గోత్రంబుగన్.

— ప్రథమాశ్వాసము

ఈ పద్యం నరకాసురునితో సత్యభామ యుద్ధం చేసే ఘట్టంలోనిది. నాచన సోమన్న యీ కథాభాగంలో శబ్దార్థాలంకారాలను అవిరళంగా చొప్పించి మెఱుగెక్కించటమే గాక, ఈ సమాసఘటనచేత సాంగ్రామిక భయంకరత్వాన్ని సైతం కన్నుల యెదుట బొమ్మకట్టినట్లు తెలియచేస్తున్నాడు. సత్యభామ చేతిలోని వింటి నుల్లెత్రాటినుండి వెలువడిన భయంకర ధ్వని మెఱుపు తీవలనెడు నూలిప్రోవుల నుండి వెలికి జారు ఉరుములై, ఇంద్రధనస్సుతో సమానమైన కాంతికీ, ఆకృతికీ అస్పదమైన బొమముడి క్రీడతో ప్రకాశింపగా ఆమె చేతిలోని విల్లుఅనెడు నీటి మబ్బుల నుండి బహిర్గతమగుచున్న బాణములనెడు (వజ్రాయుధములవంటి) పిడుగులు రాక్షసరాజైన నరకాసురుని కుల పర్వత శరీరమున చొచ్చి కప్పుచున్నవి. సత్యభామ యుద్ధాన్ని ఉపమానోపమేయ అభేదత్వ రామణీయకమైన రూపకాలంకారాలతో వర్షావేళతో పోల్చాడు. ఇట్టి యీ విశిష్ట రచనామార్గమే తరువాతి తెలుగు కవులకు ఒజ్జబంతి అయింది. ఇంద్రుడికి నరకాసురుడు విరోధి. ఆ విరోధిని చంపేటప్పుడు సత్యభామాదేవికి ఇంద్రుని ప్రభుత్వ ప్రభావము తోడైనదనికూడా వ్యక్తం చేస్తున్నాడు.

మ. అరిఁ జూచున్, హరిఁ జూచుఁ, జూచుకము లందందంద మందార కే
సరమాలా మకరంద బిందు సలిలస్యందంబు లందంబులై తో
రుగం, బయ్యెద కొంగొకింత దొలఁగం, దోడ్తో శరాసారమున్
దరహాసామృత పూరముం గురియుచుం, దన్వంగి కేలీగతిన్.

—ప్రథమాశ్వాసము

ఈ పద్యం కూడా నరకాసురునితో సత్యభామ యుద్ధాన్ని వర్ణించే ఘట్టంలోనిదే. ఈ పద్యంలోని విశిష్టత వీర శృంగారాలనే రెండు ప్రముఖరసాల్ని - కలిసిరాని వాటిని - ఒకే సన్నివేశంలో సమాగమింప చేయుటం. దీనికి క్రమాలంకారమును పనిముట్టుగా స్వీకరించి వీర శృంగారాలను (స్వల్పమైనా) సున్నితమైన పనిచేసి పద్యపు కట్టులో తీసినాడు. ఇందు సత్యభామ అరియైన నరకాసురునిఁ జూచునప్పుడు వీరమును, పియుడైన శ్రీకృష్ణుని చూచునప్పుడు శృంగారమును క్రమముగా కలుగుట వర్ణితమైనది. సత్యభామ స్తనాగ్రములం దచ్చటచ్చట మందారపుష్ప సంబంధమైన కింజల్కముల సముదాయము మీది తేనె బిందువులవలె ఘర్మబిందువులు జాఱి పడుచుండ శత్రువును చూచును, విలాసముగా పయ్యెద కొంగు కొంత తప్పుకొనగా కృష్ణునిచూచును. మరల వెంటనే యెడతెఱిపిలేక బాణ సముదాయములను విడచుచు శత్రువైన నరకాసురునిపై వీర దృక్కులు ప్రసరించుచు అంతలో చిఱునవ్వులనెడ అమృతమును గురియుచు తన

ప్రియుఁడైన శ్రీకృష్ణుని చూచును. ఈ విధముగా సత్యభామ వీరశృంగార కేళీ నిర్మగ్నయైనదని వర్ణించినాడు. ఇట్టిపద్యములను పోతన భాగవతమున నీ కథా ఘట్టముననే యనుసరించి మిక్కిలి ప్రకాశింపఁజేసినాడు.

## శంఖారావము

సీ. వడఁకు పన్నగరాజు పడగలమీఁద, స
    ర్వం సహాకాంత పేరణము సూప
నుబ్బూఁత లూఁగెడు నుదయాస్తగిరులతో
    నాకాశలక్ష్మి కోలాటమాడఁ,
దెరలెత్తి సప్తసాగరములుఁ బొరలంగ,
    వరుణుండు గొండిలి పరిఢవింప,
మొకముల చాయ శేఁజోక చందముగ నిల్పి,
    కమల సంభవుఁడు ప్రేంఖణ మొనర్ప,
తే. మంగలములోని ప్రేలాల మాడ్కి, జుక్క
లిక్కడక్కడ నడ, దిక్కులెనిమిదియును
బగులఁ, బాతాళ తలము గుబ్బటిల, జెలఁగె
శౌరి పూరింప నప్పాంచజన్య రవము.

—చతుర్థాశ్వాసము

హంసడిభకులు దుర్మార్గులు. దర్పోద్ధతులు వాళ్ళు. శ్రీకృష్ణునికూడా సరకు గొనలేదు. యాదవులు తమకు కప్పము కట్టవలసినదని జనార్దనుడను తన మిత్రుని ద్వారా హంసడిభకులు ద్వారకానగరానికి కబురు చేశారు. అది విని యాదవులు కుపితులైనారు. శ్రీకృష్ణునికి కూడా చాల కోపం వచ్చింది. పుష్కర సరస్సు తీరాన యుద్ధానికి సిద్ధమై రావలసిందని హంసడిభకులకు తిరిగి కబుర్లు పంపారు. తన సేనతో కదలి శ్రీకృష్ణదేవుడు పాంచజన్యాన్ని ఊదినప్పుడు భయముచే వడంకుచున్న ఆదిశేషుని పడగలమీద మోయబడుతున్న భూదేవి పేరణనృత్యం చేసినది. సూర్యోదయమై తత్కాంతులు వ్యాపించునప్పుడే చంద్రాస్తమయమగుచున్నప్పుడు ఆకాశమునందు భాగ్యదేవత తూర్పు పడమరలతో నటునిటు కోలాటమాడుచుండగా, కెరటములొకదానిపై యొకటి ఒత్తుకొనుచు భయంకరముగా యేడు సముద్రములును కలిసిపోవుటచే వరుణదేవుడు జలాధిదేవత గొండిలి నృత్యముచేసెను. తన సృష్టికేదో భంగపాటు కలుగుచున్నదని బ్రహ్మదేవుడు మండలాకార నృత్యము చేసెను. చుక్కలు మంగల

# కాంతిగీతం

## మాదిరాజు రంగారావు

చీకటి గుహపై నెలిగే। తారల
శిల్పసౌందర్యం విలోకించే కన్నులలో
ఉదయ రేఖలు తులకించునపుడు
చైతన్య స్ఫూర్జితమైనప్పుడు హృదయం
వెలుగు తలుపులు మూత పడిన
చీకటి కోట గోడలు దూకి వచ్చి
ఎవడో నూర్యుడు చంపేస్తాడనే
అజ్ఞాతభయం తొలగిపోయినవేళ
ముడుతలు పడిన శరీరంతో
నడువలేని పండుముసలి, సముద్రుని
తరుణ హృదయంలో ఊగిసలాడి
తమంతట మలగి పోవు కామనలకు
స్వరూపాలు పరిణమించినపుడు
గ్రీష్మాదిత్య జ్వాలలకు తపించి,
నీలాంబుద మాలాజలధారాసార
మనోజ్ఞనవం నవతా బంధురమా
భూదేవత విడిచే సురభిళ
నిశ్వాస పవన వీచికలవలె, ఊహాలు
బుద్ధిని అల్లుకొన్నప్పుడు, మనసు

---

( 12 వ పేజీ తరువాయి )

మందరి ప్రేలాల వలె యెగిరి స్థానములు తప్పి విఱియుచున్నవి. ఎనిమిది దిక్కులును పగిలినవి. పాతాళము వెల్లగిల్లినది.

ఈ వర్ణన మింత భయంకరముగా చేయుటకు కారణము శ్రీ కృష్ణుడు జగత్కంటకులైన హంసడిభకులపై యుద్ధమున కేగుటవలన నని యూహింప వలసి యున్నది.

మల్లెమొగ్గలు వికసించినపుడు
వినిపిస్తుంది కాంతిగీతం —
సూర్య తేజో కిరణాలవమెరుగని;
జిప్సీన నెత్తురునాడులు లాగు చలి
గాలికి, బిగిసిన మంచులా మారి
చలనశక్తి ఉడిగిన, నదివలెనో
ముసురుకొన్న పేదరికం దాడులకు
ఆగలేక పొంగులతో పరుగులెత్తు
నెత్తురువాకలు ఒక్కమారు ఆగిపోవ,
ప్రేతాకృతులవలె నిదురపోవు
చీకటి మనుషుల గుండెలలో
అనవరతం మ్రోగుతూంది.
ప్రత్యణువును స్ఫులింగంగా
ప్రతి మనస్సును విద్యుజ్జ్వాలగా
రామణీయక రస జగత్తుగానో
మార్చివేయు—కాంతిగీతం


# అభ్యుదయ

( మాసపత్రిక )

| చందా వివరాలు | | |
|---|---|---|
| సంవత్సరం | : | ఆరు రూపాయలు |
| అర్ధసంవత్సరం | : | మూడురూపాయలు |
| విడిప్రతి | : | అర్ధరూపాయి |

| ప్రకటన రేట్లు (ఒకసారి) | | |
|---|---|---|
| టైటిల్ నాల్గవ పేజీ | | రు. 50 |
| ,, (2, 3 పేజీలు) | .... | 40 |
| మామూలు పేజీ | .... | 30 |
| అరపేజీ | .... | 20 |

ద్వివర్ణ, త్రివర్ణాలకు అదనపు రేట్లు. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లుకావాలి. కావలసిన ప్రతులకు కమిషన్ పోను మిగతా డబ్బు ముందుగా చెల్లించాలి.

వివరాలకు:

మేనేజరు, అభ్యుదయ, విజయవాడ - 2.

## మతుకుమల్లి నృసింహకవి (1816 - 1873)

# "చెన్నపురీ విలాసము"

డా॥ కొత్తపల్లి వీరభద్రరావు

పందొమ్మిదవ శతాబ్దియొక్క మధ్యకాలమున, ఆంగ్ల నాగరికతకు పుట్టినిల్లయి వరలిన చెన్నపట్టణమును వర్ణించు ప్రౌఢ కావ్యము, శ్రీ మతుకుమల్లి నృసింహకవి రచించిన 'చెన్నపురీ విలాసము', శ్రీ వీరేశలింగం పంతులుగారి రచనలకు వ్యవహిత పూర్వమున బయలుదేరిన ప్రౌఢాంధ్ర కావ్యములలో - ఆంగ్లభాషా పదములు, పాశ్చాత్య నాగరికతను వర్ణించు ఘట్టములుకల, 'చెన్నపురీ విలాసము' (1) విశిష్టమయినది. ఆంగ్లేయుల పాలనాధికమును గూర్చియు, వారి విజ్ఞాన ప్రభావమును గూర్చియు, యథాతథముగ వర్ణించిన పద్య కావ్యము.

శ్రీ మతుకుమల్లి నృసింహకవి (1816-1873) సంస్కృతాంధ్రములలో మహా విద్వాంసుడు. వీరిది పండిత వంశము. వీరి జనకులు జానకమ్మ కనకాద్రిశాస్త్రులు. నృసింహకవి గ్రంథములలో, ప్రౌఢప్రబంధమైన 'ఇందుమతీ పరిణయము' అను నామాంతరముగల 'అజ చరిత్ర' ప్రఖ్యాతికెక్కినది. ఈతని రచనలలో చారిత్రక ప్రాముఖ్యముగలది 'చెన్నపురీ విలాసము'. ఇది శ్రీ రాజా బొమ్మదేవర నాగన్న నాయుడు జమీందారు ఆజ్ఞచే నృసింహకవి రచించెను. ఈ విషయమును కవి "ప్రథమంబగు స్వరూప పద్ధతి" లో యిట్లు తెలిపెను —

" పురములలోనఁ జెన్నపురి పూర్ణవిలాసము వర్ణనీయమై
ఖరియగుఁ గానఁ దెల్పుమ వికస్వరచారు విలాస వర్ణన
స్ఫురణనొనర్పు మొక్క కృతి భూరి గభీరతరార్థగుంభన
స్ఫురరసభరంబుగా మతుకుమల్లి నృసింహ కవీంద్ర శేఖరా " (2)

కృతికి ప్రోత్సాహమిచ్చిన శ్రీ బొమ్మదేవర నాగభూపాలుడు సీమరాణిచేత సత్కారములను బొందినవాడు. ఈ సత్కారములు రాణిగారి తరఫున "కలెక్టరు,

---

(1) చెన్నపురీ విలాసము - శ్రీ మతుకుమల్లి నృసింహ కవి కృతము.

"ఈ ప్రబంధమును మొట్టమొదట (1863) ఎనుబది సంవత్సరముల క్రితము వచ్చిన దుందుభి సం॥ శ్రావణ మాసమున శ్రీ వావిళ్ళ రామస్వామిశాస్త్రులవారు స్వకీయ ముద్రాక్షరశాలలో ముద్రింపించి ప్రకటించిరి" (1941 ముద్రణ పీఠికలో శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు వ్రాసిన వాక్యము. పుట - 4)

(2) చెన్నపురీ విలాసము (1941) పుట - 8; పద్యము - 8.

జష్టి, కర్నలు మొదలుగాఁగలుగు దొరలు" బందరు పురములో శాలివాహన మహాశక వత్సరంబులు గుణవారణమునీందు (1861 క్రీ॥ శ.॥) గణనగల్గు, రౌద్రినామ వత్సరమున నాశ్వయుజీయ **బహుళ** పంచమి సుందవాసరమున" చేసిరి. ఆ సంవత్సరములోనే ఈ ప్రభువు సకుటుంబముగా చెన్నపురి చేరెను. చేరి 'చాకలిపేట'లో పెద్ద యింటిలో సపరివారముగ నివసించెను. తరువాత నృసింహకవిని రావించి 'చెన్నపురి'ని గూర్చి కావ్యమును రచింపుమని కోరెను. ఈ కావ్యముయొక్క పుట్టుకకు కారణ మిది.

పందొమ్మిదవ శతాబ్ది మధ్యభాగమున చెన్నపురి ఎట్లుండెడిదియో తెలిసికొనఁ గోరువారికి ఇది మిక్కిలి ఉపయోగపడును. ఇందు - ప్రభుత్వ సంబంధమైన వివిధ విషయములు, వైజ్ఞానిక విషయములు, వివిధ దృశ్యములు చక్కగా వర్ణింపబడెను. వస్తు విశేషములను దెలుపునపుడు సుబోధమగుటకై వాడుకలోనికి వచ్చిన ఆంగ్లేయ పదములను వాడుచు వస్తుచయమును వర్ణించెను" అని పీఠికలో శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు వ్రాసినది సత్యము. (3)

ఇట్లు వర్ణింపబడిన విషయములను మూడు ముఖ్య భాగములుగ విభజింప వచ్చును. ఆంగ్ల ప్రభుత్వమునకు సంబంధించిన అధికారుల నామాధికమునకు సంబంధించినవి, పాశ్చాత్య విజ్ఞానమును వర్ణించు భాగములు, కేవలము చెన్నపురిలోని దృశ్యములకు చెందినవి - అనునవే ఆ మూడు విభాగములును. ఇందే ఆంగ్ల భాషా పదములు విశేషముగ వాడబడెను. ఈ కావ్యము గద్య పద్యాత్మకమై నృసింహకవియొక్క లోకజ్ఞతకు దర్పణమై యున్నది. ప్రాచ్య సంప్రదాయములో పుట్టి పెరిగిన కవి; పాశ్చాత్య విజ్ఞానమును, జీవిత పద్ధతిని అర్థము చేసికొన్న విధానమును చూచినచో, ప్రతిభ నవనవోన్మేషశాలిని అని తెలియును.

ఆంగ్ల ప్రభుత్వమును గూర్చి చెప్పునప్పుడు కవి యుపయోగించిన ఇంగ్లీషు పదములను, వర్ణనలను ఉదాహరించుచున్నాను.

క్యారక్టర్లు: ఈ శబ్దమును కవి 'యోగ్యతాపత్రములు' అను అర్థమునకు సన్నిహితముగ నుండునట్లు ప్రయోగించెను.

"ప్రకట ప్రీతిని హూణవల్లభులు క్యారక్టర్లు నా రాజపుత్రక చూడామణి
కిచ్చి మెచ్చెదరు......" (పుట 8; పద్య - 4)

బొమ్మదేవర నాగభూపాలుడు చెన్నపురి రాగానే ప్రభుత్వము వారు, ఆ ప్రభువునకు రాజ్యమిచ్చిరను సందర్భమున నృసింహకవి ఇట్లు చక్కగా వర్ణించెను.

---

(3) వైజ్ఞానిక పారిభాషిక పదజాలము విషయమై యేక వాక్యత కుదరక చిక్కుపడుచున్న మన విజ్ఞానవేత్తలు నోరు తిరగని క్రొత్తమాటలు సృష్టింపక వాడుకలోనున్న మాటలను - అవి ఏ భాషా పదములయినను - సాధ్యమైనంతవరకు ప్రయోగించిన విద్వత్కవి నృసింహకవిని మార్గదర్శిగా గ్రహించుట మంచిదిగదా ?

"ఘనతఁ గమిస్నరీ దొరల గౌన్నరుగార్లను సెక్రిటేరులన్
గనఁగఁ గమిస్నరీజెనలు గారు శిఫారుసు సేయ మెచ్చిన
మ్మనమునఁ గూర్మి నా నృపతి మౌళికి గౌన్నరుమెంటువారు, భూ
జను లలరారఁగా హొకుమొసంగిరి క్రమ్మర రాజ్యమియ్యఁగన్".

(పుట -7 ; పద్య-15)

షెల్లు: 'వీరభట ప్రకరణము'న కవి ఈ శబ్దము నిట్లు ప్రయోగించెను.

"పటిమఁ బురోప కంఠతట వాటి కెలన్గడి బాల్సవీరి యు
ద్భట సుభటప్రటా పటులధాటులు కెపును మాపు బాహు సం
ఘటితముతో తుపాకుల చకచ్చకలొప్పఁ గవాతు సేయ ని
ష్కుటి కుటిల ప్రతిధ్వనిగ ఘూర్ణిలు షెల్ల ఘెళ ఘెళ ధ్వనుల్".

(పుట - 13; పద్య-1)

పోలీసు: 'వీరభట ప్రకరణము'ననే కవి వీరినిగూడ నిట్లు వర్ణించెను.

"కురుచగ నంగుసంగుఁ బురి గుప్తికి నిల్వఁగ వీర రౌద్ర సం
పదల నెసంగు పోలీసుల బంటు లొగిం బడు నిద్దురల్వపుం
గుదియలుపూని లాగులను గుప్పు కంచుకముల్ ఘటించి మ వా
రదయాతఁ గాల కింకర ప్రవృత్తిఁ జరింతు రెంతయున్."

(పుట - 13; పద్య - 2)

'ఉపవన ప్రకరణము'లో నృసింహకవి, పాశ్చాత్యులు నివసించెడి బంగాళాల నిట్లు వర్ణించెను. ఇందుమిందుగా, పాశ్చాత్యోద్యోగు లందరును పేర్కొనబడిరి.

"పురికిం దక్షిణ పశ్చిమంబుల వనభోజనంబుల జూడ గౌ
న్నరులుం గర్నలు సెక్రిటేరులు కమాండర్లింక జడ్జీలు కా
ప్టెనులుం బాదరులుం గవిర్నరులు మేస్టర్లింజనీర్లాదిగా
దొరలుండం దగు బంగళాలు చెలు వొందున్నవి వేలుండగన్"

[పుట-14; పద్య-4]

'సభాప్రకరణము'న నృసింహకవి, ఆంగ్లేయులు స్థాపించిన 'కోర్టు'ల నిట్లు పేరుపేరున వర్ణించెను.

"వెనుపొందు నగరంబు తూర్పు నను సూప్రీమ్ కోర్టు నాఁజిన్న కో
ర్టును సీకస్టము నాఁగమిస్నరియు నామాపింప నాఫీసు లే
జన లోకంబున సర్వకర్మములు సంస్థాపింప నేతెంచి ని
ల్చిన పాకారి యమాంబునాథ ధనరాట్లీలా సభాశైఖరిన్"

(పుట-22, పద్య-2)

ఇంగ్లీషువారు నిల్పిన 'కోట్టలు', ఇంద్రాదుల సభావైఖరిలో నున్నవట! 'దుర్గప్రకరణము'న కవి 'కోట' నిట్లు వర్ణించెను.

"పరిఘాంబు త్రితయత్రివప్రయుతమై భాసిల్లు లో కోటలోఁ
బరఁగున్ గౌర్నరుమెంటు త్రేజరు వలంప న్మిల్టరీ రప్ప చె
ప్పెరఁ గౌంటూంటును లోనుగాఁగల సభాల్చెల్లాయుబల్ ట్రోర్సు పె
క్కురయు సోల్జర్లవి బారకీసులు ఘరంగు ల్పొల్చి రంగొప్పఁగన్."

(పుట - 24; పద్య - 4)

గవర్నరు తన పరివారముతో కొలువుచేయుటను మతుకుపల్లి నృసింహ కవి ఇట్లు కనులకు గట్టునట్లు వర్ణించెను.

"వినుత పరార్ఘ్యవేషులగు వేలకొలంది దొరల్ సమున్నతా
సనముల నిల్వ నీల పట సంవృతి మత్ఫలకాళి ముందు నా
ల్గొన లిఖియించు రైటరులు గొల్వఁగ గౌర్నరు గొల్వుసేయు నా
ఘన సభ సొంపుగానవలెఁగాని వచింపవశంబె యేరికిన్"

(పుట - 25, పద్య - 6)

'ధర్మస్థాన ప్రకరణము'లో కవి ఇంగ్లీషువారి ఆఫీసులలో కొన్నింటిని ఇట్లు వర్ణించెను.

"గ్రసదాశేశ్వర సంసదుద్యశము పిన్కంటాకన్సిస్మెంటు టా
ప్పు సవర్కోర్టును హేడ్డుపోలీసు ను నా సొంపారు నాఫీసు లిం
పెసఁగెన్ దత్పురి దక్షిణంపుదెస లోనైకాగ్ర్య ధర్మంబు మే
లొసఁగన్ జాతిదొరల్ ఘటింపఁదగి బాహ్యోద్యాన భాగంబులన్"

(పుట - 27; ధర్మస్థాన ప్రకరణము పద్య-1)

పై విధముగా 'చెన్నపురీ విలాసము'లో ఆంగ్ల పరిపాలనాదికమునకు సంబంధించిన విషయములు, యథోచితములైన ఆంగ్ల పదప్రయోగముతో రమణీయముగా వర్ణింపబడెను.

ఈ కావ్యములో పందొమ్మిదవ శతాబ్ది మధ్య భాగము నాటి విద్యాపద్ధతులను గూర్చియు, ఆంగ్లేయులతోడి సంపర్కము వలన మనకు సంక్రమించిన విజ్ఞానమును గూర్చియు, నాగరకతలో పాశ్చాత్యులు తీసికొని వచ్చిన మార్పులను గురించియు నృసింహకవి సుదీర్ఘముగా వర్ణించెను. ఇట్లు వర్ణించు నపుడు ప్రకరణౌచిత్యమునకు వలయు ఇంగ్లీషు మాటలను ఈ విద్వత్కవి నిస్సంకోచముగ వాడెను. వైజ్ఞానిక విషయములకుసంబంధించిన ప్రకరణములో నృసింహకవి చేసిన వర్ణనలను కొన్నింటిని క్రింద చూపుచున్నాను.

'పుస్తక సౌధ ప్రకరణము'న కవి గ్రంథకోశము నిట్లభి వర్ణించెను.

" ఆ పుస్తక కోశము భువి భూపస్తవనీయ లీలఁ బొలుపగు కాలే
జీ పేర నందు లేని మహాపుస్తక మభ్రపుష్పమై తనరారున్" (పు-35 ; ప-2)

పాశ్చాత్యుల రాకవలన, మన నాగరకతలో- రైలుబండ్లు, వార్తా ప్రసరణమునకు తంత్రీ మార్గములు, విద్యుచ్ఛక్తి, ముద్రణము మొదలయినవి ప్రవేశించినవి. చిరకాల పరిచయమువలన మనకివి క్రొత్తగ, వింతగ కన్పట్టక పోవచ్చును. కాని నాడు (పందొమ్మిదవ శతాబ్ది మధ్యకాలమున) ప్రజలనవి సమ్మోహింపజేసిన వనుటలో ఆశ్చర్యములేదు. వారియందవి భయసంభ్రమములు కల్పించినవి. ఏ విధములయిన యంత్రములను చూచి ఎఱుగని ప్రజలు; పాశ్చాత్యులు ముద్రణ యంత్రమును వంగ దేశములోనికి మొట్టమొదట తెచ్చినప్పుడు; ఆ 'కర్రమర'ను చూచి,అది 'ఇంగ్లీషువారి దేవతావిగ్రహము'గా భావించినారట!

'శ్రీరామపురము క్రైస్తవ మిషను'నకు చెందిన డా॥ విలియమ్‌కెరే, ఒక 'ముద్రణ యంత్రము'ను తెచ్చినపుడు జరిగిన విషయమిది. (4) ఇది పదునెనిమిదవ శతాబ్ది చివరిమాట. భారతదేశంలో ముద్రణాలయములు క్రొత్తగ నెలకొల్పబడుతున్న తొలినాళ్లలోని మాట. అందుచే అంత వింత, ఇక; రైలు మార్గములు, వార్తా ప్రసరణమునకు తంత్రీమార్గములు, విద్యుచ్ఛక్తి ఉపయోగములు ఆవిరి యంత్రములు; 'చెన్నపురీ విలాసము' రచింపబడు నాటికి కొలది సంవత్సరములకు ముందు మాత్రమే (5) వినియోగమునకు వచ్చుటచే, వీనివర్ణన విషయమున మతుకుమల్లి నృసింహ కవి ప్రత్యేక శ్రద్ధచూపెను.

---

4. "In 1798, taking advantage of the opportunity afforded by a wooden printing - press in calcutta being offered for sale, he (Dr. Carey, the Baptist Missionary) bought it for £ 40, and took it away to Madnabati in the Malda district, where he was living. So unfamiliar were the villagers with any form of machinery that when it was set up there, they believed it to be an **English idol**".

(Modern India and the West. Oxford University Press (1941) page - 225.)

5. "The early years of the second half of the nineteenth century were a formative period of greater importance, in which the tide of westerniration set strongly on the shores of India. A mere recital of dates is sufficient to show ths rapid succession of changes. **In 1853 the first Railway began running; in 1854 the first telegraph line was opened** and the modern postal system was installed." (Ibidem,-576)

' చెన్నపురీ విలాసము ' 1861 ప్రాంతమున వ్రాయబడి 1863 లో మొట్ట మొదట వావిళ్ళవారిచే ముద్రింపబడెను.

'తంత్రీవార్తా ప్రకరణము'లో నృసింహకవి, 'టెలిగ్రాఫ్' యంత్రాదికమును రమణీయముగ అతిశయోక్తులతో ఇట్లు వర్ణించెను.

"ప్రోలుసృజించి నాఁడచట గ్రుచ్చిన నిస్తులవాస్తు సూత్రమున్
బోలి తుదిన్ శుభార్థముగఁ బూన్చిన తోరణ వైఖరిన్ గనం
బాలి నభంబునొల్ల విధి సాచిన మానగుణంబునా నుద
క్పాళిఁ జెలంగుఁ గంబములపై నొక లోహపుఁ దీఁగ సోగనై"

"అమరుల్మౌనులు మున్ దపోగరిమ నుద్యద్దూర వార్తాగ్రహో
ద్యమహత్త్వంబును గాంచి రబ్రముగ నారోపించు లాగ్రోల నో
లీమహాచిత్రముగా ఘటించి రది టెల్లీగ్రాఫు నా దాన ని
క్కముగా దూరపుదీవి వార్తల నెఱుంగన్వచ్చు నేకత్రుటిన్".

(తంత్రీవార్తా ప్రకరణము, పుట-41; పద్యములు-3, 4)

ఈ యంత్రమున కిట్టిశక్తి ఎట్లు లభించుచున్నదో కవి ఇట్లు వర్ణించెను.

"ద్రావక లబ్ధశక్తికిని దావలమై తగ నిందునందు వా
ర్తా వివిధార్థ వైఖరులు వ్రాయ ఘటించును లోహతంత్రి ప్రే
యోవిధి నింగి నిద్దొరల కొప్ప లిఖింప సుకంబు దైవ మెం
తో వడిఁ బూను నయ్యభసు తోముఖలేఖిని నాఁగ నంపగున్."

(పుట - 42; పద్య - 7)

'ధూమశకట ప్రకరణము'లో నృసింహకవి 'రైలు రోడ్డు'లను, 'రైలు బండ్లు'ను 'రైలు యంత్రము'లను విపులముగా వర్ణించెను. ఆ వర్ణనలను పఠించినచో అవి కవికే ఎంత ఆశ్చర్యమును కలిగించెనో తెలియగలదు. రైలుబండ్లు పోవుటను కవి ఇట్లు ప్రౌఢశైలిలో వర్ణించెను.

"ఘనఘటా కఠిన ఘర్ఘర ఘోరనిర్ఘాత నిర్ఘోష ఘోషముల్ నిండిముట్ట
తతముఖోత్తంభితోద్ధామ ధూమ స్తంభరంధ్ర నిర్యద్ధూమరాజి గ్రాల
క్రమ పరిక్రమదవక్ర క్రాంత దిక్చక్రచక్ర చంక్రమణముల్ చౌకళింప
ద్రుతజితానిల తార్క్ష్యదుర్నిరీక్ష్యా చింత్య చిత్రాతి వేగముచ్చైరువు సేయ
ధూమశకట పరంపరల్మ్రాన వేగ, దుర్నివారంబులై పర్వు నిర్నిరోధ
వార్షికాంబుద మాలికా వహులమాడ్కి నుభయ పార్శ్వముల నగరికి నుత్తరమున".

"అమరులు మున్ను దివ్యమహిమాతిశయంబునఁ గన్న దేవయా
నములు దివిన్మనోరయమునం జనుఁ గాముచరంబులంచు విం

టిమి యిపు డింగిలీషులు పటిష్ఠతఁ రైలుబండ్లు నే
గురుహిమనోజవంబును జిగురొక్కనగాఁ బురి సద్భుతంబుగాన్ ”

(పుట - 43; పద్యములు - 5, 6.)

రైలులోని యంత్రములను, అవి నడచు విధానమును, అందుపయోగించు బొగ్గు మొదలగువానిని స్పృశించి కవి మిక్కిలి చిత్రముగా వర్ణించెను. నాటికిని నేటికిని ఈ విషయము నింత రమణీయముగను, చమత్కారముగను ప్రౌఢభాషలో వర్ణించిన సాహిత్యభాగము లేదనిపించును. కవి హృదయముపై ఆ యంత్ర మెంత ప్రభావము చూపినదో యీ క్రింది వర్ణనవలన తెలియును.

“.........కొందఱు శిల్పశాస్త్రమనీషులగు నింగిలీషులు చిత్రమయంబగు మయ మాయ ననుమేయించి శంబరాలంబనంబగు శాంబరి విడంబించియుఁ గడంగి యతి విచిత్రంబుగ యంత్రంబులు తంత్రంబులు మరలు వరలు గీల్గొను సొల్గునుం గిలకలుం బలకలుం గీలుకొల్ప యనల్ప శిల్పకల్పనాకల్పం బాకల్పంబు వెలయ ధూమయంత్ర శకటంబులును రుచిరతరయాన శకటంబులుం గల్పింప నయ్యేకైక యంత్ర శకటంబునకు వెనుక ననేక యానశకట పరంపర మాలికాకారంబుగ లంకె లిడి తన్ముఖస్థిత యంత్ర శకటాంతరాళంబున దహార కుహారంబుతోడం దగ వాడు దహన కుహారంబులోన శిలామయంబులగు వెక్కసంపు టెక్కసిబొగ్గు లగ్గలంబుగ నునిచి పెనిచి యనలంబు దరికొల్పి మరకాఁ డొక్కరుఁ డక్కడ నిల్చి మఱిమఱి మరద్రిప్పఁ దెప్పరంబుగ లోని యంత్ర చక్రంబులు కులాల చక్రంబుల క్రియ నవక్రవేగంబున గిఱ్ఱ గిఱ్ఱం దిరుగుఁ గావలి గిఱికొనుచుఁ గరముడరు కరువలింపవలుకొని రవులుకొనం జిగి మిగుల నెగడుచుం బుగబుగన బుగులుకొని తదగ్ని యంత్రోపరిస్థలోత్క్షిప్తోత్తాన ధూమస్తంభ నాళ రంధ్రంబున నుద్దామ ధూమస్తోమ రేఖా వలయంబులు వెడలి లయకాల విలయ ధూమకేతు భ్రమం బాపాదించుచు నభ్రంకషంబులై నెగయఁ దాదృగ్విధ యంత్ర దహనంబు బహుల హేతివ్రాతా జటిలంబుగ భగ్గు భగ్గునం బుట్టి పిట్టెగఁ బట్టి పట్టింపు మంటలు పెట్టిదంబుగ నెట్టుకొనం బట్టు యూచుట్టునుం దొట్టిలోనం బట్టిన నెగఁదొట్టు నుదక పూరంబు గ్రాఁగి తెకతెక నుడికి మసలి వెసరుల పసంగ సరెత్తి దిగువాఱు ముసురుకొను నావిరి వావిరిం గావిరికొని తీవరంబుగ వానికి నెక్కు నూల్కొపిన కుబ్జ యంత్ర స్తంభ నాళ ద్వారంబులం బోవఁ దదుద్దామ దహన దాహాతిరేక సంతప్త సలిల సంక్షోభ సమాకృత ధూమోద్గమన రభస భవ మహాబల రయ వశంబున జడంబయ్యుఁ జేతనంబు పగిది మెల్లన నాడించుచుం గదలి నీర్గొనిక్కి సాగి జరిగి క్రమమ విజృంభితంబై నగర సౌధ గారుత్మతరత్న ప్రభా ప్రతిఫలనంబునకు జడిసిక దలి వెడలి వదనంబున నిపాన లాయ్చలు పేర్చి మిగుల నార్చుచు బుసకొట్టుచుం బఱచు మహోద్భుత భుజంగంబు భంగి... పవన జవంబున నానాఁటికిఁ గ్రింశద్యోజనాయామంబు పఱచి యెడనెడ నిలుప నిలుచుచు మరల మరద్రిప్పఁ దత్కారియంబునం గ్రమ్మఱ నా పురంబుఁ జేరుచుండు మఱియును”

"రైలు రోడ్డునందు రహినందు నందుగంబముల కొనల ప్రేలు ఫలక యుగము
రైలుబండ్లు గదల వ్రేలుచు దిగజాఱు వెసఁబదాగమైక్య పిశునమగుచు"
(ధూమ శకట ప్రకరణము; పుటలు - 44, 45, 46)
'వైద్యశాలా ప్రకరణము'లో 'హాస్పిటల్' ఇట్లు వర్ణింపబడినది.

"ఆ పురికి నుత్తరమున వప్రాంతికమున సకలలోక హితార్థ మాజాతి దొరలు
ప్రీతి నిలుపఁగ నొక్క యాస్పిటలు వెలయుబహు విధామయ పీడితప్రాప్యమగుచు"
(పుట — 46)

'ఫోటోగ్రాఫీ ప్రకరణము'లో ఛాయాచిత్ర గ్రహణమునుగూర్చి నృసింహ కవి యిట్లు వ్రాసెను. నృసింహకవి సోమకునకుగూడ అందు ప్రావీణ్యము కలదట !

"ఛాయాగ్రాహిణి యాంగ్లేయుని తనుచ్ఛాయన్ వడిన్ నిల్పి తా
డాయం దీసెననంగ వింటిమని మాడ్కన్ యంత్రపేటిన్ ఘన
ప్రాయా దర్శములందు నీడలఁ ఫోటోగ్రాఫీ క్రియన్ నిల్వఁగా
జేయం జాలిరి యింగిలీషులు పురంజిత్రాది చిత్రంబుగన్"

"నలువ యొనర్చు సర్గము వినశ్వర సంతతమున్న యాను నా
తులు ప్రతిబింబ వైఖరులఁ జూడఁగఁ దాఁ పృథి కింబలీలల
న్నిలిపిరి హూణులకముల నిత్యముగా ప్రకృతిన్నశక్తి పెం
పలరఁగ బొమ్మదేవర వరాన్వయ నాగవిభుండు చేకొనెన్"
(పుట — 53; పద్య — 1,2.)

'ఇలెక్ట్రోగేల్వానిక్కిజమ్ ప్రకరణము'లో ఈ కవి, ద్రావకముల సాయముతో విద్యుత్తును కల్పించు విధానమును, దాని యుపయోగములను, చిత్రముగా వర్ణించెను. ఇవన్నియు నాడు, పాశ్చాత్య నాగరకతా సంపర్కము వలన ప్రజలు మెల్లమెల్లగా గ్రహించుచు వచ్చిన విజ్ఞాన విషయములు. ఈ ప్రకరణములో కవి భావనాశక్తి మనోహరము. విషయ వర్ణనము నిరుపమానము. అంతయు కనులకు కట్టునట్లు చిత్రింపబడెను.

"శ్రమ మిఱున్నకల ప్రబాంగకముల స్పందిల్లు వాయువ్యప
ల్మమియింపంగ జగద్ధితార్థము ప్రశస్త ప్రౌఢి యూరోపుల
ట్లు మహాయత్నమున రచించిరి యిలెక్ట్రో పేటి నవ్విద్యన
శ్రమతన్నేర్చి జగజ్జనోపకరణేచ్ఛన్నాగ భూజానియున్"

"మరియు నా యిలెక్ట్రోగేల్వా నిక్కిజమను వైద్యవిద్యకు విద్యోతకంబగు నొక్క యంత్ర పేటియునందు ద్రావక ప్రపూర్ణంబులగు కాచపాత్రములు రెండును

వానిలో న్యస్తంబై యంత్రకీలితంబగు తంత్రీద్వితీయంబును గలిగియుండు నాతంత్రీ ప్రకారంబు"

"ద్రావకన్యస్త తంత్రులఁ గ్రమము తోడ జరుగునా కృష్ణశక్తి యుత్పన్నశక్తి
ముకుటిఁబట్టిన రథసమిం మకయుతేదు సూక్ష్మము గ్రహింపఁబరఁగు నతుల్యల్బణముగ"

"కాయములోని ప్రాణము పెకల్చు మహోలయకాల కాల కా
లాయసకాల పాశమున వచ్చుపు సెచ్చెని సర్వదేహభృ
త్కాయుని కాలమందుఁగల ధాతులు పీల్చెడిమారి జిహ్వకుం
డని తోడునీడయగు భాగపుతంత్రిని ముట్టశక్యమే."

"కందుక గల యొకకోటి గతించినట్లు కూడి వయిసంద్రడగబ్బలు కుట్టినట్లు
దాక ప్రవాచేతికెని దెబ్బ దాఁకినట్లు తల్లడిలు ప్రాణములు తంత్రిఁ దాఁకినంత"

"తేలుకుట్టిన వెతకొంత దేహమంత గాలపెవరించు కైవడి ఝూంకరించు
తంత్రినంటిన మాత్రఁ జిత్రంబుగాఁగ గల వలన దేహమంతెల్ల జలదరించు."

"ఎక్కుడగు వింటిచే మూసి రమికినట్లు గులగులన రక్తమాంసము లుక్కడురుగ పెలఁ
బల్లటిలుఁ బ్రాణములు మేను జల్లుమనఁగఁ దీగదోయి కరద్వయి లాఁగునపుడు."

(పుటలు - 53, 54; పద్య - 1, 2, 3, 4, 5, 6, 7.)

ఎలక్ట్రిక్ షాక్‌ను ఇంత తేటగా వర్ణించిన కవి నాటికిని నేటికిని కానరాడు గదా! ఉపమానము లన్నియు దేశ్యములే!

'చెన్నపురీ విలాసము'లో నృసింహ కవి, నాడు చెన్నపట్టణములో గల ముఖ్య ముద్రాక్షరశాలలను, ముఖ్యపత్రికలను పేర్కొనెను.

"విద్యానిలయ మాది విద్యానిలయము, కళానిధి జ్యోతిష్కళా నిధియును,
శారదానిలయంబు జ్ఞానసూర్యోదయంబు నల సూర్యాలోకమును సరస్వ
తీ నిలయంబు నాగ సరస్వతీ నిలయంబు వివేక రత్నాకరంబు
నన వివేకాదిత్యుడన వర్తమాన తరంగిణియు ననంగ రమణఁజెందు
నందు హిందూప్రచక్షస్తు ముద్రాక్షరా లయము లశేషమనీషి జనాళి సంస్తు
మాన విభవాన్వితంబులై మాననీయ శారదా టంకశాలికా చారురేఖ"

"జనులెన్నం దినవర్తమానియును బోస్టన్‌ంగ్లాడ్జిగెజిట్టిగెం
టన మిష్నేరియు నాఁగ మెచ్చనగు నచ్చాఫీసు లాయింగిలీ
షు నృపన్యస్తము లప్పురంబిర తనుం జూడంగ నేతెంచు మా
త్రుని కాయంబున కూన్చనావనసి భూరి శ్రీఁదనర్పుం బురిన్"

"ఆ ముద్రాక్షరశాల లందు సుహితంబౌ తంపియోష్ఫెట స
ధామం బాది సరస్వతీనిలయ ముద్రావర్ణ సన్మంబు సా

యాను శ్రీవిలసిల్లఁ దత్పురిఁ దదధ్యక్షుండు వావిళ్ల స
ద్రామస్వామి విపశ్చిదగ్రణి ప్రసిద్ధ ప్రఖ్యగాంచున్ ధరన్"

(పుటలు - 51, 52)

'చెన్నపురీ విలాసము' మొట్టమొదటిసారి "ఆదిసరస్వతీ నిలయ ముద్రాక్షర యంత్రంబు" నందే ముద్రింపబడినది.

నాడు చెన్నపురిలో పాశ్చాత్య పద్ధతిని విద్యనేర్పెడి పాఠశాలలను కవి యిట్లు వర్ణించెను.

"మేలొప్పన్దగు నప్పురంబునను నార్మల్ స్కూలు నయ్యాంగ్రసన్
స్కూలున్ బొల్పగు పచ్చయప్ప విభునా స్కూలు న్విచారింప హై
స్కూలు న్లోనగు స్కూలు లప్పురి పిఱుంగుల్కుం బరద్వాల కో
న్నలఱ్కుంత సుశోభిత ల్వెలయు వాణీ నాట్య రంగాకృతిన్"

(పాఠశాలా ప్రకరణము; పుట - 65; పద్య - 1)

ఈ పాఠశాలలతో నాడు ఆంగ్లవిద్యను దేశమందు నెలకొల్పి, దేశీయుల మనస్సులను తీర్చిదిద్దెను.

ఇట్లు నృసింహకవి చెన్నపురిలోని వివిధ వైజ్ఞానిక విషయములను, సంస్థలను వర్ణించుటయేగాక; ఆ పట్టణములోని మనోహర దృశ్యములను, పేటలను సుదీర్ఘముగా వర్ణించెను. ఈ కావ్యములో నాలుగింట మూడువంతులు పురదృశ్యవర్ణనలే కలవు. ఈ వర్ణనలు చేయునపుడు నృసింహకవి, ఔచిత్యము చెడకుండునట్లు ఆంగ్ల పదములనే వాడి, వర్ణనల సొగసును ఇనుమడింపజేసెను. దేశీయుల యొక్కయు విదేశీయుల యొక్కయు జీవిత విధానములను, మత విషయములను, సాంఘికాచారములను వర్ణించుటయేగాక; నాటి చెన్నపురిలోని వీధులను, దేవాలయములను, వస్తువిక్రయశాలలను చిత్రముగా వర్ణించి చూపెను. ఒక విధముగా చూచినచో 'చెన్నపురీ విలాస' మంతయు వర్ణనాత్మకమే. ఈ వ్యాసములో ముఖ్యముగా పాశ్చాత్యభాషా విజ్ఞానముల ప్రభావము ప్రత్యక్షముగనో పరోక్షముగనో పడిన భాగములకు విశేష ప్రాముఖ్య మిచ్చుటైనది.

'శకట ప్రకరణము'లో కవి నాడు ధనవంతుల వాడుకయందున్న గుఱ్ఱపు 'సారట్ల' నిట్లు వర్ణించెను. ఇది చారియట్ (chariot) శబ్దభవముగా తోచుచున్నది.

"చతురశ్వ ద్వ్యహయాన్వితంబులు చతుశ్చక్రాభిరామంబు లం
చిత చిత్రాంబర సద్వితానకములై చెల్వారు సారట్లను
న్నతి మీఱన్విహరించుచున్నగరి నానాదేశ భూపాల సం
హతి తత్పూర్వదిగవేక్షణాభ్యుపగతాశాధీశులన్ బోలుచున్"

(పుట - 16; పద్య - 1.)

పాశ్చాత్యుల విహారములను కవి ఇట్లతిశయోక్తిగ వర్ణించినాడు.

"లలితాకార విచిత్రవేష రుచిరాలంకార శృంగార మూ
ర్తులు యూరోప్ద్వార సానులున్ దొరలు దోస్తో సారటులెక్కి దో
స్తులు నాగాఘ విమానులై తిరుగు సంధ్యావ్యాప్తస్త కిన్నరు
ల్పరై క్రీడింతురు నీట వార్ధికడ లీలారక్ష్యలన్ సంధ్యలన్"

(పుట - 17; పద్య - 5.)

ఆంగ్లేయులను వర్ణించునప్పుడెల్ల కవి అతిశయోక్తులను విరివిగావాడి, వారి ప్రజ్ఞా ప్రాభవములను కీర్తించెను.

చెన్నపురిలోగల ప్రఖ్యాత పాశ్చాత్యుల శిలావిగ్రహములనుగూర్చికూడ కవి వచించెను. శ్రీరంగపట్టణ యుద్ధములో పాల్గొనిన 'మేడీసు' (Medows) దొరకు సంబంధించిన ప్రతికృతి కోటలో కలదని కవి ఇట్లు వ్రాసెను.

"విపులంబై తగు కోటలోపల శిలావేదిన్ సుతుస్తంభ సం
టపమందా సులుతానుటోడి తన బిడ్డన్ దెచ్చి యొప్పించుట
ల్సపసన్ జేకొంటనునౌ గన్పడ న్నిలుపు మేడీసున్ గనన్ దోచు తీం
ద్రపు శ్రీరంగసమాఖ్య పట్టణ రణారంభంబు లీ నాటికిన్"

('మేడీసు ప్రకరణము' - పుట 26; పద్య - 1)

స్ఫురింపగ కవి 'సర్ థామస్ మన్రో' శిలావిగ్రహము నిట్లు కనులకు కట్టినట్లు వర్ణించెను.

"అతి పీనాంగుడు దతి ప్రమాణ తురగారూఢ్యాకృతుడు దక్షాజనా
వృతుడు దంష్ట్రిఘ సవ్యహస్తముఖాసిధారుడై పెంపొందు మం
ద్రోలు నా, కృతిగా మోదంబగియొప్పు నప్పురికి వార్ధిగూర్చుమి నుపైచే ప్రతి
కృతి విస్తార విచిత్రమై యుడు దియువర్ణకేళ్రోణి పెన్రోడ్డుజిన్"

(పుట - 27; ప - 1)

"మౌంట్ రోడ్" ను గూర్చి కవి; "హూణశ్రేణిసౌధ సందోహభాస్వరంబై పేటలకు నెల్ల హెచ్చగు మౌంట్రోడ్డు" అని వ్రాసెను. (పుట - 28; వచ - 1)

"వినోద సభా ప్రకరణము"లో కవి మద్రాసు మ్యూజియము, జంతు ప్రదర్శన శాలలను రమణీయముగా వర్ణించినాడు.

'హూణదేవాలయ ప్రకరణము'లో కవి క్రైస్తవుల గుడులను వర్ణించుచు, వాని శిఖరములు ఆకసమును చుంబించుచున్నవని ఇట్లు వ్రాసినాడు.

" అభ్రంలిహ శిఖరములు వినుభ్ర సుధాలేప విభవ సుందరములు మహా
విభ్రమములు సౌధరుచుల యనభ్రములగు గుడులు పర్వతాభ్ర సువంబులన్"

" గములయి యాదివారముల గాఢపుభక్తి మదిం దలిర్పఁగాఁ
బ్రజనములతోడఁగూడి నిజ భావము లన్నిక లేశ్వరునిద్భుతన్
శంపదయ యుక్తి ధ్యానములు సల్పుదు రప్పుడు నన్య కార్య హ
బ్రాసురహితాంత రంగులు పరంగులు సౌదిరిగుళ్ళ నప్పురిన్"

(పుటలు - 52,53; పద్య - 1,2)

'టంకశాల'లోని నాణెములను కవి ఇట్లు రమ్యముగా వర్ణించెను.

" మీర పువ్వులఁబోలు దీనారసమితి రిక్తేనోత్పలు రౌప్యముద్రికలగములు
కర్ణికారాభతామ్రపుటంక ద్రమ్మములు రాసులై టంకశాలల రాణించుగాంచు."

(పుట - 57; పద్య 4.)

పాశ్చాత్య వనితల సాయంవిహారమును కవి యిట్లు చిత్రించెను.

" తెళతెళలీను గాజుపిగిలిం కుబుసంబులు మేనుగప్పి యం
దముల జిగజంపు చెప్పులగని మెట్టు దెసల్పొలవంగ నేలపై
నెలమిని జీవవాహ వెస నీతలు మ్రోయిలుగాఁగ బాటసా
రలయి చరింతు రప్పుడు బరంగిపరాంగులు సంజవేళలన్"

(గుజిరి వీథి ప్రకరణము. పుట - 59; పద్య - 2.)

"ముత్యాలపేట వీథి ప్రకరణము"లో కవి కొన్ని ప్రసిద్ధ వీథులను, వస్తు విక్రయశాలలుగల వానినిట్లు వర్ణించెను.

"హరాణజనసందోహ సంకీర్ణ సుందరంబగు నైనియాన్పని వీథియుఁ దాన్పరంబగు శంభుదాసు కొరిముత్తు పలయాన్పయాన్వ మేస్త్రీ నైమిన్న నైమిన్నల వీథులును, సమస్త ప్రశస్త నిస్తులాస్తోక వస్తు విస్తార శ్వేతకాయ వాణిజ్యక నికాయ వాణిజ్య సౌధ మంటప విశాలంబగు సౌపమ్ను వీథియు..........."

( పుటలు - 61, 62. )

'నైమిన్న నైమిన్న వీథుల ప్రకరణము'లో పాశ్చాత్యులు వారివారి దుస్తులు ధరించి ఎట్లు నిరంతరశముగ సంచరింతురో నృసింహకవి ఈ క్రింది పద్యములో చిత్రించెను.

" వెలయున్ బుట్టలబోని హస్తముల టోపీలొప్పఁ జిత్రంపు బొం
తలు సెమ్మెనులు గప్పలాగులు పదస్వాంగ్వాంబులోఁ దీర్ప నే

షాలు నేయుం పురి శ్వేతకాయ వయామా డైమిన్సు కైమిన్సు సే
కుల సంభోనిధిఁ బోసియుండలరు పాధోమానుష ప్రక్రియన్"

(పుట-63)

'వాణిజ్యశాలా ప్రకరణము' లోకవి, నాడు ప్రసిద్ధి కెక్కియున్న సంస్థలను షాపులను చిత్రముగా వర్ణించెను.

"అల యూర్పుత్తైటు హాసు జెన్కిహానాషాప్పార్ లయన్సోసు నా
బలుహాసుల్కఁటి షాపులు న్వాలయు దీస్త్ర శ్రీలనేతత్పుర
స్థలిత ద్వైప విచిత్ర వస్తుకలన న్వారాశి ప్రక్రియకు న
త్సలతం పన్మకుఁ గూర్చు పైశవ కళాంచత్కళా సద్మాకృతిన్"

(పుట-66; పద్య-1)

"నానాదేశ్య సునోష్ఠ వస్తువుల నానాడుం బరంగిఁబురం
గనేత్రల్పననాడెంచి తన్నగన నిక్షిప్తంబుతో షాపుల
న్నానా తీతి విశాల దర్పణగతానల్పానంగుతై పొల్చు న
క్షీణక్షీర సరస్వదూర్మి చలదత్సక్తానుసార ప్రక్రియన్"

" హిందువులు నిల్పు షాపులు నందలయన్ హానాఘులు నంచు హాసులకు నను
గుండిన్మల హాసులును ననించి సంపదలు నానేకములరయన్"

(పుట - 67; పద్య - 3,4.)

పందొమ్మిదవ శతాబ్ది మధ్యభాగమున, చెన్నపురిలో ప్రసిద్ధికెక్కిన ప్రాంతముల నీ క్రింది పద్యములో వివరించినాడు నృసింహకవి.

"ఎగ్మూరు యూనానుగంటివాక యాడయార్ కిల్పాకుంబూరు మే
త్తిరు వట్టూరును రాయపేట తిరువల్లికేణి చేపాకయున్
బురుశుంవాక పరంగికొండ నురి కృష్ణాంపేటయున్ లోనుగాఁ
గురిమట్లున్ విలసిల్లు నాటు పురముల్ భూతింపదే కాకృతిన్"

చెన్నపురి నేవునుండి ఏయే ప్రాంతములకు ఓడల రాకపోకలు సాగుచుండెడివో ఈ క్రింది పద్యము తేటగా తెలుపుచున్నది.

"అల నారోన్మను పరంగి బొంబయియును బర్మాసీమపై గోవ బం
గళ కోరంగియు నాదిగాఁగలుగు ప్రఖ్యాతంపు కోస్తాల నా
వలరా కల్నగరీ జనంబులకు రేపల్ దెల్పు రంజిల్లు ను
జ్జ్వల సీకష్ట నివిష్టకేతన పటుస్తంభాగ్ర చేలప్రటల్"

ఇట్లు వివిధప్రాంతముల నుండి వచ్చిపోవు ఓడలలోని సరకులను రేవునకు చేర్చు పడవల రాకపోకలను కవి ఇట్లు చమత్కారముగా వర్ణించెను.

"సరకు నింపను దింపను సారె సారె దరులయొద్ద కరుగుపడవ
లోడలకు మేడలకు మైత్రి నొనరగూర్చు నిటునటు చరించు చారుల నెనసి వెలయు"

ప్రతిభావ్యుత్పత్తులు పుష్కలముగా కల కవి గనుకనే నృసింహ కవి ఇంత రమణీయముగా చెన్నపురీ విలాసమును తీర్చిదిద్ద గలిగెను. వీనితో బాటు సాహసము కూడ కల కవి. ఇంగ్లీషు మాటలను, జంకు గొంకులులేక యథాస్థానములందు ప్రయోగించి తనకుగల ఔచిత్య పరిజ్ఞానమును వెల్లడించెను. ఇట్లు ప్రయోగించి, ఇంగ్లీషుమాటల విషయములో - వాడుకలోకి వచ్చినవి కావ్యములలో పరిగ్రాహ్యములా, కావా, అను విషయమున - ఒక సిద్ధాంతమును వెలువరించినాడు. ఇది కవియొక్క ప్రగతి దృక్పథమునకు తార్కాణము. కావ్యము ప్రౌఢశైలిలో, ప్రాచీనకవి సమయములతోను, అలంకారములతోను నిండియున్నను వాస్తవికతను యథోచిత ఫక్కిలో ఆదరించెను.

కనుక 'చెన్నపురీ విలాసము' నకు ఆంధ్రసాహిత్య రంగమున విశిష్టస్థానము కలదని సూచనచేయుచు, నృసింహ వంశమును, ఆతనిని, శ్రీ రాజా బొమ్మదేవర నాగన్ననాయుడుగారు కీర్తించినట్లు కవి చెప్పుకొనిన పద్యముతో వ్యాసమును ముగించుచున్నాను.

"క్షమవిహరించు వాక్సతి పుట్టినయిలు గణుతకెక్కి కులపుణ్యైక ధన్య
యోగులు వేంకటాచార్యాదులు మాల్యశైల నృసింహ కవులెల్ల నరసి
తుష్టి విద్యావిదులు ధన్యప్రపితామహులుండు వారి కవీంద్రగోత్రము దక్షి
ణవ భారతాది నానా గ్రంథకర్త నీ తాత నృసింహ నిర్వాణమందు
శబ్దశాస్త్రత్రయా నిపుణుండు నీదు జనకుండైనట్టి కనకాద్రి శాస్త్రి నయ్య
దఖిల శాస్త్రార్థవేది, నీ వద్భుత ప్రసిద్ధ సారస్వతుడవు నృసింహశాస్త్రి."

('తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము' అను నా 'డాక్టరేటు' పరిశోధన వ్యాసము ననుసరించి)

# కీర్తికాంక్ష

సి. నారాయణరెడ్డి

అన్ని కాంక్షలందు, కీర్తి
యన్నది చిత్రమైనది
కొనయూపిరి లాడువరకు
అణగారని దాహమ్మది.

కణమాత్రమ్మైన, కీర్తి
కాంక్ష లేని మానవుండు
నేటికి ఏనాటికైన
నూటికి కోటికి కొకండే.

వింత యేమిటనగ 'వెర్రి
వెంగళప్ప' యైనగాని
తనకు కీర్తి దాహమున్న
దన 'నసేమి' ఒప్పుకోడు.

తెల్లనైన యశఃకాములు
దీపింతురు మానులట్లు.
నీటిప్రక్క ఒంటికాల
నిల్చియుండవా కొంగలు ?

పేరుకొరకు సభ్యత పాలి
మేరల నవదాటువారు
గడియించున దేమి ? పేరు
గా దెముకల పేరుగాని.

మనిషి ననుసరించు నీడ
మాదిరిగా కీర్తిగూడ
తనయంతట తానే వ
చ్చినచో తలదాల్చవలయు.

[నా 'సమదర్శనం' నుండి]

ప్రజా సాహిత్య వైతాళికుడు

# పాలుకురికి సోమనాథుడు

కామఋషి సత్యనారాయణవర్మ

## ప్రస్తావన

పాలుకురికి సోమనాథుని పేరు వినగానే శైవారాధకులకు - సాహితీప్రియులకు తనువు పులకాంకురిత మౌతుంది. ఇందుకు రెండు కారణాలు. ఒకటి భక్తి ప్రధాన శైవమత ప్రబోధం - రెండవది ప్రజాసామాన్యానికి అందుబాటులో గల దేశిచ్ఛందస్సులో వ్రాసిన కావ్య రచన. సుందరకావ్య రచనతో నిరంతర సన్నిహితుడైన యీ మహామునిని చారిత్రక దృష్టితో 8 శతాబ్దుల వెనుకకునెట్టి దూరం చేసికోవటం నా మనస్సుకు కష్టమనిపిస్తుంది. ఇతడు తన కావ్యశరీరంతో నిత్య ప్రసన్నుడు - అన్ని కాలములకు చెందినవాడు. అట్టి మహాకవి యీనాడు మన సమక్షంలోనే సాక్షాత్కరించి వున్నాడు.

అదిగో! ఆమూర్తి దర్శనం చెయ్యండి!

శ్రీ భసిత త్రిపుండ్రక
పరిత విశంకట ఫాలు,
జాటజూటీభూత దాము నిజ్జల
నటీపటులా కృత దేహు,
నక్షమాలాభరణాభిలాంగు బసవాక్షర
పాద పవిత్ర వక్త్రు
చిచ్ఛోభిత చిత్తు పాల్కురికి
సోమన దేశికు ప్రస్తుతించెదన్

* * *

పిడి లిఖింపక మున్న యపరిమితార్థోక్తిశక్తి
యూతని జిహ్వ జరుగుచుండు
ఛందోవ్యాకరణాది సరణి చూడకమున్న
మదినుండు కావ్య నిర్మాణశక్తి
భాష్య సంతతులు చెప్పంగ చూడకమున్న
రుద్రభాష్య క్రియారూఢి వెలయుc
దర్శనశాస్త్రాది విద్యలు పఠింపకమున్న
సకలక్షు విగ్రహ ప్రౌఢి వెలయు
నతని మతియింప నాబోటికలవియగునె
జైనపుస్తక విన్యస్త శాంతరసాల
కలిత బిజ్జల వెలగుండు, గండ శిరస
శోభితుడు పాల్కురికి సోమనాథాఖ్యుండు.

పిడుపర్తి సోమనాథుడను భక్తుడు (1600) వ్రాసిన సంపూర్ణ కావ్యం, బసవపురాణంలో తనకృతికర్తయైన పాలుకురికి సోమనాథుని వర్ణించుకొన్న మూర్తి స్వరూపమిది. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, వృషాధిపశతకం మొదలుగాగల అనేక గ్రంథాలను రచియించి తెలుగుల కందిచ్చిన ఈ కవిశేఖరుని గూర్చి కొంత వ్రాసికొందాము.

## జ న నా ది క ము

కళ్యాణపుర ప్రభువు బిజ్జలుని మంత్రి బసవేశ్వరుని (క్రీ. శ. 1132) అనంతరం తెలుగునాట వెలసిన వీరశైవప్రవక్తలలో సోమనాథుడు ప్రధానుడు. 12వ శతాబ్దంలో ఓరుగంటిని పాలించిన ప్రభువు

ప్రతాపరుద్రునికి ఇతడు సమకాలికుడు. తెలంగాణ మండలి 'పాలుకురికి' ఈతని జన్మస్థలమని చారిత్రిక పరిశోధకులు సూచిస్తున్నారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి ఉపనయన సంస్కార సంగతి తిరస్కరించి శైవదీక్ష స్వీకరించాడు.

పండితారాధ్య చరిత్రలో చాలచోట్ల బసవని గోత్రుండ, బసవపుత్రుండ నని భక్తితాత్పర్యంతో చెప్పుకొన్న దృష్ట్యా, ఆ గ్రంథాన్నిబట్టే ఇతనిని శ్రియాదేవి యని, తండ్రి విష్ణురామిదేవుడని, తాను కట్టకూరి పోతిదేవుని శిష్యుడని, వతిగాము రామయ్య శిష్యుడు, చెన్నరాముడు ఇతని సఖుడని తెలుస్తున్నది. తల్లిదండ్రులు శైవులు కాకపోయినా తాను శైవదీక్షల స్వీకరించి భక్తుడైనాడు. పిడుపర్తి సోమనాథుని కావ్యమునుబట్టి ఈయన వ్యక్తిత్వాన్ని కొంత తెలిసికోవచ్చు.

“ఇతడు స్వాభిమాన గోత్రుడు. సర్వలింగాచార విశారదుడు. సర్వశాస్త్ర పారంగతుడు, సంగ్రామాభిరామ వంటి కావ్యరచనా నిపుణుడు, వాగీశ్వరుడు. శైవదేశికుడు, వేదవేదాంగవేత్త, వేదభాష్యకారుడు, అష్టభాషాకవి, సంగీతవేత్త, పంచి తార్కికుడు, వినయసంపన్నుడు. తన వాక్కు చేత, ముక్తి చేత రాజులను మంత్రులను శిష్యులుగా దాసులుగా చేసికొన్నాడు, జైనమత వ్యాప్తిని నిర్ఘాటంగా నాశనం చేశాడు. ద్వైతా ద్వైత సిద్ధాంత పద్ధతులలో ప్రవీణుడు. చారిత్రిక మూలపురుష మహాశివుడు 'బసవన్నకు' దివ్యతేజస్సు కలిగించిన వీరారాధకుడు. దేశభక్తి, శైవభక్తి కలిగి ఆంధ్రదేశంలో ప్రచారం చేసిన రాజకీయవేత్త. అప్పటి దేశ రాజకీయముల ననుసరించి జైనమత ప్రాబల్యము నరికట్టుటకై సంస్కరణాభిలాషతో, ప్రజానీకంలో ఆయా భావాలను వ్యాప్తం చేయ్యడానికి అవసరమైన సాహిత్యం సృష్టించి, వ్రాసి స్వయముగా చదివి వినిపించి శిష్యగణాన్ని ప్రోగుచేసి, రాజులను, మంత్రులను స్వాధీనం చేసికొన్న ప్రతిభావంతుడు. దేశాటన చేసి, బహుభాషల నభ్యసించి వానిలో కావ్యములన్నీ వీరశైవ ప్రచారం ముఖ్యమైన నాయక శిఖామణి. వీరశైవ సాహిత్యమును కన్నడులకు ప్రసాదించి ఆరాధ్యుడై వారి సంస్తుతుల నందుకొన్నాడు - (బసవపురాణ కన్నడ, మహారాష్ట్రి భాషలలో అనువదింపబడినది.)

సోమన కాలంనాటి సాంఘిక పరిస్థితులను కొంత కొంత వివరిస్తాను.

మనకు స్వతంత్రస్మృతిలేని చరిత్రలు సామాజికం కష్టం. మతంతో వ్యమాలు ఉద్రిక్తత కల్లోలం - సంఘర్షణం లేకుండా వుండవు. మత యుద్ధాలలో జైనులు నిర్మూలించబడగానే వీరశైవులు - వీరవైష్ణవులు దేవస్థల మలంకరించారు. వీరి మతోన్మాదవ్యాప్తి గుళ్ళలోని విగ్రహాలను మార్చివేసేటంతవరకు పోయింది. ఉదాహరణకు ఆదిలో తిరుపతిలో వున్న వీరభద్ర విగ్రహాన్ని శ్రీ రామానుజులే వైష్ణవదైవతంగా మార్చినట్లు శ్రీపతి పండితులు తమ శ్రీకర భాష్యంలో వ్రాసినారట. వాఙ్మయ రంగంలో పరస్పర దూషణలతో కూడిన సందర్భాలు చాల దొరుకగలవు - దీనికి సోమనాథుడు నూతన కలిశాడు ఇతనిలో శైవ మతాభిమానం ఎంతో -

మహావీరుడు [illegible] తీర్థంకరులు. వీరులతో (జైనీయ [illegible]) సంభాషణము కూడ వర్ధమానుడు. ఈ మత ప్రవృత్తి [illegible] సామాన్యులందరిలో [illegible]. ఈ నా [illegible] ప్రభావం [illegible] కనిపిస్తున్నది. [illegible] దేశంలో [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] ప్రాంతాన్ని [illegible]. ఈ నా [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] భాషా [illegible] లేనిదే ఇంత [illegible] [illegible] – [illegible] [illegible] [illegible] – [illegible] – [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] [illegible] – [illegible] [illegible] – [illegible] – [illegible] – దేశ భాషా [illegible] – [illegible] – [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. ఇది [illegible] జైన ప్రభావం ఎంతటిదో [illegible] [illegible]!

తెలుగు దేశమంతా ఒక జైన [illegible] క్షేత్రం. శ్రీశైల – [illegible] – [illegible] రాలు వాటికి పెట్టిన కోటలు – తెలుగు భాష జైన సంప్రదాయాత్మకమైనది. చిన్న నాడే 'ఓం నమః శివాయ' అన్న [illegible] [illegible] మంత్రంతో అక్షరాభ్యాసం చేసే తెలుగులలో [illegible] జైనమత ప్రాబల్యం స్పష్టమవుతున్నది.

## ఒక మాట

[illegible] అక్షరాభ్యాసానికి' [illegible] [illegible] [illegible] – తెలుగు [illegible] ప్రాంతాలలో' 'ఓం నమః [illegible] [illegible] 'సిద్ధం నమః' అని [illegible] వ్రాయిస్తారు.

జైనమత వ్యాప్తివల్ల [illegible] మొదటి విద్యాభ్యాసం [illegible] వారు '[illegible]' అని అక్షరాభ్యాసం చేయించి [illegible] [illegible], [illegible] [illegible]. తెలుగు [illegible] జైన ప్రాబల్యం ఎంతటిదో విశదమౌతుంది.

7 వ శతాబ్దం మొదలు 12 వ శతాబ్దం వరకు తెలుగుదేశ పరిపాలకులైన వారంతా [illegible] [illegible] మాహాత్మ్యమునే. [illegible] [illegible] మహాభారతాన్ని తెలుగు చేయించిన [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ప్రతిష్ఠ [illegible] – [illegible] ప్రభువులు [illegible] [illegible] – [illegible] (క్రీ. శ. 1050 – 1350) జైనం విడిచి శైవు [illegible]. [illegible] జైన [illegible] [illegible] [illegible] గ్రామాలు, ధనములు [illegible] శాసనాలు వ్రాయించారు. [illegible] జైనమతానికి [illegible] తెనుగుకు రాజభాషా [illegible] [illegible] [illegible] శిథిలమైంది.

సోమన రచన లోనారి విశిష్టతను తెలిసికొనేముందు శైవవాఙ్మయం గురించీ ప్రజాసాహిత్య రచనా స్ఫూర్తిని గురించి అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ఆదినుండి బ్రాహ్మణులు వేదాలపైన ఇతరులు ఆగమాలపైన ప్రామాణికత నుద్ఘాటిస్తూ ఉండేవారు. శైవులు అధిక సంఖ్యాకులు బ్రాహ్మణేతరులే. శైవమత ప్రవర్తకులగు 63 నాయనార్లు బ్రాహ్మణేతరులే. నాయనార్లు సులభగ్రాహ్యమైన దేశభాషలోనే గ్రంథాలు రచించారు. వేద సమ్మతమైతేనే గాని ఏ మతానికి ప్రామాణికత ఏర్పడదు. అందువల్ల ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు మొదలైన వాటిని శైవపరంగా వ్యాఖ్యానించ నారంభించారు. ఇట్టి వారిలో శ్రీకంఠ శివాచార్యులు - శ్రీపతి పండితులు (12 వ శతాబ్దం) వంటి ప్రసిద్ధులైన సంస్కృతాచార్యులు ముఖ్యులు. వీరి రచనలు కూడ ప్రజా బాహుళ్యానికి అందుబాటులో నుండి మత ప్రచారానికి తోడ్పడినవి. 12 వ శతాబ్దానికి వీరశైవ ప్రచారం మొదలు కాగా శైవం నామమాత్రావశిష్టమైపోయింది. మత సాహిత్యానికి మూలాధారమైన ఆంధ్ర వాఙ్మయంలో మార్గము - దేశి అను రెండు ప్రత్యేక శాఖలు ఏర్పడినవి. దేశమునకు చైతన్యకమైనదే దేశి సంప్రదాయము, మార్గము సంస్కరింపబడిన దేశి.

ఈ మార్గ, దేశి సంప్రదాయాల లక్షణాలు కూడా కొంచెం అవగాహన చేసికొన్న పిమ్మట సోమనాథుని రచనలలోని వైశిష్ట్యం బాగా గ్రహించవచ్చు.

మార్గ సంప్రదాయం - సంస్కృతానుకరణాత్మకంగా వైదికమత ప్రాధాన్యం గలది. మానవజీవనంలో చాతుర్వర్ణ్య వ్యవస్థ - బ్రాహ్మణాధిక్యతను అంగీకరిస్తుంది. సంస్కృతానికి ప్రధానమైన భాగాన్ని వినియోగిస్తారు. వాఙ్మయ సృష్టిలో సంస్కృత వృత్తములతో కూడిన పద్యకవితకు ఆలంబన మొసగునది - సాహిత్య రీతిలో గద్యపద్యాత్మక ప్రబంధపద్ధతి ననుసరించి ఉంటుంది. కథావస్తువు పౌరాణికమూ, దివ్యనాయకత్వమూ - వైదిక సంస్కృతి ప్రతిపాద్యముగా నుండి శిష్టజనసంవర్ధితమై గ్రంథస్థానాలైన ప్రౌఢ సాహిత్య రచన సాగుతుంది.

దేశి సంప్రదాయం అవైదికం - ద్రావిడ మార్గానుసరణం - సంఘ జీవనంలో జాతి విచక్షణ పాటించకపోవటం - నిమ్నజాతుల వారి ఉద్ధరణము లక్ష్యము - భాషలో దేశి ప్రాధాన్యం గల జాను తెనుగు ననుసరించటం - వాఙ్మయ సృష్టిలో దేశి కవిత - మాత్రాగణ ప్రాధాన్యం గలది. జాతీయ భావనా ప్రోత్సాహకమైనది. సాహిత్య రీతులలో ద్విపద, రగడ, శతకము యక్షగానము, ఉదాహరణము - మొదలగు కృతులకు ప్రాముఖ్యం గలది. కథా వస్తువులో మానవ నాయకత్వం - వీరారాధన - భక్తి ప్రధానము.

దేశ కాల పాత్ర ప్రతిబింబనముగా సంచరించెను. సర్వజన సంతర్పణము - సంగీత భావ ప్రాధాన్యత గలది - ముఖ్యముగా గానపరమైనది.

నన్నయ భారతాంధ్రీకరణం నాటి నుండి ప్రామాణికంగా వున్న మార్గ కవిత - శివకవులలో మొదటి వాడైన నన్నెచోడుని - దేశి మార్గకవితల సమ్మేళన విధానంతో మార్పు చెందింది, దేశి సాహిత్య ప్రాముఖ్యానికి మార్గం ఏర్ప

డింది. ఈ పరిణామంలో దేశి శైవమత ప్రచారానికి ఆలంబన యోగ్యత యింది. సోమనాథుడు సంస్కృతము - కన్నడము, ద్రావిడము, మహారాష్ట్రము మున్నగు బహు భాషలలో పండితుడు, కవి కూడ నగుటవలన అతని వాణి పండిత పామర రంజకమై విలసిల్లినది. వీర శైవ మత ప్రవక్తల చరిత్రలు - భక్తుల చరిత్రలు స్తుతులు రచించి ఆంధ్ర శైవ వాఙ్మయ రంగంలో ఒక ప్రత్యేకతగా నిలిచినాడు.

మార్గ కవితా రీతులు ఉత్తమ సాహిత్యంగా పరిగణింప బడుతూన్న రోజులలోనే సోమనాథుడు ఆంధ్రదేశి ఛందస్సుకు మూలమైన ద్విపదకు జీవం పోసి, మహాకావ్య విశిష్టతను కడయించి పెట్టినాడు.

కొన్ని రచనలను పరిచయం చేసికొందాం.

"అల్పాక్షరముల అనల్పార్థ రచన
గావించుటేను గాదె కవికి ముఖ్యము?"

అన్న భావంతో వ్రాసిన కొన్ని రచనలను పరిశీలించుదాము.

"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్య మగుట
కూర్చెద ద్విపదలు కోర్కి దైవార"
—బసవపురాణం.

అని రచనలు సాగించాడు.

ఇతని కవితా గురువు కరస్థలము విశ్వనాథయ్యగారని ఈయన వ్రాసికొన్నాడు.

శైవ మతోద్ధారకుడైన బసవేశ్వరుని చారిత్రమునే బసవ పురాణముగా రచించాడు. మధ్య మధ్య శివభక్తుల కథలూ, మహిమలూ వర్ణింపబడినవి. ఇది కన్నడము, ద్రావిడము - సంస్కృత భాషల లోనికి అనువదింపబడి వారిచే గౌరవింప బడుతూంది. ఈ కృతికి గొబ్బూరి సంగనామాత్యుడు శ్రోత.

రెండవ గొప్ప కావ్యం పండితారాధ్య చరిత్ర. మల్లికార్జున పండితారాధ్యుని చరిత్రను ప్రధానంగా చేసికొని శైవమత ధర్మాలను ప్రతిపాదించిన గ్రంథము - తన ముద్దుల మరది, నెచ్చెలికాడు, సాహిత్యపరుడు, బసవ భక్తుడు, వీర పోచేశ్వరాచార్యుని శిష్యుడు, మంత్రియును, ఆపస్తంబ సూత్రుడు, హారీతసగోత్రుడు నగు సంగనామాత్యునకు కృతిగా సమర్పించాడు. ఈ కావ్యం ఒక మహాసాగరం వంటిది. మథిస్తే రత్నరాసులు కొల్లలుగా లభ్యమౌతవి - తన భాషా వైదుష్యాల వెల్లడించిన అమూల్య కృతి.

వాద ప్రకరణంలో జైన, చార్వాక, బౌద్ధాది మతముల ఖండనము వ్రాయబడినది. పర్వత ప్రకరణం ఆ గ్రంథానికి శిరోభూషణం వంటిది. ఆనాటి ప్రజాజీవన సాంఘిక చరిత్ర - ప్రజల వినోదాలు - ఆటలు పాటలు సమగ్రంగా చిత్రింపబడినవి. భక్తుల స్తుతుల రచనలో సోమనాథుని శైలి మహోన్నతస్థాయిలో నడిచింది. భక్తులకు పారవశ్యం కలుగ చేస్తుంది. దుర్గ కుడుంగాలలో యాత్రికులు పడే కష్టాలను సహజంగా వర్ణిస్తాడు.

'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అని పెద్దలు అంటారుగదా. భక్తుడు ఎన్నో కష్టాలకు కఠిన పరీక్షలకు కఠోర దీక్షలకు ఆగి నిలువగలిగితే శివుని అపారకరుణకు ఆప్తుడు పాత్రుడౌతాడు. భక్తులు పారవశ్యంతో పథశ్రమను దీరే

ట్టుగా గొంతెత్తి పఠించే స్తుతులు వినిన ఒడలు పులకాంకురితమౌతుంది.

"సమ్ముఖి.... ఇట్టి దుర్ఘట మార్గ దుర్గ భూరి పర్వత మహోద్భూత గుహాగహ్వ రారణ్య దుష్ట మృగానుక చోర నాగ సంశ్రిత నిర్జన ప్రదేశముల............ చిక్కుచు మోకాళ్ళ చేతులూనుచు వంగుచు, వాలుచు, దొంగుచు లేచుచు

..............................

చేదుకో చేదుకో శ్రీగిరినాథ చేదుకో
మల్లయ్య చేదుకొమ్మనుచు చేదుకో చేదుకో
శ్రీశైల నిలయా......................

అనుకుంటూ పర్వతాగ్రాల మీద అతి ప్రయాసతో యాత్రలు సాగించారు. తెనుగుల అష్ట భాషా ప్రభావంతో ఆంధ్ర కన్నడ, ద్రావిడ, మహారాష్ట్ర (ఆరె) దేశవాసులు వారి వారి స్వభాషలలో శ్రీగిరి మల్లయ్యను ఎలా వేడుకొన్నది - స్తుతులు చెల్లించుకొన్నది హృద్యంగా వర్ణించాడో చూడండి.

"నల్లవో నల్లవో నా రాజ రాజ!
మల్లయా మల్లయా మహానీయుడే!
మహాపాతక కోట్లు భస్మమైపోవాలు
శ్రీగిరి మల్లయ్య శరణన్న చాలు!
రాబోవ నెంత మానంబైన నిలుక
చేబోదు మల్లయ్య చేపట్ట గొలువ

ప్రసంగానుప్రసంగంగా కొందరు శైవ భక్తులను కూడా స్మరించుకునేవారు. ఈతనికి శివునికంటె గూడ శివభక్తులపట్ల గల అపార భక్తి.

"పండితారాధ్య శ్రీపతి పండితయ్య
బండారు బసవయ్య బానుక నొల్లు
శంకర దాసయ్య లెంక మంచయ్య
బంకయ్య శివరాత్రి వంకయ్య శరణు
యేలేసు కేశయ్య యింద్రి శాతయ్య
మోళిగ మారయ్య ముగ్ధయ్య శరణు
బావూరి బ్రహ్మయ్య బాచిరాజయ్య
కోవూరి బ్రహ్మయ్య గొగ్గయ్య శరణు
కిన్నెర బ్రహ్మయ్య కేసిరాజయ్య
కన్నాడ బసవయ్య గణరాసి శరణు
బాచయ్య సకలేశ నాదయ్య చిబ్బ
బాచయ్య మడివాలు మాచయ్య శరణు
శివగిరి శరణు శ్రీగిరినాథ శరణు
శ్రీగిరి మల్లయ్య శరణు శరణు

ఈ విధంగా ఆడుచు పాడుతూ యాత్రలు సాగించారు. ఈ భక్తులలో వర్ణభేదము గాని, భాషాభేదము గాని పాటించక అందరును శివభక్తి పేర ఆరాధ్యులై సంస్మరణీయులగుట గమనించదగిన విషయం.

భక్తిపారవశ్యం కలిగించే స్తుతులలో ఒకటి.

"శ్రీ మల్లినాథాయ శ్రితమన్మథాయ
సోమార్క జూటాయ శూలాయుధాయ
భస్మీకృతానంగాయ పరమేశ్వరాయ
తస్మై నమోస్తు కుధరవల్లభాయ"

## ప్రజల వినోదాలు

"ప్రసన్న పురాతన పటు చరిత్రలును
క్రమమొంద బహు నాటకములాడువారు"

..............................

మేటిమై మను భక్త కూటువలందు
పాటలుగా గట్టి పాడెడివారు
ప్రస్తుతోక్తుల గద్య పద్య కావ్యముల
విస్తారముగ చేసి వినుతించువారు
అటుగాక సాంగ భాషాంగ క్రియాంగ
పటు నాటకంబుల నటియించువారు
మునుమాడి వీరు వారన నేలగూడి
కనుగొన రోళ్ళ రోకళ్ళ బాడెదరు -

అని ఆనాడు విద్యా ప్రచారంలో పాటలకు నాటకాలకుగల ప్రాముఖ్యతను వివరిస్తాడు.

## రంగుల రాట్నం వినోదం

చటిల సంసృతి జీవ ఘటి చక్రకర్మ
పటు పరివర్తన భ్రమణంబు గూర్చి
కీలు వొందించి యాంత్రిక రాటనముల
వాలియాడించు నా వడ్రంగి యాతడు -

తెలుగు సీమలో తయారైన సన్నని వస్త్రాలకు ప్రపంచ ప్రఖ్యాతి వుంది - కాకతీయుల కాలం నాటి వస్త్ర నామ విశేషాలు సోమనాథుని రచనలో చూడ వచ్చును.

“వెంజావళియు, జయరంజియు, మంచు
పుంజము, కుణిపట్టు, భూతిలకంబు
శ్రీ వన్నియయము మహా చీని చీనిజము
భావజ తిలకంబు పచ్చని పట్టు
రాయశేఖరము, రాయవల్లభము
వాయు మేఘము, గండవాళంబుగండ
..................... ............
గౌరి గనయమును, క్షీరోదకంబు
పట్టును, రత్నంపు పట్టును, సంకు
పట్టును, మరకత పట్టు పొంబట్టు
నెరపట్టు వెలిపట్టు, నేత్రంబు పట్టు

అని అనేక రకాల బట్టల పేర్లను వివరించాడు. (ఇట్టి వివరాలు శుకసప్తతి, హంస వింశతిలో గూడ కొల్లలుగా లభిస్తవి.)

నిత్య లింగార్చనలో శివాభిషేక సమయంలో శిశు పోషణ విధానమంతా వైద్య శాస్త్రసమ్మతంగా వివరించ బడింది.

“దొంగిళ్ళపైనుండి లింగమూర్తిలేని
అంగన గావించు నభ్యంగనములు
ముక్కొత్తు చెక్కొత్తు ముక్కున్న
పులుము
నక్కొత్తు కడుపొత్తు నటువీపు నివురు
వెనుగంగ వలెనని తరుణి నీడ్వడగ
చరణము ల్గ్రాగములు జాగంగ దిగుచు-”

ఈ విధంగ యీ రచన నాటి సాంఘిక చరిత్రను దర్పణంగా భక్తిరస ప్రవాహంగా, నేటికి మనకు నిలచివుంది. వృషాధిప శతకంలో కొన్ని -

బసవా! బసవా! వృషాధిపా! అన్న మకుటంతో చంపకోత్పలమాలలో రచించి నది. నందీశ్వరుని అపరావతారమైన బసవేశ్వరుని మహిమలు లీలలు ఇందు వర్ణింప బడినవి. దీనిని బసవన దండనాథునకే అంకితం చేశాడు - సంస్కృతాంధ్ర కర్నాట ద్రావిడ ఆర్యాది భాషలలో గల నేతని పాండిత్యం ప్రకటితమయ్యె. ఆ యా భాషలలో రచించిన పద్యాలు కూడా యిందు లక్ష్యమౌతవి.

“నాయొడయండ, నా విభుడ, నా హృద
యేశ్వర నా మనోహరా!
నా యిలవేల్పు నావరద నా గురులింగమ
నాదు జంగమా!
నాయదినాథ నా ప్రభుడ నన్ను కృపా
మతి బ్రోవుమయ్య దే
వా యనుమి బ్రుంపవంద్య బసవా! బసవా!
బసవా వృషాధిపా!

తన కభిమానపాత్రమైన జాను తెనుగులో

“పలు పాడతోంటి బీరమును పాపసరుల్
విరుమోము కన్నె వె
న్నెల తలచేతి కుత్తుకయు నిండిన వేలుపు
పేరు పల్కు పూ
సలు గలరేని లేఖవని జాను తెనుంగున
విన్నవించెదన్

# దృశ్యద్వయం

## "సత్యం"

౧

ఉఱుములు, మెఱుపులతో కుంభవృష్టి. చీకటి కమ్మిన మధ్యాహ్న సమయం. గాలిదెబ్బకు ఉబ్బుకువస్తున్న చెఱువుదరి పూరికొంప. రోడ్డుమీదనుండి లోనికి దూకుతున్న వాననీరు. మూనాళ్ళనుండి మండని పొయ్యి. మంటల జ్వరంతో ఎగిరిపడుతున్న ఎనిమిదేళ్ళ పెద్దకొడుకు. లక్కచిట్టిలో పాయసం వండి వడ్డిస్తున్న అక్క. ఆరగిస్తున్న చెల్లెలు. పాలుచాలక గోలపెడుతున్న చంటిబిడ్డ. జోలపాడుతున్న తల్లి అస్థిపంజరం. నంజుతో గింజుకొని, గింజుకొని కుక్కిమంచంలో కన్నుమూసిన తండ్రి!

౨

నల్లని శరీరం. బక్కచిక్కిన మనిషి. గోచీపెట్టిన కొల్లాయి లాంటి కట్టు. అకాలంగా ముసురుకున్న ముసలితనం. బుజాన కావడి. ముందుమట్టులో సామానుల తట్ట. తట్టమీద కుండా, చట్టీ పెట్టి కట్టిన ఒకమూట. వెనుక మట్టులో కోళ్ళగంప. గంపమీద గుడ్డల మూట. మూటమీద వెనుక ఎఱుకబుట్ట. రొమ్మున గట్టుకున్న పసిబిడ్డ. కుడిచేతిలో వ్రేలాడుతున్న పంజరం. పంజరంలో కిచకిచలాడుతున్న కొన్ని పక్షులు. వాటిని కవ్విస్తూ వెనుకవస్తున్న గోచీపెట్టుకున్న బాలుడు. వాని నెత్తిన గుడారపు వెదుళ్ళకట్ట. వెనుక పదిగజాల్లో కాళ్ళీడ్చుకుంటూ ఎదుపుదెబ్బతిని కూనిరాగంతీసే నంటినిండా దుమ్ము కొట్టుకున్న బడీవయసు వచ్చిన బాలిక!

---

(36 వ పేజీ తరువాయి)

వలపు నుడిం పలంతు బసవా! బసవా! బసవా వృషాధిపా! తన ఆశ్వాసాంత గద్యంలో వ్రాసికొన్నట్లు.

"అసంఖ్యాక మాహేశ్వర దివ్య పద పద్మ సౌరభ భ్రమరాయమానుడు" కూర్చిన జాను తెనుగు మధుధారలు, జంగమ లింగ ప్రసాదోపభోగ సంగత సుఖ సమాశరధి నిమగ్న సుకృతాత్ముడు తెలుగుల కందిచ్చి దివ్య సారస్వత పుష్పసౌరభాలు మన మనఃఫలకంపై సదా వాసించి తుష్టిని పుష్టిని అనుగ్రహించుగాక!

# ఏమి వ్రాయను?

## శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మ

ఈ మధ్యవుండీ వుండలేక "ఒక కథ" వ్రాశానండీ! అదికూడా నా మిత్రుని ప్రోత్సాహంతో అనుకోండి. మా చిట్టి మా యింటిలో పన్నెండు సంవత్సరాలు పెరిగి, వాళ్ళ నాన్న దగ్గరకు వెళ్ళింది. వాళ్ళ నాన్న తీసుకుని వెళ్ళకముందే చిట్టిని వాళ్ళ యింటికి పంపవద్దన్నా. అమ్మ వింటేనా? వాళ్ళ నాన్న దగ్గరుంటే కట్న మివ్వగలడు, అప్పుడు మంచి సంబంధం వస్తుంది. నా కేముందిగనుక? వాళ్ళ నాన్న తీసుకొనివెళ్ళాడు. అదే పదివేలంది అమ్మ. దానికి జరిగిన అన్యాయానికి యీ సంఘంలో బ్రతకలేక చిట్టి చనిపోయింది. మా చిట్టి చనిపోయిన తరువాతకూడా సానుభూతిలేకుండా "దాని పని, పిచ్చిపనులు చేసిన తరువాత దానికేం చేస్తుంది?" అని సంఘం నిందిస్తూవుంటే, నిజం తెలిసిన నాకు బాధ యెంతెంత ఎక్కువవుతుందంటారు, చెప్పండి? మీ రేమైనా అనుకోండి, చెప్పవలసిన ధర్మం నాది కాబట్టి చెపుతున్నా. నా బాధనంతా వ్యక్తంచేస్తూ నా మిత్రునికి ఒక జాబు వ్రాశాను. వాడు దాన్ని చదివి, వెంటనే నాకొక జవాబు వ్రాశాడు. ఆ లేఖలో యిలావుంది. "మిత్రమా, మీ బాబాయి కూతురు చిట్టి తానంతటతాను ఆలోచించుకోలేని దుర్భర పరిస్థితిలో ఒక దుర్మార్గుని వలలో పడి మోసపోయింది. మోసం తెలుసుకున్న తరువాత ఆదరించని తండ్రినీ, తనను అసహ్యించుకుంటున్న సంఘానికీ మాయమవ్వాలనే వుద్దేశ్యంతో యీ లోకాన్ని వీడింది. ఈ సత్యాన్ని తెలుసుకున్న నీవు నాకు వ్రాసినదే కథా రూపంలో వ్రాయరాదా?" అని వ్రాశాడు మావాడు. వాడు చెప్పినట్లు చేస్తే సత్యాన్ని బయటపెట్టి, చనిపోయిన మా చిట్టికి సంఘంలో న్యాయం కలుగచేస్తానన్న మనశ్శాంతితోనూ, చచ్చిన మా చిట్టికి ఆత్మశాంతి కలుగుతుందనే నమ్మకంతోనూ, నా మిత్రుడు వ్రాసినట్టే వ్రాశానండీ, నా అదృష్టమో, మా చిట్టి అదృష్టమో, పత్రికలో నా కథ ప్రచురించబడింది.

నేను ఒకనాడు తెగిపోయిన చెప్పులు బాగుచేయించుకోవడానికి సవన్నపేట వెళ్ళాను. చెట్టు దగ్గర తాత నా చెప్పులు బాగు చేస్తున్నాడు. అక్కడేనున్న మాసిన యిద్దరు పెద్దమనుష్యులు నాకు వినబడేలాగు యిలా చెప్పుకున్నారు. "ఆ చెట్టు దగ్గర నిలబడ్డ ఫకీరు ముండాకొడుకును చూశారా? వాడు వ్రాసిన కథ పత్రికలో పడింది" అన్నాడు మొదటివాడు. "ఆ చెప్పులు బాగుచేయించుకునే వాడేగా" అంటూ నా ముఖం చూస్తున్నాడు. "వాని స్తోమతెంతో, వానికున్న పలుకుబడెంతో నాకు తెలుసు. ఊరూ, పేరూలేని వెధవలు పంపితే వేసుకునే పత్రికవాళ్ళకేం తెలుస్తుంది?" అని చెప్పుకింద

స్నేహితులా అన్నాడు మొదటివాడు మాబోటివాళ్ళు "వాని కథ ఏమిటామాని వేసుకున్నారు?" అని ప్రశ్నిస్తే "మాకు వాస్తవంగా కనిపించింది. ఇతర వివరాలు అనవసరం" అంటారు పత్రికల వాళ్ళు అన్నాడు రెండో సహానుభావుడు. "అది వాడు వ్రాసిన కథ కాదు అంటే. ఎక్కడో కాపీ కొట్టి ఉంటాడు, యీ వెధవ రచయిత అనిపించుకోవాలనే కోరికతో..." అంటూ, నాకు వినబడేలాగ గుసగుసలాడి నాకేసి చూస్తూ నవ్వుకున్నారంటే, నేనే [illegible] చెప్పండి.

బాగుచేసి యిచ్చిన చెప్పులు తొడుక్కుని యింటికి పోయాను. ఆ రోజు కథ వ్రాయటం కాదు కదా, ఆ ఆలోచనే లేకుండా చేశారు యీ పెద్దమనుష్యులు. దేవుడా! రచనలు చేయకూడదని నా [illegible] నాకేళ్ళానా? అలా నీవు నిర్ణయించితే, నేను రచయితనవ్వాలనే దృఢనిశ్చయంతో యీ కథ వ్రాస్తాను. కన్నీళ్ళింట వస్తున్నాయి దేవుడా! చివరకి చేయూతనివ్వని నా ప్రయత్నాన్ని చేయలేకపోయాననే బాధతో వ్రాసిన కథ. నేను దృఢనిశ్చయంతో వ్రాసింది కాదు స్వామీ! అంటూ కాళ్ళ బడ్డా.

కథ పత్రికలో చూసి, నన్ను కలుసుకోవడానికి యిద్దరు మిత్రులు మా యింటికి వచ్చారు. అందులో ఒకరిని పోల్చేను. రెండో ఆయన నాకు కొత్త. వాళ్ళను చూసేసరికి, వాళ్ళేమంటారోనని భయపడ్డాను. మీరేమైనా అనుకోండి, నాకు కొంచెం భయం జాస్తి. 'భయస్తుడు', 'ప్రక్కవాళ్ళు ఏమన్నా ఎదురుతిరగలేని వాడు' అని నా గురించి మీరనుకోవచ్చు. అనుకోండి; అంతమాత్రంతో 'ధైర్యం లేనివాడు' అని మీరనుకోరుకదా! మా యిద్దరు స్నేహితులూ నా కథను చదివి పెద్దమనుష్యులుగాక చాల సంతోషించి యికముందుకూడ కథలు వ్రాయమని, కొన్ని సలహాలిచ్చి, నాలో రచయితనవ్వాలనే భావాన్ని కలిగించి వెళ్ళిపోయారు.

ఆరాత్రే కథావస్తువును ఏరుకొని, వెంటనే వ్రాయటానికి ప్రయత్నాల ఎక్కువయింది. ఆలోచిస్తూ కూర్చున్నాను. యింతలో నా మిత్రుడు ఉసికొలిపిన ఉత్సాహం తీసుకొని వ్రాయటానికి కూర్చున్నా. "ప్రియతమా! నీ మోము తిలకించని క్షణం నా ప్రేమ [illegible] అని కవ్వాలనుకున్నా; నీ కనులు కలకాలం నవ్వడితో ఆడుకుంటే నా కన్నె కథల పంతుంది." "ప్రియా నీ ప్రేమ ... వచ్చు ... నిద్రాలని ... పెట్టుము."

ఇలాంటి మాటలతో ఒకరని శృంగార ప్రేమకథలుగాధను వ్రాయాలనుకున్నాడు. ఆలోచించా, ప్రేమించడం ఏంటో తెలియని నాకు ప్రేమించి పెండ్లిచేసుకుంటారా, లేక పెండ్లిచేసుకుని ప్రేమిస్తారా నా కథానాయకుడు? అంతుచిక్కలేదు. పైగా, సాహిత్యానుభవమున్న ఒక కవి చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. కవిజీవితమే కావ్యమనీ, అలాంటి కావ్యమే రాణిస్తుందనీ, అనుభవాలు పొందిన రచనలలో రచయిత జీవితాన్ని ఏదో ఒకచోట చూడగలుగుతామనీ ఆయన చెప్పారు. వారి మాటలనే దృష్టిలో

వుంచుకున్నప్పుడు నా మిత్రుడు చెప్పిన శృంగారకథలో ప్రవేశిస్తే ఏమవుతుందో మీరే చెప్పండి. "శృంగారం కాస్తపోయి విషాదంలోకి దించాడురా కథను. చెడ వాయి" అంటారు మీరు. మరి నేను గొప్ప రచయిత నవ్వాలిగా కాబట్టి యీ కథ వదిలేస్తాను, మరి మీరేమీ అనుకోకండీ.

తప్పత్రాగిన పోలీసు త్రాగిననేరస్థుణ్ణి బంధించితే, దొమ్మరగుడిసెల్లో దూరిన మాజిస్ట్రేటును పొరపాటున లాకప్‌లో వుంచితే, విచారించేది ఎవరు? ఈ వస్తువును తీసుకొని కథ వ్రాయరాదయ్యా అన్నాడు నా రెండో మిత్రుడు. మా బాధలను కొంతయినా కథలో చూపెడితే పోలీసువాని జీవితంకూడా దుర్భరమనే సత్యాన్ని తెలుసుకుంటారు. కథకూడా మజాగా వుంటుదిలే వ్రాయమన్నాడు మా వాడు. ఈ కథ బాగానేవుంది. దీనిని విపులీకరించివ్రాస్తే, మావాడన్నట్లు మజాగానే వుంటుంది. వ్రాద్దామని కలం తీశాను. వెంటనే నలభైతొమ్మిదినుంచి యాభైరెండువరకు జరిగిన సంఘటనలు జ్ఞాపకానికి వచ్చాయండి. వీడు కమ్యూనిస్టై వుంటాడని పై వాళ్ళకు రిపోర్టుచేరితే అసలు నాకు వుద్యోగమే లేదనుకోండి, ఏదైనా అలాంటి అవకాశంవస్తే, పై కారణంగా కమ్యూనిస్టునైన నాకు వుద్యోగం నూరుకుతుందో లేదో అని భయపడ్డా. మీరనుకోవచ్చు- స్నేహితుని కోర్కెను తీర్చలేనివాడు భవిష్యత్తులో రచయిత ఎలా అవుతాడా అని. క్షమించండి. ముందేచెప్పాను నేను పిరికివాడినని. కథావస్తువుకోసం గతాన్ని తలచుకున్నా. నవ్వొచ్చింది. నేను విశాఖపట్టణం వెళ్తూ వుంటే, రైల్లో, యిద్దరు పోలీసుల మధ్య ఒక "గజదొంగ" సంకెళ్ళు వేయబడి వున్నాడు. వాడి సంగతి సందర్భాలు తెలుసుకున్నా. వాడు రాకపోక సౌకర్యాలులేని పల్లెటూరువాడనీ, నాలుగుశేర్ల సజ్జలు దొంగిలించాడనీ, శిక్ష చెప్పారు కాబట్టి సెంట్రల్ జైలుకు తీసుకుపోతున్నామనీ పోలీసులు తెలిపారండీ. ఇది విన్నాక, వానివంక చూస్తే నాకు జాలివేసింది. కాని, వానిలో జైలుకుపోతున్నానన్న బాధ రవ్వంతైనా కనుపించలా. పైగా, ఆశ్చర్యంగా మాట్లాడుతున్నాడు. "ఇదేటో లయ్య, జోడెన్న బండెక్కంటే జోరుగాపోతాది. ఈ బండి నేసుంతారు బాబూ?" అన్నాడు. పెట్టెలోని వాళ్ళంతా పకపకా నవ్వారు. "రైలు బండి. దీనికి ఎద్దులుండవురా గాడ్దా" అన్నాడు ఒకడు. ఆనాటి అతని మాటలు వినిపించినట్లయి, ఎంతసేపు నవ్వానో ఏమో. అమ్మ లేచి, "ఓరే ఎందుకురా ఆ నవ్వు? అర్ధరాత్రి నిద్రపోకుండా నీ వెలగబెట్టే రచనలు ఏమిటి? నీ వాలకం చూస్తే, నీకు వున్మాదం వచ్చినట్టుంది. నన్ను నిద్దరపోనిచ్చి నీవు నిద్దరపోరా తండ్రీ" అంది. మీరే చెప్పండి. ఆమెను కసురుకుంటే ఏం బాగుంటుంది? రచయిత అంటే దయా, ఓర్పులతో సహనశీల స్వభావాన్ని అలవర్చుకోవాలిగా మరి! కిమ్మనకుండా పడుకున్నాను. ఇంకేముంది? ఆ రైటే కథ వ్రాయాలనుకున్న "థాట్" కాస్తా పోయింది. "మూడ్స్" లేనప్పుడు వ్రాయడమంటే ఎంత కష్టమో మీరే చెప్పండి.

నాకు నిద్రపట్టలా. మరల ఆలోచన. మా ప్రక్క యింటిలో భార్యాభర్తలు అన్యోన్యంగా వున్నట్టే కన్పించేవారు. వేరే యింకో స్త్రీ చాలా మంచి మనిషి లెండీ, మంచికోసమే ఆమెకు కొన్ని కష్టాలువచ్చి, మనశ్శాంతికోసంమాయింటి ప్రక్కవారి యింటి కొచ్చింది. ఆ దంపతులు కూడ బాగానే చూశారు. కొన్నాళ్ళకు ఆ యింటిలో శాంతిలేకుండా పోయింది. ఆ ఇంటావిడ తన ఆప్తులతో తనకు సుఖాన్ని చేకూర్చమనీ, యితరుల మూలకంగా భర్త ఆలోచించలేకపోతున్నాడనీ చెప్పింది. ఆ ఆప్తులు "ఇంట్లో వుండే వెళ్ళనామె, ఆమె కుటుంబపరిస్థితి నీకు కొంతవరకు తెలిసేవుంటుంది. ఆ దంపతులకు ఎందుకు శాంతి లేకుండా పోయిందో చెప్పు" అన్నారు. ఆ స్నేహితి చెప్పిందిది: ఆ యింటావిడ చాలా పెంకిమనిషనీ, భర్తను వేధించుకు తింటుందనీ, నామాట అబద్ధమయితే ఆ యింటిప్రక్కవాళ్ళ నెవరి నైనా అడగమని చెప్పింది. వాళ్ళు మా యింటిప్రక్కనేవున్న యింకో యింటి వారి నడిగారు. వాళ్ళుకూడా అదేమాట. ఇంకేముందీ? ఆప్తులూ, వూరూ, వాడా మాయింటి ప్రక్కావిడను పెంకిది, పెంకిది, పెంకిదన్నారు. కొంతవరకు ఆమెతో పరిచయమున్న ఒకరిద్దరు బాధపడ్డారు. కాని ఆమె పెంకిది కాదే అంటే ఏమొస్తుందోనని భయపడి నోరు మూసుకుని వూరుకున్నారు. మా చిట్టికథ వ్రాసిన నేను ఈ "స్టోరి"కూడ వ్రాస్తే బావుంటుందనుకున్నా. కానీ, అంతా, పెంకిది అన్న ఆమెనుగూర్చి మంచిగా వ్రాస్తే, వూళ్ళో వాళ్ళంతా వ్యతిరేకంగా పోతే, యీ వెధవాయి తూర్పుగా పోతానంటాడు. ఈ వెధవ కెందుకంట అని తిడతారు. ఒకవేళ ఆమె నన్ను కథ వ్రాయమందని వీరంతా ఆమెమీద విరుచుకుపడితే కథ వ్రాసి న్యాయం చేయాలనుకున్న నేను అన్యాయం చేసినవాడ నవుతానేమో? ఆమె బ్రతికే వుందిగా మరి? మీరే చెప్పండి? మా చిట్టియితే చచ్చిపోయింది కాబట్టి, సత్యాన్ని బయటపెట్టి దాని ఆత్మకు శాంతికలిగించా. చిట్టిబుర్రలో కొచ్చి బావురుమన్నా. అమ్మ కూడ బావురుమంది. ఇంకేముందీ? కాకుల అరుపులతోపాటు ఏమిటబ్రా? ఏమిటబ్రా అంటూ, మావాడికిట్టు వాళ్ళంతా మాయింటిచుట్టూ మూగారు. అమ్మ వాళ్ళతో, ఏడుస్తూ

మావాడికి పిచ్చెక్కిందమ్మా,
రెండురోజులనుండీ వాడి వాలకమే
వేరుగావుందీ,
అర్ధరాత్రి కాడ నవ్వుతుంటేనే
నాకర్థమయింది
ఇదంతా దానిమూలంగానే అని
యిప్పుడు రుజువయిందీ—

అంటూ రాగాలుతీస్తూ చెప్పింది అమ్మ. వాళ్ళలో ఒకామె "ఏడవకుండా ఏం జరిగిందో చెప్పు"మంది. అమ్మ ఏడుపు మాని "అదేనండీ, మా యింట్లో వుండేదే మా మరిదిగారమ్మాయి, యీ మధ్య మా యింటికొచ్చి "అన్నయ్యలేడా పెద్దమ్మా అంది." లేడన్నాను. "నన్ను క్షమించు పెద్దమ్మా ఒకడు పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసంచేశాడు. సవతితల్లి బాధలను తట్టుకోలేని నేను వాడివలలోపడ్డాను. దాని ఫలితంగా యిప్పుడు తల్లిని కాబో

తున్నాను. చేసుకుంటూ నన్ను వాడు ఎక్కడికో పారిపోయాడు. నాన్న యీ సంగతి తెలిసి యింట్లోనుండి పొమ్మన్నాడు. మీరూ అన్నయ్యా ఆలోచిస్తారని వచ్చా"నంది.

"పెంచినపిల్లే అనుకోండు, కన్నతండ్రి పొమ్మంటే, ఆ స్థితిలో జాలివేసినా రక్షించడం కష్టమనుకుని మీ నాన్నగారికే వెళ్ళమన్నాను. అదివెళ్ళేముందు ఒక వుత్తరం వ్రాసి "అన్నయ్యకి" ఇమ్మని వెళ్ళిపోయింది. ఆ వుత్తరం చదివిన దగ్గరనుంచి మావాడు యిలామారిపోయాడు" అనిఅమ్మ బావురుమంది. ఈ వుత్తరంమాట జ్ఞాపకానికొచ్చి పైకి ఏడిస్తే వెక్కిరిస్తారనుకొని, ఎలాబాధపడ్డానో మీరర్థం చేసుకుంటే అదృష్టవంతుల్నే. తెల్లవార్లూ కథ వ్రాయాలనే ఆ వేదనతో నిద్రలేకుండా వున్న నా ముఖం ఎలా వుంటుందో మీరే వూహించండి. వాళ్ళంతా "ఎర్రగా గుంటూరు బావుల్లావున్న కళ్ళెట్టుకొని పిచ్చిచూపు లెలాచూస్తున్నాడో. పాపం ఒక్కగా నొక్క కొడుకు. పిచ్చివాడైనాడు- అంటున్న గతింకేంగాను?" అని వాళ్ళంటూవుంటే, మా ప్రక్క యింటావిడకథ వ్రాయాలనుకున్న నాకు ఆమె ఎలా పెంకిపయిందో అర్థం తెలిసిన నాకు ఎలా వుంటుందో మీరే వూహించండి." ఓరి భగవాన్! ఎలాంటి దుస్థితి తీసుకొచ్చి పెట్టావురా అంటూ దేవునికీ, రచయిత లెవరయినా నన్నుగూర్చి వ్రాయాలనుకుంటే, నా మట్టూ మరెగిన వాళ్ళు నన్ను పిచ్చివాణ్ణి చేశారు కాబట్టి ఈ దుస్థితినుంచి నన్ను విముక్తిచేస్తూ వ్రాయమని వారికి ఒక దణ్ణంపెట్టి నా ఆలోచనను అంతటితో ఆపానండీ. నాకొచ్చిన ఈ దుర్భరస్థితిలో ఎలా వ్రాయమంటారు? ఏమి వ్రాయమంటారు? మీరే చెప్పండి?

*A Fine Collection of*

**Mahakavi Sri Sri's POEMS**

# THREE CHEERS FOR MAN

**Rendered for the first time into English.**

**Rs. 2/-**

**Postage Extra**

***Copies Available at:***

**Visalaandhra Publishing House,**

**VIJAYAWADA-2.**

# పదచిత్రాలు

సంజీవదేవ్

కొండలూ, కొండల క్రింద లోయలూ, లోయల కావల కొండలూ. సూర్యుడు ఉదయించాడు. లోయలన్నీ పొగమంచుతో నిండివున్నాయి. సూర్యకాంతి పడని మంచు తెరల్లో గుండా దూరపు కొండలు లేత ధూసర వర్ణంలో స్వప్నలోకంలోని ఛాయా రూపాలుగా గోచరిస్తూన్నాయి. సూర్యకాంతి పడిన మంచుతెరలు లేత ధూమ్ర వర్ణాన్ని తాల్చినవి.

★

వాగు వొడ్డున ఏకాంతంగా వూగుతోంది పూచిన రెల్లు పొద. పైన మేఘాలు లేని శరత్కాలపు నీలాకాశం, క్రింద బుడదలు విరిగిన నీల జలాల ప్రవంతి. పైన నీలం, క్రింద నీలం, మధ్యలో రెల్లు పూల తెల్లదనం.

★

సూర్యుడు అస్తమిస్తున్నాడు పశ్చిమాకాశంలోని పగిలిన మబ్బుల్లో. పశ్చిమ దిగంతం రక్తరాగంతో వెలుగుతూంది. చెట్ల చివరలూ, ఇళ్ళ కప్పులూ, చెట్ల చివరలమీద తెల్లకొంగలూ, ఇళ్ళ కప్పులమీది బొల్లిపావురాలూ ఎర్రబారినవి. ఒక నల్లకాకి పశ్చిమంగా ఎగిరిపోతోంది.

★

నిశీథం, పైన కారుమేఘాలతో క్రమ్మివుంది తారామయ ఆకాశం. తారలకాంతి మేఘాల నలుపులో లీనమై పోయింది. క్రింద బురదనీటి నది కెరటాలు లేపుతూంది. అన్నిదిక్కులా నీరసం నిస్తబ్ధం, దూరాన పడవలో సన్నని మిణుకు మిణుకు దీపం.

★

# ప్రజల సంగీతం

## కొడవటిగంటి కుటుంబరావు

ప్రజల జీవితంలో కలుగుతూ వచ్చే రాజకీయ పరిణామాల అభ్యుదయం అటువంటి సాంస్కృతికంగా కూడా వాంఛనీయమైన పరిణామం జరుగుతూ వస్తున్నది. ఇవన్నై అయిదేళ్ళ నాటికన్న ఈనాటి ప్రజల నిత్యజీవితంలో సాహిత్యం, సంగీతం, నృత్యం, అభినయం, చిత్రలేఖనం మొదలైన కళలకు అధిక స్థానం ఉంటున్నది. ఈనాడు పత్రికలు, రేడియోలు, సినిమాలూ మొదలైనవాటి ధర్మమా అంటూ ఎవరుపడితే వారు నిత్యమూ తమకు కావలసిన కళలు ఆనందించవచ్చు. పూర్వం కూడా ఏవో కళలు ప్రజల జీవితంలో ఉండేవి. నాటకాలూ, తోలుబొమ్మలు, వీధినాటకాలు, జంగం కథలూ, జముకుల పాటలూ, సుద్దులూ, హరికథలూ, భజనలూ కోలాటాలూ మొదలైనవి. అయితే అవి గృహపరిశ్రమల లాంటివి, తరుణాలలో తప్ప లభ్యమయేవి కావు.

ఈ లోపం అలా ఉంచి, ఆ నాటి కళలకు ప్రాంతీయ లక్షణాలుండేవి. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకం పాటలుండేవి. అచ్చుయంత్రాల ధర్మమా అంటూ నాటకాలు మాత్రం ఆంధ్ర అంతటా ఒకే రకం నాటకాలు ప్రసిద్ధిలోకి రావటం జరిగింది, అప్పటికీ నాటకాలలోకూడా ప్రాంతీయ ప్రశస్తి అంటూ ఉంటూ వచ్చింది.

ఈనాటి ప్రజల కళలు పారిశ్రామికమైనవి. రేడియోలో పాటలు పాడితే అన్ని ప్రాంతాలవారూ వింటారు. ఒక సినిమా చిత్రం తయారైతే అంతటా ఆడుతుంది. దేశంలో ఉన్న జనం అందరి ఆదరణా పొందే గాయకులూ, నటులూ, రచయితలూ, చిత్రకారులూ మొదలైన వారీనాడు వెలిశారు. పారిశ్రామిక కళా ఉత్పత్తి ధర్మమా అంటూ సాంస్కృతికంగా దేశమంతటా ఒకటి అవుతున్నది. తమిళులకూ — తెలుగువారికీ మధ్యా, ఉత్తర దేశానికీ — దక్షిణ దేశానికీ మధ్యా సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయి. రాష్ట్రీయవేత్తలు నూరేళ్ళు గొంతులు చించుకున్నా ఇటువంటి ఏకత్వం సాధ్యమై ఉండకపోను.

ఇదంతా ప్రశంసనీయమే, వాంఛనీయమే; కాని, పారిశ్రామిక ఉత్పత్తిలో ఉండే మైల ఈ కళలకు విధిగా సోకుతుంది. ఇందువల్ల ఒక కళ — సంగీతం ఏమవుతున్నదీ చూదాం.

ఈనాడు రేడియోద్వారా ప్రజలకు కర్నాటక, హిందూస్థానీ సంప్రదాయ సంగీతమూ సుగమ సంగీతమూ, లలిత సంగీతమూ, సినిమా పాటలూ వినిపిస్తున్నాయి. సినిమాలు చూసే లక్షలాది ప్రజలు సినిమా పాటలు వింటున్నారు. ఇందులో ప్రచారం అధికంగా ఉండేది సినిమా సంగీతమూ, ఉత్తమ సంగీతలక్షణాలతో కూడుకున్నది సంప్రదాయ సంగీతమునూ. మిగిలినవి మిడిమిడి సంగీతాలు.

ఒకప్పుడు సినిమా సంగీతం సంగీతమే కాదన్న వైఖరి అవలంబించిన రేడియో

వారు రాజీ విధానానికివచ్చి ఇక్ష్వాకుల నాటి సినిమా రికార్డులను మిడిమిడి సంగీతంకింద చలామణీ కావిస్తున్నారు. పాత చింతకాయ పచ్చడి పద్యమన్న ధోరణి తప్ప ఇందులో మరేమీ స్ఫురించటంలేదు. ఏనాడో సూర్యకుమారి, రాజేశ్వరరావు, బెజవాడ రాజరత్నం, టి. జి. కమల మొదలైనవారు పాడిన పాత పాటలు లలిత సంగీతంగా ప్రజలకు అందుతున్నాయి! ఈనాటి సినిమా పాటలు మరో ఇరవై ఏళ్ళకు ఊరి లలిత సంగీత మవుతాయనుకోవచ్చు. సినిమాలలో పాడటం మానుకున్నవారి పాటలు లలిత సంగీతమేమో!

మిడిమిడి సంగీతాలు నాకాకర్షకం ఏమిటంటే ఇమిటేషన్ ఘంటసాలలచేతా, ఇమిటేషన్ లీలలచేత పాడించే పాటలు. ఏ యెంకిపాటనో పట్టుకుని ఒక ఇమిటేషన్ ఘంటసాల సంసారివారి ఆత్మ క్షోభించేటట్టుగా —చాతనయినంతమటుకు సినిమా ఫక్కీలో— పాడేస్తాడు. వినేవాళ్ళు అభిరుచిగలవాళ్ళయితే వాంతి చేసుకోవలసిందే. ఈ పాటలుపాడే బృందానికి చెందినవారికి సినిమా ఛాన్సులు జన్మలో రావు.

ఈవిధంగా రేడియో మిడిమిడి సంగీతం సినిమాసంగీతానికి ఈ కొసనూ, ఆ కొసనూ పట్టుకు వేళ్ళాడుతున్నది. ఈ సంగీతంనుంచి భగవంతుడు ప్రజలను కాపాడుగాక!

ఇక అసలు సినిమా సంగీతానికే వద్దాం. విటమిన్ బి కాంప్లెక్స్‌లాగా ఇందులో అనేకరకాల సంగీతం చేరివున్నది. ఒక చివర నికరమైన కర్నాటక సంగీతమూ, రెండోచివర ఎవరుపడితే వాళ్ళు పాడదగిన చచ్చురకం లలలా సంగీతమూ ఉన్నది. ఇది జాతీయ సంగీతంలో ప్రైవేట్ సెక్టర్. ఈ సంగీతంయొక్క ప్రధానాశయం జనరంజకంగా ఉండటమూ, డబ్బు గడించటమూనూ. అందుచేతనే ఈ సంగీతంలో ఎప్పటికప్పుడు నూతనత్వం ఉంటుంది, మొత్తంమీద వైవిధ్యంకూడా ఉంటుంది.

ఈ వైవిధ్యంమూలంగానే సినిమా సంగీతంలో నికరమైన సంగీతం ఎంతపాలు ఉండేదీ చెప్పడం కష్టమవుతున్నది. సంగీతంలో ఏమీ అభిరుచిలేని జనాన్ని ఆకర్షించటానికి ఇప్పుడు హిందీసినిమాలవాళ్లు నకరకాల సంగీతాలు సినిమాలో ప్రవేశపెడుతున్నారు. ప్లేబాక్ పాడే ఆడకూతుళ్ళు ఎవరో గొంతును పట్టుకుని తోస్తున్నట్టు పాడటమూ, తాగివున్నట్టో వెర్రెత్తినట్టో పాడటమూ మనం వింటున్నాం. ప్లేబాక్ గాయకుళ్ళు యోడలింగ్ ప్రారంభించారు. దానితోపాటు దగ్గటమూ, కక్కటమూ, జంతువులు చేసే చప్పుళ్ళన్నీ చేయటమూ కూడా సాగించారు. ఈ రకం సినిమా సంగీతంలో సంగీతం ఏమీ ఉండదు. కాని రేడియోలో ఈ పాటలనువిని చిన్న పిల్లలు పారవశ్యం చెందుతారు. ఎవరైనా చెయ్యకూడనిపని చేసి శిక్షించబడకుండా ఉండటంవారికి ఎటువంటి ఆనందాన్ని కలిగిస్తుందో ఈ సంగీతం అదే ఆనందాన్ని కలిగిస్తుంది.

ఇంతకంటే పాతపద్ధతి సంగీతంలో కూడా కొన్ని చిక్కులున్నాయి. అన్నిటికన్న ముఖ్యమైన చిక్కేమిటంటే సినిమా సంగీతంలో సంగీత హృదయం లేకపోవటం. ఈ మాట అనటంలో నా అభిప్రాయం ఏమిటో వివరిస్తాను.

ప్రతికళలోనూ రసభావాలు ప్రకటించే మార్గాలు వేరు వేరుగా ఉంటాయి. సంగీతంలో నవరసాలూ ఒప్పించవచ్చు. రాగాల ఎన్నిక ద్వారానైతేనేమి, పాడే పద్ధతిలోనైతేనేమి శృంగార, వీర, రౌద్ర, భీభత్స, భయానక ఆది రసాలనూ ఒప్పించవచ్చు. దానికి అభినయం తోడు పెట్టనవసరంలేదు. స్టేజిసంగీతం పాడే వాళ్ళకుకూడా సంగీత జ్ఞానము తెలిసిన రోజులలో బాలగంధర్వ (నారాయణరావు రాజహంస) అనేక నాటకాలలో కరుణారసపూరితమైన పాటలు పాడేవారు. కాని పాట పద్య ఎన్నడూ ఎక్కిళ్ళు, ఎగబీల్పులూ పెట్టేవారు కారు. ఆంధ్ర గంధర్వ జోన్నవిత్తుల శేషగిరి ముఖారి రాగంలో "రామో నాథ బభూవ" అన్న శ్లోకం పాడుతూ, మొదటి మూడు చరణాలలో కరుణరసాన్ని, నాలుగో చరణంలో వీర రసాన్ని ఒకే రాగంలో ప్రదర్శించారు. ఈనాటి సినిమా పాటగాళ్ళను వినివిని ఒక్కసారి ఆ తరం గాయకులను జ్ఞాపకం తెచ్చుకుంటే వారు సరస్వతీ అవతారాలని పిస్తారు.

దురదృష్టవశాత్తూ సినిమా సంగీతం లోకి ఏనాడో అభినయం ప్రవేశించింది. కరుణరసం విషయంలో చిత్ర నిర్మాతలు మరీ కనికరంలేకుండా ప్రవర్తిస్తున్నారు. ముక్కు చీదుకోవటం మినహాగా మిగిలిన అభినయమంతా ప్లేబాక్ ఆర్టిస్టు చేతనే చేయిస్తున్నారు. ఇలాంటి పాటలు అకస్మాత్తుగా రేడియోలో - సినిమా సందర్భం లేకుండా, మన మానసిక స్థితితో ప్రమేయం లేకుండా-వినిపించేసరికి కంపర మెత్తుకొస్తుంది. సంగీత భావం మాత్రమే ప్రధానంగాగల సంగీతమైతే ఎప్పుడు బడితే అప్పుడు వినటానికి ఇలాంటి అభ్యంతరం ఉండకపోను, ఈ కారణం చేత ఏడుపు సినిమాపాటలు ప్రజల సంగీతంగా రాణించలేక పోతున్నాయి.

ప్రజల సంగీతానికి తగినసాహిత్యం కూడా ఉండటం అవసరం. జానపద గేయ సాహిత్యం ఈ విషయాన్ని స్పష్టంగా నిరూపిస్తుంది. సంప్రదాయ సంగీత సాహిత్యం జనానికి అంతగా పట్టదు. అది సామాన్యంగా భక్తిమయం గానూ, దేవుడిపరంగానూ ఉంటుంది. కృతులు మొదలైనవి పాడేవారుకూడా సాహిత్యంలో ఉండే భావానికి అట్టే ప్రాధాన్యం ఇవ్వక సంగీతంమైనే తమ శక్తిసామర్థ్యాలు ప్రయోగిస్తారు.

ఈ దృష్టితో చూసినట్టయితే కొద్ది సినిమా పాటలు తమ సాహిత్యంతో ప్రజలను అమాంతంగా ఆకర్షించాయి - "నందామయా గురుడ", "గణనాథా" లాంటివి. మిగిలిన పాటలలో ఉండే సాహిత్యం కేవలం కథా సందర్భాన్ని పురస్కరించుకుని ఉంటుంది. ఆ పాటలను కథానుబంధంనుంచి వేరుచేస్తే వాటికి అర్థం ఉండదు - "కనుల కొకసారైన కనపడని నాతల్లి", ఎక్కిళ్ళతో సహా!

మరికొన్ని పాటలలో అసలు సాహిత్యమే ఉన్నట్టుండదు. పల్లవి "హాహాహా-హాహాహా" అనుపల్లవి "లలలా, లలలే" పాటలో మధ్యాంతిక మూడు పంక్తులు ఏకాక్షర నిఘంటువులోకూడా కనబడని పాడు అక్షరాలుంటాయి; మిగిలిన పాటకుకూడా అర్థం ఉన్నట్టుండదు.

అయినప్పటికీ ప్రజలసంగీతంగా పరిగణించటానికి ఈసినిమా ప్రైవేటు సెట్టరు సంగీతంతప్ప ఈనాడు మరొకటి కన బడదు.

# పలుకని చిలుక

## వియోగానంద

పదునాల్గు వత్సరమ్ములు
వదలినపతి రాక దెలిసి భావాలేవో
మదిలోన మెదలెనేమో
ముదమందుచు నూర్మిళమ్మ ముస్తాబయ్యెన్.

పంజరాన బెట్టి బంధింపబడియున్న
చిలుక చెంత జేరి పలుకరించ
మాటలన్ని నేర్చి మాటాడదేలనో
మర్మమెరుగకుండె నూర్మిళమ్మ.

ఇన్నినాళ్ళదాక నన్నెంతో మురిపించి
పలుకవేల నేడు చిలిపిదాన !
మగని జేరబోవు మగువను గనినంత
యీసుగల్గెనంటె యింతిలోన ?

అనినగాని తాను కనులెత్తిచూడదు
సిగ్గు చెంది నటుల శిరమువంచి
కూరుచున్న చిలుక తీరు గాంచిన యంత
ఊర్మిళమ్మ మనసు ఉలికి పడియె.

తన వెనుక జేరియున్నను
కన లేదపుడూర్మిళమ్మ కాంతుని రాకన్
మనసారంగ సుమిత్రా
తనయుడు తన చెలికి బలికె దరహాసమునన్.

చిత్తము చంచలించినది చిల్కకు; నెచ్చెలి ! చోద్యమందకే !
లత్తుక పూతతో నధరరాగము ముక్కున వ్రేలుచున్న ఆ
ముత్తెము మీదసోక, మును ముక్కునదాడిమ బీజమున్న యీ
క్రొత్త శుకమ్ము దెవ్వరని గొంకుచునున్నది మౌన మూనుచున్.

(మూలం : మైథిలీ శరణ గుప్త)

# పుట్టు పండువ

కొమఱ్ఱాజు వినాయకరావు

ఓకుసుమ సుకుమారికా! నీకు నేఁడు
పుట్టు పండువ, నా యెద పొంగిక్రుంగ।
ఏను నిరుపేదఁ గడుబీద నెట్లొసంగఁ
గాఁ గలను గాన్కగాఁగ నీ కామితంబు?

* * *

తళుకు పసలీను చేతినూల్వలువ దాల్చి,
ఘనత వహియించి, యెదమించి కదలువేళ
కన్ను మర్పింపఁగా నాకుఁ గలవె సిరులు?
నీ సఖులిడిరి నీ పద నీరజాళి
మ్రోల, లలిత సుందర భూషణాలు మిగుల!
తారకా రుచిలహరీ తుషార మొలుకు,
మల్లె తోమాలియల పసలెల్లఁ జిలుకు,
ధవళ శృంగార కోమల దంతహార
మిడె భవత్కంఠమున మను నీ స్మితమున
నీ సఖాళిలో నొక మంచి నేస్తగాఁడు!

* * *

ఏమొసంగ గల్గుదును? నా యెదను మీటు
కొంచు నేనె కన్నీరు కన్గొనలఁ గురిసి,
తావకాభ్యుదయ మధువు ద్రావుతమిని
వేడికొందును నీకయి విధిని, మదిఁ!;
బాడుకొందును తన్మయత్వమున లోన!

* * *

ఏమొసంగఁగా గలను? నా కేమి కొఱత?;
క్రొవ్వు పెనక్రుంగఁ, బెదవుల నవ్వుపొంగ,
నిరుపమామూల్య ప్రేమైక నిర్మలాశ్రు
లహరులం బ్రవహింపింతు నంతరాత్మ!

# గడ్డిపరకలు

## "రమణశ్రీ"

తెల్లవారింది. కళ్ళు నులుముకొంటూ ముగ్గురు బిచ్చగాళ్ళ కుర్రాళ్ళు లేచారు. అందులో ఒకడు పెద్ద. మరిద్దరూ జంట.

ఎండకీ, వానకీ, మంచుకీ తడిసి ఎండిన శరీరాలు... పగిలిన గాజుపెంకుల్లాంటి కళ్ళు... గారబట్టిన పళ్ళు... చింపిరి జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి తెగ కెలుక్కుని, ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకొన్నారు.

ఊరంతా నిద్ర ముంపునించి, ఊపిరి విడి తూలుతోంది. కడుపులో ఆకలి కలుక్కుమంటోంది. రాత్రినించి తిండి లేదు. ప్రక్కనున్న మురుగు కాలవ రోగక్రిముల్ని మోసుకుపోతూ నల్లగా కసిగా, మురికి పారుతోంది. లుకలుకలాడుతోన్న పురుగులు... ముగ్గురి కళ్ళలో మెరుస్తున్నాయి.

రోడ్డునిండా విరజిమ్మిన, ప్రోగెత్తిన చెత్త కాగితాలు, చిత్తు పరకలు, పగిలిన రంగు రంగుల గాజుపెంకులు, ఉల్లిపాయ తొక్కలు, కోడిగుడ్డు డొల్లలు... మున్సిపాలిటి తుడిచెయ్యడానికి చేతులెత్తక ముందే... వాటిమీద విరగబడ్డారు ముగ్గురూ.

కుళ్ళిన బంగాళాదుంపలు, నిలువ కూరగాయలు, రసంపిండిన నారింజ డొప్పలు... లోకం విసర్జించి పారేసినవి ఒహాటేమిటి! ఎవళ్ళకందినవి వాళ్ళు... అందుకొని కొరుక్కుంటున్నారు. పెరుక్కుంటున్నారు. చప్పరిస్తున్నారు. వాళ్ళ కందిస్తూన్న నేల తల్లి కన్నీళ్ళు ఆప్యాయంగా ప్రసరిస్తున్నాయి.

చెత్తకుండీల్లో తిని పారేసిన ఆకుల్లో ఆకలి నాక్కుంటూ, చేజారి కర్మవశాన పడిపోయిన విలువగల వేమైనా దొరకాలని కోరుకుంటూ, కోడిపిల్లల్లా చెత్త పోగుల్లో కిరాణా దుకాణాలవాళ్ళు చెరిగి పారేసిన ముక్కిపోయిన జీడిపప్పు పలుకులూ వగైరా ఏరుకుని గిరుకొంటూ కేరింతలు కొట్టుకుంటున్నారు.

సీతాఫలాలు దింపుకుంటోన్న బండి దగ్గిరచేరారు.

"చెత్తవెధవలు పొండి!" అంది బండి. ఎద్దులు తోకలతో వుండుమీద ఈగల్ని తోలినట్టు తోలాయి.

గంపల కెత్తేటప్పుడు పళ్ళనించి రాలిన గుంజు, తిని జనం ఊసి పారేసిన తొక్కల్లో గుంజు ఆప్యాయంగా పెదవులకి పాముకొంటున్నారు.

అందులో పెద్ద కుర్రాడి కళ్ళు తీక్షణంగా మెరుస్తున్నాయి! చెత్తకుండీల్లోకి చూపులు నిల్పుకొంటూ పోతున్నాయి!

జంట కుర్రాళ్ళిద్దరూ మిఠాయిదుకాణం కాచుకొన్నారు. దుకాణదారు ఏరిపారేసి, గిరాటువేసే కరకజ్జం పలుకులు, కాకులు పక్షులతో కలబడి ఏరుకొంటూ తృప్తిగా కళ్ళు మూసుకొంటున్నారు!

దారినెవరేనా ఏదైనా తింటూ కని పిస్తే, వాళ్ళవెంట పడి పొరపాటున రాలిన జారిపడిన బఠాణీగింజలూ, వేరు శనగ పప్పులూ అడుక్కుంటూ ఏరు కొంటూ పరుగెడుతున్నారు.

పుడమితల్లి ఆదరంగా చెమరుస్తూ వాళ్ళ చిరుపాదాల సవ్వడి వింటోంది. 'నా బిడ్డలు ... నా పిల్లలు ..' అంటూ దిక్కుమాలిన దిక్కులు నిట్టూరుస్తున్నాయి.

'నా సంతానం ... నా వాళ్లు ...' అంటూ ఆకాశం నల్లనివాళ్ళ శరీరాన్ని అరుణకిరణ హస్తాలతో స్పృశిస్తోంది.

ముగ్గురూ ఒక్కచోట పోగయ్యారు.

'ఇయ్యాల ఫరవాలేదురా! లేసినేళ మంచిది. అయ్యా యియ్యా దొరుకు తుందను' అన్నాడు పెద్దాడు. ఎక్క డేవున్నా పసిగడతాడు. ప్రతీ యింటి ముందూ, కొట్టుముందూ చెత్తపోగుల్లో విలువయిన వస్తువు ఎక్కడే చిక్కినా చేసి, బయటికి లాగుతాడు.

కాఫీ హోటల్ ముందు ఎవరేనా పొట్లాలు పట్టుకెళ్ళుతుంటే తన్నుకు పోయే గద్దలు గోపురంమీంచి మిర్రి మిర్రి చూస్తున్నయ్!

పారేసిన ఆకుల్లో ఉప్మాని ఇడ్లీ ముక్కలు, వదిలేసిన పచ్చడి, దోశ ముక్కలు, తినగా మిగిలిన దద్దు...వ్వా రాల మధ్య మలమల మాడే ఆకలి కేలు కుక్కుంటూ ప్రజల మూహాలు గర్వంగా చూస్తున్నారు వీళ్ళ లెక్కేమిటి మా కన్నట్టు? కడుపులో రాజుకొంటూన్న జఠరాగ్ని ఎంగిలీ, గింగిలీ కొత్తా కొచ్చు...ఏదైనా లెక్క లేకుండా భస్మం చేసి పారేస్తోంది.

ఓ యింటిముందు కుంకుడు కాయ తుక్కు వారగాపడి వయ్యారంగా పిలుస్తోంది. పెద్దవాడికళ్ళు మిరుమిట్లు గొలిపాయి. మెల్లగా సహజంగా వెదక నారంభించాడు.

జలగడుగువాళ్ళు గమేలా చీపురుతో మట్టి పోగుచేసి అల్లంత దూరంగా అందులో ఏవో దొరికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు నీళ్ళతో ధారగా కడుగుతూ. అది వాళ్ళవృత్తి.

వాళ్ళని కాదని కుంకుడు తుక్కులో ముక్కుపుడక మిలమిల మెరిసింది. పుడక అరిగిపోయివుంది. రాళ్ళు లేవు.

'బంగారం పుడక...భలే భలే! అని చంకలు గుద్దుకొన్నాడు పెద్దాడు. లేచిన వేళ!

ఒకవేళ ఇత్తడి ముక్కేమో? తన కెప్పుడూ ఇలాంటి అదృష్టం పట్టలేదు.

దూరంగా జలగడుగువాళ్ళ వెంపు కోపంగా తల తిక్కించి చూశాడు. గబగున పరుగు లంకించుకొన్నాడు సరాబు దగ్గరికి! వెంట కుర్రాళ్ళు అర్థం కాక పెద్దాడితో పరుగెత్తారు.

పుడమితల్లి కనులు చెమరుస్తూ 'నాయనా! నాయనా!' అంటూ వెంట బడింది.

గుడ్డపీలికలు మధ్యనుంచి తొంగి చూస్తోన్న వాళ్ళ బతుకు పీలికలు...

* * *

'ఇన్ని బిచ్చం తల్లీ! పిల్లలాకల్తో మలమల మాడతండారు...రెండు రోజుల్నించీ గంజి నేదు తల్లీ!'

ఇంటి ముంగిట ముగ్గులో నిలబడి అరిచింది గొంతుపొర చించుకొని... కలవారి అమ్మని, 'తల్లీ!' అని పిలుస్తూ.

ఇహాఁ పొద్దుణ్ణుంచీ, బొక్కుడు గింజలు... చంకలో బిడ్డ నకనకలాడుతూ రొమ్ముల్లో తల్లి రక్తం స్ఫురించాలని వెతుక్కుంటున్నాడు పెదవుల్తో.

శోషొచ్చి పడేలావుంది.

ఇంటివాళ్ళు చెత్తపోగుల్లో, కుంకుడు తుక్కుల్లో దేనికోసమో వెతుకుతున్నారు.

'ఏవుంది! పోయింది. ఎవడో యెత్తానో వేసుకున్నాడు. రెండు పుంజీలు రూపాయలుపెట్టి చేయిస్తేనేగాని తయారవదు. పొద్దున్నే ఏ వెధవ మొహాం చూశానోఁ గాని...' అంటున్నాడు ఇంటి పెద్దాయన.

'ఏంటి బాబూ! యెతుకుతున్నారు?' అంది బిచ్చగత్తె.

ఇంటావిడ అనుగుమానంగా చూసి, బోసి ముక్కుతో, 'అక్కడ వెదకండి, ఇక్కడ వెదకండి!' అని ఆదేశాలందిస్తోంది.

'ఏవుంది? ముక్కుపుడక! తలస్నానంచేస్తూ కుంకుడు తుక్కులో వేసినట్టు ముక్కుపుడక... అది కాస్తా వీధిలో దిమ్మరంచేసింది వీధిలో దాసీది.' అన్నాడింటాయన...తన ముక్కుమీద ఇత్తడి నత్తు దాచుకొని, బిచ్చగత్తె ఊరుకుని ముందడుగువేసింది. కొళాయిలో ఇన్ని నీళ్ళు త్రాగి, ఆరిపోతోన్న ప్రాణాలు నిలుపుకొంది.

హోటలుముందు నిలబడి, వచ్చిపోయే వాళ్ళని దేవురిస్తూ అడుక్కుంటోంది. తనకు జీవితం నేర్పిన మంత్రం ఒహాటే తెలుసు. అదే పెదవులమీద వ్యక్తావ్యక్తంగా వుచ్చరించే, 'బాబూ! నాయనా! ఓ పైసా! ఇన్నిబిచ్చెం...' అన్నదే!

కాళ్ళరిగేలా, గుదులుకట్టేలా నిలబడి నిలబడి - కూలబడింది. ఎన్ని వందల కాళ్లో తన ముందునుంచి నడచిపోతున్నాయి విదిలించుకొంటూ. మూగజీవంలా హోటలు చీడీ నంటిపెట్టుకొని, సొక్కి సోలిపడివుంది.

పొద్దు క్రుంకుతోంది.

ముగ్గురు పిల్లలూ, 'ఓలమ్మో! లమ్మో!' అనుకుంటూ పరుగెత్తుకొచ్చారు. తల్లిని చుట్టబెట్టేసుకున్నారు అంతులేని ఆనందంతో.

'ఓలమ్మో! ఇయ్యేల అయ్యాయియ్యా బాగాదొరికినియ్యి! నీముక్కుకున్న నత్తు నాటిది...కుంకుడు తుక్కునో దొరికినాది!'

తల్లి విస్తుపోయింది. తను బిచ్చానికి వెళ్ళినప్పుడు ఆ యింటి ముందు వెదుకుతోన్న దృశ్యం...కళ్ళముందు గిరగిర తిరిగింది.

'అల్లక్కడేనా?' అంది.

'ఊఁ'

'ఏండబ్బొచ్చినాది?'

'ఏటొత్తాది? ఇత్తడి ముక్క...... సెరాబుసావుకారు కాడికెల్తే, రూపాయ నేతిలో యెట్టాడు.'

'ఆఁ' అని త్రుళ్ళిపడింది. కన్నీళ్ళు సెలయేళ్ళుగా దూకాలని గుండె కొండ పైనించి తొంగిచూశాయి.

'ఇత్తడ సేయించు కెట్టుకోనాని కాళ్ళకరవా? దొంగదగా... నడు. పదిమందిలో సెరాబు నెట్టి సీవాళ్లెడతాను.' చంకలో బిడ్డ 'క్యారు' మని రోదసి నిండేలా రోదించింది. మసిపాత గుడ్డల పీలికలు బిచ్చగత్తె వంటిమీద

జీరాడుతున్నాయి. కళ్ళు జేవురించాయి అస్తమించే సూర్యబింబాలవలె. అన్యాయాన్ని వగాని ధిక్కరించింది పెదవి పుటం ...

'నడండి యెధవల్లారా! ఏడ మెమ్మ్రగో సూపియ్యాండి!' కుర్రాళ్లు ముగ్గురూ పిల్లుల్లా నడిచారు.

నిదుర లేచిన మనస్సు మాటలు పేర్చుకొంటోంది. మెదడు సాలీడులా వలల్లుతోంది. ఇంటి ఆయనకీ, తనకీ, తన బిడ్డలకీ అన్యాయం జరిగిపోయింది. ఎందుకింత పగ? ప్రపంచానికెందుకింత తనుమీద దురాశ!

'ఎదవల్లారా! బంగారందిరా! ఏదో సేతిలో పెట్టంగానే లగెత్తుకొచ్చారా? ఆ యింటిగల్లోళ్లు మీ మానానబడి గొల్లుమంటుండారు. దొరికినసోటు ఆళ్ళకే యిచ్చిలేకపోనారా?'

'మాకేటి తెలుసు? నీ ముక్కునున్న నత్తు నాంటి వనుకొని సెరాబుకాడికి లగెత్తుకెళ్లాం.'

ఔను! ఇంతోటి భాగ్యం... వాళ్ళ జన్మలో ఎరగరు. దాని విలువ తెలియదు. తెలియనివోటు దగా. అదే యిక్కడా జరిగింది. చంకలో పాప ఈ రహస్యమంతా తెలుసునన్నట్టు నవ్వింది.

సరాబు మూటాముల్లె సద్దుకొని నిష్క్రమించడానికి సిద్ధంగా వున్నాడు.

'ఈడే... ఈడే...' అన్నాడు పెద్దాడు.

ఏండి సావుకారుబాబూ! మానాంటి పేదోళ్ళ నిలా యేడిపింతారా? తెలీని కుర్రాడొచ్చిత్తే బంగారంవుడక ఇత్తాడని సెప్పి, రూపాయ సేతిలో యెడతారా? దాంతో మీ కక్కురితి తీరిపోతాదా? అంత నోకువా మాలోటోళ్ళంటే! మా దగ్గరే సెయ్యాలా బాబా! నేయం నేదండీ? దరమం పోనాదా? రెండు పుంజీల్లూ పాయిలు...'

బిచ్చగత్తె గొంతు గలగల సంకెళ్ళు విడిపోయింది. జనం బిలబిల పోగయ్యారు 'ఏవిఁటేవిఁ' టంటూ.

'ఈ పెద్దమడిసి సూడండి బాబూ! ఏంసేశాడో? నోరెరగని కుర్రోళ్ళని సేసి...'

కంఠంలో నరాలు కరకర విడిపోయాయి. కంటి చాకలు కన్నీటి కాల్వలు త్రవ్వకొంటున్నాయి.

సరాబు గొంతులో పచ్చివెలక్కాయ పడింది. ఇటుపోలేక అటురాలేక, చేసిన నేగా ఒప్పుకోలేక, దుర్వాదంచేసి గెలవలేక నోరు చింముకొంటున్నాడు. మరి బొంవలాంటి మనిషి వళ్ళంతా రొజుతూ ధర్మాన్ని, న్యాయాన్ని, సత్యాన్ని గుండెల్లో కుళ్ళబొడిచి - హత్యచేస్తూ, గొంతుక నులుముతూ బిచ్చగాళ్ళని ఎదిరించాడు.

'పొండి! పొండి! నాకేం తెలవదు. నా కేప్పుండే? ఎక్కడమ్మారో వెదుక్కోండి, యెళ్ళండి! చెత్తాకాని వెధవలు!'

వళ్లంతా చెమటతో బాడీలా తయారయింది. పోగయిన జనం రెండు పక్షాలుగా మారి తపతప చెక్కలు కొట్టుకుంటున్నారు.

'నేయం... సత్తెం... సత్తెప్రమాణం...' అని గుంపులో బిచ్చగత్తె ఘోషించింది. సరాబుమీద తిరగబడ్డారు కొంతమంది

పాతకక్షిదారులు ఇదే అదననుకొని... మొత్తానికి కూపీ లాగారు.

'కుర్రోళ్లమ్మేరు గాని, అదిప్పుడే కరిగేశాను. ఇప్పు డెక్కణ్ణుంచి తేను?'

'కుదరదు. కుదరదు. చేయించివ్వాల' గుంపులోంచి కేక గుండుమీరి కాకంలా లేచింది.

'అవిటి బలుసు బాబా! అనాథ'

'వాడబ్బ సొమ్మా! ఎంతమంది నిలా దగా చేస్తున్నాడో గోవిందా. బాగా బుద్ధి చెప్పాలి వెధవకి'

గోంకపాయ కంఠం కంచులా మ్రోగింది.

మొత్తానికి, ముక్కుపుడక బయటికి లాగారు. బిచ్చగత్తెలో కానికి మ్రొక్కింది. ఎవరైనా దొరికితేనే దొంగ!

'ఏం దేవర్లారా!? నడంపి... ఆళ్ళ ముక్కుపుడక ఆళ్ల కిచ్చేద్దాం...?' తప్పనను సరించారు ముగ్గురు కుర్రాళ్ళు.

సూరాబు 'నాకూ పోయె మాటతో'? అని మూలిగాడు. గుంపులో జనం విరగబడి నవ్వింది. సూరాబుకి సంగురంగుల తొటాకులు కట్టి ఏడిపించి వినోదించింది.

'జలమ... ఓ నయాపైసా ధరమం సెయ్యండి బాబా!'

* * *

తన్ను చూసి జనం దూరదూరంగా తొలిగిపోతున్నారు, ధర్మంచేసి పుణ్యం మూటకట్టుకోకండా. ఏనాటి పాపమో తన వంటి మీద పుళ్ళు విడుగుతోన్నాయి. చేతివేళ్ళు మొండిముక్కల్లా తయారవుతున్నాయి. గోళ్ళు రసి కారుతున్నాయి. దొరికిన పైసలు పేగులో ఓ మూలకిరావు.

పెళ్లాం, ముగ్గురు పిల్లలూ తన లానే ఊరిమీదపడి కొల్లగొట్టుకు బతుకుతున్నారు. ఎంగి ళ్ళేరుకొంటున్నారు. అంకిందంతా కుళ్ళినా కంపు గొట్టినా మింగేస్తున్నారు. తమతో పశువులు పోటీ చేస్తే వాటితో కలబడి బతుకుతున్నారు.

బాగా చీకటిపడింది. ఊరు కళ్లలో వత్తులు వెలిగించుకొంది. దీపకాంతులు కళ్లలో మెరుపు కొరడాలు విసురుతున్నాయి. ఎన్నాళ్లయినా ఈ వెలుగులో ఇలా స్నానంచేస్తే తనలో ప్రబలుతోన్న కుష్ఠు రోగం నాశనమైపోదూ?

పూల కొట్లదగ్గర కాళ్ళు ఆగాయి.

ఫుట్ పాత్ ముందు పారబోసిన పూలరేకులు, ఆకుల్లు విరిగిన పురుగుల్లా రేగుతున్నాయి. వాడిపోయిన పూలు! పూలచెత్తలో చేతులు కెలికాడు. ఇన్ని వాడీవాడని పూలు ఏరాడు ఎన్నాళ్లయిందో? తన ఆడదాని తలలో పూలుచూసి... ఎప్పుడో తన శరీరంలో మదం రేకెత్తినపుడు, ఇంత కూలీ నాలీ చేసి హాయిగా బతికేటప్పుడు, తొలి రాత్రులు వెన్నెలలో వేగేటప్పుడు... తన ఆడదాని తలలో ఇన్ని పూలు గుబాళించేవి.

పూర్వస్మృతి గిర గిర్తోంది కళ్ళలో. పక్కన పడున్న ఎంగిలాకు తీశాడు. కన్నీళ్ళు జలజలరాలాయి.

పొట్లం కట్టాడు. ఇన్ని రేకులు రాలుతోన్న పూలూ' గులాబీ రేకులు ... అడుగులు బరువుగా పడుతున్నాయి. నిద్ర గన్నేరు చెట్టుక్రింద మకాం దగ్గరకు నడిచాడు.

పెళ్ళాం పిల్లలూ...

వెన్నెల నీడలో సీవెండి డొక్కు తళతళలాడుతోంది.

'ఇదేమదే?' అన్నాడు జోలి కిందకి దింపి. పొద్దుణ్ణుంచీ తిరిగిన తిరుగుడు కాళ్ళ సత్తువ పీక్కుని బరువుగా కూలబడింది.

పెళ్ళాం, జోలి కెలికింది.

'అబ్బె!...ఏం నేవేం? సూడియ్యాల పెద్దోడికి ముక్కుపుడక దొరికినాది. సానా గొడవయినాదనే! నేయుం మనేం వుండబట్టి, మరాబుకాణ్ణుంచి మనకే సిక్కింది.'

అంతా చెప్పింది.

'తిన్నగా, యెల్లి ఆ పారేసుకున్న గుమ్మంకాడ నిలబడి, పిలిసిచ్చేసినాను. ఇంటాయన పోయిం దొరికినందుకు మా సంబరపడ్డాడునే! ఇంటావిడ యింత వొణ్ణం, పులుసూ, కూరా, పప్పూ యెట్టినాది మా తల్లి! నీలుతాగనా కీడొక్కిచ్చినాది. ఎంత మంచి మణిసో! ... భలే ఆవిడనే! కుర్రాళ్ళకి పాతగుడ్డలేటన్నా వుంటే యిత్తానన్నది. పాపం! ముక్కుబుడక పోయ్నందుకు మొగోడు సీవాట్లెట్టినోడంట ... సెప్పుకుని మాయిదయింది యిల్లాలు.'

మాటలు వింటూ నేలతల్లి ఆనంద బాష్పాలు రాల్చింది. చిక్కని, పచ్చని పచ్చికమీద గోనెగుడ్డలు పరుచుకొని ముగ్గురు కుర్రాళ్ళు సుఖంగా నిద్రపోతున్నారు. చల్లని వెన్నెల వాళ్ళ ముఖాల మీద పడగలు విప్పి ఆడుతోంది.

గిన్నెలో రుచిగలకూడు తిన్నాడు. కడుపెంతో చల్లారి హాయిగా తేరుకుంది.

వెన్నెల...

చెట్ల ఆకుల సందుల్లోంచి సూదుల్లా గుచ్చుకొంటున్నాయి కిరణాలు.

'ఇపుడెంతవుద్దో టయిం?'

'ఎంతవుతే మనకెందుకేటి? తెల్లారేదాకా కునుకేటం... ఊరిమీనప్డం... ఇయిగో సూడు! పూలట్టు కొచ్చాను! సూసి, వొదల బుద్ధవనా.'

'పువ్వులే!'

'ఆఁ ఆ పూల కుప్పమీన దొరికి దొరికి పొరలాలనిపించినాది.'

ఇన్ని రేకులూడిన పూలుతీసి, ఆడదాని జీబురు తలలో తురమడానికి ప్రయత్నించాడు.

'శా! ఏం పనది?'

అని నవ్వింది వెన్నెల్లో నవ్వుకలిపేస్తూ. కళ్ళు ఆకలితీరి మెరుస్తున్నాయి.

'నువుగనక్క ముక్కుపుడక తీసుకెళ్ళిచ్చేసినవు మరోళ్ళయితేనా...'

అని ఆగాడు. ఎంతమంచిది? దాని గుణం చిన్నప్పట్నుంచీ అంతే! తన పెళ్ళానిది ఎంత మంచి బుద్ధి!

మంటిగుడ్డు పక్క గుడ్డపీలికలు సరిజేస్తూ, ఆవులించింది పెళ్ళాం...కళ్ళమీద ఆలోచన రెక్కలు ముడిగి పడుకొంది. ఒకరికి ఒదిగి ఒదిగి ఇద్దరూ పడుకొన్నారు. నిద్రలో మునుగుతోన్న శరీరాలు...పెనవేసుకోవాలనే కోర్కె! బయాలు...సంచార శూన్యం......పులకరించిన గడ్డిపరకలు...చెట్ల మధ్యనుంచి చంద్రుడు స్ఫోటక ముఖంతో నవ్వాడు. చుక్కలు ఎర్రని వుండుల్లా గాలికి రేగి మండుతున్నాయి.

# నా జీవితం

### "అడ్సుమిల్లి"

వడగాలిలో ఒక్క సుడిగాలి
జడివానలో ఒక్క పెనుగాలి
నడిరేయి నిశిలోని నిట్టూర్పు
నా జీవితం ! ఒహో నా జీవితం !

బాటలో రక్కిన పొదలపై పాదాలు
వేటలో పులిగోటి గాటుపై రక్తాలు
నాట మొనగని కన్నె వలపులో వెచ్చసలు
నా జీవితం ! అహో నా జీవితం !

పాలపుంతలనుండి రాలితూలిన చుక్క
పాము పడగలక్రింద పవళించు చిరుకప్ప
పై కెగుర యత్నించు పసిపిట్ట చిరుకళ్ళు
నా జీవితం ! ఒహో నా జీవితం !

పొగమంచుపైనున్న పగడాల పూమాల
పాలపై మీగడలో బాల కృష్ణుని లీల
ఒక తామరాకుపై బహునీటి బిందువులు
నా జీవితం ! అహో నా జీవితం !

భేతాళ నృత్య సంరంభంపు రంపు
భూదేవి గర్భగత విషవాంఛ, లుబ్ధ
ఘూకాల శాంతి బాకాల ప్రీతి
నా జీవితం ! ఒహో నా జీవితం !

★

# గురజాడ 'కవి' కాదా?

## రమణారెడ్డి

ఒక కాలమునాటి మహాకవి మరొక కాలములో అల్పకవి కావచ్చును. కొందరి దృష్టిలో మహాకవి మరికొందరికి అల్పకవిగా కాన్పించవచ్చును. షేక్స్పియరును రెండవ ఛార్లెసు హయాములో కొందరు కించపరచినారు; డాన్ ను (John Donne) విస్మరించినారు; డ్రైడన్ (Dryden) ను తృణీకరించినారు. మరొక కాలములో వీరి ప్రతిష్ఠ యథాపూర్వముగ భాసించింది. గురజాడను కొందరు మహాకవి అంటున్నారు. కొందరు కవే కాదంటున్నారు. ఉదాహరణకు, "జయంతి" పత్రిక జనవరి సంచికలో శ్రీ పొట్లపల్లి సీతారామారావు గారు గురజాడను "అకవి"ని చేసినారు. అకవులను వర్ణిస్తూ, "ఈ రకపు రచయితలకు కవితాశక్తికంటె హంగుదారు లవసరము. ఈ కవుల దృష్టి కవితాసృష్టియందుకంటె అప్పటి లోకస్థితి కనువుగా వస్తువు నేర్చుకొనుటయందే మొగ్గ గలిగియుండును. అప్పటి లోకము మారనంతవఱకు చలామణి యగును. ఆ పరిస్థితిలోనే కొంచెము మార్పు వచ్చినను ఇది కవిత్వము కాక పోవలసివచ్చును. వీరి రచనలో ప్రధానముగా భాసించునది కవితాశక్తి కాదు. అప్పటి రాజకీయములు – సాంఘిక పరిస్థితులు – వాస్తవిక దృష్ట్యా పరిశీలించినచో వీరు కవులుగాదు – అకవులు – కవులుగా చలామణి గా ప్రయత్నించెడి కీర్తికాములు" అన్నారు. కవిని "కవితా శక్తినిబట్టియే కవిగా నంగీకరింపవలయును. గురజాడ అప్పారావు గారు కవితా దృష్ట్యా పరిశీలించిన నిలువరు......ఆంగ్ల ప్రభుత్వము వలన, ఆంగ్ల భాష వలన దేశములో నేర్పడిన కృతక సమాజముయొక్క అభిప్రాయములను కప్పుకొని కవి యనిపించుటకు ప్రయత్నించిన యొక వ్యక్తి – అంతే – అంతకంటె మించి ఆయనను గూర్చి చెప్పరాదు. ఈ కాలమున వీరిని గూర్చిన పొగడ్తలు మిన్నుముట్టుచున్నవి. గురజాడ వాల్మీకి యనియు ఆధునిక కవిత్వమునకు యుగకర్త అనియు సభా వేదికలనుండి, వివిధ పత్రికలనుండి విపరీత సిద్ధాంతములు బయలుదేరినవి."

శ్రీ పొట్లపల్లి సీతారామారావుగారి అభిప్రాయము గౌరవించవలసినదే. కాని మదభిప్రాయాలను మట్టుకు కాదు. కీర్తికాముకత, "అకవుల"కే కాక కవులకు కూడ వుంటుంది. వారు మనుష్యమాత్రులు కాబట్టి. లోకం గుర్తించడం లేదని వాపోయిన భవభూతి, ఎంతకు లోకము మెచ్చదే గదా అన్న తెలుగు కవి, కవులు కాకపోయినారా? కాబట్టి కీర్తి కాముకతలో తప్పులేదు. ఇక అకవులదృష్టి కవితా సృష్టియందుకంటె అప్పటి లోకస్థితి కనువుగా వస్తువు నేర్చుకొనుటయందుండునని అంటున్నారు. అంటే లోకస్థితికి అనువుగాని వస్తువు నేర్చుకొంటే 'కవిత' కాగలుగుతుందా? అని వీరి ప్రశ్న.

ప్రతి కృతిలోకూడ నాటి సాంఘిక పరిస్థితులు యింతో అంతో ప్రతిఫలించక తప్పదు. గురజాడ "లోకముతో నాకేటికి?" అనుకోన్నా, తన ప్రేష్యప్రేతులలో, యిష్టాయిష్టాలలో సంఘాన్ని ప్రతిబింబించకపోడు - రామాయణ భాగవత భారతాలనుంచి శ్రీమద్రామాయణ కల్పవృక్షం వరకు, శాకుంతలం మొదలు యన్. జి. వో. వరకు యిది నిజం. కనకనే చరిత్రకారులు 'లిటరరీ ఎవిడెన్స్' అనే పేరిట ఆయా కాలపు రచనలనుంచి చరిత్రను నిర్మించేందుకు కొంత సాక్ష్యం తీసుకుంటారు. ఇక లోకస్థితినే యితివృత్తంగా తీసుకొంటే 'అకవిత' అవుతుందా? అయితే "కన్యాశుల్కం" నాటకం కావ్యం కాదా? అనాగరికమూ - అవాస్తవికమూనైన యితివృత్తాలే కవిత్వానికి తగినవని సీతారామారావుగారు భావించడం లేదనుకుంటాను. ఆనాటి పరిస్థితులు నేడు లేకపోయినా పేర్లు మారినా నాటి కాలపు లోకం మారిందా లేదా? కన్యాశుల్కాన్ని సంభావించడం లేదా? అవి లోకస్థితికి అనువుగా వున్నందుచేతనే కాదు - అలాంటి వ్యక్తులు, భావాలు, అభిప్రాయాలు, సంఘర్షణలు యీనాటికీ వున్నందుచేత. ఈ మార్పులేని మానవ ప్రవృత్తిని సాంఘిక పరిస్థితుల ప్రతిబింబాల నడుమ నిలిపినందుచేత వాటికి యీనాటికీ గౌరవం వుంది.

ఆంగ్లప్రభుత్వం వలన ఆంగ్లభాష వలన దేశములో నేర్పడిన "కృత్రిమ సమాజము" యొక్క అభిప్రాయములను కప్పుకొని కవి యనిపించుటకు ప్రయత్నించారట గురజాడ! ఏది కృత్రిమ సమాజమో, ఏది సహజమో సీతారామారావుగారు సరిగా చూడలేకున్నారు. దురాచారాలను, మూఢ విశ్వాసాలను, దేవదాసీలను, బాల్యవిధవలను, తత్ఫలితమైన అవినీతిని కల్పించింది ఆంగ్లభాష, ఆంగ్ల ప్రభుత్వం కాదే? వాటి సంపర్కంవలన ఏర్పడినది "కృత్రిమ" సమాజం కాదు - శుచికరమూ, విజ్ఞానయుతమూ, కరుణాసహితమూ, సంస్కార ప్రియమూనైన నవసమాజం. ఇంగ్లీషువారి రాజకీయాలవల్ల ఏర్పడ్డ దుష్ఫలితాలు వేరు. ఆ అభిప్రాయాలు "కప్పు"కోలేదు గురజాడ- ఆయుధాల నెలానో, అలా చేబూనాడు. కప్పుకొని కవి యనిపించుటకు ప్రయత్నించలేదు. తన కవితా శక్తిని చక్రబంధాలమీద అష్టావధానాలమీద రాజవేశ్యలమీద ప్రయోగించక, నవసమాజంమీద ప్రయోగించారు. ఇంతకూ సీతారామారావుగారి దృష్టిలో పంది నందిగా కనిపిస్తుందికాబోలు!

## హంగుదారులు

"ఈకాలమున" గురజాడవారి పోకడలు మిన్నుముట్టుతున్నాయట? దేశంలోని కవుల బిరుదాలను తన కాళ్ళముందు కుప్పబోసికొన్న గిడుగుపండితుడు విమర్శకు తగడా? ఆయన కవిగా అంగీకరించలేదా గురజాడను? కృష్ణశాస్త్రిగారు "యుగయుగంబులనుండి మ్రోగెడు విశ్వగాన వియత్తరంగిణీ భంగములనుప్పొంగు నాతని గీతశీకరముల్?" అని యెవరిని గురించి యెప్పుడు వ్రాశారో తెలియదా సీతారామారావుగారికి? ఆధునిక కవిత్వయుగకర్తగా సీతారామారావుగారే యెన్నిక చేసిన శ్రీ శ్రీ గారి అభిప్రాయమెలాంటిదో యెరగరా? ఇంతెందుకు,

నవ్యసాహిత్య పరిషత్సభలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు గురజాడను గురించి యేమన్నారో చూద్దాం: కృతక భాష గురించీ, వికృతి భాషా కావ్యాలు గురించీ, రసస్ఫోరకమైన వాడుక భాషను గురించీ మాట్లాడుతూ, "ఈ భేదజ్ఞానం అంధ్రభంలో శ్రీ గురజాడ అప్పారాయోపజ్ఞకం. ఆయన దీనిని రెండు మార్గాలుగా ప్రవహింపజేశారు. ఒకటి కావ్యరచన, రెండవది వ్యవహార భాషావాదం". దేశంలో నీరస గ్రాంథికంలో కుప్పతెప్పలుగా బయలుదేరిన గ్రంథాలనుండి రసబుద్ధి సంస్కారానికై వాడుకభాష అవసరమనీ, అప్పారావుగారు "సంగీతాలను" వెలయించారనీ అన్నారు. ఇది "నూతన కావ్యమార్గం" అని చెప్పారు (భారతి: ఏప్రిల్ 1940). ఇక శ్రీ సీతారామారావుగారికి మట్టుకు గురజాడ "అకవి". గిడుగు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, శ్రీ. శ్రీ. ప్రభృతులు "సాంగుదాయులు" కాదగిన గురజాడకు కవి నామాన్ని తీసివేసిన సీతారామారావుగారు తిక్కనాది మహాకవులపట్ల "సాంగుదాయు" కాగలిగారు. వాళ్ళ ఋషులగాన్యా, ఋషులు, క్రాంతదర్శులు. లోకం అప్రత్యక్షమైనా, "కాలము కలక్రింతులు గావచ్చును" కాని వారు నిశ్చయముందురు. మరి, మహాకవి పాల్కురికి సోమన నిశ్చయున్నాడా? ఎందుకని? తిక్కనాది మహాకవులలో వలెనే యితనికిగూడ "కవితాశక్తి జీవగఱ్ఱ" కదా, ఎందుకు వన్నె తరిగినాడు? విశ్వనాథవారు యిచ్చిన పదముగ్గురు తెలుగు మహాకవుల జాబితాలో యీ సోమన లేడేమి? దీనికి సమాధానం చెబితే, తిక్కనాది మహాకవుల సన్నికరుగల యింకొక కారణం తెలుస్తుంది. వీరశైవం అణగారిన రోజునే పాల్కురికి సోముని ప్రశస్తికూడ సన్నగిల్లింది. మహాభారతం, రామాయణం హైందవజాతీయ కావ్యాలు; తాతతాతలనాటి కతలు మతముతో పెనవేసికొనిపోయాయి; కవితాశక్తితోబాటు తల్ప్రచయితలు, తిరునావాచకులు మతాన్ని సాహిత్యరంగంలో నిలిపారు. కనుకనే మహాభారతముతోబాటు యీ కవులు గూడా మన్నారు. ఆనాడు రాజరాజనరేంద్రుడు వీరశైవుడుగా మారివుంటే, నన్నయాదికవుల నామరూపాలనుగూడ సీతారామారావుగారు గుర్తించివుండేవారుకారు.

## గురజాడ యుగకర్త కాదట

"ఈ మనగా వాల్మీకితో పోల్చక తీసుకొనివచ్చునట్టి చాల ముచ్చటాడాము," అంటున్నారు, శ్రీ సీతారామారావుగారు. అలంకారము, మలుకుబడి, శబ్దనాల్పము, భావముల యొక్కతమేల — వీనియన్నింటికి వాల్మీకి మార్గదర్శకుడు కాగా, "రసనాద్యైశల్యమునకు, అస్ఫుటమైన భావవ్యక్తీకరణమునకు సంప్రదాయ్యకర్త" గురజాడ. సాహిత్యము "వెనుకకు" త్రొక్కుటకు ప్రయత్నించాడు. "ఆధునిక కవిత్వమునకు పునాదులు అప్పారావుగారి రచనలలో లేవు" అని అంటున్నారు.

శూన్యంనుండి వాల్మీకి కవిత్వాన్ని సృష్టించినాడని ఎవరైనా భావిస్తే, వారికి గాఢమైన విశ్వాసము గురి వుండాలి. వాల్మీకి అనే పేరుగల కవి యెవడైనా వుండినాడో కూడ నిర్ధరించలేని దురవస్థ మనది. కలకత్తా విశ్వవిద్యాలయపు ఉపా

చార్యులుగా వుండిన డాక్టర్ సిద్ధాంతా గారి "The Heroic Age of India" వంటి పరిశోధనాత్మక వుద్గ్రంథాలలో కూడ, రామాయణ మహాభారతాలు గ్రంథస్థం కాకమునుపు, వీరకథలుగా ఆస్థానాలలో కవి గాయకుల నోట తిరిగేవని చెప్పారు. రామాయణ కర్త ఎవరేగాని, ఒకరేగాని పలువురేగాని, వాల్మీకిని కవికులపతిగా ఎందుకు ఎంచుతున్నామంటే ఒక మహా కావ్యరచయిత అయినందుచేత. కాని వాల్మీకి త్రోవను పోయినవారు సంస్కృత మహా కవులలో ఎందరున్నారు? ఎవరి త్రోవ వారిది. ఎవరి ప్రత్యేకత వారిది. కాగా, గురజాడను వాల్మీకిగా యెందుకు భావించడం జరిగింది? సాహిత్య పరమ ప్రయోజనం క్షీణించి, నీరస కావ్యాలు ప్రబలి, కవితాకన్య లక్షణాల చెరలో సతమతమై, కావ్య నాడులు మొద్దుబారి, రక్త ప్రసరణ మందగించిన అంధ యుగాలనుండి ఆధునిక యుగావసరాలను గమనించి, క్రాంత దర్శియై, వర్తమాన నాగరికతకు అనువైన ఖండ కావ్యాన్ని, కథానికను, సాంఘిక నాటికను ఓంప్రథమంగా శిల్పం సంవిధానం సౌందర్యం లేశమైనా తగ్గకుండా, కఠినంగాకుండా, సుబోధకంగా, ప్రవక్తవలె అందించినందుచేత ఆయన యీ యుగానికి వాల్మీకి. ఆయన వాడిన అలంకారాలు కవిత్వాన్ని యిరుకునబెట్టే యినుప గొలుసులు కావు. కథకు అడ్డుతగిలి, అలంకారాలను గుది గూర్చడం యీనాటి సాహిత్య శిల్పందృష్ట్యా గొప్పపనిగాదు. ఇక రచనా శిల్పమంటారా, ఆయన వాడుక మాటల వాడితనాన్ని, సరళ శైలీ ప్రసన్నతాన్ని, చిట్టి పొట్టి పలుకులలో వుట్టిపడే శృంగార, హాస్య, కరుణా రసాలను వెలయించాడు. మరి అస్పష్టత మాటేమిటి? అది గురజాడ వారిలోనే కాదు మహా మహా కవులలోనే కనిపించే గుణం. కొందరు యిటీవలివారు అస్పష్టతనే పూజించి వ్రాస్తున్నారు. కాని అప్పారావుగారిలో అస్పష్టత విమర్శించే వారికేగాని, చదివేవారికి, వినేవారికి తెలియదు.

శ్రీ సీతారామారావుగారు "ముత్యాల సరాలు" గురించి వ్రాస్తూ, మొదట "లోకమందని మంచిచెడుగులు లోక మెఱుగును రా" అనే గీతాన్ని చూపి. దాని సారాంశం వ్రాసి, రచయితయొక్క "అశక్తతను" చెప్పారు. ఏదో ఒక నీతిని చెప్పేందుకు గురజాడ యీ గీతం వ్రాసినట్లు ఆలోచించారు. ఇది వీరికి ఎట్లా తెలిసిందో మనకు తెలియదు. ఈ పాటలో నాయకుడు సంస్కార ప్రియుడు; వుత్సాహి; పదినాళ్ళ పట్నాన సంఘ సంస్కరణ ప్రవీణుల సంగతిని మెలగి ఒకనాటి వేకువన యిల్లుచేరి, భార్యను నిద్రలేపి, చమత్కార గర్భితంగా మింట ధూమకేతు వున్నది, కాముబాణము వలె నున్నది, అని సరసాలు పల్కగా, నాయిక ఓరమోమిడింది. నాయకుడికి భార్యవద్ద తన విజ్ఞానాన్ని మూఢవిశ్వాస వైముఖ్యాన్ని చూపే అవకాశం దొరికింది. ఒకటికి పదిమాటలతో మూఢ విశ్వాసాలను ఖండించి, తన అభిప్రాయాలే భార్యకుకూడ పట్టుబడవలెనని అతని వుబలాటం. కాబట్టి యీ ధూమ కేతువు గురించి చెబుతూ, "యిది అరిష్ట దాయకమైన కేతువని నీ ముఖచంద్రుడు

"అలిగినట్లుంది" అంటాడు. అదృష్టవశాత్తు తనకు లభించిన అవకాశాన్ని జారవిడుచుకొని రతికలాపానికి ఎగబడకుండా, సంస్కరణోత్సాహి కాబట్టి ఒక వుపన్యాసం దంచుతాడు. ప్రతిదీ వ్యక్తం చేయనక్కరలేకుండానే, కామబాణానికి గురానుకేతువుకు అభేదం సూచిస్తూ వుత్ప్రేక్షించాడు కవి. ఈ విశ్వాసాలన్నీ సడలి, మేటివారల మాటలనే మంత్రాల మహిమవల్ల జ్ఞానసంపన్నమై లోకంమారి, మతాలు మౌఢ్యాలు వైదొలగి, అంతరాలు అంతరించి, లోకమెల్ల ఒక్కయిల్లౌతుందని నాయకుడంటాడు. ఇది అతని నమ్మకమును, వుత్సుకతను తెలియజేస్తుంది. ఆ నాయకుడి మనస్తత్వమలాంటిది. అది ఒక ధోరణియొక్క పాత్రీకరణమేగాని రచయిత వుబలాటం అందులో కనిపించదు. "నాయిక అడుగనూలేదు పెట్టనూలేదు. అనవసరముగ ఈ నాయకుని దీర్ఘోపన్యాస మేమిటి?" నాయిక అడుగనక్కరలేదు - ఆమె భావాలు అతనికి తెలుసు - కనుకనే యీ ఉపన్యాసం అవసరమైంది. ఏది చెడుగో, ఏది బాగో తెలియనివారినందరినీ చేర్చి లోకమన్నాడు కవి. తనకు అది తెలుసును గనుక నాయకుడు లోకములో చేరడు. ఈ లోకాన్ని మార్చడం తన ధ్యేయం కాబట్టి, సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగా వుత్ప్రేక్షించాడు. కాబట్టి యిందులో రచయిత "అశక్తతత" కంటె సీతారామారావుగారు అర్థం చేసికోవడంలోని "అశక్తత" బోధపడుతుంది.

## ఆంగ్ల ప్రభుత్వము - అప్పారావుగారు

"ఈ రచయిత ఆంగ్ల ప్రభుత్వము మన దేశములో బాగుగ నధికారము చలాయించుచున్న కాలములో నున్నాడు. పరతంత్ర భావములేగాని స్వతంత్ర భావములు - జాతీయ సంప్రదాయములు - ఈయనలో నంతగా కనిపించవు. కొన్ని యెడల సంప్రదాయములను వెక్కిరించుట కూడ కలదు."

ఇది నిజంగా హాస్యాస్పదమైన ఆరోపణ. ఆంగిలేయులు కొన్ని సంస్కరణలను ప్రోత్సహించినందున వారొక విధంగా మంచివారే అని భావించిన వారు అప్పారావుగారొక్కరే కారు. వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం, కొక్కొండ వెంకటరత్నం మొదలైనవారు. జాతీయోద్యమం విస్తరించని రోజుల్లో అలాంటి అభిప్రాయాలు క్షంతవ్యాలు. అంతమాత్రాన అప్పారావుగారికి పరతంత్ర భావాలే వుండవలెనా? మూఢ విశ్వాసాల పట్టు సడలడానికి ఆంగ్లవిద్య (శాస్త్రజ్ఞానం) వుపకరించింది కాబట్టి వారి విద్యలను మెచ్చడంలో తప్పులేదు. పురాణగాథలు - అంటే యమలోకము, నరకము, కర్మము, ప్రారబ్ధము, శకునము-వంటివి "వెఱ్ఱి"వి కాకపోవేమిటి? ఇదే జాతీయసంప్రదాయమా? మౌఢ్యం మౌర్ఖ్యం జాతీయ సంప్రదాయాలైతే వాటికో దణ్ణం! చార్వాకుడు, బుద్ధుడు, నాగార్జునుడు - వీరి బోధలు జాతీయ సంప్రదాయంలో చేరవేమిటి? సంప్రదాయం ద్వివిధం; ద్వైధావిభజితం - పాలకవర్గాల ప్రయోజనా

లను రక్షించే దొకటి, జ్ఞానదీపికను చేబూని జీర్ణకుడ్యాలను అజ్ఞాన తిమిరాలను వెలిగించే దొకటి – ఈ సంప్రదాయాన్నే ఈ దేశంలో మహా సంస్కర్తలు పుంజీభవించారు.

## జానపద సాహిత్యం

"ఎల్ల రామదాసు మహాకవి యనిపించు కొన్నప్పుడు గురజాడ అప్పారావుగారు కవి గావచ్చునేమో!" అంటున్నారు. శ్రీ సీతారామారావుగారు వారి విసురు ఎల్ల రామదాసుమీద కాదు. ఈ దేశంలో శతాబ్దాలనుండి రహస్య జీవనం సాగిస్తున్న జానపద సాహిత్యానికి తగిన మన్నన రాలేదు. కారణం, ఆ సాహిత్య కర్తలకు విద్యాగంధంఎక్కువగా లేనందు చేతనో, తక్కువ కులాలవారైనందు చేతనో, సంస్కృతపండితులు కానందు చేతనో. కాని అప్పారావుగారు ఎల్ల రామదాసుకు రాని కీర్తిని సంపాదించు కొంటే, అది రామదాసు దౌర్భాగ్యం అనుకోనేందుకంటె, ఈ దేశపు భాగ్యం అనుకోవాలి. జానపద సాహిత్య రీతిని చేబూని సరళ శైలితో వ్రాసినందుచేత అప్పారావుగారిని అనామధేయ కవుల గుంపులోకి నెట్టేకంటె, అతన్ని గౌరవించడం జరుగుతున్నది. ఎందుకని? ఆ రీతులకు సాహిత్య గౌరవం యిచ్చాడు కాబట్టి. జానపద సాహిత్య సరస్వతిని వుద్ధరించి సాంస్కృతిక సాహిత్య సరస్వతి సరసన నిలిపాడు కాబట్టి. ఇదే శ్రీ సీతారామరావువారి బోంట్లకు కంటు.

## భావన - రచన

"అకవియైనవానిలో వస్తువు భావనాస్పర్శ లేకుండనే యున్నది యున్నపాళముగా రచనయగుటకు ప్రయత్నించును." దీని భావమేమిటి? 'భావన' అంటే సీతారామరావుగారి దృష్టిలో అభ్యూహకత్వము (Imagination) అనుకొంటాను. ఇది అప్పారావుగారిలో లేనట్టు. "పట్నమున పదినాళ్ళు లుంటిని కార్యవశమునబోయి" ఒక ఉదాహరణగా చూపినారు. ఏ మహాకవి కావ్యములోనైనా యిట్టివి వుండకపోవు. ఇక భావన అప్పారావుగారిలో లేదా? "ఉండి, ఉడిగియు, అకులాడక, కొసకెనో యనగా వీచెను" – దీని నేమంటారు? "ప్రేమ పెన్నిధిగాని, యింటను నెప్పరీకళ, ఒజ్జలెవ్వరు లేరు"లో భావనలేదా? అంటే జిలుగు మెరుగులు క్రిక్కిరిసి, నెమలి పురివిప్పి, వన్నెలు వెలుగులు తోటలు వూటలు – అలౌకికమైన వస్తువులను రచనలో కుదిస్తేనే భావనవౌతుందా? 'డెలికేట్ టచ్' అనేది భావనకాదా?

శ్రీ సీతారామరావుగారు గురజాడలో ఎత్తిచూపిన లోపాలు ఎన్నో వున్నాయి. వాటికన్నిటికీ సమాధానమిచ్చి లాభం లేదు – ఇంతకూ అప్పారావుగారిని గురించి ఆయనకు చిన్నచూపు ఏర్పడింది. సానుభూతితో చదివితే, యీ అవగాహన కలగకుండా వుండేది. కవి – అకవి సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించి, అప్పారావుగారిని అకవిగా నిర్ధరించినందుచేత అప్పారావుగారి ప్రతిష్ఠకు వన్నెతగ్గబోదు. సీతారామరావుగారి దృక్కోణమే భిన్నమైనది. పాండిత్య భారంతో వంగి, ఎత్తైనవాటిని తలయెత్తి చూడలేని శోచనీయమైన స్థితిలోవున్న విమర్శకులను ఏమనీ లాభంలేదు. ఇది యిటీవల బయ

ల్వడలుతున్న ఒక వెనుక మాపులో అంతర్భాగమే కాని వేరు కాదు.

**గురజాడ** అప్పారావుగారి ఒరవడి కొత్తకాదు రచయితలకు బడి. వారిలో లోపాలుండవచ్చును. కాని వారిలోని మేలిమి మనము స్వీకరింపవలసినది. విశ్వాసయుగాంతాన విజ్ఞానయుగ వైతాళికుడై, నేటి తెలుగును, నును నాణ్యాన్ని, మెచ్చిన హాస్యాన్ని, దేశాభిమానాన్ని, ప్రజా శ్రేయోకాంక్షను సాహిత్యాన ప్రతిష్ఠించిన మహాకవి గురజాడను గురించి శ్రీ. శ్రీ. వ్రాసిన పంక్తులతో ముగిస్తాను.

"అడుగుజాడ గురజాడది
అది భావికి బాట,
మనలో వైతాళికత్వం
మురిపించే పాట!"



విజయవంతముగా నడచుచున్న

కె. యస్. ఫిలిమ్స్‌వారి హాస్య చిత్రం

# చల్ తీకా - నామ్ - గాడీ

మధుబాల - అశోక్‌కుమార్ - అనూప్‌కుమార్
కిశోర్‌కుమార్ - కె. యస్. సింగ్

డైరెక్షన్ : సత్యేన్ బోస్ ★ మ్యూజిక్ : బర్మన్



విజయవాడ - రాజకుమారిటాకీస్
విశాఖపట్నం - పూర్ణా

— భారత్ పిక్చర్స్‌వారి రిలీజ్.


నేడే చూడండి
జయా వారి
అప్పుచేసి పప్పుకూడు
డైరెక్షన్ ప్రసాద్ +++ నిర్మాతలు.... నాగిరెడ్డి & చక్రపాణి...

విశాలాంధ్ర అంతటా విజయవంతముగా నడచుచున్నది




నాగేశ్వరరావు, సావిత్రి, రాజసులోచన, యస్. వి. రంగారావు,
రేలంగి, రమణారెడ్డి, సూర్యకాంతం, రమణమూర్తి.

—నవయుగ.

EDITED, PRINTED AND PUBLISHED BY TUMMALA VENKATARAMAYYA AND PRINTED
ART PRINTERS, VIJAYAWADA.



1959 మార్చి

# అభ్యుదయ

సాహిత్య మాసపత్రిక

1959 - ఫిబ్రవరి. మార్చి

★

సంపాదకవర్గం:

శ్రీరంగం శ్రీనివాసరావు, కొడవటిగంటి కుటుంబరావు,
అనిసెట్టి సుబ్బారావు, తుమ్మల వెంకటరామయ్య, కె. వి. రమణారెడ్డి.

★

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం
విజయవాడ - 2.

అర్ధరూపాయి.

**Extracts From The Proceedings of The Director of Public Libraries, Andhra Pradesh – Hyderabad.**

*R. C. No.* 1533 M 4/57. *Dated* 27-1-'58.

The following Monthly magazine is commended for use in all the Public Libraries in the State.

Name : "Abhyudaya"......................

★

83/58 స్థానిక పరిపాలన ఇనస్పెక్టర్ జనరల్ కార్యాలయం

యల్. డిస్. నెం. 92369/58 — తేదీ 25 అక్టోబరు 1958

"అభ్యుదయ" తెలుగు మాసపత్రిక పంచాయితీ గ్రంథాలయములలో ఉపయోగించుటకు సిఫారసు.

ఉత్తర్వు :

ఆంధ్రప్రదేశ్ లోని పంచాయితీలకు ఇందుమూలంగా తెలియపరచునదేమనగా అవి తలచినట్లయిన "అభ్యుదయ" తెలుగు మాసపత్రికకు చందా కట్టవచ్చును...

★

ముఖచిత్రం :

పిచ్చికగూళ్లు : కళ్యాణ్ ప్రసాదశర్మ

★

## ఈ సంచికలో

శ్రీశ్రీ. వేదుల సత్యనారాయణ. "ఉదయభాను". రాజేంద్ర, కె. వి. రమణారెడ్డి, "ప్రేమేంద్ర". సంజీవదేవ్, బాధర్, కొడవటిగంటి. వక్రపర్తి రంగస్వామి. ద్వారం భావనారాయణరావు. సోమసుందర్. ఆర్. రామచంద్రారెడ్డి.

# అభ్యుదయ

సంపుటి 5 | 1959 - ఫిబ్రవరి - మార్చి [ సంచిక 2-3

## అనర్హులెవరు?

అఖిలభారత సాహిత్య ఎకాడమీ 1956_57 లో వివిధభాషలలో వెలువడిన గ్రంథాలలో కొన్నిటిని ఉత్తమంగా పరిగణించి, ఆయా గ్రంథకర్తలకు బహుమతులు ఇచ్చింది. ప్రధాని నెహ్రూ బహుమతీ ప్రదానోత్సవం జరిపారు. కాని ఆ బహుమతి కర్హులైన వారిలో తెలుగువారు కనబడరు! ఇది మనకు వింతగా కనబడవచ్చు. సాహిత్య ఎకాడమీ బహుమతి ఇచ్చిన వివిధ శాఖలలో దేనిలోనూ బహుమతి కర్హమైన గ్రంథాన్ని వ్రాయగల సామర్థ్యం లేదా ఆంధ్రులకు? అంత గొడ్డుపోయిందా మన సాహిత్యరంగం? సాహిత్య ఎకాడమీ ప్రతి యేటా తెలుగులో ఉత్తమ గ్రంథాలంటూ చేసే నిర్ణయాలను ఇదివరలో చూచినవారికి ఇలాంటి సందేహాలు రానవసరం లేదు. నిజానికి సాహిత్య ఎకాడమీ బహుమతి నిర్ణయానికి అవలంబించే విధానమే శాస్త్రీయ పద్ధతి కాదు. సాహిత్య అకాడమీ ఎవరో పది – ఇరవైమంది పెద్దలను ఎన్నుకొంటుంది. వారిని ఉత్తమ గ్రంథాలను నిర్ణయించవలసిందిగా కోరుతుంది. కాని ఆ పెద్దలలో ఎంతమందికి ఆధునిక గ్రంథాలతో పరిచయముంటుంది? కొన్ని పత్రికల పేర్లైనా, ప్రచురణాలయాలు ముఖ్యమైనా వారెరుగరంటే ఆశ్చర్యంలేదు. పైగా ఈ పదుగురో – ఇరవైమందో తమ తమ కిష్టమైన గ్రంథాల పేర్లు వ్రాసి పంపుతారట. అందరూ తమ అభిమానులైనవారి ఒక గ్రంథాన్నే 'రికమెండ్' చేస్తే, ఏ ఒక్క గ్రంథానికీ ఇద్దరైనా 'రికమెండ్' చేయని కారణంగా, బహుమతి అర్హతను తెలుగువారు పోగొట్టుకొన్నారట. ఇంతకంటె లజ్జాకరమైన విషయం లేదు. ఈ "ఉచిత సలహాదారులు" ఒకచోట ఎందుకు సమావేశం కాకూడదు? అందరూ చర్చించి ఎందుకు నిర్ణయించకూడదు.

మనం కేవలం కేంద్ర సాహిత్య ఎకాడమీనే నిందించి పనిలేదు. ఇందుకు బాధ్యత తమ అభిమాన దురభిమానాలతో తెలుగు భాషామతల్లికే అపచారంచేస్తున్న "సలహాదారుల" దీ కూడాను. ఎకాడమీ బహుమతినందకున్నంత మాత్రాన ప్రతిభావంతమైన ఆయా రచనలకు, రచయితలకు వచ్చిననష్టం లేదు. సాహితీప్రియుల ఆదరణను వారెప్పుడూ చూరగొంటారు. పోతే బహుమతీనిర్ణేతలుగా "సలహాదారులు"గా ఉన్న పెద్దలే నిజానికి ఆ పదవులకనర్హులు. సజీవ సాహితీ ప్రవంతి నిర్మలోదకాలను సైతం త్రావి జీర్ణించుకోలేని అజీర్ణవ్యాధిగ్రస్తులే ఈ పదవులకు అనర్హులు.

## వచ్చే సంచికలో

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

శ్రీ శ్రీ కవిత్వంలో

మానవప్రేమ : కారుణ్యదృష్టి

శ్రీ శ్రీ : వేమన.

శ్రీ చిరంజీవి : నాటిక

ఇంకా అనిసెట్టి, రమణారెడ్డి, కొడవటిగంటి మొదలైనవారి రచనలు.

# స్వీకారం

## తేజశ్చక్రము

రచన : సుప్రసన్న.

వెల : రూపాయి

డిస్ట్రిబ్యూటర్స్ : ఆంధ్ర బుక్ హౌస్. సుల్తాన్ బజారు, హైదరాబాదు.

* * *

## చుక్కాని (వార పత్రిక)

ప్రచురణ : ప్రతి శనివారం.

చిరునామా : మేనేజరు, చుక్కాని, మచిలీపట్నం.

సంవత్సర చందా : రు. 9/-

విడి ప్రతి వెల : 20 న. పై.

* * *

## దీపిక (1958 - 59)

నవమ ఆంధ్రాభ్యుదయోత్సవముల అభినందన సంచిక.

హైదరాబాద్ అఖిల కళాశాలల ఆంధ్ర విద్యార్థి సమితిసంఘ ప్రచురణ,

వెల : 50 న. పై.

* * *

## నాట్యకళ

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక కళోత్సవ సంచిక 1959

సంపాదకులు : శ్రీ శ్రీనివాసచక్రవర్తి

వెల : రూపాయి

ప్రతులకు : నాట్యకళ - విజయవాడ-2.

# 'నా ఉద్యమం' జయిస్తుంది

## 'మన సాహితి'తో మహాకవి శ్రీశ్రీ ఇష్టాగోష్ఠి

**1959** జనవరి **12**వ తేదీనాడు మహాకవి శ్రీశ్రీ హైద్రాబాద్ నగరానికి విచ్చేసినారు. నాటి సాయంత్రం 'మన సాహితి' సభ్యుల ఇష్టాగోష్ఠి సమావేశం హిమాయత్ నగర్‌లోని దేవంప్ర భవన్‌లో ఏర్పాటు చేయబడినది. సమావేశములో శ్రీ తాపీ ధర్మారావు, శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ గోపాల చక్రవర్తి, శ్రీ మహీధర్ ప్రభృతులు పాల్గొన్నారు.

దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో మహాకవి అనేక విషయాలపైన 'మన సాహితి' సభ్యుల సందేహాలకు సమాధానాలు యిచ్చారు.

ప్రశ్న : తెలుగుభాష కాకుండా ఇంకే భాషల్లో మీరు సాహిత్య వ్యాసంగం చేశారు? చేస్తున్నారు?

సమాధానం : నాకు రెండు భాషలు వొచ్చు. ఇంగ్లీషు, తెలుగు. ఈ రెండింటిలోనూ నేను వ్యాసంగం జరిపినాను; జరుపుతున్నాను.

ప్రశ్న : మార్క్సిజం మిమ్మల్ని ఎప్పుడు ఏ విధంగా ప్రభావితం చేసింది?

సమాధానం : నేను మార్క్స్ వ్రాసిన 'కాపిటల్' చదవనేలేదు. మార్క్సిజాన్ని గూర్చి ప్రత్యేకంగా అధ్యయనం అంటూ చేయనేలేదు. ఎప్పుడు వీలుంటే,



'మన సాహితి' గోష్ఠిలో శ్రీ తాపీ ధర్మారావు, శ్రీశ్రీ

ఎప్పుడు దొరికితే అప్పుడు మార్క్సిజాన్ని గూర్చి చదివాను.

ప్రశ్న : తెలుగు సాహిత్యంలో స్తబ్ధత వ్యాపించిందన్న వాదంతో మీరు ఏకీభవిస్తారా ?

సమాధానం : ఖచ్చితంగా. మనకు స్వాతంత్ర్యం వచ్చినతర్వాత ఒక నిర్దిష్టమైన అలసత్వం, అజ్ఞానమూ ఇంతకు ముందున్న జాతీయాభిమానం స్థానాన్ని ఆక్రమించాయి. మన పాతదే గొప్పదనీ, పాశ్చాత్య సంస్కృతి నిందకు అందరూ పూనుకొంటున్నారు. మన లోపాలను సరిదిద్దుకోవాలనే వుద్దేశమే లేదు. అటువంటి వుద్దేశం రాకమానదు. వస్తుంది.

ప్రశ్న : మన తెలుగు సాహిత్యంలో నవల, కథానిక రచనల గురించి వాని వికాసం గురించి మీ అభిప్రాయాలు తెలుపండి.

సమాధానం : తెలుగు సాహిత్యంలో నవలా రచన గొప్పగా అభివృద్ధి చెందలేదన్నది అక్షరాల సత్యం. పాయింట్లో కాన్సెంట్రేషన్ (కేంద్రీకరణ) వున్నట్టే నవలలో ఎలాబొరేషన్ (విశదీకరణ) వుండాలి. నవల వ్యాప్తి[illegible]. ఇక కథా రచన గూర్చి తెలుగు సాహిత్యంలో ఉత్తమ కృషి సాగింది.

ప్రశ్న : 'ఇవి ఉద్యమాల రోజులు కావు. ఉద్యమోత్కంఠితమైన కావ్యాలకు నేడు విలువలేదు......వంటి కవుల ఆవేశపు పొలికేకలకు నేడు స్థానంలేదు.' అనే వారికి మీ సమాధానం ?

సమా : ఇంతకుముందు కవిసమ్మేళనములో (సాహిత్య అకాడమీ వార్షికోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయబడిన కవిసమ్మేళనములో పాల్గొన్న అనంతరం ఈ గోష్ఠి జరిగింది) గోపాలరెడ్డిగారు 'శ్రీశ్రీ ఒక్క కవిమాత్రమే కాదు. ఒక వుద్యమం' అన్నారు. ఆయన ఏ వుద్దేశంతో అన్నారో నాకు తెలీదు కాని 'నా వుద్యమం' అయిస్తుంది.

తర్వాత ఇక పొలికేకలు స్లోగన్స్ అన్న అర్థంలో వుపయోగించబడిందనుకుంటాను. లక్షలమంది హృదయాలలోని భావన పి. వి. మా. కట్టటం సామాన్యమైన పని కాదు.

ప్రశ్న : ప్రస్తుతం మీ రచనా వ్యాసంగం ఏమిటి ?

సమా : నేను తెలుగు సాహిత్యంలో ఒక క్రొత్త పథాన్ని అనుసరించాను. దాన్ని అభివృద్ధి చేసే బాధ్యత యువకులది. ఇంకా ప్రయోగాల అవసరం లేదని ఆరుద్ర 'త్వమేవాహం' చదివాక అన్నది ఇందుకే.

ప్రశ్న : పరోక్షంగా అనుకుంటున్నాము. అనేకమైన మీ రచనల గురించి మేము అక్కడ ఇక్కడ విన్న కబుర్లతో సంతృప్తిపడటం, ఎవరైనా ఒక పుస్తకం తెప్పిస్తే వాటిని సంపాదించుకోగలిగే హక్కు మాకు లేదా! చెప్పండి - మీ రచనా వ్యాసంగం విషయం ?

సమా : 'ఖడ్గసృష్టి' ప్రచురించబడనున్నది. 'సామ్యవాద మహాభారతం' ఫిలిం స్క్రిప్ట్‌లాంటి నవలను వ్రాసే ప్రయత్నంలో వున్నాను. 'సహస్రాంశమయి' పూర్తిచేస్తాను.

ప్రశ్న : గురజాడ కవి గాడనీ, నాటకకర్త కాడనీ అనే విమర్శలపై మీ అభిప్రాయం ?



గోష్ఠి సందర్భంలో జరిగిన విందులో విచ్చేసిన యువకవులు

రాజు: ఆనాటి కాలంలో తిక్కనా, మధ్యకాలంలో వేమన, ఆధునిక యుగంలో గురజాడ వారు తెలుగు సాహిత్యంలో మహాకవులు. అప్పారావుగారు వ్రాసిన కన్యాశుల్కం వంటి నాటకం తెలుగు సాహిత్యంలో ఇంతవరకు లేదు. నా దృష్టిలో భారత దేశంలోనే వేయి సంవత్సరాల నుండి రెండే రెండు ఉత్తమ నాటికలు వచ్చాయి. ఒకటి 'మృచ్ఛకటికం'. రెండు 'కన్యాశుల్కము'. 'మృచ్ఛకటికం' నాటకం కాకుంటే కన్యాశుల్కం నాటకం కాదు.

ఇక వేమన కవి అని మాత్రం పండితులెవరు అంగీకరించారు! 'ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు' అన్న పద్యమూ కవిత్వమేనా అని హేళన చేసిన వాళ్ళెందరు లేరు గనుక! సమాజంలోని మనుష్యులను, ఎక్కడి కక్కడ, ఎప్పటి కప్పుడు తీవ్రంగా, నిశితంగా, మొహమాటం లేకుండా, చిత్రించి, ఖండించి ప్రజలముందు ప్రదర్శించాడు వేమన. పై పద్యమే ఉదాహరణకు తీసికొండి

'ఉప్పు కప్పురంబు నొక్క
పోలికనుండు'

ఇక్కడ ఆ రెంటి భౌతిక ధర్మం ఒక్కటే అని చెప్తాడు. (1)

"చూడ చూడ రుచులు జాడ వేరు"

ఇక్కడ ఆ రెంటి రసాయనిక ధర్మం వేరని చెప్తాడు. (2)

అట్లే

"పురుషులందు పుణ్య పురుషులు వేరయా"

మనుష్యులంతా ఒకేవిధంగా వున్నా వాళ్ళల్లో మంచివాళ్ళు వేరని సిద్ధాంతీకరించుతాడు. (3)

(1) మొదటిదాన్ని థీసిస్‌గా తీసుకుంటే రెండవది యాంటీ థీసిస్. మొదటి రెండు పాదాలకు సంఘర్షణ కల్గించుతాడు వెంటనే మూడవ పాదంలో ఈ రెంటినీ కలుపగా వచ్చిన ఫలితాన్ని సింథెసిస్‌గా సాధిస్తాడు. ఇది చాలా గొప్ప శిల్పం. ఇటువంటి సమాలోచనలు చేయకుండా ఊహల్లో కవిత్వం ఏముందని వేమనను విమర్శించారు. అదే విధంగా మహాకవి గురజాడనూ – ఒకవేళ వేమన కవి కాకపోతే గురజాడ కాదు. ఇది చెరగని సత్యం.

"జాతికి పట్టిన బూజును దులిపి, ఆరోగ్యకరమైన వాతావరణంలోకి, ఆనందకరమైన సమాజంలోకి, ప్రగతిపథంలోకి జనతను నిద్దురలేపి నడిపిన మహాకవి యొక్క రచనలు ఆయన కాలంలోనే సంపూర్ణంగా ముద్రణానికి దొరకలేదంటే, ఆ దురదృష్టానికి ఎవరని నిందించాలి! జాతి సిగ్గుపడాలి: గ్రంథరూపంలో వచ్చినవి తప్పితే ఆయన అమూల్యమైన రచనలు అనేకం చదవటానికి కాదు, చూడటానికి కూడ మనకు దొరకటం లేదు. అనేకమైన పూరచర్ని గురించి మేము అక్కడా ఇక్కడా విన్న కబుర్లతో, ఉద్రేకపడటం, ఊపిరి బిగపట్టడం తప్పితే వాటిని సంక్షేపించుకునే హక్కు మాకు లేదా? మీరైనా సర్వహక్కులూ మాకి – ముద్రణానికి – అనడానికి సాహసిస్తే మీ నుండి ఇంకా అనేక సాహిత్యనిధులను మేము డిమాండ్ చేస్తే– చేస్తున్నాం – మా మనవిని తిరస్కరించగూడదు. ఇది మా హృదయపూర్వకమైన అభ్యర్థన. కాదు – తెలుగు దేశంలోని నేలాది కంఠాల ఆందోళన, ఆవేదనా నిత్యమైన నినాదము. మీ కలం నుండి మాకు రచనల నందివ్వండి. మీ అపూర్వ శక్తులు సద్వినియోగం కావాలి. మా అభ్యర్థనను తిరస్కరించరని గాఢంగా విశ్వసిస్తున్నాము" అని 'యువ సాహితి' సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తర్వాత కృతజ్ఞతలతో సమావేశం ముగిసింది.



# శ్రీనాథుని కావ్యరసధుని

పదిహేనవ శతాబ్ది మొదలుకొని ప్రబంధ యుగము ప్రారంభమయ్యేవరకు యుగకవిగా నిల్చి కవిసార్వభౌముడనే తన బిరుదు సార్థకపరచుకొన్నవాడు శ్రీనాథుడు. పురాణ సాహిత్యానికీ, ప్రబంధ సాహిత్యానికీ తన రచనలతో కళాత్మకమూ సౌందర్యమయమూ అయిన సేతువు నిర్మించాడాయన. సాహిత్యము మానవ జీవితానికి ప్రతిబింబమనే వాస్తవము ఆయన రచనలలో ఎక్కువగా గోచరిస్తూ ఉంటుంది. అప్పటివరకూ పురాణపురుషులూ, దేవతలూ, తపోధనులూ, సప్రసాదులూ గుత్తగొన్న సాహిత్య క్షేత్రములో సాధారణ మానవుల సుఖదుఃఖాలనుగూడ పండించడానికి బాగా కృషి సాగించాడు ఆయన. తెలుగుతల్లిని "సంస్కృతము పల్లకీపై సర్వదేశములు త్రిప్పి" ప్రజావాణిగా మార్చాడు. రాజగౌరవముతో పాటు ప్రజాభిమానముకూడా ఆమెకు సమకూర్చిన జాతీయకవి ఆయన. వనకని మోజునుబట్టి, దేశకాల పరిస్థితులనుబట్టి పురాణ కావ్యభాగాలను అనువదించినా ఆయన రచనలలో ప్రతిభనూ, స్వాతంత్ర్యాన్ని, ఉపజ్ఞనూ, జాతీయతనూ వెల్లడించే రచనా విశేషాలు ఎన్నో వెదకిన కొద్దీ గోచరిస్తూ ఉంటవి. తన రచనకు సూక్తివైచిత్రి, ఉభయభాషాప్రౌఢి, రసాభ్యుచితబంధము ముఖ్యలక్షణాలని ఆయనే చెప్పుకొన్నాడు. సమాసములో పొదిగి భావానికి గాంభీర్యము కల్పించే శిల్పము ఆయనకు తెలిసినట్లు తెలిసిన కవులు చాలా తక్కువ మంది. ఆ శిల్ప చాతుర్యాన్ని వెల్లడించే కొన్ని విశేషాలు సహృదయులకు ఆనందాన్ని కల్గించగలవని మా తలంపు.

ఈ పద్యాలకు లఘు వ్యాఖ్యచేసినది శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారు. వారికి కృతజ్ఞత.

—సంపాదకులు.

## ఉత్తర క్రియ

హస్తయుగ్మము మోడ్చి ప్రార్థించి పలికెదఁ
తెమ్మెఁడా నాకిమ్ము తగఁ జితాగ్ని
మందమందమ్ముగా మలయాచలము గాడ్పు
నెరవుతో మండంగఁ విసురుఁగాతెఁ
పరలోక తృప్తికై బంధు లిద్దఱకును
ధర్మోదకం బిడుఁ తమ్మితేనె
సహకార మంజరీ చరుపిండకబళమ్ము
పెట్టుండు మాకునై పికము ముట్టి
తేనె పెట్టుండు కస్తూరి దీర్చియచట
జేర గొజ్జంగిపూనీటఁ జెంబు నిడుఁడు
నన్ను నలరాజుఁ దలచి మన్నన దలిర్పఁ
దగ సమర్చనసేయుఁడు దంపతులకు.

(హరవిలాసము)

హరునికంటి మంటచే భస్మమైనాడు మన్మథుడు. అతనికై ఏడ్చిఏడ్చి రతీదేవి అతనితో సహగమనము చేయసంకల్పించి వసంతుడితో ఈ మాటలు చెప్తున్నది. రతీమన్మథులు శృంగార రసమూర్తులు. స్త్రీ పురుష సౌందర్యానికి ఆదర్శభూతులైన రతీమన్మథుల ఉత్తర క్రియలుకూడా వారికి తగినట్లు ఉండవలెను. అందుచే కవి తమ్మితేనెతో ధర్మోదకమూ, పికము ముట్టడము కోసము సహకార మంజరులతో చరుపిండమూ, తేనెపెట్టె, కస్తూరి తీర్చి, గొజ్జంగి పూలనీరు నింపిన చెంబు లుంచి, ఆచట రతీమన్మథులను తలంచుకొని దంపతులను పూజించడమూ కల్పించి రతీమన్మథుల ఉత్తర క్రియలలో కూడా రామణీయకత స్ఫురింప చేశాడు. చని పోయినవారి కోసము ధర్మోదక మీయడమూ, పక్షిముట్టడానికి పిండము వేయడమూ, దంపతులను పూజించడమూ అందరూ చేసే పనులే. కాని రతీమన్మథుల కోసము చేయడమూ, చేస్తున్నది వసంతుడూ అయినప్పుడు మామూలు వస్తువులతో జరిపితే శోభ ఏముంటుంది? అందుచే చక్కని కమ్మని వస్తువులను కల్పించి రతీమన్మథుల ఉత్తర క్రియలను కరుణ శృంగార రసమయములు చేయడము ఎంతో హృదయంగమముగా లేదా ?

## వే గు జా ము

పారిజాత కలతా పల్లవంబులు మేసి
          కొసరె నుద్యాన పుంస్కోకిలములు
కంధరాగ్రైకీయ కనక ఘంటిక మ్రోయ
          వేల్పుటేనిక యమర్వీథికి నడచె
మందాకినీ వీచి మారుతం బల్లార్చె
          నప్సరస్త్రీల నీలాలకముల
సప్తర్షి పావనాశ్రమ వనాంతరమున
          నామ్నాయ ఘోష మభ్యధికమయ్యె.

బాలవత్సంబు పైఁ గూర్మిఁ బంచితిలుచుఁ
గామగవి సేఁపువచ్చి హుంకారమిచ్చె
శక్రు గడియారమున మించె శంఖరవము
విబుధలోకము నందలి వేఁగుఁబోక.

ఈ వేఁగుఁబోక స్వర్గానికి సంబంధించింది. కోళ్ళు కూయడమూ, ఏనుగులు ఆహారానికి వెళ్ళడమూ, నిద్రమైకాన్ని పోగొట్టే చల్లగాలి వీచడమూ, వేదాధ్యయనము చేయడమూ, పాడియావులు లేచి పాలుచేపువచ్చి పంచితిస్తూ అంభారవము చేయడమూ, ఆస్థానాలలో గంటలు కొట్టడమూ తెల్లవారుజామున మనము చూసే విశేషాలు. అవే స్వర్గంలో ఎట్లా జరుగుతవో భావనచేయగలగడము సాధారణము కాదు. స్వర్గ మర్త్యలోకాల చక్రదనాలను కలిపివేసిన ముడి ఈ పద్యము. స్వర్గములో తెల్లవారుజామున కూసేది కోళ్ళుకావు, పారిజాతపు తీగల చివుళ్లు మేసే గండు కోయిలల మెడలోని బంగారుగంట టంగు టంగున మోగుతూ ఉండగా ఉషఃకాలాన జరపవలసిన కృత్యాలకు బయలుదేరేది ఐరావతము. నిద్రపోయే అప్సరసలను ముంగురులతో సయ్యాటలాడేది గంగాతరంగాల మీది చల్లగాలి. వేదఘోష మారుమోగేది సప్తర్షుల ఆశ్రమాలలో. దూడమీది మమతతో లేచి పంచితము విడుస్తూ పాలు చేపి అంభా అని అరచేది కామధేనువు. ఇంద్రుడి గడియారాన వినవచ్చేది శంఖారావము; నిత్యమూ మనకు గోచరించే వేగుజామును స్వర్గములో ఉదయింపచేసి ఈ లోకాన్ని మరిపించడమే శిల్ప చాతుర్యము.

## వాన

తటినభిఘాతయోగమున ధారలు జోరునఁ గుర్యుచుండఁగా
బిటలు పిట్లనం బ్రిదిలి! ప్రేలిపడం గొండఁగం జతుర్దిశా
తటముల మండుచుం బిడుగు తండములుం గాంచి పురీజనంబు హ్రా
త్పుటములు జల్లనన్ మఘవ పుత్రుని ప్రేళ్ళు పదిం జపింపఁగన్.

భగవదాజ్ఞచే కాంచీనగరములో ఇరవై యొక్క రోజులు ఎడతెగని వాన కురిసింది. మెరుపులు మెరవడమూ, వాన ధారలు కురియడమూ, మండుతూ పిడుగులు పడడమూ, మాటల కూర్పులో నినదింపచేసే రచన ఇది. అర్జునుడి పేర్లు పఠిస్తే పిడుగు పడదన్న నమ్మకాన్ని పద్యములో చూపించి ఆ కుంభవృష్టిని మన మనస్సులలో కురిపించడము కళా సరస్వతి కడగంటి చూపువంటి శిల్ప విలాసము.

*


# అభ్యుదయ

(మాసపత్రిక)

| చందా వివరాలు | | | ప్రకటన రేట్లు (ఒకసారి) | |
|---|---|---|---|---|
| సంవత్సరం | : | ఆరు రూపాయలు | రైటిల్ నాల్గవ పేజీ | రు. 50 |
| అర్ధసంవత్సరం | : | మూడురూపాయలు | ,, (2, 3 పేజీలు) .... | 40 |
| విడిప్రతి | : | అర్ధరూపాయి | మామూలు పేజీ .... | 30 |
| | | | అరపేజీ .... | 20 |

ద్వివర్ణ, త్రివర్ణాలకు అదనపు రేట్లు. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లుకావాలి. కావలసిన ప్రతులకు కమిషన్ పోను మిగతా డబ్బు ముందుగా చెల్లించాలి.

వివరాలకు:

**మేనేజరు, అభ్యుదయ, విజయవాడ-2.**

# దినమణి

## "ఉదయభాను"

ఎన్నాళ్ళకీనాడు వెలిగింది చూడు !
సామాన్య మానవుడు మాన్యుడైనాడు
సామీప్య భవితవ్య శోణితద్యుతితో
సామాన్య మానవుడు సూర్యుడైనాడు;

వరదవలె ఉరకలిడి వెలుగువలె పురతిపడి
ఎన్నాళ్ళ కీనాడు వెలిగిందిచూడు !
కన్నీళ్ళకోనేళ్ళు గడచెను నిసుళ్ళు;
ఎన్నాళ్ళ కీనాడు వెలిగిందిచూడు;

ఉరి కొయ్యలే లేచి ఉర్విపై సుడిసి
సుడిగాడ్పువలె వీచి వడగళ్ళు కురిసి
అజ్ఞాన తిమిరాల నణగించి చదిపి
వెలిగింది యీనాడు వీర విక్రాంతి;

సంచలించిందిలే బధిరాంధ జగతి
ఎన్నాళ్ళ కీ నాడు వెలిగింది చూడు !
ఎన్నేళ్ళ కడగళ్ళ ఫలితమీ చిగురు
ఎన్నేళ్ళ కన్నీళ్ళ నానయీ గెలుపు !

ఎన్ని రూపాలతో మనమీద మిత్తి
ఎన్ని గాయాలపై ఎత్తింది కత్తి
అడుగు అడుగూ చేతి కందకుండేను
ఎన్నాళ్ళ కీనాడు గెలిచింది చూడు !

మంచు కురిసేచోట మండింది నెగడు
ఎన్నాళ్ళ కీనాడు వెలిగింది చూడు !
వ్యత్యస్త విపినాన కార్చిచ్చు పొదిగి
ప్రత్యూష పవనాల ప్రీతి ప్రసరించి

ఎన్నాళ్ళ కీనాడు వెలిగిందిచూడు
నైరాశ్య పవనాల బడబాగ్ని మెదిపి
ఉత్సాహ గీతాల వురుము లాలికించి
సంక్రాంతి సంజలో శశి తేతస్వ

ఎన్నాళ్ళ కీనాడు వెలిగిందిచూడు
ఆవరించిన నిరామయపు చెర త్రుంచి
అవతరించెను నూత్న చేతన స్రవంతి
మ్రోగింది జనలోక జాగృతి విపంచి.

ఎన్నాళ్ళ కా నీచ నిశలంతరించెన్
ఎన్నాళ్ళ కీరోచి నివహాముదయించెన్
ఇచట నీ కోసమై వేచెను ఉషస్సు
ఇచట నీరాకకై నిలిచె నాయూసిస్సు !

ఎన్నాళ్ళ కీనాడు వెలిగిందిచూడు
సామాన్య మానవుడు రేడాయెనేడు !

# వజ్రముఖులు

## రాజేంద్ర

గంగులు, గంగీ, కూలికి వెళ్ళి పొద్దు పోయే సమయానికి ఇళ్లు చేరుకున్నారు. ఇంకా బావిపనికివెళ్ళిన నాగన్న, లక్ష్మి, నాగమ్మ ఇల్లు చేరుకోలేదు. దాదాపు రెండుమైళ్ళ దూరాన పనిచేసి, అక్కణ్ణుంచి రావాలి. అందుచేత ఆముగ్గురూ రోజూ ఆలశ్యంగా రావడం మామూలే.

గంగి బజారునుంచి తెచ్చిన నియ్యమేసి త్వరగా కూరొండి పెట్టేసి, చింతకాయ పచ్చడి చేసింది. గంగులుకు పెళ్ళాం చేసిన చింతకాయ పచ్చడి మా రుచిగా వుంది.

"ఏంచేశావే......నీ ఒల్మకంతా...ఈ పొద్దు కుదిరింది" అన్నాడు.

"ఇన్నాళ్ళ...నే చేయలా....నువ్వు తిన్లా...సడేలే!" అని విసుక్కుంటోన్నే, మొగుడికి పచ్చడి నచ్చినందుకు సంతోషించింది గంగి. కొడుకూ, కోడలు, కూతురు వచ్చి అంత గతికేశారంటే, పళ్లోకి దిగొచ్చుననుకొంటూ, అన్నం తిని, చల్లగా గంజి తాగి, అరుగుమీద కూర్చున్నాడు గంగులు. దూరాన కోడలు మాటలు వినిపించి, మీద కప్పుకొన్న పైపంచి తీసి, మళ్లీ అరుగుమీదవేసి పైకి లేచాడు.

"ఏమేయ్...ఆళ్ళవొస్తావుండాల్లే... అవన్నీ ఆడ బెట్టేసి అంక నువ్వు పళ్లోకి రా" అనేసి లోపలికివెళ్ళి గడ్డపార, పార, తట్టలూ తీసుకొని బయటకొచ్చాడు.

పనిముట్లు పునాది గాడిలోవేసి తిన్నగా దిగి గడ్డపలుగుతో త్రవ్వడం ప్రారంభించాడు.

పౌర్ణమి రాత్రి, పుచ్చపువ్వులా వుంది వెన్నెల. పట్టపగలులా అన్నీ, అంతా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కడగాలు త్రవ్వి, మట్టి తట్టలకెత్తుతూ వుంటే, గంగి వచ్చి మట్టి గట్టుమీద పోయసాగింది.

కొడుకు, కోడలు, కూతురు వచ్చారు. అన్నాలుతిని గంజిత్రాగి పనిలోదిగారు.

పని చేస్తూవుంటే గంగులుకు మహా ఆనందంగా వుంది. కూతురు పెళ్ళినాటికల్లా ఇల్లు కట్టేస్తాననుకొన్నాడు. కొత్తయిల్లు ఎలావుండబోతుందో, వాడలో వాళ్ళు, ఊళ్లో రైతులు తనను, తనఇంటినీ చూసి ఎలా ఈర్ష్యపడతారో కూడా వూహించుకొన్నాడు. ఇప్పటికే అంటూనూ — "గుట్టుగా గుడిసెలో పడి వుండక, ఊరికే రాత్రీ పగలు వొళ్ళు విరుచుకుంటున్నాడు. అన్యాయంగా పెళ్లాం పిల్లల్ని కష్టపెడుతున్నా"డంటున్నారు. తనకు బూసయ్య పొలం దున్నుతున్నప్పుడు పెద్ద నిధి దొరికిందని కూడా అనుకొంటున్నారు.

తను ఎంత కష్టపడి కొంత డబ్బు మిగిల్చి కడగాలుకు రాళ్ళు కొట్టించాడో ఎవరికి తెలుస్తుంది? తను, తనవాళ్ళు ఎన్నాళ్ళకూలి డబ్బులు కానీ, వక్కా ఆకుకు ఖర్చుపెట్టకుండా ఎలా కూడ

బెట్టారో ఎవరు వూహించగలరు? సోమరి తనం లేకుండా, ఇంట్లో అందరూ కష్ట పడుతున్నారు. వర్షానికి, ఎండకు, చలికి, గాలికి రాపుగా సౌఖ్యంగా ఇల్లు కట్టుకో వాలనుకోవడంలో తప్పేముంది. ఈ హరి జనవాడలో వూరివాళ్ళ గుడిసెలు తప్పించి, ఎవరికీ ఒక పెంకుటిల్లుగానీ, మిద్దెగానీ లేదు. తనే మొదటిసారి అంత సాహసం చేశాడనీ, తను రేపు పెంకుటిల్లువేస్తే, తనసంపదకూ ఈ వాడను నాయకుడుగా చూస్తారని తనచుట్టూను తను, సుఖంగా ఇంట్లో వెచ్చగా పడుకోవాలనుకొంటు న్నాడంతే. అనుకొని నేలగా నిట్టూర్పు విడిచి పల్లెగాలి పీల్చుకొని, ఒక్క మూలుగు మూలిగి, గడ్డపారకు అడ్డొచ్చిన బండరాయిని, ఒక్కవూపున పెళ్ళగించేసి "నాయనా! రాకుండా యాడపోతాందిరా" అన్నాడు గంగులు!

సింగరయ్య కుంటుకుంటూ వచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

"ఏవరా నాయాళ్లా, ఏం కట్టుకుంటుం డార్రా పిల్లగ అంత గతికేసి గుడిసెలో పడుంటేక" అని ఏమంటారా అని పని చేస్తున్నవాళ్ళను చూశాడు.

"నోరు మూసుకొని కూర్చో. ముసలి ముక్కులా వూరికే మొరగొద్దు" అన్నాడు నాగన్న.

"అది సరేలేరా పిల్ల ఎదవా! వోరి గంగులూ...ఊరంతా అంటా వుండారే మిరా...... నీకేదో నిధి దొరికిందని. లేకపోతే నువ్వు మాలఎదవ...ఇల్లు కట్టే దేమిటి?" అన్నాడు.

"నిధి దొరికితే ఇట్ల రాత్రంతా కష్ట పడి ఎందుకుసస్తాం మామా!" అన్నాడు నెమ్మదిగా గంగులు.

"పోన్లే! ఏదో ఇల్లు కట్టుకోవాలా అని నువ్వు! గిట్టనోళ్లు కన్నుకుట్టి ఎన్నైనా అంటార్లే. సంగాని పొవ్వాకే మన్నా వుంటే ఇట్లఎయ్యరా" అన్నాడు ముసలి సింగరయ్య.

గంగి తిత్తితీసి అందులోంచి కొంత పొగాకు కాడ తుంచి సింగరయ్య వొడి లోకి వేసింది. సింగరయ్య అందులో కొంత తుంచి నోట్లో వేసుకొని, మిగతా బొడ్లో దోపుకొని లేచి, తిన్నగా కుంటు కుంటూ వెళ్లిపోయాడు.

వాడంతా నిద్రపోతోంది. గంగుల కుటుంబం పనిచేస్తూనే వున్నారు.

గంగులు గడ్డపలుగుకు ఏదో అడ్డొ చ్చింది. బలంకొద్దీ గడ్డపలుగు పైకెత్తి బలంగా దిగపొడిచాడు. ఖంగుమని మ్రోగింది! పైకితీసి ఇంకోసారి వేశాడు. మళ్ళీ ఖంగుమంది.

"నేను నాయనా ఈడేదో ఖంగు మంటూందిరో" అన్నాడు గంగులు క్రిందికి జాగ్రత్తగా చూస్తూ.

నాగన్న పార క్రిందపడేసి దగ్గరగా వచ్చి గంగులు దగ్గర గడ్డపార తీసుకొని 'ఖంగుమన్నచోటు' చుట్టూ త్రవ్వి మట్టి తీశాడు. లోపల ఏదో నల్లగా గుండ్రంగా కనిపించింది. తిన్నగా త్రవ్వి దాన్ని పైకి తీశాడు. నాగమ్మ, లక్ష్మి దగ్గరగా వచ్చి గట్టుమీదనుంచి వంగిచూస్తున్నారు. అది చిన్న కుండ! మంచి ఒకటోరకమైన గట్టికుండ!

"దీంట్లో ఏందో వుందప్పా" అంటూ నాగన్న దాన్ని గుడిసెలోకి తీసుకెళ్లాడు. అందరూ ఇంటిలోపలికి వెళ్ళి తలుపువేసి గడియపెట్టేశాడు.

గంగులు దాన్ని చేతికి తీసుకొని త్రిప్పిచూశాడు. దానికి మూత వుండవలసిన చోటున, అడ్డంగా లోగా ఒక గట్టి పెంకువుంది. గడ్డపారతో లోపలికి పొడచాడు. తిప్పించికొట్టాడు. నాలుగైదుసార్లు కొట్టింతర్వాతగానీ అది పగిలి దారి యివ్వలేదు. లోపల ఏవో మిలమిల మన్నాయి. క్రిందికి క్రుమ్మరించాడు. వెండి నాణేలు క్రింద రాలేయి. అన్నీ లెక్కబెడితే ఏభైవున్నాయి. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎవరి నోటి నుంచీ ఒక్కమాట రాలేదు. గంగులు దాన్ని అలాగే తీసుకెళ్ళి ధాన్యం కడవలు దించి క్రింది కడవలో వుంచేసి అన్నీ మళ్ళీ యథాస్థానంలో పెట్టేశాడు.

"ఇంక పదండి మహాలక్ష్మి వచ్చు" అని ఉత్సాహంతోనూ, ఎవరైనా చూస్తారేమో అన్న తొందరతోనూ, తలుపుతీసి పునాది దగ్గరకు వచ్చాడు. అందరూ మళ్ళీ పనిలో నిమగ్నులయ్యారు. ఆ కుండ దొరికిన ప్రదేశం చుట్టూ చాల త్రవ్వి చూశారు గానీ ఇంకేమీ కనిపించలేదు. అందరూ అలసిపోయి పని ఆపుచేసి పడుకొన్నారు.

* * *

గంటుకు పెద్ద 'నిధి' దొరికిందని, ఊరంతా విశేషంగా చెప్పుకొంటున్నారు. దాదాపు వెయ్యి రూపాయలు విలువ కలిగిన బంగారు దొరికిందని కొందరు, ఐదువందలు వెండి రూపాయలు దొరికాయని కొందరూ...ఎవరి వూహకు తట్టినట్లు వారు ప్రచారం చేశారు. గంగులును కొందరు గౌరవంతో, కొందరు ఈర్ష్యతో, కొందరు ద్వేషంతో చూడసాగారు.



గంగులును, గంగిని, నాగన్నను, లక్ష్మిని, నాగమ్మను అందరూ పిలిచి అడగటం, వీళ్లు 'అయ్యో...ఏమీ దొరక లేదు స్వామీ" అని చెప్పుకోవడం మామూలయిపోయింది.

ఒక రోజు సాయంకాలం గ్రామపెద్ద సుబ్బయ్య రహస్యంగా పిలిచి అడిగాడు.

"నీకు కడగాలు త్రవ్వుతూవుంటే వెండో, బంగారో ఏదో దొరికిందని అందరూ అంటున్నారు. ఎంత దొరికింది? మొదట నేను నమ్మలేదుగానీ...నువ్వు ముందుగా పెంకుటిల్లు కట్టాలని, ఇప్పుడు మిద్దె కట్టాలని అంటున్న తర్వాత నాకూ అనుమానం కలుగుతోంది. నిజంచెప్పు... నా దగ్గర దాపరిక మెందుకు.....ఎంత దొరికింది గంగులూ" అన్నాడు.

"సత్తె పెమాణంగా చెప్తున్నాను సామీ. బంగారు గింగారు నాకేమీ దొరకలేదు. ముందు పెంకుటిల్లు వేయాలనే అనుకొంటిని. మిద్దెవేయను ఇంక ఇంతెకన్న జాస్తీ ఏమీ కాదని మేస్త్రి చెప్పినాడు. అందుకని అట్లనే చేద్దామనుకొంటిని" అన్నాడు గంగులు.

"నీ వెధవ్వేషాలన్నీ నాకు తెలుసు లేరా గంగులూ! నా దగ్గరా నీ వేషాలు! మర్యాదగా చెపుతున్నాను. న్యాయంగా అందులో సగం వాటా నాకిచ్చెయ్. లేదూ...నీ పని పట్టిస్తాను. అసలు నువ్వు ఇల్లు కట్టుకున్న నేల ఎవరిది? కాగితాలన్నీ తిప్పిచూసినాను. పూర్వమంతా మాదే. దాన్ని మీకు అమ్మినట్లుగానీ, దానం చేసినట్టుగానీ ఎక్కడో దాఖలాలేదు. అదంతా మీ అనుభవంలో వుండేగానీ...ఇంతలో నీ సొంతమైపోలేదు. ఏమంటావు? ఏం చేస్తావు? సరేనా... ఒప్పు

కొన్నిస్తేనా" అని సాధికారంగా గంగుల్ని చూశాడు.

గంగులు ఆలోచిస్తున్నాడు. తను పెద్ద రైతు సుబ్బయ్య దగ్గర చేరకుండా స్వేచ్ఛగా ఇష్టం వచ్చిన వారిదగ్గర, లాభకారిగా వున్న పనికి వెళ్ళి హాయిగా బ్రతుకుతున్నాడని ఆయనకు ఎంతో కాలం నుంచి ఆగ్రహంగా వుంది. ఆ పక్క వాళ్ళ చెఱకు తోటలో చెఱకు విరిచాడని నాగన్నను నడిఊళ్ళో స్తంభానికి కట్టించి చచ్చేలా బాదకొట్టి, వొళ్ళు హూనం హూనంచేసి వొదిలిపెట్టారు. లక్ష్మి వంటరిగా పొలందగ్గర కనిపిస్తే, దాని కొంగు పట్టుకొని లాగి, అది తిట్టే, "ఇక్కడే గడ్డి కోస్తున్నావం" అని తన సేద్యగాణ్ణి పిలిచి, ఇద్దరూ చేరి చితకబొడిచి పంపించారు. ఇవన్నీ తెలిసికూడా తను వూరుకోవలసివచ్చింది. ఈ దుర్మార్గుడిప్పుడు తనను బంగారు తెచ్చివ్వమంటున్నాడు.

"ఏమిటి : ఇంకా ఆలోచిస్తున్నావు. రేపు రాత్రిలోగా తెచ్చిస్తావా...సరే లేదూ... ఫైసలయిపోతావ్! పోలీస్ రిపోర్టిచ్చి నీ తాడు తెంచి ముప్పుతిప్పలు పెట్టి నిన్ను మూడు చెరువులనీళ్లు త్రాగించే వరకు వదలి పెట్టను. పోరా...పో... పోయి ఆలోచించుకో" అని టవలు భుజంమీద నుంచి తీసి విదిలించి మెడమీద వేసుకొని చరచరా వెళ్లిపోయాడు సుబ్బయ్య.

గంగులు తిన్నగా ఇంటికి నడిచాడు ఇక ఈ వూళ్ళో బ్రతకడం సాధ్యం కాదని నిర్ణయించుకొన్నాడు. ఎందుకనో సుబ్బయ్య మాటలు వింటూవుంటే, ఇల్లు కట్టుకొని అందులో సౌఖ్యంగా బ్రతకాలనే కోరిక పటాపంచలై పోయింది.

తనకు ఏమీ దొరకలేదంటే ఇక ఎవరూ వినిపించుకోరు. కూలి చేసుకొని పొట్ట గడుపుకొనేవాడు ఇల్లు కట్టుకొంటాడంటే అందరికీ అనుమానమే. మనిషి శక్తిమీద ఉన్నతి కృషిమీద నమ్మకం లేని వాళ్ళందరికీ అనుమానం కలిగింది. పదిమంది కొంపలు కూల్చి వాళ్ళ జీవితాలు నాశనం చేసిగానీ ఒక మేడకట్టుకోలేని పెద్దభూస్వాములు, ధనికులు తాము కష్టపడి కూలీ చేసి ఇల్లు కట్టుకోవడాన్ని సహించలేకపోతున్నారు. మొదటి నుంచీ తన కుటుంబం ఏ ఒక్కరికీ లొంగకుండా, సోమరితనం లేకుండా, స్వశక్తిమీద ఆధారపడి నలుగురు చిన్న రైతులదగ్గర పని చేసుకొంటూ గడపడం చూసి పెద్దవాళ్ళకందరికీ తనమీద కసి! ఆ కసి తీర్చుకోడానికి సుబ్బయ్యకు అదను దొరికింది.

ఆ రాత్రి ఊళ్లో పరిస్థితిని ఇంట్లో అందరికీ వివరంగా చెప్పాడు. సుబ్బయ్యగా ప్రాణంతీస్తున్నాడు. వ్యాపారస్థులు "ఆ వెండి రూపాయలు మాకు తెచ్చివ్వు. దానికి సరిపడా నోట్లిస్తా"మని పీడిస్తున్నారు. ఒక్కొక్కరూ రహస్యంగా పిలచి నయానా భయానా చెప్పి చూస్తున్నారు. ఇటువంటప్పుడు వీళ్ళ నుంచి తప్పించుకోడానికి ఇంక మార్గం లేదు! అందరూ ఆలోచించారు.

గంగులు తన నిర్ణయాన్ని అందరికీ చెప్పాడు. అందరూ "సరే" అన్నారు.

ఆ మరునాడు రాత్రి గంగులు రహస్యంగా, వొంటరిగా సుబ్బయ్యను కలుసుకొన్నాడు.

"నాకు మీరనుకొనేంత దొరకలేదు. ఏదో నాలుగువందల రూపాయలు వెండివి ఉన్నట్లున్నాయి. భయంతో నేను దాన్నింకా లెక్కపెట్టుకోనుకూడాలేదు. అంతా మీకే తెచ్చియిచ్చేస్తాను. నాకు. మున్నూరు రూపాయలు నోట్లు మారు చేయించండి చాలు" అని మొలనుంచి నాలుగు వెండి రూపాయలు తీశాడు. "అవీ ఇలాంటివి దొరికినాయి" అన్నాడు.

"సరే రాత్రికి పెరటివాకిలి దగ్గర కనిపించు" అన్నాడు సుబ్బయ్య.

అర్ధరాత్రివేళ చేతిలో చిన్న బరువైన సంచితో గంగులు సుబ్బయ్యను పెరటి వాకిలిదగ్గర కలుసుకొన్నాడు. సంచీ అందిచ్చి, నోట్లకట్టలు తీసి మొలలో దోపుకొని చకచకా నడిచిపోయాడు.

గంగులు ఆదేతీరున...ఆ రాత్రంతా నడుస్తూవున్నాడు. గ్రామం, తాలూకా, జిల్లా సరిహద్దులన్నీ దాటి పోయాడు. ఎల్లి ఇదివరకే అక్కడ చేరిన కుటుంబాన్ని కలుసుకొని ఆ ఉదయమే రైలు బండెక్కి ఇంకా దూరం......బ్రతుకు తెరువు నిమిత్తం వెళ్ళిపోయాడు.

ఆరాత్రి ఆ సంచీని అలా ఇనప పెట్టెలో వుంచేసి తృప్తిగా పడుకొన్నాడు సుబ్బయ్య.

మరునాడు. ఇంట్లో ఎవరులేని సమయం చూసి, గది తలుపులు బిగించి, ఇనప్పెట్టె తెరిచి సంచిబయటికి తీశాడు. దానికొసన కట్టిన ముడివిప్పి క్రింద కుమ్మరించాడు.

గలగలమని రాలాయి. సుబ్బయ్య కళ్లు బైర్లు క్రమ్మాయి. ఆయన తల గిర్రుమని తిరిగి మళ్ళా యథాస్థితిని నిలిచిపోయింది. కళ్ళు పెద్దవిచేసి ఇంకోసారి క్రిందికి చూశాడు.

అన్నీ పెంకుడు బిళ్ళలు. బరువుకోసం వుంచినారాయి! తెల్లని వెండివంటి బండరాయి ముక్క! విచారంతో, కోపంతో రెండు చేతులతో కుప్పలో చేతులు పోనిచ్చి కెలికాడు.

ఒకేఒక్క వెండి రూపాయి మిలమిలా మెరుస్తూ వెక్కిరించింది.

ఆగ్రహ పరవశుడై సైకిలెక్కాడు సుబ్బయ్య. గదికి తాళం వేసి సరాసరి పల్లెకు వెళ్ళాడు. గంగులు గుడిసెలో ఎవరూలేరు. ఎక్కడో పనికి వెళ్ళి వుంటారని...తిరిగి వచ్చేశాడు.

రెండు రోజులకు కూడా గంగులు జాడ కనిపించలేదు. సుబ్బయ్య కోపం అదుపు తప్పింది.

వెంటనే సింగరయ్యను లాక్కురమ్మని మనుష్యుల్ని పంపించాడు.

తనతో గంగులుకు పెద్ద 'నిధి' దొరికిందని 'రహస్యం' చెప్పిన సింగరయ్య కాలును... బాగున్న ఇంకో కాలును కూడా విరిచేస్తే గానీ, తన ఆత్మతృప్తి పడదనుకొన్నాడు.

వణుకుతూవచ్చి నిలుచున్నాడు సింగరయ్య.

సుబ్బయ్య తనమీద విరుచుకు పడే సరికి 'కుయ్యో' అని అరిచేశాడు సింగరయ్య!

★

# లవణరాజుకల : శాంత, శృంగార రసాలు

రమణారెడ్డి

శ్రీ పోట్లపల్లి సీతారామారావుగారు "జయంతి"లో గురజాడ అప్పారావుపై విసిరిన రాళ్ళలో మరికొన్నిటిని పరిశీలించక తప్పదు. అందులో మొదట "లవణరాజుకల" అనే గేయాన్ని గురించి వారు చేసిన విమర్శలను స్పృశిస్తాను.

"లవణరాజుకల"లో నాయకుడైన లవణుని వృత్తాంతం జ్ఞానవాసిష్ఠములో వుంది. మూలకథలో హరిశ్చంద్రుని వంశంలోని వాడుగా పేర్కొనబడి "శాంతుడు"గా ప్రసిద్ధుడైన లవణరాజుకు అప్పారావుగారు శృంగార దోషం అంటగట్టి ఆ మహారాజుయొక్క ప్రకృతిని కళంకిత మొనర్చినట్లు శ్రీ సీతారామరావు గారి విమర్శనుబట్టి మనం గ్రహించవలసి వస్తుంది. మూల కథలో మార్పు గావించేటప్పుడు, రసదృష్ట్యా కొంచెము మార్పు చేయవచ్చునేమో గాని పెద్దమార్పు చేయరాదని ఒక శాసనంకూడ శ్రీవారు చేసివేశారు. అప్పారావుగారి అపరాధం గురించి ఆలోచించేముందు, శ్రీ సీ. రా. (ఈ వ్యాసంలో శ్రీ సీతారామారావు గారి పేరు సౌలభ్యంకోసం, సీ. రా. అని వ్రాస్తున్నాను.) దృష్టిలో మహాకవులుగా మన్నింపబడక తప్పని అల్లసాని పెద్దన, విశ్వనాథ సత్యనారాయణగార్ల కృతులలో యీ అపరాధాన్ని గుర్తించలేకపోయారా శ్రీ సీ. రా? అన్యరతైబడినను వ్రతనిష్ఠ చెరచుకోనొల్లని ప్రవరుడు, సంసార బంధములను ఛేదించుకొని తపోవని కరిగినప్పుడు స్వరోచి శాంత రసమును మూర్తీభవించినవారుకదా! శృంగారమునేగాక, ప్రవరుని పట్ల శృంగారాభాసమును కల్పించిన పెద్దన గారి ఔచిత్యదృష్టి నేమనాలి? విరాగియైన ప్రవరునికి బిళ్లలమొలత్రాడు కట్టి, వలెవాటు తీర్చి, విటునివలెదిద్ది, వరూధుని వద్దకు తీసికొనిపోయినప్పుడు, స్వరోచి తపస్సాచరించినట్లు మార్కండేయ పురాణంలో వుంటే ఆభావాన్ని తొలగించినప్పుడు, యీ ఆంధ్ర కవితా పితామహుని నొక్కరైనా వ్రేలెత్తి చూపలేదు. విరాటపర్వములోని సుదేష్ణ, కీచకునికి సైరంధ్రిపైగల మోహతీవ్రత తెలిసికూడ, ఆవిడకు రాగల ముప్పు నెరిగికూడ, సైరంధ్రిని కీచకునింటికి పంపి దోషిగా నిరూపిత అయివుండగా, తమ "నర్తనశాల"లో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు స్వాతంత్ర్యం వహించి,

ఆమె ప్రకృతిలోని వంకరను దిద్దినప్పుడు, అర్భకురాలైన ఉత్తర పాత్రలో ధర్మాధికారాన్ని చిత్రించినప్పుడు, ఎవ్వరూ కిక్కురుమనలేదు. అనవలసిన అక్కర కూడ లేదు. ఔచిత్యము దృష్ట్యా మూల కథను తమ తమ ఊహల ననుసరించి కవులు మార్చుకోవచ్చునని పెద్దలు అన్నారు.

"నాగానంద" నాటకములో ధీరశాంతుడైన జీమూతవాహనుడు నాయకుడైనాడు. "వేణీసంహార" నాటకములో ధీరోద్ధతులైన భీమ, దుర్యోధనులు నాయకులై యుండగా, తన సిద్ధాంతమును సమర్థించుటకొరకు సంహితులు ధర్మరాజు నాయకుడన్నారు. ఇక శ్రవ్యకావ్యాల విషయం చూస్తే మహాభారతం శాంతరస ప్రధానమైనది కదా, అందులో యితర రసాలన్నీ మొందుకొని యుండలేదా? శాంతరస ప్రధానమైన కావ్యములలో కూడ శృంగార ప్రసక్తి నిషిద్ధము కాలేదనుటకు "నాగానంద" నాటకమే ప్రబల నిదర్శనముగా వున్నది. నిజానికి, శాంతరసము నిండారడానికి శృంగారమే అక్కడ బాగా వుపకరించిందనాలి. జీమూతవాహనుడు మలయవతిని వలచి, మధుపర్కాలు ధరించకుండ వుంటే, గరుడుడు అతనిని నాగునిగా భ్రమించి యుండే అవకాశం వుండేది కాదు. కాని విరోధిరసాలైన శాంత శృంగారాలకు అద్భుతరసంవలన వ్యవధానం కలిగింది. "నాగానందము"లో విషయేచ్ఛావైముఖ్యమును సూచించి, నాయకుని ధీరశాంతునిగ నిరూపించి, మలయవతి యొక్క దివ్యగానముద్వారా అద్భుత రసాన్ని చూపి, తర్వాత మలయవతీ శృంగారమును నిర్వహించినాడు హర్షుడు.

"లవణరాజు కల"లో ఇందుకు భిన్నంగా జరుగలేదు. లవణరాజు ధర్మజ్ఞుడు; విషయేచ్ఛాలంపటుడు కాడు. ఇంద్రజాలికుడు ప్రమోల నిల్పిన గుర్రమెక్కినప్పుడు ఆయన స్థలావకాశములో గాక, కాలములో పయనించినాడు; వాస్తవముగా కాక ఊహలో పయనించినాడు; పయనించకుండనే పయనించినట్లు భావించినాడు. అప్పటి అతని అనుభూతి అతనికి నిక్కువమే అనిపించింది. చూచేవారికి ఏదు నిముషాలనిపించిందే కాని ఆయనకు అదే జన్మాంతరము వంటి అనుభూతి; పూర్వజన్మ వాసనలు పూర్తిగ విడిచిపెట్టని అద్భుత పరిణామము! ఇంతలో ఒక దివ్యగానము వినిపించింది. చెట్లు చేమలే చెవులను విప్పి విన్న గానము; చంద్రుడే చెవియొగ్గి విన్న గానము! ఈవిధంగా శాంతానికి, తరువాత ప్రస్తావించబోయే శృంగారానికి యీ అద్భుతాన్ని వ్యవధానంగా చేసిన కవిని "ధ్వన్యాలోక" కారుడు కూడ నిందించలేడు. కాని లవణుడు ధీరశాంతుడనేందుకంటె ధీరోదాత్తుడని పించుకోదగినవాడు. విరాగి కాడు.

కాని శ్రీ సీ. రా. గారొక బెడ్డ విసిరారు. ఆ శృంగారం మోతాదు మించిపోయినట్లు వారి ఆరోపణ. శ్రీ సీ. రా. లోతుగా చూసినట్లు లేదు. ఈ కథా సందర్భంలో శృంగారం ఎంతమేరకు ఎంత మోతాదులో వాడవచ్చును? ప్రధాన రసమైన శాంతానికి భంగపాటు కలగనంతవరకు అని జవాబు చెప్పుకోవచ్చును. ఆ మాలెత పాట పాడింది. ఎవరిని గురించి? లవణుడనే పేరు విన వచ్చినట్లు లీలగా అనిపిస్తుంది రాజుకు.

ఇదీ అద్భుతం కిందనే జమ. ఏవేవో యింకా మునుపటి పుట్టువుల జ్ఞాపకాలు అతనిని కప్పివేస్తున్నాయి. ఆమె ఎవ్వరో అన్య కాదు—కన్యకనక. అంతే కాక, తొలిపుట్టువులలో తన చెలికూడ. కనుకనే లవణుడు ఆ కన్యను వెంబడించడమూ, "కనుముబట్టి యుగంబు యమునముగ జేర్చి ముద్దిడి కురుల" దువ్వడమూ జరిగింది. ఈ పూర్వజన్మ సంబంధాన్ని గురించి కథ మధ్యలో అడ్డుతగిలి కవి చెప్పకూడదు. కనుకనే లవణుని పేరుపెట్టి ఆవిడ పాడుతున్నట్లు అక్రూడ సూచించడం మట్టుకు జరిగింది. ఆ తరవాత ఆమె చంద్రికని చేరబోయి నప్పుడు "వచ్చితివ యిల్లుండ!", అని ఆమున లవణుని చేరబిలవడం జరుగుతుంది.

"ఆడబోయిన తీర్థమెదురై
వేడబోయిన వరము వచ్చెను...",

అని లవణుడు యిందుకే భావించాడు. చిరకాల వియోగం ఆనాటితో ఆ పురాణ దంపతులకు చెల్లింది. బాహ్య సౌందర్యం కంటె ఆ యువతి ఆత్మ సౌందర్యం ఆకర్షించింది. ఇప్పటికి యింకా సుఖంగా కథ పర్యవసించింది కనుకనే చంద్రుడు నవ్వినాడు. ఎట్లా నవ్వినాడు? సంతోషం పట్టలేక "పకపకా నవ్వేన్." అకారణ నవ్వడానికి అంత అజ్ఞాని కాదే చంద్రుడు? అంతా నాగరకుడేను కనుక నిండుగా నవ్వినాడు. అపహసించడానికైతే వెలితినవ్వు నవ్వివుండును. తానొకటి అనుకొని వాడినపదం వేరొక అర్థాన్ని సూచించే విపరీత ధ్వని ప్రదదోషం సమాసగతమైన పదదోషమే కాని విడిమాటలకు వర్తించదు. శాంతం యొక్క ప్రాముఖ్యాన్ని యీ శృంగార ప్రసక్తి నైదొలగించలేదు సరిగదా, దానిని ప్రముఖతరం చేసింది. కథాంతానికి ముందు తిరిగి శాంతం ప్రస్ఫుటిస్తుంది. బిడ్డలను కని, పసులను పోషించి, పంటలు పెంచి, దుష్టులకు క్షామాలకు బలియై, జీవనేచ్ఛా విముఖులై, చితిని దూకిన యీ దంపతులు ఆ నడుమంతరపు నిజానిజపు సంబంధాన్ని త్రెంచుకొన్నారు. కాని కథారంభాన తోచిన అద్భుతమే కథాంతాన తిరిగి ప్రత్యక్షమౌతుంది. ఆదిలో కనిపించినది అనిపించినది ఇంద్రజాల మహిమ. నడుమ కనిపించినది శృంగార మహిమ. చివర కూర్చినది దైవ మహిమ. సింధు దేశాధీశ్వరుడు కానుకగా పంపిన రాజపుత్రిని చూచి "వచ్చితివ నా ప్రాణసఖి" యని మాలతిగా తాను చూసిన సుందరిని తిరిగి గుర్తిస్తాడు. ఇంత వస్త్వైక్యం సంవిధాన చాతుర్యం వర్ణనా చిత్ర్యాలుగల లఘుకావ్యం యిటీవలి కాలాన మరొకటిలేదని చెప్పవచ్చును.

శ్రీ సి. రా. పూరుకోరుగారి? వారికి పరలోకబోరలు కనిపించింది. అదేమిటంటే, ఈ కథను అప్పారావుగారు ఆధునిక భావములను (సంఘసంస్కారం) లోకం దృష్టికి తేవడానికే వ్రాశారట. వ్రాస్తేతప్పా? పతితోద్ధరణకోసం రామాయణాలు తిరిగి రచించేవారినేమంటారు? మహాభారతానువాదం అందుకేగదా జరిగింది? తినుచున్న అన్నమే లోకము నిత్యమూ తింటున్నదెందుకయ్యా అంటే తినరుచి తనదికాబట్టి, అని "కవిసమ్రాట్టు" విశ్వనాథవారు అంటారు. ఎవరిపిచ్చి వారికానందం అని లోకం అంటుంది. కాని చూడవలసింది, అప్పారావుగారు కవిగా

కథాగతికి అడ్డుగా నిలిచి, ఆ సందర్భంలో ఈ మాలలను గురించి ఆక్షేపణగా వాకొన్నారా? లవణుడు ఆకొని వున్నాడు. ఆయనకు కూటికుండతో కనిపించింది. అన్నం అడిగాడు. అయ్యో మాలెతనే నేను, అంది. అని కంటనీరు పెట్టింది. ఎట్లా యీమెను ఓదార్చడం? తాను విశ్వసించనివి చెప్పకూడదు. విశ్వసించిన ధర్మాలలో "సహజ ధర్మము"ను లవణుడు వాకొన్నాడు. "నీలో మాలిన్యం లేదు కనుక నీవు మాలవు కావు; మాలిన్యం వున్నవాళ్ళే మాలలు; వాళ్ళు బ్రాహ్మణులైనా ఎవరైనా" అన్నాడు. ఇందులో విశేషాలు ఏమున్నాయి? మాల మాదిగలను చిన్నచూపు చూడడం ఇక్ష్వాకుల నాటి నుంచీ వస్తున్న "సంప్రదాయం" కాదా? హరిశ్చంద్రుడు (లవణుని పూర్వీకుడు) కాటికాపరి దినాలు వెళ్ళబుచ్చలేదా? పురాతనమైన యీ సమస్యను ప్రస్తావించడం అసందర్భమేమీ కాదు. ఇక, ప్రస్తుత సంఘ స్థితిని విమర్శించేందుకు యిది పనికివస్తున్నదని దానిని దుయ్యబట్టడం తగునా? ఆవిధంగా పురస్కరిస్తే సంతోషించవలసిందేగాని, తప్పులెన్నవలసిన పని లేదు. ఈ కథలో మాలల ప్రసక్తి మట్టుకే కాకుండా - జన్మాంతరాలను గురించీ, ఇంద్రజాలం గురించీ, విధి గురించీ రచయిత వర్ణించాడు-యిది మట్టుకు సబబా యేమి? ఇంతకూ లోకానికి సబబైనది శ్రీ సీ. రా. కు బేసబబు.

ఇక యతిప్రాసలను గురించి శ్రీ సీ. రా. ఒక విసురు విసిరారు. "'దండి నృప! వొక గండుగారడి కలదు కను' మనియెన్." 'దండి' అనే మాటకు 'గండు' అనే మాటకు శ్రీవారికి శబ్దసారూప్యమే కనిపించింది. కాని, యీ విశేషణాలకు అర్థం లేకుండా అప్పారావుగారు వ్రాసియుండరు. లవణుడు వట్టి చవటరాజై వుంటే అతన్ని "దండి నృప" అనే అవసరం లేదు. "దండి" అనే మాటకు "గొప్ప" అనే అర్థంవుంది. అదే విధంగా చచ్చుబజారుగారడి అయి వుంటే, దాన్ని "గండు" అననక్కరలేదు. "గండు" అనే మాటకు "అసాధ్యము", "దుష్కరము" అనే అర్థం వుంది. కాబట్టి శ్రీ సీ. రా. విసిరిన రాయి తిరిగి వారికే తగులుతుంది. వారు ముందుగా ఒక నిర్ణయానికి వచ్చి తర్వాత బొక్కలు వెదికినవారే కాని, నిజమైన పండితునివలె నిష్కల్మష హృదయంతో యీ విషయాన్ని స్పృశించలేదు.

## "దేశభక్తి" సూత్రీకరణలు

దేశమును ప్రేమించుము; మంచిని పెంచుము; వంటి చిటిపొటి వాక్యాలలో "కవిత్వపు జీర" లేదన్నారు శ్రీ సీ. రా. కవిత్వమంటే శబ్దార్థాలంకారాల డాబు దర్పాలను కోరే వారికి యిందులో కవిత్వం కనిపించకపోవచ్చును. ఉదాత్తమైన వచనమే లయానుబద్ధమైనప్పుడు కవిత్వ మనిపించుకొంటుంది. "ప్రాగ్వ పశ్చిమ్మతంబున రసను నేయిగట్లు గొప్పది. నవకథాకృతిని మించి" .. యిందులో కవిత్వం కాదుగదా, వచనగుణంకూడ లేదు. అలంకారా లవసరమేలేదా? కథా కావ్యమైనప్పుడు, సందర్భం అనుకూలించినప్పుడు, భావాలు మహోజ్జ్వలంగా రేగినప్పుడు కవి అలంకారాల నాశ్ర

యిస్తాడు. అయినదానికీ కానిదానికీకూడ చమత్కరించబోడు.

"దేశభక్తి" గేయంలో మనకు కనిపించేది యీ శ్రవణ సుభగమైన ఉదాత్తపదవాహిని. అది కవిత్వం కాదంటే కవిత్వానికే చిన్నతంగాని దానికి కాదు. కల్లబొల్లి వ్యూహాలకు మీదుగా నిలిచి, అది ధర్మాన్ని నిర్దేశిస్తున్నది. ఇది కవిత కానప్పుడు భగవద్గీత కూడ కవిత యనిపించుకోదు. కల్పనా కావ్యాలకూ, ప్రబోధ కావ్యాలకూ విమర్శకులు అంతరం గ్రహించకపోవడం వల్లనే యిలాంటి ఆరోపణలు బయల్వెడలుతూ వున్నాయి. భీష్ముని రాజధర్మప్రబోధం, కృష్ణుని క్షత్రియోచిత ధర్మప్రబోధం, బైబిలులోని "టెన్ కమేండ్‌మెంట్స్" (Ten Commandments) ఈ ప్రబోధ కావ్యాల కోవకు చెందిన మేలి నమూనాలు. ఇవి "బడికి పొమ్మ", "వేకువనే నిదుర లెమ్మ" అనేవంటి సూత్రాల మట్టుకే వర్తించడం లేదు. అట్టి సూత్రీకరణలలో ఉదాత్తత లేదు. అవి నిత్యనైమిత్తిక కార్యకలాపాలకు సంబంధించినట్టివి. దేశభక్తి పేరిట గుడిగోపురాల శిథిలాలను, బూజును దుమ్మును, కొండలను బండలను ఆరాధించే మూర్ఖుల నుద్దేశించి, మెడత్రిప్పి, అట్టడుగునపడివున్న జనాన్ని చూపి, దేశమంటే యిదోయ్ అని చూపగలవాడు కవి కాకుంటే కాకపోయె కాని ద్రష్ట! కనులకు రంగుల తెరలంటించుకొని చూడక, అంతర్వాహినిగావున్న యథార్థాలను చూడగలిగి, దానిని పుట్టు గ్రుడ్డులకు చెప్పేవాడు కవి కాకుంటే కాకపోయె కాని ప్రవక్త!

కవికి సమాజాన గల స్థానం ఎట్టిది? కోకిలవలె ఆకు గుబురులో కూర్చుని, అభిమానాలు మొలకెత్తేటట్లుగా పాడడమా? కాదంటారు శ్రీ సి. రా. కవి సంఘములో అణగిమణగియుంటే ఆతనికి భావస్వాతంత్ర్యముండదట. సంఘాన్ని ధిక్కరించినపుడే భావస్వాతంత్ర్యం వుంటుందని కాబోలు! కాలగతిని, జనతా హృదిని గుర్తెరిగి, అందరిలో తానొకడై, అందరినీ కదిలించి క్రియోన్ముఖులను గావించేవాడే సత్కవి. భావస్వాతంత్ర్యానికి పరమాశయం యిదే కాని ఏటికి ఎదురీదే వికట వర్తనం కాదు. ఆకు లాగున కోకిల "కలిసి మెలిసి" కూస్తున్నదని అప్పారావుగారు ఎందుకు వ్రాయలేదు? ఆకులపచ్చని వన్నెలో నల్లని కోకిల కలిసి మెలిసియుండలేదు. "అణగిమణగి" యుండడంలో కోకిలకు న్యూనత లేదు. సమాజం తల్లి; తల్లికి బిడ్డ అణగిమణగియుంటేనేమి? దాని వ్యక్తిత్వం అణగిపోలేదు; కాని తగినంతకంటె ఎక్కువకూడ కాలేదు. మాటలో మాట— "కోకిల కొమ్మలో కూసిన నీవటే నన్ను పిచ్చితివంచు నవ్వవా మాని" అని "కవిసమ్రాట్టు"గారు సెలవిచ్చారు. 'కోకిల కొమ్మమీదినుండి కూయడం బోయి, కొమ్మ"లో" కూయడమేమిటి?' 'చెట్టు తొర్రలో కూర్చుంటుందా కోకిల? బెరడ క్రింద దాగుంటుందా?' అని సుగాకరు విపరీతార్థం తీయవచ్చును. అభిమానాలు మొలకెత్తించడానికి కాదు కవిత్వంవున్నది. రసానందాన్ని కలిగించడానికి, అంటున్నారు. శ్రీ సి. రా. రసనిష్పత్తియే కావ్యానికి గమ్యం కాదు - దానికి ఆవలనున్న గమ్యానికి అది సాధనమే గాని తదన్యం కాదు.

అయితే ఆ సమస్యేమిటి? దురభిమానాలను పోద్రోలి, మనస్సులను క్షాళనంచేసి మంచినీ మేల్మినీ విస్తృతమే, లోకశ్రేయస్సు కళలకు పరమాశయం. ఇదే కవ్యాత్మ. అందుకనే అప్పారావుగారు కవితాశాఖ నధిరోహించిన కోకిలస్వాములుగా పరిగణింపబడుతున్నారు. రసానంద ముతోబాటు ధర్మోపదేశముకూడ కావ్య ప్రయోజనములుగా పూర్వులు పేర్కొన్నారు. అప్పారావుగారు ప్రభుసమ్మిత ముగానో కాంతాసమ్మితముగానో ధర్మ ప్రబోధము చేయక, మిత్రసమ్మితముగా చేసినారు. ప్రభువువలె శాసించలేదు - భార్యవలెమురిపించి మాన్పించబూనలేదు - మిత్రునివలె లాభనష్టములనెత్తి చూపినారు.

## అనుకూల విమర్శనము : కువిమర్శనము

అప్పారావుగారిని విమర్శించేటప్పుడు ఆయన అభిప్రాయములకు "అనువుగా" విమర్శించవలెననేవారు "ఆధునిక సాహిత్యములో జరుగు భాషావ్యభిచారమును కప్పుకొనుటకు" ఈ సాకును చూపుతున్నారని శ్రీ సి. రా. అంటున్నారు. తాము రచయిత శక్తినే విమర్శించినారట. ఈ పరదూషణ, ఆత్మసమర్థనలలో నిజం ఎంత వంతు? భాషా "వ్యభిచారం" అని వీరు దేనినంటున్నారో అది భాషా సంపర్కమని మనం బోధపరచుకోవాలి. స్వదేశ విదేశ భాషలమీద మక్కువ వుండటం మంచిదే, ఆ మక్కువ యెక్కువైనప్పుడు అది తలతిక్కకు త్రోవతీస్తుంది. సంస్కృత సంపర్కంవలన, ద్రవిడ భాషల బాంధవ్యంవలన తెలుగు ఎంత సంపన్నమో అయింది. కాని సంస్కృత భాషాధిక్యతవలన కొంత దరిద్రంకూడ నాపురించింది. ఈనాటికీ గీర్వాణాన్ని మాపుతూ, ఆ విభక్తి ప్రత్యయాలను ఆ సమాసబాహుళ్యాన్ని, ఆ శబ్దరూపభేదాలను సాగదీసి సాగసుమాపి తెలుగుకు ప్రయాసతో తగిలించి, "మానభంగాన్ని" చేస్తున్న పెద్దలున్నారు. వ్యభిచారం యిరుపక్షాల ఒప్పందంమీద జరిగేపని; మానభంగం ఏకపక్ష చర్య; ఒకటి క్షణిక ఆనందాన్నైనా కలిగిస్తుంది; రెండోది ఏపక్షానికి సుఖమియ్యదు. ఆంగ్ల, తదితర భాషా సంపర్కంవలన తెలుగు దెబ్బతిన లేదు. కాబట్టి దీనిని కప్పుకోనవసరం ఎవ్వరికీ లేదు. అయినా అప్పారావుగారిపై వీరు చూపుతున్నా, ఈ కుంటిసాకునకూ సంబంధమేమిటి? రచనాశైథిల్యమని వీరు వ్రాస్తున్న సులభశైలి భాషాశైథిల్యానికి దారితీస్తుందని వీరి భయమేమో? గ్రాంథికమైన భాష ఏనాడో శిథిలమైంది. దాని నుద్ధరించే ప్రయత్నాలు కూడ జయించవు. ఇప్పుడు మనకవులు వాడుతున్న వ్యావహారిక భాష శిథిలమైన భాష కాదు. ప్రవాహానికి పాచిలేనట్లు దీనికి శైథిల్యంలేదు.

రచయిత అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని విమర్శ చేసినప్పుడే అది విమర్శ కాగలదు - లేనిచో కువిమర్శ, దూషణ కాగలదు. విమర్శకునికి ముఖ్యముగా వుండవలసింది సహిష్ణుత, సహృదయత. అవి లేనప్పుడు అలంకార శాస్త్రాలను వల్లెవేసినా, అరిగీ అరగని సూత్రాలను వెళ్ళగక్కినా ఫలితం సున్న.

"తనివి సనంగ వ్యాకృతియుఁ దక్కిన లక్షణ లక్ష్యముల్ పసం
బునఁ బెను జిడ్డుగట్టె, నెగఁబోసి యజీర్ణపు గాలి త్రేఁచుచుస్
మని యెడి నీకుఁ గావ్యరస మాధురి నాని యదార్థలోక సీ
మ నొక త్రుటిం గ్రమించి క్షణమాత్రము స్వర్గము చూఱగొట్టఁబో
లు నె? సరసాత్మకోకిలల లోపము చేసెను నీకు బ్రహ్మ! కా
దనియెదొ? సాటిలేని మధురామృతశీకరముల్ వెలార్చు మో
హన కవితాసుమంబులను నగ్గిగ గుత్తు వదేల? పుట్టుప
చ్చను దొలగింపనెంచి నవసారస నేత్ర కపోల ఫల్గుమున్
ఘనముగ గంధకార్గమునఁ గాల్చిన రీతిఁ బటంబునందు బొ
మ్మను గిలికించి నేత్రముల మాదిరి కన్పడునట్టు దబ్బనం
బునఁ దొగదిద్ది కన్నెఁగవపోఁడిమి చూడ్చుచు పోలిక కావ్యముం
గొని వివిధావయవంబులను గోసి కసాయి బజారు బెట్టెదో?..."
అని కవికోకిల (డు) నిసర్గకవులను వర్ణించినారు.

## కవి - ప్రతిభ

ప్రతిభ లేనిదో కవిలో ఎన్ని గుణము లున్నా భాసించవని శ్రీ సీ. రా. అంటున్నారు. ఇంతకు గురజాడను ప్రతిభాశూన్యునిగా ఆక్షేపించినారు. ప్రతిభ అంటే కొత్తకొత్త వస్తువులను నిర్మించే నేర్పు, కొత్త పోకడలను కల్పించే ప్రజ్ఞ, అన్నారు పెద్దలు. చమత్కారము కలిగించే కావ్యము యీ ప్రతిభ వల్లనే సాధ్యమౌతుంది. లోకోత్తరమైన చమత్కారం అంటే వైచిత్ర్యము, విచ్ఛిత్తి, చారుత్వము, సౌందర్యము, హృద్యత్వము, రమణీయత్వము అన్నారు. భావుకత్వము Imagination (ఇమేజినేషన్) అంటున్నారు. ఇది అప్పారావు గారిలో లోపించినట్లు శ్రీ సీ. రా. గారి ఊహ. పూర్ణమ్మ కథలోనూ, కన్యక కథలోనూ, లవణరాజు కలలోనూ వెల్లకొల్లగా యీ ప్రతిభ కనిపిస్తుంది. కాని "అణగిమణగి" కనిపిస్తుంది. ఇదే మిగత కవులకూ గురజాడకూ గల తేడా. ఆయన ప్రతిభ నిసర్గసుందరమైన వర్ణనలలోనూ, స్వాభావసంగతి భావ చిత్రణంలోనూ, పదాల పొందికలోను, మెరపు తీవవలె అంతలో మెరసి యింతలో మాయమయ్యే లోకోత్తర చమత్కారంలోను కనిపిస్తుంది.

## యుగపురుషుడా ?

ఆధునిక సాహిత్యానికి మార్గం కాదంటారు శ్రీ సీ. రా. లోగడ వ్యాసంలో ఆధునిక సాహిత్యంలో దేశిమార్గానికి మూలవిరాట్టు గురజాడ అని నేను వ్రాశాను. దేశంలో, అంటే జనంలో, వాడుకలో నుండిన పాటల బాణీలను, పలుకుబళ్ళను తీసికొని, వాటికి కావ్యగౌరవం కల్పించినాడు గురజాడ. ఈ కావ్యధోరణి ఆయనలో పరాకాష్ఠ అందుకోకపోయి వుండవచ్చును. ఆయన ముత్యాలసరాలు ప్రయోగదశలోనే నిలిచిపోయి వుండవచ్చు. ఆయన యింకొంచెం కాలం బ్రతికివుంటే, ఇంకా రసవత్తర రచనలు చేసివుండేవాడేమో! ఆయన జాతికిచ్చిపోయిన కావ్యాలు, వ్యాసాలు, నాట

కాని రచనలు చూస్తే యీ జాతి ఆయనకు ఎంత ఋణపడివుందో తెలుస్తుంది. మనుషులు మాట్లాడుకొనే మాటలకు మన్నన కల్పించడమే కాదు; మనుషులను మనుషులుగా తీర్చిదిద్దడం ఆయన ధ్యేయం. దీనికి కావ్యరచన ఒక సాధనం. ఆయన ముఖ్యంగా మహాపురుషుడు — ఆ మహాపురుషుడే కవి. అల్ప మనస్కులు మహాకవులు కాలేరు. గొప్ప తలపులే గొప్ప రచనలకు సోపానాలు. లోకబంధువువలె ప్రబోధిస్తూ, లోకగురువువలె మన్నించిన గురజాడ యుగకర్త కాకుంటే — ఉష్ట్రపక్షుల మనస్తత్వం కలిగినవారు, లోకానికి వికటంగా తోచేవారు కాగల్గుతారా? హెలెన్ గార్డనర్ వ్రాసిన "The Art of T. S. Eliot" అనే గ్రంథాన్ని సమీక్షిస్తూ, మహాకవి శ్రీ. శ్రీ. గారిలా వ్రాశారు: "అన్నిటికన్నా మిన్నగా మహాకవి అనిపించుకోగలవాడెవడంటే — ఎవడు తన కావ్యం రచించి ఉండకపోతే, ఆ తరువాత కవులు తాము రాస్తున్న రీతిగా రాయలేకపోయేవారో అతడే! ఉత్తరోత్తర కవులమీద తన ప్రభావం స్పష్టంగా ప్రసరించజేయగల వాడే మహాకవి. మహాకవి ఒక్కడే తన జాతిజనులు మాట్లాడుకొనే భాషకు ఇతఃపూర్వ మెరుగని విభ్రమస్ఫూర్తి ప్రసాదిస్తాడు."

కవిత్వానికీ, రసానికీ, వాక్యరచనకీ గల ఆనుకూల్యాన్ని పరికించి అప్పారావుగారే యిల్లా అన్నారు.

"రసం అట్టే లేని తలపులకు గద్య రచన తగి వుంటుంది. రసం చాలనిచోట పద్యరచన విరసం. అందుకుతోడు తలపులు తక్కువైతే వృత్తాలు నింపడం కోసం గంగిరెద్దు గుడ్డలు మెట్లు పడవలె. ఆ గుడ్డలైనా అందముగా అమర్చడం చేత కాకుంటే, మాటలుమాసి, అన్వయం చెడి, పద్యాలు టొంకర నడకలు నడిచి, కవిత్వం 'కపిత్వం' అవుతుంది."

అందుకనే ఆయన గంగిరెద్దు వేషాలకు పోక కపిగానాల్లక, పరిమితులకు లొంగి ఔచిత్యానికి లోబడి పద్యరచన చేశారు. వేషాలు మెచ్చే విమర్శకులకు యిందులో 'ప్రతిభ' కనిపించలేదు. వారికి కనిపించక పోయినంతమాత్రాన లేదనడం దుస్సాహసం. కొయ్యబొమ్మలలో కోమలత్వం కనిపిస్తుంది వీరికి; కోమలులలో పాషాణత్వం కనిపిస్తుంది.

## ఆలంకారిక సిద్ధాంతాలు — ఆధునిక రచనలు

ఈ కొసనుంచి ఆ కొసవరకు ఆలంకారికులను తోసిగేసి రచనలు చేసేవారు, చేసినవారు చాల కొద్దిమంది. ఏ పింగళి సూరనవంటి వారో ఒకరిద్దరు. ఆధునిక కవులలో బొత్తిగా లేరనే అనాలి. రస సిద్ధాంతాలు, ధ్వని సిద్ధాంతాలను గుర్తెరిగి వ్రాయని ఆధునిక రచనలను ఆ దృక్కోణాలనుంచి విమర్శించడం యుక్తమేనా? అదిన్నీగాక, యిలాంటి విమర్శకులకు లక్షణాలమీదనున్నంత భక్తిగాని, వానిని జీర్ణించుకోవడంలో తీసికొంటున్న శ్రమగాని, రచనలమీద పదోవంతుకూడ లేకపోతున్నది. శిలాశాసనాలవలె కాకున్నా, లోహకవచాలవలె యీ లక్షణ ప్రమాణాలు నిలిచిపోయాయి. కావ్య స్వభావమూ శరీరమూ యీ మితులకు మిక్కుటము కావడమో, లేదా సన్నగిల్లిపోవడమో జరిగింది. ఈ యినుప చొక్కాలు వదులు

# అనుభూతి

## "ప్రేమేంద్ర"

అప్పుడే పెద్దవర్షం కురిసి వెలిసింది. అయినా, ముత్యాల్లా యింకా చిన్నచిన్న తుంపర్లు పడుతూనే వున్నయ్. ఆకాశమంతా మేఘావృతమైవుంది. చెట్లమీద కాకులు ఆదేపనిగా అరుస్తున్నాయి. గాలి కూడా కాస్త జోరుగానే వీస్తోంది. పెద్దవర్షం మళ్ళీ ప్రారంభిస్తుందేమో ననిపిస్తోంది వాతావరణం.

దేవాలయ ప్రాంగణంలో ఓ మూల స్తంభానికి చేరబడి వున్న ఓ బక్కచిక్కిన వ్యక్తి, నిస్పృహతో చుట్టూ కలయచూసి, లేచి నించున్నాడు.

మాసినగడ్డం అతని మోహంలోని ఆవేదనను కప్పేస్తుంది. జుత్తు తైలసంస్కారం లేనట్టు చింపిరిగా వుంది. పైజామా, చొక్కా, వేసుకుని వున్నాడు. అవి బాగా నలిగిపోయి నల్లబడి వున్నయ్. ఈ అవతారంలో అతన్ని చూసి, వయసు చెప్పలేం కానీ, తీక్ష్ణంగా పరిశీలనగా చూస్తే పాతికేళ్ళుంటూ యేమో ననిపిస్తుంది.

అతని మొహం బాగా పీక్కుపోయి వుంది. కళ్ళుగుంటలు పడినట్లుగా లోతుకి పోయాయి. ఓ మారు కడుపు అరచేత్తో రాసుకున్నాడు. అదో విధంగా నవ్వుకున్నాడు. ఆ నవ్వులో నిస్పృహ సుస్పష్టంగా అగుపిస్తోంది.

'ఆకలి' అంటే అర్థం యేమిటో, యిప్పుడతనికి అవగాహనవుతోంది. ఆకలి మనిషిని యెంతగా కృంగదీస్తుందో బోధపడుతోంది. తన దగ్గర డబ్బున్నన్నాళ్ళూ ఆ అనుభూతిని తెలుసుకో లేకపోయాడు. వేల,లక్షలూ,ప్రజలు ఆకలితో మలమలమాడుతూ, కుస్తీపడుతూ, అర్ధమాన గడ్డి కరుస్తూ, యెలా బ్రతుకుల్ని యీడుస్తుంటారో వూహించుకుంటే సరికి అతనికి భయం ఆవరించింది. మనిషిగా జన్మించడమే పాపమేమో ననిపించింది. ఇన్నాళ్ళూ తనకి కడుపు నింపుకుందుకు 'సిరి' తప్పించి యింకేమున్నా కావాలి. మూడు రోజులయ్యింది గామోసు నోటితోనే ఆకలిని చంపుకుంటున్నాడు!

అప్రయత్నంగా అతని కళ్ళు ఆర్ద్రమయ్యాయి. 'ఆకలి'అని యెదుటివారిని అర్థించలేడు. మర్యాద, అభిమానం,

---

(27 వ పేజీ తరువాయి)

కావడమో బిర్రుకావడమో తప్పలేదు. పూర్వం గ్రీసుదేశాన ఒక కథ చెప్పుకొనే వారు. ఒక దుష్టు, తన యింటికి వచ్చిన వారిని ఒక లోహ శయ్యమీద పరుండబెట్టి, దానికంటె పొడవైనవాడైతే మంచానికి సరిపడేలాగు తెగగొట్టడమో, పొట్టివాడైతే కాలుజేతులు వూడివచ్చేటంతగా మంచానికి సరిపడేటట్లుగా గుంజి లాగడమో చేసేవాడట. మన "శాస్త్రీయ" విమర్శకులు యిలాంటి పనులు చేయరాదని, ఆధునిక సాహిత్య ప్రక్రియలపట్ల మరింత సానుభూతి చూపగలరని ప్రార్థించక తప్పడంలేదు.

అర్థిస్తున్నాయి. అందుకు ఫలితంగా మాడుతోంది కడుపు—

ఎవరో ఓ వ్యక్తి దేవాలయం నుండి తిరిగి పోతున్నాడు. అతని చేతిలో కొబ్బరి చెక్క వుంది. కనీసం అందులో చిన్నముక్కయినా లభిస్తే బావుండేది అనుకున్నాడు మనసులో. అతణ్ణి సమీపించాడు.

"ఏమండీ" మెల్లగా అన్నాడు.

ఆ వ్యక్తి కళ్ళల్లోకేసి చూసేసరికి ఆకలితో వుండే ఆ అబ్బాయికి కడుపు నిండిపోయినట్టయ్యింది. వీళ్ళనా దైవ భక్తులు! అనుకున్నాడు.

"ఏం కావాలి?" అన్నాడా పెద్ద మనిషి. ఆ స్వరంలో సున్నితం అగుపించనే లేదు.

అబ్బాయి అర్థించాడు. ఏ మనిషి అడగాలో ఒకింతైనా తట్టింది కాదు. ఆకలేస్తుందని అడగలేదు — అభిమానం చచ్చినంతుంది. మానవుడే యాచన అడగాలి? — అర్థించాడు. "ప్రసాదం కాస్త పెడతారా?" అన్నాడు.

ఆ వ్యక్తి అదోలా నవ్వేడు. ఆ నవ్వులో హేళన స్పష్టంగా అగుపిస్తోంది.

"పెడతాను... పెడతాను... ఎందుకు పెట్టనూ! పొరపాటు చేశాను. దేవుడికి సమర్పించినదాన్ని గాని, సన్యాసివున్నావని తెలిస్తే నీ ముందే నైవేద్యం పెట్టేవాణ్ణి. లేకపోతేనో ప్రసాదం కావాలట... అడ్డమైనవాళ్ళకోసమే అనుకున్నావా ఈ ప్రసాదం!" నవ్వుతూ అపహాస్యంగా అన్నాడు.

ఆ యువకుడు అవమానంతో, సిగ్గుతో కుంచించుకుపోయాడు.

"ఎందుకండీ అన్ని మాటలు! ప్రసాదం యిచ్చి అన్ని మాటలన్నా సహించి వుండేవాణ్ణి" వొస్తున్న వుక్రోషాన్ని బలవంతాన ఆపుకుంటూ అన్నాడు.

"అబ్బ! పౌరుషానికేం లోటులేదు. అంత పౌరుషమున్నవాడివి, సంపాయించడానికి యిలా సిగ్గుపడ్డావు నాయనా!" కటువుగా యెగతాళిగా అనేసి ముందుకు వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

ఆ యువకుడు అవమానంతో కృంగిపోయాడు. అతని మనస్సు సుళ్ళుతిప్పుతోంది. అప్రయత్నంగా పళ్ళు పటపట కొరుక్కున్నాడు. మనస్సు నపోయి, ఆ పెద్దమనిషిని పీక నులిమేయాలనిపించింది. కాని తొందరపాటు కూడదనుకొన్నాడు. తొందరపాటువల్ల మనిషి యెంతగా దిగజారిపోతాడో ఒకోక్క సమయంలో అతడికి బాగా తెలుసు... అనుభవంమీద నేర్చుకున్నాడు.

ఇక లాభంలేదు... ఆకలి తీరదు... పచ్చి మంచినీటితో కడుపు నింపుకోవటమే వుత్తమం... అనుకుంటూ ముందుకి సాగిపోయాడు యువకుడు. సమీపంలో వున్న నూతినీరు వుప్పగా వుంటుందని అతనికి తెలుసు. అందుకే కాస్తదూరంలో వున్న కుళాయి దగ్గరికి నడక సాగించాడు. అతనికి నిండుగా ఏడుపొస్తోంది. తను యెందుకీ సంకటపరిస్థితుల్లో వుండటం? తిన్నగా యింటికిపోతే?

ఈ ఆలోచన రెండురోజులనుంచి కలుగుతోంది. కాని అది యెంత తెలివి తక్కువ ఆలోచనో తరువాత గ్రహించుకొంటున్నాడు.

ఆలోచన మంచిదే! కాని — నడుచుకుంటూపోగలడా! అసంభవం... రైలు

ఛార్జీలకు డబ్బు?...అది గొప్ప సమస్య. ప్రపంచంలో అన్ని సమస్యలకంటె, డబ్బు సమస్య గొప్పది. ఆ సమస్యని యెదుర్కోవటం యింతకు ముందెప్పుడూ యెరుగడు ఆ యువకుడు.

నడుస్తున్నాడు మెల్లగా... అడుగులు పడ్డంలేదు. చిన్న చిన్న తుంపర్లు ఇంకా పడుతూనే వున్నాయి. కుళాయి దగ్గరికి వచ్చాడు. ఆసక్తిగా నీళ్లు తాగాడు. ఆకలిని అరికట్టేందుకు తను చేస్తున్న ప్రయత్నానికి అతనికే నవ్వొచ్చింది. అది బాధలో నవ్వు. అప్పటికదో తృప్తి!

గొడుగు వేసుకొని యెక్కణ్ణించో వొస్తున్నాడు వేణు. ఆరోజు ఆఫీసుకి సెలవు పెట్టాడు వూరికే. అప్రయత్నంగా అతని దృష్టి కుళాయిదగ్గర నీళ్ళు తాగుతున్న వ్యక్తిపై పడింది. ఆ యువకుణ్ణి అతనెప్పుడూ చూళ్లేదు. కాని అతని వేషం చూసి, మొహం చూసి, జాలి పడ్డాడు. అతణ్ణి పలకరించాలని బుద్ధి పుట్టింది.

లోకంలో మనుషులంతా ఒకే మోస్తరు వుండరు. అలావుంటే మంచీ, చెడూ, అన్న విభేదాలు అగుపించవు. పూర్తిగా మంచైనా, చెడయినా, యేదో ఒకటి నిలుస్తుంది.

ఆగాడు వేణు. ఆ యువకుడు నీరు తాగటం పూర్తిచేసి, చొక్కాతో మూతి, చేతులు, తుడుచుకొన్నాడు. ఆ తుడుచుకోవటంలో అసహ్యం నిండి వుందని పసిగట్టాడు వేణు. చప్పున వూహించాడు. ఆ అబ్బాయి సహజంగా బికారి కాడని. అది కేవలం, అతని వూహ మాత్రమే!

“ఏం అబ్బాయ్ ... నీ దేవూరు?” అన్నాడు వేణు అతనుదగ్గర పడుతుంటే. తనకంటె వయసులో చాలా చిన్నవాడుగా అగుపిస్తున్న వ్యక్తిని యేక వచనంలో సంబోధించడం తప్పు కాదనుకున్నాడు వేణు.

ఆ అబ్బాయి తెల్లబోయాడు. తననేనా, యితను సంబోధిస్తోంది? మనుష్యుల్లో యెన్ని రకాలవాళ్ళుంటారు? ప్రాధేయపడి ప్రసాదం పెట్టమని అడిగితే కసురుకునే వాళ్లు - స్వయంగా పలుకరించి ఆప్యాయత అగుపర్చేవాళ్ళు-యెంత చిత్రం?

“ఏ వూరవుతేనేం లెండి” అన్నాడు అబ్బాయి. అలా అన్నందుకు తర్వాత బాధపడ్డాడు. ఆప్యాయత కనబర్చే వ్యక్తికోసం యింతవరకూ యెదురుచూసి, తీరా, అలాంటి వ్యక్తి అగుపించేసరికి, తనకేమీ సహకారం అవసరం లేకున్నా బెట్టుగా మాట్లాడ్డం యేమిటని నొచ్చుకున్నాడు.

“ఫరవాలేదు చెప్పు... ఏ వూరు?” మళ్ళీ అన్నాడు వేణు నెమ్మదిగా.

“కాకినాడ దగ్గర ఓ వూరులెండి...”

“మరి, యిక్కడికి కెందుకొచ్చావు? నీ వైఖరి చూస్తుంటే, చదువుకున్నవాడిలా అగుపిస్తున్నావు...కుళాయి నీరు తాగి కడుపు నింపుకుంటున్నావా?”

ఆ అబ్బాయి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. “ఏం చెయ్యనండీ! పరిస్థితులు అలా వచ్చాయి” అని మాత్రం అనగలిగాడు.

ఆ అబ్బాయి జీవితంలో, ఆవేదన, అసంతృప్తి నిండివున్నాయని వూహించాడు వేణు.

"నీ పేరేమిటి?"

"సుబ్బారావు"

"ఆకలిగా వుంటే, యెవరింటికైనా వెళ్ళి భోజనం పెట్టమనలేక పోయావు?"

సుబ్బారావు ఒక్కమారు తన దుస్తుల వేపు చూసుకొన్నాడు. "ఈ వేషంతో వెళ్తే యెవరండీ అన్నం పెడతారు! అవమానపడ్డం తప్పించి" నిట్టూరుస్తూ అన్నాడు;

"ఈ స్థితికి యెలా వచ్చావు? ఎవరూ లేరా నీకు?" అన్నాను నేను.

బాధగా నిట్టూర్చాడు సుబ్బారావు. "అంతా వున్నారు...వాళ్ళేం చేస్తారండీ! నా తొందరపాటే నన్ను కృంగదీసింది"

కనులు చెమ్మగిల్లాయి. ఇక ఆ రోడ్డుమీద నిల్చొని మాట్లాడ్డం బాగుండదనుకున్నాను నేను.

"నా గొడుగులోకి రా అబ్బాయి... మా యింటికి పోదాం" అన్నాను.

సుబ్బారావు సంతోషంతో వుక్కిరిబిక్కిరయ్యాడు. ఆ వ్యక్తికీ తనకీ వున్న అనుబంధం యేమిటి? ఎంత ఆప్యాయత అగుపరుస్తున్నాడు!...అనుకుని అతని పక్కన చేరేందుకు సంశయించాడు.

నేను అది యిట్టే గ్రహించేశాడు. "అలా సంశయించటం మంచిది కాదు. నాకు అది యిష్టముండదు కూడాను...రా" అంటూ అతని భుజం పట్టుకుని తన పక్కకి లాగాడు. ఇద్దరూ కలిసి నడిచారు.

అంతవరకూ ఆకలిబాధతో అలమటించి పోయిన సుబ్బారావుకి నేను ఆప్యాయత, ఔదార్యం, కడుపునింపి వేశాయి.

ఇద్దరూ నేను యిల్లు చేరుకున్నారు. సుబ్బారావు స్నానం చేసేందుకు యేర్పాటు చేశాడు నేను. సుబ్బారావు స్నానం ముగించుకువచ్చాడు. తన యిస్త్రీ పైజమా, షర్టూ యిచ్చాడు తొడుక్కోమని.

సుబ్బారావుకిదేమీ బోధపడలేదు... తను కలగంటున్నానేమోనని భ్రమపడ్డాడు.

భోజనాలయ్యాయి. సుబ్బారావు తృప్తిగా భోంచేశాడు.

"మీ మేలు మర్చిపోలేనండీ" అని మాత్రం అనగలిగాడు యింకేవిధంగా చెప్పాలో అర్థం కాక.

"దానికేముందిలెండి ... నేనేమీ ఘనకార్యం చెయ్యలేదు. నిన్ను చూశాక యేమిటో నాకదోలాంటి అభిమానం పుట్టుకొచ్చింది. సరేగాని నువ్వు యిలా ఎందుకు మారావో చెప్పావు కాదు...నేనేమైనా సహాయం చెయ్యగలిగితే చెప్పు" అన్నాను నేను.

కాసేపు సుబ్బారావు మౌనంగా వుండిపోయాడు.

"అంతా నా తొందరపాటు వల్లనే జరిగిందండీ! మా తల్లిదండ్రులకు, నేనూ, మా అక్క, యిద్దరమే సంతానం. అక్కకి పెళ్ళయి పోయింది. నేను యింటరు చదువుతున్నాను. మేం బాగా డబ్బున్నవాళ్ళం కాకపోయినా, అవసరాలకు లోటులేని సంసారం మాది. మొదటినుంచీ స్వేచ్ఛకోసం ప్రయత్నించే వాణ్ణి. ఇంట్లోనూ, కాలేజీలోనూ, ఒక నియమబద్ధమైన జీవితం గడపటం, యేమిటో నాకు క్రమంగా కష్టమని పించింది. మా నాన్నగారికి నా అభిరుచు

లంటే తగని మంట. నన్ను చూస్తే చాలు- ఆయన రుసరుస లాడేవారు. అందుకే ఆయన ఓ ప్లాను వేశారు. నాకు పెళ్ళి చేసేస్తే నా పొగరంతా అణిగి పోతుందని అభిప్రాయపడ్డారు. ప్రయత్నించారు. చివరికి ఓ సంబంధాన్ని కూడా నిశ్చయపర్చారు. నేను ఆటంక పర్చినా, ఆయన వొప్పుకునే స్థితిలో లేరు. నేను తీవ్రంగా ఆలోచించాను. పెళ్ళి జరిగినట్టయితే, వూపిరి పీల్చుకుందు కూడా స్వేచ్ఛ వుండదనుకున్నాను. నా అభిప్రాయాలతో మా నాన్నకి పని లేదు. బలవంతంగా ముడివేయనుంటారు. ఇవన్నీ ఆలోచించి, కొంత డబ్బు పట్టుకుని పలాయన మయ్యాను...

"బొంబాయి, కలకత్తా, కటకం, పూరి తిరిగాను. పూరీనుండి తిరిగి వస్తుంటే, యెవరో నా సూట్ కేసు కొట్టేశారు. అందులోనే నా పర్సు, టిక్కెట్టు అన్నీ వున్నాయి. నా తలకింద పెట్టుకున్న సూట్ కేసుని యెలా కొట్టేశాడోనండీ మరి! టికెట్ కలెక్టరు యీ వూళ్లో దింపేశాడు; ఇప్పటికి నే నీ వూరు వచ్చి మూడురోజు లయ్యింది. అన్నం పెట్టమని యెవర్నీ అడగడానికి అభిమానం అడ్డొచ్చింది. ఈమూడురోజులూ మంచి నీళ్ళతోనే గడిపానంటే నమ్మండి. కోరి కష్టాలు తెచ్చుకున్నాను" అని ముగించాడు సుబ్బారావు.

"పోనీ, నాన్నగారికి టెలిగ్రామ్ యివ్వలేకపోయావా డబ్బు పంపమని" అన్నాడు వేణు.

"టెలిగ్రామ్ యిచ్చేందుకైనా డబ్బే దండీ! అదీకాక ఆయన పంపుతారన్న నమ్మకం కూడా నాకు లేదు."

"మరిప్పుడేం చేయదల్చావు?"

"అదే ఆలోచిస్తున్నాను. మీ ధర్మమా అంటూ, తెల్లటి దుస్తులు దొరికాయి కదండీ? ఇక అంతగా ప్రమాదం వుండదు. ఇప్పుడు నేను యేం చెప్పినా ప్రపంచం నమ్ముతుంది. మురికి దుస్తుల్లో వున్నప్పుడు కసురుకొనే మనుషులు తెల్లటి దుస్తుల్లో వుంటే ఆదరిస్తారు. వ్యక్తి ఒక్కడే! కాని, దుస్తులు మారాయి." నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

"నువ్విలా పంతంకొద్దీ వచ్చేశావుగాని, మీ నాన్నగారి మాట వినిపెట్టు. మీ అమ్మగారు యెంతగా కుమిలిపోతున్నారో యేమిటో వూహించావా?" అన్నాడు వేణు.

అప్పుడు సుబ్బారావుకి నిజంగా తృప్తి కలిగింది.

"పోనీండీ! ఏం చేస్తాను? ఆక్షణం అల్లాంటిది. అవన్నీ యోచించలేదు. అన్నట్టు యిప్పుడేమన్నా బండి వుందండీ కాకినాడపోయేది?" "ఇంకా వుంది... వెంటనే బైలుదేరు. ఆ... అన్నట్టు అధికమైతే నే నివ్వలేనుగానీ, టిక్కెట్టుకి సరిపడే డబ్బు యివ్వగలను... తీసుకెళ్లు."

సుబ్బారావు వింతగా అతని ముఖంలోకి చూశాడు. అతనికీ, తనకీ గల బాంధవ్యం యేమిటి? ఎంత నమ్మకం యేర్పడింది?

"మీ రింతవరకూ చేసిన సహాయం చాలక డబ్బు కూడా ఇవ్వదల్చుకొన్నారా? నేను పంపుతానన్న నమ్మకం వుందా?"

"మనుష్యుల్ని గుర్తించి సత్కారం యేర్పరుచుకొంటారు సాధారణంగా. సంపాదించకపోయినా ఫరవాలేదు. ఒక స్నేహితుడికి సహాయం చేశాననే తృప్తయినా వుంటుంది." నవ్వుతూ అని లోపలికి పోయి పదిరూపాయల నోటు తెచ్చి సుబ్బారావు చేతిలో పెట్టాడు.

కృతజ్ఞతతో అందుకున్న సుబ్బారావు కళ్ళు ఆర్ద్రమయ్యాయి.

"మీ మేలు మరచిపోలేనండీ!" అని మాత్రమే అనగలిగాడు. "వస్తానండీ" అంటూ నమస్కారం పెట్టి బయలుదేరాడు.

పెద్ద వర్షం వస్తుందని యేర్పరుచుకొన్న భావం యిప్పుడు లేదు. మేఘం అంతా పంచముక్కల్లా విడిపోయి, కరిగిపోయింది. స్వచ్ఛమైన వాతావరణం.

నేను సుబ్బారావుతో కొంత దూరం వెళ్ళి తిరిగి వచ్చాను. సుబ్బారావు తను మూడు రోజులు గడిపిన దేవాలయం దాటిపోతూ అదోలా నవ్వుకుని ముందుకు సాగిపోయాడు.

◆ ◆ ◆

సుబ్బారావు వెళ్ళిపోయిన నాలుగు రోజులకు నేనుకి మనియార్డరు వచ్చింది పది రూపాయలు. కూపనులో కృతజ్ఞత తెలుపుతూ యేమిటేమిటో రాశాడు సుబ్బారావు. అమ్మ ప్రస్తుతం కులాసాగానే వుందని రాశాడు. నేను నవ్వుకున్నాను. సుబ్బారావుకీ, తనకీ గల బాంధవ్యం యేమిటి? ఏముంది? సాటి మానవుడు!

★

*A Fine Collection of*

**Mahakavi Sri Sri's POEMS**

# THREE CHEERS FOR MAN

**Rendered for the first time into English.**

**Postage Extra**

**Rs. 2/-**

*Copies Available at :*

**Visalaandhra Publishing House,**

**VIJAYAWADA-2.**

# "శ్మశాన లక్ష్మి"

## పాఘర్

[అముద్రితంగా ఉన్న "మహాశ్మశాన" కావ్యంలోని భాగం ఇది. రచనా కాలం 1951. ఈ భాగంలో **శ్రీ శ్రీ** "కవితా" రాగం వినిపిస్తుంది. అంతే. అక్షరసామ్యం కానరాదు. వస్తుభావ విలయాలకూ అతీతమూ, కేవలభావానుబంధమూ అయిన కవితాస్ఫూర్తి వేగాలనే ఆకాంక్ష ఆయనకు లంకిస్తూ వచ్చారు. ఆ ప్రయత్నంలో సఫలమైనారు. దేశ ద్వైతం నిజ సామాన్యంలో ఇదొక పంక్తి మాత్రమే.]

— ప చ యు ఎ

"జగమంతా
కలగించే కదిలించే.
బిగిసే గర్భముష్టిలో
జగజ్జనం కాంక్షించే
మనిషీ! ఓ మనిషి!!
నీకోసం నీ నీ స్వాతికొరకో
ఎన్నో విధాల యుగయుగాల
పగడాల్లో
పాలుపోసి పెంచిన
నీ సంస్కృతీ జీవం
నిర్ణయ దందశూకం......
కుమిళ్ళనలిపోయిన నీ ఆశావృక్షం
మనసంచిన హృదయాన్ని మథియిస్తే
చూస్తున్నాను నన్నే ఆకాశాలు —
నీతో నేనూ చూస్తున్నాను
ఉన్నాడా! మానవుడెక్కడైనా అని.
ఎంతకు లేదీ ప్రశ్నకు సమాధానం
చిక్కుప్రశ్నల గణితం మనజీవితం.

♦ ♦ ♦

ఒక్కడ్నే
భువి నేనొక్కడినే యోచిస్తే.
సుందర ఆశల కోసం
నారకపు దోషల కొరకై
నే నొక్కడినే యోచిస్తే.
చీకటి గుహలో
అంతర్నేత్రం విప్పి
అనుకున్నాను...
నమ్మిన రోజులున్నై
నేనూ మానవుణ్ణేనని
నమ్మిన రోజులున్నై;
నమ్మకాల ఊయలలో శిశువున్న
పిల్లల్నే సేవించిన
నను ప్రార్థించిన యుగాలలో
నా జగతివి నీవేయని నమ్మిన
మంగళకుంభం విశీర్ణిస్తే.
హృదయం గర్భగుడిలో
మోగిన ఒకే ఘంట
ఎన్నోలోకకంఠాల

ఒకే ఒక మంట
వాయువులై విడిపో లేదా !
........................
జగతీ ! ప్రియ జగతీ !
నీ యీ మృద్భవనమ్మున
నమ్మిన నన్ను పులకరింపమనే
తల్లీ ! నిగిరావమ్మా !
ప్రగతికి నిగిరావమ్మా ! !
నీ స్ఫురణాలోని సూర్ద్వవం
అది నీ నాలోని సౌష్ఠవం
కరిగాయి – కలిసి మరిగాయి...
నాపై నీ దిష్టి మనుగడకై
శీతలవర్షం కురియుచున్న
కృత్రిమ మేఘా లావర్షించిన
పెనుసంద్రపుటల లాకర్షించిన
శోధనావర్తాలకు నేనే లోనై
సుహాసిని కంచుకం ధరించిన
పురాజగన్మాతకడ పట్టా నే
నా నిర్వ్యసం వేసంగా;
నాదే సమసన
రాజరికాలు మంత్రాంగాలు
తిరిగి తలెత్తుచున్న ప్రతిసరం
తల్లీ !
జగతీ ! జనప్రగతీ ! !
నీకై
నీ నిజరూపం కొరకై
చేసిన

ఈ అనంతాశాయుత హృదంత
రాళ హోమంలో
జీవులు మిగల లేదు
జీవం తరగలేదు......
నాయీ మథనంలో
జగత్ పితృచ్ఛత్రపు నీడల్లో
నేజారిన చీకటి కోణం;
మదిరాస్వాదన నృత్యోత్సాహ వేళలో
భంగపడిన
మనశ్ఛాయను సవధరించి
నను క్షమియించిన తల్లీ !
నా నడకిన దాపుల్లో
కోరిన కోర్కుల్లో
చెలరేగిన
సుడిగాలుల
బడబానల
సంసిద్ధశాహూతి
క్రాంతిభ్రాంతి విభ్రాంతి శాంతికై,
విజయ వీచీ నివహం మూగిన
ద్వంద్వ మహా సంయోగాన్తే తే
జలధి
మనలు గొన్న నా మనసేమో
ఏమేమో పలికింది......
భ్రమిత జనతాశోకం
నన్నభిషేకిస్తే,
ఒక్క విశీర్ణక్షణంలో
హృదిలో రేగిన
ప్రసూతి జ్వాలా దృశ్యం తల్లీ!

( మిగతా 36 వ పేజీలో )

# వంగసాహితి

## సంజీవదేవ్

విశ్వసాహితీ మహావృక్షానికి భారతీయ సాహిత్యం ఒక బ్రహ్మాండమైన శాఖ. ప్రాచీన యుగాల్లోనూ, మధ్యయుగంలోనూ కూడా. భారతదేశంలో అనేక భాషలు; ప్రతి భాషదీ ఒక గొప్ప సాహిత్యం. ప్రతి సాహిత్యానికీ కొన్ని ప్రత్యేక లక్షణాలు.

భారతదేశంలోని కొన్ని భాషల సాహిత్యాలు ప్రాచీనకాలంలో ఎక్కువ వికాసం చెందినయి. మరికొన్నిటివి ఆధునిక కాలంలో. వంగభాష ఆధునిక కాలంలో వికాసం చెందిన వాటిల్లో మొదటిది.

ఇతర భారతీయ భాషల కున్నంత అతి ప్రాచీన చరిత్ర వంగభాషకు లేదు. కారణం, వంగప్రాంతమే అసలు ఇతర ప్రాంతాలకంటే వయసులో చాల లేతది. సముద్రం వదలిన ఒండ్రు నేలమీద ఏర్పడ్డ ప్రాంతం వంగదేశం. అక్కడ మట్టితప్ప రాయీ రప్పా దొరకవు. నదులు తప్ప కొండలు అరుదు. అందుకే వంగదేశంలో మూర్తి శిల్పపు ప్రాచీన ఉదాహరణలు కాల్చిన మట్టిబొమ్మలు (Terra cotta) తప్ప శిలాప్రతిమలు తక్కువ. అతి ప్రాచీన చరిత్రలు గల దేశాలు ఆధునికంగా వెనకబడి వుండటం, ఆధునికంగా ముందున్న దేశాలు ప్రాచీనాన్నత్యంలో వెనకబడి వుండటం విచిత్రం.

వంగదేశపు సభ్యతా సంస్కృతులు వైదిక సాంస్కృతిక అంతర్భాగంలోనివి కావు. ఇందులో అనార్యమైన ఆదిమ వనవాసుల సంస్కృతి అధికం. ఇప్పటికీ వంగభాషలోని కొన్ని ప్రయోగాలు ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబానికి చెందినవిగా కనుపిస్తాయి. మొత్తం మీద సంస్కృతపదాలు ఎక్కువగా తీసుకొంటున్నా, వంగభాష ఎక్కువగా ఆర్యభాషకంటె అనార్యభాషని తోసి పోయింది.

ప్రసంగ భాషల్లో ప్రాచ్యభాష, వంగభాష, ఈ రెండూ ప్రాసే [illegible]

---

జగతీ! జనప్రగతీ! ప్రియ జగతీ!
నాలో
నీ రేఖల
వ్యాచ్ఛాఖలతో నిర్మించిన
సుందర రమణీయ మణీ దేహాగ్రం;
నీ మనసుల
సుడిగాలుల
విసురులతో నను ముసిరిన
ద్రవీభూత హృద్గోళాన్విరసధుని;
సజ్జన జనికై
నే కోరిన
అనాది మానవ మనోవనం తల్లీ!
ఇది
విశ్వమహాశ్మశాన శ్రీ —

వేరు– ఆ వ్రాసినదాన్ని ఉచ్చరించే పద్ధతివేరు. ఇంకా ఫ్రెంచిభాష కొంత నయం, హల్లుల్ని వదిలేసి ఉచ్చరించినా, అచ్చుల ఉచ్చారణలో అంతగా మార్పు గోచరించదు.

ఇక వంగభాషలో ఉచ్చారణ మొత్తం మారిపోతుంది. ఉదాహరణకు, 'లక్ష్మి' అని వ్రాసి 'లొఖ్ఖి' అని ఉచ్చరిస్తారు. 'పద్మ' అని వ్రాసి 'పొద్దొ' అని ఉచ్చరిస్తారు. ఇలాగే అకారాన్ని ఒకారాలుగా పలికీ, ఉన్న అక్షరాలన్నిటిని ఉచ్చరించకా, వంగభాషకో ప్రత్యేకమైన సహేతుకంకాని విచిత్రమైన ఉచ్చారణ అలవాటైపోయింది.

భాషా సంప్రదాయాలకు భావ పాకం పర్యాయాలకూ కొంత సంబంధం వుంటుంది. ఇలాంటి విలక్షణ భాషను మాట్లాడే వంగీయుల్లో ఒక విలక్షణ భావ స్రవంతి ప్రవహిస్తూ వచ్చింది. ఇలాంటి విలక్షణ భావాలున్నపుడు ఆ సాహిత్యం కూడ కొంత వైలక్షణ్యాన్ని కలిగివుండటంలో ఆశ్చర్యం ఏముంటుంది?

వంగ సాహిత్యంలోని ఆ విలక్షణత ఏమిటంటే ఒక్క మాటలో 'లాలిత్యం' అని చెప్పవచ్చు. పుష్కలమైన పండు నేల నిరాక పెరుగుతూ, స్త్రీని యిష్టదైవంగా ఆరాధిస్తూ, భాషలోని కఠినపదాల్ని కోమలంగా పలుకుతూ, కఠిన కఠోర పర్వతాల్ని కాక కదిలే కోమలనదుల్ని ప్రతినిత్యం చూస్తూ, కరుడుకట్టిన రాతిని చెక్కి కాక పుష్కలమైన మట్టిని సాగదీసి సుందర ప్రతిమల్ని రూపొందిస్తూ, కఠినమైన ఎముకల్ని, కలగని మాంసాన్ని కాక మెత్తని చేపల్ని ఆహారంగా తీసుకొంటూన్న వంగీయుల సాహిత్యంలో ప్రేమ, సౌకుమార్యం, ఐక్యానుసంధానం, లోకోత్తర సత్యాలపై అనురాగం ఇవి వుండి వుండటంలో ఆశ్చర్యంలేదు.

వంగభాష దీర్ఘకాలంగా పరివర్తన చెందుతూ ప్రస్తుత పరిణామాన్ని అందుకొన్నా, వంగ సాహిత్యం మాత్రం ఒక్కసారిగా వికసితరూపంలో పైకి వచ్చింది. ఇప్పటికి లభిస్తున్న మొదటి వంగ హస్తలిఖిత పుస్తకం "చర్యపదాలు" అనేదాన్ని క్రీ. శ. పదో శతాబ్దానికి చెందినట్లు తేల్చారు. ఈ గ్రంథం హిందూ బౌద్ధ సంప్రదాయాల ఒక మిశ్రమ పంథాకు చెందింది. భాషద్వారా భావాన్ని వ్యాసంగానికి తాకేలాగా వ్యక్తపరచటంలో ఈ కవులు ఎంతో ప్రగతిశీలురుగా గోచరిస్తారు. వీరిదొక అసంప్రదాయికమైన గుప్త విద్య. సంప్రదాయసిద్ధమైన మతాల్లోని వ్యర్థత్వాన్ని వీరు విమర్శించారు. వంగ సాహిత్యంలో ధారావాహికంగా వస్తూన్న మర్మవాదానికి (mysticism) ఇది నాంది. ఈ "చర్య పదాలు" జీవితానుభవంలోనుంచీ, మానసిక సాధనలోనుంచీ ఉద్భవించినవే కాని గతానుగతికమైన మతాల్లోనుంచి కాదు.

వంగ సాహిత్యంలో ఇలాంటి ఉజ్జ్వలమైన ప్రారంభం ప్రత్యక్షమైన తరువాత సుమారు మూడు శతాబ్దాలవరకు సాహిత్య సృష్టి ఏమీలేకుండా స్తంభించిపోయింది. ఇందుకు ప్రధాన కారణం వంగదేశాన్ని ముస్లిములు జయించటమే. కొత్త పరిపాలకుల పాలన సుస్థిరమై ప్రశాంత పరిస్థితులు నెలకొనేదాకా దేశంలోని సాంస్కృతిక కార్యాలు నిష్క్రియత్వాన్ని తాల్చటం అసహజం కాదు.

ఈ మార్పుతో సాహిత్యసృష్టికి ఇదివరకు వుంటూ వచ్చిన ప్రేరణ కాస్తా ఎండిపోయి మళ్ళీ నవ్య పరిస్థితులకు అనుగుణ్యమైన ప్రేరణ తలెత్తజొచ్చింది. ఈ సర్ధ కాలంలోనే జయదేవుడు తన సంస్కృత "గీతగోవిందం" రచించాడు క్రీ. శ. పన్నెండో శతాబ్దారంభంలో. ఈ నూతన రచన పదాల అందంలోనూ, గతుల సౌందర్యంలోనూ, భావాల మాధురిలోనూ, రసానుభూతిలోనూ ఒక నూతన జగత్తును సృష్టించింది. రాధాకృష్ణుల ప్రేమవిలాసాన్ని చిత్రిస్తూన్న ఈ "గీతగోవిందం" ఇంద్రియానుభూతానందం ఇంద్రియాతీతానందానికి చిహ్నం మాత్రమే అని సూచిస్తుందని; మానవాతీతానందం మానవుని ద్వారానే వ్యక్తమవుతుందని; అశరీరానందం శరీరం ద్వారానే ప్రస్ఫుటమవుతుందని.

మూడు శతాబ్దాల అనంతరం మళ్ళీ వంగసాహిత్యం ప్రత్యక్షం కాజొచ్చినప్పుడు ఆ సాహిత్యం త్రివేణిగా ప్రవహించజొచ్చింది. ఒకటి: వైష్ణవ గీతాల రూపంలో. ఇందులో చైతన్యప్రభుని భక్త్యావేశమూ, ఆయన జీవన లీలలకు సంబంధించిన సాహిత్యమూ ముఖ్యమైనవున్నాయి. రెండు; సంస్కృత కావ్యాలైన రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలకు వంగభాషలో అనువాదం. మూడు; "మంగళ కావ్యాలు". ఇవి ఇంతవరకూ పురాతన గ్రంథాలకు వెలపలగా వుంటూన్న నూతన దేవతల ప్రవేశాన్ని సూచించేవి.

జయదేవుని "గీత గోవిందం"తో ప్రారంభించిన ఈ వైష్ణవ భావప్రవంతి విద్యాపతి, చండీదాసుల ద్వారా ముందుకు కొనిపోబడింది; ఇది చైతన్యునకు ముందు కాలానాటి సంగతి. విద్యాపతి మిథిలలో ఆస్థానకవి; గొప్ప విద్వాంసుడు; సర్వతోముఖ ప్రతిభ గలవాడు. కేవలం ధార్మికతత్వం మాత్రమే గల ఆనాటి నగరంలో వున్న వైష్ణవ కవితలకు ఆయన అనేకరకాలైన చేర్పులు మార్పులు చేశాడు. తరువాతి వైష్ణవ కవితలన్నీ విద్యాపతి వాడిన కొత్త పద్ధతిలో భక్త్యావేశపు [illegible] ప్రధానంగా రచింపబడసాగినయి.

క్రీ. శ. పదునాలుగో శతాబ్దంలో చండీదాసు సాహిత్యం ప్రత్యక్షమైంది. నిజానికి వంగసాహిత్యం చండీదాసుతోనే ఆరంభమైందని చెప్పవలసి వుంటుంది. చండీదాసు ఒక గొప్ప ప్రేమికునిగా, ప్రేమ కవిగా వంగీయ గ్రామీణ జాతి హృదయాన్ని ప్రత్యక్షంగా [illegible]న్నాడు. ఆయనొక దేవాలయపు పూజారి. ప్రేమ రహస్యానికి నిజమైన అర్థాన్ని రామి అనే ఒక చాకలి వనితనుంచి తెలుసుకొన్నాడు. అందువల్ల ఆయన కులంనుంచి వెలివేయబడి దేశభ్రష్టుడై గానం చేసుకొంటూ జీవితాన్ని గడిపాడు. ఆయన గానాల్లో ఆయన వ్యక్తిత్వం అంతా రాధాకృష్ణుల ప్రేమలీలల గాథలలో ప్రతిఫలిస్తుంటే. చండీదాసు కూడా ఆ విధమైన వస్తువుని తీసుకొని [illegible] అల్లసాగాడు.

చండీదాసుని "రాధ" ప్రణయసుఖాల్లో [illegible]గా ఆనందాన్ని పొందే రాధ కాదు. ఆమె పరిణతి చెందిన వనిత; ఆమె తన ప్రేమను గురించి సర్వసుఖాల్ని త్యజిస్తుంది; సంసారంలో తన స్థానాన్ని లెక్కచేయదు; తన కీర్తిని

సుర్యోదయమా, సర్వస్వాన్ని ప్రేమ నిమిత్తం స్వాహా చేస్తుంది. కాని ఏం ప్రయోజనం? చివరకు ఆమె ప్రియుడు ఆమెను నిరాశ పరుస్తాడు.

"ఎవరంటారు ప్రేమ సుందరమని?
నేను సుఖపడతానని ప్రేమించాను.
కాని నా జీవితమంతా విలపిస్తూనే వున్నా."

ఇది ఆమె యొక్క విషాదగీతి. అయితే చండీదాసు శాశ్వతమైన భావైక్యంలో ప్రేమ ప్రేమికుల్ని సమైక్యపరుస్తాడు.

రాధాకృష్ణులను చండీదాసు ఆదర్శ ప్రేమికులుగా చిత్రించినా, వారికి దైవత్వాన్ని ఆపాదించలేదు; వారిని కేవలం మానవమాత్రులుగానే మనకు చిత్రించి సాక్షాత్కరింపజేశాడు. స్త్రీగా పురుషుడిగా చండీదాసు దైవసంభూతులు కాదు, 'సహజియా' ... . వంగ దేశంలో వైష్ణవుల్లో 'సహజ' అనే పేరుగల గుప్త సాధనకు సంబంధించిన ఒక పంథా వుండేది; ఇదొక రకమైన రహస్య సాధనా మార్గం. ఇదొక వైరాగి సంప్రదాయాలనూ, దీనికి సంబంధాలుండేవి, దీని అనుయాయులు నమ్ముతూ వుండేవారు. స్వచ్ఛమైన నిస్వార్థమైన వైరాగ్య ప్రేమ సాధనలో అనుభవించవచ్చు. ఆధ్యాత్మిక సాధనలో స్త్రీ పురుషులు సన్నిహిత మిత్రులు; ఇందుమూలంగానే ఉత్కృష్ట ఆధ్యాత్మిక సామాన్యాన్ని అలవరచుకో వచ్చునని వీరి విశ్వాసం.

"వినండి సోదరులారా,
మానవుడే పరమసత్యం
మానవుడికి మించిన సత్యమూ లేదు."

ఈ విధంగా చండీదాసు మానవుని మహిమను గానం చేశాడు. వంగ సాహిత్యంలో చండీదాసు పదావళి ఎంతో పేరుపొంది ప్రజాభిమానాన్ని చూరగొన్నది. చండీదాసుతో సమానంగా విద్యాపతి కూడా వంగ సాహిత్యంలో అమరకవిగా నిలిచిపోయాడు.

ఇక క్రీ. శ. 1486 లో శ్రీ చైతన్యుడి జననంతో వైష్ణవయుగాల వంగీయుల జీవితంలోనూ సాహిత్యంలోనూ కూడా ఒక అద్భుత నవ్యచైతన్యం ఆవిర్భవించింది. వంగీయులు నూతనోత్సాహపూరితులై, ప్రేమ సందేశాన్ని, విశ్వకాంతిగా ఇంటింటా ... . ఎంతోమంది నిరీశ్వరవాదులైన ... ల్ని, ... అనంతమైన అనురాగ ... లో ముంచెత్తివేశాడు చైతన్యుడు. ఈ నూతన చైతన్యం మానవునిలోని ... ఆనందాన్ని, బాధల్ని, వ్యథల్ని, ఈర్ష్యల్ని, ద్వేషాల్ని, కులతత్వాల్ని ... భావాల్ని సమూలంగా నశింపజేసి మానవుడికి ప్రేమానందాన్ని ప్రసాదించింది. ఈ నూతన భావధార వంగ సాహిత్యానికి నూతనోత్సాహాన్ని చేకూర్చింది. వైష్ణవ సాహిత్యం వంగదేశంలో ఈ కాలంలోనే శిఖరాగ్రాన్నందుకొంది.

ఆనాటి వైష్ణవ ధర్మం నేటికీ ప్రత్యక్షంగా వంగీయుల జీవనవిధానంలో ప్రత్యక్షమవుతుంది. ఎందరో వైష్ణవ భక్తులు తమ కీర్తనల ద్వారా ప్రేమ ధర్మాన్ని కురిపించారు. ఇలాంటి కవులు సృష్టించిన ఈ వైష్ణవ గీతాలు "పదావళీ" అనే పేరుతో ప్రసిద్ధిగాంచినాయి. వీరిలో చండీదాసు, జ్ఞానదాసు, గోవిందదాసు, బలరాందాసు, నరోత్తమదాసు, రాయశేఖర్ అనే వారు ముఖ్యులు. వీరి గీతాలు మాటలతో నిర్మించినవి కావు. తమ

హ్యత్కులల వర్ణాన్ని పెరికి వాటితో నిర్మించినవి మాత్రమే.

చైతన్యుడి జీవితచరిత్రను చిత్రిస్తూ ఎంతో రసవంతమైన సాహిత్యం వెలిగిపోయింది. చైతన్య జీవితచరిత్రల్లో ప్రధానంగా ఎన్నతగినది కృష్ణదాస కవిరాజ అనే ఆయన రచించిన “చైతన్య చరితామృతం” అనేది.

అటు తరువాతి వంగ సాహిత్యంలో ప్రధానమైనవి కృత్తివాసు రచించిన “రామాయణం”, కాశీరాందాసు రచించిన “మహాభారతం”. భారతదేశపు ఇతర ప్రాంతీయ సాహిత్యాల్లో మాదిరే ఈ రామాయణ మహాభారతాలు సంస్కృత మాతృకలకు పూర్తిగా అనువాదాలు కావు. వీటిల్లో కవయిత్రుల స్వతంత్ర సృష్టి ఎంతగానో గోచరిస్తుంది. ప్రధాన ఘట్టాల్ని, పాత్రల సృష్టిని కూడా వారు స్వంత పద్ధతుల్లో పరివర్తన పరిచారు. ముఖ్యంగా వీటిల్లోకూడా చైతన్య భావకాంతులు విరివిగా కనిపిస్తూనే వుంటయి.

మొత్తంమీద వంగ సాహిత్యంలో ఈ “కృత్తివాస రామాయణమూ,” “కాశీరాందాసు మహాభారతమూ” ప్రత్యేక స్థానాన్ని కలిగి వంగ సాహిత్య చరిత్రలో మైలు రాళ్లుగా నిలిచివున్నాయి. వీరుభయులూ వీటిల్లో ప్రదర్శించిన శైలీ, వర్ణనా, ఉపమాన ఉపమేయాలూ, అన్నిటికంటే మించి చూపిన ఉదాత్త భావాలూ ప్రశంసనీయం.

వంగ సాహిత్యంలో “మంగళ కావ్యాలు” అనబడేవి కొన్ని అనార్య ఐతిహ్యాలను ఆర్య సంప్రదాయంలోకి చొప్పిస్తూ ఐక్యపరచిన గాథలు. వీటిలో ముఖ్యం “ధర్మమంగళ”, “మానసమంగళ” “చండీమంగళ” అనే మూడు. వీటిల్లో “చర్యపదాల”లోని తత్త్వచర్చగాని, వైష్ణవ పదావళిలోని ఆధ్యాత్మికానుభూతిగాని [illegible], నాటి వంగయుల నిత్యజీవితంలోని కొన్ని అనుష్ఠానాల్ని, ఐహికాభ్యుదయం కోసం వారు మ్రొక్కిన చిల్లర దేవతలను గురించిన గాథల్ని, గృహ చిత్రాల్ని, సవతుల కలహాల్ని, పొరుగువారిపై ద్వేషాల్ని, వ్యాపారాల్ని, వస్తు వినిమయం కోసం సాగించిన సముద్రయానాల్ని మొదలైన ఎన్నో నిత్యజీవితానికి సంబంధించిన ఘట్టాల్ని బహు వాస్తవ రీతిలో చిత్రించినాయి.

ఆనాటి కొన్ని కవ్యాల్లో “చండీమంగళ” రచయిత అయిన ముకుందరామ గానాల ప్రసిద్ధి చెందాయి. “మానస మంగళ”లో మనసాదేవి అనబడే సర్పదేవత యొక్క మహిమను గురించిన గాథ కావ్యాల ప్రసిద్ధి చెందింది. ఇవన్నీ క్రమేణ శాస్త్రీయ సాహిత్యంలోకి ద్వారా దారి తీస్తూ వచ్చినయి. వైష్ణవ సాహిత్యానికీ, శాస్త్రీయ సాహిత్యానికీ మధ్యలో నిలిచినయి ఈ “మంగళ కావ్యాలు”. ఇవి కొంతవరకు జానపద సాహిత్యంలోకి వస్తయి.

నాటి వంగ జానపద సాహిత్యంలో “మైమనసింహా గీతాలు” అనేవి ఎంతో ఉన్నతస్థాయికి చెందినయి. ఇంగను లో సంప్రదాయ బద్ధం కాని స్వేచ్ఛాప్రియ సంఘంలోని ఆలాపాల్లో, ప్రణయ గాథలూ మొదలైనవన్నో రసవంతంగా పాటల్లో రచింపబడి వున్నాయి. వీటిల్లో సరససాకారాలైన హాస్యోక్తులూ, అనురాగ ప్రలాపాలూ మొదలైనవి విరివిగా గోచరిస్తయి.

# జీవన చిత్రం

## చక్రవర్తి రంగస్వామి

పూలరోజులు గడిచిపోయి
జీవితం దీర్ఘనిశిలా తోచి
గతస్మృతి తెమ్మెరలు కూర్చుకొని
కూర్చునేవాణ్ణి !
కన్నీరు అలుముకొని
నల్లని కారుచీకటి మబ్బులు
కొండలు కొండలుగా
ముంచుక వచ్చేవి ! !

ఒక రోజు
భయంకర ప్రళయం –
ఘోషల సందడి –
దూసిన కత్తిలా వుంది ప్రకృతి !

పెద్దపెద్ద చెట్లు
అటూ ఇటూ ఊగి
నేల కొరిగిపోయాయి
మహా వీరుల్లా !

ఇళ్ళ కప్పులు ఎగిరిపోయాయి ఆకుల్లా
అంతరిక్షానికి !

గూళ్లు కూలిపోయాయి
పాతాళానికి !

ఒకరోజు గాలీవాన !
మెరుపులు ఉరుములు పిడుగులు ! !

రాళ్ళు దొర్లి జలప్రవాహంలో
కొట్టుకపోయాయి !
నేనూ బయటికి దూకి
గాలిలో మెలికలు తిరిగిపోయాను !

పచ్చి కోపం తగ్గి
విరిగిన మహా వృక్షాలను
హత్తుక్కుకొచ్చింది ప్రకృతి !

మబ్బులు విచ్చి సూర్యుడు
ప్రసన్నుడై నవ్వి కనిపించాడు !

గరిక మొక్క నవ్వుతూ
నవ్య జీవనోత్సాహానంద నృత్యం
మొదలుపెట్టింది !

తల్లి తన పచ్చని డొక్కలోకి
గండం గడచిన బిడ్డను పొదువుకొంటోంది
మృదువుగా !

విరిగిన కొమ్మలకున్న మొగ్గలు
విచ్చి చూడసాగాయి !

పసిపిల్లలు పడవ ఆటల్లో
మునిగిపోయారు !

తడిసి కలకల్లాడుతున్న
వసుంధరమీద
అందమైన హంసల్లా
స్త్రీలు నడక సాగించారు !
తలలు వంచి ఎవరి పనులు వాళ్లు
చూచుకోటం మొదలుపెట్టారు !

ఏమీ ఎరుగని కడిగిన ముత్యంలా
కనిపించింది ప్రకృతి !
"నా గతస్మృతి తుట్టెల్లా తేలూ
అలా గాలిలో ఎగిరి, నీళ్ళలో పడి
కొట్టుకుపోలేదేమో !" అని
సణుక్కుంటూ వొళ్ళు విరుచుకొని
లేచి బయలుదేరాను !



# అనువాద సాహిత్యం

## కొడవటిగంటి కుటుంబరావు

రెండవ ప్రపంచయుద్ధం తరవాత ప్రపంచమంతటా పుస్తక ప్రచురణ విరివిగా సాగుతున్నట్టు కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం ఆ ప్రపంచ యుద్ధం ప్రపంచ ప్రజలలో తెచ్చిపెట్టిన చైతన్యమే ననటానికి ఎటువంటి సందేహమూ లేదు. పరిమిత జీవితంనుంచి కలిగే అనుభవంతో తృప్తిపడనివారికీ, ప్రపంచ జ్ఞానం సంపాదించాలనే ఆసక్తి కలవారికీ ఇతర దేశాలలోనూ, సమాజాలలోనూ కలిగే మార్పులు మన జీవిత విధానాలను మారుస్తాయని గుర్తించిన వారికీ పుస్తకాల విలువ తెలుస్తుంది; వారు దేశదేశాల పుస్తకాలు చదవగోరుతారు.

అందుకనే ప్రతి భాషలోనూ బోలెడంత సాహిత్యం వెలువడ్డమే గాక అనువాద సాహిత్యంకూడా పెరుగుతున్నది. అనువాద సాహిత్యం చదవటమూ, దాన్ని ఆదరించటమూ బానిస బుద్ధిని సూచిస్తుందనుకునేవారు ఈనాడు తగ్గిపోతున్నారు. ఏమైనా ఇది సరిఅయిన భావం కాదు. మంచి అనువాద సాహిత్యం పాఠకుల దృక్పథాన్నే గాక, రచయితల దృక్పథాన్నికూడా విశాలం చేస్తుంది.

సోషలిస్టు దేశాలలో పుస్తకాల విజృంభణ గమనించదగిన విషయం. రష్యాలో అనువాద సాహిత్యం చాలా విరివిగా వెలువడుతున్నది. ఇప్పుడు తూర్పు జర్మనీ రచయితల ప్రతినిధులు మన దేశం పర్యటించి, వివిధ భారతీయ భాషలలో, వెలువడే ఉత్తమ సాహిత్యాన్ని తూర్పు జర్మనీలో ప్రచురించటానికీ, తూర్పు జర్మనీలో వెలువడే పుస్తకాలలో సాధ్యమైనన్ని మన దేశ భాషలలో అనువాదం అయేటట్టు చూడటానికీ ప్రయత్నాలు చేస్తున్నారు.

కాని శోచనీయమైన విషయమేమిటంటే ప్రస్తుతం మన దేశ భాషలలో - ముఖ్యంగా తెలుగులో - వివిధ దేశాల సాహిత్యం అనువదించి ప్రచురించటానికి సరిఅయిన పరిస్థితులు లేవు.

మొదటి చిక్కు భాషకు సంబంధించినది. అనువాదం చేసే వాడికి రెండు భాషలతోనూ మంచి పరిచయం ఉండాలి. సొంతభాషలో బాగా రచించే సామర్థ్యం కూడా ఉండాలి. తెలుగులోకి బెంగాలీ సాహిత్యం చాలాకాలం క్రితమే అనువదించబడింది. బంకిం, ఠాగూర్, శరత్ మొదలైనవారి రచనలు తెలుగులో వెలువడ్డాయి. వీటిలోకొన్ని బెంగాలీ భాషనుంచి ఆభాష తెలిసినవారు నేరుగా అనువదించినవే. అయినా ఆ అనువాదకులు తెలుగుభాషలో చక్కగా రాయలేకపోయినప్పుడు అనువాదాలు రాణించలేదు. మరి కొందరు బెంగాలీ సాహిత్యాన్ని హిందీ తర్జుమాల ద్వారానో, ఇంగ్లీషు తర్జుమాలద్వారానో తెలుగులోకి అనువదించారు. ఇది కూడా ఆశించినంత విజయవంతం కాలేదు. సాహిత్యం అచ్చంగా భాషే కాదు. అందులో

జాతీయతా, సంప్రదాయాలూ కూడా ఉంటాయి. అనువాదకుడు వాటిని కూడా శ్రద్ధపడి అనువదిస్తేనే అనువాదం ఫలప్రదమవుతుంది.

ఇతర దేశాల సాహిత్యం అనువాదించటానికి ప్రస్తుతం ఇంగ్లీషు ప్రధాన సాధనంగా వున్నది. ఇంగ్లీషు భాష్యమా అంటూ మన భాషల్లోకి కొన్ని ఇతర దేశాల పుస్తకాలు దిగాయి. అయితే ఇవి నిర్దుష్టమైన తర్జుమాలనీ, ఈ పుస్తకాలను ఇంగ్లీషు తర్జుమా చేయనవసరంలేదనీ అనువాదకులు సయితం అనుకునే అవకాశంలేదు. విదేశీయుల పేర్లుకూడా ఎలా ఉచ్చరించాలో మనకు తెలీదు. కొన్ని ఫ్రెంచ్, జర్మన్, చైనీయుల పేర్లు తెలిసినా తెలుగు భాషలో రాయటం బహుకష్టం. పేర్లలో పేరొకొన్న జాతీయ సంప్రదాయాలను చిత్రించటంలో అనువాదకుడు చేసే పొరపాట్లు అనువాదాన్ని చాలా పాడుచేస్తాయి.

ప్రసిద్ధ రచయితా, విద్వాంసుడూ అయిన ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ మన దేశం వచ్చినప్పుడు అనువాదాలు అసలు భాషనుంచే జరగటం వాంఛనీయమన్న అభిప్రాయం వెలిబుచ్చాడు. ప్రస్తుతం మన విశ్వవిద్యాలయాలలో విదేశభాషలు నేర్చుకునే విద్యార్థులు చాలామంది ఉంటున్నారు. వీరిలోనుంచి భావి అనువాదకులు రావటం ఎంతైనా వాంఛనీయం.

అనువాద సాహిత్యం కేవలం అనువాదకులమీదనే ఆధారపడిలేదు. ప్రచురణకులమీదకూడా ఆధారపడి వున్నది. అనువదించదగిన పుస్తకాలు మంచివిగా ఏరుకుని వాటిని సమర్థులైన అనువాదకులచేత తర్జుమా చేయించుకోవటం పుస్తక ప్రచురణ సంస్థలపని. వీరిదక్షతపై మనకు లభ్యమయ్యే అనువాద సాహిత్యం ఆధారపడుతుంది.

ప్రస్తుతం అనువాద సాహిత్యం ప్రచురించటంలో ఏర్పడుతున్న సమస్యలు చాలా క్లిష్టమైనవి. అందులో కొన్ని ఒకంతట పరిష్కారమయ్యేవి కావు.

మొదటి సంగతి, అనువాదాలు చెయ్యటంలో నిపుణులైన సమర్థులు బహుతక్కువ. నిజానికి అనువాదాలు చేసేవాడు సొంతాన సాహిత్యం సృష్టించేవాడు కానవసరంలేదు. మాతృభాషలో ఎటువంటి భావాలనైనా సులువుగా చెప్పగల సామర్థ్యం ఉన్నవాడైతే చాలు. కాని ఆపాటి సామర్థ్యం ఉన్నవాళ్ళు సొంతాన రాస్తూనే ఉండటంచేత అనువాదకులందరూ స్వభాషలో సాహిత్యం సృష్టించేవారే అవుతున్నారు.

ఇటువంటి రచయితలైనా అనువాదాలు చెయ్యబూనుకోవటానికి తగిన ప్రోత్సాహం లేకపోవటానికి కారణం ఏమంటే, ప్రచురణాలయాలు అనువాదాలకు చాలా తక్కువ ముట్టచెబుతాయి. సొంత రచనలకన్న అనువాదాలకు తక్కువ సొమ్ము ఇవ్వటంలో అర్థం ఉన్నట్టు కనబడదు. నేను సొంతంగా రాశాను. అనువాదాలు చేశాను. నా అనుభవంలో సొంత రచనకన్న అనువాదం నాలుగింతలు కష్టం. పరభాషలో నేను చదివిన పుస్తకంపైన నా కెంతో ఆదరం ఏర్పడితేనే గాని నేను దాన్ని అనువదించటానికి పూనుకోను. మిగిలిన అనువాదకులైనా అంతే కావచ్చు.

ఈ విధంగా ఒకవంక అనువాదకులు అభిమానంకొద్దీ అనువాద సాహిత్యం తయారు చేస్తుంటే వారి ఫలితానికి సరి అయిన ప్రతిఫలం ఇవ్వక ప్రచురణ సంస్థలు అనువాద సాహిత్యంపట్ల అనాదర భావం చూపిస్తున్నాయి.

అనువాదకులకు తగినంత సొమ్మిచ్చినట్లయితే కొందరు సిద్ధహస్తులైన అనువాదకులు అనువాద సాహిత్యం తయారు చెయ్యటం తమ వృత్తిగా పెట్టుకుని దానిపై సుఖంగా బతకవచ్చు. అలాంటి అనువాదకులను పోషించే ప్రచురణ సంస్థలు బోలెడంత అనువాద సాహిత్యాన్ని కూడా పెంచవచ్చు.

కొన్ని విదేశీ గ్రంథాలు - ముఖ్యంగా పాశ్చాత్య గ్రంథాలు - చాలా పెద్దవిగా ఉంటాయి. ఉదాహరణకు లెవ్ టాల్‌స్టాయ్ రాసిన "వార్ అండ్ పీస్" ఇటువంటి గ్రంథాలను యథాతథంగా తెలుగులోకి దించాలంటే అనువాదకుడికీ, ప్రచురాకులకు కూడా నీరసం వచ్చేస్తుంది. మన పాఠకులు అంతేసి పుస్తకాలు చదవటానికి అలవాటుపడి లేరు. ఉన్నది ఉన్నట్టు దించితే గ్రంథం పెరుగుతుంది. దానితోబాటు ఖరీదూ పెరుగుతుంది. ఈ కారణాలన్నిటిని బట్టి మనవాళ్ళు సంక్షిప్త అనువాదాలు ప్రచురిస్తున్నారు. ఇలాటి సంక్షిప్త అనువాదాలు ప్రచారాన్ని పొందాయి కూడా.

ఈ విధంగా సంక్షిప్త అనువాదాలు ప్రచురించటం నా బుద్ధికి ప్రస్తుతం సమర్థనీయంగానే కనబడుతున్నది. ఇవి ప్రమాణమైన అనువాదాలు కాకపోవచ్చు; ప్రమాణమైన అనువాదాలు వెలువడేదాకా వీటితో పని గడుపుకోవటంలో తప్పేమీ లేదు. ప్రమాణమైన అనువాదాలు వచ్చాయని పించుకోవటం కన్న వర్తమాన విదేశీ సాహిత్యాన్ని సంగ్రహానువాద రూపంలో ప్రజల కందించటం ఎక్కువ ముఖ్యంగా కనిపిస్తుంది.

అయితే పూర్వ గ్రంథాల (క్లాసిక్స్) అనువాదాలు సాధ్యమైనంత వరకు ప్రమాణంగా వుండేటట్టు చూడడమే శ్రేయస్కరం. ఈ పనికి వ్యాపార సంస్థలు పూనుకోవటంకంటె సాహిత్య పరిషత్తులు పూనుకోవటం మంచిది.

కొందరు కొందరు విదేశీ సాహిత్యాన్ని తర్జుమా చేస్తూ పాత్రల పేర్లూ, కథయొక్క వాతావరణమూ మనదేశానికి అనుగుణంగా పరివర్తింపచేస్తున్నారు. ఇలా సృష్టించిన అనువాద సాహిత్యం స్త్రీలకూ, పిల్లలకూ బాగుండవచ్చు - నేను నా చిన్నతనంలో ఇలాంటి అనువాదాలు చదివి ఎంతో తృప్తి పడ్డాను! కాని ఈ పద్ధతి ప్రోత్సహించ దగినది కాదు. పేరు ప్రఖ్యాతులుగల ప్రముఖులు అనుసరించదగినది కూడా కాదు.

అనువాద సాహిత్యం సృష్టించేవారూ ప్రచురించేవారూ కూడా కేవలం తమ అభిరుచులను మాత్రమే అనుసరించక మాతృకకు సాహిత్యంలో లభించిన ఉన్నత స్థానాన్ని కూడా పాటించటం మంచిది.

*

# భక్తకవి : అన్నమాచార్యుడు

ద్వారం భావనారాయణరావు

ఇప్పటికి సుమారు ఐదువందల సంవత్సరములకు పూర్వం అన్నమయ్య అనే ఒక మహాభక్తుడు ఆంధ్రదేశంలో అవతరించాడు. మహామహిమాన్వితుడైన అతనికి 16వ యేటనే శ్రీ వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరించి సంకీర్తన రచనాశక్తి ననుగ్రహించాడట. నాటినుండి దివ్యధామము చేరుకునే వరకు అన్నమయ్య చేసిన సంకీర్తనములు ముప్పదిరెండు వేలు. కావ్యమై పాడటానికి అపురూపగానమై నిలిచినవి.

భక్తులు ఆత్మ సంతోషం కోసమూ, లోక కళ్యాణం కోసమూ, గద్య, పద్య, సంకీర్తనాత్మకంగా రచనలు సాగించారు. విన్నపాలు వచనాలు అనబడే రెండు ప్రధానమైన గద్య వాఙ్మయం తెలుగుదేశంలో వుండేది. శ్రీనాథుని విన్నపాలు, వేంకటేశ్వర వచనాలు, సింహగిరి నరహరి వచనాలు మొదలైనవి ఈ కోవకు చెందినవి. గద్యాలు కావటంచేత వీటిని జ్ఞాపకముంచుకోవడం ఎక్కువ కష్టం. అందువల్ల విశేషించి ఇవి వ్యాప్తిలోనికి రాలేదు. గద్యంకంటె పద్యానికి ఎక్కువ ఆకర్షణీయం కావటంచేత భక్తి శతకాలు ఎక్కువ ప్రచారంలోనికి వచ్చాయి. ఇందుకు ఉదాహరణంగా దాశరథీ శతకం, కృష్ణ శతకం ఇత్యాదులను చెప్పవచ్చును.

రాగ తాళ నిబద్ధం కావటంవల్ల గద్యం కంటె, పద్యం కంటె కూడ పాట సులభంగా జ్ఞప్తిలో నుంటుంది. వాగ్గేయకారులంతా అందుచేతనే ఈ రచనా మార్గాన్ననుసరించారు. అంతే కాకుండా, పాటలో అటు గాయకునకు, ఇటు శ్రోతకు కూడా ఆనందం వుంది.

తెలుగున ఇలాంటి వాఙ్మయ రచనలో నేటికి తెలిసినంతవరకు అన్నమాచార్యుడు మనకు ప్రాచీనుడు. అతనికి పూర్వముండిన గీత వాఙ్మయం లభించలేదు. అన్నమాచార్యుని సంకీర్తనల ప్రభావం తరువాతి మహా వాగ్గేయకారుల రచనలందు కనబడుతుంది. ఇందుకు ఒక ఉదాహరణంగా అన్నమయ్య మాళవి రాగంలో రచించిన

"శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీ సతివల్లభా
శరణు రాక్షస గర్వ సంహార
శరణు వెంకటనాయకా॥

అను సంకీర్తనము ననుకరించి పురందరదాసులు అదే రాగములో రచించిన

"శరణు శరణు సురేంద్ర వందిత
శరణు శ్రీపతి సేవిత।
శరణు పార్వతి తనయ మారుతి
శరణు సిద్ధి వినాయక॥

అను సంకీర్తనమును చూపవచ్చును.

అన్నమయ్య వేంకటాచలపతి వర ప్రసాదితుడు. జన్మించి సుమారు 79 యేండ్లు నిండుగా బ్రతికాడు. బాల్యమునుండీ అతని మనసు దైవధ్యాస కలిగియుండేది. అందువల్ల దైనందిన జీవితానికి సంబంధించిన ఏ విషయములు ఆసక్తి

కల్పించేవి కావు. అతనికి ఇంటపోరు చీకాగ్గా ఉండేది.

“తగు బంధు లాత్మజులుఁ దల్లులునుఁ
దండ్రులును
వగలఁ బెట్టుచు దిరుగు వారే గాక
మిగుల నీరలపాండు మేలనుఁ దమారి నాత్మ
దగిలించలేక చింతా పరుఁడనైతినయ్యో”

అని ఆనాటి యాతని మనోవేదన.

శ్రీ వెంకటేశ్వరుడు దర్శనంతో పాటు రచనాశక్తి ననుగ్రహించగానే స్వామినామ సంకీర్తనం చేసుకుంటూ ఇంటివద్ద తల్లిదండ్రులకు కూడా చెప్పకుండానే తిరుపతికి ప్రయాణించాడట. ఈ ప్రయాణం కమనీయంగా సాగినట్లు కనబడుతుంది. ఏడు కొండలవాని దర్శనం చేసుకునే వరకు దారి పొడవునా ప్రతి విశేషాంశమును యాత్రా విధియందు ప్రతిఘట్టమును అతి పవిత్రభావంతో పూజించి, శ్లాఘించి, గానంచేస్తూ పోతున్నట్టు, ఆ సందర్భంలో రచించిన సంకీర్తనలను చదివితే, మనకేదో అస్పష్టంగా కనబడు తున్నట్టనిపిస్తుంది. అదే యాత్రలో “మోకాళ్ళ పర్వతం” అని పిలువబడే చోట అలసి, బాటకు ప్రక్కగా ఉన్న ఒక వెదురు పొదక్రింద రాతిపై ఆదమరచి నిద్రపోగా అలమేలుమంగమ్మ సాక్షాత్కరించి, తన దివ్య ప్రసాదంవల్ల ఆకలి బడలికలు పోగొట్టి కాళ్ళకి తొడుక్కొన్న చెప్పులను విడచి ప్రయాణము చేయమని అన్నమయ్యను హెచ్చరించి, అంతర్ధానమైనట్టున్నా ఆమీదట—

“తాళ్లపాక ఘనుఁ డన్నడు
పద్యశతంబు చెప్పెఁ గో
ణమ్మని వాక్ప్రసూనములఁ
గూరిమితో నలమేలు మంగకున్!”

అని ఒక కథ ప్రచారములో నున్నది.

అన్నమాచార్యుడు రామాయణం అంతా కీర్తనములుగా రచించాడు. అతని సంకీర్తనావిధానం బహుజనాకర్షకమై ప్రసిద్ధికెక్కినది. సాళ్వ నరసింహరాయలు ఆచార్యుని దర్శించి, గౌరవ పురస్సరమైన మైత్రి నేర్పరచుకొన్నట్లున్నది. అప్పటికి ఈ నరసింహరాయలు కడపజిల్లా రాజంపేట తాలూకా టంగుటూరు గ్రామమునకు పాలకుడుగా వున్నాడు.

తరువాత విజయనగరాధిపుడైన ఈ నరసింహరాయలు అన్నమాచార్యుని సగౌరవంగా తనవద్దకు ఆహ్వానించి, అతని సంకీర్తనామృతమును గ్రోలి, వస్తు, వస్త్రాదులను, అగ్రహారములను యిచ్చి సత్కరిస్తూండేవాడు. ఒకనాడు వేంకటపతిపై రచించిన రీతిగ తనను గూర్చి సంకీర్తనము చేయమని కోరగా, అన్నమాచార్యుడు అందుకు సమ్మతించక “హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ నినున్ గొనియాడంగ నేర” దని బదులు పలికేసరికి రాయలు కుపితుడై ఆచార్యునికి సంకెలలు వేయించాడట.

“సంకెలఁబెట్టినవేళ చంపఁబిలిచినవేళ
అంకిలిగా నప్పులవారాగిన వేళ
వేంకటేశు నామమే విడిపింప గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మఱిలేదు తెఱగు

అని పరమేశ్వరుని గూర్చి ప్రార్థించి సంకెలలు విడిపించుకొనేసరికి, ఆ మాహాత్మ్యానికి నరసింహరాయుడు ఆశ్చర్యపడి క్షమాపణ వేడి, అనుగ్రహింపబడినాడట.

అన్నమాచార్యుడు తన జీవితాన్ని విశేషముగా వెంకటేశ్వర సన్నిధిని గడిపి, తరించాడు. అతని జీవిత చరిత్ర అతి రసభరితమైనది; ధన్యమైనది.

అన్నమాచార్యునకు తిరుమలమ్మ యందు నరసింహాచార్యుడు, అక్కలాంబ యందు పెద తిరుమలయ్య, నరసమ్మ, తిరుమలమ్మ అను సంతానము కల్గెను. అతని ఇద్దరు పుత్రులు, నరసింహుడు - పెద తిరుమలయ్య కుమారుడు చిన తిరుమలయ్య కూడా భక్తులు, కవులు కీర్తి గడించారు. చిన తిరుమలాచార్యుని మూడవ తమ్ముడు చిన్నన్న అన్నమాచార్య చరిత్రమును రచించి ప్రఖ్యాతుడైనాడు. తిరుమల దేవస్థానమునకు అన్నమయ్య, తాళ్లపాక వారి కుటుంబము చేసిన సేవలు, సమర్పించిన భూములు అనల్పమైనవి, అనేకములున్నవి.

అన్నమాచార్యుని రచితమైన ఆధ్యాత్మ శృంగార సంకీర్తనముల సంఖ్య 32 వేలు అని చెప్పబడినప్పటికీ, ఇప్పటికి దొరికినవి సుమారు 14 వేల పదాలు కలవని తెలుస్తున్నది. వీటిలో ఆధ్యాత్మిక సంకీర్తనముల కన్న, శృంగార సంకీర్తనలే యెక్కువ. అన్నమాచార్యుని కవితా ప్రతిభ, ప్రజ్ఞలు వైవిధ్యం చెయ్యడానికి కేవలం ఆధ్యాత్మిక భావన ఇచ్చే అవకాశం చాలక పోవడమే ఇందుకు కారణమని విమర్శకుల అభిప్రాయము. నిజానికి, అందులో కొన్ని శృంగార సంకీర్తనలను, ఆధ్యాత్మిక సంకీర్తనలలో ఇమిడ్చి గుని తేల్చి చెప్పడం అసాధ్యము.

అన్నమాచార్యుల సంకీర్తనలే అన్నమయ్య పదాలని కూడా పిలువబడుతున్నవి. పదమనే మాటకు ఈనాడు సంగీత పరిభాషలో ఒక ప్రత్యేకమైన అర్థమున్నప్పటికీ, పూర్వం, "పదం" పాటకు మారుపేరుగా వుండేది. అనేక విధాల అన్నమాచార్యులు పదకవితలలో అగ్రగణ్యుడు అనేది నిర్వివాదాంశం. "పదకవితా పితామహ" అనే బిరుదు అతనియందు సార్థకమైనది.

సంకీర్తనలు గాక, అన్నమయ్య 12 శతకాలు, సంకీర్తన లక్షణం, ద్విపద కావ్యంగా రామాయణం, సంస్కృత భాషలో శ్రీ వేంకటేశ మహాత్మ్యము మొదలైన అనేక గ్రంథాలు రచించాడు. ఈ నాటికి దక్షిణ దేశంలో విరివిగా పాడబడుతున్న భజన పద్ధతి శ్రీ అన్నమాచార్యునిదే.

నాటి కృతులలో అన్నమాచార్యునిచే రచింపబడిన జోలలు చాలా వున్నవి.

"జో అచ్యుతానంద జో జో ముకుంద
లాలి పరమానంద రామగోవింద"

అని తెలుగు దేశంలో ప్రతి యింటను తెలిసిన జోలపాట ఇలా అన్నమాచార్యునిది చెందుతుంది.

"గోవర్ధనంబెల్ల గొడుగుగా బట్టి
కావరమ్మున నున్న కంసుని బడగొట్టి
నీవు మధురాపురము నేలచేబట్టి
కీర్తితో నేలిన దేవకీపట్టి ॥జో॥

"అంగుగా తాళ్ళపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీ వేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥జో॥

అన్నమయ్య జీవితంలోని కొన్ని సంఘటనలు, సంకీర్తనములలోని కొన్ని పోకడలు, పోతన, వేమన, పెద్దన, రామ

దాసు, క్షేత్రయ్య, త్యాగయ్యలవంటి మహానీయుల జీవితాంశములకు, కవితా రీతులకు సామ్యములు కలవిగా నున్నవి.

సంగీత రచనలో శ్రీ అన్నమాచార్యుని సంకీర్తనములు ఎటువంటి వర్ణమెట్లు కలిగియుండేవో తెలియదుగాని రాగనామములు మాత్రము ఆయా సంకీర్తనములపైన పేర్కొనబడినవి. దానిని బట్టి తన రచనలలో సుమారు 90 రాగాలు వినియోగింపబడినట్లు స్పష్టమగుచున్నది. ఆరాగములలో కూడా గుజ్జరి, ఆహిరి నాట, హిజ్జిజ్జి, అ[illegible]సింధు, దేశాళం వంటి రాగాలు ప్రస్తుతం ప్రచారంలో లేవు.

ఈ మన సంకీర్తనలు పల్లవి, అనుపల్లవి, సాధారణంగా మూడు చరణాలు కలిగి ఉంటాయి.

అన్నమయ్య గ్రాంథిక భాషా పాండిత్యము కలిగియున్నా, తన సంకీర్తనములలో పలుచోట్ల వాడుక భాషనే వినియోగించాడు. ఈతని భాష శబ్దార్థసంపత్తి కలిగి ఇంపుగొలిపే సులాలిత్యముతో నిండిన తెనుగు నుడికారపు సొగసు సొంపు లెసగి, లోనిభావం హృదయములకు హత్తుకునేటట్లుగా వుంటుంది. మనఃపూర్వకంగా తాననుభవించిన ఉత్కృష్టమైన భావాలను గంభీరంగాను, సహజంగాను, శ్రోతలను కదిలించేటట్లుగాను వెల్లడి చేయగలిగిన శక్తి అతని భాషకున్నది. ఉదాహరణకు సమ్మోహనకరంగా —

"తేనెలపై తేట తిన్నని చెరకు
పానకముల నేర్పుగూర్చిన మేలు
చక్కనాలో తీపు చల్లదెమ్మెరలు
చిక్కని కప్పురంబు జీవరత్నములు
కలయమృతంబు విరాగ నమిరించవులు
చిలుకు మంగవుతల్లి చేయుత్త"

ప్రమొక్కటట్లుగా పాడేవాడట!

అన్నమాచార్య ఆధ్యాత్మ సంకీర్తనములనుండి నాటు ఎనిమిదింటిని యెంచి ఆ పాటలకు పేర్కొనబడిన రాగాలలోనే ఆ పాటలలోని స్వరూప గ్రామాణములు, మతి ప్రాసాములు సంక్షిప్తించి, ఉచితమైన ప్రసిద్ధ తాళాలను నియమించి, భావానుసూక్తితో, భావనాశక్తితో, తాను కల్పనచేసిన శ్రీ గాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు ప్రశంసనీయులు!

అఖిలము అన్నమయ్య సంకీర్తనాదులను రాగిరేకులపై చెక్కించి కావ్యజగతికి శాశ్వత మహోపకృతి యొనర్చిన అన్నమాచార్య సంతతికి జోహార్లు!

ఇన్ని తే సుకృతినో కనిపిస్త[illegible]
కవీశ్వరా!

# మేఘరంజని

## సోమసుందర్

నడుస్తున్నాను, నడుస్తున్నాను
జీవితాన్ని తేలుస్తూ, భావిని యోచిస్తూ
వర్తమానాన్ని చూస్తూ, శోధిస్తూ
బరువుగా అడుగులు వేస్తూ
నడుస్తున్నాను.

గొడ్డు; నా బ్రతుకులాంటి గొడ్డు –
నాకు తెలుసు, అన్నీ యెగుడుదిగుడులే;
అంతా దుమ్ము, [illegible], [illegible] –
నొచ్చిన నా అరికాళ్ళకు
గుచ్చి బాధించే కంకర,
దుమారం, [illegible] –
మార్గమంతటా కడుతున్నది నాకు!
నడుస్తున్నాను, తప్పదు కనక
జీవితం ఒప్పదు కనక...

పడబోతగా పొల్లు తప్పించుకుంటూ,
కుంటుకుంటూ, ఒట్టగాలు గుడిస్తూ,
గుంజుస్తూ, నిట్టూర్పుల్ని గుణిస్తూ,
అంచనాల ఆకారాన్ని పరిగణిస్తూ
ఆశనిరాశల ఊతకోలల బలంతో –
నాకు నేనే ఆలంబనంతో –
వంకర టింకరల కాల విలంబనంతో –
నా జీవితం మించి నేనే
నడుస్తున్నాను.

కలలబలంతో,
వలపుల గోర్వెచ్చని కోరికల బలంతో,
ఆశల తోచిన వెలుగుల పులకలతో,
నాకు నేనే సాక్ష్యంతో,
నా కనుపాపల నిలచిన రేపులతో,
నాకై ఘనీ తరంగాల తేలివచ్చు
ప్రేమల నును మెత్తని కెంబూవుల
తోపులతో,
అక్షులు సారించిన పక్షాలతో,
నడుస్తున్నాను,
విడుస్తున్నాను గతాన్ని!

కాలం విసురుతూన్న గాలాన్ని
మనసుల మాయాజాలాన్ని
[illegible] గాయాల్ని
నిరసించే కర్కశ హస్తాల్ని
[illegible] వ్యంజించే హాలాహలాన్ని
కారే చిరునవ్వులకలల్ని
తప్పించుకుంటూ నడుస్తున్నాను;
ఒప్పించుకుంటూ నటిస్తున్నాను:
పడుతూ లేస్తూ
అడుగులు వేస్తున్నాను.

అయినా తప్పదు కనక
ఆశలు ప్రసరిస్తున్నాను.
సువాసనలు పర్చిస్తున్నాను.
అవగాహన కందని దేనికోసమో
ఆహ్వాన వీణలు మ్రోయిస్తున్నాను.

౨

అవును
జ్ఞాపకం రాక మానడంలేదు.
స్మృతుల వ్రణాలు మానడంలేదు
జీవన సంగ్రామపు
రణగుణధ్వని మానడంలేదు;

రొప్పుతూ రోజుతూన్న మోజులు
నిప్పులు రాజుతూన్న రోజులు

నాజూకుగా అలంకరించుకుంటూ
నామీంచి నడవక మానడంలేదు.

కనక నే
శాఖల్ని బరువుల్ని
చిరు నవ్వుల్ని కాగితం పువ్వుల్ని
మనస్సులేని వయస్సుల్ని
గడియారపు ముళ్ళ కఠోర శబ్దాల్ని
తడియారని నఖక్షతాల నెత్తుటిచారల్ని
ఫ్యాక్టరీల సైరను కూతల్ని
జనన మరణాల రిజిస్టర్లని
అనవసరంగా ఆదిమధ్యాంతరహితంగా
ఆగిపోయే గూడుశకటాల్ని
'మొల్లోడెనిక్' వికటాట్టహాసాల్ని
వితంతువుల పగటి కలల్ని
మార్జాల దంపతుల పాలయాకల్ని
పిల్లికూన ఘోర శాపాల్ని
వెదురుబొంగువంటి బ్రతుకులో
కాపురం పెట్టుకున్న కందిరీగల్ని
మాయామానుష విగ్రహాల్ని
—ధిక్కరించే శక్తిలేక
సహిస్తున్నాను; వహిస్తున్నాను;
దహిస్తున్నాను; భరిస్తున్నాను;
బరువుగా నడుస్తున్నాను;
జడివానల తడుస్తున్నాను;
కరుణాశ్రువుల కురుస్తున్నాను;
కపోలాలు తుడుస్తున్నాను
కడలివోలె గర్జిస్తున్నాను

౨

నిరాశ కప్పుకొని
గుర్రు పెట్టి నిద్రపోతూంటే-
ఉపద్రవంగా ఆశ
అలారం కొట్టి లేపుతోంది
ఈతాకుచాపల ఇలాగంగాంచి
మా తాత నాగన్న మందలిస్తున్నట్టు-
ఏతాము సీల తా కిరుకిరుమన్నట్టు-
వాతపోతమొక్కటి సన్నగా మూల్గినట్టు-
ముసలినక్క కూత మెచ్చి ఏడ్చినయట్లు
మనసు కుబుసం విప్పి
గుసగుసలు పోతోంది.
కోర్కె కోరలనెత్తి
కొంగ కొంగా చూస్తోంది

మనుజా ఘనకాల సంక్రాంతాలలో
చిక్కినవాని చూపలేక దుఃఖాగ్నిలో కుందు
మృత్తికపాల స్రొక్కిపోయిన నరుడు
ఓటమిని గుర్తించలేక మూర్ఖనరీతి
భల్లూకం వంటి భీతి
వెన్నంటుతూన్న రీతి
ప్రతినిత్యం ఎదురయ్యే ప్రబల విషాన్ని
సహించలేక, ప్రాణాలనొడ్డి
ధిక్కరించలేక,
ఆశ చాక - నిరాశపోక,
తీపి అందక, చేదుపోక
మృద్దళల తీగల్ని కత్తిరించలేక -
మాపుల కట్టి కూకల్ని భరించలేక,
అంతా...అంతా
నాకుంటా...కలంటా
నడుస్తున్నాను;
జడుస్తున్నాను.

ఉషారక్తి నునుబుగ్గలమీద తోచే
నోరు గులాబి రేకలపై భ్రాంతిపోక,
ప్రత్యూష సమయంలో ఎలుగెత్తే
పికసాధ్వి మేలుకొలుపు గీతాల
కొసరించే కోరిక బాకా శ్రోతల
తాకమనిలేక, పోనీ పరిచిపోలేక
వలపుకన్నా మును నిగ్గులవంటి
నిశాంత తమిస్రల సన్నసన్నని
మేని ముసుగు తెరల తొలగించే—

దివ్యవిభాతరోచిర్నివహాల
విస్మరించలేక, పోనీ స్మరించలేక,
చల్లని వలిపపుగాలి దొంతరలలో
దోబూచులాడే చిరునవ్వు వంటి
చివురాకుల కైదువుల
తళ్తళ్తళ్ల తేలగలేక
—అలాగే... అలాగే...

పురి గుహలో చిక్కుకున్న
పేదరాని ప్రాణవాయువులా –
నేటికాకూ తొలు చేరని
తల్లి మట్టిగా తీరంగా ప్రతిక్షించేసే
మల్లె మొగ్గ వంటి నిన్న పుట్టిన
పసి కూనలా —
ఎగరా తోడుగాక, ఎగరా
విడిచిపెట్టి పోక,
బ్రతుకు కపాలంలో విస్తులు నాదమే గాని
కోసుకోవడం చేతగాక,
మిత్రులను శత్రువులుగా చేసుకోవడమే గాని
శత్రువుల నుంచి మిత్రుల్ని సాధించలేక,
కాముల కనీస శస్త్రాల్నే గాని
కోతల కానీ స్వప్నాల కలనాదాల
తొలి కలపులు పిలిచేందుకు కొంపాలపొందలేక –

నేను శిల్పకుడనే గాని
నొపిక్కి చేసే వాళ్ల నరికట్టలేక,
గాలి ఒత్తిడిని స్వాయత్తం చేసుకోలేక,
లేక లేక దొరికిన కొట్టెముక్కను
కోతులెత్తుకుపోతే ఏడ్వగాక,
మూడు తొమ్మిదుల మోసినా
సంతసాన్ని ప్రసవించలేక;
కురిసిన దుఃఖాన్ని కొలుచుకునేందుకు
కనీసం తుంచాలైనా దొరకక –
అలాగే – ఒక్కలాగే
నన్ను నేనే శపించుకుంటూ,
నా కలలకు నేనే ముసుగుకుంటూ,
నా భయాలకు నేనే ముడుచుకుంటూ,
నడుస్తున్నాను.
నడుస్తున్నాను...
జడుస్తున్నాను; విడుస్తున్నాను –
గతాన్ని !
స్వగతాన్ని !!
నా సర్వస్వాన్ని !!!

అవును, జ్ఞాపకం వుంది :
పదహారోయేడు నాకు –
ఓపలేక తులతుల మెరుస్తున్న బాకు,
కొండవాగాల పరిగెన్న
ఎగరేస్తున్న మోకు,

అవును జ్ఞాపకం వుందినాకు;
కుచ్చుటోపీ వంటి పదహారోయేట –
మనసులో ఒయ్యారం
మోసుకొస్తూన్న తోట;

సైకిళ్లు గోడలెక్కి కూర్చోడానికీ,
అమ్మాయిలతో బాహాటంగా
ఎకసక్కెలాడ్డానికీ,
మాష్టర్ల ఉపమానాన్ని గోడలమీద
వ్రాయడానికీ,
పుస్తకాలు చించి గాలిపటాలు కట్టడానికీ,
—సిగ్గుపడని వయస్సులో...

అప్పుడప్పుడు నాకు జ్ఞాపకం వుంది
అస్తమానూ పాటలు పాడ్డానికీ
తోటివాళ్లతో జగడాలాడ్డానికీ
నోటి తీట కరవడానికీ
చేటపెయ్యల్ని తరమాను చేయడానికీ
సిగ్గు తెలియని వయసులో
మచ్చికోలు ప్రస్ఫురించే మనసులో
నిగ్గులు తేరి విచ్చుకుంటూన్న
మొగ్గతొడిగిన వయసులో

దేహాన్ని కుతకుత లాడించే
వెచ్చ వెచ్చని మనస్సులో
అవును నిజమే – నేను మరచిపోలేదు.

నవమోహనమైన కోర్కెల గులాబుల్ని
హృదయైకవేద్యమైన నవాశల బులాకుల్ని
సరసముల పికస్వరాల పిసాళిపదాల్ని
వెలిగించి, విరియించి, కురిపించే
తలపించి, మరపించి, వినిపించే
ఎలజవ్వనాల బావుటాలు సంధించే,
వెన్నబాము కుదిపి ఝళిపించే,
కోడెత్రాచువంటి వయసులో...
కోడికూతలాంటి మనసులో...
అవునవును నాకింకా జ్ఞాపకం వుంది.

హఠాత్తుగా మెరిసిన విద్యుల్లతాంగిని –
నన్ను కదిపి, నాళనాళాన్ని కాల్చిన –
హృదయ మాధ్వీకరసంతో వెలిగించబడ్డ
దీపాన్ని, జీవన సర్వస్వరూపాన్ని;
నా వక్షస్థలంమీద కీలించబడిన
కౌస్తుభమణిహారాన్ని: జీవనసంభారాన్ని;
మణి మండిత రత్నాలంకారాన్ని,
విద్యుద్భ్రమా సుందరిని, వసుంధరని;
మేఘాచ్ఛాదిత చంద్రరేఖకైవడి
నిమీలితమైన లోచనాయుగాన్ని;
అవును నేను ఎన్నటికీ మరచిపోలేని
ప్రకాశాన్ని

క్షమాశిక్ష నేర్చుకోలేని గతాన్ని –
తీసంగా సంప్రార్థన చేసుకోలేను ఆ
గతాన్ని –
ఒకులకు చూపలేను శ్రమాభిన్న వదనాన్ని!
బహువులు తొలగించుకోలేని కన్నీళ్ళ
ధ్యానాన్ని!

నడుస్తున్నాను, నడుస్తున్నాను
విరామంలేని ఆశయంలో
జడివానల యోజనాలు సాగ
చిక్కుపడిన నాకంలో
మనసుకు నే కబోదినై సాగ
చిరుముచ్చటుల మాటలో
నడబడుతూన్న భారమై నేను
నడుస్తున్నాను, నడుస్తున్నాను.

వెఱ్ఱిగా పూనదిన్నా సరికే
చింతలు సజాగా ఎత్తి కొంతేసరికే,
విషాదాలు అడుగులెత్తి యుగళోత్సే సరికే
సుఘాసులే తమసాకుటై జ్వలించే నన్నే-
నా జన్మ నటించిపోతూ,
విశ్వాసంగా నిండువునా నడచిపోతూ –
దిక్కుచీర బుజుపవనాల
విపత్కర సన్నివేశాల ద్వారాల
పరిస్థితుల తక్కెడసిబ్బెల ఇబ్బందుల శ్రేణుల
నడుస్తున్నాను, నడుస్తున్నాను
నడుస్తున్నాను; నడుస్తున్నాను.

[ఇది అసంపూర్ణం]

★

నా టి క

# పద్మవ్యూహం

ఆర్. రామచంద్రారెడ్డి

## పాత్రలు

| | | |
|---|---|---|
| రఘు | : | బి. ఎ. ప్యాసైన యువకుడు – వయస్సు 22 |
| పద్మ | : | రఘు చెల్లెలు – వయస్సు 15 |
| తండ్రి | : | రఘు, పద్మల తండ్రి – వయస్సు 49 |
| తల్లి | : | రఘు, పద్మల తల్లి – వయస్సు 40 |
| వెంకట్రామయ్య | : | తండ్రికి ఆప్తుడు – వయస్సు – 50 |
| సత్యనారాయణ | : | పెండ్లికొడుకు – వయస్సు 25 |
| సోమయ్య | : | సత్యనారాయణ బంధువు – వయస్సు 50 |

మొదటి రంగం : సాధారణ మధ్యతరగతి గృహస్థుని యింట్లో హాలు – ఉదయం 10 గంటలు.

రెండవ రంగం : అదే స్థలం – సాయంత్రం 4 గంటలు

## మొదటి రంగం

(ఒక వైపున వీధిలోకి వాకిలి. మరొక వైపున యింట్లోకి వాకిలి. రంగం మధ్యలో అడ్డంగా ఒక మంచం. మంచం మీద పండుకొని రఘు పుస్తకం చదువుకొంటూ వుంటాడు. మంచం కిలవైపు ఒకటి రెండు పాత కుర్చీలు – కుర్చీలకు ముందు భాగంలో చాపమీద కూర్చొని పద్మ ఫిడేలు సాధన చేసుకుంటూ వుంటుంది. తెర యెత్తేటప్పటికి పాట చాలాభాగం ఐపోయివుంటుంది. తెర మెల్లగా లేస్తుంది.)

పద్మ : (పాట ఐపోయిన తర్వాత రఘు వైపు చూస్తూ) యెట్లుందన్నా పాట ?

రఘు : (పుస్తకం చదువుకుంటూనే నిర్లిప్తంగా) ఊఁ–బాగుంది.

పద్మ : (ఫిడేలూ, కమానూ చాప మీద పెట్టి, లేచి రఘు దగ్గరికిపోయి) సరిగా చెప్పన్నా–బాగానే వుందా ?

రఘు : (లేచి కూర్చొని, అస్పష్టమైన చిరునవ్వుతో) నిజంగామ్మా–పాట బాగుంది–చాలా బాగుంది–అద్భుతంగా వుంది.

పద్మ : (మూతి తిప్పుతూ) ఛో - నీవెప్పుడూ నన్ను యెగతాళీ చేస్తుంటావ్. నిజం చెప్పనే చెప్పవ్.

రఘు : (స్పష్టమైన చిరునవ్వుతో) నిజం పద్మా! నీ యోగ్యతను నీవు బాగనే వాయిస్తున్నావ్. ఇంకా రెండు మూడేండ్లు నేర్చుకుంటే చాలా బాగ వాయించగలవ్.

పద్మ : (ఉత్సాహంగా) ఆ మాటే మా సంగీతం టీచర్ కూడా అన్నాడు... మరి నాన్నతో చెప్పనా!

రఘు : (ప్రశ్నార్థకంగా చూస్తాడు)

పద్మ : (విచారంగా) సంగీతం టీచర్ని మానుకోమన్నాడు నాన్న.

రఘు : మానుకోమన్నాడా?

పద్మ : (తల వూపుతూ) ఊఁ.

రఘు : మీ టీచరుకెంత? నెల కెనిమిది రూపాయలు కదూ?

పద్మ : ఔను.

రఘు : అందుకే వద్దన్నాడు నాన్న.

పద్మ : (దిగులుగా) యెట్లాగ మరి?

రఘు : (విషాదంగా చిరునవ్వు నవ్వుతూ పద్మముఖంలోకి చూస్తూ) యెందుకమ్మా అంతదిగులు?... నేర్చుకుంటే మాత్రం యెంత సంగీతం నేర్చుకుంటావ్?

పద్మ : (అమాయకంగా) యేం?

రఘు : యెంత నేర్చుకొని మాత్రం యేం సాధిస్తావ్?

పద్మ : యేమన్నా?

రఘు : (ఒక క్షణం నిశ్శబ్దంగా పద్మ ముఖంలోకి చూసి) పిచ్చినాన్నా! (ఇద్దరూ [illegible]) నేర్చుకుంటే యెన్నాళ్లు నేర్చుకుంటావమ్మా? మహా ఐతే ఆరు నెలలో, సంవత్సరమో - అంతేనా?

పద్మ : తర్వాత యెందుకు నేర్చుకోకూడదు?

రఘు : (విచారంగా, నిదానంగా) అంతలో యెవడో వొకడు సూటూ బూటూ వేసుకొని పెండ్లి కొడుకు నంటూ వస్తాడు. నిన్ను పెండ్లి కూతుర్ని చేసి అతని చేతిలో పెడ్తాం. అంతే - యిక నీ దారి నీది, సంగీతం దారి సంగీతంది.

పద్మ : (సగం సిగ్గుతో, సగం కోపంతో) ఛో నాన్నా - నీ వెప్పుడూ యింతే. (తల వంచుకొనును)

రఘు : (విషాదంగా చిరునవ్వు నవ్వుతూ) ఉన్నమాట అంటేనమ్మా. (ఒక క్షణం నిశ్శబ్దం) పద్మా, యిటు చూడు (పద్మ తల యెత్తును) లోకంలో జరిగేదంతే... పోనీ, మీ సంగీతం టీచర్ నడుగు - ఆయన దగ్గర సంగీతం నేర్చుకున్న ఆడపిల్లలందరూ యేమైనారో. పెండ్లిండ్లు చేసుకొని వచ్చిన సంగీతం చల్లగా మరచి పోయినారు.

పద్మ : (అమాయకంగా — తనలో తాను అనుకున్నట్లుగా) యెందుకు మరచి పోతారో!

రఘు : ఊహూఁ - సంసారాల కొత్త అంతా బ్రతకడానికే చాలవంటేను. సంగీతం మీద శ్రద్ధ ఎక్కడనుంచి వస్తుంది?

పద్మ : (అర్థం కాక ప్రశ్నార్థకంగా చూస్తుంది.)

రఘు : తెలుసుకుంటివి [illegible] అంటే తెలుసునా?

పద్మ : (తెలుసునన్నట్లు మెల్లగా తల ఆడించును)

రఘు: బ్రతకడం అనేదే తలకుమించిన భారం అయినప్పుడు, సంగీతం అనుభవించడానికి ఆసక్తి వుండదు, తీరికా వుండదు.

పద్మ: (ఒకక్షణం నిశ్శబ్దంగా రఘువైపు చూసి) ఐతే మరి అందరూ సంగీతం నేర్చుకోవడం యెందుకూ చిన్నప్పుడు?

రఘు: (మెల్లగా నవ్వుతూ, రెండు చేతులతో పద్మభుజాలు పట్టుకొని అటూ యిటూ తిప్పి) పిచ్చి పద్మా! (లేచి పోయి పంపంపుమీద కూర్చొంటాడు.)

పద్మ: (వెంటనే లేచి [illegible] నిలబడి) యేమన్నా?

రఘు: (పద్మవైపు చూస్తూ) అంతేనమ్మా. పెళ్ళి కావాలంటే సంగీతం నేర్చుకోకపోతే యెల్లా? పెళ్ళి కావడానికి అనేక యోగ్యతలు, క్వాలిఫికేషన్స్. సూటూ బూటూ వేసుకున్నవాడు వచ్చి, మీ అమ్మాయికి ముక్కూ ముఖమూ వుందా అంటాడు. చదువూ సంగీతమూ వచ్చునా అంటాడు. ఈ అన్నిటిలోనూ నువ్వు ప్యాస్ కాకపోతే నీకు పెళ్ళయ్యేట్లా?

పద్మ: (కోపంగా) ఊఁ. (విసురుగా యింట్లోకి పోతూ) యెప్పుడూ నీకు పెళ్ళిగోడవే.

రఘు: (కొంచెం బిగ్గరగా) పద్మా! (వాకిలి దగ్గర నిలబడి పద్మ తిరిగి చూచును. రఘు ఫిడేలువైపు చూపుతూ) అవి తీసుకుపోమ్మా! (పద్మ ఫిడేలువద్దకు వచ్చి కూర్చొని, ఫిడేలును పెట్టెలో పెడుతుంది) పెట్టెయింటానికా జాగ్రత్తగా భద్రం చెయ్యి వాటిని.

(ఇంట్లోనుండి తల్లివచ్చి వాకిట్లో నిలబడుతుంది.)

పద్మ: (తల్లిని గమనించకుండా సగం హాస్యంగా, సగం కోపంగా) అమ్మతో చెప్తానుండు - నీ కెప్పుడూ అదేమాటే నేమో.

తల్లి: (రెండడుగులు ముందుకు వస్తూ) యేమిట్రా?

పద్మ: చూడమ్మా వీడు.

రఘు: (కొంచెం కంగారుగా) యేమీ లేదమ్మా. (లేచి నిలబడుతూ) నేనూ - చదువుకుంటుంటేనూ - ఫిడేలూ - పద్మా - (తడబడుతూ వుండగా).

పద్మ: (రఘును అతిశయంగా అనుకరిస్తూ) నేనూ - చదువుకుంటుంటేనూ ఫిడేలూ-పద్మా (పకపకా నవ్వును)

రఘు: (పసిపిల్లవానివలె - పద్మవైపు చూపుతూ) చూడమ్మా యిది.

తల్లి: (మెల్లగా నవ్వుతూ) ఇక స్నానం చేసిరా, పో రఘూ, భోంచేస్తురు.

(రఘు నిష్క్రమించుతాడు)

పద్మ: (ఫిడేలు పెట్టె చేతిలో పట్టుకొని లేచి నిలబడుతూ) అమ్మా.

తల్లి: యేమమ్మా?

పద్మ: (తల్లి దగ్గరకువచ్చి) అన్నకు చదువంతా ఐపోయిందిగదా, యిక పెళ్ళెప్పుడమ్మా?

తల్లి: (చిరునవ్వుతో) యేం - అన్న పెళ్ళికి నీకు తొందరైందా?

పద్మ: ఆఁ హాఁ - చదువు పూర్తై సంవత్సరం దాటిందిగదా అని.

తల్లి: (విచారంగా) పోనమ్మా, ఉద్యోగము దొరికింది కాని పెండ్లే వద్దంటున్నాడు. ఇంతలో యేదో వాడి కుద్యోగం వస్తే మీ యిద్దరి పెండ్లిండ్లూ వొకేసారి చేస్తాంలే.

పద్మ: త్వరగా వస్తుందేమ్మా అన్నకు వుద్యోగం?

తల్లి: యేమో తల్లి — వాని అదృష్టం. ఒక్క కొడుకని యెంతో ఆశలతో పెంచినాం. తీరా యిప్పుడు చూస్తే...

పద్మ: సరే, వుద్యోగం వస్తే, [illegible] చేసుకొని నేను పట్నంలో వుంటానన్నాడు గా అన్న.

తల్లి: (ఆశ్చర్యంతో పద్మ ముఖంలోకి చూస్తూ) పోనమ్మా — యెక్కడ వుద్యోగం వస్తే అక్కడే వుంటాడు.

పద్మ: అన్న వెంట నేనూ పోతానమ్మా.

తల్లి: యెందుకూ? నీ అన్నను విడిచి వుండలేవా?

పద్మ: అదీ కాదు — అన్న వెంట పోయి సంగీతం నేర్చుకుంటాను.

తల్లి: (ప్రేమతో పద్మను దగ్గరకు లాక్కొని) పిచ్చి పిల్లా, (తలనిమురుతూ) యెందుకమ్మా సంగీతం? మీ యన్న యింత చదువు చదివి ఏంతమాత్రం వుద్ధరిస్తున్నాడు. నీవింక సంగీతం నేర్చుకొని యెవర్ని వుద్ధరిస్తావో?

పద్మ: యింకా రెండు మూడేండ్లు నేర్చుకుంటే బాగుంటుందని అన్నకూడా అన్నాడమ్మా.

తల్లి: అన్న అనడానికేంలే. వాని చదువుకే సగం సంసారం గుల్లయింది. ఇక నీ సంగీతానికి తక్కిన సగమూ అయిపోవాలనా?

పద్మ: అన్న చెప్పిస్తాడులేమ్మా. అన్నకు వుద్యోగం వస్తుందికదూ!

తల్లి: (చిరునవ్వుతో) సరేలేవే. మీ యన్న నీకు సంగీతం చెప్పిస్తుంటే నేను వద్దంటానా?

పద్మ: సరి అందాకా... (అనుమానంగా ఆపును)

తల్లి: (ముఖం చిట్లించి) యేమిటే?... అందాకా?

పద్మ: (మెల్లగా) అందాకా సంగీతం నేర్చుకోవడం మానిపించవద్దని నాన్నతో చెప్పమ్మా!

తల్లి: (నిట్టూర్పుతో) [illegible] చెప్పినా [illegible] వింటున్నాడా [illegible]. మీ నాన్నకు [illegible] వుద్యోగం వస్తుందని, అందాకా నీ సంగీతాన్ని నిలిపి [illegible] చెప్పి [illegible] వుంటాడా? [illegible] నాన్నతో — నీవే చెప్పుకో.

పద్మ: (తల్లి ముఖంలోకి ఆశగా చూస్తూ విచారంగా) అన్నకు వుద్యోగం వస్తుందేమ్మా. త్వరలోనే వస్తుంది.

తల్లి: (ఎక్కడో దూరంగా చూస్తూ) [illegible] చేస్తున్నావో, సంవత్సరం నుండీ యీ వుద్యోగం ఆ వుద్యోగం అని తిరుగుతూనే వున్నాడు — మీ నాన్న అన్నా, యిద్దరూ. అక్కడికనీ యిక్కడికనీ తిరగడానికే యెన్నియో వందలు ఖర్చయ్యుంటాయి.

పద్మ: వస్తుందిలేమ్మా వుద్యోగం. బ్యాంకిలో వుద్యోగం వస్తుంది. తప్పక వస్తుందమ్మా, యెందుకు రాదు?

తల్లి: (పద్మవైపు చూస్తూ, తలనిమురుతూ) నీ మాట చలవతో అట్లే కానీలే తల్లీ.

అన్నకు వుద్యోగంవస్తే అంతేచాలు...
అంతా భగవంతుని దయ.

పద్మ : (పోబోతూ) సరే అన్నతో యిప్పుడే చెప్తానమ్మా. (తొందరగా నడుస్తూ)

తల్లి : (అర్థం కాక, ఆశ్చర్యంతో, ఆసక్తితో) యేమిటే ? యేమనీ ?

పద్మ : (వాకిలి దగ్గిర నిలిచి తల్లివైపు తిరిగి) అదేమమ్మా - అన్న వెంట నేనూ పోతాను - ఆ మాటే. (నిష్క్రమించును.)

తల్లి : (సుకుమారంగా) పిచ్చి పిల్ల! (అంతలోనే పద్మ తిరిగి ప్రవేశిస్తూ వుండగా) మళ్ళీ యేమే యింతలోనే ?

పద్మ : (తల్లి దగ్గరికి వస్తూ) సరే అంతా నాన్నతో చెప్పమ్మా ఆ సంగతి.

తల్లి : (వికసించిన ముఖంతో) యింకా తొందర - మీ నాన్న రానీ - చూస్తాం.

[ బైట పోస్ట్ ! పోస్ట్ !]

(తల్లి లోనికి వెళ్ళి కవరు తీసుకొని తిరిగి వస్తుంది.)

పద్మ : (తల్లి చేతిలోనుంచి కవరు తీసుకొని, అడ్రసుచూసి, ఉత్సాహంగా) అన్నకు ఉద్యోగం వచ్చిందమ్మా.

తల్లి : (సంతోషంతో) నిజంగా నామ్మా?

పద్మ : (తల్లివైపు చూస్తూ) నిజంగానమ్మా. బ్యాంకినుండి వచ్చింది జాబు.

తల్లి : బాగా చూడమ్మా - నిదానంగా చూడు.

పద్మ : (కవరు చించుతూ) దీనికోసమే గదూ మొన్న హైద్రాబాద్‌కు పోయి వచ్చింది. (కవరులో నుండి టైపుచేసిన కాగితంతీసి చూస్తూ, మరింత ఉత్సాహంతో) అదేమ్మా- ఉద్యోగమే. ఇదుగో (వచ్చీరాని ఇంగ్లీషు వుచ్చారణతో) బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ అని ఇక్కడ కూడా వుందమ్మా.

తల్లి : చదువమ్మా - యేముందో చదువు.

పద్మ : (రెండు క్షణాలు కాగితంవైపు చూచి) నా కర్థం కాదులే. అన్నను పిలుచుకొస్తానుండు. (కాగితమూ, కవరూ తల్లిమీద పడవేసి యింట్లోకి పరుగెత్తుతుంది.)

తల్లి : (క్రిందపడిన కవరూ కాగితమూ తీసుకుంటూ) సరిపోయింది - ఆ అన్నకూ, యీ చెల్లెలికీ.

(అర్ధనిముషం నిశ్శబ్దం. తర్వాత పద్మ ముందూ, రఘు వెనుకా ప్రవేశం.)

పద్మ : (తొందర తొందరగా తల్లి చేతిలో నుండి కాగితం తీసుకొని రఘుకు అందిస్తూ) చూడన్నా - నా మాట అబద్ధమేమో.

రఘు : (కొద్ది క్షణాలలో కాగితం చదివి, నిరాశగా నిట్టూర్చి, కుర్చీలో కూర్చుంటూ) ఊం.

తల్లి : (ఆదుర్దాగా) యేం రఘూ ?

పద్మ : (రఘు ప్రక్కన నిలబడుతూ) యేమన్నా ? ఉద్యోగం రాలేదూ ?

రఘు : (తలయెత్తకుండా, నిశ్చలమైన కంఠంతో, మెల్లగా) లేదమ్మా.

తల్లి : బ్యాంకినుండేనా ఆ జాబు ?

రఘు : ఆఁ.

తల్లి : ఈ వుద్యోగం తప్పక వస్తుందని మీ నాన్న అన్నాడే ?

రఘు : (నిట్టూర్పుగా) ఊఁ.

పద్మ : యేమైందన్నా ? యెందుకివ్వ రంటా నీకు వుద్యోగం ?

రఘు : (మెల్లగా తలయెత్తి, విషాదమైన చిరునవ్వుతో పద్మవైపు చూస్తూ) యెందుకివ్వరమ్మా ?...యిస్తారులే.

పద్మ : (ఉత్సాహంగా) యెప్పుడన్నా ? యెప్పుడిస్తారంట ?

రఘు : అందరికీ యిచ్చిన తర్వాత.

తల్లి : అదేమిట్రా ? సరిగా చెప్పరాదూ? యెప్పుడిస్తా మన్నారూ ?

రఘు : (తల్లివైపు చూస్తూ) యెప్పుడిచ్చేదీ వాళ్లిమీ చెప్పలేదు. ఇప్పటికి మాత్రం లేదన్నారు.

తల్లి : బాగుంది. దీని కోసమని యెవరితోనో సిఫారస్ చేయించినా మని అన్నాడే మీ నాన్న.

రఘు : అంతకంటె పెద్ద సిఫారసులున్న వాళ్ళకే యిచ్చి వుంటారమ్మా ఆ వుద్యోగం.

తల్లి : యేమో నాయనా ! భగవంతునికి మనమీద యెప్పుడు దయ కలుగుతుందో ! (కొద్దిక్షణాల నిశ్శబ్దం తర్వాత, నడుస్తూ) యిక రాండి భోజనానికి. రా పద్మ. (నిష్క్రమణ) (రెండుక్షణాలు నిశ్శబ్దం)

పద్మ : (మెల్లగా) అన్నా !

రఘు : (తలయెత్తకుండా) యేమమ్మా.

పద్మ : వుద్యోగం వచ్చిందనే అనుకున్నా.

రఘు : (పద్మవైపుచూస్తూ) పోనీలేమ్మా. ఇప్పుడొచ్చిన నష్టమేముంది ?

పద్మ : అందరికీ వస్తున్నాయే వుద్యోగాలు - నీ కెందుకురాదూ ?

రఘు : యెవరన్నారూ, అందరికీ వస్తున్నాయని ? నా బోటివాళ్ళు చాలా మంది వున్నారు దేశంలో.

పద్మ : యెట్లామరి ?

రఘు : హుః - యెట్లన్నా యేముంది ? అందరితోపాటే నేనూ. వచ్చిందాకా ప్రయత్నం చేయడమే. కుంటిదో గుడ్డిదో యేదో వొకటి యెప్పుడో వొకసారి రానే వస్తుంది. (రెండుక్షణాలు నిశ్శబ్దం) నీవు పోమ్మా - అమ్మ పిలుస్తున్నదిపో.

పద్మ : నీవూ రా - అన్నం తిందాం.

రఘు : నాన్న వచ్చిన తర్వాత వస్తాలే. నీవు తిను పో. (పద్మ పోతూవుండగా) పద్మా. (పద్మ నిలబడి వెనక్కి తిరుగును) నాన్నతో చెప్తాలేమ్మా - నీ కింకా కొన్నాళ్లు సంగీతం చెప్పించమని.

పద్మ : (మెల్లగా తల త్రిప్పుతూ) వద్దు.

రఘు : యేం ? యెందుకొద్దు ?

పద్మ : వద్దులేన్నా.

రఘు : (చిరునవ్వుతో) పిచ్చిదానా ! యెందుకొద్దమ్మా ? నే చెప్తాన్లే నాన్నతో.

పద్మ : (రఘు దగ్గరికి వచ్చి) నాన్న యేమంటాడో.

రఘు : యేమంటాడు ?... (పద్మ ముఖంలోకి చూస్తూ) నాకు వుద్యోగం రాలేదనా ? (ఔనన్నట్లు పద్మ తల యెగురవేయును) దానికేమ్మా - ఈరోజు రాకపోతే రేపు రాదూ ? నీ వెందుకు సంగీతం మానుకోవడం ?

పద్మ : నీకు వుద్యోగం వచ్చిన తర్వాత నేర్చుకుంటాలే.

రఘు : (విషాదపూరితమైన కంఠంతో) పిచ్చితల్లి ! నీకు వుద్యోగం వచ్చేటప్పటికి నీ బ్రతుకుమీద యెంత భారం పడుతుందో ! అప్పుడింకేం నేర్చుకుంటావ్ నీవు ?

పద్మ: యేమిటో నీ వనేది? అంతగా సంగీతం నేర్చుకోకపోతే యేం?

రఘు: (మెల్లగా తల త్రిప్పుతూ) తప్పమ్మా. జీవితమంటే యేమో నీ కింకా తెలియదు. (క్రమంగా మాటలు భారంగా వస్తాయి) జీవితం నిన్ను సుఖపడనివ్వదు. జీవితం నిన్ను క్రుంగదీస్తుంది. జీవితంతో పోరాడి నీవు గెలువలేవు. జీవితం నీకు యే ఆనందాన్నీ యివ్వదు. నీ ఆనందాన్ని నీవే సృష్టించుకుంటేతప్ప జీవితం నిన్ను భయపెడుతుంది.

(ఒక క్షణం నిశ్శబ్దం)

పద్మ: యేమిటో నీవు చెప్పేదంతా!

రఘు: అంతేనమ్మా. జీవితం నిన్ను మనిషిగా బ్రతకనివ్వదు. మనిషిగా బ్రతకాలంటే సంగీతంవంటిది యేదో ఒకటి నీకు ఆసరా వుండాలి. (రెండు మూడు క్షణాలు నిశ్శబ్దం) యేమమ్మా, నేను చెప్పేది అర్థంకాలేదుగదూ? (పద్మ జవాబివ్వదు. ఒక క్షణం నిశ్శబ్దం) పోనీలే! (లేచి) సంగీతం నేర్చుకుంటావ్ కదూ?

పద్మ: (అమాయకంగా) ఊఁ!

రఘు: (పద్మ వీపు మీద చేయి వేసి నడుస్తూ) నేర్చుకోమ్మా - నాన్నతో పోట్లాడైనా నేర్చుకో! నేనూ చెప్తాన్లే నాన్నతో! (వాకిలి దగ్గర నిలబడి) సరేనా?

పద్మ: (అమాయకంగా తల ఆడిస్తూ) సరేన్నా!

రఘు: ఇక పో!

(వికసించిన ముఖంతో, మెరిసే కన్నులతో, పద్మ ఒక క్షణంసేపు రఘు ముఖంలోకి చూసి నిష్క్రమించుతుంది. రఘు ఒక క్షణం పద్మ పోయినవైపే చూస్తూ వుండి దీర్ఘంగా నిట్టూర్చి, మెల్లగావచ్చి కుర్చీలో కూర్చొంటాడు. నేపథ్యంలో నుండి విషాద సంగీతం అస్పష్టంగా ప్రారంభమై క్రమంగా స్థాయి హెచ్చుతూ వుంటుంది. అర్థ నిమిషం తర్వాత రఘు ఎడమచేతిలోనే వున్న కాగితం మరొకసారి చదువుకొని విచారంగా నవ్వుకొంటాడు. నేపథ్య సంగీతం హఠాత్తుగా స్థాయి హెచ్చి, హృదయ విదారకంగా వినపడుతుంది. ఒక నిమిషం తర్వాత తండ్రి ప్రవేశం. సంగీతం ఆగి పోతుంది.)

తండ్రి: (వస్తూనే) ఒరేయ్ మీఅమ్మేది? (నేరుగా వాకిలిదగ్గరికి పోయి) పద్మా, ఓ పద్మా, మీ అమ్మను రమ్మను. (వచ్చి సంచంమీద కూర్చొనును.)

రఘు: (జాబు చూపిస్తూ) హైదరాబాదునుండి జాబు వచ్చింది నాన్నా!

తండ్రి: బ్యాంకినుండేనా?

రఘు: ఆఁ. ఉద్యోగం యివ్వలేదు.

తండ్రి: (ఉట్టిపాటుగా లేచి, నిలబడి కోపంగా) ఉద్యోగం యివ్వలేదూ? ఎందుకివ్వరంట?

రఘు: ఆ సంగతేమీ లేదు. ఉద్యోగం మాత్రం లేదన్నారు.

[తల్లి ప్రవేశం: వాకిలిదగ్గర నిలబడును]

తండ్రి: ఏం? నీకేం లోటుందంట? ఇంతకంటే పెద్దచదువు కావాలేం ఆ వుద్యోగానికి?

రఘు: వాళ్ళకు కావలసిన వాళ్ళకు యిచ్చి వుంటారు - ఆ వుద్యోగం. మన మిక్కడ కోపగించుకుంటే ఏం లాభం నాన్నా!

తండ్రి : (అటూ యిటూ తిరుగుతూ) దొంగ... ఈ వుద్యోగానికి అడ్డమైన వాళ్ళ నందరినీ ఆశ్రయించినాను. ఇద్దరు యం.యల్.ఏ. లతో సిఫారస్ చేయించినాను. ఇన్నూరు రూపాయలు ఖర్చైనాయి. (రెండు మూడు క్షణాలు నిశ్శబ్దం.) ఊఁ—ఐతే యికేం చేస్తావ్ ?

రఘు : చేసేదేముంది నాన్నా ? యేదో వొక ప్రయత్నం చేస్తూ వుండవలసిందే.

తండ్రి : (నిలబడి) యేడ్చినట్లే వుంది నీ ప్రయత్నం. ఇప్పటికి నీ ప్రయత్నాలకే వెయ్యి రూపాయలు ఖర్చైనాయి.

తల్లి : దానికి వాడేం చేస్తాడూ ? వానికి మాత్రం వుద్యోగం రాకూడదని వుంటుందా ?

తండ్రి : (మరింత ఆవేశంతో) నీవూ తోడైనావ్ వానికి ? యింక తల్లీ కొడుకూ కలిసి నెలగబెట్టండి సంసారం.

తల్లి : యిది బాగుందండీ ! యిప్పుడు యేమన్నానని నేను ?

తండ్రి : ఏమనలేదులే. ఇక నయాచెయ్.

తల్లి : మీరు పిలువలేదూ నన్ను ?

తండ్రి : ఆఁ ? (వెంటనే జ్ఞాపకంవచ్చి) పిలిచినాలే. | యేదీ — మీరిద్దరూ కలిసి నన్ను మాట్లాడ నిస్తేనా !

తల్లి : (చిరునవ్వుతో) సరే లెండి. యేమిటో యిప్పుడైనా చెప్పండి.

తండ్రి : (మంచంమీద కూర్చుంటూ). యేమిటి చెప్పేది — నా తలకాయ. అక్కడ వొక పని నెరవేరిందిగదా అని సంతోషంగా యింటికి వస్తే, యిక్కడ వీడు పెద్దమ్మ మాదిరి కుర్చీలో కూర్చొని వున్నాడు — వుద్యోగం రాలేదు నాన్నా అంటూ. ఇప్పుడు ఈ సంగతి చూసుకోమ్మంటావా, ఆ సంగతి చూసుకోమ్మంటావా ?

(రఘు ఆసక్తితో తండ్రివైపు చూస్తూ వుంటాడు).

తల్లి : ఆ సంగతేమిటో మీరు చెప్తేనా ?

తండ్రి : అదే — పద్మ పెండ్లి సంగతి. నెల్లూరు వాళ్లు యీ దినం వస్తున్నారు — పిల్లను చూసుకోడానికి. వెంకట్రామయ్యకు జాబు వ్రాసినారు.

తల్లి : మధ్యాహ్నం రైలుకు వస్తారా ?

తండ్రి : ఆఁ — వచ్చి వెంకట్రామయ్య యింట్లో దిగుతారుట. సాయంత్రం వస్తారు మనింటికి.

రఘు ; పద్మ పెండ్లికి యిప్పుడేం తొందర వచ్చింది నాన్నా ? యింకా రెండేండ్లు వుండకూడదూ ?

తండ్రి : (విసురుగా) నీ దేమిట్రా మధ్యలో ! యింకా రెండేండ్లయితే నీకు జిల్లా కలెక్టర్ వుద్యోగం వస్తుందేం ? అప్పుడు చెల్లెలికి ఘనంగా పెండ్లిచేస్తావేం ?

రఘు : (శాంతంగా) అదికాదు నాన్నా. పద్మకిప్పుడు యేమంత వయస్సుందనీ ?

తండ్రి : యేడ్చినావ్ లే. ఆడపిల్లకు ఎంత వయస్సు వుండాలనుకున్నావ్ యింకా ? యీ సంబంధం కుదిరితే వెంటనే పెండ్లిచేసేసేదే.

తల్లి : వాళ్ళకు రాత్రికి మనింట్లోనే వంట చేయమంటారా ?

(సశేషం)

విజయవంతముగా నడచుచున్న చిత్రం!



విక్రమ్
ప్రొడక్షన్ వారి
రాజా
మలయ సింహ
నిర్మాత - దర్శకుడు - B.S. రంగా

(ముఖ్యమైన ఘట్టములు పంచరంగులలో)
జానకి, రాజసులోచన, సూర్యకళ, రంజన్, రాజనాల, పద్మనాభం,
సి. యస్. ఆర్., వంగర, శ్రీరామ్. (గెస్ట్ ఆర్టిస్ట్) —నవయుగ

EDITED, PRINTED AND PUBLISHED BY TUMMALA VENKATARAMAYYA AND PRINTED AT SWATANTRA ART PRINTERS, VIJAYAWADA.



# అభ్యుదయ

## సాహిత్య మాసపత్రిక

1959 - ఏప్రియల్

★

సంపాదకవర్గం:

శ్రీరంగం శ్రీనివాసరావు, కొడవటిగంటి కుటుంబరావు,
అనిసెట్టి సుబ్బారావు, తుమ్మల వెంకటరామయ్య, కె. వి. రమణారెడ్డి.

★

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం
విజయవాడ - 2.

అర్ధరూపాయి.

## Extracts From The Proceedings of The Director of Public Libraries, Andhra Pradesh – Hyderabad.

*R. C. No.* 1533 M 4/57. *Dated* 27–1–'58.

The following Monthly magazine is commended for use in all the Public Libraries in the State.

Name : "Abhyudaya"......................

★

### 83/58 స్థానిక పరిపాలన ఇనస్పెక్టర్ జనరల్ కార్యాలయం

యల్. డిస్. నెం. 92369/58 – తేదీ 25 అక్టోబరు 1958

"అభ్యుదయ" తెలుగు మాసపత్రిక పంచాయితీ గ్రంథాలయములలో ఉపయోగించుటకు సిఫార్సు.

**ఉత్తర్వు :**

ఆంధ్రప్రదేశ్ లోని పంచాయితీలకు ఇందుమూలంగా తెలియపరచునదేమనగా అవి తలచినట్లయిన "అభ్యుదయ" తెలుగు మాసపత్రికకు చందా కట్టవచ్చును...

★

ముఖచిత్రం :

ఉద్వేగం : ఎ. వి. యస్. ఆర్. జోస్యులు

★

## ఈ సంచికలో

రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీశ్రీ, వంగల పార్థసారధి ఆచార్య, ఆర్. రామచంద్రారెడ్డి, రావెళ్ల వెంకట్రామారావు, సంజీవదేవ్, మద్దుకూరి చంద్రశేఖరరావు, "తారక", పూసపాటి కృష్ణంరాజు.

# అభ్యుదయ

సంపుటి 5 ]　　　1959 - ఏప్రియల్　　　[ సంచిక 4


## సాహితీ సంస్థల కర్తవ్యం

"పాతకొత్తలమేలు కలయిక" నే ప్రగతివాదులంతా కోరేది. గత మనేది లేకుండా నేడు, రేపు అనేవిలేవు. అలా అని వెనుకచూపుతప్ప ముందుచూపు లేనివారికి భవిష్యత్తు శూన్యం. గత సంప్రదాయాలను జీర్ణించుకొని, అందులోని ఉత్తమగుణాలను అలవరచుకొన్నపుడే, మన సాహిత్యానికీ, సంస్కృతికీ నిజమైన వారసులమౌతాం. అందుకు ప్రాచీనసాహిత్యంలోని అందచందాలను ఈతరంవారికి అందచేయడం అవసరం.

పోషించెడివారు లేక, ఆదరించెడివారు లేక, ప్రోత్సాహ మిచ్చేవారు లేక ఎందరో ప్రతిభావ్యుత్పన్నులైన పండితులు, విమర్శకులు అజ్ఞాతంగా వుంటున్నారు. వారితో పరిచయమున్న వారికి తప్ప ఇతరులకు వారి పాండిత్యం అక్కరకు రాకుండా పోతున్నది. అప్పుడప్పుడేవైనా ఒకటిరెండు ప్రసంగాల వల్లనో, వ్యాసాలద్వారానో, ప్రామాణిక గ్రంథాలలోని నిగ్గులను మనం తెలుసుకోగల్గినా, సమగ్రవ్యాఖ్యానాలు మనకు లభించడంలేదు. ఈనాడు వృద్ధపండితులెందరో దారిద్ర్యబాధతో క్రుంగిపోతున్నారు. పొట్టపోసుకోవడమే ఒక సమస్య అయినపుడు, గ్రంథ ప్రచురణకోసం వారంతకువారు ప్రయత్నాలుచేయడం కష్టం. వృద్ధతరంలోని పండిత సంప్రదాయం మనకు అంతరించక ముందే ఆంధ్ర మహాకావ్యాలకు వ్యాఖ్యలను రచింపజేయుట ప్రచురించుట సాహితీ సంస్థల ప్రధాన కర్తవ్యం. ముఖ్యంగా ఆంధ్ర సాహిత్య అకాడమీ ఈ పనికి పూనుకోవాలి. ఇప్పటివరకు సమగ్ర వ్యాఖ్యానాలు వివరణలు లేని ప్రామాణిక గ్రంథాలకు అర్హులైన పండితులచే సమగ్ర వ్యాఖ్యానాలు వ్రాయించి, ప్రచురించి, తన ఆశయాలలో పేర్కొన్న విషయాలను కార్యరూపం దాల్చేటట్లు అకాడమీ చేస్తుందని ఆశిద్దాం.

## విధి - నిక్షేపాలు :

# శ్రీనాథుని శిల్పం

శ్రీనాథుని కావ్యరసధుని నుండి కొంత చవిచూపించారు శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రిగారు గత సంచికలో. శ్రీనాథ మహాకవి శిల్పచాతుర్యాన్ని చాటే మరికొన్ని విశేషాలను ఇప్పుడందించుతున్నాం. ఈ పద్యాలకు లఘు వ్యాఖ్య సమకూర్చినది యువకవీ, చిత్రకారుడూ, వ్యంగ్య గేయ – చిత్రకళావేత్తా అయిన శ్రీ రాంభట్ల కృష్ణమూర్తిగారు. వారికి మా కృతజ్ఞత.

—సంపాదకులు

శ్రీనాథుడు శిల్పి. మాటలకు రూపులు దిద్దుతాడు. రంగులు అద్దుతాడు. ఒక్కొక్కచోట ఆయన చేసే వర్ణన సినిమా చిత్రంలాగ మన కళ్ళముందు మెదులుతుంది. అదికూడా చక్కని నేపథ్య సంగీతంగల పంచరంగుల చిత్రం.

కాశీ ఖండంలో సూర్యోదయవర్ణన ఇందుకు ఉదాహరణ. వింధ్యపర్వతం గర్వించి ఆకాశం ఎత్తున లేచింది. సూర్యచంద్రుల గతి తప్పడంతో లోకాలన్నీ తల్లడిల్లిపోతాయి. నక్షత్రమండలం అంతా రాసిపడుతుంది. కాలక్రమమే ఆగిపోతుంది.

సూర్యుని రథం మామూలుగా ఆ రోజున కూడా బయలుదేరింది. రాత్రి అనే కారడవిని నరికే గండ్రగొడ్డలి లాగ, కారుచీకట్లను కబళించే నిప్పు నాల్కలాగ, నక్షత్రాలనే కలువలను తుంచడానికి సూర్యుడు చాపిన చేయిలాగ, మన్నును మిన్నును వేరుచేయడానికి గీచిన గీతలాగ తూర్పు దిక్కున అరుణోదయమయింది. చంద్రబింబం వెలవెలపోయింది. చీకట్లు చెల్లాచెదరై పారిపోయాయి. ఉదయపర్వతం రెక్కలను ఇంద్రుడు నరకగా అక్కడ చెమరించిన నెత్తురులాగ సూర్యకిరణాలు కొన్ని ఆకాశాన పారినాయి.

సీ॥ తఱిపి వెన్నెలలోని ధావళ్యమొక కొండ
నవసుధా కర్దమ ద్రవముగాఁగఁ
జెన్నారి పొన్నారి చిఱుతచీకటి చాయ
యసలుకొల్పిన మహీరసముగాఁగ

నిద్ర మేల్కాంచిన నెత్తమ్మిమొగడల
పసవంపుఁ బుప్పొళ్ళ హారిదళముగఁ
దొగరువన్నియ లేఁత తొలుసంజకెంజాయ
కమనీయధాతు రాగంబుగాఁగ

గీ॥ వర్ణములు గూర్చి యామినీవ్యపగమమున
జగము చిత్రింపఁ దూలిక చందమైనఁ
గోమసుప్రాయంపు నూనూఁగుఁ గొదమ యెండ
ప్రాచి కభినవమాణిక్యపదక మయ్యె.

తరిపివెన్నెలలోని తెలుపు, చిరుచీకట్లలోని నలుపు, అరవిచ్చిన తామరపుప్పొడిలోని పసుపు, తొలిసంజకెంజాయలోని ఎరుపు - ఈ రంగులను కూర్చుకొని నూనూగు కొదమఎండ కుంచెగా ప్రపంచాన్ని చిత్రిస్తున్నాడు చిత్రకారుడు. ఒక్కొక్క పూతతో బొమ్మకు ఒక్కొక్క కళ పెరుగుతోంది. కొన్నిక్షణాల్లోనే చిత్రం పూర్తి అయి జీవకళలతో మనకు దర్శనమిస్తుంది.

సూర్యునిరథం ఉదయాద్రి శిఖరానికెక్కింది. ఆకొండచరియ మీదనుంచి కిందికి జారకుండా ఉండడానికి గుర్రాలు వెనకడెక్కల్ని తన్నిపట్టాయి. ఆ తన్నిపట్టినప్పుడు నాడాలువేసిన డెక్కలు రాతికి కొట్టుకొని టంగని మ్రోగుతున్నాయి వినండి.

సీ॥ చరమ రింఖాపుటాంచల టంకశిఖరంబు
లుదయాద్రి చటిజాఱకుండ మోపి
తీఁగసాఁగిన భంగి దీర్ఘదీర్ఘములైన
యంగకమ్ముల రజ్జులలిమి యెత్తి
నుత్తానుడై నెక్కు కొరిగి పిచ్చుకకుంటు
విప్రతీపంబుగా వినుతిసేయ
నవగత న్యాసాంగమగుటఁ జిత్కారంబు
నలిఁగాఁగ జక్రంబు విభ్రమింప
తే॥ నభ్రవీథికి లంఘించె నమ్మహాద్రి
గంధవాహ ప్రవాహాభిఘట్టనమున
గేతనము మీఁది పసిఁడి కింకిణులు మొరయ
మెఱపు మెఱసిన చందాన మిహిరురథము.

సూర్యుని రథం ఆకాశంమీదికి ఎగిరింది. అది దక్షిణాయనం. అందుకని లంక నుంచి తుండీర పాండ్యదేశాల మీదుగా బయలుదేరింది. అక్కడనుంచి నడినెత్తికెక్కింది. అప్పుడు -

సీ॥ విసృమరధ్వాంతౌఘ విధ్వంసన క్రియా
పరమ దీక్షారంభ గురుమయూఖ
దశశత పరిషదాధార మండలుఁడైన
చండభానుని కధిష్ఠాన మగుట
భారంబు భరియింప బరువు పడ్డదివోలె
మూఁపు మూఁపున జేరి మొక్కలమున
ననిలంబు లేఁడును నంచెలంచెలు గట్టి
యాకాశవీథి నందంద నడవ

గీ॥ నడచు రవితేరు మింటనెనన్నడిమిచక్కఁ
బ్రగ్గనఁగఁదాఁకె వింధ్యపర్వతము చఱులఁ
గఠిన నిర్ఘోష నిర్ఘాతఘట్టనమున
బంకజాతభవాండ కర్పరము పగుల.

చండభానుడు కూర్చున్న రథం మరి చాలా బరువు కదా! ఆ బరువు మోసి గుర్రాలు కొత్త కుంగడం సహజం. ఆ బరువు ఒత్తిడిని కవిసార్వభౌముడు అయిదవ అక్కర వర్గంలో పొదిగినాడు. ముందు కొంచెం దీర్ఘంగా వున్న 'ఫ' తర్వాత 'భ' బ, ప, వ, ఆ తర్వాతను ములాగ ఆ పాదంలో అక్షరాలు క్రమంగా సరళమై తేలికైపోయాయి. ఆ బరువును కూడా గుర్రాలు తేలిక చేసుకున్నాయి. అక్కడనుంచి 'అంచెలంచెలు గట్టి ఆకాశవీథినందంద' హుషారుగా సాగినాయి. అలా వెళ్ళి వెళ్ళి వింధ్యపర్వతాన్ని కొట్టుకున్నాయి. దానితో రథం బహుశా కొయ్యరథం అయివుంటుందేమో "బ్రగ్గ" ని బద్దలైంది. ఆ తర్వాత దానినుంచి పుట్టిన ప్రతిధ్వని ఎంత గట్టిదో ఆ మాటలే తెల్పుతున్నాయి.

అలా ఢీకొన్న రథంలో ముక్కలైన భాగాలు బహుశా జలజల గలగల రాలి వుంటాయి. అయినా కాకపోయినా కవిసార్వభౌముడు లఘువులను వాడి మనకలాంటి నేపథ్యధ్వనులు వినిపిస్తున్నాడు.

క॥ తగులువడి యపుడు వడిసెడి
గగన మణిరథంబు దోరగలువడి నిలిచెన్

బాగుగు మొగకడలి యక్కలిఁ

దగిలిఁ నిలువఁబడిన ఘన వితతియుంబోలెన్.

దానితో ఎక్కడి కాలం అక్కడ ఆగి పోయింది. ముక్కలు రాలిపడ్డాయి. లోకాలు తల్లడిల్లినాయి. పశ్చిమదేశాల్లో అసలు పగలనేదే లేక అక్కడివారు పాముకరిచిన వారిలా మూర్ఛిల్లిపడినారు.

అగస్త్యమహర్షి వింధ్యను కురచ పరచిన తర్వాత సూర్యరథం తిరిగి కదులుతుంది.

సూర్యుని గుర్రాలు ఉదయాద్రిమీద పటికపురాలలో తమనీడ చూచుకొని అవి ఏవో గుర్రాలనుకొని సకిలిస్తాయి. పద్మరాగాలను చూచి అస్తమయం అయి పోయిందని అనుమానపడతాయి. మరకతం పలకల్లో అవి కనిపించీ కనిపించ నట్లుంటాయి. వైడూర్య శిలలను చూచి నీరుతాగుదామని తలలు వంచుతాయి. కిన్నరపడతులను చూచి బెకురుకుతాయి.

ఆ గుర్రాలూ చిలకల్లా ఎగురుతున్నా యంటున్నాడు కవిసార్వభౌముడు. సూర్యునిగుర్రాలు పచ్చగా ఉంటాయి. అవన్నీ ప్రతిబింబించి ఇరుపక్కలా మేఘాలు రెక్కల్లా వున్నాయి. కకుక్కల కళ్ళానికి గాటువడి నెత్తురోడి ముఖం ఎర్రవారినాయి. చూడండి.

సీ॥ తమ తనుచ్ఛాయ మేఘములు పచ్చని వన్నె
నుభయపక్షములునై యూఁగియాడఁ
గళ్ళాలఁదెఁగిన సృక్కములఁ గ్రొన్నెత్తురు
లాలనంబులకుఁ గెంపావహింప
నుడుపథంబునయందు నుండినగతిధార
గమన వేగంబునఁ గానఁబడఁగఁ
శుకముఖద్విజకోటి సులభకౌతూహల
వ్యతిషంగమునఁ జేరి యనుచరింపఁ

తే॥ చిలకలునుబోలె హేమాద్రి శిఖరశృంగ
కల్పవృక్షాటవీవాటికలఁ జరించె
మహీధరము సేయునంకిలి మానుటయును
వనజ వనబాంధవుని తేరివారువములు.

గుర్రాలు మంచి పలాకీగా ఉన్నాయి. మధ్యలో ఎక్కడైనా ఆకాశగంగ ఒడ్డున ఇసకలో గిట్టలు చిక్కుకున్నా, వేగం కాస్త మందగించినా, దేవతల కిరీటాల్లోని మరకతాలను చూచి లేగరిక అనుకొని అటు తిరిగినా, చంద్రబింబాన్ని చూచి సైంధవ లవణం అచ్చు అనుకొని ఆసపడినా, సూర్యసారధి పిచ్చుకకుంటు – అనూరుడు – బంగారు గిలకలకోల అదలించి గట్టిగా హుమ్మంటే చాలు గేలప్ అందుకుంటాయి గుర్రాలు.

ఇదే ఆయన శిల్పం – ఇలాగ ఆయన కావ్యాలలో తరచినకొద్దీ నిధినిక్షేపాలు కొల్లలుగా దొరుకుతాయి.



# తెలుగు సాహిత్యంలో గూఢత - వేమన

**శ్రీ శ్రీ**

నేను చేస్తున్న ఈ ప్రసంగం ఎందరు వింటున్నారో నాకు తెలియదు గాని వింటున్న వారందరూ "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో అంతమయ్యే పద్యాలను వినే ఉంటారని నాకు బాగా తెలుసును. వాటిని రచించిన వేమనలోని గూఢత ప్రస్తుతం నేను ప్రసంగించబోతున్న విషయం. అందరూ విన్నట్టివీ, అందరికీ అందుబాటులో ఉన్నట్టివీ, అందరికీ అర్థమయ్యేవీ అయితే ఇక వేమన పద్యాలలో ఉన్న గూఢత ఏమిటీ అనే ప్రశ్న రావచ్చును. అయితే ఈ అర్థంకావడమనేది అనేక అంతస్తులలో ఉంటుంది. ఒక్కొక్కరి సంస్కారపు స్థాయినిబట్టి ఒకే పద్యం ఒక్కొక్క విధంగా అర్థం అవుతుంది. అందరికీ అర్థం కాగా ఇంకా ఎంతో మిగిలిపోయే అర్థం ఉంటుంది, మహా కవిత్వానికి! అంతేకాదు; కాలం గడిచిన కొద్దీ ఆ కవిత్వం కొత్తగా ఏర్పడ్డ పరిస్థితులమీద వ్యాఖ్యానంగా సరిపోగలుగుతుంది.

ఉదాహరణకు: "చెప్పులోని రాయి" అన్న పద్యం ఉంది.

"చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా
విశ్వదాభిరామ వినురవేమ"

మానవ జాతి యావత్తూ ఒకే కుటుంబంగా రూపొందుతూన్న ఈ రోజులలో ఐక్య రాజ్య సమితి సమావేశాలలోని వాగ్యుద్ధాల మీద "ఇంటిలోని పోరు ఇంతింత కాదయా" అన్న కవి వాక్యం సముచితమైన వ్యాఖ్యానం కాదని ఎవరనగలరు?

అసలు గూఢత అనే మాటకే అర్థం కాకపోవడం అనే అర్థం ఒక్కటే అర్థం కాదు. ఎక్కడో ఏదో వుంది. ఎంత ప్రయత్నించినా ఎవరికీ అందదది. ఎలాగయినా దాన్ని తెలుసుకోవాలి. అంతే కాదు. ఆ తెలుసుకున్న దాన్ని అందరికీ తెలియజేయాలి. అదే జిజ్ఞాస. అటువంటి జిజ్ఞాసను ప్రదర్శించేదే గూఢ కవిత్వం. "మిస్టిసిజం" అనే ఇంగ్లీషు మాటకు పర్యాయపదంగా వాడుతున్న ఈ గూఢత కేవలం అర్థం కాకపోవడంతో ఆగిపోదు. అత్యున్నత స్థాయిలో అదొక ఆధ్యాత్మిక అనుభూతి; పారవశ్యం దానికి ప్రాతిపదిక! తెలుసుకో శక్యం కానిదాన్ని తెలుసుకోవడానికి చేసే తపస్సు!

గాజు కుప్పెలోన గడగుచు దీపంబు
ఎట్టులుండు జ్ఞాన మట్టులుండు

తెలిసినట్టి వారి దేహంబు లందున
విశ్వదాభిరామ! వినుర వేమ!

ఎవరీ "తెలిసినట్టి వారు"? ఏమిటి తెలిసినట్టి వారు? తెలివికీ తెలియమికీ మధ్య స్పష్టమైన సరిహద్దు గీత ఏదైనా ఉందా?

ఈ సరిహద్దు గీతను కనిపెట్టడానికి కావించే అన్వేషణమే గూఢ కవిత్వం.

వేమన జీవితమంతా ఈ అన్వేషణలోనే గడచింది. సమస్త జీవితానుభవాలనూ చవిచూచిన తర్వాత అతనొక వేత్తగా, ద్రష్టగా, బోధగా పరిణతి పొందాడు. అప్పుడతనిలో కవిత్వం అప్రయత్నంగా పుట్టుకొచ్చింది. అతని చుట్టూ ఎప్పుడూ అనేకమంది శిష్యులంటూ వుండే వారని అనుకోవడం అసమంజసం కాదు. వేమన పద్యాలను వారే కంఠస్థం చేసుకొని ఉండాలి. అందులో పెద్ద శ్రమ ఏదీలేదు. ఒక్క మారు వింటే ఎన్నటికీ మరిచిపోలేకుండా మనస్సును హత్తి పెట్టుకు పోగలశక్తి ఉన్నవి వేమన పద్యాలు. వేరే ఏ తాటాకుల మీదా ఎవరూ వాటిని వ్రాసుకోనక్కరలేదు. లోకుల నాలుకలమీదనే వేమన తన పద్యాలను విరచించాడు. అందువల్లనే అవి అంత శాశ్వతంగా నిలవగలుగుతున్నాయి. ఎవరూ జ్ఞాపకం ఉంచుకోనివి ఎన్ని వందల పద్యాలయితే మాత్రం ఏం లాభం! "నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు, తళుకు బెళుకు రాలు తట్టెడేల?" అని అందుకే అన్నాడు వేమన. ఒక్క నీలమే కాదు ఇంకా ఎన్నో అమూల్య మణులు అతని పద్యరత్నాలు.

వేమన్న అన్నిరకాల భేషజాలకీ విరోధి. శివపూజలైనా సరే చిత్తశుద్ధి లేకపోతే అతడంగీకరించడు. ఆడంబరం అంటే అతని కసహ్యం.

"అల్పుడెపుడు పల్కు నాడంబరము గాను సజ్జనుండు పల్కు చల్లగాను" అంటాడు.

ఈ చల్లని పలుకుకోసమే అతను జీవించాడు. ఎందుచేతనంటే "కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా?" అని ప్రశ్నించాడు. తెలివితక్కువవాళ్లు మాత్రమే తెగ ఆర్భాటం చేస్తారు. ఆ గందరగోళం అంతటినీ ఒక్క ఆటవెలది పద్యంతో చల్లార్చివేస్తాడు వేమన.

సాధారణంగా "మిస్టిసిజం" మీద వినవచ్చే ఒక విమర్శ ఏమిటంటే, అది జీవితాన్ని నిరాకరిస్తుందనీ; జీవిత సమస్యలనుంచి పలాయనమవుతుందనీ; వైరాగ్యాన్ని ప్రబోధిస్తుందనీ; వైరాగ్యాన్ని ప్రబోధిస్తుందనీ; కాని వేమన కవిత్వంలో ఈ వైరాగ్యం ఎక్కడా కనబడదు, సరికదా నిత్యజీవితంలోని సాధారణానుభవాలే అతని కావ్యవస్తువులు. పరిపూర్ణమైన ప్రాధాన్యాన్ని ఇస్తూనే జీవితానికి గుణపాఠాలు నేర్పగడుసుదనంగలవాక్కు వేస్తున్నది! అతడు స్వీకరించే ఉపమానాలూ, చూపించే నిదర్శనాలూ చుట్టూ ఉన్న ప్రపంచానుంచే పుడికి పుచ్చుకుంటాడు. 'కడవెడైన నేమి ఖరము పాలు!' 'బొగ్గు పాల గడుగ బోవునా మలినంబు!' 'కుంటికుక్క కేల కుందేటి పసుగులు?' 'చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగునా?' ఇటువంటివి ఎన్ని వందలైనా ఎత్తిచూపించవచ్చును. ఇంకో విశేషం ఏమిటంటే ఏ వస్తువూ వేమనదృష్టిలో హీనమైనది కాదు. అన్నింటికీ అతని కవిత్వంలో ప్రవేశానికి అర్హత వుంది—"చెప్పులోని రాయి! చెవి

లోని జోరీగ! కంటిలోని నలుసు! కాలి ముల్లు!" అన్నింటికీ! ప్రపంచాన్ని ఎంతో ప్రేమించగలిగిన వాడొక్కడే ఇంత విశాలహృదయం ప్రదర్శించగలడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమస్త సృష్టినీ సమానంగా పరిగణించడం అంటే ఏమిటో ఆచరణలో చూపించాడు వేమన.

వేమన్నది మహోత్సాహోత్సేత్తమైన విప్లవ తత్వం: ఆత్మని బంధించే అన్ని శృంఖలాలనూ తెగత్రెంచివేసి విశ్వమంతటా నిరాఘాటంగా విహరిస్తుందతని వాణి. ఈ సర్వతంత్ర స్వతంత్రమైన మనస్తత్వం వల్లనే అతడు రాజులనీ, సంఘాన్నీ, భగవంతుణ్ణీ కూడ నిలబెట్టి ప్రశ్నించగలుగుతాడు. అడ్డదిడ్డపు అసందర్భపు ఆచారాలెన్నింటిమీదనో అతని కవిత్వం గొడ్డలిపెట్టు. "ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల?", "తలలు బోడు లైన తలపులు బోడులా?" అని దాంభికులు నిండా కప్పుకున్న ముసుగును హఠాత్తుగా ఊడలాగి పారవేస్తాడు. బహుశా వేమన యోగి అయిన తర్వాత దిగంబరుడుగానే తిరిగి ఉండాలి! దాచిపెట్టడం, కప్పిపెట్టడం అనేవి అతనికి సుతరామూ నచ్చవు. ఏ నీడా, ఏ ముసుగూ లేని పరిశుద్ధ సత్యాన్నతడు సాక్షాత్కరింపజేసుకున్నాడు. ఆ సత్యాన్ని మరుగుపరిచే అవకుంఠనం ఎంత ఖరీదైనదైనా, దాన్ని చింపేస్తే కోపం తెచ్చుకొనే వాళ్ళెంత బలవంతులైనా అతడు లక్ష్యపెట్టలేదు. ఇతరుల దూషణ భూషణాదులతో ఏ మాత్రమూ నిమిత్తంలేని ఎత్తునుంచి జీవితాన్ని పరిశీలిస్తాడు వేమన.

తెలుగు సాహిత్యంలో వేమనకు గల స్థానం విచిత్రమైనదీ, విశిష్టమైనదీను. తతిమ్మా కవులందరిదీ ఒకతోవ! వేమనార్యుడొక్కడిదీ ఒక తోవ! అసలదో తోవ అనడానికి కూడా ఆస్కారం లేదేమో! వేమనతో కలిసి చేసే ప్రయాణం ఆదిమధ్యాంతరహితం! అగమ్యగోచరం. అలాగని అతని వాక్కులో ఎక్కడా అస్పష్టతగాని, సందిగ్ధతగాని ఏమాత్రమూ లేవు. సులభంగా, సూటిగా, సూక్ష్మంగా చెప్పేస్తాడతను, ఎంతెంత కఠినమైన జటిలమైన విషయాలనైనా! నిజాని కతని పద్యాలన్నీ అప్రయత్నంగా అప్పటికప్పుడు చెప్పినవే! చెట్టు మీద పళ్ళు పండినట్లు జీవితంలోంచి పరిపక్వమై పడినవతని పద్యాలు.

ఎంత సంపన్నమైనదా జీవితం! ఎన్నెన్ని వివిధ విచిత్రానుభవాలు! అత్యున్నత శిఖరాగ్రాలూ చూశాడూ, అగాధమైన లోతులూ చూశాడు వేమన! అతని మనస్సులో ఎన్ని తుపానులు చెలరేగి ఉండాలో! శాశ్వతంగా అక్కడ ఒక క్షీరసాగర మథనం సాగిపోతూ ఉండాలి. ఒక కంట్లోంచి అమృతం, ఇంకో కంట్లోంచి హాలాహలం వెళ్ళి గ్రక్కుతూ వుండే వాడనవచ్చును. అయితే ఆ సంక్షోభం అంతా నేపథ్యంలోనే. పైకి వెలువడే పద్యం నిట్టూర్పుకీ, నిశ్శబ్దానికీ చేరువగా ఉంటుంది. నాలుగు పాదాల పద్యంలో ఆఖరిది "విశ్వదాభిరామ వినుర వేమ" అయితే ఇక మిగిలిన మూడు పాదాలలో ఎక్కువ హంగామా చెయ్యడానికేమీ అవకాశం వుండదు. మొదటి పాదంలో ఒక ఊహని ప్రకటి

స్తాడు. దానికి విభిన్నమైన ఊహాని రెండో పాదంలో ప్రవేశపెట్టి రెండింటి చేతా హోరాహోరి పోరాడుకో నిస్తాడు. వెంటనే మూడో పాదంలో తానై జోక్యం చేసుకొని పోలికనగానో, ఉపదేశంగానో, అర్థాంతరన్యాసంగానో దీని సంగతిదీ అని తీర్పు చెబుతాడు. వేమన పద్యాలలో చాలా మట్టుకు గోచరించే గతితార్కిక పద్ధతి ఇదే. ప్రతి విషయపు హృదయంలోకి సరాసరిగా ప్రవేశించి దానిలోని వైరుధ్యాలను బట్ట బయలు చేసి ఆఖరికి తన వ్యాఖ్యానం అందజేస్తాడు.

అది వేమనలోని గూఢార్థం! "అయితే ఏమిటి దీనంతటికీ అర్థం?" అనే ప్రశ్నకి వేమన ఇచ్చిన జవాబు, దేశదేశాలు తిరిగిన తర్వాత, రకరకాల మనుష్యుల్ని చూసిన తర్వాత, ప్రేమ తర్వాత, వియోగం తర్వాత, నవ్వుల తర్వాత, ఏడుపుల తర్వాత, బంగారం తయారు చేసిన తర్వాత, దాని పనికిమాలిన తనం గుర్తించిన తర్వాత, కాలాన్ని ఉపయోగంగానో నిరుపయోగంగానో ఖర్చుపెట్టిన తర్వాత, చెయ్యదలచిందంతా చేసి చూడవలసిందంతా చూసిన తర్వాత, లోకాన్ని క్రిందనించి మీదకీ మీదనుంచీ క్రిందకీ ఊగులాడించి వొదిలిపెట్టిన తర్వాత, యోగిగా, జ్ఞానిగా, కవిగా వేమన చెప్పిన వేదం ఆధ్యాత్మికమే అయినప్పటికీ ఐహిక సమస్యలతో తక్షణ సంబంధం పెట్టుకొన్న కవిత్వం. ఆరేళ్ళ కుర్రాడు మొదలుకొని అరవై యేళ్ళ వృద్ధుడిదాకా ఎవరెవరు ఎన్ని మార్లు చదివినా అందరికీ అన్ని అంతస్తులలో అర్థమయ్యే రహస్యం! ఎవరికీ అంతు పట్టని విషయాల మీద అందరికీ బోధపడే విధంగా చెప్పిన పరమార్థం.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

★

*A Fine Collection of*

**Mahakavi Sri Sri's POEMS**

# THREE CHEERS FOR MAN

**Rendered for the first time into English.**

**Postage Extra**

**Rs. 2/-**

***Copies Available at:***

**Visalaandhra Publishing House,**

**VIJAYAWADA-2.**

# కలవరింత

వంగల పార్థసారథి ఆచార్య

నర్స్! మై గుడ్ నర్స్!!
టేక్ దిస్ డోస్ ఎవే!
నా కీ మందక్కర్లేదు –
నా టెంపరేచర్ రికార్డు చేయనక్కర్లేదు –
దిస్ హాస్పిటలైజేషన్ ఈస్ నాట్ నెససరీ!
అయాం రాంగ్లీ డయోగ్నైజ్డ్! మై గుడ్ నర్స్!!
అయాం రాంగ్లీ డయోగ్నైజ్డ్!!

♦ ♦ ♦

జీవిత ప్రపంచంలో
భావాల అగ్ని పర్వతాలు బ్రద్దలై
లావా ప్రవహించి నాశనం చెయ్యకముందే
ఇవాక్యుయేట్ చెయ్యాలన్నానని
ఇంటలెక్చువల్ డ్రంకర్డన్నారు నన్ను!
ఈ ఆస్పత్రిలో చేర్చారు
ఇక్కడి డాక్టర్లంతా
ఇది హిస్టీరియాలాంటి దన్నారు
ఈ టెంపరేచర్ నార్మలైజ్ చెయ్యాలన్నారు –
అయాం రాంగ్లీ డయోగ్నైజ్డ్! మై గుడ్ నర్స్!!
అయాం రాంగ్లీ డయోగ్నైజ్డ్!!

♦ ♦ ♦

శాంతీ, సౌహార్దం లేని స్వాతంత్ర్యం
స్వర్గానైనా నరకం చేస్తుందన్నాను –
ఆకలి తీరిందని అధికారం గర్వంతో ఆవలిస్తే

అపజయభయాన్ని ఆహ్వానిస్తుందన్నాను –
కలరా, ప్లేగూ తగ్గుతున్నాయంటే
కాటకం వ్యాపిస్తోందన్నాను !
ప్రజలంతా కీటకాలన్నాను
ధనికత్వానికి కారణం ఏన్సెష్టర్సన్నాను !
దారిద్ర్యానికి కారణం మనమే అన్నాను
గనుల గాఢాంధకారాల్లో
జనుల హృదయాంతరాళాలు
కార్ఖానాల ఆధికారిక ప్రేరణ
కరాళ ధ్వనుల్లో
శ్రాంతజనుల నిత్య ముక్తకంఠ
వికార హాహాకారాలు
కరగి కరగి ప్రవహించే లోహాలలో
తరిగిపోయే కండల సమూహాలు
శూన్యదృష్టి నిరాశా ప్రసారాలలో
మెరిసే క్రోధ విస్ఫులింగాలు
చూచి వ్యాఖ్యానించాననీ
కళ్ళు తెరవమన్నాననీ
డైనమోలు ఆపమన్నాననీ
ఈ ఆస్పత్రిలో చేర్చారు !
అయాం రాంగ్లీ డయాగ్నైజ్డ్ ! మై గుడ్ నర్స్ ! !
అయాం రాంగ్లీ డయాగ్నైజ్డ్ ! !

◆ ◆ ◆

మానవ హృదయం అగాధాల్లోంచి
కన్నీటి ఊటల్ని చిమ్ముతుంది !
రమణీయ వసంతోద్యానాలన్నీ
బిచ్చగాళ్ళ కల్యాణానికి
విడిది తోటలు కానున్నాయి ! !...

శ్రమజీవుల నరాల్లో
క్షణాక్షణం ఉప్పొంగే
ధర్మరక్త ధారాసారంలో
చిట్టా యావర్జాల ఎత్తు సిరా అంకెలూ, మరకలూ,
చెరిగిపోబోతున్నాయి !!...
అన్నానని — విన్నావా నర్స్ !!
అందఱూ నాకు హిస్టీరియా అన్నారు !
అయాం రాంగ్లీ డయాగ్నైజ్డ్ ! మై గుడ్ నర్స్ !
అయాం రాంగ్లీ డయాగ్నైజ్డ్

♦ ♦ ♦

నిజంగా కలవరిస్తున్నాను
నిజంగా కల-వరిస్తున్నాను !!
నీ విశాలలోలాక్షు లొక్కసారి
నింగి మీదికి ప్రసారించు !—
ఆ లోకంలోకి - ఆ నాకంలోకి
ప్రసారించు - ప్రసారించు !!
నవభారత యువ నిర్మిత
ధర్మసోపాన పరం
పరాగ్ర విన్యస్తపద
ధ్వనిత తులా కోటి కోటి !
ఉప సంహృత స్వపరభేద —
సముజ్జ్వల సౌహార్ద సౌర
భోచ్ఛ్వాసి స్వేచ్ఛ జన గ
ణోల్లాసాభ్యుదయ శోభ !!
అనతిదూర - మనతిదూర
మదిగో ! అదిగో !! అదుగో !!!
ఇది హిస్టీరియా కాదు నర్స్ !
ఈ మందు నా కక్కర్లేదు —

నాటిక

# పద్మవ్యూహం

## ఆర్. రామచంద్రారెడ్డి

[గత సంచిక తరువాయి]

తండ్రి: భోజనం యేం వద్దులే. సాయంత్రం కొంచెం కాఫీ, ఫలహారం చెయ్... ఆఁ– పద్మ సంగీతమేమైనా చూడాలంటారేమో – ముందుగానే మంచి పాట ఒకటి చూసుకొని వుండమని చెప్పు.

తల్లి: సరేగాని–యిక భోజనానికి రాండి. (నిష్క్రమణ)

రఘు: ఈ సంబంధం కుదురుతుందా నాన్నా?

తండ్రి: యేం యెందుక్కుదరదూ? తప్పక కుదురుతుందంటున్నాడు వెంకట్రామయ్య.

రఘు: కుదిరినా యింకొక సంవత్సరం వరకూ పెండ్లి ఆపలేరూ? పద్మకింకా పదహారేండ్లు నిండినాయో లేదో.

తండ్రి: అంతా నీ యిష్టమేనేంరా? అవతల పెద్దమనుషులేమో అర్జంటుగా పెండ్లి కావాలంటున్నారు. ఇంట్లో ఆడదిక్కులేదని వాళ్ళు తొందరపడుతున్నారు.

రఘు: (బాధతో) ఆడదిక్కు లేకపోతే యీ పసిపిల్ల వాళ్ళకు దిక్కౌతుందా?

తండ్రి: (లేచి దగ్గరకువస్తూ–కోపంగా) యేమిట్రా నీ యేడుపు? యింత మాత్రం సంబంధం రావాలంటే ఐదువేలైనా కట్నం యిచ్చుకోవాలి.

### పూర్వ కథ

[పద్మ, రఘు ఒక మధ్యతరగతి గృహస్థుని బిడ్డలు. రఘు బి. ఎ. ప్యాసయినా యింకా ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగంకోసం చేసే అతని ప్రయత్నాలు విఫలమయినందుకు తండ్రికి అతనిపై కోపంగా ఉంటుంది. పద్మకు సంగీతంలో అభిలాష హెచ్చు. కాని సంసారపరిస్థితులు అంతగా అనుకూలించనందున సంగీతం మానుకోవాలని భయపడుతూ వుంటుంది. ఇంతలో పద్మ పెళ్లిచూపులకు ఎవరో వచ్చారని తండ్రి ఇంట్లో చెబుతాడు.]

వీళ్ళదో యిరవై తులాలు బంగారు పెట్టే చాలన్నారు. ఇట్లా సంబంధం నీవు కోరినప్పుడల్లా దొరుకుతుందేం? (అటూ యిటూ తిరుగుతుంటాడు).

రఘు: (నిదానంగా– కంఠంలో వ్యంగ్యం ధ్వనించకుండా) అంత గొప్పదా ఈ సంబంధం?

తండ్రి: (నిలబడి) గొప్పదిగాక బియ్యే ప్యాసై ముండమాదిరి ఇంట్లో కూర్చోవడమనుకున్నావా. నీవు కూర్చున్నట్లే. లక్షణంగా బట్టలషాపు పెట్టుకొని యేటా నాలుగువేలు వెనకేస్తున్నాడు

పెండ్లి కొడుకు. (మళ్ళీ అటూయిటూ తిరుగుతుంటాడు.)

రఘు: (తలవంచుకొనును. ఒక క్షణం నిశ్శబ్దం, తలయెత్తకుండా) నాకు వుద్యోగంరాలేదని పసిపిల్ల తలమీద అంతబరువు వేయమన్నారా?

తండ్రి: (నిలబడి) యేమిట్రా మాట మాటకూ పసిపిల్ల పసిపిల్ల అని? నాకు లేని అభిమానం నీకే వున్నట్లు? పైగా తలబరువంట! పెండ్లి చేయడమూ, అత్తవారింటికి పంపడమూ బరువౌతుందేం ఆడపిల్లకు? ఇంగ్లీషు చదువులు చదివితే వున్నమతి పోయిందంట! (మళ్ళీ అటూయిటూ తిరుగుతుంటాడు)

రఘు: (తలయెత్తకుండానే -బాగా) ఒక సంవత్సరమైనా పెండ్లి ఆపు నాన్నా. అందాకా సంగీతమైనా నేర్చుకుంటుంది పద్మ.

తండ్రి: (నిలబడి) సంగీతానికేమొచ్చిందిరా యిపుడు? పెండ్లయిన తర్వాత వాళ్ళు మోజుపడితే వాళ్ళే చెప్పించుకుంటారు. వాళ్ళు చెప్పిస్తే మనమొద్దంటామా?

రఘు: (తలయెత్తి తండ్రివైపు చూస్తూ) వాళ్ళు చెప్పించకపోతే?

తండ్రి: మనమేం చేస్తాం? పెండ్లయిన తర్వాత మన మాటేముంది యింక?

రఘు: అందుకనే పెండ్లి కాకముందే ఇంకా వొక సంవత్సరమైనా సంగీతం చెప్పించమనేది.

తండ్రి: (తీవ్రకోపంతో) ఛీ! ఇన్నేండ్లు వచ్చినా నీకు బుద్ధనేది లేదురా. (ఇంట్లోకి నిష్క్రమణ) [విషాదంగా ఫిడేలురాగం. రఘు తల వంచుకొని దిగులుగా వుంటాడు. అర్ధనిముషం తర్వాత తెర మెల్లగా పడుతుంది.]

## రెండవ రంగం

[మొదటి రంగంలోని స్థలమే. మంచం వుండదు. కుడివైపున మూడు కుర్చీలూ, యెడమవైపున మూడు కుర్చీలూ యెదురెదురుగా వుంటాయి. మధ్యలో ఒక చిన్న టేబుల్, దానిమీద టేబుల్ క్లాత్, తాంబూలం సరంజామా, సిగరెట్ పెట్టె వగైరా వుంటాయి. ఒకవైపు మూడు కుర్చీలలో (ప్రేక్షకుల వైపునుండి) వరుసగా సత్యనారాయణ, సోమయ్య, వెంకట్రామయ్య కూర్చొని వుంటారు. మరొకవైపు రఘూ, తండ్రీ కూర్చొనివుంటారు. ఒక కుర్చీ ఖాళీగా వుంటుంది. రఘు ప్రక్కన చాపమీద కూర్చొని పద్మ ఫిడేలు వాయించుకొంటుంది. తెర యెత్తేటప్పటికి పాట చాలాభాగం ఐపోతుంది. రఘు విచారంగా యెక్కడో అనంతంలోకి చూస్తూ వుంటాడు. సత్యనారాయణ సూటూ బూటూ వేసుకొని వుంటాడు. యెడమచేతికి బంగారు గొలుసుగల గోల్డు గోల్డురిస్టువాచీ, మూడు నాలుగు వుంగరాలూ, అప్పుడప్పుడూ పద్మ వైపుచూస్తూ, గడియారం చూసుకుంటూ, ఉంగరాలు సర్దుకుంటూ ఉంటాడు. సోమయ్యా, వెంకట్రామయ్యా, అప్పుడప్పుడు గుసగుస లాడుకొంటుంటారు. తల్లి వాకిట్లో నిలబడి వుంటుంది. పాట ముగిసినతర్వాత సంగీత సాధనాలు తీసుకొని పద్మా, పద్మవెంట తల్లీ నిష్క్రమించుతారు.]

తండ్రి : యేమండీ సోమయ్యగారూ - పిల్ల నచ్చిందా ?

సోమ : నాదేముందండీ ? పెండ్లి కొడుకు నడగండి. (లేచి టేబుల్ మీది వున్న వక్కపొడి కొంత నోట్లో వేసుకొని మళ్ళీ కుర్చీలో కూర్చొంటాడు.)

వెంక : యేమోయ్ సత్యనారాయణా ? నిన్నే అడిగేది - పిల్లనచ్చిందా ?

సత్య : ఆఁ ఆఁ నచ్చిందండీ.

వెంక : సంగీతంకూడా విన్నారు కదూ ? యేమంటారు ?

సోమ: చాలా బాగుందండీ(సత్య...తో) యేం సత్యం ?

సత్య : నిజమే - నిజమే.

రఘు : సోమయ్యగారూ, మా పద్మ కింకా సంగీతం నేర్చుకోవాలనివుంది. మీ వూళ్లో మంచి విద్వాంసు లెవరైనావుంటే...ఇంకా కొన్నాళ్లు...

సోమ : చూస్తాంలెండి - అదేం పెద్ద భాగ్యమా ?

తండ్రి : (రఘుతో) మన మెందుకురా అవన్నీ చెప్పడం ? పద్మను వాళ్ళ చేతిలో పెట్టింతర్వాత సంగీతమే నేర్పిస్తారో, చట్టుబండలే నేర్పిస్తారో వాళ్ళ యిష్టం.

సోమ : వున్నమాట అన్నారండీ! ఐనా యీ కాలంలో మనం సంగీతం నేర్చుకోవడ మెందుకండీ ? ఎల్లగా రేడియో తిప్పితే యెవరో వొకరు పాడుతూనే వుంటారు. హాయిగా వినవచ్చు.

సత్య : రేడియో మొన్ననే కొన్నాం వొకటి. సెకండు హాండుదైనా కొత్తదానికంటె బాగుంది.

తండ్రి : (రఘుతో) యింకేంరా ? మంచి రేడియో వున్నదంట - యెన్ని పాటలైనా వినవచ్చు.

వెంక : రేడియోలో సంగీతంపాఠాలు కూడా చెప్తారు. మన అమ్మాయి యెంత సంగీతమైనా నేర్చుకోవచ్చు.

తండ్రి : (రఘుతో) వింటున్నావురా? అంతా నీవు కోరినట్లే జరుగుతుందిలే.

(రఘుమౌనం):

సోమ : మీ అబ్బాయి యేం చేస్తున్నాడండీ ?

తండ్రి : మొన్ననే బియ్యే పూర్తయిందండీ. ఉద్యోగం కొరకు ప్రయత్నం చేస్తున్నాం.

సోమ : వుద్యోగాలు దొరకడం మహా కష్టమైపోయిందండీ యీ రోజుల్లో. వేలు వేలు ఖర్చుపెట్టి చదువు చెప్పించడం వొకత్తూ, ఆ తర్వాత వుద్యోగం సంపాయించడం వొకత్తూ.

వెంక : బ్యాంకి వుద్యోగం వొకటి ప్రయత్నం చేస్తున్నారులేండి. అది తప్పక వస్తుంది.

రఘు : లేదండీ, అదీ ఐపోయింది. ఈ దినం జాబు వచ్చింది. (తండ్రి అసంతృప్తిగా రఘువైపు చూచును).

వెంక : అదీ రాలేదా ? అంత ప్రయత్నం చేసినా ?

తండ్రి : లేదు వెంకట్రామయ్యా, దేనికైనా అదృష్టం కలిసిరావద్దూ ?

సోమ : మరి వుద్యోగం యేమీ లేకపోతే వూరికే వుండడం యెందుకండీ ?

తండ్రి : యేం చేయమంటారు ?

సోమ : నాకు తోచింది చెప్తున్నానను కోండి, యింత చదువు చదివి వూరక వుండడంకంటే, వేరే వుద్యోగం

దొరికిందాకా మన సత్యనారాయణ బట్టల షాపులో పని చూసుకుంటూ వుండవచ్చునే అని... అంటే మీ కిష్టమైతేనే అనుకోండి.

సత్య: మనకెందుకు మామా? ఇప్పుడున్న గుమాస్తానే తీసివెయ్యాలని మా నాన్న అంటున్నాడు. నా పెళ్లి అయిందాకా వుండనీలెమ్మని నేనే వుంచుకున్నాను.

వెంక: ఎవరో గుమాస్తా వుండడంకంటే మన వాడు వుండడం మేలు గాదేమోయ్? నమ్మకానికి నమ్మకమూ వుంటుంది - అతను పని నేర్చుకున్నట్లూ యేదో కొంత జీతం సంపాయించినట్లూ వుంటుంది.

తండ్రి: సోమయ్యగారూ, మీరు చెప్పిన సలహా బాగుందండీ. సత్యనారాయణ తండ్రిగారితో మాట్లాడి...

సోమ: (రఘువైపు చూస్తూ) యింతకూ అతడేమంటాడో? యింత చదువు చదివి షాపు గుమాస్తాగా వుండమంటే ఈ కాలం మనుషులు వొప్పుకుంటారా?

వెంక: (లేచి ముందుకు వస్తూ) రఘు వొప్పుకోడనా? ఆ భయమేం లేదులే. ఈ కాలం పిల్లవాళ్ళలో యింత బుద్ధిమంతుడే లేడు.

సోమ: యింకేం వెంకట్రామయ్య గారూ, (లేస్తూ) పోదామా? (తండ్రికి నమస్కరిస్తూ) వస్తామండీ. (అందరూ లేస్తారు. పరస్పర నమస్కారాల తర్వాత సోమయ్య, సత్యనారాయణ నిష్క్రమిస్తారు. వాళ్ళ వెనుకనే వెంకట్రామయ్య నిష్క్రమిస్తూ వుండగా)

తండ్రి: వెంకట్రామయ్యా! (వెంకట్రామయ్య తిరిగి వస్తాడు) కట్నమూ అవీ యేమనుకున్నట్లు?

వెంక: యిప్పుడే వస్తాను మళ్ళీ - వాళ్ళను మా యింటిదగ్గర వదలిపెట్టి. (నిష్క్రమిస్తాడు).

(తల్లి ప్రవేశించి టేబుల్ దగ్గర నిలబడుతుంది.)

తండ్రి: (తల్లితో) ఏం - పెళ్లికొడుకు బాగానే వున్నాడా?

తల్లి: పెళ్లికొడుకేం - బాగనే వున్నాడులేండి. కట్నం ఎంత అడుగుతున్నారు?

తండ్రి: ఆ సంగతికే యిప్పుడు వెంకట్రామయ్య మళ్ళీ వస్తానన్నాడు.

తల్లి: యేం రఘూ, నీ అభిప్రాయమేమిటి?

రఘు: (ఒకక్షణం తల్లి ముఖంలోకి చూచి) నా అభిప్రాయానికేం విలువ వుందమ్మా? నాకు వుద్యోగమైనా లేదు.

తల్లి: (ఆందోళనగా) అదేమిట్రా? వుద్యోగం లేకపోతే...?

తండ్రి: (కోపంగా) ఎవర్నిరా నీవు బెదిరించేది? (తల్లితో) పద్మకిప్పుడే పెళ్లి చేయకూడదంట! యింకా పసిపిల్లంట! యింకా కొన్నాళ్ళు సంగీతం నేర్పించాలంట! యివీ వీడు నాకు చెప్పే సలహాలు.

తల్లి: రఘూ! (రఘు పలకడు. రెండు క్షణాలు నిశ్శబ్దం) యీ సంబంధం నీకిష్టం లేదా? అదైనా చెప్పనాయనా.

రఘు: నా యిష్టంతో పనేముంది? ముందు పద్మనడగండి.

తండ్రి : పద్మనూ నిన్నూ అడుగుతూ వుంటే యింక యీ సంసారం తెల్లవారినట్టే.

తల్లి : పద్మ నడుగుదాంలే. ముందు నీ అభిప్రాయం చెప్పు.

రఘు : యీ సంబంధంచేస్తే పద్మ సుఖ పడదు.

తండ్రి : (దురుసుగా) యేం? యెందుకు సుఖపడదు? నీమాదిరి బియ్యే చదువు కోలేదనా అతడు?

రఘు : (శాంతంగా, దృఢంగా) సుఖ పడదు నాన్నా. వాళ్ల సంస్కారం అటువంటిది. వాళ్ల మనసులు అటు వంటివి.

తండ్రి : యేమిట్రా నీ పొగరుబోతు కూతలన్నీ? వాళ్ళ మనస్సుల కేమైందనీ? నీకు వుద్యోగం వచ్చిందాకా వాళ్ళ షాపులో వుంచుకొని జీతంకూడా యిస్తామన్నారు. మంచి వాళ్ళు కాకపోతే అంటారా?

తల్లి : (తండ్రితో) వాళ్ళ షాపులోనే రఘును గుమాస్తాగా వుండమన్నారా.

తండ్రి : ఆఁ- అభిమానం వుండబట్టే అన్నారు. లేకపోతే వాళ్ళకేం గుమాస్తాలు దొరక్క కాదు. (తల్లి రఘు వైపు చూస్తుంది.)

రఘు : (తండ్రివైపు చూస్తూ - ఆవేశంతో, నిదానంగా) అభిమానం! వాళ్ళ షాపులో నన్ను గుమాస్తాగా వుండమంటారు. వాళ్ళ యింట్లో నిన్ను నౌకరుగా వుండమంటారు పద్మను కుక్కకంటె హీనంగా వుండమంటారు. అంతా అభిమానమే.

తండ్రి : (తీవ్రమైన కోపంతో) నోరు ముయ్ వెధవా. వాడు దుడ్డు సంపాయించ లేకపోయినా పెద్ద పెద్ద మాటలన్నీ నేర్చినావ్! (చర చరా బయటికి నిష్క్రమణ. అర్ధ నిముషం నిశ్శబ్దం. రఘు కుర్చీలో కూర్చుంటాడు.)

తల్లి : రఘూ! (రఘు తల్లివైపు చూచును) యింతకంటె మంచి సంబంధం మనకెట్లా వస్తుంది? మనకు యోగ్యత వుండవద్దూ? (ఈమాటలంటూ వుండగా పద్మ ప్రవేశించి వాకిట్లో నిలబడుతుంది.)

రఘు : ఇంతకంటె నీచమైన సంబంధం యెక్కడా వుండదు. ఏ అడుక్కుతినే వాడైనా యింతకంటే మేలే! (పద్మ వచ్చి రఘు ప్రక్కన నిలబడుతుంది.)

తల్లి : ఇంతకూ వాళ్ళ కేమైందనిరా? నిన్ను గుమాస్తాగా వుండమన్నారనేనా నీ కోపమంతా? (పద్మతో) నీ వింట్లోకి పో పద్మా! (పద్మ కదలదు.)

రఘు : నన్నన్నారని కాదు. వాళ్ళు యేమైనా అనగలరు. అసలు వాళ్ళు మనుషులే కాదమ్మా! పద్మను వాళ్ళు మనిషిగా బ్రతకనివ్వరు. పద్మ మనిషనే సంగతి వాళ్ళు గుర్తించరు.

తల్లి : ఏం మాటల్ రా నీవి! వాళ్ళు మనుషులు కాక రాక్షసులంటావా?

రఘు : వాళ్ళకు ఆడదిక్కు లేదని పెండ్లి అర్జంటుగా కావాలంటున్నారు. ఈ పసిపిల్ల అత్తవారింటికి పోయి ఇప్పుడే ఆ సంసారమంతా మోయగలుగుతుందంటావా?

తల్లి : సంసారమంతా యెంతరా? నలుగురైదుగురికి వండి పెట్టడమే గదా?

రఘు: ఆ బరువంతా మోస్తే వాళ్ళు కృతజ్ఞత చూపిస్తారంటావా? మోయలేక పోతే సానుభూతి చూపిస్తారంటావా?

తల్లి: ఆడపిల్లన్న తర్వాత అత్తవారింటికి పోవడమూ సంసారం చేయడమూ తప్పుతుందేమిరా?

రఘు: పెళ్ళంటే ఒక తప్పని బాధ, అనివార్యమైన దురదృష్టం అని నీ అర్థం. పెళ్లిచేయడం సుఖపడడానికని మీరెప్పుడు తెలుసుకుంటారమ్మా?

పద్మ: అన్నా!

తల్లి: (కొంచెం కసిగా) పద్మా! నీ వింట్లోకి పో.

రఘు: ఉండమ్మా - పద్మ అభిప్రాయం కూడా చెప్పనీ.

పద్మ: అమ్మా! నన్నడగకుండానే నాకు పెళ్లిచేస్తారా?

తల్లి: యెవరన్నారే - నిన్నడక్కుండానే చేస్తామని?

పద్మ: నేను వద్దంటే బలవంతంగా చేయరుగదా?

తల్లి: యేమిటి పద్మా? బలవంతంగా యెందుకు చేస్తాం?

పద్మ: (రఘుతో) నీవింకేం పోట్లాడ వద్దులేన్నా. నాకీ పెళ్లి వద్దు.

తల్లి: యేమిటే? నీకూ మతి చెడిందా? యెందుకొద్దూ యీ పెళ్లి?

పద్మ: నాకింకా రెండేళ్లు యే పెళ్లీ వద్దు. నేను సంగీతం నేర్చుకుంటాను.

తల్లి: (నిదానంగా) యేమోనమ్మా — మీతో నేను వాదించలేను. మీ నాన్నతోనే చెప్పుకోండి. (నిష్క్రమణ)

పద్మ: (రెండు మూడు క్షణాలు తల్లి పోయిన వైపుచూచి, తర్వాత) అన్నా, నాన్నతో నేనే మాట్లాడుతాలే. నీ వూరకుండు.

రఘు: వద్దులేమ్మా - నేనే మాట్లాడుతాను. నీవు మాట్లాడడం బాగుండదు.

పద్మ: వద్దు. నీకు వుద్యోగం రాలేదని నాన్న యిప్పుడే నీమీద కోపంగా వున్నాడు.

రఘు: నా వుద్యోగానికీ నీ పెళ్లికీ యేమి సంబంధం పద్మా?

పద్మ: సంబంధం లేదని నీకూ నాకూ తెలుసు. నాన్నకు తెలియదు.

రఘు: (తలవంచుకొని, దిగులుగా) ఊం.

పద్మ: నీకు వుద్యోగం లేదు కాబట్టి నీ మాటకు విలువలేదు. (అర్థనిముషం నిశ్శబ్దం, రఘు యెక్కడనో చూస్తూ ఆలోచనలలో మునిగివుంటాడు. పద్మ రఘు వైపు చూస్తూ విచారంగా వుంటుంది. ఇద్దరూ నిదానంగా మాట్లాడుతారు. కంఠాలలో ఉద్వేగం వుండదు. బాధతో, భారంతో మాటలు బరువుగా వుంటాయి.)

పద్మ: అన్నా.

రఘు: (తల త్రిప్పకుండానే) యేమ్మా?

పద్మ: లోకమంతా యింతేనా?

రఘు: (పద్మ ముఖంవైపు చూస్తూ) ఊం?

పద్మ: పెద్దవాళ్ళకు మన మనస్సులు అర్థం కావా? (రఘు పద్మవైపే చూస్తూ వుంటాడు. రెండు క్షణాలు నిశ్శబ్దం) చెప్పన్నా.

రఘు: నాకు తెలియదమ్మా

పద్మ: పిల్లల సుఖం కోరరా పెదవాళ్లు?

రఘు: యెందుకు కోరరు?

పద్మ : మరి యెందుకొస్తాయి ఈ పోట్లాటలు ?

రఘు : సుఖమంటే డబ్బని పెద్దవాళ్ళ అభిప్రాయం. మన అభిప్రాయం అదికాదు.

పద్మ : (ఒక క్షణం తర్వాత – తనలో తాను అనుకున్నట్లు) సుఖమంటే డబ్బని పెద్దవాళ్ళ అభిప్రాయం. (ఒకక్షణం నిశ్శబ్దం) మనమూ అంతేనా – పెద్దవాళ్ళమైతే ?

రఘు : ఆఁ ?

పద్మ : మనం పెద్దవాళ్ళమైతే మనమూ అంతేనా ?

రఘు : (తలవంచుకుని) ఏమో.

పద్మ : చెప్పన్నా.

రఘు : నాకు తెలియదమ్మా.

పద్మ : పెద్దవాళ్ళ అభిప్రాయమే సరైనదా ?

రఘు : (బాధగా) ఆఁ ! (అంటూ పద్మ వైపు చూడడు)

పద్మ : లేక – వయస్సు వచ్చేకొద్దీ జీవితం దుఃఖాలు నేర్పుతుందా ?

రఘు : (తల వంచుకొని – తల ఊపుతూ) ఔనేమో.

పద్మ : జీవితం అంత భయంకరమైనదా ?

(నేపథ్యంలో నుండి ఫిడేల్ భయంకరంగా మ్రోగుతూవుంటుంది. రఘూ, పద్మా చిత్తరువులవలె అల్లే వుంటారు. అర్ధనిముషం తర్వాత సంగీతం ఆగిపోతుంది. తండ్రి ప్రవేశం)

తండ్రి : (ప్రవేశిస్తూ) పద్మా, మీ అమ్మను రమ్మను. (పద్మ నిష్క్రమణ. కొంచెంసేపు కుర్చీలు అటూ యిటూ సద్ది, ఒక కుర్చీలో కూర్చుంటూ) యేంరా, యింకా తెగలేదా నీ యేడుపు ? (తల్లి ప్రవేశించి రఘు ప్రక్కన నిలబడుతుంది. పద్మ ప్రవేశించి తల్లి వెనుక నిలబడుతుంది. తల్లితో) ఆఁ – వెంకట్రామయ్యతో మాట్లాడివస్తున్నా. యిరవై తులాలకు తక్కువైతే వొప్పుకోరంటున్నాడు. యే సంగతీ యీ రాత్రికి తేల్చేయ్యాలన్నాడు. వాళ్ళు ప్రొద్దున్నే పోతారంట. యేం పలకవ్ ?

తల్లి : అంత తొందరా ?

తండ్రి : తొందరంటే – మనం వొప్పుకుంటే రేపు శుక్రవారం ముహూర్తం వుందంట. ఆ ముహూర్తానికే పెండ్లి కావాలంటున్నారు. ఆ సంగతి నిన్నడిగి చెప్తానన్నాను.

తల్లి : నన్నడిగితే యేం లాభం ? మీ కొడుకునూ, కూతురునూ అడగండి.

తండ్రి : వాళ్ళనే అడుగుతాన్లే. శుక్రవారం ముహూర్తానికి మనకు వీలుంటుందా అని ?

తల్లి : యే ముహూర్తమైనా పెండ్లి ఖాయమైతే గదా ? పద్మకి పెండ్లి యిష్టంలేదంట.

తండ్రి : (దిగ్భ్రాంతితో) యేం ? (లేచి నిలబడతాడు)

తల్లి : అసలు పెండ్లే వద్దంటున్నది – యింకా రెండేండ్లు.

తండ్రి : (సాధికారంగా) యేం పద్మా ?

పద్మ : ఆఁ

రఘు : నాన్నా.

తండ్రి : (రెండడుగులు ముందుకువేస్తూ, కోపంగా) నీదేమిట్రా ? నీవు నేర్పిన బుద్ధులేనా పద్మకివన్నీ ?

రఘు : కూర్చో నాన్నా. నీవు శాంతంగా వుంటే వొకమాట అడుగుతాను.

తండ్రి ; (ఇంకా ముందుకు నడిచి, రఘు కెదురుగా నిలబడి) నీవూ నన్నడిగే వానివైనావ్ ?... ఊఁ... అడుగు యేమడుగుతావో.

రఘు : పద్మ అడిగినమాటే అడుగుతున్నాను. నన్నడక్కుండానే నాకు పెండ్లి చేస్తారా ? నేను వద్దన్నా బలవంతంగా చేస్తారా ? అని అడుగుతున్నది పద్మ.

తండ్రి ; హుఁ— అంతవరకొచ్చిందీ వ్యవహారం ! ఏం పద్మా, ఆమాట అన్నావు నీవు ?

పద్మ : యిష్టంలేని పెండ్లి చేయరుగదా నాన్నా నాకు ?

తండ్రి : యెందుకిష్టంలేదు ?

పద్మ : నా కిష్టంలేదంటే బలవంతంగా చేస్తారా ? అది ముందు చెప్పు.

తండ్రి : బలవంతంగా ఎందుకు చేస్తాం ? నీ సుఖమే కాదూ మేం కోరేది ?

పద్మ : నా సుఖమే కోర్తారు. నిజమే. కానీ మీరు కోరే సుఖం వేరు – నేను కోరే సుఖం వేరు.

రఘు : ఈ సంబంధం మానుకో నాన్నా.

తండ్రి : నీకేం తెలుసునని మాట్లాడుతున్నావురా ? యింత మాత్రం సంబంధం మనకు దొరకదు. వాళ్ళకెవరైనా నాలుగైదు వేలు సులభంగా యిస్తారు. మన కుటుంబం మంచిదనీ సాంప్రదాయం మంచిదనీ వొప్పుకున్నారు. నిన్ను షాపులో పెట్టుకొని నలభై రూపాయలు జీతం కూడా యిస్తామన్నారు.

తల్లి : నలభయ్యేనా ?

తండ్రి : నలభైయ్యైతే యేం ? అన్నం వాళ్ళింట్లోనే గడచి పోతుందిగా ? నలభై యిచ్చినా వేరేచోట ఎనభై వచ్చినట్లే.

రఘు : నాకు జీతం వస్తుందని పద్మను వాళ్ళకిస్తామా ?

తండ్రి : యేంరా ? నీ కింతకంటె మంచి వుద్యోగం యెవడిస్తాడు ? గవర్నమెంటులో మాత్రం గుమాస్తాకు యెంత జీతం వస్తుందనుకున్నావ్ ?

రఘు : నాన్నా, నా వుద్యోగం సంగతి ఇప్పుడెందుకులే. ముందు పద్మ అడిగిందానికి చెప్పు. యిష్టంలేని పెండ్లి బలవంతంగా చేస్తావా ?

తండ్రి : బలవంతం యేముందిరా ? వొప్పించే చేస్తాను. నీవు మర్యాదగా నోరు మూసుకొని పడివుండు. నీ చెప్పుడు మాటలతోనే పద్మ చెడి పోతున్నది.

రఘు : పద్మ పెండ్లితో నాకేమీ సంబంధం లేదా ?

తండ్రి : నూటికి సంపాయించుకోలేని వానికి నీ కెందుకురా యిన్ని మాటలు? పదివేలు కట్నమిచ్చి నీ చెల్లెలికి పెండ్లి చేసే యోగ్యత నీకుందా చెప్పు. యెవరో పెడుతుంటే మువ్వూటలా తిని కన్నూ మిన్నూ కనపడకుండా మాట్లాడుతున్నావ్. (కోపంగా బయటికి నిష్క్రమణ. రెండు మూడు క్షణాలు నిశ్శబ్దం.)

తల్లి : (మెల్లిగా) రఘూ, (రఘు తల్లివైపు చూచును) మీ నాన్నతో నీకెందుకు నాయనా ?

రఘు : (జాలిగా) నీవూ అంతేనామ్మా ! పద్మ సుఖపడాలని కోరడం తప్పా ?

తల్లి : యేంమాటలురా అవి ? మేం మాత్రం పద్మ సుఖం కోరమూ ?

రఘు : పద్మ సుఖం కోరేవాళ్ళయితే, మీ కెందుకమ్మా యీ పట్టుదల ? పద్మ వద్దన్న సంబంధం మానుకో రాదూ ?

తల్లి : పద్మ వద్దంటే మాత్రం దానికేం తెలుసురా ? మంచీ చెడ్డా తెలుసుకునే వయస్సుందంటావా పద్మకు ?

రఘు : ముక్కూ మొగమూ యెరుగని వాడెవడో వచ్చి, మాయింట్లో ఆడ దిక్కులేదు, మాకొక ఆడపిల్లతో అర్జంటుగా అవసరమున్నది, మీ పిల్లను నాకిస్తారా అంటే, మేళతాళాలతో వాని వెంట పంపడానికి మాత్రం వయస్సు వుంది పద్మకు. మంచీచెడ్డా తెలుసుకునే వయస్సు లేదు. అంతే నామ్మా ?

తల్లి : యేం విడ్డూరం రాయిది ? ఆడపిల్లకు పెండ్లి చేయడం కూడా తప్పేనంటావా ?

రఘు : నేను మాట్లాడలేనమ్మా మీతో. మీ మాటలు నా కర్థం కావు. నా మాటలు మీ కర్థం కావు.

తల్లి : యేమో నాయనా – యింట్లో తండ్రీ కొడుకూ పోట్లాడుకోవడం మంచిది కాదని చెప్తున్నా. అవతల నీయిష్టం. (మెల్లగా నిష్క్రమించుతుంది. నేపథ్యంలో ఫిడేల్ దీనంగా మ్రోగుతూ వుంటుంది. ఒక నిముషం తర్వాత ఆగుతుంది. యిక్కడనుండి ఇద్దరి మాటలూ బాధగా, భారంగా, నిదానంగావుంటాయి.)

పద్మ : అన్నా …

రఘు : యేమ్మా ?

పద్మ : ఇంత పట్టుదల యెందుకో పెద్ద వాళ్లకు ?

రఘు : పట్టుదల మనకూ వుందిలేమ్మా.

పద్మ : మన పట్టుదలా వాళ్ళ పట్టుదలా వొకటేనా ?

రఘు : కాదమ్మా. మన పట్టుదల మన సుఖంకోసం. వాళ్ళ పట్టుదల వాళ్ళ సుఖంకోసం కాదు. వాళ్ళ మాట గెలవాలని.

పద్మ : పెద్దవాళ్లందరూ యింతేనా అన్నా ?

రఘు : మమూలుగా యింతే. లోకంతీరే ఇంత !

పద్మ : లోకంలో అందరికీ సుఖపడాలని వుండదూ ?

రఘు : ఎందుకుండదమ్మా ? అందరికీ సుఖపడాలనే వుంటుంది.

పద్మ : (ఎక్కడనో అనంతంలోకి చూస్తూ) మరి యెందుకు సుఖపడరు ? వొకరి నొకరు యెందుకు సుఖపడ నివ్వరు ? వద్దంటే పెండ్లి చేస్తామంటారు. కావాలంటే వుద్యోగం యివ్వరు. సంగీతం నేర్చుకోడానికి వొప్పుకోరు. ఎందుకన్నా ? వొకరి నొకరు ఎందుకు సుఖపడనివ్వరు ? వొకరినొకరు ఎందుకు బాధిస్తారు ?

రఘు : అంతేమ్మా ! ప్రపంచం అంతే ! మనుష్యుల్ని మనుష్యులుగా బ్రతక నివ్వదు. మనుష్యులుగా వుండనివ్వదు. ప్రపంచం మారుస్తుంది. (అంటూ తల వంచుకొంటాడు.)

పద్మ : (పరధ్యానంగా – బాహ్యస్మృతి లేనట్లు) మనుష్యులుగా బ్రతకనివ్వదు ……ప్రపంచం మారుస్తుంది.

# రుక్కులు

రావెళ్ల వెంకట్రామారావు

బ్రతుకు క్రతువున
బడలి సడలిన
నరుని మేధకు,
సుందరోజ్వల
సుచిర స్వప్నం
అందుతుందా...?

కాలసర్పం
గ్రక్కు గరళం
మెక్కి గ్రుక్కిన,
బక్కవానికి
జీవితంలో
"శివం, సత్యం"
చిక్కుతుందా...?

భగ్నమను బడ
బాగ్నికీలల,
మ్రగ్గిపోయిన
మానవునిలో,
వెలుగు వెల్లువ
విరుస్తుందా...?

హెచ్చు తగ్గులు
పెచ్చరిల్లి
పాదు కదలిన
భవన మందున,
జాతి మనుగడ
సాగుతుందా...?

---

(24 వ పేజీ తరువాయి)

రఘు : మారకపోతే బాధిస్తుంది.

పద్మ : మారకపోతే – బాధిస్తుంది...?

రఘు : అంతేమ్మా!

పద్మ : యేమిటి యీ ప్రపంచం?

రఘు : ఆఁ?

పద్మ : యేమిటి యీ ప్రపంచం?

రఘు : ప్రపంచం...(అంటూ మెల్లగా రెండు మూడుసార్లు తల అడ్డంగా ఆడించాడు. నేపథ్యంలోనుండి విషాదసంగీతం మెల్లగా, సన్నగా ప్రారంభమై క్రమంగా హెచ్చుతూ వుంటుంది. అర్ధనిముషంతర్వాత మెల్లగా – చాలా మెల్లగా – తెర పడుతుంది. తెరపడుతూ వుండగా సంగీతం వేగమూ, స్థాయీ హెచ్చుతూ వుంటుంది.)

సమాప్తం.

# పందొమ్మిదవ శతాబ్దంలో

# వంగ సాహిత్యం

సంజీవ దేవ్

పద్దెనిమిదో శతాబ్దపు మధ్యభాగంలో అనేక రకాల మిశ్రమ సాహిత్యం ఉద్భవించింది. మధ్యకాలీన వంగ సాహిత్యం క్రమేణా మాసిపోతూ రాబోయే నవ్య సాహిత్యానికి ప్రాణదానం చేయబోతూన్న సంధి కాలం అది. హిందూ ముస్లిముల సంగమములు ఆంగ్లేయుల సంస్కృతితో సంగమమై త్రివేణిగా ప్రవహించబోయే కాలం అది.

వంగ సాహిత్య వికాసానికి ఆనాటి ముస్లిం కవులు కూడ మత వర్గ వివక్షత లేకుండా వైష్ణవ పదాలనూ శాక్తేయ పదాలనూ కూడ రచించి ఎంతగానో దోహదం ఇచ్చారు. "సహజీయ" కీర్తనలూ "బావుల్" కీర్తనలూ ఈ కాలంలోనే ఎక్కువగా రచించబడినయి.

ఆ మధ్య కొంత తగ్గిపోయిన లలిత గీతాల జీవం మళ్ళీ ప్రత్యక్షం కాజొచ్చింది. "వైష్ణవ పదావళి" పద్ధతిలోనే "శాక్త పదావళి" రచనలు తలెత్తసాగినయి. ఈ "శాక్త పదావళి" లో కాళీమాత తన భయంకరత్వాన్ని కాక తన వాత్సల్యాన్ని ప్రదర్శించసాగింది. ఈ శాక్తపద కర్తల్లో రాంప్రసాదు అనే కాళీభక్తుడు చాల ప్రసిద్ధి చెందాడు. వంగీయుల్లో నేటికీ చండీదాసు రచించిన వైష్ణవ పదాలవలెనే రాంప్రసాదు రచించిన శాక్త పదాలు ప్రచారంలో వున్నాయి.

ఇక ఈ మధ్య కాలానికి చెందిన అంతిమ ప్రసిద్ధ కవి భారత చంద్రరాయు. ఆయనతో మధ్యయుగం ముగిసిపోతుంది. ఆధునిక యుగం ప్రారంభమవుతుంది. భారతచంద్రుడు కొంత అశ్లీల సాహిత్యాన్ని సృష్టించాడనే నిందను కూడ పొందాడు. ఆయన రచనల్లో "అనంద మంగళ్", "విద్యా సుందర్" అనేవి ముఖ్యం. ఇందులో ఆయన సృష్టించిన హీరామాలిని అనే స్త్రీ పాత్ర చాల విచిత్రమైనదిగా పేరు పొందింది.

పురాతన వంగసాహిత్యానికి అంతిమ చిహ్నమైన "విద్యాసుందర్"ను రచించాడు భారతచంద్రరాయ్ ప్లాసీ యుద్ధం (1758) తరువాత కొన్ని సంవత్సరాలకు. ఆధునిక వంగ సాహిత్యానికి ప్రథమ చిహ్నమైన "మేఘనాథ వధ"ను రచించాడు మైకేల్ మధుసూదనదత్తు సిపాయి మ్యూటిని (1858) తరువాత కొన్ని సంవత్సరాలకు. ఈ మధ్యలోని నూరు సంవత్సరాల్లో ఆంగ్లేయ వర్తకుల పరిపాలనతో వంగదేశంలో రాజనైతికంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా ఎంతో మార్పు వచ్చింది. ఈ నూతన సంపర్కంతో వంగీయుల జీవితంలోనూ, సాహిత్యంలోనూ కూడ

పాశ్చాత్య ప్రభావం ప్రబలం కాజొచ్చింది. ఆంగ్ల సాహిత్యపు కిరణాలు వంగ రచయితలమీద ప్రసరించ సాగినయి.

ఈ నవ్యప్రభావ ఫలితమే వంగ భాషలో గద్యరచన ప్రారంభం. ఇంతకు ముందు వంగ సాహిత్యంలో పద్యరచనలు తప్ప యెన్నదగిన గద్య రచనలు లేవనే చెప్పాలి. క్రైస్తవ మిషనరీలు బైబిలు మొదలైనవాటిని వంగ గద్యంలోకి తర్జుమా చేసి ఈ రంగంలో కొంత మార్గదర్శకు లయ్యారు. వీరి అనుయాయి అయిన రాంబోసు ప్రథమంగా "ప్రతాపాదిత్య చరిత" అనే ప్రముఖ గద్య రచన్ని వ్రాశాడు. మొగలు పాలకులతో స్వాతంత్ర్యసమరాన్ని సాగించిన ఒక వంగ రాకుమారుని చరితం యిది. ఇది 1801 లో ప్రచురింపబడింది. ఇక గద్య రచయితలు మెల్లగా తమ శైలికి పదును పెట్ట ప్రారంభించారు. కొన్ని సంవత్సరాలకు రాజా రామమోహనరాయ్ తన సాంఘిక, ధార్మిక సంస్కరణ కార్యాలకు గద్యాన్ని ఒక గొప్పసాధనగా ఉపయోగించుకొన్నాడు. తరువాతి గొప్ప గద్య రచయిత అక్షయకుమారదత్తు. ఆయన రచించిన వైజ్ఞానిక, తాత్విక వ్యాసాలు ప్రజ్ఞాపూరితాలు. ఇక ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గద్య రచనలోకి రసమయ వాతావరణాన్ని సృష్టించి బంకించంద్రునకు బాట సరిచేశాడు.

ఈ సమయంలో పద్య రచనలోకూడ నూతన ప్రభావాలు గోచరించసాగినయి. ఈశ్వర చంద్రదత్తు అనే కవి కవితాలోకంలో తన వ్యంగ్య కవితల ద్వారా మంచి ప్రసిద్ధి చెందాడు. పాఠకులు ఏదో కొంతలోనైనా, ఘాటైనా కవితా సాహిత్యం కోసం దాహం కనపరచ సాగారు. వారి దాహానికి పానీయంగా ప్రత్యక్షం కాజొచ్చినయి మైకేల్ మధుసూదనదత్తు కావ్యాలు.

ఇక మూడోది వంగనాటకాలు. నవ్య పిపాస ననుసరించి సంస్కృతం నుంచీ, ఆంగ్లంనుంచీ కూడ నాటకాల అనువాదాలు వంగభాషలోకి పదార్పణ చేయ సాగినయి. సంఘ సంస్కార వాదములు బాగా వీస్తున్న రోజులవి. దీనబంధు మిత్ర రచించిన "నీల దర్పణ" నాటకం నుంచి ప్రచారంలోకొచ్చింది. ఈ నాటకాల టెక్నిక్ ఆంగ్లేయం, మిగతా పద్ధతులు సంస్కృత రీతులకు చెందినవి. వంగ దేశంలో పూర్వ సంప్రదాయాలకు చెందిన "జాత్రా" అనే వీధినాటక పద్ధతి క్రమేణ క్షీణించ సాగింది.

ఈ విధంగా గద్య, పద్య, నాటక సాహిత్యాలు ఆ నూతన సభ్యతా సంస్కృతులన్ని ప్రతిబింబించసాగినయి. వీటికి వైజ్ఞానిక, మానవీయ ప్రభావాన్ని అప్పటి విద్యులు తమవిగా స్వీకరించటానికేమాత్రమూ వెనకాడలేదు. కాని, క్రైస్తవ మతాన్ని స్వీకరించటానికి కాని, తమ జీవన విధానాన్ని ఆంగ్లీకృతం చేసుకోటానికి కాని వారు సిద్ధపడలేదు. ఈ భావ సామ్యాన్ని రాజా రామమోహనరాయ్ గారి బ్రహ్మ సమాజోద్యమం నిర్వహిస్తూ వచ్చింది. కొందరు మేధావులు క్రైస్తవాన్ని కూడ స్వీకరించకపోలేదు.

ముద్రణా యంత్రాలు వాడుకలోకి రావటంతో పుస్తకాలు అమ్ముకావటం

మాత్రమే కాక కొన్ని పత్రికలుకూడ వెలువడ సాగినయి. ఈ పత్రికలు ఎక్కువగా సాహిత్య పత్రికలు కాక వ్యక్తులూ, సంఘాలూ తమ తమ సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకొనే పత్రికలు. వీటిలో "దుర్జన దమన నవమి" అనే త్రైమాస పత్రిక క్రైస్తవ ప్రచారాన్ని అరికట్టటానికేర్పడ్డ పత్రిక. మరొకటి "సర్వశుభకారి" అనే మాస పత్రిక. ఇందులోని వ్యాసాలు బాల్య వివాహాల్ని అరికట్టటానికీ, స్త్రీ విద్యను ప్రోత్సహించటానికీ త్రాగుడును నిషేధించటానికీ సంబంధించి వుండేవి. వీటన్నిటిలోకీ ఉత్తమ పత్రికలు అక్షయ కుమారదత్తు నడిపిన "తత్వబోధినీ పత్రిక", రాజేంద్ర మిత్ర నడిపిన "వివిధార్థ సంగ్రహా" అనేవి. "ప్రభాకర్" అనే వార్తా పత్రికనొకదాన్ని ఈశ్వర చంద్రగుప్త నడిపాడు. ఇందులో వార్తలకంటే సాహిత్యరచనలే ఎక్కువగా వుండేవి.

వంగసాహిత్యంలో నవయుగ కర్త మైకేల్ మధుసూదనదత్తు (1824-1873). ఆయన కులీన హిందూ కుటుంబంలో జనించి తరువాత క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. కలకత్తాలో కళాశాలా విద్య పూర్తి అయిన తరువాత ఆయన మద్రాసుకు పయనించి అక్కడ కొంత కాలం వుండి ఆంగ్ల కవిగా రూపొందాడు. రెండుసార్లూ కూడ ఆంగ్ల వనితల్నే వివాహం చేసుకొన్నాడు. ఇంగ్లాండు వెళ్ళి బారిస్టర్ అయి వచ్చాడు. కాని ఆయన సాహిత్య ధోరణి కోర్టులో ఎవరికీ అర్థమయేది కానందున ఆయన లాయరు వృత్తి పైకి రాలేకపోయింది.

వంగ పద్య రచనలోకి ముక్తఛందస్సు (blank verse) ను ప్రవేశపెట్టింది మధుసూదన దత్తు. వంగభాషలో మహాకావ్యాన్ని రచించాలని ఆయన అభిలాష. మొదటిగా ఆయన రచించిన కావ్యం "తిలోత్తమ సంభవ" మనే పౌరాణిక గాథ. దీని ముక్త ఛందో పద్ధతి మూలాన సహృదయ సమాజంలో కొంత అలజడి లేచింది. కాని ఆయన ఈ అలజడినంతా అరికట్టేడు తన రెండో కావ్యం "మేఘనాధ వధ" ద్వారా. ఆయన రచించిన కావ్యాల్లో "వీరాంగన కావ్యం" కూడ ప్రసిద్ధి చెందింది. వీరత్వం మధుసూదనదత్తుకు ఎంతో ప్రియమైన గుణం. తన కావ్యాల్లో వీర రసాన్ని సృష్టించటంలో సఫలుడైనాడు. ఆయన కొంత నాటకరచనకూడ చేశాడు.

పద్య రచనలో మైకేల్ మధుసూదనదత్తు ఏమైతే చేశాడో దాన్ని మించి బంకించంద్ర చటర్జీ (1838-93) గద్య రచనలో చేశాడు. ప్రాంతీయ సివిల్ సర్వీసులో ఉద్యోగిగా జీవయాత్ర నడిపినా ఆయన గొప్ప జాతీయవాదిగా తయారైనాడు. భారత దాస్యాన్ని గురించి ఆయన మనసు సదా ఆందోళన చెందుతూనే వుండేది.

బంకించంద్రుడు అనేక నవలల్ని రచించినాడు; "వంగదర్శన్" అనే సాహిత్య మాసపత్రిక నొకదాన్ని నడిపాడు. నేడు భారత జాతీయగీతంగా వ్యవహరించబడుతూన్న "వందేమాతరం" గీతాన్ని రచించింది బంకించంద్రుడే. ఆయన చారిత్రక నవలలు: "మృణాళిని" వంగదేశాన్ని ముస్లిముల చేతుల్లో పెట్టిన దేశద్రోహుల్ని గురించిన వృత్తాంతం.

"దుర్గేశనందిని" "కపాలకుండల" అక్బర్ కాలంనాటి వంగదేశాన్ని చిత్రిస్తయి. "రాజసింహ" ఔరంగజేబు కాలంలోని రాజపుత్ర వీరత్వాన్ని చాటుతుంది. "సీతారామ" మూర్షిదాబాద్ నవాబుల నాటి వంగదేశానికి మనల్ని తీసుకుపోతుంది. "చంద్రశేఖర", "దేవీ చౌధరాణి," "ఆనందమఠం" మహమ్మదీయ పాలన బ్రిటిషు చేతుల్లోకి వస్తూన్నప్పటి పరిస్థితుల్ని వివరిస్తయి. ఆయనలోని ముస్లిం వ్యతిరేకత క్రమేణా ఆంగ్లేయులపై ద్వేషంగా మారసాగింది.

బంకించంద్రుని సాంఘిక నవలలు : "విషవృక్షం" "కృష్ణకాంతేర్ విల్" ఈ రెండూ ప్రేమగల దంపతులమధ్య ఇంట్లో వున్న విధవలు కలిగించే గల్లంతుల్ని గురించి చిత్రిస్తయి. "రజని", "రాధారాణి", "ఇందిర" సుఖంతో అంతమవుతయి. "ఇందిర" అనే నవల స్వయంగా బంకిం చంద్రునకు ఎంతో ప్రీతిగలది. నిజానికి ఆయన రచించిన వాటిలో ఇది సర్వోత్తమమైంది.

రాజా రామమోహనరాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌లు ప్రవేశపెట్టిన సంస్కారాలమీద బంకిం చంద్రునకంతగా ఇష్టం లేకపోయినా, ఆయన సహేతుక ఆలోచకుడు. నవలలేకాక ఆయన అనేక విషయాలపై ఎన్నో వ్యాసాలుకూడ రచించాడు. ఆనాటి వంగసాహిత్యంలో ఆయనొక గొప్పదీప్తి. వంగ గద్య రచనకు నిజంగా బంకిం చంద్రచటర్జీ ప్రాణప్రతిష్ఠ చేశాడు.

మైకేల్ మధుసూదన దత్తు, బంకిం చంద్రులు సమకాలికులు. చాల ప్రతిభాన్వితరచయితలు. వీరిలో నాటకకారుడైన దీనబంధుమిత్ర నాటి ప్రపంచంలో తన "నీలదర్పణ" అనే నాటక రచనతో చాల కల్లోలం లేపేడు. ఇది ఆనాటి నీలిమందు ఉత్పత్తిదారుల క్రూరకృత్యాల్ని గురించి వర్ణించిన నాటకం. ఏదో ఒక దాని ప్రచార నిమిత్తం రచించినా ఇందులోని కళాకమనీయత యెంతో పుష్టిగాంచి వుంది. ఈ "నీలదర్పణ"కు కలిగిన ప్రచారం మరే నాటక రచనకూ ఆ రోజుల్లో లభించలేదు. వంగ దేశంలోనూ, బయటా కూడ ఇది చాల అలజడి లేపింది. దీన్ని ఆంగ్లంలోకి అనువాదం చేసినందుకుగాను మైకేల్ మధుసూదనదత్తుకు ఉద్యోగం పోయిందట. ఆ ఇంగ్లీషు అనువాదాన్ని ప్రచురించినందుకుగాను లాంగ్ అనే ఒక ఉత్తముడైన ఆంగ్లేయ మిషనరీకి శిక్ష విధించబడింది. గ్రంథకర్త మారుపేరు ఉపయోగించుకొన్నందువల్ల తన తపాలా ఉద్యోగానికి భంగంలేకుండా పోయింది. ఈ నాటకం ఇతర ఐరోపీయ భాషల్లోకి కూడ అనువదించబడింది. ఆయన రచించిన నాటకాలన్ని కూడ లోకంలోని ఏదో ఒక చెడును అరికట్టడానికి వ్రాయబడినవే.

అయితే, దీనబంధుకు ప్రత్యక్షంగా నాటకరంగంతో సంబంధం లేదు; ఆయన స్వయంగా నటుడూ కాడు, రంగ నిర్వాహకుడూ కాడు. అందువల్ల ఆయన నాటకాలు ప్రదర్శన నిమిత్తం వంగ దేశంలో అంతగా ప్రోత్సాహాన్ని పొందలేదు.

గిరీశచంద్రఘోషు నాటక రచయిత మాత్రమే కాక గొప్ప నటుడూ, రంగ నిర్వాహకుడూ కూడ. ఆయన అనేక

నాటకాన్ని రచించి ప్రదర్శింప చేశాడు. ఇవి ఎక్కువగా పౌరాణిక విషయాలనూ, చారిత్రక విషయాలనూ వివరిస్తయి. వీటి లోని సాహిత్యగుణా లెలావున్నా, ఇవి నాటక వృత్తికీ, నగరాల్లోని రంగ వికాసానికీ ఎంతగానో తోడ్పడినయి. గిరీశ చంద్ర ఘోషు అన్ని విషయాల్లో చాల ఉత్తముడే కాని ఆయనకు త్రాగుడు అలవాటుండేది. ఆ త్రాగిన ప్పుడు మాత్రం కొంచెం సంచిత నాన్ని పోగొట్టుకొనేవాడు. ఆయన రామకృష్ణ పరమహంస శిష్యుడు. త్రాగుడున్నదని తెలిసికూడ పరమహంస ఆయన్ని ఎంతగానో ప్రేమించేవాడు.

ఒకరోజు తను వ్రాసిన నాటకాన్ని ప్రదర్శింపబోతూ పరమహంసను ప్రతి మాలి నాటకం చూడటానికి తీసుకవెళ్ళి రంగస్థలానికి దగ్గరగా ఆయన్ని ఆదరాభి మానాలతో ఆసీనుణ్ణి చేశాడు. కొంత సేపటికి గిరీశచంద్రుడు బాగా త్రాగి వేషంతో రంగంమీద కొచ్చి పరమ హంసను నోటికొచ్చినట్లు నానా పిచ్చి తిట్లన్నీ తిట్టేడట. పరమహంస నక నక నవ్వుకొన్నాడట. ఆ రోజునుంచి ఆయన త్రాగటం మానేశాడట.

గిరీశుని అనంతరం నాటక రచన్ని వికసింపజేసిన వారిలో అమృతలాల్ బోసు క్షీరోద ప్రసాద విద్యావినోద్ అనేవారు ముఖ్యులు. వంగ నాటక రచనలో స్వతంత్ర రచనలకు తోడు షేక్స్పియర్ నాటకానువాదాలుకూడ ప్రత్యక్షం కాజొచ్చినయి.

పద్య సాహిత్యంలో మహాకావ్యాల రచన చురుకుగా నడవ సాగింది. కవు లంతా మహాకావ్యాలను వ్రాయాలని ఉత్సుకపడేవారు. మైకేల్ మధుసూదన దత్తు మహాకావ్యమైన "మేఘనాధ వధ"తో "వధ"తో కూడుకొన్న కొన్ని మహాకావ్యాలు బయటికొచ్చినయి. వీటిల్లో "వృత్ర సంహారం" అనేది ముఖ్యం. దీని రచయిత హేమచంద్ర బెనర్జి, ఆయన కావ్యాల్లో ఆత్మసమర్పణం, దేశభక్తి, ఇంకా ఇతర మానవీయగుణాలూ ముఖ్యం.

ఈ దేశభక్తి కావ్యాలు నవీన చంద్ర సేన్ రచనల్లో బాగా మూర్తీభవించినయి. ఆయన ప్రాంతీయ సివిల్ సర్వీసుకు చెందినవాడు. నవీన చంద్రుని "ప్లాసీరో యుద్ధో" చాల ప్రఖ్యాతి చెందింది. ఆయన రచించిన ఇతర మహాకావ్యాలు పౌరాణిక గాథలకు సంబంధించినయి. బంకించంద్రునివలె ఆయనకూడ మత పునరుద్ధరణమీదే జాతీయ పునరుజ్జీవం ఆధారపడివుందని నమ్మేవాడు.

రంగలాల్ బెనర్జి అనే మరో ఉన్నల కవి తన కావ్యాలకు ప్రేరణ రాజ పుత్ర వీరగాథలనుంచి పొందేవాడు. "స్వాతంత్ర్యం లేకుండా ఎవరు జీవిం చాలని కోరతారు? ఎవరు జీవించాలని కోరతారు:" అనేదే ఆయన నినాదం. వంగదేశంలోని నాటి యువకుల్లో చాలామంది అప్పుడే ఆంగ్ల వ్యామోహాన్ని వదిలించసాగారు. తమ దేశంలోనే తమకు స్వేచ్ఛలేదనే సత్యాన్ని చాలామంది గుర్తించసాగారు. "నీ స్వంత దేశంలోనే నీవు ప్రవాసివి; ఇంకా ఎంత కాలానికి ఈ దుఃఖసాగరాన్ని దాట గలవు ఓ భ్రాంత భూమీ?" అని పిలపిం చాడు గోవింద చంద్రదాసు అనే ఒక కవి.

దేశదాస్యం పాశ్చాత్య సభ్యత మూలంగా ఒక విధమైన అసహాయభావాన్ని పురికొల్ప సాగింది. వంగదేశంలో సంస్కృతి కలవారికి స్వాతంత్ర్యం అనే పదం అన్నిటికంటే ప్రియంగా తోచసాగింది. తోరుదత్తు అనే ఆంగ్లకవితల్లో కవయిత్రి "Ancient Ballads and Legends of Hindustan" అనే గ్రంథంలో ప్రాచీన భారత సంస్కృతిని మహిమాన్వితం చేసింది. ఈమె అతి చిన్నతనంలోనే, ఇరవైయొకటవ ఏటనే మరణించింది. జీవించివుంటే ఆమె వంగభాషలో కూడా గొప్ప కవయిత్రి అయ్యేది. అన్నిదేశాల కంటే ఫ్రాన్సును తాను ఎక్కువగా ఎందుకు ప్రేమిస్తున్నానంటే ఫ్రాన్సు వక్కాణించే ఆ రోజుల్లో స్వాతంత్ర్యాన్ని ఆరాధించే దేశం కనుకనని.

ఆ రోజుల్లో కావ్యగుణంతో పాటు కావ్యాన్ని కొల్చే కొలబద్ద దేశభక్తి కాజొచ్చింది. ఇలాంటి వాతావరణంలో బిహారీలాల్ చక్రవర్తి అనే కవి తన పరిసరాలకు వ్యతిరేకమైన కావ్యసృష్టి చేయసాగాడు. ఆయన సౌందర్యపాసి, రసపిపాసి. రససృష్టితో నిండిన రచనలు తప్ప మరో యితర ప్రయోజనాలకు పనికొచ్చే రచనల్ని ఆయన రచించేవాడు కాడు. ఇలాంటి కల్పనాలోకవాసి తన కాలపు కవితా జగత్తులో ఆదరాన్ని పొందలేక పోయాడు. అయినా, అప్పటి చిరుత ప్రాయపు రవీంద్రనాథ ఠాగూర్ మైకేల్ మధుసూదనలాంటి కవుల్ని కూడా త్రోసేసి రసజ్ఞహృదయంతో బిహారీ లాల్ చక్రవర్తిని తన కావ్యసృష్టికి మార్గదర్శకునిగా తీసుకొన్నాడు.

వంగ గద్యసాహిత్యంలో కూడా బంకిం చంద్రునితో సమానంగా తులతూగలేక పోయినా, అనేక గొప్ప రచయితలు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌లాంటి మహా సంఘసంస్కర్తలు కూడా గద్య రచనకెంతో దోహదం ఇచ్చారు. భూదేవ ముఖర్జీ వంగ గద్య సాహిత్యానికి తన రచనల ద్వారా ఎంతో అలంకారాన్ని చేకూర్చాడు.

రమేశ చంద్ర దత్తు ఐ. సి. యస్. అయినప్పటికీ వంగసాహిత్య వికాసానికీ, భారత జాతీయోద్యమానికీ గొప్ప సేవ చేశాడు. అఖిల భారత కాంగ్రెసుకు అధ్యక్షుడు కూడా అయినాడు. ఆయన వంగభాషలో ప్రత్యేకంగా గద్యలో చాల గ్రంథాల్ని రచించాడు. ఆయన తన గద్య రచనలో బంకించంద్ర శైలిని, భావ ప్రపంచంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర సిద్ధాంతాల్ని కలిగియున్నారు. ఆయన చారిత్రక నవలలు నేటికీ ప్రాణస్పందనని కోల్పోలేదు.

తారకనాథ గంగూలీ, సంజీవ చంద్ర చటర్జీ (బంకించంద్రుని సోదరుడు), త్రైలోక్యనాథ ముఖర్జీ, కేశవ చంద్ర సేన్ మొదలైనవారుకూడా మంచి గద్య రచయితలు. కేశవ చంద్రసేన్ "సులభ సమాచార్" అనే ఒక వార్తా పత్రికను కూడా నడిపాడు. కేశవ చంద్ర సేన్ వంగ గద్యాన్ని సరళంగా చేయాలని కొంత ప్రయత్నించాడు. కాళీప్రసన్న సిన్హా అనే రచయిత ఇందుకు కొంత తోడ్పడ్డాడు. ఈ సందర్భంలో మీర్ ముషర్రఫ్ హుసైన్ రచించిన "విషాదసింధు" అనేది ఉల్లేఖనీయం. ఇది

ఉత్తమ వంగ గద్య రచన; ఇది కర్బలా విషాదగాథను చిత్రిస్తుంది. ఆయన శైలి శక్తివంతమైన నాటక పద్ధతిగా వుంటుంది.

వంగ సాహిత్యం యీ విధంగా ప్రతిభాశాలుల రచనలద్వారా సర్వాంగ సుందరంగా పరిణతి చెందుతూన్న కాలంలో వంగ సాహిత్యాకాశంలో రవీంద్రుడు ఉదయించాడు.

★


# అభ్యుదయ

( మాసపత్రిక )

| చందా వివరాలు | | | ప్రకటన రేట్లు (ఒకసారి) | |
|---|---|---|---|---|
| సంవత్సరం | : | ఆరు రూపాయలు | టైటిల్ నాల్గవ పేజీ | రు. 50 |
| | | | ,, (2, 3 పేజీలు) .... | 40 |
| అర్ధసంవత్సరం | : | మూడురూపాయలు | మామూలు పేజీ .... | 30 |
| విడిప్రతి | : | అర్ధరూపాయి | అరపేజీ .... | 20 |

ద్వివర్ణ, త్రివర్ణాలకు అదనపు రేట్లు. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లుకావాలి. కావలసిన ప్రతులకు కమిషన్ పోను మిగతా డబ్బు ముందుగా చెల్లించాలి.

వివరాలకు :

మేనేజరు, అభ్యుదయ, విజయవాడ - 2.

ఉమ. అతని బుద్ధికి, విచక్షణాజ్ఞానానికి కాలదోషం పట్టింది.

తన పూర్వ కథలోని పాపపుణ్యానికి చేసుకున్నాడు ఉమ. పాపపుణ్యాల పూర్వపుణ్యానికి అపశ్రుతి. పీడకల.

మామూలుగా ఆఫీసుకు వెళ్ళాడు. ఒక్కొక్క కేసు చూసుకుంటూ సాయంత్రానికి అడుగుపెట్టాడు. ఆఖరున ప్రవేశపెట్టబడ్డ కేసు.

కాయితాలమీద వ్రాసి ఉంచిన నేరం (బ్రోతల్ క్రైమ్):

విసుక్కున్నాడు ఆ కేసు పేరు వినగానే! పవిత్ర భారతదేశంలో, పతివ్రతా శిరోమణులు కాలవాలమై, ధర్మగ్రంథాలకు పాదాలా వచ్చే ఈ నాగరికతలో "పతితలు! వ్యభిచారులు! మానాన్ని వస్తువు చేసి బజారులో వేలం వేసే... స్త్రీలు... అభాగ్య పతితలు"

కేసు చూశాడు... చూడలేకున్నాడు. కాసేపు ఆలోచించాడు. కలకు - వాస్తవానికి మధ్య, నిజానికి - అబద్ధానికి ... అనుమానం కలుగుతోంది. కాని మనస్సులో మళ్ళీ పునరావృత్తమైంది.

తలెత్తి చూశాడు. మేలిముసుగులో ఆమె ముఖం కనిపించింది. ఇంగువకట్టిన గుడ్డ. ఆమెను చూస్తే ఒకనాడు అందం, సౌందర్యం ఆమెలో కాపురమున్నాయని ఊహించవచ్చు. శిథిలం కాబోతున్న మహల్‌లా వుంది ఆమె.

జస్టిస్ ఉమాకాంతునిలో ఆసక్తి తలెత్తింది. "...కారణం?" అతని కంఠం జీరబోయింది. గొంతు సవరించుకున్నాడు.

ఆమె తలెత్తి, ఓరగా ఉమను చూసింది. మేలిముసుగు సరిచేసుకుంది.



"చేస్తేగాని వల్లగాదా?" ఆమె చూపుల్లో ఎదుటి వ్యక్తిని లోబరుచుకునే శక్తి వుంది. మనసులోని స్థిరత్వం చెదరకుండా "నేరం విచారించేముందు పూర్వాపరాలు తెలుసుకోవాలి!"

ఆమె తర్కం పెంచలా! తనను ఒక మగవాడు (పేరు చెప్పలా) ప్రేమను అస్త్రం పెట్టుకు అనుభవించటం, ఆతర్వాత మాయం కావటం చెప్పింది. కాలదోషం పట్టిన కన్యాత్వాన్ని ఆధారం చేసుకు సమాజం, తనమీదకు దండయాత్రకు సిద్ధం కావటం, పలుకుబడి, ఐశ్వర్యం, అందచందాలు లేని అనాథ కావటంవల్ల నిలదొక్కుకోలేక, అస్తవ్యస్తమైన బతుకు ఉదరపోషణకు అక్కర్లేకున్నా తిరగటం, పురుషుల పురుషత్వాన్ని కవ్విస్తున్న అందం, ఓనాడు కాలబాటన పిచ్చిగా జీవితం కుదుట పడక పోవటం ... అన్నీ చెప్పింది. తాను మనసా వాచా నేరం చేస్తే శిక్షకు సిద్ధంగా ఉంది. కాని నేరమైనట్లైతే తనను దోషిగా నిర్ణయించిన సమకట్టిన నేరం, అతి దుర్మార్గం, శిక్ష స్త్రీకి కాదు న్యాయం అని అంది. తన నాడు నేరస్థురాలయినా, తాను నేరస్థురాలవటానికి కారణభూతులు కొందరున్నారని, వారిని శిక్షించటం న్యాయమని అంది.

ఆమె వాదించింది, ఉమ నిశ్చలుడయ్యాడు. ఆమె అడిగిన ప్రశ్నకు ప్రపంచంలోని ఏ న్యాయ శాస్త్రమూ జవాబు ఇవ్వలేదు. ఏ శిక్షాస్మృతీ వాటికి శిక్షలు స్వీకరించలేదు.

చెదరిపోతున్న మనస్సును కూడగట్టుకుని "నిన్ను మొదట మోసగించినవాడు ఎవరు?"

మెల్లగా నవ్వింది. అందులో హేళన, జాలి, కరుణ మిళితమై వున్నాయి. "ఎందుకు లేండి. అతడిప్పుడు ఏ ఉన్నతస్థానంలో వున్నాడో! అతడెక్కడున్నా, నావల్ల అతనికి కళంకం కలుగటానికి ఒప్పుకోను. పిరికివాడు: ... ఎక్కడున్నా సుఖంగా వుంటే అంతేచాలు!"

కాళ్ళక్రింద నున్న భూమి అదురు తున్నట్లు కదిలి, ఒరిగి సముద్రగర్భంలోకి పడిపోతున్నట్లు ఫీలయ్యాడు ఉదయ్. [illegible]సు నాయినా నే[illegible].

భారమైన గుండెతో బంగళాకు చేరాడు. తనేం చెయ్యాలో, ఏం చేస్తే తన అపరాధం [illegible] సాహిత్య [illegible] ఉదయ్ తో [illegible]. ప్రేమించిన స్త్రీని లోకానికి వదిలేసి పారిపోయాడు. కానీ ఆ స్త్రీ యింకా తనకోసం ఆరాటం, ప్రేమ, జాలి చూపుతోంది. [illegible] వాడిని. తనని నోరారా తిడితే ఎంతో ఏం చేశాడు. మనసారా ఉమ్మేస్తే ఆనందంగా ఉండేవాడు. కాని అంతా విరుద్ధం!

నేరానికి శిక్షవిధించటం [illegible]. నేరం [illegible] అన్నదే గానీ, ఎందుకు చేశాడు, కారణాలు, పరిస్థితులు అనవసరం. కానీ ఆమె కోరింది ... తన పతనానికి కారకుడైన నాయకుడిగా [illegible] తక్కినది!......

ఆనాటు [illegible] అతని [illegible] చూస్తున్నది. ఆచేతన [illegible] [illegible] కూర్చుని తన్ను [illegible]. [illegible]! కలం [illegible]! [illegible]! [illegible]!

[illegible], [illegible] "నేను ... శిక్ష ......"

కలం [illegible]. [illegible] కలం [illegible].



# బళ్ళారి రాఘవ

## మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

బళ్ళారి రాఘవ అంటే బళ్ళారి సొంతం, ఇంకా మద్రాసు వాసికి, మద్రాసునుంచి [illegible], మొత్తం విశాలాంధ్ర నాటకరంగానికి [illegible] విగ్రహాన్ని [illegible] ప్రతిభాశాలి. 1915 నుంచి 25 దాకా ఆంధ్ర నాటకరంగం [illegible] స్వర్ణయుగంలాగా ప్రకాశించింది. ఆ నాటికి ఆంధ్ర దేశపు ముఖ్యనగరాలన్నింటిలోనూ అనేకమైన నాటక సమాజాలు నడుస్తూవుండే రోజులు. మైలవరం బాలభారతీ నాటక సమాజంలో వృద్ధిపొందుతున్న పువ్వుల్లాగా [illegible] సంగీతరావు, [illegible] నారాయణ, [illegible] నాయుడు, [illegible] మొదలైనవారూ, ఇంకా [illegible] బసికెపల్లి, [illegible], [illegible] ప్రసాదరావు, లక్ష్మణస్వామి, [illegible] రాజు, ఆలమూరు [illegible] మొదలైన నటులు [illegible] నాటక ప్రదర్శనాలిస్తున్న రోజులు.

ఈ నాటికి బళ్ళారి రాఘవ పేరు ఆంధ్రప్రాంతాలకు రానేలేదు. అటు బళ్ళారి మొదలైన ప్రాంతాల్లోనూ, హైదరాబాదు, మైసూరు, బెంగుళూరు ప్రాంతాల్లో మాత్రమే ఆయన ప్రదర్శనాలనిస్తూ వుండేవారు. ఆనోటా, ఈనోటా రాఘవ పేరు ప్రతిష్టలు వినడం తప్ప ఆయన నటనా విశిష్టతను కళ్ళారా చూచినవారు అరుదు.



కళాప్రపూర్ణ టి. రాఘవ

ఆనాటికే ఆంధ్ర నాటక రంగంలో ఎంతో కాలంగా పాతుకుపోయిన పాత పద్ధతులకు స్వస్తిచెప్పారు. రచయితలకు, నటులకు క్రొత్త మార్గాన్ని ప్రసాదించారు. స్త్రీలే స్త్రీపాత్రలు ధరించాలని ఎలుగెత్తి చాటారు. ఆనాడు ఆంధ్ర నాటక ప్రదర్శనాలలో స్త్రీపాత్రలన్నీ పురుషులే ధరిస్తూ వుండేవారు.

అంతేగాక ఆయన నిర్వహించిన హిరణ్యకశిపుడు - రాజరాజు - చాణక్య - రామదాసు - పఠాన్ - ఒథెల్లో - షైలాక్ -

హేమ్లెట్, పాత్రలను అఖండంగా ప్రదర్శించారు. క్రొత్త అభినయాన్ని, పాత్రలకు క్రొత్తమనస్తత్వాలనూ ప్రవేశపెట్టారు. ఆంధ్రుల ప్రతిభా విశేషాలను ఒక్క ఆంధ్రదేశంలోనే కాక భారతదేశంలోనూ, అంతర్జాతీయ నాటకరంగంలోనూ చాటారు.

ఆయన ప్రతిష్టణానికి ఒక విశాలమైన నాటకరంగ స్థలంకోసం కృషి చేశారు. సాంఘిక నాటకాలనూ, అమెచ్యూర్ నాటకసమాజాలనూ ప్రోత్సహించేవారు. ఈవిధంగా ఆంధ్ర నాటకరంగంలో ఒక నూతన విప్లవాన్ని తీసుకువచ్చారు రాఘవాచార్యులుగారు.

రాఘవ వస్తుతా లాయరు. వకీలు పని చేస్తూ బళ్ళారిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవినికూడా నిర్వహించారు. రాఘవకు కవిత్వ ధోరణి, సంగీత పరిచయంకూడా కలవు. బళ్ళారిలో అందరి మన్ననలకు పాత్రమైన వంశం తాడిపత్రి వంశం. అధిక గౌరవాలకు, మర్యాదలకు అనాది నుంచీ పేరుపడిన వంశం. ఆంధ్ర నాటక పితామహులనూ, బహు నాటక గ్రంథకర్త అయిన కీ॥ శే॥ ధర్మవరం కృష్ణమాచార్యులవారి మేనల్లుడే మన బళ్ళారి రాఘవాచార్యులుగారు. ఆయా కేసుల్లో మద్రాసు హైకోర్టుతోనూ ప్లీడర్లతోనూ, ప్రభుత్వంతోనూ ఎక్కువ సంబంధాలు వుండడంవల్ల, మద్రాసు ఆంధ్రులతోనూ సుగుణ విలాస సభతోనూ, సభా నిర్వాహకులైన సంబంధం మొదలియారూ, రంగవడివేలూ, ఇ. సి. గోపాలరత్నం మొదలైన వారితోనూ పరిచయమవడం వల్ల మద్రాసులోవున్న రోజుల్లో సుగుణ విలాససభవారి ఇంగ్లీషు నాటకాల్లో వివిధ పాత్రలు ధరించి దక్షిణదేశపు కళాక్షేత్రమైన మద్రాసులో రాఘవ అఖండమైన పేరు ప్రతిష్టలు సంపాదించారు.

ప్రతి నటీనటునికి విగ్రహపుష్టి ఎంతో సహాయపడుతుంది. పాత్ర ప్రవేశంలో ప్రేక్షకుల్ని తొలిసారిగా ముగ్ధుల్ని చేసేవి విగ్రహమూ, వేషధారణా. అలాంటి సుందర రూపమే మన రాఘవాచార్యులు గారిది. రంగంలో ప్రవేశించడం తోటే ప్రేక్షకులందర్నీ ఇట్టే ఆకర్షించేది ఆయన సుందర విగ్రహం. రాఘవాచార్యులు గారు రంగస్థలం మీదా, విడిగానూ సుందర పురుషులే. ఆయన సుందర విగ్రహమే, ఆయా పాత్రలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టినవని చెప్పవచ్చు. విశాలమైన నేత్రాలతో, బొద్దు కనుబొమలతో, వెడల్పాటి నుదురుతో, వంకీలు తిరిగిన వెంట్రుకలతో, ఎంతో గంభీరంగా వుండేవారు. వారిని చూచీ చూడడం తోటే, ఇట్టే ఆకర్షింపబడేవారు; రాఘవ సహజ సుందరుడు. ఆ సుందరత్వానికి తగినట్లు వేషధారణలో ఏ పాత్ర ధరించినా ప్రజల హృదయాల్లో హత్తుకుపోయేటట్లుండేది. ఆ నాటికీ ఈనాటికీ అటువంటి విగ్రహం నటుల్లో వుందా అని అనుభవజ్ఞులు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదేమో ?

నాటకంయొక్క సందేశాన్ని ప్రేక్షకులకు ఆహ్లాదంగా వినిపించాలంటే శృతిపక్వమైన గొంతు కావాలి. కొంతమందికి జన్మతః శ్రావ్యమైన గొంతులే వుంటాయి. మరికొంతమంది హీనస్వర నటులు సాధన ద్వారా శృతిపక్వంగా గొంతును మలుచుకుంటారు. కాని మన రాఘవాచార్యులు గారు సహజమైనవాక్సంపత్తిగలవారు.

ఖంగుమనే గొంతు, లలితస్వభావం గల శ్రావ్యత, అన్నివిధాలా శ్రుతిపక్వమైన గొంతు. పాడడానికి గొంతూ, స్థాయిలూ ఎలావుండాలో అలాగే మాటలకూ, శృతి, లయా, ఆరోహణా, అవరోహణా, అన్ని స్థాయిలూ వుండాలంటారు రాఘవాచారిగారు. స్వచ్ఛమైన భాషోచ్చారణ కలిగినవారు. సంభాషణలను దిగమింగటం గానీ అస్పష్టంగా పలకడం గానీ, ఒత్తులు ఎగరగొట్టడంగాని, లేక త్వరత్వరగా మాట్లాడి తొట్రుపడడం గాని, సంభాషణలను వూరికే వూకదంపుడుగా వల్లించడంగానీ చేసేవారు కారు.

ప్రతిసంభాషణ పలకడంలోనూ సంభాషణయొక్క అర్థాన్ని, భావాన్ని అవగాహన చేసుకుని పలకి అనేవారు. అర్థానికి తగిన భావగాంభీర్యాన్నిచ్చేవారు. ప్రతిసంభాషణనూ అపస్వరాలూ, అపశబ్దాలూ లేకుండా అనేవారు. సంభాషణలను ఎక్కడ తేల్చి మాట్లాడాలో, ఎక్కడ నొక్కిమాట్లాడాలో, ఎక్కడ తగ్గుస్థాయిని అనుసరించాలో అలాగే పలికేవారు. అంతేగాని కొట్టిబట్టి కొండపీటి నాంతాడులా ఒకే ధోరణిలో ఎప్పుడూ సంభాషణలు పలికేవారు కారు– అదే ఆయనసాధనా, ఆయనయోగం.

రాఘవాచార్యులు పద్యాలు పాడడంలో ఒక క్రొత్త పద్ధతిని ప్రవేశపెట్టారు. అభినయం శూన్యమైన పాటలు, పద్యాల ద్వారా ఆనాటి ప్రదర్శనాలు నడుస్తూవుండేవి. రాగం తప్ప భావానికి ఏమాత్రం ప్రాముఖ్యం యిచ్చేవారు కారు ఆనాటి నటులు. కాని రాఘవ పద్యాలు పాడే పద్ధతిని సంపూర్ణంగా మార్చివేశారు. కేవలం పద్యాలు పాటకొరకే గాదని పాటతోపాటు భావాన్నీ, రసాన్నీ ఒప్పించాలనీ అనేవారు. కాని యీ పద్ధతి నాటి పద్యాలుపాడే నటకులకు వెగటుగా వుండేవి. రాఘవ మీద కొంతమంది దుమారాన్ని గూడ లేవదీశారు. అయినా రాఘవ సంగీతానికి ప్రాధాన్యం తగ్గించి కేవలం భావానికీ, ఆ భావానికి తగిన అభినయానికే ఎక్కువ ప్రాధాన్యం యిచ్చారు. ఈ పద్ధతి విశిష్టమైన కొంతమంది నటుల్నీ, ప్రేక్షకుల్నీ సంతృప్తిపరచగలిగింది. క్రమానుగతంగా ఆ విధానాన్ని చాలమంది విమర్శకులూ, కళాభిమానులూ రాఘవ పద్యాలుపాడే పద్ధతిని గుర్తిస్తూ వచ్చారు. ఆనాడు రాఘవను సమర్థించినవారిలో ముఖ్యులు బందా, గోవిందరాజుల సుబ్బారావు - మాధవపెద్ది వెంకటరామయ్య, స్థానం నరసింహారావు, సన్యాసిరాజు మొదలైనవారు. చనిపోయేవరకూ మాధవపెద్ది ఆయన పద్ధతిలోనే పద్యాలు పాడుతూ వుండేవారు.

రాఘవకు, తెలుగు, ఇంగ్లీషు, కన్నడం, సంస్కృతం, హిందీ, తమిళ భాషల్లో పరిచయముంది. సంస్కృత నాటకాలు మొదలు ఆయనకు పరిచయమున్న అన్ని భాషలలోని నాటకాలనూ నాలవగకు పరిశోధనచేశారు. ఆయా భాషల నాటకాల్లోని వివిధ పాత్రలను కడు సమర్థనీయంగా నటించి ఆసేతు హిమాచల పర్యంతం భారతదేశపు అగ్రనటుడనిపించుకున్నారు. బెంగాల్ నాటకరంగ పితామహుడు శిశిర్ కుమార్ చౌదరి - మనోరంజన్ భట్టాచార్య, సంబంధ మొదలియార్,

విశ్వకవి రవీంద్రనాథ ఠాగూరుచేత, మహారాష్ట్ర నటకుడూ, ఆ సుగాయకుడూ అయిన బాలగంధర్వ, కర్నాటక హాస్యనటుడు గుబ్బి వీరన్న మొదలైన భారతదేశంలోని అగ్ర నటులందరి చేతా, ఉత్తమ నటుడుగా మెప్పుపొందారు. నిరంతరమూ ఆకర్షించి మెప్పించడానికి కారణం ఒక్కటే, ఆయన నిర్వహించిన పాత్రలు అన్ని భాషల నాటకాలలోనూ వున్నాయి. ఆ పాత్రలనొక్క సర్వసమగ్రమైన మనస్తత్వాన్ని ప్రదర్శించడమందువల్లనే అగ్రనటుడనిపించుకొన్నారు.

ఆ రోజుల్లో సామాన్యులే కాకుండా, ముఖ్యంగా మేధావుల్లోనూ, పెద్దల్లోను, ఆంగ్లము విద్య నభ్యసించే విద్యార్థుల్లోనూ, నాటక పిచ్చి ఎక్కువగా వుండేది. ఆ నాటికి రాఘవ పేరు ప్రతిష్టలు వినని చూడనివారు లేరు. సర్కారాంధ్ర నటుల్లో ఆయనను చూడాలనే కుతూహలాలే ఎక్కువైంది. అయినా రాఘవాచార్యులు గారు ఆంధ్ర (సర్కారు) ప్రాంతాలకు రావడానికి వెనుకాడారు. అందుకు కారణం ఒక్కటే. ఆయన అభిప్రాయాలు వేరు, ఆయన ప్రదర్శనా విధానం వేరు. ఆయన పాత్రల స్వభావానిచ్చిన నిర్వహణం వేరు, పద్యాలకూ పాటలకూ కాక కేవలం అభినయానికి అందులో ముఖ్యంగా సాత్వికాభినయానికి ఇచ్చిన ప్రాముఖ్యం వేరు. సర్కారు ప్రాంత ప్రేక్షకులు కేవలం సంగీత ప్రియులేగాని ఇలాంటి భావ ప్రధానమైన ప్రదర్శనలకు ప్రాధాన్య మివ్వరనే ఒక వింత ప్రచారం జరగడంవల్ల ఆయన, ఈ ప్రాంతాలకు రావడానికి వెనుకాడారు. ఆనాటి నటుల్లో రాఘవాచారి అభిప్రాయాలను గురించి ఎక్కడబడితే అక్కడ, సమాజాలలోనూ, గోష్టులలోనూ చర్చలు జరుగుతూ వుండేవట. చివరికి ఆయన బృందంతో 1921 సంవత్సరానికిగాని మన ప్రాంతానికి రాలేదు.

మన నాటకాల్లో చిత్రించిన దుర్యోధనుని పాత్రను ఆనాటి నాటక రంగ నటులు అతి హీనంగా చిత్రించి నటించినారు. మహాభారతంలో దుర్యోధనుని పాత్ర అద్వితీయంగా నిరూపింపబడింది. కాని మన నాటక ప్రదర్శనాలలోని దుర్యోధన పాత్రధారి ఏ మాత్రం నిలకడలేకుండా, ఓర్పునూ, సహనాన్ని మూలకునెట్టి, అరవడం, కేకలు వేయడం, ఆనందంలో గంతులు వేయడం, కోపంతో చిందులు త్రొక్కడం చూస్తున్నాం. రాజకీయ దురంధరత నాయకదక్షత, పాండవుల్ని ఏ కాలంలో వంచన చెయ్యాలో? నాయకత్వాన్ని ఎలా చేబట్టాలి? కౌరవులందర్నీ అదుపులో ఎలా వుంచుకోవాలి? ఈతత్వం మన దుర్యోధన పాత్రధారుల్లో ఎక్కడా కనబడేదికాదు. యడవల్లి, రాఘవ దుర్యోధన పాత్రలకు తూర్పు, పడమరల కున్నంత వ్యత్యాసముండేది.

యడవల్లి రంగస్థలంలో ఎక్కువ ఆంగిక చలనంతోనూ, నడకలతోనూ, వాచిక ప్రయోగంతోనూ ప్రేక్షకుల్ని ఆకర్షించగలిగినా, రాఘవపాత్ర ముందు చాలా హీనంగా వుండేది.

రాఘవ అతి నిబ్బరంగా ఏ మాత్రంగానూ లేకుండా, హావభావాల్లోనూ, ఆంగిక చలనంలోనూ, నడకల్లోనూ తేలికతనాన్ని కనబడనీయకుండా కృష్ణ సాన్నిధ్యంలో

నడుస్తున్న పాండవుల్ని యెలా లొంగదీయాలి? పాండవ పక్షపాతం చూపించే కృష్ణునివిూద కక్ష, సిరిని సహించలేని కౌరవ సోదరబృందాన్ని అదుపులో పెట్టుకుంటూ కృష్ణునివల్ల అవమానాలనూ లోలోన దిగమ్రింగి యెలా పాండవుల్ని సాధించాలా? అనే కార్యదీక్షనూ, ఏక కాలంలో ముఖభావాలను సాత్వికాభినయం ద్వారా, నేత్రాభినయం ద్వారా ఒక ప్రత్యేక అభినయం చూపించి దుర్యోధన పాత్రకు న్యాయం కలుగచేశారు. దుర్యోధనుడు అతి సామాన్యుడు కాడు. అతనూ నాటకానికి నాయకుడే, నాయకుండదగు లక్షణాలనూ, [illegible], ద్రోణ, కర్ణ, అశ్వత్థామ, శకుని, కృపాచార్య ముదలైన యోధానయోధుల అండ కలిగిన అనుభవంలో [illegible] రాజువలె [illegible], హుందాతనాన్ని ప్రేక్షకుల్లో కలిగించేవారు. ఈ విధంగా రాఘవ [illegible] సృష్టించిన పాత్ర ననుసరించి ఆనాటి నటకులు [illegible] దుర్యోధన పాత్ర స్వభావాన్ని పూర్తిగా మార్చేశారు. ప్రేక్షకుల్లో ఒక గొప్ప సంచలనాన్ని కలుగచేశారు.

అలాగే రామదాసు నాటకంలో రామదాసు పాత్రను [illegible] అభినయంవరకు ఎత్తో మార్పులు తీసుకు వచ్చారు. నేటి మన నాటకాల్లో కనిపించే రామదాసులు పూర్తిగా మూర్తీభవించిన రామదాసుల్లాగ ప్రారంభంనుంచి తయారవుతారు. మీసాలు, గడ్డాలు పెంచడం, రుద్రాక్షమాలలు కాషాయ వస్త్రాలతో మొదటి రంగంనుండి ఒక వైరాగి వేషంగా తయారై రామదాసు పాత్రను ఒక కృత్రిమ వేషధారణద్వారా ఆ పాత్రయొక్క స్వభావానికి తగని ఖూనీ చేసేవారు.

కాని రాఘవాచార్యులుగారు రామదాసు పాత్రను నిరాడంబరమైన వ్యక్తిత్వంతో ప్రవేశంలో గోపన్నగా, చొక్కా, తలపాగ, ధరించి క్రమేపీ శ్రీరామచంద్రునిమీద పెరిగిన భక్తి భావాన్ని క్రమానుగతంగా పెంచి నాటకాంతానికి భక్తిపారవశ్యంలో మునిగిపోయి [illegible] ప్రవర్ధమానమైన భక్తి భావంతో పాటు, సాత్విక భావాలనూ, [illegible] భావాల్లో వచ్చే మార్పులతో భక్తికి [illegible] చిన్నచూపు చూస్తూ క్రమానుగతంగా రామదాసు పాత్రను అభివృద్ధిపొందించి ప్రేక్షకులందరికీనూ నిజమైన రామదాసుగా మారిపోయేవారు. ఈవిధంగా రాఘవ అనేక పాత్రలకు ఆయన ఒక నూతనత్వాన్ని [illegible] యిచ్చారు. ఆంధ్రదేశంలో [illegible] ఆయన తీసుకువచ్చిన మార్పులను అనుసరించారు. రాఘవ ప్రదర్శించే ప్రతి నాటకానికి ముఖ్యంగా నటకులు [illegible]. రాఘవ వేషధారణను, [illegible]మైన పాత్రాభినయాన్ని, పాత్రల మారు స్వభావాన్ని ఇతర నటకులంతా అనుసరించేవారు. రాఘవ నాటకాల ప్రభావం అంతటిది. రాఘవ ఆశయం కళ ప్రజలకు వుపయోగపడాలనీ, ప్రజా[illegible] సమస్యలను ప్రతిబింబించని యే కళా నిరర్ధకమన్నాడాయన. నాటక ప్రదర్శనాలు ధనార్జనకు కాక, ప్రజాప్రబోధానికి వుపయోగించాలని, ప్రతిపట్టణంలోనూ, విశాలమైన ఆధునిక నాటక రంగస్థలాలు నిర్మించాలనీ, ఆనాడే నాటక కళ పునరుజ్జీవింపబడుతుందనీ, సాంఘిక నాటకా

లనూ అమెచ్యూర్ సమాజాలను ప్రోత్సహించేవారు. నటనకు సంబంధించినంతవరకూ గుడ్డిగా ఏనటునీ అనుసరించక ఎవరికున్న పరిజ్ఞానంలో వారిని ఆలోచించమనేవారు. ఆరోజుల్లో స్త్రీలే స్త్రీపాత్రలు వేయాలన్నందుకు వచ్చే వ్యతిరేకతను సహితం ఎదుర్కొని ముందుకు పోయారు.

రాఘవ నాటక ప్రదర్శనమంటే ఆంధ్రదేశం నలుమూలలనుంచి నటులే ప్రేక్షకులుగా వచ్చేవారు. అందుకు కారణం రాఘవ నటించే నాటకాల్లో ప్రదర్శించే పాత్రల స్వభావాన్నే మార్చివేశారు. ప్రహ్లాద నాటకంలో రాఘవ హిరణ్యకశిపుని వేషాన్ని సంపూర్ణంగా మార్చివేశారు. ఆనాటి నాటకాల్లో హిరణ్యకశిపుడంటే, ఎంతో క్రూరుడుగానూ, రాక్షసుడుగానూ చిత్రించారు. ఆనాటి నాటకాల్లోనూ, యితర పురాణ గ్రంథాల్లోనూ హిరణ్యకశిపుని క్రూరత్వాన్నీ భీకరంగా చిత్రించారు. కాని రాఘవ ఆ విధానాన్ని తల్లక్రిందులు చేశారు. ఆ పాత్రలు రాక్షసుడుగా కాకుండా, సత్వగుణప్రధానంగా, అతి లౌకికంగా పుత్రుని మీద ప్రేమను ప్రక్కకు త్రోయలేక లోలోన కుములుతూ, ఒకప్రక్క లీలావతిని ఓదారుస్తూ, ప్రహ్లాదుని బెదిరిస్తూ, విష్ణువు మీదుండే ద్వేషాన్ని చిత్రించడంలో కేకలు, బొబ్బలు లేకుండా, కుమారుని మొరటు పద్ధతులతో లొంగదీయకుండా, సాత్విక పద్ధతితో బుజ్జగిస్తూ, అనేక ఉపాయాలతో ఒక కంటితో కోపాన్నీ, మరో కంటితో వాత్సల్యాన్నీ, భావ గాంభీర్యంతో ఆ సన్నివేశాన్ని సృష్టించి ఎంతటి రాక్షసునికైనా పుత్రవాత్సల్యం ఒకప్రక్క తప్పక వుండితీరుతుందనే సత్యాన్ని ప్రేక్షకుల్లో కలిగించేవారు. విష్ణువుమీద ద్వేషం, కొడుకు లొంగలేదని ఆవేదన, నిప్పులుగ్రక్కుతూవుండే లోలోన కక్ష, వేరొకప్రక్క పుత్రప్రేమ ఏక కాలంలో ప్రేక్షకులందర్నీ ఉర్రూతలూగించి రాక్షసునిగా చిత్రించిన హిరణ్యకశిపుని, ఆ పాత్ర స్వభావం అది కాదని నిజమైన హిరణ్యకశిపుని పాత్రఇది అని నిరూపించారు.

చంద్రహాసలో దుష్టబుద్ధిగా వుండి చూస్తే ఆ అభినయ ప్రాబల్యం ఎంతో భావగాంభీర్యంతో నిండివుండేది. చాల మంది నటులు దుష్టబుద్ధి మిత్రత్వాన్నీ, శత్రుత్వాన్నీ భిన్న భిన్న రూపాలుగా నటించేవారు. కాని రాఘవ ఆ పాత్రను అతి రాజకీయ దురంధరతతో, అతి నిపుణత్వంతో నిర్వహించేవారు.

రాఘవ ఆంధ్ర నాటకరంగంలో ఎంతో కాలంగా పాతుకుపోయిన అనేక పాతపద్ధతులకు స్వస్తిచెప్పినట్లే నాటకాలలో స్త్రీలే స్త్రీ పాత్రలు నిర్వహించాలని ఎలుగెత్తి చాటారు. అందుకు ప్రథముడు కూడా ఆయనే. సాధ్యమైనంతవరకు ఆయన నాటకాలన్నిటిలోనూ స్త్రీలే స్త్రీ పాత్రలను ధరింపచేశారు. ఆయన నాటకాలలో ఆనాడు ముందుకు వచ్చి సహకరించినవారు వింజమూరి సీతాదేవి, కొమ్మూరి పద్మావతీదేవి, శ్రీమతి వరదాబాయి, శ్రీమతి సరోజిని, అన్నపూర్ణ మొదలైనవారు. ఇలా స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించినందుకు ఆనాడు యెంతో దుమారం రేగింది. అయినా అడ్డంకుల నన్నిటినీ ఎదుర్కొని

ఆయన విధానాన్ని కొనసాగించి ఆనాటికి, ఈనాటికి ఆదర్శప్రాయులయినారు.

భారతదేశ అగ్రనటులైన మన రాఘవ 1927 లో ఇంగ్లండు వెళ్ళారు. అంతకు పూర్వమే సుప్రసిద్ధ ఆంగ్ల నటుడైన ఫార్బ్స్ రాబర్ట్సన్‌కు, రాఘవకూ వుత్తర ప్రత్యుత్తరాలద్వారా పరిచయమేర్పడింది. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని స్ట్రాట్‌ఫర్డ్ ఏవన్‌లో జరిగే షేక్స్పియర్ నాటకాల్లో పాల్గొనడానికి రాఘవను ఆహ్వానించాడు. ఇంగ్లండులో రాఘవ అనేక నాటక ప్రదర్శనాల్లో పాల్గొన్నారు.

లారెన్స్ ఆలీవర్, చార్లెస్ లాఫ్టన్, ఎడిత్ ఇవాన్స్ వంటి ఆంగ్ల నటుల పరిచయ భాగ్యమబ్బింది. వారి నాటకాలన్నిటినీ, రాఘవ ప్రదర్శించారు. రాఘవ పాత్రలన్నీ వారూ చూశారు. వేనోళ్ళ స్తుతించారు రాఘవను. ఈ విధంగా రాఘవ అంతర్జాతీయ ప్రఖ్యాతినికూడా పొందాడు.

1935 వ సంవత్సరంలో రాఘవాచార్యులుగారు సినీరంగంలో ప్రవేశించారు. ద్రౌపదీ వస్త్రాపహరణంలో యడవల్లి సూర్యనారాయణగారు దుర్యోధన పాత్ర ధరిస్తున్న సమయంలో మన రాఘవ ద్రౌపదీ మాన సంరక్షణంలో దుర్యోధనపాత్రధరించారు. విజ్ఞులందరూ రాఘవ అభినయాన్నే కొనియాడారు. తరువాత, రామబ్రహ్మంగారి రైతుబిడ్డలో ఒక రైతు పాత్రను ధరించి అమోఘంగా నటించారు. చండికలో ఒక పాత్రధరించి సినీమా నటనకు స్వస్తిచెప్పి బళ్ళారి వెళ్ళిపోయారు.

రాఘవాచార్యులుగారు ఆంధ్ర నాటక రంగాభివృద్ధిని గురించి ఎన్నో బంగారు కలలు కన్నారు. ఆయన ఆశయాలనూ, ఆదర్శాలనూ ఆచరణలో పెట్టగలిగిన వారు ఆనాడు బహు కొద్దిమంది మాత్రమే. ఆయన జీవించిన కాలంలో, వృత్తినాటక సంఘాలూ, కంట్రాక్టు నాటకాలూ, నాటకరంగాన్ని కలుషితం చేశాయి. అనేకమంది నటులు బిరుదులకు లోబడిపోయి, పవిత్రమైన నాటక కళకూ, నటలోకానికి తీరని కళంకం తెచ్చారు. నటులలోనూ, సమాజాలలోనూ, కక్షలు సాధించుకోవడం, ధర్మనిధులకు నాటక ప్రదర్శనాలంటూ డబ్బు మ్రింగటం, పూర్తిగా టికెట్లమ్మి డబ్బుతో పరారవడం, నాటక ధర్మాల్ని మఱచిపోయి, వన్స్‌మోర్ విధానాలకు లోబడి వ్యక్తి స్వార్థంతో పాత్రలను మఱచి రంగస్థలంలోనే కొట్లాడుకోవడం, ప్రేక్షకులు పాడమన్న పాటలు పాడడం మొదలైన వక్రమార్గాల్లో నడుస్తూంది నాటకరంగం. అంతకుముందు కట్టుదిట్టంగానూ, ఎంతో ఆదర్శంగానూ నాటకాలను ప్రదర్శించిన వారందరూ చాలవరకు ఈ ప్రవాహంలో కొట్టుకు పోతున్నారు. ఏకాకి రాఘవ. ఈ విషయాలు ఆయనను ఎంతో బాధించాయి. కాని ఆయనకు తోడుగా నిలబడేవారు కూడ తక్కువై పోయారు. అదీగాక ఆమెచ్యూర్ నాటకరంగం ఈనాడున్నంత వుధృతంగా ఆనాడు లేదు. నాటకరంగానికి ఈనాడున్నంత ఆదరణ ఆనాడులేదు. ఇంతమంది యువనటీ నటులూ, యువనాటక కర్తలూకూడా తక్కువే ఆనాడు. అందువల్లనే ఆయన కలలన్నీ కల్లలుగానే వుండి

పోయాయి. ఈతరంవారికి రాఘవుని ఆశయాలు ఎంతో ఆవశ్యమైనవి. ఆయన ఆదర్శాలనూ, ఆశయాలనూ ముందుకు తీసుకుపోవాలి. ఒక్కొక్క యుగంలో, ఒక్కొక్క ఉద్యమంలో కొద్దిమంది మాత్రమే యుగపురుషులు జన్మిస్తారు. ఆకోవకు చెందినవారే మన రాఘవాచార్యులుగారు. ఆంధ్ర నాటకరంగంలో అపూర్వమైన మార్పుని తీసుకువచ్చి ఒకనవ్యయుగాన్ని సృష్టించి యుగపురుషులైనారు. అదే రాఘవయుగం, ఆయన కేవలం కళాకారుడే కాదు, కళాయోగి, నటననేది ఒకయోగమంటారాయన. అది ఒక తపస్సుఅనీ, అంతంత మాత్రాన అందరికీ అది సిద్ధించదంటారు. నిజంగా రాఘవాచార్యులుగారు కళా ప్రపూర్ణుడు. ఎన్నో ఆవేదనలనుభవిస్తూ రాఘవ 1944 సంవత్సరం ఏప్రిల్ 16 వ తేదీన అస్తమించారు. ఆనాటినుండి ఈనాటి వరకు ఆయన వర్ధంతులు ఆంధ్రదేశపు నాలుగు చెరగులా జరుపుతున్నారు. ఆయన పేర, రాఘవకళా కేంద్రమనీ, రాఘవ కళా సమితి అనీ, రాఘవ గ్రంథాలయమనీ, రాఘవ నాటకోత్సవాలనీ నడుస్తున్నాయి.

దాదాపు 10 సంవత్సరాలుగా విజయనగరంలో శ్రీ వేదుల జగన్నాథరావుగారూ ఆయన సన్నిహిత మిత్రులూ, వరుస తప్పకుండా ప్రతిఏటా రాఘవ ఏ తేదీన అస్తమించారో, ఆ తేదీన ఏప్రిల్ 16 న ప్రారంభించి ఏప్రిల్ 20 వ తేదీవరకూ నాటక, నాటికల పోటీలు, కవితాగోష్ఠి, సాహిత్యగోష్ఠి, నటీనటు, కవి, గాయకులకు సన్మానాలతో ఆదర్శంగా రాఘవ నాటకోత్సవాలను జరుపుతున్నారు. ఆయన పేర, ఆంధ్ర నాటక కళా పరిషత్తు, ప్రసిద్ధ వజ్రోత్సవ నటుడు ఏ. నాగేశ్వరరావుగారు విజయవాడలో రాఘవుని పేరు మీద రాఘవ కళామందిరాన్ని కట్టించబోతున్నారు. ఈ విధంగా ఈ తరంవారు ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతున్నారు.






అచ్చులో

# అంగారవల్లరి

(ఖండకావ్యం)

శ్రీ కె. వి. రమణారెడ్డి

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం

విజయవాడ-2.

# ANNOUNCING

## A NEW FEATURE

in

## OVIET LITERATURE

**Monthly magazine of Literature**

In response to many requests from readers **SOVIET LITERATURE**, will carry from issue No. 4, 1959 a course of **RUSSIAN LESSONS.**

This course is intended to provide a foundation for studying **RUSSIAN**. The publishers also will answer questions that may arise while studying the lessons, directly by correspondence.

**Subscribe Now!**

**Subscription Rates**

**Annual: Rs. 6.00**

**Monthly: 0.62 nP.**

Subscriptions accepted at:

VISALAANDHRA PUBLISHING HOUSE,
Buckinghampet P. O. VIJAYAWADA.

and

PEOPLE'S BOOK HOUSE,
Nehru Road, HYDERABAD.

V/O MEZDUNARODNAYA KNIGA, Moscow 200 U.S.S.R.

# ఘోస్టుల గోష్ఠి

పూసపాటి కృష్ణంరాజు

1 వ ఘోస్టు : కాల్చుకాల్చు సిగరెట్
లేకపోతే ఆరిపోతుంది చార్మినార్

2 వ ఘోస్టు : నీ కుక్షిలో నారవం చేస్తున్న రవం

1 వ ఘోస్టు : ఏదో వ్రాయి నీకు తోచింది
యిష్టమైంది వుంచుకుందాం
కష్టమైంది కొట్టేద్దాం

3 వ ఘోస్టు : తెలివిగలవాళ్ళం కాబట్టి

2 వ ఘోస్టు : తాత్పర్యం ఆంతర్యం
ఆఁ ! లిఖించు చూస్తావేం ?

3 వ ఘోస్టు : అంతాన్ని పూర్ణానుస్వారం

1 వ ఘోస్టు : అదిగో కవిత్వం అయిపోతోంది.

2 వ ఘోస్టు : మనం చెప్పబోయేది కవిత్వంకాదు

3 వ ఘోస్టు : మరేవిటి ?

1 వ ఘోస్టు : నా మస్తకం కూడా

2 వ ఘోస్టు : పోనీ వుండనీ ఎందుకొచ్చిందో

3 వ ఘోస్టు : యీ స్వహస్త లిఖితంలోవస్తే వచ్చిందిలే సున్నా.

2 వ ఘోస్టు : హస్తాన్ని చూసి గీతల్ని లెక్కించి గీతికలు వ్రాద్దాం
హ్రస్వరేఖలూ, దీర్ఘరేఖలూ సాముద్రికంగా నువ్వు
కాబోతున్న స్న స్న స్న, యిక్క డెందుకనో మన
ఆలోచన లాగిపోయేయి !

1 వ ఘోస్టు : తిక్కన ధర్మసందేహాలన్నీ గురునాథుని రచనా ప్రవా
హంలో కొట్టుకు పోయినట్టు.

2 వ ఘోస్టు : వెయ్యేలేవా రెండు మాటలు.

1 వ ఘోస్టు : అమృతం ఆపోసన పట్టినా నాలుకలు చీలిపోయినవిష భుజంగాల్లా అమ్మాయిగారి భ్రూకుటి జూసి ఆయన గారు జడుసుకోనేలా.

2 వ ఘోస్టు : వాగు వాగు ఆగి పోకు.

1 వ ఘోస్టు : పడిపోయిన పాలగ్లాసునుండి పాకిన పాలలో అతికిన ఉపమాలంకారం.

3 వ ఘోస్టు : అబ్బా భయం! అచ్చుకాదండీ.

1 వ ఘోస్టు : సరే మానేద్దాం.
ఏదీ ఒక సిగరెట్టు దమ్ము.
యీ పొగలో అగణిత కవితా
సంపుటాల అవగాహన అవధానం

3 వ ఘోస్టు : అదేవిటి ? దుష్టసమాసంలా వుంది ?

2 వ ఘోస్టు : ఆధునిక కవిత్వంలో దుష్టత్వంలేనే లేదు ద్రష్టత్వమేగాని–

1 వ ఘోస్టు : ఆరుద్ర పొయిట్రీలాగా.

2 వ ఘోస్టు : ఆగండి ఆగండి మనం మాట్లాడేది ఆరుద్ర పొయిట్రీ గాదు అధునాధున సాహిత్యం వినా.

1 వ ఘోస్టు : గ్రీన్ థాట్ యిన్ గ్రీన్ షేడ్

2 వ ఘోస్టు : ఆంగ్ల సారస్వత శాఖల్లో
ఫ్రెంచి గీతికల సూర్యకిరణాలు
వక్రీభవించి డైఫ్రాక్షన్‌లో
ఆకులోంచి ట్రాన్సిలేటయి
కిరణాలంటే గుర్తుకొచ్చింది
నవ్యసాహిత్య పరిషత్తె రుణాళ్ళలో
భాషా భిమక్కుల న్యూక్లియర్

వారలో రోదసీ హృదయ
పరివేదనోజ్వలిత కృశాగ్ను లస్తమించేవేళ
ఆవేళగాదు యీవేళ
ఆంధ్ర సారస్వత పత్రికల త్రెడల్ క్రింద

3 వ ఘోస్టు : అవునౌను నేనూ విన్నాను
సలిగిపోయే నకలు నిసువుల ఆక్రందనలు

1 వ ఘోస్టు : అంతేనంటావా! అవును మరేవిటి!

2 వ ఘోస్టు : భావాల్లేని ముద్రలు, వినూత్నశల్య పంజరాలు
సౌందర్యంలేని కవిత్వాలు
ఎక్స్రేలో తీసిన రంభా ఊర్వశుల ఫోటోలు

3 వ ఘోస్టు : మనం వ్రాయబోతున్న పొయిట్రీలాగ

2 వ ఘోస్టు : కాదు వ్రాసిన పొయిట్రీలాగా! మనం కూచున్న చెట్టు
నీడలాగ పోతుందంటావు మరో గంటకో అరకో.

3 వ ఘోస్టు : అల్లాఅవుతే మంచిదే అంతా బ్రహ్మచారులం. కాదు వానరులం. అవుతే మంచిదే. వానరుల హస్తాలంటే మన భారతికి యిష్టం. ఆహా యిది సూ మంచి ఏకాంకికం.

# శంఖారావం



కె. రాంబాబు

(విజయనగరం స్కూలు ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విద్యార్థి)

తెలుగు చిత్రసీమలోని ప్రముఖ నటీ నటులతో
కాలం, ధనం విశేషంగా ఖర్చుచేసి నిర్మించిన చిత్రం.




తారాగణం:

అంజలి, నాగేశ్వరరావు, రాజసులోచన, శాంతకుమారి,
గుమ్మడి, నాగయ్య, రంగారావు, రేలంగి, రమణారెడ్డి,
కుటుంబరావు, సూర్యకాంతం, ముక్కామల.


EDITED, PRINTED AND PUBLISHED BY TUMMALA VENKATARAMAYYA AND PRINTED AT SWATANTRA ART PRINTERS, VIJAYAWADA.



# అభ్యుదయ

## సాహిత్య మాసపత్రిక

**1959 - మే**

★


సంపాదక వర్గం:

శ్రీరంగం శ్రీనివాసరావు, కొడవటిగంటి కుటుంబరావు,
అనిసెట్టి సుబ్బారావు, తుమ్మల వెంకటరామయ్య, కె. వి. రమణారెడ్డి.


★


ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం
విజయవాడ - 2

అర్ధ రూపాయి

**Extracts From The Proceedings of The Director of Public Libraries, Andhra Pradesh – Hyderabad.**

*R. C. No.* 1533 *M* 4/57. *Dated* 27–1–'58.

The following Monthly magazine is commended for use in all the Public Libraries in the State.

Name : "Abhyudaya"........................

★

83/58 స్థానిక పరిపాలన ఇనస్పెక్టర్ జనరల్ కార్యాలయం

యల్. డిస్. నెం. 92369/58 — తేదీ 25 అక్టోబరు 1958

"అభ్యుదయ" తెలుగు మాసపత్రిక పంచాయితీ గ్రంథాలయములలో

ఉపయోగించుటకు సిఫారుసు.

**ఉత్తర్వు :**

ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయితీలకు ఇందుమూలంగా తెలియపరచునదేమనగా అవి తలచినట్లయిన "అభ్యుదయ" తెలుగు మాసపత్రికకు చందా కట్టవచ్చును...

★

ముఖచిత్రం :

శ్రమజీవనం : శ్రీ కళ్యాణప్రసాద్ శర్మ

★

## ఈ సంచికలో

కొడవటిగంటి కుటుంబరావు. అనిసెట్టి సుబ్బారావు. రమణారెడ్డి.

కౌముది. మంజుశ్రీ. చలసాని ప్రసాదరావు. "ఉదయభాను"

ఆంధ్రప్రదేశ్ అంతటా విజయవంతముగా నడచుచున్నది



ప్రసాద్ ఆర్టు పిక్చర్స్

ఇల్లరికం

దర్శకత్వం..టి.ప్రకాశరావు • నిర్మాత..ఎ.వి.సుబ్బారావు

జమున, నాగేశ్వరరావు, గిరిజ, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి,
సి. యస్. ఆర్., పేకేటి, రామలింగయ్య, ఆర్. నాగేశ్వరరావు.

వెండి తెర నవల వెల : 0–60 న.పై. — నవయుగ

విశాలాంధ్ర అంతటా మే 23 విడుదల



విశ్వరూపా వారి

# కూతురు కాపురం

... గిరిరావు + దర్శకుడు... రావు

జమున, జగ్గయ్య, రాజసులోచన, అమరనాథ్, పెరుమాళ్లు, సూర్యకళ.

డిస్ట్రిబ్యూటర్లు

ఆంధ్ర & నైజాం : పరిజాత్ పిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ, సికింద్రాబాదు
రాయలసీమ : భాస్కర్ పిక్చర్స్, గుంతకల్లు
మైసూరు : చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్సు, బెంగుళూరు.

# అభ్యుదయ

సంపుటి 5 ] 1959 - మే [ సంచిక 5

## వెలుగుచుక్క వీరేశలింగం

సాహిత్యానికి ఒక ప్రయోజనం. లక్ష్యం ఉండని నిరూపించి, సమాజ శ్రేయస్సుకోసం సాహిత్యాన్ని ఆయుధంగా చేపట్టిన యోధుడు వీరేశలింగం. తెలుగు సాహిత్యంలో ఆధునికశాఖ లెన్నింటినో ఆరంభించి యుగకర్త అని పేరొందిన గౌరవ మొక్కటేకాదు ఆయన విశిష్టత. అజ్ఞానం. మౌఢ్యం ఆవరించి క్రుంగి పతనమౌతున్న ఆంధ్రజాతికి వెలుగుచూపిన దివ్యతార వీరేశలింగం! అన్యాయానికి తలయొగ్గక. అధికారుల అవినీతిని సహించక. వారి దురాగతాలను వెలికితెచ్చి. ఎదిర్చి. ఒంటరిగానైనా సరే పోరాడి అకుంఠిత కార్యదీక్షనూ. అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన యోధుడు వీరేశలింగం. బాల్య వృద్ధ వివాహాలను; కన్యా. వరశుల్కాలను; వడుపువృత్తినీ; సానిమేళాలనూ - కుతంత్రాలనూ. మూఢాచారాలనూ నిరసించి. వాటి నివారణకు ఉద్యమాన్ని నిర్మించి సంఘ కశ్మలాన్ని క్షాళనం చేసి. తెలుగుజాతికి విజ్ఞాన వికాసా లందజేసిన వెలుగుచుక్క వీరేశలింగం.

ఇంతేగాక మహిళావిద్యకు వితంతువివాహాల ప్రోత్సాహం ద్వారా సంఘ సంస్కరణకూ పాటుబడిన వీరేశలింగంగారికి ఆంధ్రజాతి ఎంతో ఋణపడివుంది. అట్టి మహావ్యక్తిని మే 27 న సంస్మరించి వర్ధంతి జరుపుకొంటున్నపుడు. కేవల మాయన గుణగణాలను సంస్మరించిన మాత్రాన సరిపోదు. ఒక్కొక యుగసంధి కాలంలో వీరేశలింగంగారి వంటి వ్యక్తుల రాక, ప్రభావమూ అనివార్యమౌతుంది. కాని అంతటితోనే. ఆయన జీవితాంతంతోనే ఆయన జీవితకాలంలో ఎదుర్కొన్న సమస్యలు పూర్తి పరిష్కారం కావు. ఆ నాటికన్నా. సమాజం నేడు ఎన్నో విధాల ముందుకు వెళ్ళింది. అయినా. నేటి ఆర్థిక విధానంలోని అస్తవ్యస్తాలవలన లంచగొండితనం విజృంభించింది. వడుపువృత్తి ఇతర రూపాలు ధరించింది. వినోదం పేరట జూదశాలలు వెలిశాయి. కంచెయే చేను మేసినట్లు అధికారులే అవినీతిలో భాగస్థులు కావడంవల్ల. ఉద్యమ నాయకులలోనే కుహనా సంస్కర్త లుండటంవల్ల. జాతి వికాసానికి విఘాతం ఏర్పడుతున్నది. ఈనాడు ఏ ఒక వ్యక్తో వీరేశలింగంగారివలె సంఘాన్ని 'మరమ్మతు' చేయలేరు. అందుకు అభ్యుదయాన్ని. సమాజ శ్రేయస్సునూ కోరే సంస్థలన్నీ కృషిచేయాలి. ముఖ్యంగా యువజన. మహిళా సంఘాలు. అభ్యుదయ సాహితీ సంస్థలు అందుకు పూనుకోవాలి. అదే వీరేశలింగంగారికి నిజమైన సంస్మృతి.

★

# వెలిగే నీడలు

## "ఉదయభాను"

అతడు అయిదారేళ్ళ పల్చటి కుర్రవాడు-జాలిగా - దీనంగా, పరధ్యానంగా కూర్చున్నాడు ఆ గోడకు యివతల. నువ్వు పరదేశంలో చదువుకునేటప్పుడు తలపుకు వచ్చిన నీ చిన్న తమ్ముడిలాంటి వాడు. యీ కుర్రవాడు 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, ద్వేషాలూ ఏమీ ఎరుగని పూవు' అతడు. అయిదారేళ్ళ పాప. దీనంగా, పరధ్యానంగా శూన్యంలోకి చూస్తున్నాడు. వాడు యీ గోడయివతల కూర్చున్నాడు.

సంతోషమూ, బాధా తెలియదు - భయమూ, స్వేచ్ఛా తప్పించి. దీక్షా పట్టుదలా వుండవు-ఉత్సాహమూ, వుద్వేగమూ మించి. పాపం వాడికి తెల్లీదు. అమ్మా, నాన్నా, గురువూ దైవం, శిక్షా భయమూ, విద్య గౌరవం, వూపిరి, నెత్తురూ అన్నీ వాళ్ళ నాన్నే - అతని రక్షా ప్రోత్సాహకుడూ [illegible], త్రాగి తందనాలాడనీ, కొడుకుని తన్ననీ, దొంగతనం చెయ్యనీ ఈ నికృష్ట జీవితంలో యితన్ని కృశింపజేయనీ ఏం - అతను వాడికి తండ్రి - అంతకంటె వాడి వూపిరి.

పాపం, పల్చగా నక్కులు చూస్తూ షోకులు ఎగరేసుకుంటూ, గుమ్మంలో కూర్చున్నాడు కుర్రవాడు. దారినిపోయే ఎవరి మనో ఆకాశాల్లోకి చొరనేరని దౌర్భాగ్యుడు. ప్రక్క హోటళ్ళనించి వచ్చే ప్రతి చిన్న వాసననీ ఆశతో వూహించుకుని, అందుకోలేక కూలబడిపోయిన కుర్రవాడు - దీనంగా పరధ్యానంగా కూర్చున్నాడు ఆ గోడకు యివతల.

తండ్రిని గోడల లోపలికి తీసుకుపోయారు యిద్దరు పోలీసులు. అతని నేరం ఈ కుర్రవాడికి తెలియదు. అసలు పోలీసులు తీసుకుపోవడానికి నేరం అంటూ ఒకటి వుండాలా!

తండ్రి చేసిన నేరం తెలియదు. మళ్ళీ వస్తాడనే ఆశ. అతను రాకపోతే ఎక్కడ వుండాలో కూడా వూహించలేని వయస్సు. వాళ్ళకు ఒక గుడిసె అంటూ వున్నా, తండ్రి లేకపోతే అక్కడ వున్నా ఆకాశంలో వున్నా అసలు లేకున్నా ఒకటే.

చీకటి పడిపోతున్నది. ఈ [illegible] మార్గానికి [illegible] వెళ్ళిపోతున్నాడు [illegible] సూర్యుడు. ఇంకా కుర్రవాడు తన తండ్రి వస్తాడని కూచునేవున్నాడు. తండ్రి లోపల ఏం చేస్తున్నాడో, చూస్తున్నాడో, ఆలోచిస్తున్నాడో, ఏడుస్తున్నాడో ఎలా తెలుస్తుంది? ఏమిటని తెలుస్తుంది? గోడ అడ్డం వుంది - ఈ గోడ ఎప్పుడు ఎవరు ఎందుకు కట్టారు? ఏమిటీ యీ కుర్రవాణ్ణి యీ గోడ యివతలే వుంచింది? - ఎంచేత అతను లోపలికి వెళ్ళకూడదు?

తండ్రి నేరం చేసేడనుకో - ఎంతో పెద్ద నేరమే అనుకో, ఎవరినో ఖూనీ చేసేడనుకొందాం. అతనికి శిక్ష విధించవలసి

రావడం న్యాయమే. ధర్మమే. అలా విధించకపోవడం క్రూరం, దారుణం కూడా – నిజమే.

అతనికే ఒక కుర్రవాడో, చిన్న పిల్లో ఎవరో వుండి, అతను అతను మాత్రమే కాకుండా ఒకడికి తండ్రి, యింకొకరికి అన్న, మరోవాళ్ళకి మామ యిలా అయ్యేప్పుడు, అతనికి శిక్ష విధించడంకోసం ఆ కొడుకుకి తండ్రి లేకుండా, తమ్ముడికి అన్న కాకుండా, యింకొకరికి మామ వుండకుండా చెయ్యడం న్యాయమా?

పాపం కుర్రవాడు, చిన్నవాడు, అయిదారేళ్ళవాడు, యింక 'నా' అనే వాళ్ళు లేనివాడు – సర్వం తండ్రే అయినవాడు, తల్లి లేని పిల్లవాడు, ఆ గోడ యివతల కూర్చున్నాడు – అమాయకుడు – ప్రపంచం అంటే అర్థం తెలియనివాడు, భయం పీల్చుతున్నాడు, దిగులు తింటున్నాడు, తండ్రి వస్తాడా రాడా అనే సందేహం చేత తినబడుతున్నవాడు – వాడు యీ కుర్రవాడు. వాడికి శిక్ష విధించడానికి ఎవరికి ఏ అధికారం వుంది – అందునా అతను చేసిన తప్పు లేనివాడు. ఎంత శిక్ష! ఊపిరి, నెత్తురు, సర్వస్వమూ అయిన తండ్రిని దూరం చెయ్యడం – అయ్యో! ఎంత దారుణం!!

ఇంక తండ్రి వస్తాడో రాడో, దీనంగా పరధ్యానంగా, దిగులుగా, గుండెల్లో బుగులుతూ కూర్చున్న కుర్రవాడికి ఎలా తెలుస్తుంది. అతని మాఘదారిలో అర్థం గిలుకొట్టాకు రోదను.

ఎలా తెలుస్తుంది కుర్రవాడికి. సమాజపుటాలోచన పరిధుల బయట క్రూరత్వం, అజ్ఞానం రాజ్యం చేస్తాయనీ, సంఘం నిర్ణయించిన హద్దుల లోపల అది అంగీకరించిన న్యాయమై, ధర్మమై, ధర్మ చెల్లుతుందనీ, తనముందు నుంచున్న గోడ యీ ధర్మమేననీ, జాతి మనోవికాసానికీ, మానవ సత్యానికీ నిత్యం జరుగుతున్న సంఘర్షణా దృష్టంలో తాను సమిధననీ, తనను కాల్చి యీ ధర్మం వెలుగుతుందనీ, ఆలోచనాధారలు యింకా విస్తృతమైతే తప్ప తనలాంటి వాళ్ళకు గత్యంతరం లేదనీ, తనకిక తండ్రి దక్కడనీ, తానిక దిక్కు లేని పక్షిననీ, సహారా తుఫానులో, సుడిగాలిలో కొట్టుకొని పోతున్న చిన్న పిచిక పిల్లననీ ఎలా తెలుస్తుంది – వాడికి, అయిదారేళ్ళ కుర్రవాడికి.

'పాపం పుణ్యం ప్రపంచమార్గం, కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవు'కి – అయిదారేళ్ళవాడికి ఎలా తెలుస్తుంది? ఎలా? ఎలా??

# చదవండి!

| | | |
|---|---|---|
| నేరము - శిక్ష | డోస్టొవస్కీ | 6.00 |
| కాకలుతీరినయోధుడు | నికోలోయ్ ఓస్ట్రొవస్కీ (మొదటిభాగం) | 3.25 |
| ,, | ,, (రెండవ భాగం) | 4.00 |
| ,, | ,, (ఒకే సంపుటి మేలుప్రతి) | 8.50 |
| మీకు తెలుసా ? | ఇలిన్ & సెగాల్ | 4.00 |
| పేదల బ్రతుకులు | డాస్టోవస్కీ | 3.00 |
| గొప్పవారి గోత్రాలు | సాల్టికోవ్ షెడ్రిన్ | 3.50 |
| పునరాగమనం | బోరిస్ పోలెవాయ్ | 1.75 |

(పోస్టేజి అదనం)

ప్రతులకు :

**విశాలాంధ్ర ప్రచురణాలయం**

బకింగ్‌హామ్‌పేట (పోస్టు) : : విజయవాడ-2.

నాటిక

# ఒకతల్లి పిల్లలు

## కొడవటిగంటి కుటుంబరావు

[ అన్నేశ్వరంగారి ఇల్లు – ఒకనాటి ఉదయం ]

అన్నే : ఇంకా ఉత్తరాలకోసం వెతుకుతూనే ఉన్నావురా, రాఘవులూ ?

రాఘు : చిన్నమ్మాయి రాసిన ఉత్తరం ఒకటీ దొరకదే.

అన్నే : మిగిలినవో ?

రాఘు : పెద్దబ్బాయి రాసినవి ఎనిమిదున్నై. పెద్దమ్మాయి రాసినవి మూడున్నై. చిన్నబ్బాయి రాసినవి ఆరున్నై. చిన్నమ్మాయి రాసినదే కనబట్టంలేదు.

అన్నే : అదికూడా రెండుసార్లు రాసిందిరా – నాకు బాగా జ్ఞాపకం.

రాఘు : ఈ ఉత్తరాలు ఇన్నిసార్లు కట్టలు విప్పాను, కట్టాను, చిన్నమ్మాయి ఉత్తరం చూసినట్టు నాకెక్కడా జ్ఞాపకంలేదు.

అన్నే : అయితే పోనీ, అది రాసిందని నేను అనుకున్నానేమో. ఒకొక్కసారి మనం అనుకునే విషయాలుకూడా నిజమల్లేనే ఉంటై. కిందటిసారి నాకు జబ్బుచేసినప్పుడూ——

రాఘు : డాక్టరుగారు తొమ్మిదింటికి వస్తామన్నారు గదూ ? తొమ్మిది కావచ్చింది.

అన్నే : ఏవేవో కొత్త చోట్లు చూశా. కొత్తమనుషులు కనిపించారు. ఆ మనుషులు కనిపిస్తే గుర్తు పట్టగలనన్న మాట.

రాఘు : (నవ్వుతూ) ఇంకాసేపటికల్లా మీ మనవలూ, మనవరాళ్లూ వస్తారు. వాళ్ళను గుర్తుపడితే చాలు.

అన్నే : (గర్వంగా) ఎంత మాటన్నావురా. నా మనవలనూ, మనవరాళ్ళనూ నేనే గుర్తుపట్టలేనుగా. చాల్లే. ఎవరన్నా వింటే నవ్విపోతారు.

రాఘు : వాళ్ళను మీరు చూసి ఎన్నాళ్ళయింది. ఎన్నేళ్ళయింది ?

అన్నే : (ఆలోచిస్తూ) పెద్దబ్బాయి ఉపనయనానికి మేమింకా కలిసే ఉన్నాంగా – వాడికప్పుడు పదమూడో ఏడు–తరవాత ఏణ్నర్ధానికో ఏమో నా కొడుకు నాతో భాగాలు పడ్డాడు !– వెర్రివాడు. ముప్ఫై ఏళ్ళు. నిన్నగాక మొన్నల్లే ఉంది సుమా——

రాఘు : పెద్దబ్బాయి పెళ్ళిచేసుకున్నాక భార్యతోకూడా మిమ్మల్ని చూడరాలా ?

అన్నే : (ఆలోచన పాడయి) ఏమిటదీ ?

రాఘు : మీరు పెద్దబ్బాయిని చూసి దాదాపు ఇరవయ్యేళ్ళయిందన్నా.

అన్నే : నీ మొహం కాదూ!

రాఘు : సరే, మీ యిష్టం.

అన్నే : (ఆశ్చర్యంతో) వాణ్ణిచూసి ఇరవయ్యేళ్ళయిందిట్రా! చిన్నతనంలో ఎట్లా ఉండేవాడననుకున్నావు? బంగారు నాయన. నా దగ్గర్నుంచి వాళ్ళమ్మదగ్గరికి వెళ్ళేవాడు కాదు. నీకు అమ్మకన్న తాత ఎక్కువట్రా? అనేది పార్వతి... వాడే కానురా, రాఘువులూ! నలుగురూ నా మీద ఎక్కి తొక్కేవాళ్ళు. సుఖమంటే అదిరా, రాఘువులూ! అన్ని సుఖాలూ మరుపుకొచ్చినా - మనవలూ, మనవరాళ్ళూ మీద ఎక్కి తొక్కిన సుఖం మరుపురాదు. నీ కూతురి కడుపున నలుసులు పుట్టుకొస్తే నీకే తెలుస్తుంది.

రాఘు : అదంతా నిజమే. ఆ నలుసులు అట్లాగే ఉండిపోరుగా! వాళ్లు పెరిగి కోరలూ, గోళ్ళూ పెంచుకుంటారు. వాటితో మనని బరుకుతారు; రక్కుతారు; పీకుతారు; రక్తం కళ్ళజూస్తారు. నాకు మనవలు పుడితే కవచం తొడుక్కు తిరుగుతాను.

అన్నే : నీ మొహం. అనుభవంలేక అంటున్నావు. నువు నా మూడో మనవడివి కాదుట్రా? నీ చిన్నతనం చూడలేదని నాకు ఎంతో బాధగా ఉంటుందిరా, రాఘువులూ.

రాఘు : నా చిన్నతనమా?

అన్నే : అవున్రా. చిన్నప్పుడు నువు చేసిన పనులు జ్ఞాపకం ఉంటే చెప్పు.

రాఘు : ఒకసారి ఉండేలు బద్దతో కుండకు చిల్లిపొడిచా. మా నాన్న కొడవలితో నా నెత్తిన చిల్లి పొడిచాడు. అది మానటానికి అర్నెల్లు పట్టింది.

అన్నే : ఛీ, ఛీ, ఏం మనిషిరా మీ నాన్న?

రాఘు : మా నాన్న మంచి మనిషే. నేనే శనిగాణ్ణి. చిన్నతనంలో నా అంత శనిగాడు ఇంకొకడుంటాడనుకోను. ఒక్క మంచిపని చేసినట్టు జ్ఞాపకంలేదు.

అన్నే : (గంభీరంగా) రాఘువులూ, నిన్ను గురించి నువు అట్లా మాట్లాడితే నే నూరుకోను, తెలిసిందా. నీ వంటి బుద్ధిమంతుడు నూటికీ కోటికీ ఒక్కడుండడు. మీ నాన్న నా కొడుకల్లే నే కర్కోటకుడై ఉండాలి; చిన్నతనంలో నీలో ఉన్న మంచితనం కూడా నీకు జ్ఞాపకం రాకుండా చేసేశాడు. నా మనవలూ, మనవరాళ్ళూ చిన్నతనంలో ఎంత మొద్దుపనులు చేసేవాళ్ళో వాళ్ళకు చెప్పినవాళ్ళు లేరు. నాకూ వాళ్ళకూ మధ్య నా కొడుకు అడ్డం వచ్చి, వాళ్ళను వేరు చేశాడు. లేకపోతే వాళ్ళ జీవితాలు ఇంత భ్రష్టయి వుండవు. వాళ్ళు చిన్నతనంలో చేసిన ప్రతిపనీ నాకు జ్ఞాపకం ఉందిరా, రాఘువులూ. ఒకసారి ఏం జరిగిందంటే —

రాఘు : మరి మీ అబ్బాయి అట్లా ఎందుకయినాడూ? ఆయన్ని మీరు పెంచలా?

అన్నే : నేను పెంచితే వాడు అట్లా అవుతాడుట్రా? వాణ్ణి వాళ్ళమ్మ పెంచింది. పెంచటంలో కూడా ఎట్లా? విషంపోసి పెంచిందనుకో - విషం. అసలు వాడు నూటికి తొంభై తొమ్మిదిపాళ్ళు తల్లి పోలిక. దాని

ముక్కు నుంచి ఊడిపడ్డాడు. ఎక్కడ ఉన్నా నా పోలిక అంటూ ఉంటే అదిమాని వాడు సిగ్గుపడేట్టు తయారు చేసింది. వాడు తల్లి కొడుకుగా పెరిగాడు.

రాఘు: అందరూ తల్లి కొడుకులుగానే పెరుగుతారు.

అన్నే: అందరూ తండ్రి అంటే అసహ్యించుకుంటారుట్రా. తండ్రి వాడా? మొదటినుంచికూడా నా కొడుకు నమ్మకమేమిటంటే, నాకు ప్రపంచ జ్ఞానం లేదనీ, నేను అసమర్థుణ్ణనీ, నన్ను గురించి సిగ్గుపడాలనీ, నా సలహా ప్రకారం చేస్తే తాను బాగుపడడనీ. వాడి తల్లికికూడా నన్ను గురించి అటువంటి ఉద్దేశమేలే.

రాఘు: అటువంటి అపోహాలు ఎంతో కాలం ఉండవే.

అన్నే: మా వాడికి నన్ను గురించి ఎప్పుడు అభిప్రాయం మారిందో నాకు తెలీదు. నాతో భాగాలు పడేనాటికి పోలేదు. వాడి భాగం వాడు పంచినాక నేను లక్ష రూపాయలు సంపాదిస్తానని వాడు ఊహించి ఉండడు. అది చూశాక వాడి ఉద్దేశం మారిందేమో మరి. నేను డబ్బు సంపాదించే కాలంలోనే వాడు తన ఆస్తి యావత్తూ క్షవరం చేసేసుకున్నాడు. లక్షాధికారి కొడుకు బికారిగా చచ్చిపోకూడదు.

రాఘు: పోనివ్వండి, మీ డబ్బు మీ అబ్బాయికి పనికిరాకపోతే ఆయన పిల్లలకైనా ఉపయోగపడుతున్నది.

అన్నే: ఉపయోగపడుతున్నదా? అదే నా అనుమానం. వాళ్ళు సుఖపడుతున్నారా? ఒక తల్లి పిల్లలమధ్య ఉండదగిన ఆప్యాయత వాళ్ళమధ్య ఉన్నదా? లేదు, రాఘవులూ వాళ్ళ తండ్రి వాళ్ళమధ్య గోడలుకట్టి మరీ వెళ్ళాడు. ఆ నలుగురినీ వచ్చి నా దగ్గర ఒక ఏడాది ఉండమన్నాను. వాళ్ళు రారు. నలుగురూ ఒక చూరు కింద నిలబడరు—గాలివాన కురుస్తున్నా సరే. అందుకే చివరకు – (కారు హారన్) డాక్టర్లే ఉంది. వెళ్ళి తీసుకురా.

రాఘు: (పక్క నున్న హాలులో నుంచి) రండి, డాక్టరుగారూ, తాతగారు మీ కోసమే ఎదురు చూస్తున్నారు.

డా: ఆయనకు ఒంట్లో సరిగాలేదా ఏం?

రాఘు: బాగానే ఉన్నారండి. మిమ్మల్ని పిలిచింది—

డా: హలో (కులాసాగా అన్నెశ్వరం ఉన్న గదిలోకి వచ్చేసి) హలో, తాతగారూ, బాగానే ఉన్నారే. తప్పకుండా రమ్మన్నారనే సరికి ఏం ముంచుకొచ్చిందో అనుకున్నాను.

అన్నే: విశేషం ఉండే రమ్మన్నాను, డాక్టరూ! ఇవాళ నా మనవలూ, మనవరాళ్ళూ నన్ను చూడటానికి వస్తున్నారు. వాళ్ళు నన్ను చూసి, నా దగ్గరికి వచ్చి చాలా ఏళ్ళయింది. విశేషం కాదూ మరి?

డా: ఏది విశేషమో నా కర్థం కాలేదు—వాళ్ళు ఇన్నాళ్ళూ మీ దగ్గరికి రాక పోవటమా, ఇప్పుడు రావటమా?

అన్నే: రెండూనూ.

డా: అందుకని పార్టీ ఏమైనా ఇస్తున్నారా ఏమిటి? నాకీమధ్య పార్టీ తగిలి చాలాకాలమయింది.

అశ్నే : వాళ్ళు వచ్చేసరికి ఇక్కడ డాక్టరొకడు ఉండటం అవసరం. అందుకని నీకు కబురు వేశా. అందుకే మిగిలిన కేసులు చూసుకుని మరీ రమ్మన్నా.

డా : మీ మనుమలూ, మనవరాళ్ళూ జబ్బుతోగాని బాధపడటం లేదుగద.

అశ్నే : వాళ్ళకు అంతో ఇంతో జబ్బున్నమాటా నిజమే మరి. అయితే అది నీ ఇంజెక్షన్లకు లొంగే జబ్బు కాదు.

డా : ఇవాళ అశ్నేశ్వరంగారు మంచి ఘోరంలో ఉన్నట్టున్నారు. నే నిక వేళాకోళం కట్టిపెట్టి, అంపశయ్య మీద ఉన్న భీష్ముణ్ణి ధర్మరాజు అడిగినట్టు వినయ విధేయతలతో అడుగుతాను. ఏమిటీ విశేషం ?

అశ్నే : (నవ్వి) మొత్తానికి నాటకాలాడ వలసిన వాడివి. దారి తప్పి వైద్యంలో పడ్డావు. బోనులో పులిలాగా ఎందుకల్లా పచార్లు చేస్తావు? కూచో, విషయం చెబుతా... ఈ వచ్చేవాళ్లు నా కొడుకు పిల్లలు, వీళ్ళెందుకు వస్తున్నారో తెలుసా ? నా స్థితి చాలా ప్రమాదకరంగా ఉందని రాఘవులుచేత టెలిగ్రాము లిప్పించాను. రిప్లయి టెలిగ్రాములు. నా పెద్ద మనవడు తప్ప మిగిలిన ముగ్గురూ జవాబులిచ్చారు. వాళ్ళు వచ్చే వేళ అయింది. రాఘవులూ, నువు హాలులో ఉండి వాళ్ళను అక్కడే కూచోబెట్టు. నేను చెప్పిన దాకా ఎవ్వరినీ ఈ గదిలోకి రానియ్యొద్దు.

రాఘ : బాబు తెలీదా ? (పోతాడు)

డా : తాతగారూ, మీ కిప్పుడు ఎన్నో ఏడూ ?

అశ్నే : ఎనభై ఆరో ఏడు నాయనా.

డా : ఎలాంటి శరీరతత్వమండీ మీదీ! చత్వారంలేదు, చెవుడు లేదు, దంతాలు కూడా ఊడలేదనుకుంటా

అశ్నే : చత్వారం వచ్చి పోయిందిగా. చెవుడే రాలేదు, నీ దయవల్ల.

డా : మీవాళ్లువస్తే వాళ్ళను ఆహాలులో కూచోబెడతారా ? తరవాత ఏం చేద్దామని మీ ఉద్దేశం ?

అశ్నే : చూడు, బాబూ ఈ పిల్లలు నాకు చంటిపిల్ల లంటివాళ్ళు. నీకు తెలీనిదేముంది ? చంటిపిల్లలను మనం దేవుళ్ళల్లే చూడాలి. వాళ్ళపట్ల మనం దేవుడల్లే ప్రవర్తించాలి. అవునంటావా ?

డా : అది సాధ్యమవుతుందిటండీ.

అశ్నే : సాధ్యమైనంతవరకే అనుకో - అయిందా, నేను డబ్బు సంపాదించా. రెండు తరాలపాటు హాయిగా కూచుని అనుభవించవచ్చు. నా కొడుకు భీష్మించుకూర్చుని నా డబ్బు ముట్టనేలేదు. నా డబ్బంతా నా కొడుకు పిల్లలకే ఇచ్చేశా. కాని వాళ్ళు సుఖపడలేదు. ఇవాళకూడా వాళ్ళు కష్టాలలోనే ఉన్నారు. వాళ్ల కష్టాలు డబ్బుతో తీరేవే అయినా కూడా నా దగ్గర ఇక డబ్బులేదు. చెప్పకోదగినంతలేదు.

డా : వాళ్ళ కష్టాలు ఎలాటివి ?

అశ్నే : ఉన్నది నలుగురు. ఒక గర్భవాసాన పుట్టినవాళ్ళు. అయినా ఒకరి పొడ ఒకరికి గిట్టదు.

డా : గర్భశత్రుత్వం.

అన్నె : తమకు తామే శత్రువులైనవాళ్లు ఎప్పుడూ లోకానికి శత్రువులు గానే ఉంటారు.

డా : 'నీ ధీనర శత్రులోర్వర ప్రభిన్నుల జేసిన ప్రాణికోటిలో నీకు విరోధి లేడు...'అన్నట్టుగానా !

అన్నె : వాళ్ళను బాధించేది అరిషడ్వర్గం కాదులే. వాళ్ళు తమలో ఉండే మంచితనాన్ని పూర్తిగా మరిచిపోయినారు. అది ఆత్మద్రోహం. అంతకన్న పాపం మరొకటి లేదు.

డా : మీరేదో కొత్త వేదాంతం కనిపెట్టినట్టున్నారు. అది నాకు సరిగా అర్థం కావటంలేదు.

అన్నె : ఇందులో పెద్ద వేదాంత మేముందోయ్? ప్రతి మనిషికీ చిన్నతనంలో సమస్త సద్గుణాలూ ఉంటై. ఇంకోరి ఆనందాన్ని పంచుకోవటమూ, ఇంకోరికి సహాయం చెయ్యటమూ చిన్నపిల్లల్లోకూడా ఉంటుంది. అయితే పెద్దయినకొద్దీ ఈ గుణాలు తరిగిపోతై. జీవితం అటువంటిది, దానికేం చేస్తాం? కాని, నేననేదేమంటే, మనకు స్వాభావికంగా ఉన్న మంచితనాన్ని పూర్తిగా పోగొట్టుకోటం అపచారమంటాను. నాతనైతే దాన్ని పెంచుకోవాలి, లేకపోతే ఉన్నదైనా దక్కించుకోవాలి. అదికాస్తా పోయినాక యిక జీవితానికి అర్థమేమున్నది?

డా : ఏమోనండీ, తాతగారూ. నన్నడిగితే ఎదిరాళ్లు సంపాదించి కూడబెట్టుకున్నవాడు ప్రయోజకుడు. నా వాళ్ళు, నావాళ్ళు అని పాకులాడినవాడు చివరకు పూలవుతాడు. ఈ ప్రపంచంలో ఎవరి కెవరు?

అన్నె : దీపాలను నమ్ముకోవటంకన్న చీకట్లో తడుముకోవటమే సరిఅయిన జీవితాదర్శమంటావా?

డా : ఎక్కడున్నాయండీ ఆ దీపాలూ?

అన్నె : వెర్రివాడా, నవ్వోక దీపానివి కావూ? నేనోక దీపాన్ని కానూ? అద్దాలకుపట్టిన మసి తుడిచేసుకోవాలే గాని...ఇంతకూ అసలు సంగతి మనం మాట్లాడనేలేదు. మావాళ్ళు వస్తారు. నాకు ప్రాణంమీదికి వచ్చినట్టు వాళ్ళతో చెప్పావా. ఎట్లాగైనా వాళ్ళు నలుగురూ ఏకం కావటం నాకు ముఖ్యం. ఆ తరవాత నేను హాయిగా కన్నుమూస్తాను. అందుకనీ—

రాజ్యం : (హాలులోకి వచ్చి, రాఘవులుతో) అన్నెశ్వరం గారిల్లు ఇదేనన్నారు.

రాఘు : అవును. మీ పేరు?

రాజ్యం : రాజ్యలక్ష్మి, అన్నెశ్వరంగారి చిన్న మనవరాలిని. మా తాత ఎట్లా ఉంటో?

రాఘు : నిద్రపోతేను. డాక్టరుగారు అయిదు నిమిషాల కోసం ఇంజెక్షనిస్తున్నారు.

రాజ్యం : ఆయనన్నోకసారి చూస్తా.

రాఘు : వీల్లేదు, వీల్లేను, కాస్సేపట్లో డాక్టరుగారు బయటికొస్తారు. ఆయన అనుమతి తీసుకుని —

డా : (రహస్యంగా) ఆ వచ్చినది మీ మనవరాలా?

అన్నె : (రహస్యంగా) అవును. దాన్ని నేను కిందటిసారి చూసినప్పుడు

పన్నెండేళ్ళపిల్ల. ఇప్పుడు పాతికేళ్లుంటయ్యేమో.

డా : (రహస్యంగా) వీళ్ళని మీరు మాసి ఎన్నో ఏళ్ళయిందంటున్నారే. వాళ్ళ అంతరాత్మల్లో ఉండే విషయాలు మీకెలా తెలుసా?

అశ్వి : ఇవిగో వాళ్ళ ఉత్తరాలూ... ఇప్పుడు మనం చెయ్యవలసిందేమిటంటే - (ఇంకా రహస్యంగా మాట్లాడుతాడు) ...

రాజ్యం : ఏనొక్కత్తైనా వచ్చింది?

రఘు : డాక్టరుగారొచ్చారుగా?

రాజ్యం : (చిరాకుగా) ఇడియట్! ఏ అక్కయ్యగాని, అన్నయ్యలుగాని రాలేదా అని అడిగాను.

రఘు : వస్తే కనిపించరూ?

రాజ్యం : నీకు మర్యాదగా మాట్లాడటం కూడా చాతకాదా? ఎవరు నువ్వు? మా తాత నౌకరువేనా?

రఘు : సగం నౌకరునూ, సగం మనవణ్ణి.

రాజ్యం : అంటే?

రఘు : అసలు మనవలు తాతగారికి సేవ చెయ్యకుండానే ఆయన సొత్తు తినేస్తే నేను ఆయనకు సేవ చేస్తూ తినేశాను. సొత్తు తినకుండా ఉంటే అచ్చగా నౌకర్నయేవాణ్ణి. సేవ చెయ్యకుండా ఉంటే అచ్చగా మనవణ్ణయేవాణ్ణి.

రాజ్యం : తెలివి చాలాదాకా ఉందే. అవతల తాతయ్య ప్రాణం అటో యిటో అన్నట్టుంటే నీకు చీమ కుట్టినట్టయినా లేదులాగుందే?

రఘు : మీ కళ్ళు ఏ ఇనప్పెట్టెమీద ఉన్నాయో, నావీ దానిమీదే. అయితే నాకు ముందే తెలుసు - ఆ ఇనప్పెట్టె ఏనాడో ఖాళీ అయింది. కుట్టటానికి చిన్న చీమకూడా లేదు అందులో.

రాజ్యం : అందరూ నీలాగే డబ్బుమనుషులనుకున్నావా?

రఘు : కొందరు తాతగారితో పాటు ప్రాణాలు కూడా వదలచ్చు. నే నెందుకు కాదంటానూ?

రాజ్యం : నాకలాంటి ఇచ్ఛకాలు చాతకావు. పొయ్యేవాళ్ల వెంట ఎవరూ పోరు.

రఘు : పొయ్యేవాళ్ల వెంటపోరు, ఉండేవాళ్ళవెంట ఉండరు. నీ బోటి వాళ్ళు ఏంచేస్తారు, తల్లీ? తొంభై ఏళ్ళ తొక్క, దిక్కులేని బతుకు బతికి దిక్కులేని చావు చావనా? మీరంతా ఉండి ఆయనకు ఏం ఒరిగించినట్టు?

రాజ్యం : బాగుంది. నా బతుకు నేను బతుకుతున్నాను. దిక్కులేకుండా పోవటానికి తొంభైఏళ్ళ తొక్కే కావాలా? నాదీ దిక్కులేని బతుకే. తాతయ్యకు తవ్వుకు పోయినంత డబ్బున్నా ఉంది, నాకు చిల్లిగవ్వ లేదు.

రఘు : అవసరం వచ్చినప్పుడు తాతగారికి రాసి డబ్బు తెప్పించుకోలా? డబ్బు పనికొచ్చిందిగాని, మనిషి పనికి రాలేదు గామాలు.

రాజ్యం : ఆ డబ్బు తీసుకున్నందుకే వీ బాబుగాడి సొమ్మంతా పోయినట్టు దెప్పుతున్నావే. వచ్చి ఇక్కడ తిష్ట వేస్తే ఇంకా ఏమనేవాడివో.

(పురుషోత్తం వస్తాడు)

రాఘు : ఓ హో, పెద్దబ్బాయిగారా, సరిగా సమయానికి వచ్చారు. కూచోండి.

పురు : ఏం రాఘువులూ, బాగున్నావా? ఏమిటి విశేషం? (రాజ్యాన్ని చూసి) ఓ, నువ్వా?

రాజ్యం : అవును, నేనే. ఏం? కాకూడదా?

రాఘు : ఊరుకోండమ్మా, తగాదాలాడటానికి తరువాత బోలెడంత సమయం- ఆ ముసలాయన హరీ అన్నాక.

పురు : (ఆశ్చర్యంతో) ఏమిటీ! తాతయ్య ఇంకా బతికున్నాడా?

రాజ్యం : (వెటకారంగా) ఎంత పొరపాటయిందీ. ఈ సంగతి తెలిస్తే ఇంకో నాలుగైదువేలు అవసరానికి పట్టుకుపోయే వాడివిగద.

పురు : నీమాదిరిగా ఆడజన్మ ఎత్తివుంటే డబ్బుగలవాళ్ళను ఇట్టే ఆకర్షించి —

రాఘు : (అడ్డుపడి) డాక్టరుగారు నన్ను పిలుస్తున్నట్టుంది. ఇప్పుడే వస్తా. (వెళతాడు)

రాజ్యం : నన్నేమీ ఎత్తిపొడవక్కర్లేదు. ప్రేమంటూ ఒకటి ఉందనికూడా నీకు తెలీదు, తెలిస్తే అవాకులూ, చెవాకులూ మాట్లాడవు.

పురు : నా చేత మాటలు పడటం ఇష్టం లేని దానివి నన్ననకు. ఇన్ని బొప్పెలు కట్టినా నీకింకా చిన్నప్పటిగుణం మారలేదు. నువ్వు అందరిమీదా నోరు పారేసుకోవచ్చుగాని, నీమీదైన ఈగ వాలరాదు.

రాజ్యం : నామీదకు ఈగన్ని తోలే అధికారం నీకు లేదు. ఎవరంటే పడాలో, ఎవరంటే తిరగబడాలో నాకు బాగానే తెలుసు. బొప్పెలు కట్టింది నాకు కాదు, నీకు. నీ చరిత్రంతా నాకు తెలియటం లేదనుకోకు, అంతా తెలుసు.

పురు : (ఆవేశంతో) ఆపు వదరకు. నన్ను గురించి నీకు ఏనాడూ ఆవగింజంత కూడా తెలియదు. నీ చరిత్ర ఏమిటో నేను మాత్రం ఎరగను - నాకక్కర్లేదు కూడాను.

(ఇద్దరూ బిగుసుకుపోతారు)

అన్నే : (రహస్యంగా) వింటున్నావా, డాక్టరూ? నా పెద్ద మనవడూ, చిన్న మనవరాలూనూ. రాఘువులూ నువ్వు అక్కడే ఉండు. చప్పున వాళ్ళు లోపలికి రాగలరు.

రాఘు : (రహస్యంగా) ఏం మాటలు వినాలిసొస్తుందో అని పారిపోయి వచ్చా.

అన్నే : (రహస్యంగా) నువ్వు లేకపోతే ఇంకా విజృంభిస్తారు.

రాఘు : (రహస్యంగా) వెళుతున్నా.

పురు : ఏం, రాఘువులూ? తాతయ్య ఏ స్థితిలో ఉన్నారు?

రాఘు : ఇంకా స్పృహ రాలేదు. డాక్టరుగారు అక్కడే వున్నారు.

పురు : ఇంకా చెప్పవేం? ఒకసారి ఆయన్ను చూస్తా.

రాఘు : వద్దు, వద్దు. ఎవరినీ లోపలికి రానివ్వద్దని డాక్టరుగారు ఖచ్చితంగా చెప్పారు.

పురు : నాకు తాతయ్యమాటే జ్ఞాపకం లేదు. ఈపూట వేరే పనిమీద వచ్చి, ఈ ఇంట్లో ఎవరుంటున్నారో అని తొంగిచూశానన్నమాట. రైలు కింకా గంట టైమున్నది. అందుకని -

రాఘు : తాతయ్యగారు మీకూడా టెలిగ్రాం ఇచ్చారు. రిప్లయి టెలిగ్రాం. సమాధానం రాలేదు. మిగిలిన ముగ్గురూ సమాధానాలిచ్చారు.

పురు : ఏమిటీ? శకుంతలా, సత్యమూ కూడా వస్తున్నారా ఏమిటి?

రాఘు : అవును పెద్దబ్బాయి గారూ.

పురు : అపూర్వ సమ్మేళనం. 'ఓగులెల్ల కూడి కొక్కచోటు' అన్నట్టుగా.

రాజ్యం : నువుకూడా ఓగుల్లోఉన్నావు కద.

పురు : నిన్ను ఒక్కత్తెనే అనటంలో నాకేమీ ఆనందంలేదు.

శకుం : (లోపలికి వస్తూ) అంతా వచ్చినట్టున్నారే?

రాఘు . పెద్దమ్మాయిగారు కాదూ? దయచెయ్యండమ్మా. ఇలాకూచోండి. తాతయ్యగారికి స్పృహలేదు. డాక్టరుగారు మత్తుమందిచ్చారు.

శకుం : కళేబరం కోసం చేరిన గద్దలమన్నమాట. హుఁ, ఆయనకేం? ఆయన దేవుడే. ఆయన చేసిన ద్రోహమల్లా మావంటి మనవరాళ్ళనూ మనవలనూ కనటమే.

రాజ్యం : (కోపంగా) నిన్ను కావలిస్తే అనుకో. నమ్మల్ని అనటానికి నువ్వెవరవు? నేను తాతయ్య కీర్తి ప్రతిష్టలకు ఎటువంటి కళంకమూ తీసుకురాలేదు.

పురు : అవును. నువు ఇన్నాళ్ళూ కాపురం చేస్తున్నది కట్టుకున్న మొగుడితోనే అని ఆయన అనుకుంటున్నారు.

శకుం : నీకేమన్నా పిచ్చిపట్టిందా ఏమిటి? కట్టుకున్న మొగుణ్ణే నమ్ముకుని నాబోటివాళ్ళంటే దానికి నామోషి.

రాజ్యం : నీ కూతురు...

శకుం : నువు తెగబడితే ఏం చేశాం? నాకూతురూ అంతే. లేదా ఏమంటే నాకూతురు నేను చచ్చానా బతికానా అని అప్పుడప్పుడూ కనుక్కుంటుంది. పస్తులు పడుకున్నామని వింటే భోరుమని ఏడుస్తుంది. దగ్గిర ఉంటే డబ్బు పంపిస్తుంది.

రాజ్యం : నేనుకూడా నీకు డబ్బు పంపిస్తే నా అంత పతివ్రత లేదని ఒప్పుకునేదానివే.

శకుం : ఒకరి పాతివ్రత్యం నాకెందుకే, పిచ్చిదానా? నాకష్టసుఖాలు పంచుకున్నవాళ్ళు నాకు అయినవాళ్ళు. మంచి చెడ్డలు చూడటానికి దేవుడు లేడూ?

రాజ్యం : మంచిచెడ్డలు చూడటానికి దేవుడున్నాడో లేడో కాని, డబ్బు అడిగినప్పుడల్లా పంపటానికి తాతయ్య ఉన్నాడు.

శకుం : తవుడు తింటూ ఒయ్యారం దేనికి? తాతయ్య డబ్బు నేనొక్కత్తెనే తిన్నానా? అందరూ తిన్నాం.

రాజ్యం : మేమందరమూ అయిన దానికీ కాని దానికీ దేవుడి పేరెత్తటం లేదు.

పురు : (గట్టిగా) మీరిద్దరూ కాస్సేపు నోరుమూస్తారా? దిక్కుమాలిన సజ్జు. అందరూ విని ఏమనుకుంటారో అని సిగ్గన్నాలేదు.

రాజ్యం : (వెటకారంగా) చెప్పొచ్చాడు సజ్జనుడు. నువు చేసిన వెకిలి పనులన్నీ చాలా రహస్యంగా చేశావనుకుంటున్నావు గామాలు. పాలు

తాగే పిల్లి. ఉష్ట్రపక్షి. చేసే చేసే కాపురం చెడగొట్టినవాడివి. చేసుకునే ఉద్యోగంలోనుంచి వెళ్ళగొట్టించుకున్నవాడివి. నువ్వు మాకు నీతులు చెప్పట మేమిటి?

పురు: పొగరు తలకెక్కి నీకు విచక్షణా జ్ఞానం కూడా లేకపోయింది. నేను ఎవరి కాపరం చెడగొట్టాను? దేవకి దేనా? నేనా రాత్రి లేవదీసుకుపోక పోతే మర్నాడు జనానికి దేవకి శవమే కనబడేది. ఆ దౌర్భాగ్యురాలు విషం తెచ్చుకుని దాచిపెట్టుకున్నది. నేనొక ప్రాణాన్ని కాపాడాను. నువ్వో, ఒక ప్రాణం తీసిన దానివి. నీ మూలంగా ఆ నాయుడి పెళ్ళాం ఆత్మహత్య చేసుకున్నది. అంతపని జరిగినాక మరొకరయితే కుక్కిన పేనులాగా అణిగిమణిగి జీవితం వెళ్ళబుచ్చేవాళ్ళు. నువ్వు మటుకు మనిషి రక్తం మరిగిన పులి లాగా –

ప్రసా: (నవ్వుతూ) ఓ హాలో, హాలో, హాలో, ఫుల్ హౌస్. మై డియరెస్ట్ బ్రదర్, మై వెరీ డియరెస్ట్ సిస్టర్స్. మీరంతా ఇంకా బతికి బాగుండటం చూచి ఈ దీనుడు దిగ్భ్రాంతుడై పోతున్నాడు.

పురు: నాన్సెన్స్, చౌకబారు నాటకాల్లో లాగా మాట్లాడకు.

ప్రసా: చౌకబారా. ఇందులో చౌకబారు ఏమీ లేదే. నాకీ ప్రపంచంలో మీ ముగ్గురి ముఖాలు చూడటమంత రోత మరొకటిలేదు.

పురు: అందులో నీ ప్రత్యేకత ఏదో ఏడిచిందనుకుంటున్నావేమో. అటువంటిదేమీ లేదు. ఈ విషయంలో అందరూ నీలాంటి వాళ్ళమే. కాని నీలాగా మేం డప్పువేసి చెప్పుకోం. కాస్త నిగ్రహించుకో.

రాజ్యం: నిగ్రహించుకోవటం ఇంటా వంటా లేదు. తనకు ఏ క్షణం ఎవరి మీద మోజు పుట్టినా మరుక్షణం ఆ సంగతి లోకానికంతా చాటాలి. లేక పోతే నిద్రపోలేదు.

ప్రసా: నీలాగా నేను సిగ్గుమాలిన వాళ్ళను ప్రేమించను. ఎవరిని ప్రేమించినా ఘరానాగానే ప్రేమిస్తాను. అందులో సిగ్గుపడవలసిందేమీ లేదు.

రాజ్యం: కాని డప్పు కొట్టవలసింది చాలా ఉంటుంది.

ప్రసా: అది నా ఆత్మవిశ్వాసానికి సంబంధించిన విషయం.

పురు: ఏ ఆత్మవిశ్వాసమో అసలు జరిగేట్టయితే నీ చరిత్ర ఆంధ్రదేశపు చరిత్ర అవుతుంది. తగ్గు తగ్గు.

ప్రసా: ఆంధ్రదేశంలో ఉన్న అపూర్వ స్త్రీలు నన్ను ప్రేమించితే అదికూడా నా తప్పే?

శకుం: ఆ అపూర్వ స్త్రీలను కొందరిని మేం చూశాంలేరా బాబూ.

రాజ్యం: ఇంకా రెండురోజులు పోనీ నీ మీద పెడనీళ్ళు చల్లిన మనిషల్లా అపూర్వస్త్రీ అవుతుంది.

ప్రసా: నా తోబుట్టువులు నన్ను చూసి ఇలా అసూయతో ఉడికిపోవటం చూసి నేను చాలా గర్వించవలసి వస్తోంది. మీరు మరికాస్త ఉడుక్కోగలందులకు చెబుతున్నాను. మన పేరు త్వరలోనే వెండి తెరపైకెక్కబోతోంది.

రాజ్యం: సహాప్రసాదం అని ఎవరో సినిమా తీయబోతున్నారుట. నేనూ విన్నాను

పురు: హియర్, హియర్!

ప్రసా: మీ అల్పబుద్ధిచూస్తే నాకు నవ్వాలో ఏడవాలో కూడా తెలియకుండా ఉంది —

రాజ్యం: ఏడుస్తూనే ఉంటివిగా?

ప్రసా: నేను పిక్చరు తియ్యబోతున్నాను. స్క్రిప్ట్ రెడీ, స్టార్స్ రెడీ, అంతా రెడీ —

రాజ్యం: తాతయ్య ఒక లక్ష రూపాయలివ్వటమే తరవాయి. అయితే చిక్కేమిటంటే తాతయ్య దగ్గిర డబ్బులేనట్టు కనబడుతుంది; ఈ పేక ముక్కల మేడ కూలిపోవటం చూడందే నేనిక్కణ్ణుంచి పోను.

ప్రసా: నాన్సెన్స్, తాతయ్య దగ్గిర డబ్బు అయిపోవటమేమిటి? అట్లా ఎన్నటికీ జరగదు. అయినా నేనిప్పుడే తాతయ్యను అడిగేస్తాను.

రాఘు: తాతయ్యగారికి స్మారకం లేదు బాబూ. డాక్టరుగారు ఇంజెక్షనిచ్చి నిద్ర పుచ్చారు. అదుగో డాక్టరుగారే వస్తున్నారు.

పురు: ఏమండీ, డాక్టరుగారూ? తాతయ్య ఎలా ఉన్నాడు? ఏమిటి జబ్బు?

డా: ముసలితనం తప్ప ఆయనకు వేరే జబ్బేమీ లేదు.

ప్రసా: అయితే ఆయనింకా చాలా కాలం బతుకుతాడు.

డా: నేనా మాట అనలేను. కొమ్మన పండిన పండు ఏ క్షణాన ఏ కారణంగా రాలిపోతుందో ఎవరూ చెప్పలేరు. మామూలు రోగి అయితే ప్రాణాపాయం ఏపాటి వున్నదీ నేను సులువుగానే చెప్పగలను. కాని అన్నేశ్వరంగారి విషయంలో ఏమీ చెప్పటానికి వీల్లేదు. మీరు నలుగురూ ఆయన కొడుకు సంతానం అనుకుంటాను?

పురు: అవునండీ. నేను పెద్దవాణ్ణి. నా పేరు పురుషోత్తం. నా తరవాతది శకుంతల. తరవాతవాడు వీడూ — ప్రసాద్. ఆఖరుది రాజ్యలక్ష్మి — రాజ్య అని పిలుస్తాం.

డా: స్వయంగా నాకు మిమ్మల్ని గురించి ఏమీ తెలియదు. కాని మీరు నలుగురూ కూడా మీ తాతగారికి మనఃక్లేశం కలిగించినట్టు నాకు తెలిసింది.

పురు: (తప్పు చేసినవాడల్లే) నేను చాలా సార్లు ఆయనదగ్గర డబ్బు తీసుకున్నాను. ఆయన కిష్టంలేకుండా యిచ్చాడని నాకు ఏనాడూ అనుమానం తగల్లేదు. నన్ను గురించి మరి ఆయనకెందుకు మనఃక్లేశం కలిగిందో —

ప్రసా: మా కుటుంబ వ్యవహారాలు మేము మీతో మాట్లాడి తీరాలాండీ డాక్టరుగారూ.

డా: (తాపీగా) అలాంటిదేమీ లేదు. ఆయన బతికిఉన్నంతకాలమూ నాకు ఆయన ఆరోగ్యంతోనే సంబంధం. ఆ తరవాత ఆయనకు ప్రతినిధిగా ఆయన విల్ అమలు చెయ్యటానికి హక్కు పొంది ఉన్నాను.

ప్రసా: అలా చెప్పరేం? నేను నా అనుమానాన్ని విత్‌డ్రా చేసేసుకుంటా.

డా : (వెటకారంగా) ధన్యోస్మి. తాతగారి సొమ్ము మీ కందరికీ ఎంతెంత ముట్టిందో నాకు కొంచెం ఐడియా ఇవ్వగలరా? ఆశ్చర్యపడకండి. ఆయనను నేను కూడా తాతగారనే పిలుస్తూంటాను. ఈ రాఘవులు కూడా ఆయనకు ఒకరకమైన పెంపుడు మనవడే.

పురు : చాలా కాలంగా తాతయ్యనా కనిపెట్టుకుని ఉన్నాడు. నే నెరుగుదును.

డా : మీలో ఏ ఒకరు అతనిలాగా తాతగారికి సేవచేసి ఉండరు. మీరు కలిగించిన విచారాన్ని ఈ రాఘవులు కొంతవరకు పోగొట్టాడని కూడా చెప్పగలను.

శకుం : మీ మాటలకు అడ్డొచ్చినందుకు క్షమించండి డాక్టరుగారూ. ఇంతకు ముందుకూడా ఈ మాటే అన్నారు. మేం తాతయ్యకు కలిగించిన విచారమేమిటి?

డా : ఆ సంగతి నాకంటె మీకే బాగా తెలిసి ఉండాలి.

శకుం : తెలిస్తే ఎందుకడుగుతానండీ? నామీద తాతయ్యకు ఏనాడు గాని కొంచెం కూడా కోపం రాలేదని ఈనాటివరకూ అనుకుంటున్నాను. అది పొరపాటేనన్నమాట.

డా : అందులో పొరపాటేమీ లేక పోవచ్చు. ఎందుకంటే, ఆయనకు ఎవరిమీదా ఎన్నడూ కోపం రాగా నేను చూడలేదు. ఒక్కొక్కసారి ఆయన మనిషా, దేవుడా అని కూడా నేను ఆశ్చర్యపడతాను. ప్రపంచంలో వున్న పాపాన్నంతా క్షమించేటంత ఔదార్యం ఆయనలో ఉన్నట్టు నాకు తోస్తుంది.

ప్రసా : అటువంటివాళ్ళే పాపాన్ని పెంచేది.

డా : నేను చాలా అల్పప్రాణిని. తాతగారి ఔదార్యాన్ని విమర్శించే తాహతు నాకులేదు. మీరు స్వానుభవం మీద చెబుతున్నారేమో, నాకైతే తెలీదు. కాని ఇతరులలో పెరిగే పాపం ఆయనను చాలా బాధించింది. మీరు నలుగురూ పుణ్యాత్ములుగా బతికితే ఆయన మనసు చాలా సుఖపడేది.

రాజ్యం : ఇదంతా మిట్టవేదాంతం. మనిషి అన్న తరువాత సాధ్యమైనంత సుఖపడాలని ఉంటుంది. సుఖం కోసం చేసే ప్రతిపని పాపమే అనవచ్చు. అది అర్థంలేని మాట.

డా : మీరంతా సుఖపడాలనే తాతగారి ఉద్దేశం కూడా. మీరు సుఖపడ్డందుకు ఆయన ఎప్పుడూ బాధపడలేదు. కాని, ఇతరులకు సుఖం కలిగించేశక్తి మీలో క్షీణించిపోతున్నకొద్దీ ఆయనకు మీ గురించి విచారం పెరిగిపోయింది. ఆయన ఉద్దేశంలో పాపమంటే ఇంకొకరిని సుఖపెట్టలేకపోవటమే. నాతో ఆయన ఈమాట అన్నారు.

ప్రసా : మా తాతయ్య సత్యకాలపు మనిషి గనక అలా అనుకున్నాడు గాని ఈ ప్రపంచంలో ఒకరినొకరు సుఖపెట్టరు, డాక్టరుగారూ, ఎవరి సుఖం వారు చూసుకుంటారు.

డా : ప్రపంచం సరిగా నడవవలసినట్టే నడుస్తున్నదని మీ అభిప్రాయమా,

ప్రసాద్ గారూ? అట్లాగే అనుకున్నా మీరు మీ తాతగారి మూలాన ఏమీ సుఖం పొందలేదా?

ప్రసా: నాకు తెలుసు, ఈ పుణ్యపాప విచారణ యావత్తూ రూపాయి అణా పైసల దగ్గిరికి వస్తుందని. నా కాయన డబ్బు ఇచ్చాడనేగా మీరనేది?

డా: అవును. మీరాయన దగ్గిర డబ్బు పుచ్చుకున్నది సుఖపడటానికే అనుకుంటున్నాను. కొంచెం ఆలోచించండి. పుణ్య పాపాలను డబ్బుతో ముడిపెట్టేది మీరనేమో. ఎందుకంటే మీ దృష్టిలో సుఖపడటం తప్ప మనిషికి ఉత్తమాదర్శం లేదు. సుఖాన్ని డబ్బుతో కొనవచ్చు. అందుచేత ప్రపంచంలో పుణ్యాత్ము లెవరంటే లక్షాధికారులూ కోటీశ్వరులూనూ.

ప్రసా: అందుకు సందేహమేమిటి? మా తాత చేసుకున్న పుణ్యం చాలా వరకు డబ్బే.

డా: (నవ్వి) అయితే మైనస్లో పుణ్యం చేసుకునే అవకాశం లేదుగా మాకు.

పురు: డాక్టరుగారూ, మనంచేస్తున్న ఈ సంభాషణ చాలా అప్రస్తుతమేమో, నాకు సెలవిచ్చినట్టయితే ఒక్కసారి మా తాతయ్యను కళ్ళచూసి నాదారిన నేను పోతాను.

డా: ఆయన్ని మీరిప్పుడు చూడడం సాధ్యంకాదు. మన మాటలు అప్రస్తుతం కావని రుజువు చేస్తాను. మీ వాళ్ళంతా ఉన్నారు కదా, వెళ్ళి పోవాలని మీ కెందుకు తొందర?

పురు: వాళ్ళతో నాకేం పొంతన? వాళ్ళు ఆహ్వానాలపై వచ్చినవాళ్ళు. నేను దారినపోతూ తొంగిచూసినవాణ్ణి.

డా: అలా అనకోకండి. మీకూ ఆహ్వానం వెళ్ళింది. మీ ఎడ్రస్ సరిగా మాకు తెలియలేదు.

పురు: దైవికంగానైనా వచ్చానుగదా. ఇక వెడతాను. వీళ్ళు దేనికోసం వేచి ఉన్నారో నాకు తెలియదు. నేను మటుకు గోతికాడ నక్కను కాను. మా తాతయ్య నా కివ్వవలసిందేమో ఏనాడో ఇచ్చాడు. నేను నా కాళ్ళపైన నిలబడగలిగాను. కుంటివాళ్ళైతే చివరంటా మొయ్యాలి. నేను చాలా కాలంగా నా కాళ్ళపైనే నడుస్తున్నాను.

డా: అందుకు మిమ్మల్ని తప్పక అభినందిస్తాను. మీ తాతయ్యగారు కూడా అంతవరకు సంతోషించేవారేగాని, ఆయన మీనుంచి అంతకన్న ఎక్కువ ఆశించారనుకుంటాను.

పురు: ఏమిటది?

డా: ఇందాకటినుంచీ ఆ విషయం చెబుతూనే ఉన్నాను. మీరు నలుగురూ ఆయనకు కావలసిన వాళ్ళు. మీరే ఆయన భవిష్యత్తు. మీ మధ్య పరస్పరం ప్రేమలేకపోగా శత్రుత్వం పెరగటం ఆయనను చాలా బాధించింది. మీరు ఒకరి సుఖంకోసం ఒకరు పాటుపడితే ఆయనకు ఏ విచారమూ లేకుండాపోయేది. కాని అలా జరగలేదు.

ప్రసా: డాక్టరుగారు హాస్యధోరణిలో ఉన్నట్టున్నారు.

డా: చాలా సీరియస్ గా చెబుతున్నాను.

ప్రసా: నేను నమ్మలేను.

డా: నమ్మలేకపోవటానికి కారణం ఉన్నది. మీరు నలుగురులో ఒకరి

కొందరు మీలో ఉన్న దుర్గుణాలనే ప్రదర్శిస్తూ వస్తున్నారు. సాధారణంగా చిన్న కిళ్లీకొట్టువాడు కూడా తనకున్న సరుకులను సాధ్యమైనంత ఆకర్షవంతంగా చూపించటానికి ప్రయత్నిస్తాడు. మీలో మీరు మీ విష స్వభావాలనే ప్రదర్శించుకోవటానికి అలవాటు పడిపోయారు. ఇప్పుడు మీ మంచితనాన్ని బయటపెట్టుకుంటే అవతలివాళ్ళు అవహేళన చేస్తారన్న స్థితికి దిగజారారు.

ప్రసా: ఇదంతా మీరు ఊహించుకుంటున్నారు.

పురు: డాక్టరుగారూ, మీరన్నదానిలో కొంత నిజం లేకపోలేదు. ఒప్పుకుంటాను. కాని ఇది ఎవరి తప్పంటారు? నాతప్పే అయితే నేను ఈ క్షణం దిద్దుకుంటాను. కాని నాకు తెలుసు, తప్పు నాది కాదు.

డా: మీ ఉద్దేశంలో మొదటి తప్పెవరిది?

పురు: అట్లా అడిగితే చెప్పటం కష్టం. కప్పను పట్టటం పాము తప్పా, పాముకు చిక్కటం కప్ప తప్పా? ఎవరూ చెప్పలేరు.

డా: మీరు మీ విషయమే ఆలోచిస్తున్నారా! అందరి విషయమూ ఆలోచిస్తున్నారా?

పురు: ఇంకొకరి సంగతి నాకెందుకు? నా సంగతి చెప్పండి.

డా: మీరు మీ తోబుట్టువులకు మీలోని చెడు స్వభావాన్నే చూపిస్తున్నట్టు తెలుసుకున్న మరుక్షణం మారకపోవటం మీ తప్పు.

పురు: నాతో చెడ్డగా ఉండేవాళ్ళతో నేనెందుకు మంచిగా ఉండాలో నాకర్థం కాలేదు.

డా: పురుషోత్తంగారూ, మీ స్వభావానికి మీరే బాధ్యులన్నట్టుగా మాట్లాడుతున్నారు. కాని అది అపోహ కావచ్చునని మీకు తట్టలేదా?

పురు: నా స్వభావం నాదే. అందులో అపోహ ఏమీలేదు. పైపెచ్చు మిగిలిన వాళ్ళ స్వభావం కూడా వాళ్ళదేనని నా దృఢ నమ్మకం.

డా: మీ స్వభావాలన్నిటినీ మీ తండ్రిగారు విడిచేశారని మీ తాతగారి నమ్మకం.

పురు: మా నాన్నను నేను బాగా ఎరుగుదును. ఆయన వాస్తవిక దృష్టి కలవారు. గాలిమేడలు కట్టి సంతోషించటం ఆయనకు సరిపడేది కాదు.

డా: ఒక్కొక్కసారి సంకుచిత దృష్టి కలవాళ్ళు వాస్తవిక దృష్టి కలవాళ్ళుగా చలామణీ అవుతారు.

పురు: మా నాన్న అలాంటివాడని నేననుకోను.

డా: మీపైన ఆయన ప్రభావం ఎలాంటిది?

పురు: అది ఇంకొకరు చెప్పాలి.

డా: నేను చెప్పవచ్చా?

పురు: చెప్పండి.

డా: నాకు మంచిదిగా తోచలేదు. నాకు పగటి కలలు కనేవాళ్ళలో విశ్వాసం ఉందనుకుండి. అలాంటి పగటి కలలు ఎప్పటికైనా నిజం కావటం మూలానే ప్రపంచం ముందుకు నడుస్తున్నది. మీరు చెప్పే వాస్తవిక దృష్టిగలవాళ్ళు సాధించిన

ఘనవిజయం బతుకుతెరువు నేర్చుకోవటమే.

శకుం: ఎందుకొచ్చిన చర్చ పోనిస్తురూ.

డా: అమ్మా, మీరుకూడా ఓర్పుగా నా మాటలు వినండి. నేను చెప్పేది నా సొంత విషయం కాదు. ఇంతకు ముందు ప్రసాద్‌గారు డబ్బును మించిన పుణ్యం లేదన్నట్టుగా తేల్చారు. నన్నడిగితే మీరంతా మీ మీ స్వభావాలను బలవంతాన మార్చుకున్నారు. ఒకప్పుడు మీమధ్య ప్రేమబంధాలుండేవి. వాటిని ఎవరూ ప్రోత్సహించలేదేమో. లేక వాటిని ఎవరన్నా అవహేళన చేశారో, మొత్తానికి మీరు మీలో ఉండిన ప్రేమలను పూర్తిగా మరిచిపోయారు. మీ తాతయ్య మీ చిన్ననాటి విషయాలను ఎంతో శ్రద్ధగా జ్ఞాపకం ఉంచుకుని పెన్నిధిని దాచుకున్నట్లు గుండెల్లో దాచుకున్నారు. అందులో మీకేమీ నీతికనిపించలేదా?

ప్రసా: నేనంత పెద్ద అర్భాటమేమీ చేయలేదు.

ప్రసా: నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ వీళ్లెవరూ ఎన్నడూ నాపైన ప్రేమ చూపించలేదు. (నవ్వి) చూపించారనుకుంటేనే ఎబ్బెట్టుగా వున్నది. ప్రేమ. డామ్ నాన్సెన్స్.

డా: ఒక్క చిన్న సంగతి జ్ఞాపకం చేస్తాను, ప్రసాద్‌గారూ. మీ చెల్లెలు రాజ్యలక్ష్మికి ఎవరో ఒక బొమ్మ ఇచ్చారు. దానికోసం మీరు పేచీ రాగాలు పెట్టి, ఆమెను కొట్టి తీసేసుకున్నారు. తరవాత మీ నాన్నగారింటికి వచ్చి మిమ్మల్ని గొడ్డును బాదినట్టు బాది ఆ బొమ్మ ఆమె కిప్పించేశారు. ఆ రాత్రి మీకు జ్వరం వచ్చింది. ఒళ్లు తెలియని జ్వరం. ఈ రాజ్యలక్ష్మిగారు తన బొమ్మను తెచ్చి మీ పక్కలో పెట్టి, 'అన్నా, బొమ్మ తీసుకో. జ్వరం మానెయ్యి' అన్నారట. ఆ ముసలాయన దేవుడల్లే ఇది గమనించి తన గుండెలో దాచుకోకపోతే ఈనాడు నేనీ సంగతి మీకు జ్ఞాపకం చెయ్యలేను.

ప్రసా: చిన్నతనంలో అజ్ఞానం చేత అందరమూ అటువంటి పనులు చేస్తాం.

డా: క్షమించండి, ప్రసాదుగారూ. మీ చెల్లెలు ఆనాడు చేసినపని అజ్ఞానమైనదీ, మీ నాన్నగారు చేసినపని జ్ఞానమైనదీ అంటే నేను ఒక్క క్షణం కూడా ఆమోదించబోను. చిన్ననాడు సహజంగా మీలో ఉండిన మంచితనం చూసి ఇవాళ మీరు సిగ్గుపడితే పడండి. కాని సిగ్గుపడటమే ప్రగతి లక్షణమని మాత్రం చెప్పకండి. (కాసేపు ఎవరూ మాట్లాడరు) ఇంకా ఇటువంటివి చాలా చెప్పగలను. పురుషోత్తంగారూ, మీ తమ్ముడు కాలవ ఒడ్డున కాలుజారి కాలవలో పడి కొట్టుకు పోతుంటే మీరుకూడా దూకిన సంగతి జ్ఞాపకం ఉన్నదా? ఎందుకు దూకారు? మీకు ఈత రాదు. ఆ సంగతి మీకూ తెలుసు. ఎవరో సమయానికి అటుగా వచ్చి మిమ్మల్నిద్దర్నీ బయటికి ఈడ్చకపోతే ఆ రోజు మీ ఇద్దరూ అయిపోయి ఉందురు. ఇది జరిగి ముప్ఫై ఏళ్లు దాటి ఉండాలి. ఈలోపల మీరు చాలా జీవితం చూశారు. ఎంతో

జ్ఞానం సంపాదించారు. ఆనాడు మీరు మీ తమ్ముడి వెంట కాలవలో ఎందుకు దూకారో చెప్పండి. అందుకు మీరిప్పుడు సిగ్గుపడుతున్నారా? మిమ్మల్నిద్దరినీ రక్షించిన మనిషి కూడా నీటిలో కొట్టుకుపోతున్న మిమ్మల్ని చూసే రక్షించ వచ్చాడనీ, మీరు చెప్పేవరదాకా, మీ తమ్ముడి సంగతి ఆ మనిషికి తెలియదనీ విన్నాను. ఈ ప్రసాద్ గారు ఆనాడే పోయి ఉంటే ఎక్కువ తృప్తిగా ఉండేదా?

పురు: (గట్టిగా నిట్టూర్చి) డాక్టరు గారూ, నేనీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేను. ఆ సంగతి మీకూ తెలుసు. ఒక్క విషయం మాత్రం ఒప్పుకుంటాను. ఆరోజు నేను ఏ ప్రసాద్ కోసం కాలవలోకి దూకానో ఆ ప్రసాద్ పైన నాకింకా చాలా ప్రేమ ఉన్నది. వాణ్ణి అప్పుడప్పుడూ జ్ఞాపకం చేసుకుంటాను. వాడు ఆనాడే పోతే నాకు తృప్తిగా ఉండేదా అని అడిగారే, వాడు ఆనాడు పోకపోయినా ఆ తరువాత ఎప్పుడో మారిపోయాడు. అందుకు నాకు విచారంగానే ఉంది. అంతకన్న నన్నేం చెప్పమన్నారు.

డా: మిగిలిన వాళ్ళ దృష్టిలో మీరు కూడా అలాగే మారిపోయారేమో?

పురు: కావచ్చు. మా శకుంతలను చదువు సంధ్యలు సరిగా లేని చవటకు కట్టబెడుతుంటే నాకు మండిపోయింది. నేనా రోజుల్లో అన్నం తినలేదు. కనుక్కున్నవాళ్ళు లేరు. శకుంతలకు తప్ప నేనీ సంగతి ఇంకెవరికీ చెప్పలేదు.

శకుం: ఆ రాత్రి నేను నీకు లడ్డూలూ, చక్కిలాలు తెచ్చి యిచ్చా. ఇద్దరమూ జామచెట్టుకింద కూచుని తిన్నాం. మా ఆయన చచ్చిపోతే నాకు మళ్ళీ పెళ్ళి చేస్తాననీ, అప్పుడంవరకూ నిన్ను వెలివేస్తారనీ, నువ్వు లక్షలకు సంపాదించి నాకు, నా రెండో మొగుడికీ మేడకట్టి పెడతాననీ అన్నావు, జ్ఞాపకం ఉందా?

పురు: (తనలో తాను నవ్వుకుంటూ) చిన్నతనపు బుద్ధులు. తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆ రోజుల్లో ప్రపంచం యింకోరకంగా ఉండేది. (ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా) నీకు జ్ఞాపకం ఉందా, శకుంతలా? శేషగిరిగాడు ఎప్పుడూ నన్ను అంటిపెట్టుకుని తిరిగేవాడు. వాడు పోయినప్పుడు నేను కుంగిపోయాను—

శకుం: శేషగిరి చచ్చిపోకపోతే పెద్దయినాక నువ్వు వాణ్ణి పెళ్ళిచేసుకునేదానివేనా? అని నన్నడిగావు. నేను ధైర్యంగా ఓ అన్నా.

పురు: నువ్వు మరచిపోలేదన్న మాట. అప్పుడు నాకెంత తృప్తి కలిగిందో నీకు తెలుసా?

శకుం: చిన్నతనంలో కొన్ని కొన్ని సంగతులు సులభంగా తెలుస్తాయి. నీకు సంతోషం కలుగుతుందని తెలిసే నేనా మాట అన్నది. (కొంచెం ఆలోచించి) చిన్నప్పుడు నేను ప్రతిదానికీ అబద్ధాలాడేదాన్నా ఏమిటి? నామాట ఎవరూ నమ్మేవాళ్ళు కాదన్నట్టు జ్ఞాపకం - ఏ అబద్ధాలాడానో జ్ఞాపకంలేదు.

పురు: అఁ. అదేమీ లేదు. నాన్న మనలో ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క గుణం ముద్ర వేసిపెట్టాడు. ఈ ముద్రలను చివరకు మనం కూడా నమ్మాం. నాకు లెక్కలు రావని ముద్రవేశాడు. పరీక్షలు వచ్చినప్పుడల్లా దగ్గర కూచుని నాచేత లెక్కలు చేయించేవాడు. ఆయన చేసే హంగామాతో నేను లెక్కల్లో సున్నాలు తెచ్చుకునేవాణ్ని. నేను థర్డ్ ఫారమూ, ఫోర్తుఫారమూ గుంటూరులో ఉండి చదివాను చూడు, అప్పుడు లెక్కల్లో 70 కి తక్కువ రాలేదు.

శకుం: నాన్న అట్లా ఎందుకు చేసేవాడో.

పురు: జబ్బు, పిల్లలు తండ్రిని దేవుడల్లే చూడాలని చెబుతాడు చూడూ, దాన్ని ఆయన తిరగేశాడు. తండ్రులు పిల్లలకు దేవుడల్లే కనపడాలనుకున్నాడు. మనపట్ల దేవుడల్లే వ్యవహరించటానికి తన శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. నేను లెక్కలు రానివాణ్ణా, నువ్వు అబద్ధాలాడేదానివి. ప్రసాదు మొండిపట్టు గలవాడు. ఆ వంకపెట్టి వాణ్ణి గొడ్డును కొట్టినట్లు కొట్టేవాడు. ఆయన ప్రసాదును కొట్టినప్పుడల్లా నేను దొడ్లోకి వెళ్ళి బాదం చెట్టును కర్రతో కొడుతూ... చావు, చావు... అనేవాణ్ణి. (నవ్వి) ఒకసారి అమ్మ చూసింది. ఆవిడ నాన్నతో, వీడు మిమ్మల్ని చూసి చెయ్యొదురసు నేర్చుకుంటున్నాడు అన్నది. నాన్న చేసేపని నచ్చి నేనాయన్ను ఇమిటేట్ చేస్తున్నాననుకున్నది. ఆ బాదంచెట్టే నాకు నాన్న అనీ, నేను చావమంటున్నది నాన్ననేననీ అమ్మకు తెలియలేదు.

ప్రసా: చూడు పురుషోత్తం! నువ్వూ, నేనూ కలిసి, ఒకసారి నాన్న ఫౌంటెన్ పెన్ను అరటిచెట్టు మురుగులో లోతుగా కూరేశాం. జ్ఞాపకం ఉందా?

పురు: కానీపెట్టి సోడా కొని ఇద్దరం తాగినందుకు ఇద్దర్నీ కొట్టాడు. సోడా తాగటానికీ - బీడీ తాగటానికీ తేడా లేదు ఆ దౌర్భాగ్యుడి ఉద్దేశంలో.

రాజ్యా: మిగిలినవాళ్ళ సంగతి నాకు తెలీదుగాని, ప్రసాదన్నయ్యా నాన్న వినకుండా భయంకరమైన మాటలనేవాడు. ఒకరోజు నాకు చాకు చూపించి, ఇదుగో రాజీ! దీంతో సఫా అన్నాడు. ఏం సఫా చేస్తావు? అన్నాను. నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ప్రసాద్ తల ఎగరేసి, వాణ్ణే అన్నాడు. మనిషికి రాక్షసి మొహం పడింది. రొప్పుతున్నాడు. నిజంగా నాన్నను చంపెయ్యబోతున్నాడనుకున్నాను. వద్దంటే నన్నే చంపుతాడేమోనని భయం; ఎవరితోనన్నా చెబితే, నాన్నకు తెలిసి ప్రసాదును చంపుతాడని భయం. కుమ్ములో పెట్టిన కాయల్లే అయిపోయాననుకో!

ప్రసా: నేనంత పెద్ద ఆర్భాటమేమీ చేయలేదు.

రాజ్యం: ఇంకా నయం. ఆ మధ్యాహ్నం గదిలో నాన్న పడుకుని నిద్రపోతుంటే పిల్లిలాగా లోపలికి పోవటం చూశాను. నాకేమీ తోచక ఇంటి

కన్నూ ఎగిరిపోయేటట్టు, అమ్మా! నాన్న ఎక్కడే? అని గావుకేక పెట్టాను. అమ్మ నోరు నొక్కుకుంటూ, నాన్న నిద్రపోతున్నారు; అరవకే అన్నది. తరవాత నన్ను చూసి అమ్మ నవ్వింది. దీనికి ఉన్నట్టుండి వాళ్ళ నాన్న మీద చాలా అపేక్ష పుట్టుకొచ్చింది అని అందరితోనూ చెప్పింది. అందరూ నన్ను చూసి నవ్వారు. నాకు నామోషీ అయింది. కాని ఆ రోజు నాన్న చావకుండా కాపాడానని చాలా సంతోషించాను.

ప్రసా : నేను [illegible] వెళ్ళింది అందుక్కాదుతే.

భాగ్యం : కాకపోవచ్చు. కాని నాకు తెలీదుగా. ఆనాటి నీ నాకుతెలిసి ఆయనమీద గిన్నాటేసేశావుట. ఆ సంగతి నీకు తెలియక నానికోసం చాలా వెతుక్కున్నావు, పాపం

పురు : ఏమిటో, తలుచుకుంటే చిన్నతనంలో అనుభవించిన బాధలుకూడా బాగానే వుంటాయి. నాన్నా, తాతయ్యా భాగాలు పంచినప్పటినుంచీ జీవితం ఇంకో రకంగా మారిపోయింది. అప్పటితో నా చిన్నతనం అయిపోయిందనుకుంటూ.

శకుం : మనం తాతయ్యంటే ఇష్టంగా ఉండటం నాన్నకిష్టంలేదు. నువ్వు గమనించావా ఎప్పుడన్నా?

పురు : గమనించకేం? నాన్న అసూయ పడేవాడు. పైకి పిల్లల ప్రేమతో పని లేనట్టు పోజు పెట్టేవాడు. లోపల తాతయ్యను చూసి కుళ్ళుకునేవాడు. కాని నాన్నకు నిజమైన షాక్ ఎక్కడంటే ఆయన రంగూను వ్యాపారం సాగించి రెండు చేతులా డబ్బు గడించటం మొదలుపెట్టాక. పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్లు తనుకూడా అడ్డదిడ్డంగా వ్యాపారం చేసి ఉన్నదంతా క్షారం చేసుకున్నాడు.

ప్రసా : తాను తినలేడు, మనల్ని తిననివ్వలేడు.

పురు : మనకేం లోటొచ్చింది? తాతయ్య సొత్తు తినేశాం, లేదా?

ప్రసా : డబ్బు ఖర్చుచెయ్యటం ఒక పెద్ద విద్య ఏమిటి? నోట్లు మూటలో ఉంటే చెదలుకూడా తినేస్తాయి. మనకు సంపాదించే అవకాశాలు లేకుండా చేశాడే. నువ్వు డాక్టరు చదువుకోసం కలలు కన్నావు; చదువు మానవలసివచ్చింది. నేను ఇంజనీరును అవుతానని ఎంతో ఆశపడ్డాను. శకుంతలకు పట్టి దిక్కుమాలిన సంబంధం చేశారు. భాగ్యం బ్రతుకు చెప్పనే అక్కర్లేదు.

పురు : ఏమైనా అవతల తాతయ్య డబ్బు లేకపోతే మనబతుకులు మరీ భ్రష్టంగా ఉండేవి.

ప్రసా : నా జీవితానికి అర్థంలేదనే విషయం పైకి తెలియకుండా ఉండటానికి తాతయ్య డబ్బు బాగా వినియోగించింది. వేలకు వేలు ఖర్చుచేసి లోకాన్ని ఉద్ధరించాను. ముఖ్యంగా ఆడవాళ్లను ఉద్ధరించాను. ఇది ఎంతో కాలం సాగదని నాకు తెలుసు. తాతయ్యకు జబ్బుగా ఉందని టెలిగ్రాం రాగానే అలారం మోగినట్టయింది.

పురు : ఏదో సినిమా తీసే ప్రయత్నంలో ఉన్నానన్నావ్ ?

ప్రసా : అది నిజమే. కాని చేతిలో డబ్బులేదు. తాతయ్య ఎలాగూ బతకడు. ఆయనకు మిగిలిన దంతా ఒక మొత్తంగా పుచ్చుకుని సినిమా తీద్దామనుకున్నాను. ఇమ్మల్నందర్నీ చూడగానే నాగుండె జారిపోయింది. టెలిగ్రాములు అందరికీ వెళ్ళాయని నాకేం తెలుసూ ?

పురు : నేను టెలిగ్రాం చూసి రాలేదు ప్రసాద్. నాకు తాతయ్య సొమ్మేమీ అవసరంలేదు. ఇదివరకు ఆయనదగ్గర చాలా డబ్బు పుచ్చుకున్నాను. ఒక ఫౌండ్రీ, కార్ఖానా, నడుపుకుంటున్నాను. నేనెలాగో బతుకుతాను. నా వంతుకూడా నువే తీసుకో.

శకుం : నా సంగతేమిటన్నయ్యా ? నేనూ పిల్లలూ చాలా క్షోభపడిపోతున్నాం. నన్ను మా ఆయన ఎంత మోసం చేశాడో మీకు తెలుసుగా ? తాతయ్య నాకు ఎంత డబ్బు పంపించారో చెప్పలేను. అంతా నా మొగుడే తాగేశాడు. ముందు నన్ను నగలు చేయించుకోమని కాల్చుకు తినటమూ, తరవాత వాటిని అమ్మేసి తాగటమూనూ. ఆయన పోయాక తాతయ్య నెలనెలా పంపిస్తున్న రెండు వందలతోనూ కాలక్షేపం చేస్తున్నాం. ఓర్చలేక కంట్లో నిప్పులు పోసుకుంటూనేగాని, రాజ్యం బతుకే సుఖంగావున్నది. దానికి అండాదండా ఉన్నారు. తిండికీ బట్టకూలోటు లేదు. నలుగురి నోళ్ళలోనూ నానితే ఏం గాక, సుఖంగా బతుకుతున్నది.

రాజ్యం : నువే సుఖంగా వున్నావని నేననుకుంటున్నాను. నేనే సుఖంగా వున్నానని నువ్వనుకుంటున్నావు. ఇస్తి వాయినం, పుచ్చుకుంటి వాయినం, సరిపోయింది.

ప్రసా : అదేమిటి ? నువు నాయుడితో ఉండటంలేదా ?

రాజ్యం : (కళ్ళనీళ్ళ పర్యంతమై) ముప్ఫై నిండకుండానే నా బతుకు కుక్కలు చించిన విస్తరి అయింది. నాకన్న నాలుగేళ్ళు చిన్నదానితో పోటీ చెయ్యలేక నేను వీధిలోకి వచ్చిపడ్డాను. నాకూ కూడా తాతయ్య నెల నెలా డబ్బు పంపిస్తున్నాడు. అందులో కొంత దాచి వెనకేసుకుందామని ఒకప్పుడనుకున్నాను. కాని రేపు గురించి ఆలోచించటం నాలాంటి బుద్ధితక్కువగా తోచింది. నాయుడు నన్ను విడిచి క్షణం ఉండలేడని ఎంతో గర్వపడ్డాను. చివరి రోజుల్లో ఆయన నన్ను వదిలించుకోవటానికి నానాపాట్లూ పడుతుంటే నాకేవి అర్థంకాడా కాలేదు. మగవాడికి కేసున్నా ఫలిస్తున్నదేమో గాని ఆడదానికి అటువంటిది లేదు. అందుకే నేనూ మా ఆడవాళ్లు ఉన్న జీవితం ఉన్నట్టుగా వెళ్ళిపోతే చాలునని దేవుళ్ళకు వ్రతాలు పెట్టుకుంటారు. నాకు అటువంటి వాళ్లను చూస్తే చాలా వెటకారంగా ఉండేది. శకుంతలక్కయ్యకు బతకటం చాతకాదనుకునేదాన్ని.

శకుం : (నిట్టూర్చి) అందులో అబద్ధం ఏమీలేదులేవే, తల్లి.

పురు: భాగ్యం, నువ్వు ఏనాడూ నా దగ్గిర వచ్చి ఉంటానన్నా నాకేమీ అభ్యంతరం లేదు. పాపం, శకుంతల పిల్లలు గలది. దానికి నువ్వేమీ సహాయం చెయ్యలేవా ?

ప్రసా: నన్ను ఈ పిక్చరు తియ్యనివ్వండి. అందరం హాయిగా బతుకుతాం. భాగ్యం! నా పిక్చర్లో వేషం వేస్తావా?

భాగ్యం: నేనా ?

ప్రసా: అవును. ఏం ? డబ్బు ఖర్చు చెయ్యటమే తప్ప ఏం లాభం, భాగ్యం. సంపాదించటం కూడా నేర్చుకుందాం. ఆ నాయకుడు బాబుల్లాంటి వాళ్లని మట్టుకు ఉక్కిళ్లాగా కొంప దేట్టు చేస్తాను. ఎల్లాగో సినిమా తీయటంలో ఆనందమేని డబ్బు మంచి నీళ్లలాగా ఖర్చయిపోతుంది. నన్నడిగితే శకుంతలక్కయ్య కూడా వేషం వెయ్యొచ్చు. తప్పేమిటంటాను.

భాగ్యం: అవును ప్రసాద్. నువ్వు చెప్పింది బాగానే ఉంది. తాతయ్య డబ్బులో నా వాటా కూడా నాకే తీసుకుని పిక్చరు తియ్యి. పెట్టిన్న డబ్బు ఎల్లాగో ఇస్తానన్నారు దామూ.

శకు: ఇన్నాళ్ళూ ఒకరికొకరం కాకుండా బతికాం. ఈ సినిమాలోనైనా మనం బతుకులు కలబోసుకుందాం. నావంతు కూడా ప్రసాదుకిస్తాను.

ప్రసా: ఉండండి ఉండండి. మీరంతా ఎగిరే ఎద్దుకు గంత తగిలించేస్తున్నారు. పిక్చరు తీద్దామనుకున్నప్పుడు నాకు కొంచెంకూడా భయమూ, బాధ్యతా తోచలేదు. అందులోకి మీరంతా వస్తామంటూంటే నాకు అదురు పుట్టుకొస్తున్నది. ఒకవేళ నేను దెబ్బతింటే మీరంతా కూడా నష్టపడతారే. ఇది వరకెల్లా నష్టేట నావ మునగటమూ, నేను ఏదో విధంగా ఒడ్డుకు ఈదుకొస్తూ ఉంటటమూ జరిగింది. ఈసారి మీరంతా ఉంటే నేను నావ నడపటం క్షేమమా ?

పురు: బాధ్యతతో పనులు చెయ్యటం ఎప్పటికెప్పటికి నేర్చుకోవద్దుట్రా ?

ప్రసా: బతికున్నన్నాళ్ళూ బాధ్యత నుంచి తప్పించుకోవటమే ఆదర్శంగా పెట్టుకుని ఉన్నవాణ్ణి మరి.

డా: మీ కుటుంబం మధ్యలో జోక్యం కలిగించుకుంటున్నాను, మన్నించాలి.

పురు: (నవ్వుతూ) చెప్పండి, డాక్టరుగారూ. మీ ఆధ్వర్యం కిందనే ఈ ఈ పచ్చ అంతా జరుగుతున్నది నిజానికి. అయితే ఇంతసేపూ మేము మిమ్మల్ని మరిచిపోయాం.

డా: తాతయ్యగారి దగ్గర డబ్బు దాగావూ ఏమీ లేదు. ఆయన ఆ సంగతి నాతో చెప్పారు.

పురు: నిజమేనా, డాక్టరుగారూ ?

డా: నేను హాస్యానికి అనటంలేదు.

పురు: పాపం, ప్రసాద్ ప్లానులన్నీ పాడేసన్నమాట.

ప్రసా: నావి కేవలం ప్లానులే. నిజం చెప్పాలంటే, నేను పిక్చరుతీసి బయట పడేస్తానని, దానికి డబ్బొస్తుందనీ నా అంతరాత్మలో ఏమూలా నమ్మకం లేదు. తాడూ కోలా లేకుండా పిక్చర్లు తీయటానికి పూనుకునేవాళ్ళను చూస్తున్నాగా.

భాగ్యం: అదేంమాట ? తాడూ కోలా లేకుండా సినిమాలలో డబ్బు చేసుకునేవాళ్ళూ ఉన్నారు. నన్నడిగితే

పెట్టుబడి లేకుండానే సినిమాలు తీస్తున్న వాళ్ళు కూడ ఉన్నారు. (ప్రసాద్ నవ్వుతాడు) ఏం, నవ్వుతున్నావ్ ?

ప్రసా: నా మొదటి ఆలోచన అదే! పెట్టుబడి లేని వ్యాపారమే చేద్దామనుకున్నాను. అన్నయ్య బాధ్యత అంటున్నాడే, ఇది జరిగే పని కాదు. నేనింకేదైనా చూసుకుంటాను. నాకు ఫరవాలేదు. మగవాణ్ణి, కాని, పాపం, మీ ఆడవాళ్ళిద్దరూ ఏమవుతారో ?

శకుం: నిండా మునిగిన దానికి చలేమిటి? వంటలు చేసుకు బతుకుతాను. రాజ్యం సంగతే ఘోరం.

రాజ్యం: (చిరాకుగా) నన్ను గురించి ఎవరూ దిగులు పడక్కర్లేదు. బతుకు తెరువులన్నీ నాకు బాగా తెలుసు. ఏట్లో పారేస్తే ఎదురీదేస్తాను. జీవిత సముద్రంలో ఒంటరిగా తెప్ప నడుపుతున్నందుకు ఇన్నాళ్లూ గర్వపడ్డాను కూడా. అయితే, ఈ కాస్సేపటిలో ఒక కల వచ్చినట్లయింది. తెప్ప ఒడ్డు కొచ్చిందనిపించింది. అయిన వాళ్ళ మధ్య ఆప్యాయంగా బతకవచ్చనుకున్నాను. కాని, అదేం కల! మళ్ళీ నా వాస్తవ జీవితం నా ముందే ఉన్నది.

పురు: ఆ కల ఏదో రూపంలో నిజం చేసుకుందాం, రాజ్యం. నేను చాలా కాలంగా పేదజీవితం గడపటం నేర్చుకున్నాను. ఇన్నేళ్ళూ మీ రెవరూ నన్ను చూడరాలేదు. అందుచేత మీకు తెలీదు. నా కార్ఖానాలో పని చేసేవాళ్ళు బతుకుతున్నట్టే నేనూ బతుకుతున్నాను. రాజ్యం! నీ విలా సాలూ, డ్రెస్సులూ ఖులాసా తిరుగుళ్ళూ మానేసి, నా దగ్గర వచ్చి ఉండు. ధనం సుఖాలు పంచుకోనే లేను; కష్టాలన్నా పంచుకుందాం.

రాజ్యం: (ఆవేశంతో) నీ సుఖాలూ వద్దు, కష్టాలూ వద్దు. నేను నీ ఇంటికెందుకు రావాలి? నువ్వెవరో, నేనెవరో. (ఏడుస్తుంది)

పురు: ఊరుకో రాజ్యం, చిట్టి తల్లివి కామూ. (రాజ్యం ఇంకా ఏడుస్తుంది) చిన్నప్పుడు ఎంత ఏడుపులో కూడా నేను నవ్విస్తే నవ్వేది.

రాజ్యం: (ఎగిరిపడుతూ) నేను సుఖంగా బతుకుతున్నానని ఎవరెవరో అనుకుంటున్నారన్నమాట. నా బతుకే సుఖం లేదు. రైలు కింద పడదామని ఇది వరకు రెండుసార్లు ప్రయత్నించాను. పడితే పీడ విరగడై పోయి ఉండేది.

పురు: రాజ్యం, నీవిక ఒంటరిగా బతకటానికి వీల్లేదు. నా వెంట వస్తున్నావు.

రాజ్యం: నేను రాను;

పురు: రాకపోతే నిన్ను ఎత్తుకుపోతాను, అంతే.

రాజ్యం: అక్కయ్యను తీసుకు పో.

పురు: అదీ వస్తుంది (కలయచూస్తూ) మా ఇల్లు ముచ్చటగా ఉంటుంది. ఇంట్లో పచ్చగా ముగ్గురాడవాళ్ళు. సందడిగా పిల్లలు...నీసంగతేమిటిరా ప్రసాద్. నువుకూడా మా కొంపలో ఇమడ లేవూ ?

ప్రసా: నేనా పిక్చరు తీస్తాను. అందులో నాలుగు డబ్బులు ఏదో విధంగా వెనక వేసుకున్నాక పై సంగతి చూస్తాం.

అన్నె : (అవతలగదిలోంచి) శ్రీమన్నారాయణమూర్తి... నారాయణా...

రాజ్యం : (ఉలిక్కిపడి) ఏమిటదీ?

పురు : ఆ మాట్లాడింది తాతయ్యేనా డాక్టరుగారూ?

రాము : నేను వెళ్ళి చూసివస్తా (వెళతాడు)

డా : రాముడులుకు తాతగారే యిల్లు ఇచ్చేశారు. అతని పేర యీ పది పదిహేనేళ్ళనుంచీ బాంకులో డబ్బు కూడా వేస్తూ వస్తున్నారు. ఈ పాటికి పెద్ద మొత్తమై వుంటుంది.

పురు : అంత డబ్బుండికూడా యింకా తాతయ్యకు సేవ చేస్తున్నాడా?

డా : దానిలో ఆశ్చర్య మేముంది?

పురు : మాకు బతకటం చాతకాకపోవటమే ఆశ్చర్యమనుకోండి.

డా : ముఖ్యంగా వచ్చి తాతగారి వ్యాపారం పాడుచెయ్యకపోతే మీ కెవరికీ ఏ లోటూ వుండేదికాదు.

రాము : (ఆదుర్దాగా వస్తూ) డాక్టరుగారూ! ఒకసారి తాతగారిని చూడండి.

డా : వస్తున్నా! (మిగిలిన వాళ్ళతో) మీరిక్కడే ఉండండి.

రాజ్యం : ఎందుకీ డాక్టరుగారు మనని తాతయ్యకు ఎడంగా ఉంచుతున్నారూ?

పురు : నాకేమీ అర్థం కావటంలేదు. ఆయనకు వేరే జబ్బేమీ లేదుట. ఏ జబ్బూ లేకపోతే మత్తు మందెందుకిచ్చారూ?

ప్రసా : అర్థంలేని మాట. మత్తుమందిచ్చినంత మాత్రాన మనం తాతయ్యను చూడకూడదనటం దేనికీ? ఈ డాక్టరుగారు ఏదో నాటకమాడుతున్నట్టు నాకు అనుమానంగా వుంది.

శకుం : ఇంతకుముందు మనం విన్నది తాతయ్య గొంతేనా? అదేదో మారినగా వినపడిందే. అవునో డాక్టరుగారు.

రాజ్యం : ఆయన మొహం అలా అయిపోయిందేమిటి?

డా : (వణుకుతున్న గొంతుతో) ఏం పని చేశాను. ఏం పని—

పురు : ఏం జరిగిందో చెప్పండి డాక్టరుగారూ. ముందు కూర్చోండి.

రాము : (విచారంతో) ఇంకేం కావాలి, బాబూ. తాతగారు దాటిపోయారు.

పురు : (నిట్టూరుస్తూ) సరే, అనుకున్నదేగా. పెద్దవారూ, అందులోనూ జబ్బుగా ఉన్నట్టున్నారుగా.

డా : నన్ను మన్నించాలి, పురుషోత్తం గారూ. మీరు వచ్చేసరికి తాతగారికి ఏ జబ్బూ లేదు. ఆయన సలహాపైనే నేను మీతో అబద్ధం ఆడాను. మీరిక్కడ కూచుని మాట్లాడుకోవటం మొదలుపెడితే, మీలో ఉండే మంచితనాన్ని మీరే గుర్తింపుతారని తాతగారి ఉద్దేశం.

పురు : అంటే? నాకర్థం కాలేదు.

డా : ఆయన హృదయం నాకే ఒకంతట అర్థం కాలేదు. మొత్తంమీద ఆయనకు ఉద్దేశమేమిటంటే మీరంతా మీలో ఉన్న మంచితనాన్ని మరిచిపోయి, సుఖంలేని జీవితాలు జీవిస్తున్నారని డబ్బుతో మీకు సుఖంరాదని ఆయన ఏనాడో తెలిసిపోయింది.

ప్రసా : డాక్టరుగారూ, తాతయ్య బతికే ఆశలేదా? ఏదన్నా ఇంజెక్షనిస్తే—

డా: అవీ అయింది. ఆయన చావు నాకు చాలా వింతగా వున్నది. ఆయన ఆనందంతో ప్రాణం విడిచాడా అని నా అనుమానం.

శకుం: మేం ఒకళ్ళతో ఒకళ్ళం గర్భశత్రువుల్లాగా మాట్లాడుకుంటూంటే విని తాతయ్య గుండెపగిలి ఉంటుంది.

ప్రసా: అవును, తాతయ్యను మనమే చంపాం.

డా: అటువంటి అపోహ మీకు వద్దనే వద్దు. ఇంత కాలానికి మీరు తాతగారికి ఆనందం కలిగే మాటలు మాట్లాడారు.

రాజ్యం: (కన్నీళ్ళతో) బతికివున్నన్నాళ్ళూ లేకపోయినా, చచ్చేముందైనా మా వల్ల తాతయ్యకు ఆనందం కలిగిందా, డాక్టరుగారూ?

డా: మీరు మళ్ళీ పాత ధోరణిలో పడకండి. ఆయన ఆత్మకు శాంతి ఉండాలంటే మీరు ఒకరిమీదొకరు ప్రేమగా ఉండండి. ఆయనకు మీమీద ఎంత ప్రేమో మీలో ఒక్కరికి తెలీదు.

పురు: నేను కొంచెముగా ఊహించగలుగుతున్నాను, డాక్టరుగారూ... మా మంచితనంలో మాకు లేని విశ్వాసం తాతయ్యకున్నదంటే–

డా: రాఘవులూ, మనం తాతగారి అంత్యక్రియలను గురించి మాట్లాడదామా ... పురుషోత్తంగారూ, మీరంతా లోపలికి వెళ్ళి తాతగారిని ఆఖరిసారి చూడండి.

[అందరూ కలిసి గదిలోకి వెళ్తే విరామం. అందరూ తాతగారి శవం చుట్టూ చేరి చిన్న గొంతులతో మాట్లాడుతారు]

శకుం: తాతయ్య అట్టే మారలేదు. నేను కిందటిసారి చూసినట్టే వున్నారు.

రాజ్యం: మొహం నవ్వుతున్నట్టుగా వుంది కాదూ!

పురు: ప్రసాద్, మనం తాతయ్య ఆఖరు కోరిక దక్కించగలమా?

ప్రసా: డాక్టరుగారు చెప్పిన మాటలు నా కర్థం కాలేదనుకున్నానా, అన్నయ్యా?

రాఘు: ([illegible]) పెద్దయ్యగారూ!

పురు: ఇక్కడే వున్నావా, రాఘవులూ?

రాఘు: లేదు, వెళుతున్నా. మీతో ఒక్కమాట చెప్పిపోదామని వచ్చా- బయట డాక్టరుగారు కాచుకున్నారు.

పురు: చెప్పు రాఘవులూ!

రాఘు: మీరంతా ఏదన్నా కలిసి [illegible] నన్ను మరిచిపోకండి. నా [illegible] దాకా చేస్తున్నా... వస్తా. (వెళతాడు)

పురు: (ఆశ్చర్యంతో) ఏం మనిషి!

ప్రసా: తాతయ్యకు ప్రతినిధిలా గున్నాడే.

పురు: ప్రసాద్, ఇవాళనుంచీ మనం అయిదుగురం. తాతయ్యా, ఇకనుంచీ మేం అయిదుగురం.

★

# గడియారం ప్రణయం

అనిసెట్టి సుబ్బారావు

అతడొక పెద్ద గడియారం. తన ప్రాముఖ్యతను, తాను ఆక్రమిస్తున్న అత్యున్నత స్థానాన్ని, గ్రహించినవాడు. ఆ నగరంలో అన్నిటికన్న ఎత్తైన ఒక మహా భవనంపై అందరికీ కనిపించే విధంగా స్థాపించబడిన అతడు ప్రతి ఉదయం సూర్యాభివందనం చెయ్యడంలో ప్రథముడు. అతని కన్నివైపులా బహు సుందర దృశ్యాలున్నాయి. చుట్టూవున్న ఆ సౌందర్యాన్ని చూస్తూ తన కఠోర కర్తవ్య పథాన్ని విస్మరించే కోరికైనా అతని కెన్నడూ కలుగలేదు. అతనికి సెకండ్ హాండ్ లేదని గాని, జీవితంలో ఎన్నడూ ఒక్క క్షణమాత్రమైనా ఆలస్యం చేసి గాని, వేగంగా నడిచి గాని ఎరుగడు.

ఆ గడియారానికున్న స్నేహితుడు ఒక్కడే. ఆ భవనంలోనే ఉంటూ అల్లరి చిల్లరిగా తిరిగే ఒక వయసుబోతు పిచ్చుక. ఆ పిచ్చుక గడియారం చేతులమీద గంతులువేస్తూ 'ట్వీట్; ట్వీట్' మంటూ రోజంతా సరదాగా కథలు చెప్తూ ఉంటుంది. చాలావరకు ఆ కథలన్నీ సత్యదూరమైనవే. కాలాన్ని కొలవడం కష్టతరమైన కార్యం గనక గడియారం ఎప్పుడూ వివేకంతో మౌనం అవలంబిస్తుంది. అతడు గంటకొకసారి తప్ప పలకడు. ఆ పలుకులో మాత్రం పరమసత్యం ఇమిడివుంటుంది. అతని గాఢ గంభీర స్వరం ఇంతకాలం గడిచిపోయిందని, మళ్ళీ అది తిరిగి రాదని, ప్రతివారికీ ప్రకటిస్తుంది. కాని. దీన్ని గురించి ఎన్నడూ విచారించలేదు. గతించిన కాలంకంటె రానున్న కాలమే మంచిదని అతనికి తెలుసు.

ఇలా ఉండగా ఒకనాడు గడియారం ప్రేమలో పడింది. ఇది చిన్నదైన విషయం గాదు; ఎందుచేతనంటే, గడియారానికి—ఇనుముతో చేసినదే అయినా—ఒక హృదయం వుంది. తన మిత్రునిలో వచ్చిన మార్పును గుర్తించి పిచ్చుక ఎంతో సంతోషించింది. గడియారం ఎంత మౌనవ్రతుడైనా చాలా మంచివాడని పిచ్చుకకు తెలుసు.

ఆ పట్నంలోనే వయసులోవున్న ఒక చక్కని అమ్మాయి నివసిస్తూవుంది. ప్రతి ఉదయం తన పనిలోకి వెళ్లేటప్పుడు రోడ్డు దగ్గరికి రాగానే తలయెత్తి గడియారం వంక చూసేది. నవ్వేది. ఆ మిత్రులిద్దరికీ రోజంతటిలోనూ అదొక్కటే ఆనందమయ క్షణం. సంతోషం పట్టలేక ఎగురుతూ గిలిగింతలు పెడుతూ గాలిలో మొగ్గలు వేసేది పిచ్చుక. గడియారం వదనంమాత్రం బయటికి ఎంతో నిశ్చలంగా ఏమీ పట్టనట్లు వున్నా, అతని ఇనుపగుండె కొట్టుకొనేది. అంతేగాదు. తాను ఆ అమ్మాయి నవ్వుకే అలా చలించిపోయిన విషయం ఎవరైనా గమనిస్తారేమో అని గడియారం అటూ యిటూ బెదురుగా పరికించడాన్ని, నిశిత దృష్టిగల

ఏ బాటసారైనా గ్రహించగలడు. అతడు తన ప్రేమకు తానే సిగ్గుపడ్డాడు. తానెంత గాఢమైన ప్రేమకు వశమయ్యాడు! గడియారాలకు కాళ్ళు, తల వుండవు గాని, లేకపోతే అతడు ఆపాదమస్తకం ప్రేమలో మునిగిపోయాడని చెప్పవచ్చు. ఆ అమ్మాయి నవయౌవనవతి, అద్భుత లావణ్యవతి. ఆ పిచ్చుక కూడా ఆ అమ్మాయిని చూచిన తక్షణం ప్రేమించి వుండేదేమోగాని, ప్రణయం ఎంత అద్భుతంగా వున్నా, అంతకంటె అద్భుతమైన స్నేహానికి అది విఘాతం కలిగించకూడదని గ్రహించింది. కనీసం, యిలాంటి ప్రణయ కలాపాలలో తనకు అపారమైన అనుభవంవుంది. కనుక ఈ విషయంలో స్నేహితునికి తన సలహాలైనా ఇచ్చివుండేది. కాని, తన మిత్రునికి సలహాలు తీసుకోవడమంటేనే అయిష్టం. అతడెన్నడూ తన ప్రేమభావాన్ని వ్యక్తంచేసేవిధంగా తన చేతులు కంపించనివ్వలేదు; తనహృదయాన్ని అవగాహన చేసుకొన్న సహచరునికూడా తన మనోగతాభిప్రాయాలను వెల్లడి చెయ్యలేదు. స్వాభిమానం శృతి మించితే ఇలాగే జరుగుతుంది.

ఒకనాటి ఉదయం ఆ అమ్మాయి పనిలోకి వెళ్ళడం ఆలస్యమైంది. గడియారం వంక చూడగానే ఆమె చిరునవ్వు ఆశ్చర్యంగా మారింది. ఆశ్చర్యం బాధగా పరిణమించింది. ఆలస్యం కావడం ఆమె కిష్టంలేదు. అంతకు ముందెన్నడూ ఆమె జాగుచెయ్యలేదు. ఆనాటిఉదయం అంత ఆలస్యం ఎందు కయిందో ఆమె కసలే అర్థం కాలేదు. ఒక్కనిముషం వ్యవధి యివ్వకూడదా అన్నట్లు ఆమె కళ్ళు చూశాయి! ఒకే ఒక్క నిముషం చాలు: సరిగ్గా సమయానికి చేరుకుంటాను.

పిచ్చుక ఆ భవనం పైభాగంనుండి రెక్క లల్లాడ్చుతూ వచ్చి గడియారం చుట్టూ 'ట్వీట్', 'ట్వీట్' మంటూ తిరిగింది.

"ఆగు! ఒక్క నిముషం సేపాగు! నువ్వామెను ప్రేమించావని ఆమె గ్రహిస్తుంది! నీ దగ్గర లెక్కకు మించినన్ని నిముషాలున్నాయిగదా; అందులో ఆమెకోసం ఒక్క నిముషం అర్పించవు!"

గడియారం మాట్లాడలేదు. ఎన్నడూ క్రమం తప్పని గడియారమని తనకున్న పరువు ప్రతిష్ఠలు భంగమౌతాయని అతనికి భయంపుట్టింది. అయితే కొంచెంసేపు, కొన్ని క్షణాలపాటు, ఆ అమ్మాయికోసం ఆలస్యం చేయడం తనకూ ఇష్టమే.

ఆ అమ్మాయి కళ్ళు సౌందర్యంతో ధగ ధగ లాడుతున్నాయి. అవి అర్థిస్తే తిరస్కరించడం అసాధ్యమే కాని, తానాలస్యం చెయ్యకుండా తమాయించుకున్నాడు.

ఆ అమ్మాయి ఆదుర్దాతో పరుగెత్తనారంభించింది. కోపంతో పిచ్చుక గొడవచేసింది.

"అంతా స్వార్థపరత్వం; నువ్వొక జంతువువి."

"అరగంట" అని మోగి, వేళ పాన్నెన అయిందనే విషయం పట్నానికి ప్రకటించాడు అతడు.

"అరగంటేమిటి!" అని కేకపెట్టింది పిచ్చుక.

ప్రొద్దెక్కిన కొంతసేపటికి తాను నాలుగు నిముషాలు వేగంగా నడుస్తున్నట్టు

గ్రహించి గడియారానికి భయభ్రాంతులు కలిగాయి. అదెలా సంభవమైంది? తన హృదయం ప్రణయజ్వాలాకీల లంటుకుని అతి వేగంగా స్పందించివుంటాది! అయితే తన ప్రేయసి ఆలస్యానికి బాధ్యుడు తానేనన్న మాట; కాని తన ప్రతిష్ఠ పోతుందేమోనన్న భయంతో ఆమెతో సహకరించడానికి తానే నిరాకరించాడు. ఎంత అహంకారంతో ఎంత అవివేకంగా ప్రవర్తించాను, అన్న బాధతో తనను తానే అసహ్యించుకున్నాడు.

జరుగనున్నదంతా గ్రహించింది పిచ్చుక. మూలలో కూర్చుని లోలోన తాను నవ్వుకుంది. ఆ చిన్ని పిచ్చుకలో ద్వేషంవల్ల సంతృప్తి నిండింది.

గడియారం తన విషాదస్థితిని గురించి ఒక్కమాట కూడా స్నేహితునితో అనలేదు. తన స్థితిని స్వయంగా తానే చక్కబరుకోగలననే ధీమా వివేచనాశక్తి ఉన్నాయేమో? అసలు మోహానికి లొంగడానికే వీలులేనంత వివేచనాశక్తి ఉందేమో!

“రేపు ఆమెకు ఆ నాలుగు నిమిషాల కాలాన్ని అర్పించేస్తే ఆమె సంతోషిస్తుంది”, అని నిశ్చయించుకున్నాడు.

ఇది గడియారం చేసిన రెండవ తప్పు. ప్రేమకు జమాఖర్చులు లెఖ్ఖచూడటం గిట్టదని అతనికి తెలియదు. ప్రేమాన్వితులైనవారు తామెంత త్యాగంచేసినా అది తాము స్వీకరించిన దాని కన్నా మించదని అతనర్థం చేసుకోలేదు.

మరునాటి ఉదయం సూర్యోదయం కన్పించలేదు. ఆకాశం మేఘావృతమై వానజల్లు పడుతోంది. తాను సక్రమంగా నడవటంలేదని ఇతరులు గుర్తించడానికి వీలులేని సమయం ఇది. తన హృదయంలోని అగాధప్రేమను ప్రియురాలికి ప్రదర్శించాలి. పొరపాటున తానా అమ్మాయి వద్దపుచ్చుకున్న ఆ నాలుగు నిమిషాలు తిరిగి అప్పగించాలి. కచ్చితంగా నాలుగు నిమిషాల ఆలస్యం కనబరుస్తూ ఆమె కోసం ఓపికపట్టి ఎదురు చూస్తున్నాడు. వానజల్లు గిట్టకపోవడంవల్ల పిచ్చుక చూరులోనే తలదాచుకునివుంది. ఆ అమ్మాయి చౌకులోనికి రాగానే గడియారం ఆమె కోసం ఒక చిన్న చిరునవ్వు నవ్వింది. అపరాధం చేశామేమో అన్న భావం కలిగినప్పుడు ప్రేమికుల హృదయాలు మరింత ఆర్ద్రమౌతాయి. ఆ అమ్మాయి తలయెత్తి అయినా చూడలేదు. హుటాహుటిని వీధిలోనుంచి నడిచిపోయింది. చూరుకింద ఏదో అల్లలాడిన శబ్దం వినిపించింది; బహుశా పిచ్చుక వేళాకోళంగా నవ్వుతూందేమో! గడియారం ఆగ్రహంతో ఉక్కిరిబిక్కిరై కసుక్కుమన్నది. తాను, మహోన్నత పదవిలో ఉన్న తను ఒక త్యాగం చేసింది. కాని, దాన్ని గుర్తించేవారైనా లేక వ్యర్థమైపోయింది. అసలా త్యాగమే అనర్హమైనదేమో, అని తన అంతరాంతరాలలో అనుమానం కలిగింది.

రోజులు గడిచిపోతున్నాయి. ఎండలు కాచినై. మంచులు కమ్మినై. ఆ అమ్మాయి ప్రతిరోజూ చౌకులోనుంచి వెళుతూనేవుంది గాని గడియారంవంక కన్నెత్తి అయినా చూడటంలేదు. కనీసం ఒక చిరునవ్వయినా విసరడంలేదు. ఆమె నిర్లక్ష్యం గడియారం హృదయంలో ప్రళయం రేపింది; కాని అతడు తన ప్రాణస్నేహితుడైన పిచ్చుకతో కూడా తన బాధనుగూర్చి మాట్లాడలేదు. అసలు

ఆ బాధకు కారణం దుర్భరమైన ప్రేమో, దెబ్బతిన్న అహంకారమో ఎవ్వరికీ అర్థం గాలేదు.

పిచ్చుకకూడా చాలా బాధపడింది. తన ప్రాణమిత్రుని కెలా సహాయం చెయ్యాలో దానికి తోచలేదు.

అప్పుడప్పుడూ అది అమ్మాయి తల మీదుగా ఎగిరి, అనేక శబ్దాలుచేసి, గడియారంవైపు ఆమె దృష్టిని మరల్చడానికి ఎంతో ప్రయత్నించేది. కాని పిచ్చుక ఉద్దేశమేమిటో, అమ్మాయి కర్థం కాలేదు. ఆకతాయి తనంగా ఎగురుతూందనుకుని, ఆనందంగా చెయ్యి ఊపుతూ వెళ్ళిపోయేది.

ప్రేమ విచిత్రమైంది! అది గడియారపు ఉన్నతస్థానాన్ని లెక్క చెయ్యకపోగా, ప్రతినిత్యం అతని హృదయాన్ని వేధించసాగింది. అతని కర్తవ్య నిర్వహణను కూడా అది ఆటంకంగా తయారైంది. ఐనా అతడు తన మిత్రుని సహాయ సహకారాలను మాత్రం అపేక్షించలేదు. ఈవేదన భరించలేక, ఆఖరికొకరోజున అతడొక నిర్ణయానికివచ్చి, ఆమెకోసం తన పదవినీ, ప్రఖ్యాతినీ, తన సర్వాన్నిగూడా త్యాగం చెయ్యడానికి, ఆమె మీద తనకున్న అపారప్రేమను రుజువు చెయ్యడానికి సిద్ధమైనాడు. ఆగిపోయాడు. ప్రజలందరూ ఆశ్చర్య చకితులైనారు. పిచ్చుకమాత్రం, మొదట్లో తను ఒక్క నిమిషం బాగుచెయ్యమని సలహా ఇస్తే వినకపోవడంవల్లగదా ఇప్పుడీ పరిస్థితి వచ్చిందని మనస్సు కష్టపెట్టుకుంది. గడియారాన్ని బాగుచెయ్యడానికి ఇద్దరు యంత్ర నిపుణులు పూనుకున్నారు కాని వారికేలోపమూ కనిపించలేదు.

"ఎంత విచిత్రం! ఇది ఎందుకాగిపోయి వుంటుంది?" అని వారు ఆశ్చర్యపోయారు.

హృదయమనేదాన్ని అర్థం చేసుకోవడం అంతసులభం అనుకున్నారు గామాలు!

మరునాటి ఉదయం గడియారం మళ్ళి పని ప్రారంభించాడు. ఈసారి తప్పకుండా విజయం సాధిస్తాననుకున్నాడు. కాని ప్రణయం కర్కశమైనదికాదని, ఘనమైన త్యాగాలు కోరదని అతడు తెలుసుకోలేదు. రెండు జీవితాలను కలిపి సుఖప్రదం, సౌందర్యమయం చెయ్యడానికవసరమైన ఆర్ద్రతను, అహంకార రాహిత్యాన్ని మాత్రమే ప్రణయం అపేక్షిస్తుంది. అతడది గ్రహించలేదు.

ఆ ఉదయాన్నే ఎప్పటిలాగా ఆ అమ్మాయి ఆ త్రోవను వెళ్ళింది. కాని తలయెత్తిచూచి చిరునవ్వు నవ్వలేదు. ఒక ముచ్చటైన చేతిగడియారం ఆమె ముంజేతిమీద మెరుస్తూ వుంది. ఎంతో కాలంనుండి తన కభిమానిగా వున్న ఆ పెద్ద పాత గడియారం మీద ఎన్నడూ చూపనంత ఆప్యాయతతో ఆమె తన చిన్న గడియారాన్ని చూసుకుంటూ వుంది.

"ఓ తెలివిగల పెద్దమనిషీ! ఇప్పుడు చూశావా, నీ అవివేకం నిన్నే స్థితికి తెచ్చిందో!" అన్నది పిచ్చుక. మనస్సు కలతపడటంవల్ల అది మర్యాదగూడా మరచిపోయి, "ఓ దద్దమ్మా! తెలివి తక్కువ దద్దమ్మా!" అని తిట్టిపోసింది.

"అరగంట!" అంటూ నిట్టూర్చాడు గడియారం. కాలం అరగంట గడిచిందని పట్నానికి చేసిన ప్రకటన అది.

దూరసీమల స్థూల రేఖలు

# ఆదామ్ మికీవిజ్

రచన: ప్రుజిన్‌స్కీ

అనువాదం: కె. వి. రమణారెడ్డి

దాదాపు వందయేళ్ళక్రితం. క్రిమియా యుద్ధరంగం ... కాన్‌స్టాంటినోపిల్ మండలం ... డెబ్బయ్యేళ్ళ వృద్ధుడు ఒకడు చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు...కలరావ్యాధి విజృంభణ... సైనిక దుస్తులు ధరించి వున్నాడు...పెదవులపై సన్నటి చిరునవ్వు...గదిలో వున్న సైనికోద్యోగిని దగ్గరకు రమ్మని సంజ్ఞ చేశాడు..."ఆటోమాన్ కొజాక్ దళం ..."... కళ్ళు మూతలు పడి పోతున్నాయి...అయిపోయింది.

మధ్యలో ఆగిపోయిన యీ మాటలు ఆదాం మికీవిజ్ యొక్క యావజ్జీవ స్వప్న సారాంశానికి రూపు కల్పించాయి. ఫ్రెంచి మహా విప్లవ భావాలను వుగ్గుపాలతో ఒంటబట్టించుకొని, నెపోలియన్ విజయాలలో వుత్సాహవేశాలను పెంపొందించుకొని, కావ్యాలను జీవిత సంఘటనలకు మేళవించిన పోలిష్ మహాకవి మికీవిజ్ యశోకాయుడయ్యాడు. పోలండులో అంతర్భాగమై యుండిన లిథువేనియా సీమలో పుట్టి, విల్నా విశ్వవిద్యాలయాన పూర్వ మహాకవుల నిధులను దోచుకొని, ప్రవాసియై రష్యా, జర్మనీ, ఇటలీ, స్విట్జర్లాండు, ఫ్రాన్సు, దేశాలలో తలదాచుకొని, చిట్టచివరకు మాతృదేశ విమోచనకై కత్తి చేదాల్చి సుదూర క్రిమియా సమీపాన, టర్కీ రాజ్యాన, అసువులు విడిచినాడు. మూడు మహా విప్లవ సంరంభాలను 1812, 1830, 1846 సంవత్సరాలలో చూడడమే గాక, రుచిచూచాడు. అనేక సాయుధపోరాటాలలో పాల్గొన్నాడు. మికీవిజ్ వ్యక్తి జీవితం యూరపు చరిత్రలో అంతర్భాగమైపోయింది. స్వేచ్ఛోచ్ఛ్వాసాలను ఎత్తిన హోరుగాలివలె ఆత్మార్పణం చేసికొన్న యీ సుందరాకారుడు మహాకవిమాత్రమే కాక, మహాపురుషుడు కూడ.

బ్రతికి చెడి, సిరులు చితికిన పోలిష్ జాతి కంటె దౌర్భాగ్య శప్తమైన జాతి ప్రపంచాన వేరొకటిలేదు. మధ్యయుగాలలో మహారాజ్య ప్రాభవ విలసితమై,

( 34 వ పేజీ తరువాత )

"అరగంట కాలేదు!" అని అరిచింది పిచ్చుక.

ఈసారి గడియారం పిచ్చుకతో ఏకీభవించాడు. దానికి కారణం పిచ్చుక చెప్పింది నిజమని గాదు; ప్రణయం చెయిజారి పోయింది; ఇక స్నేహం కూడా చెడిపోతుందేమోనని భయం పుట్టింది.

(మూలం : "వరల్డ్ యూత్" పత్రిక లోని కథ)

నానాటికి తీసికట్టుతూ, 18 వ శతాబ్దిలో యిరుగుపొరుగున వుండిన నిరంకుశ రాజ్యాలైన రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాలనే ఆ గొన్న తోడేళ్ళ పాల్పడి, మూడు ముక్కలుగా విడిపోయి, జాతీయ వ్యక్తిత్వానికి దూరమైపోయినది. పనో ఫలకాల మీద పూర్వ ప్రాభవ స్మృతి ముద్రలు యింకా చెరిగిపోలేదు. దుర్గ శిథిలాలు, తుప్పుపట్టిన ఆయుధాలు, జానపద గేయాలు యీ స్మృతికి ఆలంబాలై ప్రజా హృదయానికి సంక్షోభం కలిగిస్తున్నాయి. ఆ దశలో పుట్టాడు జాతీయ మహాకవి మిక్‌విజ్......1798 వ సంవత్సరం...బ్రతికి చెడిన సంపన్నుల కుటుంబం...పూర్వ ప్రతిష్ఠను మూర్తీభవించిన శిథిల సుందర పరిసరాలు...ఫ్రెంచి మహావిప్లవం సుమార స్వనాలు...స్వేచ్ఛా సమానత్వ, స్వాతంత్ర్య నినాదాల కోసం సవ్వడులు...జాతీయ హృదయాన తిరిగి రెక్కొంటున్న ఆశాస్పందనలు...కుట్రలుగా మొదలైన మహోద్యమాలు...పోలిష్ సాంస్కృతిక పునరుజ్జీవకులైన మహాకవుల గ్రంథ పరిచయాలు!

ఆదాం మిక్‌విజ్ తండ్రి నికలస్ న్యాయవాద వృత్తి చేస్తున్నా, నాలుగు రూకలు సంపాదించలేకపోయాడు. రాజకీయాలలో వున్న ఆసక్తి వృత్తిలో లేదు. ఆదాం మొట్టమొదట డామినికన్ సన్యాసుల కాన్వెంటు బడిలో చదివాడు. అతని బాల్యం నెపోలియన్ విజేత విజయ పరంపరా ముద్రాంకితమైంది. పోలిష్ జాతీయ స్వాతంత్ర్యం నెపోలియన్ విజయ ఫలితంగా లభిస్తుందని పెట్టుకొన్న ఆశలు వమ్మయినాయి. 1812 లో చెక్కుచెదరని సేనతో పోలండు మీదుగా రష్యాలో ప్రవేశించిన ఫ్రెంచి చక్రవర్తి, యేడాది తిరగకముందే, శిథిలీభూతమైన సేనతో, అపజయాలతో, రష్యాను వదలి పోలెండు మీదుగా స్వస్థానం పోయాడు. శత్రువైన రష్యాను కూల్చాలని పోలిష్ యువకులనేకులు నెపోలియన్ సేనలో ఒక దళంగా సమకూరి, మాస్కో పరిసరాలలో ఎముకల పోగు పడినారు. నెపోలియన్ శృంగభంగం పోలిష్ జాతికి ఆశాభంగమైంది. శేష యూరప్ ఖండానికి అమానుష నియంతగా కాన్పించిన ఫ్రెంచి చక్రవర్తి, పోలెండుకు స్వేచ్ఛాదాతగా కాకున్నా, స్వేచ్ఛాదూతగా కన్పించాడు. ఆడిన మాట తప్పినా, అతని నభిమానించారు. ఈ అభిమానం మిక్‌విజ్‌లో అతిశయించి జీవితావసాన వేళవరకు నిలిచింది.

1815 లో మిక్‌విజ్ విల్నా విశ్వవిద్యాలయాన ప్రవేశించాడు. చేత రాగిరూక కూడా లేదు. తండ్రి మూడేళ్ళ క్రితమే పోయాడు. కాని స్కాలర్‌షిప్ లభించింది. ప్రత్యక్ష జీవితంలో స్వేచ్ఛ లేకున్నా, విశ్వవిద్యాలయ సాంస్కృతిక ప్రణాళికలో మహాభావుకులైన వోల్తే, రూసో, దిదిరో, దాలెంబర్ట్ గ్రంథపఠనకు స్థానం లభించింది. పూర్వ మహాకవుల గ్రంథ పరిచయం కూడా సమకూడింది...క్రొత్తకారు కుర్రవాళ్ళలో దేశవిమోచనం లక్ష్యం కొనసాగింది...విద్యా విజ్ఞాన సంస్కారాలద్వారా జాతిని పునర్జీవింపజేయాలనే సంకల్పం...వాదాలు చర్చలు..రహస్యాలోచనలు...రాజకీయాభిమానాలు...కుట్రలు, పితూరీలు... "వైప్లవ్యగీతాలతో ప్రతిధ్వనించే నిశీథిని"

అని ఒక సమకాలికుడు యీ దశను చక్కగా వర్ణించాడు.

ఆదాం మికీవిచ్ విశ్వవిద్యాలయం నుండి జీవితంలో ప్రవేశించాడు. ఎక్కడో వుత్తరాన కోవ్నో అనేచోట ఉపాధ్యాయ వృత్తిలో రెండేళ్ళు పనిచేశాడు ...జర్మన్ సాహిత్య పరిశీలన...కాల్పనికోద్యమ ప్రభావం...షిల్లర్, గేటే, బైరన్‌ల పట్ల అభిమానం...పోలిష్ టీనసుందర పరిసరాలు...కళాకారుని స్వప్నాలకు మొలచిన జన సంప్రదాయాలు ... రచనా వ్యాసంగం ... కథా కావ్యాలు (Baallds)..." "వంటపని వాళ్ళు, సంపన్న స్త్రీల పరిచారికలు యీ పాటల పుస్తకాన్ని మొదట కొనుగోలు చేశారు" ... విదేశాలకు అణగిమణగిన దేశాన, జాతీయ పునర్వ్యవస్థం కాల్పనిక ధోరణుల శరణుకొచ్చింది ... స్వాప్నిక నిశ్వాసం, భావోన్నత్యం దీని గుణాలు... భూత ప్రేతాలు, మంత్ర తంత్రాలు, చందమామ సోయగాలు, అమ్మమ్మ కథలు దీని రూపాలు! పోలిష్ ముఖ్య నగరమైన వార్సాలోని పండితులు నోరు చప్పరించారు. జనభాషలోని మొరటు పలుకుబడులను, "గ్రామ్య" రీతులను వాళ్ళు అసహ్యించుకొన్నారు. పూర్వ మహాకవుల గ్రంథాలలోని భాషను, వృత్తాలను వాడుకొంటూ, "శైలి"ని పూజిస్తున్న యీ కృతక భాషావాదులకు మికీవిచ్ కొత్త కావ్యం "గ్రాజినా" కనువిప్పు అయింది. ఈ "నిరక్షరకుక్షి" పూర్వ మహాకవుల పరిచయం సంపాదించాడే! కాని, యితన్ని పైకి రానీయ కూడదని శపథం చేశారు. విమర్శించారు. నిందించారు. తద్వారా అతని పేరు ప్రాకిపోయింది. యువ మేధావులు, సాధారణ ప్రజలు అతనికి పట్టం కట్టసాగారు. మికీవిచ్ కాల్పనికోద్యమ శిఖరాలను తాకుతూ, తన విఫల ప్రణయ వృత్తాంతాన్ని దేబూని, "జియాడీ" [పూర్వీకులు] అనే గేయ నాటకం వ్రాశాడు. పోను పోను, ప్రణయ వృత్తాంతం సన్నగిల్లి రాజకీయ ప్రశ్నయంగా పరిణమించింది.

దేశంలో ఒక రాజకీయ ప్రళయం వుప్పతిల్లింది. రహస్య విద్యార్థి సంఘాల మీద పోలీసుల నిఘా అతిశయించింది. 1824 లో చాలమంది కుర్రవాళ్ళ చేతులకు బేడీలు పడినాయి. మికీవిచ్ మీద ఏ నేరారోపణ లేదు. కాని యిద్దరు మిత్రులతో సహా, అతన్ని రష్యాలో వుపాధ్యాయుడుగా బదిలీ చేశారు. అదే దేశానికి తుది వీడ్కోలు.

## 2

క్రిమియాలో నవాబువలె కొంత కాలం జీవించాడు. రష్యన్ గవర్నర్లతో పోలిష్ కౌంట్లతో సహవాసం చేస్తూ, నీతిని లోకరీతిని విడిచి, విశృంఖలవర్తనుడయ్యాడు. తర్వాత మాస్కోకు వచ్చాడు. మాస్కో గవర్నరు జనరలు ఆఫీసులో నౌకరి ... గొప్ప కవిగా ప్రశంసావర్షం ... "కోన్రాడ్ వేలన్ రాడ్" అనే వీరకావ్యరచన ... పదునాల్గవ శతాబ్దాన లిథుయేనియాలోని ఒక యువకుడు శత్రుపక్షాన చేరి, లోపలినుండి వాళ్ళను దెబ్బ తీయడానికి పూనుకొన్న సంఘటన... సమకాలిక సంఘటనలకు పౌరాతన్యపు భ్రమ కల్పించాలని సంకల్పం...రష్యన్ అధికారుల గుడ్డి

చూపు, మందబుద్ధి ... అనుమానాలు... మిత్రుల హెచ్చరికలు ... రష్యానుండి పలాయనం...1829...జర్మనీ.

జర్మనీలో ప్రతిష్ఠ ... బెర్లిన్ ... డ్రెస్డెన్ ... ప్రేగ్...వీమార్‌లో గెటే మహాకవి సందర్శనం...స్విట్జర్లాండు... ఇటలీ ... 1830 ... బెల్జియంలో తిరుగుబాటు ... ఫ్రాన్సులో విప్లవం ... "బూర్జువా రాచరికి" స్థాపన ... పోలండులో సైనికపితూరి ... తన కావ్యాలే పితూరీదారుల ధ్వజాలు ... తన గేయ చరణాలే యుద్ధనినాదాలు...కాని తాను మట్టుకు రణరంగానికి యోజనాల దూరం ... యూరపులోని దేశాలన్నీ రష్యా సామ్రాజ్యానికి వత్తాసి యిస్తున్నాయి...పితూరీ అణగిపోతున్నది ... తన కాళ్ళు మాతృభూమివైపు సరిహద్దుల వరకు పయనించాయి ... పరాజితులైన స్వేచ్ఛాప్రియులు ప్రవాహప్రాయంగా దేశంనుండి వలస వస్తున్నారు...రేగినట్లే రేగి ఆశ అణగారిపోయింది.

జాతిస్వప్నాలు కవికి వ్యక్తిగతజీవిత నాటక సంఘటనలయ్యాయి. స్వేచ్ఛా సమరవీరుల సాహసకృత్యాలను యితివృత్తాలుగా గ్రహించి "కార్ద్వాకర్ పాటలు" వంటి కావ్యాలు వెలువరించాడు. ఇంతకు మునుపు రెండు భాగాలు మట్టుకే వ్రాసిన "జియాదీ" మూడవ భాగాన్ని యిప్పుడు పూర్తిచేశాడు. తొలి రెండు భాగాలలో విఫలప్రేమను వర్ణించిన కవి, మూడవ దానిలో స్వీయ రాజకీయ పోరాటాలను వుల్లేఖించాడు.

జాతి హృదయాన ఆశపూర్తిగా అంతరించలేదు. రేపటి మాపటి కలలు పండుతాయని ఆశించాడు. ఈ విశ్వాసాన్ని కేంద్రంగా చేసికొని "పోలిష్ జాతి, దాని యాత్రా గ్రంథాలు" అనామకంగా వ్రాశాడు మిక్కీవిజ్. కొద్దినెలల్లోనే అనేక ముద్రణలు పొందిన యీ గ్రంథం ప్రసిద్ధికి రావడానికి పద్యంవంటి గద్యరచన ముఖ్యకారణం. పోలిష్ జాతికి బైబిలువంటి యీ గ్రంథంలో బైబిలులోవున్న గద్యంవంటిదే కనిపిస్తుంది. క్రీస్తువలె పోలండు దేశం శిలువపాలైనది. క్రీస్తువలెనే చివరకు గెలుస్తుంది. పోరాడి ఓడిపోయినవారు వృత్తిప్రవాసులు మట్టుకే కాదు స్వేచ్ఛాపథసంచారులు, దివ్యయాత్రికులు! జాతులన్నిటిలో పోలిష్ జాతి ఆత్మార్పణ ద్వారా స్వాతంత్ర్య సందేశం ప్రపంచానికి ప్రసాదిస్తుంది, అనే విశ్వాసం వర్తమాన దుర్దశను మరపించింది. పూర్వఘనతకు మనసైన స్మృతులను నెమరువేసికొంటూ కాలంపుచ్చసాగారు. ఈ దశలోనే మిక్కీవిజ్ "పాన్ థాడ్యూస్" అనే మహాకావ్యం వ్రాశాడు. దీనిలో అతని మహాకవిత్వ రచనాదక్షత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పోలిష్ భాషలో కెల్ల యిది మహోత్కృష్ట సృజనగా సంభావించబడింది. దీని తర్వాత, మిక్కీవిజ్ రచనావ్యాసంగాన్ని కట్టిపెట్టాడు. ఆయన జీవితం దీనితో సఫలమైంది. తర్వాత పెళ్ళిచేసికోవడం, బిడ్డలు పుట్టడం, కీచులాటలు, దారిద్ర్యం, ప్రవాసజీవితక్లేశం, అతని మనస్సును వంచివేయగలిగాయి. అంతేకాదు. ఈ కష్టనిష్ఠురాలవల్ల విధిత్రోపులవల్ల, అతనిలో ఆధ్యాత్మిక చింతన అతిశయించింది. కావ్యరచనవల్ల ప్రయోజనంలేదని తీర్మానించుకొన్నాడు. ఋషి కానివాడు కవి కాడు అని

భావించాడు. ఆత్మశుద్ధి లేనివాడు కవి అవడానికి అనర్హుడనుకొన్నాడు. ఆ కావ్యాలు వ్రాయడంకంటె, కావ్యాలు చేయడమే ఎక్కువ, గద్యం వంటి బ్రతుకుకు పద్యం మార్గం; పద్యం వల బ్రతికినప్పుడే పద్యం వ్రాయాలి అని నిశ్చయించుకొన్నాడు.

ఒక మహాకవి జీవితాశ్వాసం సంపూర్ణమైంది కాని మహాపురుషునిది పూర్తి కాలేదు. 1839 లో స్విట్జర్లాండులోని లాసేన్ విశ్వవిద్యాలయాన లేటిన్ సాహిత్యశాఖకు ప్రొఫెసరుగా నియమితుడైనాడు. వీల్నాలో జరిపిన చదువు అక్కరకు వచ్చింది. "లేటిన్ మింగి, ఫ్రెంచిని వుమ్మి" యీ క్రొత్త బ్రతుకు సాగించాడు. బోధన ఫ్రెంచి భాషలో జరిగేది. కొంతకాలం తర్వాత, ఫ్రాన్సు విశ్వవిద్యాలయంలో స్లావోనిక్ సాహిత్య పీఠానికి అధిపతి అయ్యాడు. మృతి పాల్పడిన లేటిన్ కు మారు జీవద్భాషా సాహిత్య బోధన ఆయనకు ప్రియతరమైంది. ఆయన వుపన్యాసాలను వినడానికి మాంటెలెమ్ బర్ట్, జార్జిశాండ్, తుర్జినీవ్ వంటి ప్రఖ్యాత రచయితలు హాజరయ్యేవారు. పోను పోను, యీ సాహిత్య వేదికను ఆయన మత వేదికగా మార్చాడు. ఆంద్రీ తోవియానిస్కీ అనే పోలిష్ యువకుడు క్రైస్తవ సిద్ధాంతాలతో విరోధించని ఒక మర్మవాదాన్ని ప్రచారం చేశాడు. టాల్‌స్టాయి మహాశయుడు భావించిన ఊహానిర్మిత సామ్యవాదంవంటి వాదంతో బాటు, వివాహ నిబంధనలు, లైంగిక సంబంధాలు కొంత సడలించిన దృక్పథం యీ 'తోవియానిజం' లోని సారాంశం. మికీవిజ్ యీ వాదానికి మనసయ్యాడు. తోవియానిస్కీ గురుత్వాన్ని అమోదించాడు. కేథలిక్ మతాధిపతులు తోవియానిజాన్ని వెలివెట్టిన తర్వాత, స్లావోనిక్ సాహిత్యపీఠంనుండి మికీవిజ్ కేథలిక్ మతదురాచారాలను ఖండించ సాగినాడు. ఫ్రెంచి విద్యాశాఖకు తలనొప్పి పుట్టించాడు. 1844 లో ఆ పదవి కాస్తా వూడింది.

నాలుగేళ్ళు గడిచాయి. యూరపు ఖండం భద్రత తరిగి ప్రమాదం పాలైంది. అనేక దేశాలలో ఒక్కుమ్మడి అగ్ని పర్వత శిఖరాలు పగిలిపడసాగాయి. "జాతుల వసంతర్తువు" ఆసన్నమైంది. మికీవిజ్ ఇటలీకి పోయాడు. అక్కడ పోలిష్ సైనికదళాన్ని పన్నెండుగురితో నిర్మించి, తాను సర్వసేనాధిపతి అయ్యాడు. ఆయన యీ క్రొత్త పహారాలో జారీచేసిన మేనిఫెస్టోలో మతాభిమానం, సాంఘిక సమానవాదంతో భుజాలు రాచుకొంది. సమిష్టి ఆస్తి, యూదుల సమాన హక్కులు, స్త్రీలకు హక్కులు, ఆయన అభిమానాలు యే దశలో వున్నాయో తెలిపే అంశాలు... ఫ్రాన్సులో 'బూర్జువా' నాటకం పడిపోయింది. "ఈనాడు క్రీస్తు మహాత్ముని ఆత్మ పారిస్ నగరంలోని సాధారణజనుల రూపం ధరించింది!" అని వ్యాఖ్యానించాడు... కాని విప్లవోద్యమాలను ప్రతీపశక్తులైన రష్యా, ఆస్ట్రియాలు అణచివేశాయి... ఫ్రాన్సు అధ్యక్షుడు లూయీ బోనపార్టు అధికారం హస్తగతం చేసికొంటున్నాడు.. ఈదశలో మికీవిజ్ ఒక అంతర్జాతీయ విప్లవ పత్రిక ప్రారంభించాడు. అనేక దేశాలనుండి ఫ్రాన్సుకు ప్రవాసంవచ్చి చేరిన విప్లవ భావుకులు కారల్ మార్క్సు స్నేహితు

డైన ఓవర్‌బెక్, రష్యన్ మేధావి హెర్జన్ వంటివారు - దీనిలో వ్రాసే వారు. మార్క్సుకు ముందుండిన ఊహాలోకపు సామ్యవాదాన్ని వీరు ప్రచారం చేశారు...ప్రభుత్వం గమనించింది... బహిష్కరణ ... రహస్య జీవితం ... భార్యమృతి...

అంతరించాయనుకొన్న ఆశలు తిరిగి చిగురించాయి. రష్యాతో ఇంగ్లాండు, ఫ్రాన్సు దేశాలు కయ్యానికి తలపడ్డాయి. ఇదే క్రిమియా యుద్ధం. రష్యాను ఓడించి, పోలండుకు స్వేచ్ఛ సంపాదించాలి. ఫ్రెంచి ప్రభుత్వామోదంతో క్రిమియా యుద్ధరంగానికి బయలుదేరాడు. తల నెరసింది. ఆరుగురు బిడ్డల తండ్రి. సైనికుల దిరిసు తాల్చాడు. యుద్ధపుంచల మందే కలరావ్యాధి సోకింది. చివరవరకు పోలిష్ స్వేచ్ఛను స్వప్నిస్తూనే వున్నాడు.

ఆదాం మికీవిక్జ్ పోలిష్ సాహిత్యంలో ఒక గౌరీశంకర శృంగం. పోలండులో పుట్టినాడేగాని బ్రదుకులో ఎక్కువ భాగం యితర దేశాలకు అర్పించాడు. కనుకనే ఆయనను యూరపు ఖండం సమస్తం గౌరవించింది. పోలిష్ జాతితో బాటు, దేశదేశ పీడితులను ఆయన అభిమానించాడు. రష్యన్ సామ్రాజ్యాధికారానికి లోబడియుండిన కొసాక్ జనులంటే ఎంత సహానుభూతి ప్రదర్శించే వాడో, యూరపులో చిన్న చూపు చూడబడిన యూదులంటే అంత ప్రేమ చూపేవాడు. కత్తిని కలాన్ని సమాన దక్షతతో నడుపలేదు కాని, వాటిని సమన్వయ పరిచాడు. కవి జాతి హృదయ కేంద్రమని నిరూపించిన పోలిష్ మహాకవి మికీవిక్జ్ విశ్వ సాహిత్య మూలస్తంభాలలో ఒకడు.

—"Adam Mickiewicz" అనే గ్రంథ సంక్షేపం.


# అభ్యుదయ

(మాసపత్రిక)

**చందా వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సరం | : | ఆరు రూపాయలు |
| అర్ధసంవత్సరం | : | మూడురూపాయలు |
| విడిప్రతి | : | అర్ధరూపాయి |

**ప్రకటన రేట్లు (ఒకసారి)**

| | | |
|---|---|---|
| టైటిల్ నాల్గవ పేజీ | | రు. 50 |
| ,, (2, 3 పేజీలు) | .... | 40 |
| మామూలు పేజీ | .... | 30 |
| అరపేజీ | .... | 20 |

ద్వివర్ణ, త్రివర్ణాలకు అదనపు రేట్లు. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లుకావాలి. కావలసిన ప్రతులకు కమిషన్ పోను మిగతా డబ్బు ముందుగా చెల్లించాలి.

వివరాలకు :

మేనేజరు, అభ్యుదయ, విజయవాడ - 2.

# కవి !

## కౌముది

తమస్సులో నవోషస్సు
కొరకయి బాటలువేసి
జాతిని మేల్కొల్పు గీత
మాలపించగలవుగాని
మండేకడుపుకు బుక్కెడు
గంజినీళ్ళ కేది దారి ?

శరజ్జ్యోత్స్న వయి ధరిత్రి
నిండగలవుకాని కళా
నిలయమయిన నీ జీవిత
మందు వెలుగు రాత్రు లెన్ని ?

యువశక్తికి మార్గదర్శివయి
ముందుకు నడుపగలవు
నిన్ను బ్రతుకు బాటలపయి
ఆదుకొనే నాథు డెవడు ?

ద్వేషానలమున జ్వలించు
పాశవిక కరాళస్వాంత
ముల పయి వర్షించగలవు
చల్లని పన్నీటిఝరులు –
కాని నీ కపోలతటిని
జారువారు కన్నీటిని
దయతో తుడిచెడి సౌ
జన్యమూర్తు లెవ రిచ్చట ?

విజృంభితస్వార్థవిలయ
నృత్య కేళికాలయమయి
మానవహృదయం జగతిని
బుగ్గిచేయదలచునపుడు –
విశ్వశాంతికొరకు గళ
మెత్తగలవుకాని వ్యథా
భరితమయిన నీ జీవిత
మందు శాంతి నింపు నెవడు ?

ఆకలితో ఆలమటించి
కన్నులుమూసిన తదుపరి
నీస్మారకసభ లెన్నో
జరుపుతుంది జనావళి;
జీవించుట కొరక జా నెడు
జాగా యివ్వని ప్రముఖులు
నీ పవిత్ర స్మృతికి జాలి
గా ఘటించగల రంజలి;

కళలకు కాణాచియయిన
దేశమందు జన్మమొంది
బ్రతుకలేక చస్తావు !
చచ్చి బ్రతుకుతావు కవీ !

★

## సీరియల్ నవల

# స్వర్గారోహణ

"మంజుశ్రీ"

శివరామయ్య చిత్రమైనవాడు.

అతని చరిత్రే చిత్రమైంది.

శివరామయ్య సామాన్యమానవుడు.

సామాన్యుడికి వుండవలసిన సాధక బాధకాలన్నీ పొల్లుపోకుండా, తు. చ. తప్పకుండా అతన్ని ఆవరించుకొనే వున్నాయి.

ఇప్పుడిప్పుడే శివరామయ్యని ఊళ్లో వాళ్ళంతా సద్బ్రాహ్మణుడంటున్నారు.

అంటే ఇదివరకు కాదా? అని. అనే!

ఇదివరకు కాదా? అన్న ప్రశ్నలో సబబు లేకపోలేదు. ఇప్పుడవునా? అన్న మీమాంసలో సత్యమూ వుండకపోలేదు.

పాతికేళ్ళప్పుడు ఆ ఊరు విడిచిపెట్టి పోయిన శివరామయ్య, అనాచారి, బ్రాహ్మణీకాన్ని మంటకలిపి, కిరస్తానీ చదువులు చదివి, ఉద్యోగంలో ప్రవేశించినవాడనీ అనిపించుకున్నాడు.

"కులవృత్తికి సాటి రాదు గువ్వల చెన్నా! నీకెందుకయ్యా యీ ఉద్యోగం, సలక్షణంగా పౌరోహిత్యం చూసుకో" అన్నారు పెద్దలు.

శివరామయ్యకి మనస్సు కష్టంవేసింది. శివరామయ్య అన్నాడుకదా—

నాకు జందాలు వడకటం చేతకాదు. సంభావనలకి పోలేను. వేదం కొద్దిగా కూడా నేర్చుకోలేదు. అసలు ఆ మంత్రాలు నా నోటికి తిరగవు. నన్నెందుకు కారొంపెలో దింపుతారు? అని.

"అయితే మీ తాతలకాలంనుంచీ నిలుపుకుంటున్న యీ పదిళ్ళ పౌరోహిత్యం పోవలసిందేనా?" అన్నారు పెద్దలు.

"అంతే" అన్నాడు శివరామయ్య.

అయితే పెళ్లిచేసుకో అన్నారు వాళ్లు. పెళ్ళి చేసుకుంటే వచ్చే ఆ అమ్మాయి అయినా తనకుఅండగా, శివరామయ్యని ఉద్యోగానికి పోకుండా చూస్తుందని.

ఇంతవుంది పెద్దలు చెపుతుండగా మొండికెయ్యటం బాగుండదని శివరామయ్య వొప్పుకున్నాడు.

శివరామయ్యకి పెండ్లయింది.

అందరికీ కావటంలా? అలానే!

ఆ అమ్మాయి పేరు వెంకటరామ నరసమ్మ.

ఇప్పుడామె యాభైయేళ్లు దగ్గరదగ్గర కొస్తున్న ఐదువ.

వాళ్ళమ్మమ్మ ఆ అమ్మాయిని 'నరసూ' అని పిలిచేది.

శివరామయ్య ఉద్యోగానికి వెళుతున్న రోజున వాళ్ళమ్మమ్మ నరసు చేత ఘోరంగా కళ్ళనీళ్ళు పెట్టించింది. అయినా శివరామయ్య చలించలేదు. పిచ్చి మొహం అనుకున్నాడు. ఆమాట కాస్తా పైకనేశాడు.

వెంకటరామనరసమ్మ తెల్లబోయింది. ఆ తెల్లమొహంతోనే అమ్మమ్మ దగ్గరికి పోయింది. "మీరు ఉద్యోగానికి పోతే నేను బ్రతకను" అని చెప్పుతున్నది అమ్మమ్మ.

'నరుసు' వచ్చి అలానే చెప్పింది.

"ఏం, ఎందుకూ?" అన్నాడు శివరామయ్య.

"అలా ఆయన అడిగినప్పుడు ఏమని చెప్పాలో!"

అమ్మమ్మని అడగలేదు నరసమ్మ.

అందుకని తెలివంతా ఉపయోగించి "మరి నేనొక్కర్తైనా వుండవద్దూ" అన్నది.

ఆ మాటలకు శివరామయ్య స్మిత సుందరవదనారవిందుడై "నువ్వక్కడ వుండటం ఎందుకూ" అని ప్రశ్న వేశాడు.

దానికామె సమాధానం చెప్పలేక "ఆయన ఉద్యోగానికి పోతుంటే వీళ్ళెందుకు చెప్మా!" అని ఆశ్చర్యపోయింది.

శివరామయ్య వచ్చిన ఉద్యోగం చచ్చినా వదలనని మొండిపట్టు కలవాడై పోయి ఉద్యోగంలో చేరాడు. 'నరుసు' మాత్రం అమ్మమ్మని తిట్టుకుంటూ అలానే ఆ ఊళ్ళోనే వుండి పోవాల్సి వచ్చింది.

"తిక్క తిరిగి ఉద్యోగం వదిలి పెట్టుకుని రాకపోతాడా?" అని అమ్మమ్మ ఆలోచన.

అమ్మమ్మకి వో మనవడు పుట్టిందాకా యీ ఆలోచన దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. తరువాత తన భ్రమ దుర్భ్రమ అన్న సంగతి ఆమె గ్రహించింది.

ఇష్టం లేకపోయినా, ఇల్లూ వాకిలీ, తట్టా బుట్టా సరిజూసుకుని సర్దుకుని మనవరాలితోపాటు శివరామయ్య ఉద్యోగం ఎక్కడెక్కడ వెలిగించాడో అక్కడక్కడికీ తిరిగింది.

జిల్లాలు జిల్లాలు తిరిగింది.

మనవరాలి మొగుడి అనాచారమంతా సహించింది. తనని తాను తిట్టుకొని యీ సంబంధాన్ని తెచ్చి తన మనవరాలికి కుదిర్చిన పెద్దమనుషులను తిట్టి తృప్తిపడ్డది.

తన జీవితనాటకపు చరమాంకంలో మనవరాలినీ, మనవరాలి మొగుణ్ణీ, ఇద్దరు పిల్లలనీ వదిలిపెట్టి స్వంత ఊళ్ళో కొంపకి చేరుకుంది.

తరువాత ఆమె ఊళ్ళోవాళ్ళందరికీ శివరామయ్య అనాచారాన్ని వేనోళ్ళ చాటి చెప్పింది. అందుకే తానక్కడ వుండలేక వచ్చేశానని చెప్పింది.

పాపం చాలా మంది జాలిపడ్డారు.

"మా యమ్మ! నీ కెంతకష్టం వచ్చిపడిందే అన్నది" సూరమ్మక్క. ఇంకో మారెమ్మ "హారా! కాలమహిమ" అని ఆశ్చర్యపడ్డది.

ఊళ్ళో అంతా శివరామయ్య అనాచారం అంతా తెలిసిపోయింది.

తరువాత ముసలావిడ జీవితం తెల్లవారింది. శివరామయ్య వచ్చి కర్మకాండ అంతా యథావిధిగా జరిపించాడు. ఆమె ఎవరితోనో చెప్పిపోయిన ఆవును, ఆమె చెప్పిపోయిన ఫలాని బ్రాహ్మణుడికే దానమిప్పించాడు.

అప్పటికి రామేశానికి ఆరేళ్లు.

తరవాత శివరామయ్యకి నలుగురు పుట్టారు. రెండోవాడు నారాయణ.

మూడోది పిల్ల. ఆ పిల్ల పేరు కాంత. కాంతమ్మ ముని మనవరాలు కాంత అయింది.

ఇది ప్రస్తావన.

శివరామయ్య అవిచ్ఛిన్నంగా ముప్ఫయ్యేండ్లు ఉద్యోగం చేశాడు, కొంతమంది బాగా సంపాదించాడన్నారు. కొంతమంది సంపాదించినదంతా ఖర్చయింది అన్నారు. కొంతమంది అవుననలేదు. కాదననూలేదు.

శివరామయ్యకి చరాస్తి. ఇప్పుడు ఒక కాడ ఊడిపోయిన కళ్ళజోడు, చిన్న అక్షయపాత్రలాంటి నశ్యపు డబ్బీ - రెండు పాతకోట్లు - సీమదొకటీ - ఖద్దరుదొకటీ, ఉత్తరాలు గుచ్చుకునే కాడ, పాతవై పగుళ్ళు నిండిన డ్రాయరు, ఒక వాలు కుర్చీ, ఒక స్టాండూ, నులక మంచమూ యిత్యాదులు.

ఇక చరాస్తి.

సంతానమూ, పెళ్ళామూ. సంతానమని ఎందుకన్నానంటే పుట్టినవాళ్ళంతా వుంటే శివరామయ్యకి యింకా సుభ్భరంగా వుండేది జీవితం.

"పుత్రాలు దొంగలు, సుతులు ఋణస్థులు, కాంతలు సంసారకారణములు" అన్నాడుకదా ఆ మహానుభావుడు. అందుకని వాళ్ళను చరాస్తికింద జమకట్టాను.

ఇప్పుడు రామేశానికి పాతికేళ్ళు. తరువాత వాడు నారాయణకి ఇరవైరెండు. కాంతకి పదహారూ. బాలకి పదమూడు. రఘుకి ఎనిమిదీ.

శివరామయ్యకీ యాభై అయిదూ. సరసమ్మకి నలభై అయిదూ. శివరామయ్య పింఛనీ పుచ్చుకుని మూడేళ్ళు కావస్తున్నది. అప్పటినుంచీ స్వగ్రామంలోనే ఆయన పిల్లలతల్లి అమ్మమ్మ ద్వారా సంక్రమించిన పెంకుటింట్లో నివసించుతున్నాడు. నిజం చెప్పాలంటే బ్రతుకుతున్నాడు.

పెండ్లికెదిగిన కూతురు......

చదువులకి ఎగబడిన కొడుకులూ.

ఇల్లాలి అనారోగ్యమూ -

అతగాడికి పట్టవు.

రిటైరయిన తరవాత పండిపోయిన క్రాఫు తీయించి పిలక పెట్టించాడు. భగవద్గీత నిత్యమూ పారాయణం చేస్తాడు. ప్రతి సాయంకాలమూ అలా పార్కుకి వెళ్ళి మళ్ళీ ఇంటికి వచ్చేప్పుడు ఆలయానికి వెళ్ళి వస్తాడు.

అతగాడికి అధ్యాత్మిక చింతన ఎక్కువైంది.

"అదృష్టం భుజ్యమానోతి, కథం భవతి హే ప్రభో" అని మొదలెట్టుకుని తత్వవిచారంలో మునిగిపోతుంటాడు.

ఇపుడు త్రికాలములయందు సంధ్య వార్చుకొనటమూ, మడి కట్టుకొనటమూ అలవరచుకున్నాడు.

పాపం సరసమ్మకి మొదలు మొదలు భర్త ప్రవర్తన చాలా సంతోషం కలిగించింది. కాని ఆ సంతోషం రోజులు గడచినకొద్దీ మాయం కాసాగింది. తన కంటే కూడా భర్త యింకా నిష్ఠలు కడుక్కోవటం చూస్తుంటే ఆమెకు వొళ్ళు మండుకపొయ్యేది.

అయినా నారీధర్మ మెరింగినది కాన, నోరు నొక్కుకుని పడివుండేది.

బాల రోజూ వాళ్ళ నాన్నకి పూలు కోసి తెచ్చేది.

కాంత సంధ్యా సామాగ్రి అంతా శుభ్రంగా అమర్చేది. పెద్దవాడు

రామేశం ఇంకా చదువుకోవాలన్న ఆసక్తి కనబరచినప్పటికీ శివరామయ్య చదువు మాన్పించేశాడు.

శివరామయ్యకి ఇప్పుడనిపిస్తూ వుంటుంది. ఈ రెవిన్యూ ఇనస్పెక్టరుగిరీ చేసి రిటైరైనదానికంటే పౌరోహిత్యంలోనే బ్రతికివున్నట్లయితే తన పెద్దలు సంపాదించి ఇచ్చిపోయిన భూవసతీ వుండేది, పరపతీ వుండేది, అని.

అందుకనే రామేశం సెకండరీ గ్రేడు ట్రెయినింగు అయి చదువుకి స్వస్తి చెప్పాడు.

రెండోవాడు బి. ఏ. చదువుకుంటున్నాడు. కాంతకి చదువనగా ప్రాయమూ వచ్చి. బాల మాత్రం స్కూల్లో చేరి చదువుకుంటున్నది. అదృష్టవశాత్తూ రామేశానికి ఆ ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది. గుట్టుగా గుట్టుచెడకుండా సంసారాన్ని యీడ్చుకొస్తున్నాడు రామేశం. రామేశం యీ జీవిత రథానికి సారథి.

నౌకకు సరంగు.

ఉద్యోగంలో చేరి యేడాదైంది. ఇంతవరకూ తన జీతంలోంచి తనకొక్క కొత్త చొక్కాను కూడా కొనుక్కోలేక పోయాడు.

ప్రతినెలా ఏదైనా సాధించాలనుకుంటాడు.

కాని ప్రతినెలా అత్యక్ష్మి ఎవరోవొకరు సాధిస్తూనే వుంటారు.

ఇప్పటికి ఇంతేలే అని సరిపెట్టుకుంటాడతడు.

సుదూరంలో తీరని కోర్కెలను కొన్ని కొన్ని పెంచుకుంటున్నారు వాళ్ళు. రామేశానికి ఎన్నాళ్ళనుంచో వుంది. అమ్మకు వొక పట్టుచీర కొందామని.

నారాయణ పులెన్ పాంటు కుట్టించుకోవాలని పుట్టినప్పటి నుంచీ అనుకుంటున్నాడు.

వాళ్ళమ్మ ముద్దు చేసేప్పుడు బాలకి సిల్కు పరికిణీ, రఘుకి తెలుపురంగులో చొక్కా, బులుగురంగు లాగూ కుట్టిస్తానని చెపుతుంటుంది.

కాంతకి కష్టసుఖాలు తెలుసు.

ఆ అమ్మాయికి ఆభరణాలమీద మోజు లేదు. ఆడంబరంగా బ్రతుకుదామని ఆసక్తే లేదు.

ఆ అమ్మాయికి దేవుడు ఒక వరమిచ్చాడు.

అది తియ్యటి గొంతు.

"దేవీ మీనాక్షీ..." అనో, "వినతా సుత వాహనుడై" అనో ఎప్పుడూ పాడుకుంటూ వుంటుంది.

దిగులుగా చూసే కళ్ళు. అతృప్తి వలన వికసించటానికి యిష్టపడని యవ్వనమూ - బరువూ బాధ్యతల గురించి ఆలోచన - భవిష్యత్తును గురించిన ఆందోళన, సంసారాన్ని గురించిన చింతా, ఆ అమ్మాయిని నిద్రలోకూడా అంటిపెట్టుకునే వుంటాయి.

పేదతనం మొట్టమొదట తెచ్చిపెట్టే ఘోరమైన బాధ ఏమిటంటే యింట్లో వాళ్ళు వొకరు చెప్పింది వొకరు అర్థం చేసికోలేకపోవటం. ఒకరు చెప్పినదాన్ని వొకరు విమర్శిస్తారు. ఒకరు చేసినదాన్ని ఒకరు పరిహాసిస్తారు. సానుభూతి శూన్యం. ఆర్థికమైన యిబ్బందులు లేని సంసారాలలో వొకరిని వొకరు వోర్పుతో అర్థం చేసికోగలరు. అదే చితికిపోయిన

సంసారాల్లో విసుగుదలా, వోర్మి లేకపోవటమూ, సానుభూతి లేకపోవటమూ బాధిస్తాయి. పసితనంలో పిల్లలు ముద్దుముచ్చటలు ఎరుగరు. చీటికీ మాటికీ యింట్లో జరిగే విషయాలకి వాళ్ళ సున్నితమైన హృదయాలు భరించలేక కరుకుతనం అలవరచుకుంటాయి.

వాళ్ళు ఎవరింటికైనా వెళ్ళినప్పుడు, ఎక్కడైనా తోటిపిల్లలు ముద్దుగా చూడబడుతున్నప్పుడు విస్తుపోతారు. వీళ్ళు కనీస సుఖాలనుండి కూడా వంచితులౌతారు.

ఆ ఇంట్లో కాంతకీ, రామేశానికి వున్న అనుబంధం, తక్కినవాళ్ళ మధ్య లేదు.

రామేశాన్ని కాంత అర్థం చేసికోగలదు.

అతడు తన అందరికోసం పడే నానా బాధలను సానుభూతితో అర్థం చేసికుంటుంది.

అతడికా యింట్లో వలసిన చిన్న చిన్న సౌకర్యాలు అమర్చగలదు, అతడిమాట ఎవరూ వినిపించుకోకపోయినా.

తండ్రి భగవద్గీత చదువుకుంటుంటాడు ఎప్పుడూ.

తల్లి ఇంటిపనుల్లో సతమతమవుతూ వుంటుంది.

రామేశంతోటి మాట్లాడటానికికూడా ఎవరికీ తీరిక వుండదు, ఒక్క జీతాలు వచ్చేరోజు తప్ప.

ఎవరిమట్టుకు వాళ్లు తక్కిన రోజుల్లో నిర్లిప్తులుగానే వుంటారు.

ఒక సత్రంలో వొక రోజు కలుసుకున్న ప్రయాణీకులమల్లే కాసేపు ఏవో ముచ్చట్లు చెప్పుకుని, కొర్కెల జాబితాలు మనసులోను కాసేపు, పైకి కాసేపు చదువుకుని లేచిపోతారు పగటిపూట.

మళ్ళీ సాయంకాలానికి కలుసుకుంటారు.

మళ్ళీ అన్నీ మామూలే. ఒక్కొక్క రోజు అంతా వొక్కచోట కూడరు.

ఏదైనా ప్రత్యేకమైన విషయాలుంటే, నవ్వొచ్చేవిగాని, చిత్రమైనవిగాని, కాంతకి వచ్చి చెప్తాడు రామేశం. అదైనా ముఖాముఖి కాదు, గోడకు చెప్పినట్లుగా. ఆ అమ్మాయి అడగదు.

అతడే ఆద్యంతాలు వదిలేసి చెప్తాడు.

విసుగ్గావున్న రోజున వచ్చి కూచుని అతడే ఏదైనా పాటపాడటం మొదలెడతాడు.

అతడు ఒకటి రెండు చరణాలు, అంటాడో లేదో కాంత ఎత్తుకుని పాడుతుంది.

ఫలానిపాట చాలా బావుంటుంది, అంటాడు తనకు తాను చెప్పుకుంటున్నట్లుగా.

"అవునన్నయ్యా, అరుణకి వాళ్ల మేష్టారు యీ విధంగా చెప్పారు, కాని అలా బావుండదు. ఇట్లా పాడితేనే బావుంటుంది." అని పాడుతుంది.

అరుణ కాంతకి స్నేహితురాలు.

చిన్ననాటి చెలిమి.

బుచ్చయ్యపంతులు బళ్లో వొకటో క్లాసునుంచి ఐదో క్లాసు వరకు చదువుకున్నారు. కాంత నాలుగురోజుల కొకసారి బడికి వచ్చినా, వాళ్ళిద్దరి మధ్యా స్నేహానికి ఆ విషయం ప్రతిబంధకం కాలేకపోయింది. కాంత చదువు మానేసింది.

అరుణ ఇంకా చదువుతూనేవుంది కాలేజీలో.

ఇంటిదగ్గర సంగీతంకూడా చెప్పించుకొంటోంది.

గాత్రం చెప్పించుకునే రోజుల్లో కాంత అరుణ వాళ్ళ యింటికి రోజూ వెళ్ళేది. ఇప్పుడు అరుణ వీణ నేర్చుకుంటున్నది. అరుణావాళ్ల నాన్న ప్లీడరు! చిత్రంగా ఆయనకు ఇద్దరే ఇద్దరు సంతానం. ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల.

మగపిల్లవాడి పేరు సురేష్. బాగా నాజూకుగా వుండాలని, కొనసాగాలని తల్లి తండ్రులు ఆ పేరు పెట్టారు. బంధువుల్లో ఎవరూ పెట్టని పేరు పెట్టాలనీ, కొత్త తరహాగా వుండాలని, వాళ్ళ వాంఛ. కొంతమంది అంటారుగదా – సూరి నారాయణ అయితే, పేరంత బాగుండక బెంగాలీ సాహిత్యమంతా (అనువాదాలు) చదివి చదివి పేరు మార్చుకున్నాడని— గిట్టనివాళ్ళు తమాషాకని ఎవరైనా చెప్పుతుంటారు.

నారాయణకి ఇంటర్లో సురేష్ క్లాస్‌మేట్. అయితే సురేష్‌కి ఇంటర్ మీడియట్ పూర్తికాలేదు. గ్రూపు ప్రతి తడవా, ఇప్పుడే ఏం తొందర? అంటోంది అతడితో. అవునులే అనుకుంటాడతడు.

వాళ్ళమ్మ అంటుందికదా — గ్రహచారం బావుండలేదు. వాడేం చేస్తాడు?- అని.

ప్లీడరుగారు నవ్వేసి వూరుకుంటారు.

అరుణకి బాధగానే వుంటుంది.

కాని తమ్ముణ్ణి చదివించగలిగిన సత్తా ఆమెలో లేదు, తలనొప్పి అనీ, జలుబు చేసిందనో అతడు నిద్రపోవటానికి ప్రయత్నిస్తుంటే అరుణ ఏమీ అనటానికి వీలుండదు.

"చదువు బాబూ, పరీక్షలు దగ్గర కొస్తున్నాయి కదా? అంటుంది" అరుణ.

పాలసీలో మంచి పిక్చరుంది అక్కా, మేరలిన్ మన్రో, గ్రెగరీ పెక్ - పోయొద్దాం అంటాడు. లేకపోతే ఇంకేదో హిందీ పిక్చరు, పాటలు ఎంత బావున్నాయో అంటాడు.

అంతటితో అరుణ కూడా చదువు మానుకుంటుంది.

అక్కా తమ్ముళ్ళు సినిమాకి వేంచేస్తారు.

కాలేజీలో చదువుమనే రోజుల్లోనే పాఠాలు చెప్తున్నంటే పుస్తకాల మధ్య ఏ డిటెక్టివ్ నావలో పెట్టుకుని కాలక్షేపం చేస్తుండేవాడతను.

ఈమధ్య దేశంలో వచ్చిన గుమారం అక్కా తమ్ముళ్ళ నిద్దరని విశేషంగా ఆకర్షించింది. తత్ఫలితంగా యిద్దరిదగ్గరా వో వంద అర్థరూపాయి పాకెట్‌సైజు పుస్తకాలు చేరినయ్.

హైదరాబాదు మామయ్యగారింటికెళ్ళినప్పుడు సురేష్ డజను పుస్తకాలు పట్టుకొస్తే, అరుణ కూడా డజను పట్టుకొచ్చింది. నేస్తుల నేస్తుల సౌకర్యార్థం వో చిన్న గ్రంథాలయం ఇంట్లోనే ఏర్పాటుచేద్దామని (ఇచ్చట డిటెక్టివ్ నవలలు మాత్రమే అద్దెకివ్వబడును). తమ్ముడు ప్రపోజ్ తెచ్చినప్పుడు అక్కగార్యా ఆనందానందకంపిత హృదయారవిందయై వెంటనే వొప్పేసుకుంది.

ఇద్దరూకలసి పాత కేలండరొకటి చించి నెంబర్లు అతికించారు వాటిమీద. పట్టీ తయారుచేసి భద్రపరిచారు. ఆ

సాయంకాలమే కాంతను పిలుచుకొచ్చి అలమారా తీసి అరుణ చూపించింది పుస్తకాలను. నీ కేమైనా కావాల్సొంటే యీ పుస్తకంలో దాని పేరు వ్రాసి, పక్కనే నీ పేరు వ్రాసి తీసుకపోవచ్చు అని చెప్పింది.

"ఏ మొద్దులే అరుణా" అంది కాంత.

"అలా కాదు యీ పుస్తకం చదువుతుంటే వొళ్ళు తెలీని భయం పుడుతుంది. ప్రాణాలు ఉగ్గబట్టుకోవాల్సిందే - తప్పక చదివి తీరాలి" అని బలవంతపెట్టి కాంతకు యిచ్చింది; పేరు రాసుకుని. అరుణకి యిలా చెయ్యటం బాగానే వుంది. మర్నాడు ప్రొద్దున్నే అరుణ కాలేజీకి పోవటానికి సిద్ధపడుతుంటే కాంత వచ్చి పుస్తకం యిచ్చింది.

"చాలా బావుందికదూ" ఇంకోటి ఇవ్వనా ? అని అడిగింది అరుణ.

"ఏం బాగోలేదు. ఛా, ఛా" అంది కాంత.

అరుణ తెల్లబోయింది.

అయితే కాంత ఇంటికి వెళ్ళిపోయిన తర్వాత ఆ పుస్తకాలను చదివి ఆనందించే సారస్యం కాంతకిలేదు, అనే అభిప్రాయానికి రావటానికామె కెంతోసేపు పట్టలేదు.

ఆమెకి ఆ పుస్తకాలంటే ప్రాణసమానమని కాదు కాని అవంటే ఆమెకిష్టం.

అయితే వాళ్ళ మావయ్య వచ్చినపుడు ఆమె దెబ్బ తిన్నది.

అలమరా తీసి గొప్పగా అవీ ఇవీ మాపబోతూంటే, అతడు పరిహసించాడు. అహా ఏమి అభిరుచి అని యీసడించాడు. 'నీకు సంస్కారంలేదు' అని ఛీదరించుకున్నాడు. అరుణకి కళ్ళ నీళ్ళ పర్యంతమయింది.

కాని సురేష్ ద్వంద్వయుద్ధం చేసేవాడులా తగులుకొని విడిచిపెట్టలేదు. మావయ్యకూడా విడిచిపెట్టలేదు. అరుణకి యీ మావయ్య చిన్న మావయ్య. లోకులూ, ఇంట్లోవాళ్లూ అనుకునేపద్ధతిని మొగుడుగా చెలామణీ కాబోయే మావయ్య. ఉత్తరదేశంలో పెద్ద చదువులు చదువుతున్నాడు. అరుణకి నలుగురు మావయ్యలున్నారు. అందులో ఇతడు చిన్నవాడు.

సురేష్ అన్నాడు. "అన్నీ గోంగూర భావాలు"

మావయ్యకి కోపం వచ్చింది.

"నువ్వు బ్రెడ్ బట్టర్‌తో బ్రతికావటరా ?" అన్నాడు.

అరుణకి లోపల మావయ్య మీద వుక్రోషం పెచ్చుపెరిగిపోతున్నది. చిన్నప్పుడైతే మీదబడి రక్కివుండేది.

"కాదులే కృష్ణమూర్తి మావయ్యా, నీ వెక్కసం, నీ సంస్కారం అందరికీ వుంటుందా - వుంటే బాగుపడిపోరా" అన్నాడు సురేష్.

"నిజం" అన్నాడు కృష్ణమూర్తి

వాదన ఇలా దారీ డొంకా లేకుండా సాగటం అరుణకేమంత నచ్చలేదు. ఉత్సాహకరమైన విషయాలు వదిలేసి ఇలా డొంక తిరుగుడుగా సంభాషణ సాగటం అరుణ మనసుకి కష్టంగానే వుంది.

కాని వాళ్ళిద్దరూ అలానే వాదించుకుంటున్నారు.

చివరకు కృష్ణమూర్తి అరుణవేపు తిరిగి "ఇలాంటి చవకరకపు పుస్తకాలు చదవకు

అరుణా" అన్నాడు. "నీ ఇష్టమేమిటి మధ్య" అన్నది అరుణ, లోపల ఆ మాట లనటానికి ఇష్టంలేకపోయినా.

"నా ఇష్టం కాదా ఏమిటి?" అన్నాడు ముఖం చిట్లించిన కృష్ణమూర్తి.

అరుణకు నవ్వాలని లేకపోయినా నవ్వింది.

కృష్ణమూర్తి కూడా నవ్వాడు.

కాని చెప్పాడు.

"నా కిష్టంలేదు అది చదవటం".

అరుణ మరేం మాట్లాడలేదు.

తరువాత అతన్ని మాట్లాడించి మామూలుగా సినిమాలకీ, షికార్లకీ తిరిగినా, అరుణ మనసుకి ఏదో లోటు కనిపించినట్లయింది.

సురేష్ పంతాని కన్నట్లు మర్నాడు ఆరడజను పుస్తకాలు కొనుక్కొచ్చాడు.

మావయ్య ముందు కూచుని తెలీని పాఠం చెప్పించుకుంటున్న అరుణ ముందు తెచ్చిపడేశాడు.

మావయ్య ముఖం మలినం కావటం చూసింది అరుణ. వాటిని చూడాలనివుంది, మావయ్య మాటనూ వినాలని వుంది. మావయ్యకు లోకువగా కనపడకూడదు. అందుకని పాఠం వదిలేసి చేతికి తీసుకుని చూసింది. మావయ్య చేతులు లోంచి అమాంతం వాటిని లాక్కుని అవతలకి విసిరేశాడు. దాంతో సురేష్ రెచ్చిపోయి 'మర్యాద లేదు' అన్నాడు.

అరుణకి మావయ్య ముఖం చూస్తే నవ్వొచ్చింది. నవ్వింది.

ఆ పుస్తకాలు అక్కడే పడేసి మావయ్య లేచిపోయాడు. మావయ్య ఊరికెళ్ళిపోయిన తర్వాత అరుణకు మావయ్యను తలుచుకున్నప్పుడు కొద్దిగా దిగులైంది. నవ్వుకూడా వచ్చింది. భలే వాడు అనుకుంది.

# 3

ప్రొద్దుటినుంచీ వాతావరణ మంతా ఆహోలా వుంది. మూగయెండ కాస్తున్నది. హస్తాతూర్పర్వ ప్రకృతి మనోజ్ఞంగా వుంది. రాబోయే వసంతఋతువును సూచిస్తూ శిశిరం చెట్లపైని ఆకులు రాలుస్తున్నది. ఆకంతా రాలిపోయి స్కూలు ఆవరణలోని రెండు చిటుకేశ్వరపు చెట్లు దట్టంగా పూలు పూసి వున్నాయి.

స్కూలు విడిచిపెట్టిన తర్వాత రామేశం అలిసిపోయి చిన్నగా ఇంటి వేపు నడుస్తున్నాడు. అతడికివాళ మనసు ప్రశాంతంగా లేదు. స్కూలులో అల్లరి పిల్లలు మరీ అల్లరిచేశారు. రెచ్చిపోయి వాళ్ళను నానా మాట లన్నాడు. ఒక కుఱ్ఱవాడిని కొడితే వాడు వెక్కి వెక్కి యేడ్చాడు. రామేశానికి తర్వాత బాధనిపించింది. సరిగా స్కూలునుంచి వస్తూ బజారుదాటి పక్కవీధిలోకి మళ్ళాడో లేదో, వెనుక ఎవరో తనని పిలుస్తున్నట్లనిపించి ఆగిపోయాడు. మేష్టారూ అని సన్నటిగొంతుక అతన్ని నిలిపివేసింది. వెనక్కు తిరిగి చూశాడు.

సావిత్రి గొడుగుముడిచి చేతిలో పట్టుకుని అలసటగా వస్తున్నది. రామేశానికి చాలా ఆశ్చర్యమైంది. సావిత్రిఎవరినైనా పిలిచి మాట్లాడుతుందని అత డిదివరలో అనుకోలేదు.

సావిత్రి దగ్గరగా వచ్చింది.

"క్షమించండి,ఒక్క నిమిషం మీతో మాట్లాడాలని ఆపేను" అన్నది.

"ఫరవాలేదు" అన్నాడు రామేశం జరుగ్గా.

అలాగే నడక సాగించారు.

"నా కేదైనా కుటుంబాలుండే సానన ఓ యిల్లు మాట్లాడిపెట్టగలరా?" అన్నది సావిత్రి.

"మీరా కి సహగోష్ఠులగురించి యెక్కడ వుంటున్నారు?" అడిగాడు రామేశం.

"ఎక్కడా, అడవిలో, అద్దైనా నయం. పాడుపోగు" అన్నది సావిత్రి నవ్వులో దాగిన విషాదభావాన్ని వ్యక్తపరుస్తూ.

"ఏమండీ ఎక్కడ తీసుకున్నా రేమిటి యిల్లు".

"చెప్పాను గా. మూర్ఖులతో బాటు నయిన గోడున మా స్నేహితురాలో కామె యీ వూళ్ళో వుంటే, వాళ్ళింటికి వెళుతూ, ఆ వీధిలో చూశాను, 'ఈ గది అద్దెకివ్వబడును' అని. వాళ్ళు పాటైంది. అన్నీ ఆలోచించకుండా పదిహేను పాయలు అడ్వాన్సుగా కూడా యిచ్చాను. తరువాత తెలిసింది. మంచి కొంప కాదని" అన్నది సావిత్రి.

"ఏం?" అన్నాడు రామేశం.

"ఏమని చెప్పను? ఆ వాతావరణంలో ప్రశాంతంగా జీవించడాని కాసాగ్రం లేదు.

"ఎక్కడండీ ఆ గది?"

సావిత్రి చెప్పింది.

రామేశం గుటుక్కుమన్నాడు.

"సరే చూస్తాను లెండి" అన్నాడు.

"చూస్తానంటే కాదు" అన్నది సావిత్రి

"శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు రామేశం.

"చూడండీ, మేము అడుగడుక్కూ ఇలాంటి వెన్నో ఎదుర్కోవాలి. ఎక్కడికక్కడ సమస్యలూ - సందేహాలూ - వీటన్నిటినీ ఎదుర్కోవాలి. ఎంత ప్రయత్నించినా స్వశక్తిమీద ఆధారపడి సుఖజీవనాన్ని ఆశించలేము. అప్పుడే ఎవరినో వొకరిని యీ కాస్త సాయం చెయ్యండీ - అని అర్థించాల్సి వస్తున్నది" సావిత్రి బాధాపూరితస్వరంతో భూమికేసి చూస్తూ నిలుచుండి పోయింది.

ప్రప్రథమంగా మాట్లాడినప్పుడే స్వచ్ఛంగా మాట్లాడగలిగిన ప్రవృత్తి చూసి రామేశం లోలోపల చాలాసంతోషించాడు.

"అలాగేనండి" అన్నాడు రామేశం.

"ఇది మాత్రం మనసులో వుంచుకోండి" అని సావిత్రి నెమ్మదిగా కదిలి పోయింది.

వెళ్లిపోతున్న ఆమెవేపు కొంతసేపు నిదానంగా చూసి రామేశం కూడా ముందుకు నడిచాడు.

వీధిలో ఇంటి ముందు కొస్తుంటే తమ్ముడు బాడ్మింటన్ బ్యాట్ వూపుకుంటూ సరదాగా వాకిట దాటి యెదురొచ్చాడు.

రామేశం తమ్ముడివేపు వుదాసీనతతో చూశాడు.

నారాయణ అన్నను గమనించనే లేదు.

రామేశానికి ఒక్కొక్కసారి తమ్ముణ్ణి చూస్తే జాలి కలుగుతుంది. మరొక్కసారి అతడి బాధ్యత తెలుసుకోలేని ప్రకృతిని గూర్చిన చింత కలుగుతుంది.

సావిత్రిని గురించి ఆలోచిస్తూ యింట్లోకి వెళ్ళాడు. సావిత్రిని యింకా

యెక్కడ తెలిసికోనలేక పోయినందుకు అతని మనసుకి కష్టమనిపించింది. ఇంట్లోకి వెళ్ళేసరికి చెల్లెలు ఏకాంతసేవా అనే కృతి వల్లించుకొంటున్నది.

పుస్తకాలు విసిరేసి అలాగే సామాన్లు పెట్టుకునే పెట్టె మీద కూర్చుండి పోయాడు.

చెల్లెలు గొంతులోని స్వర [illegible] అతడి మానసికోద్వేగాన్ని శాంతింపచేస్తున్నది. అనుకున్నాడు — తనకు లోటేమిటి? ఈ మాత్రపు ఆర్థిక సంబంధమైన కష్టాలు అందరికీ వుంటూనే వుంటాయి. లక్షణంగా తల్లి, తండ్రి, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు — ఇంకా ఏంకావాలి? ఈ నిస్పృహ మనసెందుకిలా [illegible]? ఏమిటో వెలితి తనను బాధిస్తున్నది. ఎందుకు బాధించాలి? తనకు కావలసినది తనకు దొరకటంలేదు. ఎంత ప్రయత్నించినా అసంతృప్తి ఎక్కువగా అనిపిస్తున్నది. అయితే ఎక్కడికి దీని అంత్యం. కోరికలు తీరకపోతే వెనుకడుగు [illegible]? అయినా అన్ని కోరికలు తాను తీర్చుకోలేడు. కనీస సుఖాలు కోరుకుంటున్నాడు. వాటి [illegible] వంచితుడవుతున్నాడు. అందుకే యీ వెలితి. అందుకే యీ బాధ. ఇంకా ఎక్కువ [illegible] పరిస్థితులు అనుకూలించలేదు. తనతో చిన్నప్పుడు వీధి బడిలోనూ, హైస్కూలులోనూ చదివినవాళ్ళు జీవితంలో వున్నతంగా బ్రతుకుతున్నారు. వాళ్ళేమీ యోగ్యులు కారు కాని, వాళ్ళ జీవితంలోని సుఖాలను, సౌకర్యాలను కాని, తన జీవితంలోని వెలితికి పోల్చుకుంటే ఒకరకమైన బాధ కలుగుతుంది. మళ్ళీ అతనిలో అప్పుడప్పుడు వోకరకమైన తృప్తి, భవిష్యత్తుమీద విశ్వాసమూ, కలలు కనాలనే వాంఛ, పుట్టుకొస్తుంటాయి.

[illegible] వెంటనే లేచి పెట్టెలోంచి నవల తీసుకున్నాడు. ఈ మధ్య పది రోజులనుంచీ అందులో ఏమీ వ్రాయటం లేదు. పది రోజులనుంచీ కాగితాలు ఖాళీగా వున్నాయి. పది రోజులక్రితం వ్రాసిన కాగితంలో ఇలా వ్రాశాడు.

“ఇవాళ సాయంత్రం [illegible] క్రొత్త సినిమా [illegible]. క్రొత్తగా సావిత్రి అనే [illegible] అయింది. [illegible] చేసుకున్నాను. ఇకనుంచీ [illegible] క్రొత్త [illegible].

ఆమెకు ఇష్టమైన [illegible]. [illegible] ఆకర్షణీయంగానే వుంది.”

ఆ రోజు డైరీలోని చివరి వాక్యం ఎలా వ్రాసినందుకు సిగ్గుపడ్డాడు. [illegible] అని అనుకున్నాడు.

మళ్ళీ ఇవాళ కాగితం మీద యిలా వ్రాశాడు: “నా కలల [illegible] నుంచి వస్తూంటే సావిత్రి కనిపించింది. [illegible] వాకిటిలోనూ, [illegible], [illegible] వెదజల్లుతున్నది. [illegible] ఇంకా [illegible].”

[illegible] ఇంటికొచ్చేసరికి [illegible]. ఇంటికొచ్చేసరికి [illegible] ఏకాంతసేవా అని పాడుతున్నది. మనసుకి చెప్పలేని బలం కలిగింది. భవిష్యత్తుమీద విశ్వాసమూ,

ఏదో సాధించగలనన్న ధైర్యమూ, మనసుకి తృప్తీ కలిగినాయి.

అతడు వ్రాసుకోటం అయిపోగానే ప్రక్కనే నిలుచుని కాంత ప్రశ్నించింది.

"రోజూ ఏం వ్రాసుకుంటావన్నయ్యా. ప్రతి రోజూ ఏం విశేషాలుంటాయి. నేనైతే ఒక్క ముక్క కూడా వ్రాయనే! నిద్రలేచాను, కాఫీ తాగాను, స్కూలుకి పోతాను అని వ్రాస్తావేమో" అని నవ్వింది.

రామేశం కూడా నవ్వాడు.

"ఇవాళ ఓ విశేష ముందిలే" అన్నాడు రామేశం. కాంత అదేమిటని అడగకముందే "మొన్న నీకు చెప్పానుకదూ — స్కూలుకి ఓ పంతులమ్మ వచ్చిందని. ఆవిడకి ఎక్కడైనా యిల్లు చూసిపెట్టాలట. ఇంతదాకా అప్పుడే అడిగింది. అడిగిందంటే ప్రార్థించిందన్నమాట".

"పాపం! అయితే యిది కాస్తా [illegible] చేసుకున్నావన్నమాట". కాంత నవ్వుని ఆపుకుంది.

"కాదులే — పాపం ఆ స్త్రీ [illegible] ముందు [illegible] వుందికదూ. [illegible] అన్నది [illegible] కదూ" అన్నాడు రామేశం.

"వాళ్ళివ్వన్నయ్యా, అది వాళ్ళు ఇచ్చినా చాలా చెబుతాను. అయినా నన్నడక్కుంటానులే" అన్నది కాంత.

దీపాలు ముట్టించడానికి వెళ్ళిపోయింది.

దీపం ముట్టించి కాంత దండం పెట్టుకుంది.

రామేశం చూశాడు.

అతడికి నవ్వొచ్చింది.

చిన్నతనంలో తానుకూడా దీపం ముట్టించేసరికి [illegible] దండం పెట్టుకునే వాడు.

ఇంతలో ప్రక్కగదిలోంచి తండ్రి మాట విన్పించింది.

ఆయన రఘుని కసురుకుంటున్నాడు.

వాడు స్కూలు ఎక్స్‌కర్షన్ వెళతాట్ట. నాలుగురోజులనుంచీ పీడిస్తున్నాడు.

తండ్రి రెండు మూడు రోజులనుంచీ ఓపికగా వాడు చెప్పిందంతా వింటున్నాడు. కాని ఇవాళ ఆయన ఏదో చదువుకుంటుంటే వచ్చి అడిగేసరికి ఆయనకు కోపమొచ్చింది. వాడు అడగక ఏం చేస్తాడు. రేపే చివరి రోజట. అందుకని వాడికొంచెం వాడిగా.

ఆయన భగవద్గీత చదువుకుంటూ పరమాత్మ ఏం చెప్పాడు అన్న విచారంలో మునిగిపోయివుంటే, ఐహిక బంధనాలను తాత్కాలికంగానైనా మరచిపోవాలని ప్రయత్నిస్తుంటే, మధ్య తన ధ్యానానికి భంగం కలుగజేసినందుకు విసుక్కున్నాడు.

మూకం కరోతి వాచాలం
పంగుం లంఘయతే గిరిం...

రఘు [illegible] లంకించుకున్నాడు.

వాడికి తండ్రి రెండు తగిలించినందుకు.

రామేశం వెళ్ళి వాణ్ణి యివతలకి తీసుకొచ్చాడు,

వాడికి యీ మాత్రం అన్నా చిక్కటంతో ఇంకాస్త ఎక్కువ ఏడ్చాడు. సంగంమీదికి తల్లికూడా ప్రవేశించటంతో వాడి ఉత్సాహం అధికమైంది.

"ఈ సంసారం నేను చెయ్యలేను, వెంకటరమణా" అనుకుంటాడు పెద్దగానే.

రామేశానికి విసుగైంది.

ఒక చిన్న విషయానికి ఇంత అశాంతి ఎందుకు చెలరేగాలో అతనికి అంతు పట్టడం లేదు.

తమ్ముణ్ణి బుజ్జగించి అడిగాడు.

'సరే, రేపు నేను కొనుక్కుంటానులే' అన్నాడు. [illegible] మూలకుపోయి కూచున్నాడు.

తల్లి అడిగింది ఇప్పుడు—

"ఎందుకురా వాడు అనుకున్నట్లే [illegible] చేయకటం?"

రామేశం విసుక్కున్నాడు.

"ఏమిటేమిటే అమ్మా! నేను కొనుక్కుంటానన్నా—"

"వెంకటులక్ష్మా" అనుకుంటూ, తల్లి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

బాల [illegible] వచ్చి [illegible] మాటాడు [illegible].

ఎందుకు వచ్చిందో - ఆ [illegible] అంతా [illegible] అతనికి [illegible].

"ఇవాళ నేను బజారుకేసు వెళ్ళి [illegible]. రేపు [illegible] తెచ్చి [illegible]" అన్నాడు.

బాల వెళ్ళిపోయింది.

"సంవత్సరానికి [illegible] యింకా [illegible] నెల [illegible] ఖర్చు" అంది.

తొమ్మిదింటికి నాన్నగారు వచ్చారు [illegible].

[illegible] చేతికేసుకుని వచ్చి [illegible] బయటికే వెళ్ళాడు.

[illegible] "చూడు [illegible] నాన్న [illegible]" అన్నాడు.

[illegible]

[illegible] వెళ్ళిపోయాడు.

రామేశం [illegible]

[illegible] అన్నాయి. [illegible]

[illegible] నిండి పోయాయి. [ఇంకా వుంది.]

A *Fine Collection of*

**Mahakavi Sri Sri's POEMS**

# THREE CHEERS FOR MAN

**Rendered for the first time into English.**

**Postage Extra**

**Rs. 2/-**

*Copies Available at:*

**Visalaandhra Publishing House,**

**VIJAYAWADA-2.**

# నాగరికుడు

చలసాని ప్రసాదరావు

ఇవ్వాళ ఒకటో తారీఖు...!

కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న గిన ఘడి!

ప్రస్తుతం జేబు నిండుగా ఉంది!

మనసుకూడా నిండుగా ఉంది! సంధ్యాసమయపు చల్లగాలి శరీరానికి గిలిగింతలు పెడుతూంది! అసలే చలి కాలమేమో, అందుకుతోడు నేను తొడుక్కున్న సాక్కు సిల్కు షర్టు కలిసి క్రమంగా మనసుకూడా ప్రారంభం కాసాగింది? రోజూ యీ టైముకి యింటి వద్ద వుండాల్సిందసలు! కాని యీ రోజు అన్ని రోజుల లాంటిది కాదు...! ఇవ్వాళ ఒకటో తారీఖాయె! ఈ ఒక్కరోజున్నా కాస్త అటూ యిటూ తిరిగి ఎంతో కొంత ఖర్చుచేస్తేగాని యింటికి పోబుద్ధి వేయదు! అయినా బ్రహ్మచారులు వెంటనే రాత్రే యింటికి పోవాలని ప్రయత్నించడమం అర్థంలేని పనంటాడు గోపాలం! ఆ మాటకొస్తే గోపాలానికేం! వాడెన్ని కబుర్లయినా చెప్పగలడు! కడుపు నిండుగా ఉండాలేగాని, వంకాయలో ఏ విటమిన్లున్నాయనే దగ్గర ప్రారంభించి అమెరికాలో ఎన్ని వీశల ప్రజాస్వామ్యం అమలులో ఉందనేదాకా గంటల తరబడి అనర్గళంగా ఉపన్యసించగలడు! అందుకనే గోపాలానికి మిత్రులు అంటుగట్టిన వాక్కు రాయుడనే బిరుదు నేటికీ సార్థక నా సహాయంగానే నిలచిపోయింది! పాపం ఆముసలాయన ఎలా భరిస్తున్నాడో తీర్ణి! ఆయన స్థితిచూస్తే జాలేస్తుంది! ఒకప్పుడు బాగా బ్రతికినవాడు! కాలక్రమాన సంతానత్వాలతో పాటు ఆదాయంకూడా క్షీణించి ప్రస్తుతం కొడుకుమీదే ఆధారపడవలసిన స్థితిలో ఉన్నవాడు! ఆయనగారికి ఏకైకాధారం గోపాలం! కాని, గోపాలానికి మాత్రం కుటుంబనియమాలేం పట్టవు! కుటుంబ బాధ్యతలంటే గోపాలం సృష్టిలో ముప్పావులా సుస్తుగా భోం చేయటం వరకేనాయె! అందుకే నాకు సామాన్యంగా గోపాలం అంటే కోపం! సాధ్యమయినంతవరకూ దూరంగానే ఉంటాను! కాని గోపాలం అలాంటి వాటిని లెక్కచేసే రకంగాదు; అతని కసలు మొహమాటమనేదే లేదాయె! ప్రతిరోజూ మేమంతా హోటలుకు పోయే సమయానికి గుమ్మందగ్గర గోపాలం తయారు! అందులోనూ గోపాలానికి ఆకలి అసలే మరీ లావుకూడాను! వాణ్ణి మోపలేక మా దుంప తెగుతూ ఉంటుంది.

ఎప్పుడన్నా గోపాలం అక్కడ కనుపించకపోతే మేం అదృష్టవంతులమన్న మాటే! అలాంటి సమయాల్లో గోపాలం సామాన్యంగా హోటల్లోనే ఇంకెవరన్నా స్నేహితుల్లో వాక్కు కోడుగా ప్రత్యక్షమవుతాడు! గోపాలానికి

స్నేహితులకేం కొదవలేదు! అందులోను పెద్ద ఉద్యోగస్తులతోనూ, గొప్పవాళ్ళతోనూ ఏదో ఒకవిధంగా పరిచయం సంపాదించుకోవటం గోపాలానికి హాబీ లాంటిది! ఈ విద్యలోకూడా గోపాలం అఖండుడు కాదని ఎవరూ అనలేరు! అంత నేర్పు ఉండడానికి! యిన్ని ఉన్నా కుటుంబాన్ని గురించిన చింత అతనికి లేకపోవడమే మాకందరికీ బాధాకరంగా ఉండేది! అందుకు కారణం గోపాలంమీద సానుభూతి కాదని మాకందరికీ తెలుసు! నిజానికి గోపాలం అంటే మా కెవరికీ ఏమాత్రం సానుభూతి లేని మాట వాస్తవమే! కాని గోపాలం తండ్రిపట్ల మాకు గల గౌరవాభిమానాలే గోపాలంపట్ల శ్రద్ధ తీసుకునేట్టు చేశాయి. చెట్టంత కొడుకు వీడు వుండికూడా పాపం ఆయన ఈ వృద్ధాప్యంలో సైతం శారీరకంగానూ, మానసికంగానూ కూడా బాధపడుతూవుంటే, కనిపించినపుడల్లా మాతో తనగోడు చెప్పుకొని నీరవుతూంటే చిరకాలంగా సంబంధాలున్న మేమెలా ఊరుకోగలం! అందుకనే గోపాలాన్ని అనేకసార్లు హెచ్చరించాం! ఏదన్నా ఉద్యోగంలో చేరమని! కాని గోపాలం పట్టించుకొన్నట్టు లేదు. అందుకు మేం ఆశ్చర్యపడనూ లేదు. ఆశ్చర్యపడాల్సిన అవసరమూ లేదు! చదువుకునే రోజుల్నుంచీకూడా గోపాలాన్నెరిగిన మాకందరికీ గోపాలం ఎలాంటివాడో బాగా తెలుసు! అందుకనే చివరికి మేమే నలుగురం కలసి ప్రయత్నంచేసి ఎలాగైతేనేం గుమాస్తా ఉద్యోగం సంపాదించి ఆ సంగతి గోపాలంతో చెప్పినప్పుడు 'ఆఁ నేనా! గుమాస్తాగానా!' అని నివ్వెరయిపో ప్రశ్నించి, తన కవసరంలేదని నిరాకరించినప్పుడుగాని, తర్వాత తండ్రి బలవంతంమీద ఆఉద్యోగంలో చేరినపుడు గాని మేమెవరం ఆశ్చర్యపడలేదు.

గోపాలాన్ని ఉద్యోగంలో చేర్పించి రెండు మాసాలవుతూంది. ఉద్యోగంలో చేరిన తర్వాత తరచు కనుపించడమే మానేశాడు! మాకెక్కడా హోటళ్లకి పోయేటప్పుడు ఏ మూలనుంచో 'హలో' అంటూ ప్రత్యక్షమవుతాడోనని భయపడాల్సిన అవసరం లేకపోయింది! నాకుమట్టుకు నాకు గోపాలం కనుపించి నెల రోజులవుతూంది. ఎందువల్లో కనుపించటం లేదో! బహుశా, పెందరాళే యింటికిపోయి సుష్టుగా భోంచేసి, ముసుగు తన్నుతూ ఉండి ఉంటాడు! అందులోనూ ఆకలి ఆసతే లావుకూడాను. ఈసారి కనిపిస్తే అడగాలి! పెందరాళే యింటికి పోవద్దంటూడా యీ సారి? చూద్దాం. అనుభవిస్తున్నాడుగదా మరి, స్వయంగా!

ఉలిక్కిపడ్డాను!

హారన్ మ్రోగించుకుంటూ ప్రక్కనుంచే దూసుకుపోయిందో కారు! నా పరధ్యానానికి నన్నే తిట్టుకొంటూ ప్రక్కకి తప్పుకుని తలెత్తిచూచాను! సెంటర్దాకా వచ్చేశానప్పుడే! ఇప్పుడెటు పోవటం? అటు యింటికా? ఇటు పార్కుకా? అయినా యివ్వాళ ఒకటో తారీఖాయె! అప్పుడే యింటికి పోవడమేమిటి? అయినా యిప్పుడేపోయిమాత్రం చేసేదేమిటి? యింక పార్కులో మాత్రం ఏముంది! ముక్కుతున్న చలిచాలక ఇంకా అక్కడికిపోవడం అర్ధంలేనిపని! పోనీ! సినిమాకెడితే! చూసి చాలారోజులయింది

కూడాను. యిప్పుడు అశ్రద్ధచేస్తే తర్వాత ఆ జేబులో డబ్బా ఉండదు. మాసే అవకాశమూ ఉండదు. అరే! అప్పుడే ఆరుంబావయిందే! ఫర్వాలేదు. ఇంకా పదిహేను నిమిషాలుంది! ఈలోగా కాస్త కాఫీ త్రాగి రావచ్చు!

అప్రయత్నంగానే కాళ్లు హోటలు వైపు దారితీశాయి!

చిరపరచితమైన గుమ్మంలో అడుగు పెట్టబోతున్నాను! పరధ్యానంగా వున్నానేమో, భుజంమీద బలమయిన చేయి పడటంతో ఉలిక్కిపడ్డాను! అయినా క్షణంలో తమాయించుకొని యింత చనువుగా భుజంమీద చేయివేసిందెవరా? అని వెనుదిరిగి చూశాను!

“బహుకాల దర్శనాలు!” అంటూ చిరునవ్వులో ప్రత్యక్షమయ్యాడు గోపాలం!

చాలారోజుల తర్వాత కలుసుకొన్నందుకు ఆనందిస్తూ చిరునవ్వుతోనే సమాధానమిచ్చి లోపలికి దారితీశాను! గోపాలం అనుసరించాడు!

“ఈ మధ్య తమరి దర్శనాలే కరువవుతున్నాయే!” అంటూ టేబుల్ ముందు చేరటం ఆలస్యంగా తన సహజ ధోరణిలో ప్రారంభించాడు గోపాలం! “గత నాలుగు రోజుల్నించీనూ కనీసం అరడజను సార్లయినా నీకోసం వచ్చి వుంటాను!” అని ఎందుకో ఊహించుకోమన్నట్లుగా ఆగాడు గోపాలం!

“అలాగా” అని ఊరుకున్నాను నేను.

“నా నిర్లిప్తతను చూసి తిరిగి అడిగాడు గోపాలం!

“ఎన్నడూ లేనిది నీవిన్ని రోజులు ఎక్కడికి పోయినట్టు?”

“ఎబ్బే ఏమీ లేదు! అనుకోకుండా ఊరికి పోవాల్సొచ్చింది! అంతే! విశేషమేమీ లేదు!”

“అలాగా!” అన్నాడు గోపాలం నిర్లక్ష్యంగా.

“అదలా ఉండనీ! ఎన్నడూ లేనిది నీవు నాకోసం ఎందుకు తిరగవలసి వచ్చింది?” అనడిగాను నేను!

“అదే చెపుతున్నాను! యివ్వాళ నీవు ఆఫీసుకు వెళ్లావా?”

“యివ్వాళ ఏమిటి? రోజూ వెడుతూనే ఉన్నాను!”

“అయితే మీ ఆఫీసులో ఒక ఉద్యోగం ఖాళీగా ఉన్న సంగతి నీకు తెలిసేఉంటుంది!”

“తెలిస్తే?”

“ఆ విషయంలో నీవు నాకు సాయం చేయాలి!”

“ఏ విషయంలో?”

“అదే! ఆ ఉద్యోగం విషయంలోనే!”

“అంటే?”

“నేనా ఉద్యోగానికి అప్లికేషను పెడుతున్నాను! ఈ సందర్భంలో నీ మాట సాయం నాకెంతో తోడ్పడుతుంది!”

“నా సాయం సంగతలా ఉంచు! ఇంతకీ నీకీ వుద్యోగం ఎందుకు?”

“ఎందుకేమిటి? ఉద్యోగాలు చేసేదెందుకో నీకు వేరే చెప్పాలా? ఉద్యోగం చేస్తున్న నీకు తెలియదా?”

“తెలుసునయ్యా మహానుభావా! నాకా సంగతి బాగానే తెలుసు! కాని నీవిప్పుడు చేస్తున్న నిక్షేపంలాంటి ఉద్యోగం వుండగా నీకీ ప్రయత్నా

లెందుకు? అనే నే నడుగుతూంటే!" అన్నాను చిరాకుగా.

"నాతో పరిహాసాలాడుతున్నావా?" అన్నాడు గోపాలం సందేహంగా.

"పరిహాసాలాడేందుకు తగినంత తీరిక గాని, ఓపిక గాని నాకు లేదు."

"అయితే నా విషయం నీకు తెలియదనే అనుకోవాలన్నమాట?"

"ఏ విషయం?" అడిగాను నేను విసుగ్గా!

"అదే! నేను ఉద్యోగం మానుకున్న విషయం!" అన్నాడు గోపాలం నిర్లిప్తతతో!

నిర్ఘాంతపోయాను నేను!

"ఏమిటీ? ఉద్యోగం మానేశావా?" అడిగాను నమ్మలేకపోతూ!

"అవును మానేశాను! అంతకన్నా గత్యంతరం కనిపించలేదు! అసలు మొదట్నుంచీ కూడా నాకా ఉద్యోగమంటే యిష్టంలేదు! ఆ సంగతి నీకెప్పుడే చెప్పాను కూడాను! దానికితోడు మా డిప్యూటీ ఏదో ఒక తప్పు పట్టుకుంటూనే ఉంటాడు! ఎకౌంటులో కొంచెం తేడా కనిపించిందని మొన్నటికి మొన్న ఏమేమో వాగాడు!" ఆ సమయంలో తెలిసిన వారెవరన్నా అటు వచ్చినట్లయితే ఎంత అవమానం!

"అందుకని మానేశావన్నమాట!"

"మరేం చేయను! పగలస్తమానం కష్టపడి చేస్తే వాడిచ్చేదెంత! వెధవది, ఆ ముష్టి డెబ్భయి రూపాయల కోసం ఏ బీ సీ డీ లన్నా రాని ఆ కుంక చెప్పు చేతల్లో ఉండటం నావల్లగాదు! పైగా గుమాస్తా ఉద్యోగమంటే నలుగుర్లోనూ తల వంపులు కూడాను!" అన్నాడు గోపాలం ఆవేశంతో.

"వాడు కుంకయితే కావచ్చు! కాని గుమాస్తా ఉద్యోగం అవమానకరమని నీవనుకోవటం సరిగాదు. ఆ మాటకొస్తే, నేను మాత్రం గుమాస్తా ఉద్యోగం కాదా చేస్తున్నది!"

"కాదని నేనన్నానా? కాని, నీది గవర్న్మెంటు ఉద్యోగమాయె. అందుకే గా, నేను మీ ఆఫీసులో చేరాలనుకుంటున్నది!" అన్నాడు గోపాలం.

నాకింక గోపాలానికి చెప్పబూనటం దండుగనిపించింది. ఏవేవో ఊహించుకొని, అంతకుముందే ఒక నిశ్చయానికి వచ్చినవాడికి ఎవరుమాత్రం ఏం చెప్పగలరు? అనుకొనే మౌనంగా ఊరుకున్నాను.

నా మౌనాన్ని చూసి, తిరిగి గోపాలం అడిగాడు. "అయితే, నేను మానుకోవటం నీ కిష్టం లేదన్నమాట!"

"అవును. అక్కగాలా! నీవు చేసిన దానికన్నా తెలివితక్కువ పని మరొకటుండబోదు. ఈ రోజుల్లో ఉద్యోగాలంటే, హోటళ్లలో కాఫీలాగా తేలిగ్గా దొరికేవని నీ ఉద్దేశంలాఉంది! ఉద్యోగం మానుకోవటం ద్వారా నీవేదో స్వాతంత్ర్యుడవయిపోయినట్లు భావిస్తున్నావులాఉంది. కాని గోపాలం యీ విషయంలో నీవు కేవలం లోతు తెలియని ఈతగాడివి?"

"సరే! జరిగిందేదో జరిగిపోయింది! యిప్పుడే నీవు నన్ను తిట్టి ప్రయోజనం లేదు! యింతకీ మరి మీ ఆఫీసులో ఉద్యోగం విషయం ఏమంటావు?" అంటూ ప్రసంగాన్ని మళ్ళించాడు గోపాలం!

ఏం కావాలి సార్! అంటూ యింతలో సర్వరు వచ్చాడు! గోపాలం వంక చూశాను! గోడకున్న కాలెండరు బొమ్మను తదేకంగా చూస్తున్నాడు. చిత్రకళా ప్రదర్శనంలో ఉత్తమచిత్రాన్ని నిర్ణయించబోతున్న జడ్జీలా!

"రెండు కాఫీ" అని చెప్పి పంపాక గాని గోపాలం ఆ చిత్రాన్ని పరిశీలించడం మానలేదు. సర్వరు అటు పోగానే తిరిగి తన మామూలు ధోరణిలో అడిగాడు! "మరి మీ ఆఫీసులో ఉద్యోగం మాటేమిటి?"

"ఈ ఉద్యోగం సంగతి నీకెవరు చెప్పారు?"

"ఎవరో చెప్పేదేమిటి? నీ కోక్లార్కు జగన్నాథమే చెప్పాడు."

"ఓహో! అతడా! నీకు కొత్తగా పరిచయమయ్యాడుగదూ! ఆయనగారికి నీసంగతి సరిగా తెలియక నీ కబుర్లు విని, నువ్వేదో పెద్ద చదువులు చదివి ఉంటావనుకున్నాడేమో! పాపం నిన్నవసరంగా ఆశలోకి దింపాడు!"

"అదేం:"

"అవును గోపాలం నీకిన్ని సంగతులు తెలుసుగదా! మరి మాది గవర్నమెంటు ఆఫీసు అనీ, అందులో నీకు ఉద్యోగం దొరకాలంటే నీవు కనీసం మెట్రిక్యులేషను ప్యాసయి ఉండాలనీ నీకు తెలీదా?" అనడిగాను నేను.

తెల్లబోయాడు గోపాలం!

"అయితే నా కాశలేదన్నమాటేనా?" అన్నాడెలాగో చివరికి.

"అంతే! అంతకన్నా చేయదగ్గదిలేదు" అంటూనే సర్వరు తెచ్చిన కాఫీ త్రాగి, బిల్లు తీసుకుని లేచాను. గోపాలం కూడా పూర్తిచేసి లేచాడు!

హోటల్లోంచి బయటికొచ్చి గుమ్మం దగ్గర షాపులో రెండు కిళ్ళీలకు ఆర్డరిచ్చి చుట్టుప్రక్కలు పరిశీలించసాగాను. చీకట్లు పూర్తిగా కమ్ముకున్నాయి. రోడ్డంతా జనం వచ్చిపోయే కార్లతో, రిక్షాలతో సందడిగా ఉంది. యిద్దరు ముగ్గురు బిచ్చగాళ్లు డబ్బాలతో మీదపడితే వాళ్ళనెలాగో వదిలించుకొంటే, యింతలో "పాలిష్ సార్!" అంటూ యింకో కుర్రాడు తయారు! "ఒక్కణా చాలు సార్ అద్దంలా పాలిష్ చేస్తాను!" అంటూ ఆశగా ముందుకు వచ్చాడు కుర్రవాడు! చిరిగినవయినా శుభ్రంగా ఉతికిన బట్టలతో చాలా చలాకీగా ఉన్నాడు కుర్రాడు! నా బూట్లవంక చూసుకొన్నాను! ఉదయమే పాలిష్ చేసిన బూట్లు శుభ్రంగా మెరుస్తున్నాయి! అందువల్ల అవసరం లేదన్నాను! నిరాశతో వెనుదిరిగాడు కుర్రాడు! గోపాలం పాదాలవంక చూశాడు! వాడి కళ్లు ఆశతో మెరిశాయి! గోపాలం చెప్పులు దుమ్ముకొట్టుకుని, ఒకమూల తోలూడి జీర్ణస్థితిలో ఉన్నాయి! కుర్రాడు గోపాలం కాళ్ళదగ్గర సంచీ దింపుకొని "ఒక్కణా చాలు సార్ శుభ్రంగా పాలిష్ చేస్తాను!" అంటూ చెప్పులు ఊడదీయబోయాడు! "ఛీ! కాలిమీద చేయివేసుకు! అవతలకి పో!" అంటూ విదిలించుకొన్నాడు గోపాలం ఆగ్రహంతో! ఆ విదిలింపుకు బోర్లపడ్డాడు కుర్రవాడు! అయినా అది గమనించకుండా "ఛీ!... ఎక్కడ చూసినా

వీళ్ళు! పోలీస్! పోలీస్ అంటూ ఒకటే గోల! అయినా మనకన్నా వీళ్ళే నయం! ఎంత లేకన్నా రోజుకు రెండు మూడు రూపాయలు కళ్ళజూస్తారు!" అన్నాడు గోపాలం నావంక తిరిగి! ఏమంటూ కన్నీళ్లు!

నాకు మండుకు వచ్చింది గోపాలం ప్రవర్తనకి! "వాడిమీదా, వీడిమీదా కాఫీకోసం పడే నీకన్నా, వీడే నయం కదా!" అనబోయి తమాయించుకొని నిదానంగా అన్నాను! "అయితే గోపాలం నీ లెక్కప్రకారం ఈ పని మీద రోజుకి రెండు మూడు రూపాయలొస్తాయి! యీ పనిలో అయితే ఒకడి క్రింద పడి ఉండనక్కరలేదు! కాలేజీ డిగ్రీల సమస్య అసలే లేదు! కావాలంటే అవసరమయిన సామాన్లు యిప్పుడే కొని యిస్తాను! మరి నీవు స్వతంత్రంగా ఒకరిని పీడించనక్కరలేకుండా బ్రతకటానికి ఎందుకు ప్రయత్నించరాదు?" అన్నాను నేను కోపంతో!

నిర్ఘాంతపోయాడు గోపాలం! కొద్ది క్షణాలవరకూ అలాగే నిశ్చేష్టుడై నావంక చూస్తూ నిలుచుండిపోయాడు! అంతలోనే తేరుకొని నావంక చురచుర చూస్తూ అప్పుడే హోటలు గుమ్మం ఎక్కుతున్న ఎవర్నో పిలుస్తూ అటే పోయాడు. "ఏమండోయ్! బహుకాల దర్శనాలు" అంటూ మళ్ళీ పాత వృత్తిలో పడ్డాడు గోపాలం!...



## వేర అక్కాపావ

ఈమె మాస్కో వెరైటీ థియేటర్‌కు చెందిన కళాకారిణి. ఈమె మాస్కోలో నివసించుచున్న శ్రీ గిడుతూరి సూర్యం వద్ద, ఆంధ్ర జానపద నృత్యరీతులను నేర్చుకొని ప్రదర్శించింది.

## ఆశీస్సులు

జన్మదినోత్సవ కానుకగా అభ్యుదయకు రు 25-0-0 విరాళమిచ్చిన చిరంజీవి తాపీ సుజాతకు ఆయురారోగ్య విద్యాభివృద్ధిని కాంక్షిస్తున్నాం. సుజాత శ్రీ తాపీ ధర్మారావుగారి మనుమరాలు. తాపీ మోహనరావు, రాజమ్మగారల కుమార్తె.

గ్రంథసమీక్ష :

## "పంజరం"

రచయిత :

శ్రీ అవసరాల సూర్యారావుగారు

వెల : రు. 1-50

ప్రతులకు :

విశాలాంధ్ర ప్రచురణాలయం,

విజయవాడ - 2.

ఈనాడు ఆంధ్రదేశాన సాహిత్య శాఖలలో దేనికీ లేనంత ఆదరణ నాటకానికి వుంది. నాటక సమాజాలు, నాటకోత్సవాలు, నాటక పాఠశాలలు, నాటక ఎకడమీలు, నాటక గ్రంథాలు-లోకమే నాటకంగా మారినట్లు కనిపిస్తుంది. చేయి తిరిగినవారూ, తిరగనివారూ, అనుభవ సంపన్నులూ, ఊహాపేతులూ, ఒకరేమిటి, ఆబాలగోపాలం నాటకాలు వ్రాస్తున్నారు. ఈ అభినివేశము ఆరోగ్యసూచకమే, ఆమోదాయకమే. కాని క్షీర, నీర విభజనకూడ ఆవశ్యకము. కావ్యాంతంనాటకం అన్నారు పూర్వులు. కాని యిప్పుడా నిర్బంధం తొలగిపోయింది. నాటకం దృశ్యం అయినందుచేత దానికి ప్రజల మనసుల మీద అనూనాధికారం ప్రాప్తించింది. సినిమాలు వచ్చికూడ, దాని అక్కరను తొలగించలేదు. ప్రజా హృదయాన్ని మలచగల నాటకాలు 'మాభూమి' 'ఎన్. జి. ఓ' లాంటివి చాల గొప్పగా గెలుపడి, ఆంధ్ర నాటక చరిత్రలో మైలురాళ్ళుగా నిలిచిపోయాయి. అవి స్వీకరించిన కథావస్తువు జీవిత కథాంతర్భాగమైనందుచేత అవి రక్తాన్ని రగిలించాయి, కళ్ళు కరిగించాయి, సాహసం చూపించాయి, పౌరుషం ప్రేరేపించాయి, కదిలించాయి నడిపించాయి.

కాని ఇప్పుడు బహుళ ప్రచారం పొందిన నాటకాల తీరే వేరు. బాహ్య ప్రపంచంమీదినుంచి దృష్టి మనస్సుల మీదికి తరలింది. సమూహాల మీదినుంచి వ్యక్తిమీద వ్రాలింది. కార్యంమీదనుంచి కారణంమీదికి పోయింది. గుణాత్మక చిత్రణనుండి ఋతాత్మక చిత్రణవైపు మళ్ళింది. ఒక శాఖ నీటి బిందువును మథించి, విభజించి, సంశ్లేషించి, తెలుపు నలుపులను మట్టుకే గాక, సప్తవర్ణాలను చూపగలిగింది. ఇంకొక శాఖ, పాప పంకాన కాలు మోపింది. పద్మాలను మొలిపించాలని కాదు; పంకాన్ని పరిశీలించాలని, పాపాన్ని వ్యక్తీకరించింది. కాని వ్యక్తీకరణలో దాన్ని కాసింత ఆకర్షవంతము చేసింది. మూడవ శాఖ, పతితలను సమీపించింది. దేహం అమ్ముకున్నా, కాలు జారినా, మనస్సు అమ్మకోని మానం సడలని స్త్రీలను సానుభూతితో ఆదరించి, మూడుముళ్ళ ముచ్చటలకు అప్పగించింది. పతితలుగా వారనుభవించిన "స్వేచ్ఛ"ను, లేదా "బంధరాహిత్యాన్ని" తొలగించి, వారిని పత్నులను గావించింది. ఈ తెన్నులకు ఆంధ్ర నాటకాలలో యిటీవలి వాటిలో మచ్చుతునకలు "మాష్టర్జీ", "పునర్జన్మ".

మరి పంజరం ఏ కోవకు చెందినట్టు? ఏ ఒక్కదానికీ కాదు, కాని మూడిటికీ అని చెప్పితే, దాని స్వరూపం బోధపడుతుంది. ఈ ఒక్క నాటకం యిటీవలి ఆంధ్ర నాటక రచనా ధోరణులను అన్నిటినీ ప్రతిబింబిస్తున్నది. దీనికి ప్రత్యేకత లేదా అంటే, వున్నదని చెప్పాలి. కొట్టవచ్చినట్టు కనిపించే సంవిధాన

చాతుర్యం దీని ప్రత్యేకత. రచయితకు దాగుడుమూతలాట యిష్టమేమో, నాటకాన్ని దొంగాటకం కావించారు. రెండు మూడు పాత్రలు తప్ప, మిగతావి అన్నీ వేషాలు; మారుపేళ్ళకింద, ముసుగులతో మసలే వ్యక్తులు. లోకంతోబాటు ప్రేక్షకులనుకూడా బురిడీకొట్టించే కిలాడీ పనులతో చాలా కాలం నెట్టుకొనివచ్చి, చిట్టచివరకు బట్టబయలుగా నిజస్వరూపాలు చూపుతారు.

ఈ ముసుగు మనుషులలో మోసగాళ్ళ మోతుబరి డాక్టర్ శ్రీరాం. పుణే నుండి - బొంబాయి వరకు ప్రాంతాలగూ, ప్రజాసంరక్షకులైన పోలీసులనూ కన్ను మప్పి, మచ్చునల్లి నెగ్గుగూ వచ్చిన వంచకుడు. స్వార్థం రూపుదాల్చినవాడు; అహంకరించి, సమాజంమీద కత్తికట్టినవాడు. ఫలితంపట్ల పూర్ణభావం; సాధనం ఏదైనా సరేనసే సార్థభావం, ఆదర్శాలన్నట్లు అపహాసం; నిలకడలేదు, నిజాయితీలేదు, తన నీడనే నమ్మలేడు; తననందరూ నమ్మాలి, నమ్మితేవారి; తన దృష్టిలో ప్రపంచమే మోసమోసం, మనుషులందరూ మోసగాళ్ళు, కనక తన తప్పేమీలేదు;—అనుకొనేవాడు. ఈ పాత్ర ఏవగించుకోదగిన పాత్ర. పూర్తిగా నెగిటివ్. ఈ కారణవల్లని పాపాల ముద్దను ఏదో ఒక గుణమిచ్చి కాసింత నొరుగుచేసి వుండవచ్చు. ఇలాంటి పాత్రల కథానాయకులను చేసినందువల్ల చిట్టచివరకూడ పశ్చాత్తాపమేమీ లేకుండా చేసినందుచేత, కథ అర్థం తిరిగినప్పుడుకూడ కరకు తగ్గక ఆత్మ సమర్థనకోసం సంఘ దూషణ చేయించినందుచేత, దుర్గుణానికి అతిశయమైన ప్రాముఖ్యం యివ్వడం జరిగింది. యుద్ధరంగంలో నిలువలేని పోరాడకను మూస్తున్న వీరునివలె శ్రీరాం చనిపోతాడు. తనకు పరమ శత్రువైన సమాజంచేత మృత్యుదండన అనుభవించేందుకంటె ఆత్మహత్యనే యెన్నుకొంటాడు. తద్వారా అతనిపట్ల గుండెలో ఎక్కడో గాని సానుభూతి తగిలిస్తుంది. సమాజం శిక్ష విధించినా, స్వయంగా శిక్షించుకొన్నా, ఫలితమొకటే అయినా, ఆత్మహత్య చేసికొన్నందువల్ల, అపజయంలో కూడా అరాచక వ్యక్తివాదం విజయం పొందుతుంది. విజయంలోకూడ సమాజం ఓడిపోతుంది. తాను-తన సంస్థలు (న్యాయస్థానాలు, న్యాయవాదులు, న్యాయశాస్త్రము, రక్షకభటులు, తలారి) అతన్ని పట్టి పల్లార్చి వుంచే ఫలితంలోని ప్రాముఖ్యం యింకో విధంగా వుండేది. నాటకకర్తలు యీ ప్రాశస్త్యాన్ని గమనించలేదు.

సమాజంలోని దుష్టశక్తులను దూషించిబట్టే అవకాశం కొన్ని సన్నివేశాలలో రచయితకు లభిస్తుంది. కాని నిందించేవాడు నిందితుడు కాకూడదు. ఇంకో మంచి పాత్రద్వారా ఆ పని చేయవచ్చు. ఈ నాటకంలో జ్యోతి (ఆమే ఛాయ) పాత్ర ద్వంద్వగుణాలు గల పాత్ర. భర్త (కాలేజి లెక్చరరు) అవమానించాడు, తరిమివేశాడు; తాను చదివిన వానకాలపు చదువు అక్కరకు వచ్చింది; నర్సుగా చేరి రోగుల గుండె గాయాలనుకూడ మాన్పబూని, శ్రీరాముని వలలోబడి, ఆదర్శపురుషుడని నమ్మి యింటచేరి, అతని అక్రమాలను కళ్ళారా చూచింది. దొంగ పిచ్చి నటించి డాక్టరు ట్రీట్మెంటుకు

యింటికి వచ్చిన భర్తను మెప్పించి తిరిగి పత్ని అవుతుంది. బాధలలో మాగి, పశ్చాత్తాపాగ్ని పరీక్షలో నెగ్గి, సతీత్వాన్ని స్వాతంత్ర్యాన్ని నిరూపించుకొంది ఛాయను వదలిన శోభ.

పిచ్చివాడి పాత్రలో రచయిత చాల చమత్కారం చూపారు. అందరూ తనను బాధపెడుతున్నారు; పైకెక్కనీయడంలేదనే పర్సిక్యూషన్ కాంప్లెక్స్ గల ఒక వుపాధ్యాయుని పాత్రకూడ చాలా చక్కగా వుంది.

"పంజరం" నాటకంలో పలచబడిన అంశాలు లేకపోలేదు. క్లైమాక్స్, యాంటీక్లైమాక్స్, సస్పెన్స్‌లు పకడ్బందుగా లేవు. వీటిలో కొంత కృత్రిమత కనిపిస్తున్నది.

ఈ నాటకంలో పూర్వాపర విషయ సంబంధం దుర్బలంగా వుంది. అస్తవ్యస్తమైన కథవల్ల కాబోలు, నాటకంలో పాత్రలు నోటరాని మాటలను కూడ వారికి ఆపాదించడం జరిగింది. ఉదాహరణకు, ప్రథమాంకంలో పిచ్చివాణ్ణి గురించి డాక్టర్ శ్రీరాం, ఛాయ ముచ్చటించుకొంటున్నారు. శ్రీనివాసరావు అనే పెద్దమనిషి ప్రొద్దుటవచ్చి కేసు సంగతి చెప్పి, సాయంకాలం తీసుకువస్తానని పోయాడు. ఛాయకు పిచ్చివాడి వ్యవహారం శ్రీనివాసరావు చెప్పినంతకంటె ఎక్కువ తెలియదు. తెలిసినా తెలిసినట్లు కనిపించకూడదు. శ్రీనివాసరావు చెప్పిన మాటల్లో, పిచ్చిపట్టకముందు యీ ప్రొఫెసరు తన భార్యను క్లబ్బులకు వెళ్ళమన్నట్లు, సభలకు వెళ్ళమన్నట్లు ఎక్కడాలేదు. కాని ఛాయ యిలా అంటుంది. "అంత భయపడే వాడు ఆమెకు స్వేచ్ఛ ఎందుకిచ్చాడు? క్లబ్బులకు వెళ్ళమన్నాడు; తనతో సభలకు రమ్మన్నాడు." పూర్వాపర సంబంధం లేని యిలాంటి మాటలు అట్టే ఎక్కువగా లేకున్నా యీ అశ్రద్ధ రచయితలకు తగదని చెప్పాలి.

ఏమైనా సంఘ కళంకాన్ని కళ్ళకు కట్టినట్లు రచించిన యీ నాటక రచయిత కృషి ప్రశంసనీయం.

— రమణారెడ్డి.

# స్వీకారం

## వ్యవసాయ కూలి (నవల)

రచయిత :

శ్రీ మండే పిచ్చయ్య

వెల : రు. 3.00

ప్రతులకు :

విశాలాంధ్ర ప్రచురణాలయం,

విజయవాడ - 2.

*

## సీతారామరాజు చరిత్ర

రచన :

శ్రీ పడాల

వెల : 40 నయాపైసలు

ప్రతులకు :

ఆంధ్రశ్రీ పబ్లికేషన్స్,

7, తుకారాంనగ్డ్ స్ట్రీట్,

మద్రాసు-17.

*

## రాలిన పూలు

(కథా సంపుటి)

సంపాదకుడు :

శ్రీ గుళ్ళపల్లి నాగేశ్వరరావు

వెల : రు. 2.00

ప్రతులకు :

జ్ఞానమందిర్,

కృష్ణలంక, విజయవాడ.

## జయభేరి

(వెండితెర నవల)

వెల : రు. 0-60 న. పై.

రచన : శ్రీ ఆత్రేయ

సంక్షిప్తీకరణ : శ్రీ మధుమూర్తి

*

## ఇల్లరికం

(వెండితెర నవల)

కథ : శ్రీ సదాశివబ్రహ్మం

సంభాషణలు : శ్రీ ఆరుద్ర

పాటలు : శ్రీశ్రీ, కొసరాజు, ఆరుద్ర

కథనం : శ్రీ పిచ్చేశ్వరరావు

వెల : 60 న. పై.

పై రెండు పుస్తకాలకు

విశాలాంధ్ర ప్రచురణాలయం.

విజయవాడ - 2.

●

## అమరవీణ

రచయిత : శ్రీ వజ్ఝల వెంకటేశ్వర్లు

వెల : రు. 2.00

ప్రతులకు :

వజ్ఝల వెంకటేశ్వర్లు, బి.ఎ., బి.ఇడి.

భూపతి స్ట్రీట్,

జయపూర్ (కోరాపుట్)

*

## తేజశ్చక్రము

రచయిత :

శ్రీ "సుప్రసన్న"

వెల : రూపాయి

ప్రతులకు :

ఆంధ్ర బుక్ హౌస్,

సుల్తాన్ బజారు. హైద్రాబాద్.

Мы изучили русский язык без учителя

**WE STUDIED RUSSIAN WITHOUT A TEACHER**







**Yes, Russian is as easy as that if you study with Mme. Potapova's two volumes. Mme. Potapova's book simplify the language and enable you to master it with ease.**

**Price**
**Part 1 : Rs 2**
**Part 2 : Rs 2.75 nP**

***Also available the Hindi Edition of the first volume at Rs 2.12 nP***

Available with

**VISALAANDHRA PUBLISHING HOUSE**
BUCKINGHAMPET P. O., VIJAYAWADA.

**PEOPLES' BOOK HOUSE**
NEHRU ROAD, HYDERABAD.

**NEW CENTURY BOOK HOUSE**
199, MOUNT ROAD, MADRAS-2.

**V/O MEZHDUNARODNAYA KNIGA, Moscow 200, U.S.S.R.**

ఆంధ్రప్రదేశ్ అంతటా జయప్రదముగా నడచుచున్న




N. T. రామారావు, S. V. రంగారావు, జానకి, గిరిజ, కన్నాంబ.

డిస్ట్రిబ్యూటర్లు: ఆంధ్ర, సీడెడ్ — విజయా పిక్చర్సు. విజయవాడ, గుంతకల్లు.
నైజాం — విజయ డిస్ట్రిబ్యూటర్లు, సికింద్రాబాదు.

EDITED, PRINTED AND PUBLISHED BY TUMMALA VENKATARAMAYYA AND PRINTED AT SWATANTRA ART PRINTERS, VIJAYAWADA.

# అభ్యుదయ

అభ్యుదయ రచయితల
ఐదవ మహాసభా సంచిక
1955 జూలై 30, 31 విజయవాడ

# రోజులు మారాయి

నాగేశ్వరరావు, రేలంగి, సి. యస్. ఆర్., జానకి

వి శా లాం ధ్ర లో

విజయవంతంగా ప్రదర్శింపబడి

## శ త ది నో త్స వా లు

జరుపుకున్న చిత్రం



ప్రతి బ్రహ్మచారి ఎర్రపిల్లని పెండ్లి చేసుకోవాలంటే
నాబోటి నల్లపిల్లగతి ఏం కావాలి ?
అందుకు ఉపాయం
మా మామిడాకుల సీతారామయ్యని
"కన్యాదానం"లో కలుసుకొని అడగండి.

"పద్మ"



విఠల్ ప్రొడక్షన్స్‌వారి

# కన్యాదానం

" వన్నియలోలేదు విలువ
కన్నియగుణమే కనుచలువ "

గ్రామ్సు : " CONCERNS "　　　　ఫోన్ నెం. 334

# కన్సర్న్సు లిమిటెడ్

## టైప్ ఫౌండర్సు & బ్లాక్ మేకర్సు

పోస్టు బాక్సు నెం. 342- బకింగ్‌హాంపేట పోస్టు

## విజయవాడ-2

★ ప్రింటింగ్ టైప్పు

★ ప్రింటింగ్ ఫర్నిచర్

★ బ్రాస్ రూల్సు

★ లైన్, హాఫ్‌టోన్ & కలర్ బ్లాక్సు

★ రబ్బరు స్టాంప్పు

★ సినిమాస్లైడ్సు వగైరాలకు

మా తో సంప్రదించండి.

# ఉత్తమ అభ్యుదయ గ్రంథాలు

| | | |
|---|---|---|
| తండ్రులూ కొడుకులు | (టర్జనీవ్ ప్రఖ్యాత నవలలు) | రు. 3-0-0 |
| వేగుచుక్క | ,, | రు. 2-0-0 |
| పేక మేడలు [అచ్చులో] | | |
| నటన | (శ్రీనివాస చక్రవర్తి) | రు. 1-8-0 |
| (తెలుగులో ఇంతవరకు నాటకాభినయనముమీద వచ్చిన ఏకైక గ్రంథం) | | |
| చైనా నవల : | (సుడిగుండం : ఎఱ్ఱసైనికుని జీవితగాథ]) | రు. 1-0-0 |
| గోర్కీ నాటకం : | (పతితజీవులు) | రు. 1-8-0 |
| చెకోవ్ నాటకం : | (సీటీకాకి) | రు. 1-0-0 |

సాహితీ పబ్లికేషన్సు, విజయవాడ-2

# విశ్వసాహిత్యము

| | | | |
|---|---|---|---|
| మానవుడు (గోమాగోలా) | రు 5-0 0 | నవజీవనము (టాల్‌స్టాయ్) | 6-0-0 |
| స్వేచ్ఛాపథము (ఫాస్టు) | 5-0-0 | నాటకకథలు ,, | 3-0-0 |
| ముగ్గురు మిత్రులు (గోర్కీ) | 5-0-0 | ఇనపపాదాలు (జాక్ లండన్) | 4-0-0 |
| అమ్మ ,, | 3-0-0 | బీజలక్ష్మి (పెర్ల్ బక్) | 2-8-0 |

ఇంకా శరత్, టాల్‌స్టాయ్, గోర్కీ రచనలకు, బాలసాహిత్యము వగైరా అభ్యుదయ సాహిత్యానికి మాకు వ్రాయండి.

ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ-2.

ఆగస్టు 5న ఆంధ్రదేశమంతటా విడుదల!

సాధనా వారి "సంతానం"

## అందరూ చూచితీరవలసిన అద్వితీయ చిత్రం



తల్లిలేని పిల్లల దీనస్థితి

క్రుంగిపోతున్న రంగయ్యగా (రంగారావు), కూతురు లక్ష్మిగా (కుమారి విజయలక్ష్మి), కొడుకు రాముగా (మాస్టర్ నాగేశ్వరరావు)

రచన: అనిసెట్టి; పినిశెట్టి. మ్యూజిక్: దక్షిణామూర్తి

దర్శకత్వం: సి. వి. రంగనాధదాస్, సూపర్‌విజన్: ప్రసాద్

సావిత్రి, జూ॥ శ్రీరంజని, కుమారి కుసుమ, నాగేశ్వరరావు, చలం, రంగారావు, రేలంగి, అమరనాథ్, కుటుంబరావు, రమణారెడ్డి మొ॥

డిస్ట్రిబ్యూటర్స్

ఆంధ్ర: ప్రభాత్ పిక్చర్స్ లిమిటెడ్, విజయవాడ.

★

రాయలసీమ, నైజాములకు: నవయుగ ఫిలిమ్స్, గుంతకల్ & సికింద్రాబాద్.

అందమైన భావానికి
పొందికైన భాషలాగ
పొందికైన మనభాషకు
అందమైన అచ్చుశోభ

కలరు ప్రింటింగుకు, అందచందాలికే
అచ్చుపనులకు పెట్టింది పేరు

"స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు"
పోస్టు బాక్సు నెం. 383
బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ

టెలిఫోను:
39

టెలిగ్రాం:
VISALANDRA

# అభ్యుదయ

అభ్యుదయ రచయితల
ఐదవ మహాసభా సంచిక
1955 జూలై 30, 31 విజయవాడ

అభ్యుదయ రచయితల సంఘం,
విజయవాడ.

వెల :

రూపాయిన్నర

స్వతంత్ర ఆర్టు ప్రింటరుస్,
విజయవాడ-2.

# ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసం

ఉప్పల లక్ష్మణరావు

మిత్రులారా !

మా ఆహ్వానాన్ని అంగీకరించి యీ సభకు మీరందరు దయచేసినందుకు ఆహ్వాన సంఘం తరఫున మీకందరకూ నా కృతజ్ఞతాభివందనాలు. ఈ సభకు ఇంతమంది విద్వాంసులు, రచయితలు, కళాకారులు సాహితీపరులు, శిష్టులు విచ్చేశారంటే అభ్యుదయ రచయితల సంఘాన్ని పునర్జీవింపజేయడమనే విషయం ఎంత ప్రాముఖ్యమైందో నేను వేరే చెప్పనవసరంలేదు. అభ్యుదయ రచయితల సంఘం 1943 లో స్థాపించబడింది. అంతకుముందే ఆంధ్ర వాఙ్మయ రంగంలో అనేక సాహిత్య సంస్థలు అందులో ముఖ్యంగా సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తు అమూల్యమైన కృషి చేసి మన సాహిత్యంలో గొప్ప మార్పును తీసుకొచ్చాయి. అప్పటిసాహితీ సంస్థలన్నింటికంటే పిన్నదైనప్పటికీ అభ్యుదయ రచయితల సంఘం పేరెన్నిక గాంచిన ఇతర సంస్థలతో పాటు శక్తివంచనలేక సాహిత్య సేవ చేసింది. పుట్టినది మొదలు అభ్యుదయ రచయితల సంఘం ఒక విశిష్ట ఆదర్శాన్ని ముందుంచుకుని పని చేసింది. ముసాయిదా ప్రణాళికలో వివరించినట్లు అభ్యుదయ రచయితల సంఘం ఆంధ్ర చరిత్రలో నవయుగ వైతాళికులైన కందుకూరి, గురజాడ, గిడుగు మొదలగు వారి ఉత్తమ సంప్రదాయం అనుసరించి సాంఘిక శ్రేయస్సు సాహిత్యం యొక్క ప్రధాన లక్ష్యమని గుర్తించి సజీవమైన సాహిత్యసృష్టికి కృషి చేసింది. ప్రాచీన అధునాతన సాహిత్యాల్లోని ఉత్తమ లక్షణాలను స్వీకరించి, ఆంధ్ర సాహిత్యంలో ఒక నూతన రచనా సంప్రదాయమును పాదుకొల్పింది. దేశిసాహిత్య రీతులను పునరుద్ధరించడానికి సమకాలిక జీవితాన్ని ఆ యా రూపాల్లో చిత్రించి, ప్రచారం చేసి, ఆంధ్రప్రజల ఆదరాభిమానాలను పొందగల్గింది. సాంఘిక జీవితానికి దూరమైన సాహిత్య ధోరణులను విడనాడి ప్రజల జీవిత సమస్యలను కావ్యవస్తువులుగా గ్రహించి ప్రగతి శక్తులకు చేదోడు వాదోడుగా నిలిచి, తెలుగుజాతికి వెలుగు చూపింది.

కాని కారణాంతరాలచే 1948 సం॥ నుంచి అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య రంగంలో ఒక నిర్మాణయుతమైన సంస్థగా పనిచేయలేక పోయింది. ఆ కారణాలేవో వివరించడం ఇక్కడ అప్రస్తుతం. మన ఆంధ్ర వాఙ్మయం యీనాడు ఎటువంటి సంధిగ్ధస్థితిలో వుందో మనం తెలుసుకుంటే అభ్యుదయ రచయితల సంఘాన్ని పునరుద్ధరించడం

ఎంత ఆవశ్యకమో అభ్యుదయ రచన ఎంత అవశ్యమో మనకి తేటతెల్లము కాగలదు.

ఆంధ్రజాతి చరిత్రలో స్వర్ణయుగం అని చెప్పుకోదగు కాలం అతి కొంచెమే అయినా, ఆ కొద్ది కాలంలోనే మనజాతి ఖ్యాతిని ప్రపంచం నాలుగు మూలలా చాటేటట్టు నాటి ఆంధ్రులు మేటి శిల్పాలను, చిత్రాలను, కవితను, వాఙ్మయాన్ని, సంగీతాన్ని సృష్టించారు. అజంతా చిత్రాలు, అమరావతీ మహాబలిపుర శిల్పాలు, హంపీ ఏకశిలా నగరపు కట్టడాలు ఇందుకు నిదర్శనాలు. మహోజ్వలమైన యీ కళాసృష్టి నాటిజాతి మేధస్సును, విశాలభావాలనీ, ఆశ్చర్యం గొలిపే ఊహాశక్తిని, సాహసంతో కూడిన భావనానైపుణ్యాన్ని ప్రతిబింబింప జేస్తూంది. ఆనాటికళ, దారుఢ్యము వైశాల్యము కలిగినదే కాక, మృదుత్వాన్ని, సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని కలిగి భావగర్భితమై ఉత్తేజకరంగా వుండేది. ఈ కళాఖండాలు ఆనాటి సమాజంలోని ప్రజల సంస్కారానికి, అభిరుచికి, పట్టుదలకు, సాధనకు చిహ్నాలు. అప్పటి చిత్రకారులు, శిల్పులు, విద్వాంసులు, నాటి మానవుని ఆలోచనలకును, ఆచరణలకును మూలమైన సూత్రాలను తరచి తెలుసుకుని తమ కళాసృష్టిలో వాటిని నైపుణ్యముగా సజీవముగా చిత్రించడంలో సాధించిన విజయాలు, వారి బుద్ధికుశలతకూ పట్టుదలకూ కృషికీ ప్రతిఫలాలు. అలాగే ఆనాటి కవిత్వము, సంగీతము పరిపక్వము చెంది, ఆవేశపూరితమై, హృద్యమై, ఉన్నత శిఖరాలను అందుకొన్నాయి. ఆ స్వర్ణయుగం లోనే లయరాగ తాళములతో కూడుకొన్న ఆంధ్రసంగీతానికి (ఈ సంగీతాన్ని కర్ణాటక సంగీతం' అని ఎందుకంటారో నాకు బోధపడ్డంలేదు. 'ఆంధ్ర' సంగీతం అంటే వాళ్ళకి చిన్నతనమేమో!) త్యాగరాజు తన ప్రతిభావిశేషంచే ఒక నూతన ఉత్కృష్టతనూ సౌందర్యాన్నీ చేకూర్చాడు. క్షేత్రయ్య పదాలు, అన్నమాచార్యుని కీర్తనలు, ఇతర జానపద సంగీతం కూడా ఆ కాలంలోనే ఒక ఉచ్ఛదశకు వచ్చాయి. రసపూరితమై, హిందూ వేదాంతసార సమన్వితమైన ఆంధ్ర భారత కవిత్వాన్ని సృష్టించిన నన్నయ, హాస్య వ్యంగ్యాన్ని కురిపించిన తెనాలి రామకృష్ణుడు, మనోహరదృశ్యాలతోను, రమ్యమైన వర్ణనలతోనూ నిండిన ప్రబంధాలని రచించిన పెద్దనాదులు ఆ స్వర్ణయుగానికి చెందినవారే. ఆనాటి కళలు, ఆనాటి రచనలు, వాస్తవంగా వివిధరంగాల్లో ఆంధ్ర జాతి ఔన్నత్యానికి ప్రాతినిధ్యం వహించాయి.

ఒకనాడు ప్రభవిల్లిన ఆంధ్ర నాగరికతకు వారసులమని చెప్పుకోడానికి మన సొంత గర్వింపదగిన విషయమే అయినా, వారు పెట్టిన నాడికారంలో పురోగమించి యింకా అంతకుమించిన విజయాలను సాధించడానికి ఉత్సాహం, అభిలాష చూపించలేకపోయినవాడు మన గర్వం ప్రగల్భమే అవడం కాకుండా, అది మన సంస్కృతి క్షీణానికి చిహ్నమే అవుతుంది. వ్యాపార వాణిజ్యాలందే కాకుండా, ప్రప్రథానంగా కళాసాహిత్యాల్లో యీ నాడు మన ఆంధ్రలో ఏర్పడ్డ ప్రతిష్టంభనకు తోటి భారత ప్రజలతోపాటు మనజాతి అనుభవించిన దుర్భర దాసత్వము, అన్య పరిపాలన కొంతవరకు కారణములవడం నిర్వివాదం. నూతన శకారంభంలో అడుగు

పెట్టనున్న మనం యిప్పుడు మన వాఙ్మయ సాహిత్యాలు యెట్టి స్థితిలో ఉన్నాయో సింహావలోకనం చేసి, ప్రస్తుతం వాటిని ఆవరించిన నిస్తబ్ధత, నిరుత్సాహం, అయోమయం నుంచి మళ్ళించి ప్రగతిశీలమైన కొత్తదారిని పట్టించేటట్టు చేసే సమయం ఆసన్నమయింది.

మన జాతీయోద్యమం ప్రారంభదశలో ప్రజలు చూపించిన చైతన్యం సంఘంలోని దురాచారాలను, కరడు గట్టిన ఛాందస సత్వాన్ని సంస్కరించేది కాకుండా, మన సారస్వతాన్ని, కళలని నూతన మార్గాలని తొక్కడానికి, జాతీయత తొణికిసలాడేటట్లు చేయడానికి కారణభూతమైంది. స్వాతంత్ర్య సమరము ఉచ్ఛస్థాయిలో ఉండి, జాతీయ సౌహృదము, దేశాభిమానము, మిన్నుముట్టిన ఈ శతాబ్దారంభంలోనే రవీంద్రనాథు, ప్రేమచంద్, సుబ్రమణ్యభారతి, వల్లతోళ్ మొదలగు మహాపురుషుల నేతులు మన సాహిత్యానికి, కళకి క్రొత్త వరవడులను దిద్దారు. ఆంధ్రదేశంలో కూడా ఆ కాలంలోనే మన జాతి యుగపురుషులగు కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు ప్రభృతులు తెలుగు సారస్వత వీథులందు వెల్గొందేరు.

ఆంధ్ర కవితా పితామహులగు నన్నయాదులు సాధించిన పరిపూర్ణత, సంపాదించిన కౌశల్యములతో వీరిరచనలు సాటి యగునా కాదా యన్న వివాదము ప్రస్తుతము అసమంజసము. నాటి అధోగత సమాజానికి నాయకులైన ఛాందస పండితులయొక్కయు, సనాతనుల యొక్కయు మూఢపువ్యతిరేకతను ఎదుర్కొని, పోరాడి, విజయాన్ని సాధించి, పాండిత్య ప్రకర్షతోనూ, ఆకారశబ్ద లాలిత్యముతోనూ కూడా క్రొన్ని నాటివాఙ్మయ సాహిత్య రంగాల్లో విప్లవం తీసుకొని వచ్చారంటే అది సామాన్య విషయం కాదు. వారి ధైర్యము, ఉపజ్ఞ, విజ్ఞాన సంపత్తి అపారము. వారు వెలుగుబాట జూపిన వీరులు. కాని వారి అడుగులను త్రొక్కిన అనుచరులు విశేషించి లేకుండుటచేత ఆ మార్గాలు ముండ్లపొదలతో నిండి నేడు శిథిలమైపోయింది. ఈ దురదృష్టము ఆంధ్రుల దొక్కరిదే కాదు. బానిసత్వపు అంధకారంలో మునిగిన దేశీయ కళలు, సారస్వతము, పక్షవాతం వచ్చిన రోగి లాగున చైతన్య విహీనం అవడం సహజమే. శల్యావశిష్టమైన రోగియొక్క వ్యాధి నివారణకు అనేకులు ఔషధాలను ప్రయోగించారు. కాని వారి యత్నాలన్నీ తాత్కాలిక కోపశమనాలే అయిపోయాయి. 1920,30లలో ఆంధ్రసాహిత్యరంగంలో భావకవుల ప్రయత్నాలలో పొడచూపిన నూతన పోకడలే యిందుకు తార్కాణం. ఈ యువకులు ధైర్యసాహసాలతో చేసిన కృషిని న్యూనత పరచడం నా ఉద్దేశం కాదు. పాశ్చాత్య కళలలోని సరికొత్త రీతులనీ మన కవిత్వ విధానంలో ఉపయోగించడం తప్పక మెచ్చుకోదగ్గ విషయమే. కాని వారి భగీరథ ప్రయత్నాలన్నీ వ్యాధి నిర్మూలనంలో నిరర్థకములై పోయాయి. రోగికి కావలసినది శాశ్వత నివారణ కాని, తాత్కాలికోపశమనము కాదుగదా! దారుఢ్యం, చురుకుదనం, వర్చస్సు, జబ్బు నిర్మూలించి, ఆరోగ్యం కుదిరేటప్పుడే బయల్పడుతుంది. కాని రోగికి అలంకరణం చేసినందువల్ల లాభమేమిటి? రోగి జీవనము కాపాడినందుకు వారికి మనం కృతజ్ఞులమే! జాతి

నాశనము చెందకుండడమే కాకుండా, సజీవమై, సర్వకళాశోభితమై అన్ని విధాల వృద్ధిచెందుతున్నప్పుడే కదా మనకి సంతోషం? 1940 సు॥ నుండి అభ్యుదయ కవులు చేయుచున్న కృషిని కూడా పేర్కొంటే, మన సాహితీ పునర్వికాసం కోసం సల్పిన తీవ్రకృషి నంతటినీ సింహావలోకనం చేసినట్లే అవుతుంది. మనజాతి నావరించిన జాడ్యలక్షణాలని గ్రహించడమే కాకుండా, వ్యాధిమూలకారణాలన్నికూడా అవగాహన చేసుకొని, ఆంధ్ర సాహితికి చెప్పుకోనదగు మేలొనగూర్చిన గౌరవము అభ్యుదయ కవులదే. ఎంచేతంటే సంస్కృతి క్షీణించడానికి కారణం జాడ్యం కాదు. అది వికాసంచెంది వృద్ధిపొందడానికి వీలు కాని పరిస్థితులు యేర్పడ్డమే. జాతి శృంఖలాబద్ధమై, అణచబడి, పీడనాపరుల వశమైపోయింది. సంకుచితం, అనారోగ్యం అయిన ఈ బానిస ప్రదేశాలనుండి బైటపడి సారవంతమైన గ్రామసీమలలోకి నిలిచి, అభిమానంతో ఆదరించి ప్రేమతో పెంచే జనబాహుళ్యం వశం అయినప్పుడే మన సాహిత్య విత్తనాలు ఫలించి మనకృషి మహావృక్షమై పువ్వులతోనూ కాయలతోనూ సొంపుగా వృద్ధిచెందుతుంది.

ఉపమానాన్నుంచి విడదీసి స్పష్టంగా చెప్పాలంటే: సమాజంలో సంస్కృతి ఏ కొద్దిమంది చెప్పుచేతల్లో వశమైనప్పుడు కంటె, ప్రజలందరి సొత్తుగా ఎప్పుడవుతుందో, అప్పుడే కళ, విజ్ఞానం, సారస్వతం వికసించి రాణిస్తాయి. శాస్త్రం, సాహిత్యం సామాన్యజనుల నిత్యజీవితంలో ఒక భాగమైపోయి, వారి ఆశలతోనూ, ఆశయాలతోనూ, కోర్కెలతోనూ ప్రతిబింబిస్తుంది. సారస్వతాన్ని సాహిత్యాన్ని అట్లా రూపొందించడమే మన అభ్యుదయ రచయితల లక్ష్యమూ, కర్తవ్యమున్నూ.

సాహిత్య రూపాలన్నింటిలో ప్రజాహృదయాన్ని చూరగొనేటట్టు కావ్యవస్తువును సాక్షాత్కరింప జేయడంలో ప్రధానమైనది నాటకము. నాటకము (సినిమా వలె) ధనవంతుల గుత్తపరిశ్రమ కానేరదు. భావరస పటుత్వం, శక్తివంతమైన వాస్తవిక కథావస్తువును కలిగి, నాటకము ఉత్సాహవంతులగు నటవర్గపు ప్రోత్సాహంతో ప్రజాదరణను పొంది, వారి హృదయాలను రంజింపజేయడానికి ఎన్నో అవకాశాలున్నాయి. అట్టి విషయపుష్టిగల నాటకములను రచించుటకు నాటక రచయితలకు నాటకముపట్లను, నాటకకళపట్లనూ, జీవితముపట్లనూ, అభ్యుదయ దృక్పథం కలిగివుండాలి. ప్రేక్షకుల సానుభూతిని పొంది వారి నుద్రిక్తులను చేసినంతమాత్రాన రచయిత సఫలీకృతుడు కానేరడు. ప్రేక్షకుల హృదయాన్ని కొంచెం కదలించి, వారి సానుభూతి పొందడంతో తన కర్తవ్యం నెరవేరినట్లు అభ్యుదయ రచయిత తృప్తిపడరాదు. విమర్శనా దృష్టితో పరిశీలించి, అందలి వివిధ సమస్యల యొక్క వాస్తవికత, వాటి పరిష్కారమార్గాల యొక్క ఆచరణ యోగ్యతను విచక్షణతోనూ, బాధ్యతతోనూ చర్చించునట్లు నాటకము ప్రేక్షకుని బుద్ధిని ప్రోత్సహింపగలిగిననాడే రచయిత కృతకృత్యుడు కాగలడు. దీనపరిస్థితులను వాస్తవముగా చిత్రించి, ప్రేక్షకులను దుఃఖితులను చేయడం నేర్పు కాదు. కన్నీటికి తావివ్వడం, ఓగి వదలిన ఉద్రేకాల ఫలితమనీ, అది నిస్సహాయతని అంగీకరించిన బలహీనుడి

యొక్క ప్రక్రియా లక్షణం అని తెలియ చెప్తూ, ప్రజలను కార్యరంగంలోకి దుముకడానికి ఉద్రిక్తులనుగా చేసేటప్పుడే అభ్యుదయ రచయిత సఫలత పొందుతాడు. తను హీనస్థితియెడల సానుభూతినీ, విచారాన్నీ చూపిస్తూ, వాటిని రూపుమాపడానికి శక్తికలవాడైనప్పటికీ ఏ విధమైన చర్యలనీ తీసుకోనివారియెడల క్రోధాగ్రస్తులని చేసి, వారి ఆధీనంలోనున్న సిరిసంపదలని తమ హస్తగతం చేసుకోవడానికి ఉద్యమింపజేసినప్పుడే ఉద్రేకాలకి మానవ చేష్టలని పురిగొల్పే ప్రేరితంలో స్థానం వుంటుందని రచయిత రుజువు చేయాలి.

ఉదాహరణకు "కన్యాశుల్కం"లో సంఘంలోని దుర్మార్గాన్ని, మోసాన్ని చిత్రించడంలో నాటకకర్త చాలావరకు కృతకృత్యుడయ్యాడు. కాని దౌష్ట్యం, విషయలోలత్వం, మోసం, పోకిరితనం, కుహనా సంస్కారం బయల్పడేటప్పుడు సంఘం వాటిని క్షమించదని నిరూపించి వుంటే ఇంకా ఎన్నో రెట్లు నాటకకర్త సఫలీకృతుడయ్యుండేవాడు. సమాజంలో దుష్టులు ఎప్పుడూ శిక్షని తప్పించుకోలేరనీ, దుర్మార్గులు మోసకారులతోపాటు సంఘంలో పురోగామి శక్తులు అభ్యుదయ కాముకులు కూడా కలరనీ, ఈ శక్తులు సంఘంలోని దుర్మార్గుల్నీ, పోకిరీలనీ, గూండాయి వాళ్ళనీ శిక్షించి అభివృద్ధి నిరోధకత్వం మీద విజయం సాధించడం, మానవసంఘ పరిణామ క్రమంలోని ఒక గొప్ప సత్యం అనీ నిరూపించగలిగినప్పుడే వాస్తవిక కళ ప్రస్ఫుటం కాగలదు. లేకపోతే ఆ వాస్తవికత కొంత అసంతృప్తిని కలిగించి, మంచితనంలో నమ్మకాన్ని తగ్గించి సంఘాన్ని మనం సంస్కరించలేమనే నిస్సహాయ నిస్పృహా భావలని ఉదయింప జేయడానికి హేతుభూతమై అసంపూర్ణంగా వుండిపోతుంది.

ఇక్కడే అభ్యుదయ రచయితలకు ఒక చిన్న మనవి. కథానాయకుడు మంచి స్ఫురద్రూపి, మాటకారి పోకిరిగా కావచ్చు. ఇంగితజ్ఞానం కలిగి, రసజ్ఞుడై, అందరి హృదయాలనీ ఆకర్షించేవాడై వుండొచ్చు. కాని, పోకిరీ వేషాలు వేస్తూ, అడుగు అందకుండా, పోకను పొందకుండా, గాలి గద్దగా అచ్చువిడిచిన ఆంబోతులా తిరుగుతూ, స్వలాభం కోసం అమాయకులనీ, సత్యకాలపువాళ్ళనీ ఎగవేసుకుంటూ, పరాన్నభుక్కుడై, రుద్రాక్ష పిల్లులతో పాటు, కుహనా సంస్కార వేషభాషలు వేసుకున్న గుంటనక్కలాగు, జీవితం గడుపుతూ వున్నవాడు - మనిషి అనిపించుకోడు. అంతే కాదు. కథానాయకుడు తన సంసార జీవనంలో ఆదర్శవంతుడైన గృహస్థు కావచ్చు. "ఒకమాట, ఒకబాణం, ఒక పత్నీవ్రతుడైన శిష్టుడు కావచ్చు. కాని, తన పనిలో, తన వృత్తి, తన ఉద్యోగంలో, తన నియమిత కార్యంలో, విసుగుతో పని ఎగవేస్తూ, అశ్రద్ధగా, నిర్లక్ష్యంగా, సోమరిపోతుగా ప్రవర్తిస్తే - అతగాడి యెడల పాఠకులకి సానుభూతి, అభిమానం కుదరకపోవడమే కాకుండా, అసలు అతగాడిని అసహ్యించుకుని ఏవగించుకుంటారు. రోడ్డుమీద ఎదురుపడితే ఛీ అని తిడతారు. పేడనీళ్ళ మొహాన్ని కొడతారు.

మరో విశేషం గమనించండి. కథానాయకుడు తన నియమితకార్యాన్ని సావధానచిత్తంతోనూ, పట్టుదలతోనూ, నిర్వర్తిస్తున్నా, ఆ కార్యం ఎందుకూ

అక్కరకురాకుండా, ఎవ్వరికీ ఉపయోగకారి కాకుండా, ప్రజోపయోగం పరమార్థం లేకుండావుండీ, అది తెలిసికొని వుండీకూడా ఆ కార్యాన్ని వదిలిపెట్టక, పనికి వచ్చే మరేదేనా పనిని చేపట్టకుండా వుంటె – అతన్ని సోమరిపోతుకింద, కొరగానివాడికింద మనం జమకట్టుతాం. అలాంటి కథానాయకునిమీద మనకి గౌరవం వుండదు. అపసంతివాడు మనకి ఆదర్శపురుషుడు ఎల్లా అవుతాడు?

సాహిత్యంలో అభ్యుదయం తక్కువగా వుండటానికి జనబాహుళ్యంలో నిరక్షరాస్యత, మన ఆంధ్రలో పుస్తక ప్రచురణం అమిత వ్యయ ప్రయాసలతో కూడుకొని వుండడం, ఆటంకాలుగాపరిణమిస్తున్నాయి. ప్రచురింపబడ్డ కొద్ది ఉత్తమ గ్రంథాలయొక్క పరిచయ భాగ్యంపొందలేక కేవలం వారపత్రికలతోనో మాస పత్రికలతోనో పాఠకలోకం తృప్తిపడవలసి వస్తూంది. వారపత్రికలకూ మాస పత్రికలకూ గల పరిమితులను బట్టి, అవి చిన్న కథలనబడే రచనలకు తప్ప ఇతర సాహిత్యరూపాలకు ప్రోత్సాహం మీయలేకుండా వున్నాయి. అంచేతే మన సాహిత్యంలో ఈవేళ "చిన్న కథ" "కథానిక" అత్యంత ప్రాముఖ్యాన్ని సంపాదించుకొనగలిగేయి. కథారచన మిక్కిలి నైపుణ్యంతో మలచదగిన దవడంచేత, మంచి చెయ్యి తిరిగిన వాళ్ళే ఆ శిల్పాన్ని ఆయుధంగా చేసుకుని సాహిత్య సాధనలో విజయం సాధించగలుగుతారు. సిద్ధహస్తులు కానివారి చేతుల్లో కథ నిర్దుష్టమైన ఆకారంగాని, విషయ విశిష్టతగాని లేక, పేలవమై, నిస్సారమై, నీళ్ళు నములుతూ, ఎందుకూ పొందకుండా వుంటుంది. ప్రజలలో విప్లవ చైతన్యం, సంస్కారాభిలాష కల్గించడానికి వ్యంగ్యం, హాస్యం, వేళాకోళం గలిగిన కథలే ఉపయోగపడుతాయి. ఇలాంటి కథలు అతి అరుదుగా ప్రచురింపబడుతున్నాయి. ఇది ఎంతేనా విచారకరము. నాటక రచన రూపంలో ప్రహసనం వంటి ఆయుధాన్ని కందుకూరి ఎంత ధైర్యంగానూ, నిర్దాక్షిణ్యంగానూ, ఎంత జయప్రదంగానూ ఉపయోగించాడో మనకందరికీ తెలిసిన విషయమే. ఆలాగే వ్యంగ్య కథలని కూడా మన అభ్యుదయ రచయితలు రచించడం ప్రారంభించాలని నా మనవి. సంఘంలోని కుళ్ళును వేలెత్తి చూపించడం ఒక యెత్తూ, దాన్ని రూపుమాపేటట్టు చేయడం అంతకంటే పెద్దయెత్తూ. అందుకు వేళాకోళం, వెక్కిరింత, అపహాస్యం, ఎగతాళీ ఎంతేనా పనిచేస్తాయి. కుహనా సంస్కారులూ, డంబాచార్యులు, స్వంతడబ్బా వాయించుకుని సంఘంలో తిరిగే పెత్తందార్లు, లంచగొండి ఉద్యోగస్థులు – వృత్తి రాజకీయవేత్తలూ, వీరందరికీ ఎగతాళీ అంటే అతి భయం. వాళ్ళని చూసి మిగతావాళ్ళు నవ్వేరంటే సహించలేరు. వాళ్ల హుందాతనాన్ని, దర్జాని వేలెట్టి పొడిచేం అంటే, బెజ్జంపడ్డ "బెలూను" లాగ నేల కూలిపోతారు. అమూల్యమయినటువంటి ప్రహసనాలను మనం అంతర్జాతీయ సాహిత్యంలో చదువుతూనే వున్నాం. సమాజంలో వుండే కుళ్ళునూ, చెత్త చెదారాన్ని అవి ఎలా బట్టబయలుచేసి, వాటిని రూపుమాపడానికి ఆయా దేశాల సాహిత్యం ఆ దేశాల ప్రజని ఎలా రేకెత్తించాయో కూడా మనకి తెలిసినదే. మన అభ్యుదయ రచయితలు కూడా యీ వ్యంగ్య రచనలో

తప్పక కృషి చేసి, మన సాహిత్యంలో ఈ లోపాన్ని పూర్తి చేస్తారని నమ్ముతాను.

ప్రజాభిప్రాయాన్ని సరిదిద్దగల శక్తి సాహిత్యరూపాలన్నింటిలో ఒక్క నవలకి మాత్రమే వుంది. మన సాహిత్యంలో ఈ రూపం యింకా పరిణితి పొంది పరిపక్వానికి రావలసివుంది. ఇప్పటికి వెలువడినంతవరకు నిన్న మొన్న ప్రచురించబడ్డ కొన్ని మినహాయించు మించు అన్ని నవలలు అసంతృప్తికరంగానే వుంటూన్నాయన్నందుకు నన్ను మీరు క్షమిస్తారు గాక! గంభీరంగా కన్పించడానికి, అర్థరహితమైన తత్వ చర్చల తోనూ, ఆధ్యాత్మిక తత్వములోనూ, భావడాంబికములతోనూ నవలలను నింపడం పాండిత్యాన్ని చాటుకోడానికే అవుతుంది కాని నవలకి ఏ మాత్రం సౌష్టవంగాని, గంభీరతను గాని, ప్రజోపయోగం గాని ఆనందంగాని చేకూర్చడం లేదు.

ఎన్నో కష్టాలకి ఇబ్బందులకు లోనైనప్పటికీ జీవితంలో ఉత్సాహం కోల్పోవక ముందుకు మంచి దినాలు వస్తాయనే నమ్మకంతో నిరంతరం శ్రమించే సామాన్యుల సహృదయతనూ, ఉదారత్వాన్నీ, చిత్రిస్తూ వారి సమస్యలనూ, ఆశయాలనీ, వారుకనే కలలనూ, వారు సలిపే పోరాటాలనీ జీవం ఉట్టిపడేటట్లు ప్రతిబింబిస్తూ, వారి యెడల సానుభూతినీ, వారి ధీరత్వానికి గౌరవం ఒదవునట్లు రచింపగలిగినప్పుడే అది సరైన అభ్యుదయ సాంఘిక నవల కాగలదు.

రచయిత సాంఘికనవలని వ్రాసేటప్పుడు వాస్తవాన్ని చిత్రించాలి. వాస్తవం అంటే యధార్థం అనేకాదు. ప్రపంచంలో కాని, సంఘంలో కానీ, వ్యక్తులయొక్క జీవిత ప్రవృత్తులలో కానీ, ఉన్నది ఉన్నట్టు, మక్కీకి మక్కీగా, తు. చ. తప్పకుండా - నకలు అచ్చుగుద్దినట్టు తయారుచెయ్యడం కాదు. సంఘానికీ వ్యక్తికీ వుండేటటువంటి నిరంతర అవినాభావ సంబంధాన్ని నిరూపించుతూ, పరస్పరం దైనందినం జరిగేటటువంటి సంఘర్షణాలను ప్రగతిశీలంగానూ, అభివృద్ధిసూచకంగానూ, అభ్యుదయకరంగానూ, మానవుడిని, మానవ సమాజాన్ని ఒక అడుగు ముందుకు తీసుకొని పోయే విధంగా కథావస్తువును, సన్నివేశాలను, సంభాషణలను, సృష్టించి, శిల్పం చేసి, రచించడమే నిజమైన వాస్తవికత. అసలు పరిస్థితులు క్లిష్టంగా, క్రూరంగా, నిస్పృహాపూరితంగా, జుగుప్సాకరంగా ఉన్నాయని చెప్పి, ఆ పరిస్థితులను చిత్రించడానికి రాజాదరణ పోతుందని భయపడో, సంఘం వెలివేస్తుందన్న వెరపుతోనో, డబ్బున్నవాళ్ళ ప్రాపకం పోతుందనే భీతితోనో, అవి లేనట్టే నటించడమో, వాటిని తేరిపారచూడడానికి దమ్ములులేక అవి ప్రత్యక్షమైనప్పుడు తలవంచుకోవడమో, కళ్లుమూసుకోవడమో, మనకేం సంబంధం అని పెడచెవినిపెట్టడమో, లౌక్యం కాదని ముఖం చాటేసి మౌనం వహించడమో వాస్తవిక రచన అనిపించుకోదు.

అయితే, ఈనాటి రచయితలలో కొందరు ఈ విషయాన్ని అంగీకరించరు. ధర్మయుగం అప్పుడే రానే వచ్చిందనీ, సామ్యవాద సమాజం నిన్నో మొన్నో భూమి మీద వెలిసిందనీ, కథ కంచికి వెళ్లింది కాబట్టి మనం ఇంటికి వెళ్ళిపోయి హాయిగా కాలుమీద కాలు జాపుకుని కడుపుల్లో చల్ల కదలకి కూర్చుండ వలసిన కాలంలో - సంఘర్షణ, సమరం, లడాయి, యుద్ధం, తగవులు, తంపులు, గలాటా, జగడం - వీటికి తావులేదనీ, అట్టి

వైరుధ్యాలు ఎక్కడో ఎప్పుడో యే మూలో తలయెత్తినా, తటస్థపడినా, వాటిని గురించి పెద్దగా చిత్రించి, అరచి, హంగామా చేయనవసరం లేదనీ, అథవా వాటిగురించి రచించినా, బంగారానికి వన్నె పెట్టినట్టు, సత్యానికి నగిషీ పెడితే తీరిపోతుంది, అంతేకాని వాటిని చిత్రించి ప్రచారం చెయ్యడం రచయిత యొక్క ధర్మం కాదనీ, వాటిని గురించి పదే పదే వ్రాయడం కళాసృష్టికి అపచారం చెయ్యడం అవుతుందనీ కొందరు అంటూన్నారు. వీరిమతం ప్రకారం "స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః... లోకాస్సమస్తా స్సుఖినోభవంతు..." అనే ప్రవచనాన్ని కథలురచనలోనూ, కవితా సృష్టిలోనూ, కళారూపాల్లోనూ చిత్రిస్తే - అదే ఉత్కృష్టమైన రచనయొక్క కళయొక్క పరమావధి అని. నిజం చెప్పాలన్నా ఇది పలాయనమంత్రం తప్ప మరొకటి కాదు. ప్రగతిశీలుడైన రచయిత మానవసమాజాన్ని చిత్రించేటప్పుడు- బుద్ధిమంతుల్ని, వెర్రి వెంగళాయిలనీ, ప్రయోజకులనీ అప్రయోజకులనీ, స్వార్థులనీ, త్యాగులనీ, వీరులనీ, పిరికిపందలనీ - అందరినీ చిత్రిస్తాడు. ఒకే వ్యక్తిలో మంచి చెడ్డ గూడా వుంటాయి కాబట్టి, సద్గుణాలనీ దుర్గుణాలని కూడా చూపిస్తాడు. ఐతే - ఏ గుణాలైతే మానవాభ్యుదయానికి దోహదం యిస్తాయో, యే లక్షణాలైతే మానవజాతి శుభోదయాన్ని సుస్థిరం చేస్తాయో, యే స్వభావమైతే ప్రగతిశీలాన్ని ఇనుమడింప చేస్తుందో వాటిని చక్కగా ఆకర్షణీయంగా చిత్రిస్తూ పాఠకుల హృదయాలని రంజింపచేసేటట్టు కథని అల్లుతాడు. మానవ స్వభావంలో వుండే అరిషడ్వర్గాలని చూసి కళ్ళకి గంతలు కట్టుకోడు. 'నన్ను ముట్టుకోకు నామాలకాకీ' అని దూరంగా అంటే ముట్టకుండా మడి గట్టుకుని కూర్చోడు. స్వతహాగా మానవాళి అంతా, ప్రతీ వ్యక్తీ, సౌఖ్యం, సౌందర్యం, సౌభాగ్యం, సంతోషం - స్వభావయుతంగా కాంక్షిస్తారనీ, వాటిని పొంది అనుభవించడానికి సహజంగా శాయశక్తులా తంటాలు పడతారనీ, ఈ కాంక్ష ఈ తహతహా, ఈ ఉబలాటం మానవుడిని ముందుకు అభ్యుదయోన్ముఖంగా తీసుకుపోయే మహత్తరశక్తి అనీ నమ్మి ఆ విధంగా తన రచనలని సాగిస్తాడు. మనుష్య స్వభావంలో అంతర్గతం అయి వుండేటటువంటి స్వార్థాన్ని, నీచాన్ని, కపటాన్ని, కుళ్ళుని అతను అర్థం చేసుకుంటాడు. వాటిని లోబర్చుకోవడం ఎలాగో వాటిని అదుపాజ్ఞల్లో వుంచడం ఎలాగో, వాటిని జయించడం ఎలాగో - అది కూడా తన రచనల్లో నిరూపిస్తాడు అభ్యుదయ రచయిత.

అన్ని కళారూపాల్లోకీ అతి ప్రాచీనమైనది సంగీతంతోపాటు కవిత్వం. నవీన కవితగురించి అనేక విమర్శనలు జరుగుతున్నాయి. దుర్భరములై ప్రయోజన రహితములైన శృంఖలాలని త్రెంచుకొని, భావము స్వేచ్ఛపొంది, కవిత్వం అభివృద్ధి చెంది పురోగమనానికి మొదటి అవరోధాలని తొలగించిన నవీనకవులు శ్లాఘనీయులు కాని వారు అధిగమించినది మొదటి ఆటంకం మాత్రమే నన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి. ప్రాచీన కవిత్వం ఆకార శబ్దాలోలత్వముతో నిండి, గ్రాహ్యము కాకుండా వుంటే, నవకవిత్వం భావలోలత్వంతో బాధపడుతూంది.

(మిగతా 79 వ పేజీలో)

# మహాసభకు సందేశాలు

మద్రాసు ప్రధాన న్యాయమూర్తి

## శ్రీ పాకల వెంకట రాజమన్నారు

విక్టోరియా క్రెసెంట్,
ఎగ్మోర్, మద్రాసు.

మహాశయా !

ఆంధ్ర అభ్యుదయ రచయితల ఐదవ మహాసభకు తమరు పంపిన ఆహ్వానం అందింది. అనేక కారణాలవల్ల నేను సభకు రావడానికి వీలు లేకుండా ఉంది.

ఆంధ్ర అభ్యుదయ రచయితలతో నా సానుభూతి ఇప్పటిదికాదు. ఒక పర్యాయం మహాసభ నా అధ్యక్షతనే జరిగింది.

అభ్యుదయ రచయితలు ఆంధ్ర సాహిత్యానికి చేసిన సేవ అపరిమితం, ప్రశంసనీయం.

ఈమారు మహాసభ శ్రీ శ్రీ గారి ఆధ్వర్యంలో ఒక గొప్ప సాహిత్య యజ్ఞంలాగ జయప్రదంగా జరగగలదని నా నమ్మకం — నా కోరిక.

విధేయుడు,
రాజమన్నారు.

★

జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ రచయితల సంఘాధ్యక్షురాలు

## అన్నా సేగర్స్

ప్రపంచము నందంతట స్నేహానికీ, శాంతికీ ప్రపకరించగల అభ్యుదయ సాహిత్యాన్ని పెంపొందించే కృషిలో మీ మహాసభ అఖండవిజయం పొందవలెనని జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ రచయితలు ఆశిస్తున్నారు.

## మహా పండిత
# శ్రీ రాహుల్ సంకృత్యాయన్

ముస్సోరీ, 5-7-55

ప్రియసహచరులారా,

అనారోగ్య కారణంగా నేను ప్రయాణం చేయలేను. ఇందుకు క్షమించండి.

మీ సభ జయప్రదం కావాలని గాఢంగా ఆశించుతున్నాను. ఆంధ్రరచయితలు తమ కార్యక్షేత్రంలో ఆదర్శప్రాయులు కాగలరని నా గాఢ విశ్వాసం.

భవదీయ
రాహుల్.

★

## సుప్రసిద్ధ బ్రిటిష్ రచయిత
# జాక్ లిండ్సే

ఎస్సెక్స్, (బ్రిటన్)

ప్రియ మిత్రులారా!

మీ సభ జయప్రదం గావాలని కోరుతూ నా గాఢాభివందనాలను తెలియజేస్తున్నాను. నేడు ప్రపంచ వ్యవహారాలలో భారతదేశ అభ్యుదయవాణి రోజురోజుకూ పెంపొందుతూ ప్రముఖపాత్ర వహించుతూంది. ఈ పరిణామంలో, రచయితలుగా మీకు చాలా ముఖ్యపాత్ర ఉంది.

శాంతి, సౌభ్రాతృత్వం, మీ ప్రజల అభ్యుదయ ఉద్యమాల ఆశయాలను తెల్పే భారతీయ రచనలలోని సంపన్నత, సౌగంధము నే నెరుగుదును. ఈ క్లిష్టదినాలలో సరికొత్త విజయాలకు ముందుకుపదండి!

భవదీయుడు,
జాక్ లిండ్సే

## ప్రఖ్యాత ఉర్దూ సాహిత్యవేత్త
## డాక్టర్ అబ్దుల్ అలీమ్

అలీఘర్ యూనివర్సిటీ,
అలీఘర్.

ప్రియ మిత్రమా,

ఆంధ్ర అభ్యుదయ రచయితల ఐదవ మహాసభకు హాజరుకావలసిందని మీరు పంపిన ఆహ్వానానికి అనేక ధన్యవాదాలు. మహాసభకు హాజరుకావాలని ఎంతో కుతూహలం వున్నా, అనివార్యమైన కారణాలవల్ల రాలేకపోతున్నాను.

మీ మహాసభ జయప్రదమగుగాక! రాజకీయాభిప్రాయ భేదాలతో నిమిత్తం లేకుండా దేశభక్త, ప్రజాతంత్ర రచయితల నందరినీ ఒకే ప్రాతిపైకి ఈ మహాసభ తేగలదని ఆశిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితులలో అన్నిరకాలైన సంకుచిత భావాలనూ విడనాడి శాంతి, ప్రజాభ్యుదయాల సాధనకోసం చేతులు కలపటమే రచయితలందరి విధ్యుక్తధర్మంగా భావిస్తున్నాను. సాహితీ, సంస్కృతీ రంగాలపై ఈనాడు ప్రసరిస్తున్న అనారోగ్యకరమైన విదేశీ ప్రాబల్యాన్ని, ముఖ్యంగా పాశవిక మనస్తత్వాన్ని రెచ్చగొట్టే చిత్రాలనీ, బీభత్సరస ప్రధాన గ్రంథాలనీ, బూతు సాహిత్య ప్రభావాన్నీ అరికట్టేందుకు రచయితలంతా ఒకటి కావాలి. సాంస్కృతిక పునరభివృద్ధికి ప్రబల ప్రతిబంధకాలుగా తయారైన జాతీయ దురహంకారాన్నీ, మూఢత్వాన్నీ ప్రతిఘటించాలి.

ఈ విషయాలన్నింటిలోను మీ మహాసభ చక్కని దారి చూపగలదనీ, దేశభక్త, ప్రజాతంత్ర రచయితల నందరినీ సమైక్యపర్చగలదనీ నా ఆశాభావం.

భవదీయుడు,
అబ్దుల్ అలీమ్.

★

# అభ్యుదయ రచయితల మహాసభ

## అధ్యక్షోపన్యాసం

### శ్రీ శ్రీ

సభాసదులకు నమస్కారం. చాలా కాలానికి మళ్ళీ మనమంతా సమావేశమౌతున్నాము. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే మన మొదటి మహాసభ. మనకి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది కాబట్టి— అందులోకీ భాషా ప్రాతిపదిక మీద మనం కోరుకున్న రాష్ట్రం, అసమగ్రంగానైనా ఆకృతి ధరించింది కాబట్టి తెలుగువారిని కలవరపరుస్తున్న సమస్యలన్నిటికీ పరిష్కారం చేయబడుతుందనుకున్నాము. ముఖ్యంగా రచయితల పరిస్థితులు బాగుపడతాయనుకున్నాము. కాని మనం ఆశిస్తున్న దొకటైతే యథార్థం ఇంకొకలాగ కనబడుతోంది. ఎటుతిరిగినా ఏదో నిస్త్రాణా, ఏదో నిస్పృహా! ఫౌల్ చేసి, గోల్ చేసి గెలిచిన ప్రతీప శక్తులు పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్నాయి. అయిదారేళ్ళకు పూర్వం అభ్యుదయ రచయితల సభల్లో పువ్వులదండల్ని వేయించుకొని, పెళ్ళికొడుకుల్ని చేయించుకొని జయజయధ్వానాల మధ్యన ఊరేగిన మిత్రులు కొందరీ నాడు క్షుద్రప్రయోజనాల మరుమరీచికల వెంటబడి ఉద్యమ విచ్ఛిత్తికి దారితీస్తున్నారు. సరియైన నేతృత్వం లోపించడంవల్ల యువకుల తరంలోకూడా ప్రమాదభరితమైన ఒకానొక నిరుత్సాహ నిరాశాఘోరణి తలయెత్తుతూన్న సూచనలు కనబడుతున్నాయి. ఇటువంటి సంకీర్ణ, సంక్లిష్ట వాతావరణాలో ఈనాడు మనం సమావేశమౌతున్నాము.

కాని, ఒకటిమాత్రం నేను గట్టిగా చెప్పగలను. ఇప్పుడు గోచరిస్తూన్న ఈ నిర్లిప్తత కేవలం తాత్కాలికం మాత్రమే. పురోగమన శీలమైనది కాలం. పశ్చా

దిక్కుల ప్రళయఘోషలకు లక్ష్య పెట్టక మానవ మహోదయం దిక్కుగా క్రాంతిరథం కదలి పోతుంది. తొలినించీ తెలుగుజాతి ప్రగతిమార్గంలో అగ్రేసరంగానే నిలిచింది. అవాంతరాలకు జడిసి ఆగిపోవడంగాని, అనర్థకాలకు లొంగి అలిసిపోవడంగాని గతంలో జరగలేదు; ఆగతంలో జరగబోదు. సుస్థిరమూ, సుస్పష్టమూ అయిన ఈ విశ్వాసమే ఇక్కడ మనందరినీ ఏకత్రపరిచిందని ఘంటాకంఠంగా హెచ్చరిస్తున్నాను.

స్వతంత్ర భారతదేశంలో, విశేషించి — స్వతంత్రాంధ్ర దేశంలో ఏం చెయ్యాలో తోచక తెలుగు మానిసి దిక్కులుచూస్తూ ఎంతో కాలం నిలబడిపోడు. ఇదీ నా అచంచల విశ్వాసం. ఇందులో రాజకీయాలు మిళితమై ఉన్నాయని పసిగట్టే వాళ్ళతో వాదించి ప్రయోజనం లేదని నాకు తెలుసును. మనది నూటికి నూరుపాళ్ళు సాహిత్య సంస్థఅనీ, ఇందులో ఏ రాజకీయ పక్షానికీ పెత్తనం ఉండబోదనీ మన ప్రణాళిక నిష్కర్షగా స్పష్టంచేసింది. కొన్ని ప్రధాన సూత్రాలకు కట్టుబడి, కొన్ని ప్రత్యేక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని మనం పనిచేస్తాం. అందుకు కొందరు హర్షిస్తారు. మరికొందరు అపహసిస్తారు. వీరి ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఈ సూత్రాల నవలంబించడంలోనూ, ఈ లక్ష్యాలను సాధించడంలోనూ మన నిజాయితీని నిలబెట్టుకోవాలి. అది పద్యం కానీండి, కథ కానీండి, నాటకం కానీండి, నవలకానీండి, మరే సృజనాత్మక, విమర్శనాత్మక రచన ఐనా కానీండి — మనల్ని ఎటువైపు తీసుకు వెళ్ళుతోంది? ఎక్కడికి చేరుస్తుంది అన్నదే గీటురాయి.

సాంఘిక ప్రయోజనం — అదీ అభ్యుదయ రచయితల లక్ష్యం. ఇది ఈనాడు మనం కొత్తగా ప్రవచించడం లేదు. అనాదినించీ ఉత్తమ సాహిత్యంలో అనుస్యూతంగా కనబడుతూన్న లక్షణమే ఇది. తిక్కన మహాభారతం రచించినా, వేమన ఆటవెలది పద్యాలు చెప్పినా, నిన్నగాక మొన్న గురజాడ కన్యాశుల్కం నాటకం వ్రాసినా వారందరూ అర్థించింది ఈ ప్రయోజనమే. సంఘానికి విరోధిగనో, సంఘంనుంచి ప్రవాసిగనో గోల పెట్టే రచయితలుకూడా

కొందరు లేకపోలేదు. కాని వాళ్ళ నిత్యజీవితంలోకి కాస్త తొంగిచూస్తే చాలు, సంఘం చేకూర్చగల సదుపాయాలన్నింటినీ వారు చక్కగా వడుక్కోవడం కనబడుతుంది. కొండొకచోట, సంఘానికి తామిచ్చిన దానికంటె చాలారెట్లు అధికంగానే సంఘంనించి సంపాదించుకున్న వాళ్లూ ఉన్నారు. అయినా వాళ్ళు మహాబాధలు పడిపోతున్నట్లు పోజులు పెడతారు. అదిచూసి కనీసం కొంతమందైనా పౌనుకాబోలని జాలిపడక తప్పదు కదా !

మరికొందరున్నారు. వీళ్ళకైతే సంఘం గురించి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. వీరిదృష్టిలో నేటి సంఘం బగ్గంపాడైపోతోంది. కుర్రాళ్ళు చెడిపోతున్నారు. రోజులు మారిపోతున్నాయి. ఆ యొక్క దిలీప మహారాజు కాలంలో అని వీరి పురాణం ఆరంభమౌతుంది. ఎన్నికలూ, ఎలక్ట్రిక్ దీపాలూ లేనికాలం, ఏనుగుచేత పూలదండ పంపించి కాబోయే రాజుని కనుక్కునే కాలం, (ఏం ? అదీ ఒకరకం ఎలక్షనే !) భార్యలని జూదంలో ఓడిపోవడానికీ, బజారులో అమ్ముకోవడానికీ అనుమతించే కాలం, (సత్యకాలమంటే మరేమిటి?) ప్రపంచమంతా ఏడు ద్వీపాలూ, ఏడు సముద్రాలూ అని నమ్మే కాలం, కాలమే ఒకగడియారమైన దానికీ వీళ్ళచేతిలో ఉంటే ఎన్నియుగాలు మనల్ని వెనక్కి తీసుకు వెళ్ళగలరో ! అన్నట్టు, వీళ్ళదృష్టిలో మనం ఏది వెనకనుకుంటే అదే ముందు ! వీరు కోరేదికూడా అభ్యుదయమే ! అభ్యుదయ పరంపరాభివృద్ధి అనేగా మన ప్రతీ ప్రబంధమూ ప్రారంభమయ్యేది ! ఈ మాదిరి అభ్యుదయంకోసం శాసనాలు చెయ్యాలనే కుతూహలంగల పరిపాలకులు కొందరు మనకి తటస్థపడుతున్నారు. పండితమ్మన్యులు కొంతమంది వారికి బాసటగా తయారౌతున్నారు. వీరు నిర్బంధంగా మన విద్యార్థులందరినీ బహు భాషా కోవిదులుగా చేసేస్తారు. ఒక్క పదిహేనేళ్లు ఓపిక పట్టండి. మాతృభాష తెలుగు, పితృభాష హిందీ, పితామహుభాష సంస్కృతం, సోదరభాష అరవం, సోదరీభాష కన్నడం – ఇలాగ ఒక పెద్ద అవిభక్త కుటుంబం ఆవిర్భ

విస్తుంది. ఆహా! ప్రజాస్వామ్యం!! ఓహో! మనోహర స్వప్నం!

హిమాలయోత్తుంగమైన ఈ ఆదర్శశిఖరం మాట అటుంచి మనం ఆశించే అభ్యుదయం ఎలాంటిదో ఆలోచించుదాం. మనం కోరేది అందరికీ తిండి, అందరికీ వసతి, అందరికీ పని! ఇకనేం? ఇలాంటి అభిప్రాయాలు ప్రకటించడమంటే ప్రమాదకరమైన రాజకీయ ధోరణిలో పడిపోవడమన్నమాటే! మీ పాటలేవో, పద్యాలేవో మీరు రాసుకోకుండా రచనలోకి రాజకీయాలు తెస్తారేమిటని విసుగు! కాని, రామాయణాలు రాసే వాళ్ళకైతేమాత్రం రాజకీయాలు లేవనుకోవడం పొరపాటు. జీవితంలో మార్పు కావాలనేవారు కొందరు. అది అనవసరమేకాక అనర్థదాయకం అనేవారు కొందరు. ఈ పరస్పర విరుద్ధభావాల సంఘర్షణలోనే జీవితం పురోగమిస్తుంది. అది సాహిత్యంలోకూడా ప్రతిఫలిస్తుంది. ఆ సంఘర్షణని చిత్రిస్తూ, అలా పురోగమనానికి దారితీసే సాహిత్యాన్ని సృష్టించడమే అభ్యుదయ రచయితల ధ్యేయం. తండ్రి తాత లార్జించిన ఆస్తివల్లగాని, పదిమందిచేత చాకిరీ చేయిస్తూ, వారి శ్రమకుతగ్గ ప్రతిఫలం ఇవ్వకుండా కూడబెట్టిన డబ్బువల్లగాని సుఖంగా బ్రతుకు వెళ్ళబుచ్చుతున్న వారికీ, వారి ప్రయోజనాలకి రకరకాలుగా రక్షణాలు కలిగించే రచనలు చేసేవారికీ ఇప్పుడున్న పరిస్థితులు మారడమంటే ఇష్టం ఉండదు. ఇలా కాకుండా ఇంకోవిధమైన జీవిత విధానం ఉందనీ, అందులో ఒకవ్యక్తి ఇంకొక వ్యక్తిని దోచుకోవలసిన అగత్యం విలుప్తమవుతుందనీ, అందరూ ఆనందమయ జీవితంగడిపే అటువంటి విధానంలోనే మానవత్వం విశాలంగా వికసిస్తుందనీ విశ్వసించేవాళ్ళూ, అట్టి విశ్వాసానికి తమరచనల్లో దోహదమిచ్చేవాళ్ళూ ఆ మార్పుని ఆహ్వానిస్తారు. అలాంటి మరో ప్రపంచంపై మహాప్రస్థానం సాగించడమే అభ్యుదయ రచయితల లక్ష్యం.

పారిశ్రామిక యుగంలోకి ఇప్పుడిప్పుడే మనం ప్రవేశిస్తున్నాము. బుల్‌డోజర్లను ఉపయోగించడమంటే పవిత్రమైన భూమాత గుండెల్ని చీల్చడమే అని అపోహలు పడే మనస్తత్వం ఇంకా మనలో కొంతమందిని వదిలిపెట్టడం లేదు.

"మనుష్యుడు ఎగరడమే భగవంతుడి ఉద్దేశమైతే మనం రెక్కలతోనే పుట్టి ఉండేవాళ్ళం" అన్నాడట వెనకటి కెవరో పెద్దమనిషి, విమానాలు కనిపెట్టే ప్రయత్నాలను వెక్కిరిస్తూ! విమానాల దాకా యెందుకు. భగవంతుడిచ్చిన కాళ్లను ఉపయోగించకుండా సైకిళ్లమీద వెళ్లేవారి మీద శాపనార్థాలు కురిపించే ముసలమ్మలుకూడా ఉన్నారు. ఈ మధ్య నేను Conquest of space (ఆకాశాలను జయించడం) అనే ఫిలింను చూశాను. అందులో గంటకు పాతిక వేలమైళ్ల వేగంలో కుజగోళంవైపు ప్రయాణంచేసే గగన నౌకకు నాయకత్వం వహించినవ్యక్తి మధ్యదారిలో తన మనో ధైర్యం కోల్పోయి, జేబులోంచి బైబిలు తీస్తూ "నిక్షేపంగా బతకమని దేవుడు మనకి భూగోళాన్ని ప్రసాదించగా కుజగోళం మీద కాలుపెట్టడం పాపం, భగవంతుని పట్లనే అపచారం" అని తిరుగు ప్రయాణానికి మరలు తిప్పబోతాడు. అప్పటికప్పుడే నౌకలోని టెలివిజన్ తెరమీద కుజగోళం కనబడుతూ ఉంటుంది. ఐనా నాయకుడు బేజారెత్తిపోతాడు. తరువాత కథ తెరమీదనే చూడండని సవినయంగా మనవిచేస్తూ ఇక్కడ నేను చెప్పబోయేదేమిటంటే మానవుణ్ణి ముందుకు తీసుకుపోయే శక్తులతో బాటు వెనక్కు దిగలాగే శక్తులు కూడా ఉన్నాయనీ, ఇవి లేవని కళ్లు మూసుకోవడం పనికిరాదనీ, వీటి స్వభావాన్ని గుర్తించి అనుగుణంగా వాటిని ప్రతిఘటించి తీరవలసిందే అనీ!

పారిశ్రామిక విప్లవంవల్ల మానవుని మనః ప్రవృత్తిలో ఒక పెద్ద మార్పు వచ్చింది. ప్రకృతి శక్తులకు మానవుడొక బానిస అనే దురభిప్రాయం పరాస్తం కావడమే ఈ మార్పు. ఆటం, హైడ్రోజన్ బాంబుల ఉదాహరణ చూపించి ఆధునిక విజ్ఞానం మానవ వినాశనానికే దారితీస్తున్నదనుకోవడం పొరపాటు. ఏ మానవ మేధస్సు ఈ శక్తులను విడుదల చేసిందో అదే వీటిని అదుపులోకి తీసుకువస్తుంది. ఇతోధికంగా జీవితాన్ని సుఖవంతం చెయ్యడానికే ఈ శక్తుల్ని ఉపయోగిస్తుంది. శాస్త్రీయ విజ్ఞానం మానవునిలో స్వాతంత్ర్య

భావాలు వికసించడానికి తోడ్పడుతుంది. ఈ స్వాతంత్ర్యం సమగ్ర స్వరూపం ధరించినప్పుడు ఎదుటివాడి స్వాతంత్ర్యాన్ని అపహరించడం అనే వ్యాపారానికి తావుండనే ఉండదు. స్వాతంత్ర్యం అవిభాజ్యం!

అందుచేత ఈ ఆధునిక విజ్ఞానమంతా తెలుగువారి కందుబాటులోకి వచ్చేటట్టు మనమందరం కృషి చెయ్యాలి. సాహిత్యం అంటే కేవలం కథలూ, కవిత్వాలూ మాత్రమే కాదు. ఈనాడు మెకానికల్ ఇంజనీరింగుకి కాని, ఫొటోగ్రాఫీకి కాని ప్రత్యేకించబడ్డ పత్రికలు లేని మన సంస్కృతి దారిద్ర్యాని కేమనుకోవాలి! యంత్ర సాహాయ్యంవల్ల బొమ్మలు తీసే ఫొటోగ్రాఫీ ఎందువల్ల కళ అనిపించుకుంటున్నదో తెలిసినవాళ్లెంతమంది? నేటి విజ్ఞానమంతా చేపడాలంటే ఏమారుమూల సంస్కృతపదాలో - అవైనా గురికి బారెడు దూరంగా సరిపోయేవి.- గాలించి పారిభాషిక పదాలు సరఫరాచేసేదాకా మన కుర్రాళ్లు చేతులుకట్టుకొని కూర్చోవలసిందేనా? ఇప్పటికే నాగరిక ప్రపంచం యెదుట ఎన్నో విషయాలలో వెనుకపడిపోయిన మనం ఇంకా ఎన్నాళ్ళు నికృష్టంగా కాలంగడపాలి? యూరోపియన్ భాషలన్నింటిలో శాస్త్రీయ పదాలు ఇంచుమించుగా ఒక్కలాగే ఉంటాయి. ఆ పద్ధతిని తెలుగు భాషలోకి ఆ పదజాలాన్నంతా యథాతథంగా ఎంత పెందరాళే తెచ్చుకుంటే అంత మంచిది. అంతేగాని కర్బన ద్వ్యమ్లజనిదము, ధనవిద్యుదావేశ అయస్కాంత తీగ అంటూ అర్థం పర్థం లేని వంకరటింకర దవడనొప్పి మాటలకోసం ఆగిపోవలసిన అగత్యం లేదు. అన్యదేశ్యాలను దిగుమతి చేసుకోవడంవల్ల తెలుగు భాషలోని సుచిసుభ్రతా మైలబడిపోతాయనే మడికట్టుకున్నవాళ్ళని చూసి మనం జాలిపడాలి. ఇక్ష్వాకులనాడు విధించిన నియమాలతో ఇప్పుడు భాషను నేర్చుకోవాలనే వారి చాదస్తంవల్లనే నేటి విద్యార్థులలో విషయపరిజ్ఞానం మృగ్యమైపోతోంది. విద్యార్థుల సంగతి అలా వుంచండి. అన్ని చదువులూ చదివి, బియ్యేలూ, యమ్మేలూ పాసై సర్వీసెస్ కమీషన్ పరీక్షలకు కూర్చున్నవాళ్ళుకూడా, సె్రహా

అంటే అదోరకం వింతజంతువనీ, రాజేంద్రప్రసాద్ అంటే అడయారులో ఒక భవనమనీ - సరిగ్గా ఇవే ప్రశ్నలూ, ఇవే జవాబులూ అని కాదు, అసందర్భంలోనూ, అజ్ఞానంలోనూ ఇందుకెంతమాత్రమూ తీసిపోని అవకతవకలు వ్రాయడం మనకి తెలియనిది కాదు. "పనసపండు తెచ్చి పళ్ళెంలో పెడితే తినలేని బ్రాహ్మడు దిక్కు-దిక్కులు చూశా"డని మన పొడుపు కథ ఉంది. మన విశ్వవిద్యాలయాలూ జాతీయ ప్రభుత్వాలూ ఈ పొడుపు కథ గురించి జాగ్రత్తగా ఆలోచించగలవని ఆశిస్తున్నాను.

సాధారణంగా ఏ ఉద్యమానికైనా ముఖ్యసూత్రాలన్నీ ఆదరణీయంగానే, అంగీకారయోగ్యంగానే కనబడతాయి. ఈ మధ్య వందమందికి పైగా రచయితలు సంతకం చేసిన దస్తావేజు చూస్తే అందులో ఉన్నతాశయాలకి అభ్యంతరం చెప్పవలసిన అవసరమే కనబడదు. ఎటొచ్చీ ఈ ఆశయాలు ఆచరణలోనికి రావలసివచ్చినప్పుడే తబ్బిబ్బులూ, తడబాటులూ, తికమకలూ వచ్చిపడతాయి. అందుకనే ఇటీవల నేను అఖిలభారతదేశపు పి. ఇ. యన్. పెన్ క్లబ్బులో నా సభ్యత్వానికి రాజీనామా ఇస్తూ అందుకు ఒకే ఒక కారణాన్ని పేర్కొన్నాను. "మానవమాత్రుడినైన నాకు మహోన్నతాలైన మీ ఉత్తమాదర్శాలను అందుకోవడం కష్టంగా ఉం"దని. "సత్యంవద, ధర్మంచర" అంటే కాదనే వాళ్లెవరు? వచ్చిన చిక్కల్లా ఆ సత్యం అనేదేమిటో, ధర్మం అనేదేమిటో విశదీకరించడంలోనే ఉంది. ఎప్పుడూ ఆదర్శాలను గురించే మాట్లాడేవాళ్ళని ఎప్పుడూ మనం అనుమానించవలసే వుంటుంది. అందుకనే అభ్యుదయవాదులకి కూడా కొన్ని ఆశయాలున్నప్పటికీ వాటినిక్కడ సవిస్తరంగా వల్లించడం మానేస్తూ ఆచరణ రూపంలోనికి వాటి ననువదించగల సాధనాలకోసం మనమందరమూ కలిసి అన్వేషించవలసిన అగత్యానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాను. ప్రతి రచయితా అమూల్యంగా ఎంచుకునే వ్యక్తిత్వానికది ఎంతమాత్రమూ భంగకరంకాదు. విడివిడిగా ఏ ఒక్కడూ చెయ్యలేని పనులు సాహిత్యానికి సంబంధించినవి

ఎన్నైనా ఉన్నవి. కలిసి కట్టుగా పనిచెయ్యడంవల్ల వీటిని మనం సాధించగలం. ఎవడికి తోచినట్టు ఎవడికి చేతనైనట్టు వాడు వ్రాసుకోకుండా ఈ సంఘాలెందుకు, సమాజాలెందుకు, ఉద్యమాలెందుకు అనుకొనేవారికి జవాబుగా మన కార్యక్రమాన్ని బహుముఖాలుగా రూపొందించుకోవలసి ఉంది.

మన కార్యక్రమంలో మొట్టమొదటిదీ ముఖ్యంగా పేర్కొనవలసినదీ రచయితల ఆర్థిక పరిస్థితిని బాగుచెయ్యడం. చంద్రమౌళిలోని అమృతాన్నిమాత్రమే సేవిస్తూ ఏ రచయితకూడా ఎంతో కాలం జీవించలేడు. అందరిలాగే అతడుకూడా అన్నవస్త్రాల అగత్యం ఉన్నవాడు. ఈ విషయాల్లో నేటి ప్రభుత్వాలు అవలంబిస్తున్న పద్ధతులు కనుతుడుపుగానే పరిణమిస్తున్నాయి గాని రచయితలకు కావలసిన భద్రతను సమకూర్చలేక పోతున్నాయి. రాజకీయ బాధితులకు భూములు కట్టబెట్టినట్టుగా అనుగ్రహపాత్రులైన ఏ కొద్దిమందికో అంగవస్త్రాలను (అన్నవస్త్రాలనుకాదు) సమర్పించడంతో ఆగిపోతున్నారు మన ప్రభువులు. మనలో కొందరు గిరీశాలు "మానాస్తం హైద్రాబాదు నవాబు వద్ద వెయ్యి సిక్కా రూపాయాల ఉద్యోగం సంపాదించలేక పోతామా" అని అడియాసలు పెట్టుకోవచ్చు. సమష్టిపరమైన సమస్యను వ్యక్తిగతంగా పరిష్కరించాలని చూసే ప్రయత్నాలు నేడు పెచ్చుపెరిగి పోతున్నవి. అందువల్లనే ఏ ఒక్కడికో పాడిగేదెలాంటి పదిలమైన ఉద్యోగమూ, పదిమంది పస్తులంతో మాడిపోవడమూ ప్రత్యక్షంగా కనబడుతోంది. అభ్యుదయ రచయితల సంఘం ఈ పరిస్థితులన్నింటినీ నిశితంగా పరిశీలించి తరుణోపాయాలను కనిపెట్టగలుగుతుందని నాఆశ. నిరక్షరాస్యత పూర్తిగా నిర్మూలించబడ్డ పాశ్చాత్య దేశాలదాకా పోనక్కర లేకుండానే మన పొరుగునఉన్న తమిళ రచయితలను చూచి మనం నేర్చుకోవలసిన గుణపాఠాలు చాలా ఉన్నాయని చెప్పసాహసించినందుకు నన్ను క్షమించండి ఇప్పుడున్న కాపీరైటుచట్టం ఎంతో అసమగ్రమే అయినప్పటికీ దాని ద్వారానే తమకు

సంక్రమిస్తున్న హక్కులు మన రచయితలలో ఎంతమంది వినియోగించుకోగలుగుతున్నారు? పాతిక ముప్ఫయి సంవత్సరాలకి పూర్వంకంటె ఈనాడు రచయిత రచయితగా జీవించడానికి ఎన్నో మార్గాలు తెరుచుకొనిఉన్నాయి. అయితే ఈ మార్గాలనిండా ఎంతో చెత్తా, చెదారమూ మన మ్యునిసిపాలిటీల వీధుల్లోలాగ నిండి ఉన్నాయి. చీపురుకట్టలు పట్టుకోవడం ఆత్మగౌరవానికి భంగం అనుకోకుండా రచయితలు ఈ మార్గాలను శుభ్రంచేసి రహదార్లుగా మార్చవలసిఉంది.

ఈ మార్గాలకి ఒక ఉదాహరణగా రేడియోను పేర్కొంటున్నాను. అభ్యుదయ రచయితల సంఘం ఏదో రాజకీయ పక్షానికి అమ్ముడుపోయిందని నిందారోపణలు చేసేవారిని నా మాటలు కాస్త జాగ్రత్తగా మననంచేసుకోవలసిందని అభ్యర్థిస్తున్నాను. మన రేడియో నూటికి నూరుపాళ్ళు ప్రభుత్వం జారీచేసే తాఖీదులను అమలుపరచే సంస్థ. కనీసం విశ్వవిద్యాలయాలకు ఉంటున్నదనుకున్నపాటి స్వపరిపాలనాధికారం కూడా రేడియోకిలేదు. స్వాతంత్ర్య వాయువులు పీల్చడానికి అలవాటుపడ్డ మనిషి మన రేడియో స్టేషన్లలో ఏ హోదాలో ప్రవేశించినా ఉక్కిరిబిక్కిరై పోతాడు. అడుగడుగునా అక్కడ భయమో, రాజసమో ఎదురుపడతాయి. మన రాజ్యాంగం గ్యారంటీ చేస్తున్న వాక్స్వాతంత్ర్యం రేడియోకిసంబంధించినంతమట్టుకు శశవిషాణప్రాయమని చెప్పడానికి విచారిస్తున్నాను. సెన్సారు విధానం కూడదని నేననడంలేదు. వేలకొలది గృహాలలోకి సరాసరిగా ప్రవేశించే, లక్షలకొలది ప్రజానీకం చెవులలోకి సూటిగా ప్రసరించే రేడియోమీద అజమాయిషీ నిస్సందేహంగా అవసరమే. కాని సృజనాత్మక రచనలమీదసహా రేడియోవిధించే ఆంక్షలు చిత్ర విచిత్రంగా ఉంటున్నాయి. నేటి పరిస్థితులలో రేడియో ఒక గుత్తవ్యాపారం. పావుగంట పాటకీ, పావుగంట నాటికకీ ఇచ్చే ప్రతిఫలంలో భేదం ఉంటుంది. రేడియోలో ఉన్నంత ఎర్రటేపు ప్రభుత్వ సంస్థలలో ఇంకెక్కడ చూడబోమనుకుంటాను. ఇనపచట్రం అనేమాట

ఇక్కడ సార్థకం. ఈ మధ్య కొన్ని పత్రికలకీ, రేడియోకీ జరిగిన వివాదం అందరికీ తెలుసుననుకుంటాను. దాని మంచి చెడ్డలమాట ఎలా వున్నా తొలినుంచి తుదిదాకా రేడియో అధికారులు అవలంబించిన మౌనవ్రతంమాత్రం క్షంతవ్యంగా కనబడదు. "కుక్కలు అరుచుకుంటూనే ఉంటాయి; బిడారం సాగిపోతుంది" అని సర్ సామ్యూల్ హోరనుకుంటాను, ఆ నాటి మన దేశభక్తుల్ని గురించి అన్నమాటలిక్కడ జ్ఞాపకం వస్తున్నాయి. అధికారగర్వం అంటే అదే! ఆనాటిది నిరంకుశ ప్రభుత్వం పోనీ అనుకుంటే ఈనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వంలోకూడా అదే దృక్పథం ప్రతిఫలించడం ఆశ్చర్యకరమే!

ప్రజాభిప్రాయాన్నింత తృణప్రాయంగా చూసే ప్రభుత్వ సంస్థలతో ఎలా వ్యవహరించాలన్నది చాలా క్లిష్టమైన సమస్య. దీనిని గురించి మనమంతా కలిసి అతి జాగ్రత్తగా ఆలోచించాలి. గిడుగు రామమూర్తి పండితునివంటి దిగ్దంతిని బాసటగా పెట్టుకొని ఒక నవ్యసాహిత్య పరిషత్తు మన విశ్వవిద్యాలయాలచేత వాడుక భాషను గుర్తించేటట్లు చెయ్యలేకపోయిందంటే అందుకు కారణం వ్యావహారిక భాషోద్యమంలోని బలహీనత కాదనీ, పకడ్బందీగా తయారయిన ఈ ఇనపచట్రపు బలాధిక్యమే అనీ చెప్పవలసిఉంది. కాబట్టి ఇప్పుడు మన ఇంకొక కర్తవ్యం విశ్వవిద్యాలయాలలో జీవద్భాష అయిన వ్యావహారికాంధ్రానికి సముచితస్థానం సంపాదించడానికి నిరంతరాందోళన సాగించడం. ఇదివరకటికంటె ఇప్పుడిది ఎక్కువ చిక్కులతో కూడుకున్నపని. అయినా మనం సర్వశక్తులనూ సంఘటితం చేసుకొని వాడుక భాష ప్రాధాన్యాన్ని విశ్వవిద్యాలయాలలో ప్రతిష్ఠించాలి. వ్యావహారిక భాషావాదం ప్రజల ఉద్యమం. నేడు కాకపోతే రేపయినా ఇది జయించి తీరుతుంది. గ్రాంథికభాష పరిమిత ప్రయోజనం కలదనీ, వాడుకభాష అపరిమిత ప్రయోజనం కలదనీ సిద్ధాంతీకరించిన గిడుగు పండితుని ప్రధాన సూత్రాల నింతవరకెవ్వరూ పరాస్తం చెయ్యలేదు. అయితే వాడుకభాష నెలాగ బోధించాలో తెలియక, సరియైన పాఠ్యగ్రంథాలు

లేక, వాడుకలో క్రమక్రమంగా భాషపొందుతూ వచ్చేమార్పులను వివరించి, విశదీకరించగలిగే వ్యాకరణాలు లేక నేటికిన్నీ ప్రాథమిక పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాలదాకా అంతటా పాతకాలపు భాషాబోధనా పద్ధతులనే అంటిపెట్టుకొని ప్రాకులాడడం తప్పనిసరి అయింది. పత్రికలలో, సినిమాలలో, రేడియోలలో ఈనాడు మొత్తం తెలుగు దేశములో నూటికి తొంభయి పాళ్ళు వాడుక భాష వ్యాపించి ఉన్నప్పటికీ అధికార వర్గాలుమాత్రం ఈ యాథార్థ్యాన్ని గుర్తించకపోవడం శోచనీయం. అరసున్నాలకోసం విద్యార్థుల కాలమంతా వ్యర్థంచేస్తే విషయ పరిజ్ఞానం నిండు సున్నా అయిపోతుంది. కొమ్ములు తిరిగిన పండితులు వ్రాసిన గ్రాంథిక భాషలో కూడా గిడుగు మహనీయుడు తప్పులుపట్టి ఆ భాషలోఉన్న కృతకత్వాన్ని బయలుపెట్టిన సంగతి మనకు తెలియనిదికాదు. ఆనాడు గట్టిగా నోరెత్తడానికి సాహసించలేకపోయినవారు ఈనాడు తోసుకొచ్చి ఆభాస భూయిష్టమైన ఈ భాషను పునరుద్ధరించాలని చూస్తున్నారు. గతం కూడ వీరికి గల మమత వర్తమానపు అవసరాలను గుర్తించనివ్వదు. నిగళాల వంటి నియమాలకి నివాళి పట్టడం బానిస ప్రవృత్తికి ప్రధాన లక్షణం. భాషా విషయంలో ఇటువంటి పట్టింపులలో కరడుకట్టిపోతూన్న మన విశ్వవిద్యాలయాలు ఏ మార్పునూ అంగీకరించలేని ఏకశిలా నగరాలుగా తయారవుతున్నాయి.

ఈ పరిస్థితులను సరిదిద్దడానికి అభ్యుదయ రచయితల సంఘం పూనుకోవాలంటే సమగ్రమయిన నిఘంటువూ, సంపూర్ణమయిన వ్యాకరణమూ, సలక్షణమైన ఛందశ్శాస్త్రమూ, నిర్మించడానికి తన శక్తుల నన్నిటినీ కేంద్రీకరించాలి. ఇందుకుగాను దేశమంతటా భాషకోసం కృషిచేస్తున్న పండితులందరినీ కూడగట్టుకోవాలి. కనీసం అభ్యుదయ రచయితల సంఘపు ఆరవ మహాసభ జరిగే నాటికి బ్రౌన్ నిఘంటువును సరియైన సంపాదకత్వం కింద వెలువరించగలిగితే కొంతలో కొంత కృతకృత్యులమయినట్లు సంతోషించవచ్చును. స్వర్గీయ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి “నుడికడలి”

అనే అచ్చ తెలుగు నిఘంటువును కూడా తెలుగులోకి తీసుకురావడానికి మనసంఘం పూనుకోవాలి. అలాగే వ్యాకరణ నిర్మాణం కూడా! నా ఉద్దేశంలో యిది నాగార్జున సాగర నిర్మాణంకన్న కూడా కష్టమైన పని! "తెనుగున కున్న వ్యాకరణ దీపము చిన్నది" అని చాలాకాలం క్రిందట చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారన్నారు. ఇవి విద్యుద్దీపాల రోజులని మనం రుజువు చెయ్యాలి. ఇక ఛందశ్శాస్త్రం సంగతి! ఛందస్సులతో నిమిత్తం లేనట్లు కనిపించే వచన గీతాల సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రవచించిన నేను ఛందోమార్గాలను గురించి మాట్లాడడం కొంత విడ్డూరంగానే కనబడవచ్చును. కాని గణబద్ధమైన దోక్కట్టే ఛందస్సు కాదు. నియమిత స్థలాలలో యతిప్రాసలను నిలబెట్టినంత మాత్రంచేత పద్యం ప్రాణవంతం కాదు. ఛందోరహస్యాలు గణయతిప్రాసలకు మాత్రమే పరిమితమైనవి కావు. అంతేకాక తెలుగు ప్రతిభ గణబద్ధ చ్ఛందస్సులలో కంటె మాత్రాబద్ధ చ్ఛందస్సులలోనే ప్రస్ఫుటంగా ప్రభాసిస్తుంది.

వాడుక భాషకీ, మాత్రాచ్ఛందస్సులకి ఒక అవినాభావసంబంధంవుంది. సాహిత్యలోకంలో దీనిని మొట్టమొదటిసారిగా ముత్యాలసరాలనే పేరిట మహాకవి గురజాడ మనకి గుర్తుకి తెచ్చాడు. అయితే అప్పటికింకా కవిత్వానికి వాహనంగా గ్రాంథికభాష ప్రాముఖ్యం వహించడంచేత గురజాడ గేయాలలో చాలాచోట్ల గ్రాంథిక రూపాలు కనబడుతూ వుంటాయి. ఒక కొత్త భూఖండాన్ని కనిపెట్టడానికి బయలుదేరిన సాహసికయాత్రికుడు గురజాడ! కన్యాశుల్కం మొదటి ముద్రణ ప్రతిలో కొన్ని కృతక వ్యావహారిక రూపాలున్నవన్న సంగతి మనం మరచిపోకూడదు. వాటినన్నిటినీ తరువాత తరువాత సవరించి వ్యావహారిక భాషకు వాల్మీకి అయినాడాయన. పండితులను సంతృప్తిపరచడానికి సుభద్రాపరిణయంవంటి ప్రబంధం రచించడానికిబదులు మాత్రాచ్ఛందస్సుల మీదనే ఆయన మరికొంత కృషి సాగించివుంటే మన కింకా ఎన్ని అమూల్యమణులు లభించివుండేవో!

రసప్రపంచంలో గురజాడ ధ్రువతార అయితే వీరేశలింగం ఒక

విజ్ఞాన సర్వస్వం. దురాచారాల గాఢాంధకారంలో నిద్రపోతున్న జాతిని మేలుకొలిపి విజ్ఞానపు వెలుగులు ప్రసరించిన మహనీయుడు. ఆంధ్రుల అభ్యుదయోద్యమానికి మూలపురుషుడు. ప్రతికూలశక్తుల ఝంఝా ప్రభంజనానికి చెక్కుచెదరకుండా నిలబడి శాఖోపశాఖలుగా విస్తరించిన వటవృక్షం. తెలుగులో మొట్టమొదటి వాస్తవిక నాటకం గురజాడ రచిస్తే మొట్టమొదటి వాస్తవికత నవలను వీరేశలింగం రచించాడు. తన కథలలో, కవిత్వంలో గురజాడ భావ విప్లవం తీసుకువస్తే వీరేశలింగం తన జీవితంలోనే దాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించాడు. విభిన్న భావాల సంఘర్షణలో తాటస్థ్యానికి తావులేదని ఇద్దరూ తమ తమ రచనలలో విస్పష్టంచేశారు. మూఢవిశ్వాసానికి విరుగుడు శాస్త్రీయ విజ్ఞానమే అని ఇద్దరూ తమ రచనల ద్వారా ప్రచారం చేశారు.

గిడుగు, గురజాడ, వీరేశలింగం! మీరు జల్లిపోయిన విజ్ఞాన బీజాలు ఇప్పుడిప్పుడే ఫలవంతమవుతున్నాయి. అయినా అసలు మీరు పుట్టనేలేదన్నట్లుగానో, మీరు సలిపిన పరిశ్రమ అంతా విఫలమయిపోయినట్లుగానో, ఏ శక్తుల మీద మీరు తిరుగుబాటు చేశారో వాటినే ఊతకర్రలుగా చేసుకొని ఇంకా ఇంకా వెనక్కి పోవాలని ఈ యిరవయ్యో శతాబ్దపు 55 వ సంవత్సరంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభ్యుదయ రచయితలమైన మనం, గిడుగు సంప్రదాయాలలో గురజాడ కావ్యవాహినులలో వీరేశలింగం విప్లవ ధోరణులలో ప్రాణవాయువులు పీల్చుకుంటున్న మనం నిస్సందేహంగా ఆంధ్ర సాహిత్యపరిణామంలో అగ్రశ్రేణిని పయనిస్తున్న మనం, మళ్ళీ మనల్ని పాత రాతియుగానికి పట్టుకుపోయే ప్రయత్నాలను సహిస్తామా అని ప్రశ్నిస్తున్నా, జవాబుకోసం ఆగకుండానే (అది యెలాగుంటుందో నాకు ఎలాగూ తెలుసును కాబట్టి) ఇంతటితో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

★

# కథా, నవలా

## కొడవటిగంటి కుటుంబరావు

ఈనాటి తెలుగు సాహిత్య మంతటిలోకీ హెచ్చుగా పరిణామం చెంది యుగధర్మాన్ని సమగ్రంగా ప్రతిబింబిస్తున్నవి చిన్న కథా, నవలా అని ఒప్పుకు తీరాలి. కాని ఈ పరిస్థితి మన సాహిత్యం తాలూకు ఆధునికయుగం ఆరంభం నుంచీ ఉన్నటువంటిది కాదు. ఈ యుగం 19 వ శతాబ్దం చివరి భాగంలో, అక్కడా అక్కడా చెదురుగా వెలువడిన రచనలతో ఆరంభమై తొలిప్రపంచ యుద్ధం ముగిసేనాటికి ఒక ఉద్యమరూపం దాల్చింది. సాహితీ సమితి ప్రారంభమయే నాటికి ఉండిన రచయితలు ఆధునిక సాహిత్యయుగంలో నవశకం ఆరంభించారు.

అప్పటికి కూడా రచయితలలో హెచ్చుభాగం కవులే. కథకులూ, నవలాకారులూ ఉండేవారే గాని వారి సంఖ్య బహుతక్కువ. వచన రచన గ్రాంథికంలోనే నడిచేది. గిడుగు రామమూర్తిగారి వ్యావహారిక భాషావాదం నవ్యుల ఆమోదం పొందినప్పటికీ వ్యావహారికభాషను సాహిత్యానికి పూన్చేవారు అంతగా లేకపోయారు. తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగాన్ని ప్రారంభించిన అమర కవి గురజాడ వ్యావహారిక భాషలో పద్యాలూ, కథలూ, నాటకాలూ రాసినా కథల శకం ఆరంభమయేదాకా వ్యావహారిక భాషలో వ్యవసాయం చురుకుగా సాగనే లేదు. కథల శకం పత్రికలతోబాటే పుట్టిపెరిగింది. పత్రికా పఠనం ప్రజలలో అభివృద్ధి చెందిన కొద్దీ కథల సంఖ్యా, కథకుల సంఖ్యా అభివృద్ధి అయింది.

పత్రికలు యంత్ర యుగానికి చెందినవి. అచ్చు యంత్రాలు చాలాకాలంగా ఉంటున్నా, ఈ యంత్రాలలో ఇటీవల కలిగిన అభివృద్ధి చాలా గొప్పది. "సాహితి" సంచికలు అచ్చువేసిన ప్రెస్‌లో ట్రెడిల్ కూడా వుండేది

కాదు. ఈనాడు విస్తారమైన ప్రచారంగల రెండువారపత్రికలు పోటీల మీద శరవేగంతో అచ్చవుతాయి. పూర్వం అయిదు పత్రికలున్నచోట ఇవాళ కనీసం నూరు పత్రికలున్నాయి. ఈ మార్పుల ఫలితాలు కథాసాహిత్యంమీద ఉండక తప్పదు.

గురజాడ అప్పారావుగారు రెండు కథలు మాత్రమే తెలుగులో రాశారు. నేను గడిచిన పాతిక ఏళ్ళకాలంలో అనేకవందల కథలు రాసి ఉంటాను. డజన్ల లెక్కనా, వందల లెక్కనా కథలు రాసినవారు ఆంధ్రలో చాలా మంది ఉన్నారు. ప్రచురించటానికి పత్రికలు లేకుండా ఇది సాధ్యం కాదు. పుస్తకాలు ప్రచురించి చేతి డబ్బు ముందు ఖర్చు చేసుకోవాలిసిన పరిస్థితిలో ఎవరూ వందల సంఖ్యలో కథలు రాయరు. పుస్తకాలు ప్రచురించి వాటిద్వారా కథకులుగా గణనకు రాగోరినవారు ఎంతో మంచికథఅనీ, తప్పక రాసి తీరవలసిన కథ అనీ అనుకుంటే తప్ప రాయరు. పత్రికల ధర్మాన కథకులు ఒక మాదిరి కథలూ, అంత బాగా లేని కథలూకూడా రాయటం జరిగింది. వాటిని రాసినందువల్ల నష్టంలేదు. ప్రచురించే పత్రికలున్నాయి; ఒక్కొక్కప్పుడు పడిన శ్రమకు తృణమో పణమో ముట్టుతుంది కూడ!

ఇటువంటి కథలన్నీ రాసినందువల్ల కలిగిన లాభమేమిటని అడగవచ్చు. లాభం లేకపోలేదు. పత్రికలలో అచ్చయినంత మాత్రాన తక్కువరకం కథలకు సాహిత్యగౌరవం ఎన్నటికీ రాదు కాని పత్రికలను మేపటానికి వందల సంఖ్యలో కథకులు పుట్టుకురావటం తటస్థించింది. "ఉత్తమ సాహిత్యం అవుతుందా, లేదా?" అని ఆలోచిస్తూ కూర్చోకుండా పత్రికలు అనేక కథకుల కథలను, ఏదో ఒక సుగుణం చూసుకొని, ప్రచురించాయి. ఇందువల్ల చాలా చెత్తసాహిత్యం సృష్టి అయినప్పటికీ అనేకమంది కథకులు రచన చెయ్యటానికి ప్రోత్సాహం లభించినవారైనారు. వారిలో కొందరు ఉత్తమ తరగతి కథకులుగా పరిణమించటం కూడా జరిగింది.

సాహిత్య రచన, అందులోనూ కథారచన, ఒక వృత్తి కాదు. ఈనాడు కూడానూ, ఉపాధ్యా

యులూ, జర్నలిస్టులూ, వైద్యులూ, గుమాస్తాలూ, వ్యాపారం చేసుకునే వాళ్లూ కథలు రాస్తున్నారు. ఇంకే సాహిత్య రూపంలోనూ కృషి చేయని వారు కేవలం కథలురాసి పేరు తెచ్చుకోనటం జరిగింది. అసలు వీరిని ప్రోత్సహించే పత్రికలే లేకపోతే వీరిలో నూటికి ఒకరు కూడా సాహిత్యం ఛాయలకువచ్చి ఉండరేమో!

ఇదే నవలలకుకూడా వర్తిస్తుంది. పత్రికలు విజృంభించక పూర్వం నవలలు రచించిన వారు చరిత్ర మీాది మమకారం కొద్దీ, నవలలు రాసి అచ్చువేయించుకుని కీర్తి, కొంత ధనమూ సంపాదించు తామనీ రచనచేశారు. పత్రికలలో ధారావాహినిగా నవలలు ప్రచురణ కాసాగిన అనంతరం నవలలు రాసే ప్రేరణ ఇతరులకు కూడా కలిగింది.

కథలూ, నవలలూ అభివృద్ధికి రావటంలో పత్రికలు నిర్వహించిన పాత్ర అనన్యమైనది. ఈనాడు కూడా పత్రికలు ప్రోత్సహించని సాహిత్యరూపాలు అడుగున పడి ఉండటం కనిపిస్తూనే ఉన్నది.

మంచిచెడ్డల విచక్షణ అటుంచి సాహిత్యం పరిమితంగా సృష్టి కావటంలోనూ, బహుళంగా సృష్టి కావటంలోనూ ఒక ముఖ్యమైన తేడాఉన్నది. బహుళంగా ఉత్పత్తి అయే సాహిత్యం విధిగా ప్రజలకూ జీవితానికీ సన్నిహితంగా వచ్చి తీరుతుంది. కొద్దిమంది కథకులే ఉన్నప్పుడు వెలువడిన కథలలో పాత్రలను "ఉదాత్తం"గా ఉంచటానికి పడినపాట్లూ, వ్యావహారిక భాషలో రాయటానికి చేసిన ప్రయత్నంలో రచయితలను పట్టుకున్న బెదురూ స్పష్టంగా గోచరిస్తాయి. రచయితలసంఖ్య హెచ్చిన కొద్దీ భాష ధారాళంగానూ, పాత్రలు స్వాభావికంగానూ పరిణమించటం జరిగింది. ఇది కథా సాహిత్యానికి జరిగిన సామూహిక లాభం. ఈ ప్రయోజనం ప్రత్యేక కథలలో పాక్షికంగా మాత్రమే ప్రతిబింబించింది.

అనాదిగా వచ్చే కథాసాహిత్యాన్ని పరిశీలించి నట్టయితే కథల యొక్క స్వరూప స్వభావాలలో పరిణామం కనిపిస్తుంది. పురాణాల లోని కథలు వాస్తవ గాథలు. వాటిలో అతిశయోక్తులుండవచ్చు.

వాటిని రాసినవారి అపోహాలూ, మూఢ విశ్వాసాలూ ఒక్కొక్కప్పుడు వాటిలో ప్రతిబింబించి ఉండవచ్చు. కాని వాటిని రాసినవారు, అవి యదార్థ సంఘటనలనే విశ్వాసంతోనే వాటిని రాశారు. ఈ కథలను ఎవరో ఇంకెవరికో చెప్పారని మరెవరో వేరెవరికో చెప్పినట్టు పురాణకారులు రాశారు. అవి గత చరిత్రకు చెందిన దృష్టాంతాలుగా మాత్రమే రచించబడ్డాయి. కథకుడు ఆ కథలకు సాక్షి కాడు, సమకాలికుడు కూడా కాడు. ఈ కథలలో సామాజిక మనస్తత్వం ప్రతిబింబించదు.

వీటిమీద ఎంతో పరిణామం చెందినవి నీతి కథలు. అవి కేవలం కల్పితాలు. పక్షులమీదా, జంతువులమీదా పెట్టి మానవుల వ్యాపకాలను తీవ్రంగా విమర్శించిన వ్యంగ్య రచనలు. వీటిలో సామాజిక మనస్తత్వం పుష్కలంగా ఉన్నది.

ఆధునిక కథలు పురాణ కథలలాగా వాస్తవమైనవి కావు, నీతి కథలలాగా అభూత కల్పనలు కావు. ఇవి కల్పిత వాస్తవికత కథలు. స్వరూపాన్నిబట్టి ఈ కథలలో వాస్తవికత నూటికి నూరుపాళ్ళు ఉండవలసిందే, గత్యంతరం లేదు. ఈ వాస్తవికత కథనంలో, పాత్ర చిత్రణంలో, సంభాషణలో సంఘటనలలో ఉండి తీరాలి. వీటిలో మనస్తత్వానికి చాలా ప్రాముఖ్యం ఉన్నది. ఇవి పురాణ కథలలాగా ఒక ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని దృష్టాంతంకింద చెప్పుకునేవి కావు. నీతి కథలలోలాగా వీటిలో ఒక విస్పష్టమైన నీతికూడా ఉండదు. వీటిలో జీవిత ఖండాలు ప్రతిబింబిస్తాయి—సమకాలిక జీవిత ఖండాలు.

ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే, కథలు చెప్పటానికి మూడు మార్గాలున్నాయి. ఒకటి, ఎవరో చెప్పగా విన్న విషయాలు చెప్పటం; రెండు, కథకుడు తాను ప్రత్యక్షంగా చూసిన విషయాలు చెప్పటం; మూడు, కథకుడు తన అనుభవాలనే చెప్పటం. ఇందులో మొదటి పద్ధతి పురాణకథలలో కనిపిస్తుంది. మిగిలిన రెండూ ఆధునిక కథా సాహిత్యంలో అమలులో ఉన్నాయి. అందుచేత కథకుడు ఈనాడు విధిగా సమకాలిక సంఘటనలనే

చెప్పాలి. కథా సరిత్సాగరంలో చాలాచోట్ల తమ అనుభవాలను గురించి చెప్పటం మనకు కనిపిస్తుంది. ఇదే పద్ధతిని కాశీమజిలీలలో కూడా మనం చూస్తాం. అయితే అటువంటి కథలకు శ్రోతలు పాఠకులు కాదు — ఇతర పాత్రలు. ఆ సాహిత్యంలో స్వానుభవాలు చెప్పించటం శిల్ప చమత్కృతి మాత్రమే.

ఈనాటి కథ – నవలకూడా – స్వరూపం సంబంధించినంతమట్టుకు పరిపూర్ణమైన పరిణామాన్ని సాధించింది. కథ చెప్పటానికి ఆదర్శప్రాయమైనదైన మాట్లాడే భాషలో ఈనాటి కథలూ, నవలలూ రచించబడుతున్నాయి. వీటిలో ప్రధాన పాత్రలు ఈనాటి జీవితంలోని అన్ని తరగతులకూ చెందినవిగా ఉంటున్నాయి. వర్తమాన జీవితమే ఈ కథలలో, నవలల్లో ప్రతిబింబిస్తున్నది.

కాని ఈ రచనల స్వభావమే ఒక్కొక్క-సారి పెడత్రోవ బడుతున్నది. కథలకూ, నవలలకూ వుండదగిన స్వభావం గురించి ఒక్కొక్కప్పుడు కథకులకే స్పష్టమైన అభిప్రాయాలుండటం లేదు.

ఆధునిక కథయొక్క స్వరూపాన్ని అర్థం చేసుకుని అటువంటి స్వరూపంగల సాహిత్యం యెటువంటి స్వభావం కలిగి వుండాలో అంచనా కట్టటం అసాధ్యం కాదు. ప్రజలకు సన్నిహితమైన భాషలో ప్రజలను చైతన్యవంతులను చెయ్యలేని కథలు రచించి ప్రయోజనమేమిటి?

కందుకూరి వీరేశలింగంగారు మొదట్లో భాషతో గరిడీసాము చేసికూడా, పదిమందికీ తెలియవలసిన విషయాలు చెప్పటంకోసం అతిసులువైన భాష అవలంబించారు. ఆయనకు భాషతాలూకు స్వరూప స్వభావ సంబంధం తెలిసివచ్చింది. ఈనాటి కథకులు మట్టుకు ఒక్కొక్కప్పుడు అందరికీ అర్థమయే భాషలో దాదాపు యెవరికీ అక్కర్లేని కథలు రాస్తున్నారు. ఇది తప్పు.

కథలలో నిత్యజీవితం తాలూకు పాత్రలుంటున్నాయి. కాని ఒక్కొక్కప్పుడు ఆ పాత్రల స్వరూపానికీ స్వభావానికి సంబంధం వుండదు. కార్మికుడికి మధ్యతరగతి మనస్తత్వమూ, మధ్యతరగతి వాడికి జమీందారీ మనస్తత్వమూ అంట

గట్టుపడుతుంది. ఈనాటి కథలలో జీవితం ప్రతిబింబించ బడుతుంది, కాని చాలా కథలలో జీవిత సత్యం లోపిస్తుంది.

ఈనాటి కథా సాహిత్యంలోని లోపాలన్నీ ఈ విధమైనవే. ఈ కథలకు ఆయువుపట్టు వాస్తవికత. వాటి స్వరూపం వాస్తవికతకు అనుకూలమైనది. అది కథలస్వభావంలో కూడా ప్రతిబింబించినప్పుడే అవి ఉత్తమ కథ లనిపించు కుంటాయి.

కథలలో, నవలల్లో ప్రతిబింబించే జీవితం తాలూకు వాస్తవికత, జీవిత సత్యం మాత్రమే. ఈ సత్యం వ్యక్తం కానప్పుడు జీవితాన్ని ఎంత వివరంగా చిత్రించి కూడా ఏమీ ప్రయోజనం లేదు. ఆ జీవిత సత్యమే రచనను అభ్యుదయ రచనగా చేసేది.

"జీవితసత్యం," "వాస్తవికత," "అభ్యుదయం" మొదలైన మాటలు రాజకీయ పరిభాష అని అపోహ పడే వాళ్ళు ఈనాడుకూడా చాలా మంది ఉండటం శోచనీయం. మార్క్సిస్టు సాహిత్యం పరిచయం లేకుండానే శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తాము రచించిన కొన్ని కథలలో జీవిత సత్యాలను ప్రతిభావంతంగా చిత్రించారు. ఒక కథలో ఒక అస్పృశ్యుడు ఇస్లాము మతం తీసుకుని సమాజం మధ్యకివచ్చి వెలి వెయ్యమని సవాలు చేస్తాడు. ఆయన రచించిన మరొక కథలో ఒక శ్రోత్రియ కుటుంబానికి చెందిన యువకుడు బతుకు తెరువు గానక హోటలు పెడతాడు. ఇదేవిధంగా, కమ్యూనిస్టు రాజకీయాలను తీవ్రంగా ప్రతిఘటించిన సురవరం ప్రతాపరెడ్డిగారు తమ కథలు కొన్నింటిలో జీవిత సత్యాన్ని చాలా చక్కగా చిత్రించారు. పాఠకులను సమ్మోహింప చేయుటంలో అసాధారణ ప్రతిభగల చలంగారు జీవిత సత్యాన్ని అంతగా వ్యక్తం చెయ్యలేక పోయినా, జీవితంలోని అసత్యాలను ఘాటుగా ఖండించారు.

ఆధునిక యుగంలో అనేక మంది కథకులూ, నవలాకారులూ కూడా ఈ సాహిత్య రూపాల స్వభావాన్ని తృణీకరించి, స్వరూపాన్ని తీర్చి దిద్దటంలో ప్రావీణ్యం సంపాదించి ఖ్యాతి సంపాదించు కున్నారు. దీనికి మనం ఈ నాడు

విచారించనవసరం లేదు. ఎందుకంటే కథయొక్క స్వరూపంలో కలిగిన ఈ వాంఛనీయమైన పరిణామం ఏ ఉద్యమమూ లేకుండానే సాగింది. నవ్య సాహిత్య పరిషత్తు పుట్టి ఉద్యమం సాగించినప్పటికే చాలామంది ప్రసిద్ధ కథకులు దేశంలో ఏర్పడి ఉన్నారు. వీరిని కూడగట్టి ప్రచారం ఇవ్వటం తప్ప సాహిత్య పరిషత్తు వచన రచనల స్వభావాన్ని తీర్చిదిద్దటంలో ఎంతమాత్రమూ కృషి చేయలేకపోయింది. ఆ మాటకువస్తే నవ్య సాహిత్య పరిషత్తులో వచన రచయితలు ఎప్పుడూ వెనక బెంచీల మీదే కూచున్నారు.

వచన రచయితలను ముందుకు తోసి కథకులకూ, నవలలకూ, ఇతర సాహిత్య రూపాలకూకూడా ప్రయోజనాత్మకమైన స్వభావాన్ని ఇవ్వటానికి మొట్టమొదటి సారిగా ఉద్యమం సాగించినది అభ్యుదయ రచయితలసంఘం. ఈ ఉద్యమం కొంతదూరం సాగి పరిస్థితులు వికటించటంవల్ల తాత్కాలికంగా నిలిచిపోయినాక కూడా ఉద్యమ ప్రభావం ఎంతమాత్రమూ నిలిచిపోలేదు. గడచిన పదేళ్ళకాలంలో అనేక వందలమంది కథకులు తమ రచనలద్వారా జీవిత సత్యాన్ని వివరించటానికి కృషి చేశారు. వీరి రచనలు అన్ని పత్రికలలోనూ వెలువడ్డాయి.

ఈనాటి పరిస్థితి యేమంటే, యువక రచయితలకు కొంతమార్గదర్శనం అవసరం. కొందరు కొందరు స్వరూపాన్ని గాలికి వదిలి కథయొక్క స్వభావానికి న్యాయం చేకూర్చాలనే ఆశతో వికృతమైన రచనలు చేస్తున్నారు. మరికొందరు వాస్తవాన్ని వాస్తవికతగా భావించి తృప్తిపడుతున్నారు. మరి కొందరు కొన్ని అభ్యుదయకర విశ్వాసాలయందు అపారమైన గురివుండి, వాటిని నిరూపించటం కోసం జీవితాన్ని తారుమారు చేసి చిత్రిస్తున్నారు.

రచయితకు జీవితానుభవం వుండాలి. జీవితసత్యాన్ని గ్రహించే నిశితమైన దృష్టి వుండాలి. ఏ కళకైనా అపారమైన సాధనవుండాలి. వాస్తవిక కళలకు మరీనూ.

ముందుకు చూస్తే కథా, నవలా సాహిత్యాలకు ఉజ్వలమైన భవిష్యత్తు కనిపిస్తుంది. భావిసాంఘిక పరిణామానికి మూలకందమైన

శ్రామిక వర్గంలో యింకా కళా చైతన్యం లేదు. కాని వస్తుంది. జీవితసత్యం తాలూకు కీలకం వారి చేతిలో వుంది. వారిలోనుంచి కథకులూ, నవలాకారులూ బయలు దేరి తమ జీవితాన్ని, దానివెనక దాగివుండే సత్యాన్ని చిత్రించటం ప్రారంభించినాక యీనాడు మనం చూసి మురిసే సాహిత్యం వెలవెలబోయే దీపాలలాగా గోచరిస్తుంది. ఆవర్గంనుంచి గోర్కీలూ, ఫాస్ట్‌లూ, హోవర్డ్‌లూ బయలుదేరే రోజు ఆట్టే దూరం లేదు. అభ్యుదయ రచయితల సంఘం సరిఅయిన పంథాలో కృషి చేసినట్టయితే, యీకృషికి సంఘం నాలుగు మూలలనుంచీ ప్రోత్సాహం లభించినట్టయితే ఆ రోజు మరింత దగ్గరపడి తీరుతుంది.

# గ్రహణం పట్టింది

## రెంటాల గోపాలకృష్ణ

ఓడిపోయిన వ్యాజ్యంలా
వీడిపోని త్యాజ్యంలా
ఉంది నా బ్రతుకు !

జీవితం ఒక పద్మవ్యూహం
చిక్కుపడిన అభిమన్యుణ్ణి నేను !
ప్రపంచం ఒక కౌరవసభ
పరాభవం పొందిన ద్రౌపదిని నేను !

నా ఆశాకుసుమములు విచ్చకుండా సైంధవులు అడ్డుపడ్డారు
ఎవరో ధర్మాత్ములు నన్ను చక్రబంధంలో పడేశారు
ఎవరో ధర్మరాజులు నన్ను పణంగా పెట్టారు
నా జీవితంతో జూద మాడారు !

పగిలినకుండలు నా పరువు ప్రతిష్టలు
వడగండ్ల వానవంటి కడగళ్ళు
విరిగినపాలు నా సంసారం
అడుగడుగున పరాభవం
అన్నిచోట్ల పరాజయం !
నేను కాలం గడపడంలేదు
కాలం నన్ను నడుపుతోంది !

జగత్తును చూడలేను
జనంమధ్య నిలువలేను
నన్ను నేను నమ్మలేను

నా మొహం నా కసహ్యం !
ఎవరు దీనికి కారణం ?
ఎవరు నన్ను సుడిగుండంలో నెట్టారు ?
ఎవరు ? ఎవరు ?

తిరిగీ అదే ప్రశ్న !
ప్రతిధ్వనించే ప్రశ్న
సమాధానం దొరకని ప్రశ్న !...

గండం కాళ్ళకు కట్టుకుని పుట్టాను
బాధలపేగులు మెడకు చుట్టుకుని వచ్చాను
దుష్టలగ్న సంధిలో భూపతితనమయ్యాను !
కడివెడుశోకం మోసుకుని వచ్చాను
నా జననం నాకే దోషం
పురిటిలోనే సంధి కొట్టింది !

ఉయ్యాలచేర్లలో ఉన్నారు రాక్షసులు
రంపాలతో కోసివేశారు తాళ్ళు –
తల్లి పొత్తిళ్ళలోనే తలుచుకున్నాను దరిద్రం
తల్లి స్తనాలనుండి త్రాగాను శోకం !

రాజులాంటి బ్రతుకునకు
పట్టింది రాహుగ్రహణం !
విముక్తిపొందాలని పోరాటం చేశాను
వెన్నెలచూడాలని ఆరాటపడ్డాను
నెలవచ్చింది, వెన్నెల వచ్చింది!

చీకటి, చీకటి
జీవితం శివరాత్రి
జాగారం, ఉపవాసం
జీవితానికి గ్రహణం పట్టింది

సంపూర్ణ గ్రహణం
సమస్త జగతికి పర్వదినం
జనానికి మృతాశౌచం
నా కన్నీళ్ళలో కాళ్ళు కడగండి
అందరూ సముద్రస్నానం చెయ్యండి !

మనుష్యులంతా రుష్యులై నిలవండి
మహామంత్రాలు పఠించండి
మహాయజ్ఞం ప్రారంభించండి
ఈ చీకటి చిక్కుముడిని విప్పండి
ఈ రాత్రివేళ రవిని రప్పించండి !
దివిని దించండి భువికి !

చెప్పండి నా జీవితానికి ప్రవర
తెప్పండి యజ్ఞోపవీతం !
ఒక్కమారు
నవ్వుతూ నువ్వులతో తర్పణం విడవండి
నేను తరిస్తాను
బాధలు మరుస్తాను !
ఈసారైనా
జీవితాన్ని వరిస్తాను ! ! !

# చెప్పు కింది పూలు

## అనిసెట్టి సుబ్బారావు

### మొదటి దృశ్యం

★

[ఈ కాలంలో యీ దేశంలో జరుగుతున్న సంఘర్షణ యిది. ఏదో ఒక రూపంలో, ప్రతి యింటిలో అనునిత్యం జరుగుతున్న సంఘటనలు యివి! ఆశలు, ఆశయాలు, అనురాగాలు - అన్నీ దారిద్ర్యపు ప్రళయనృత్యంలో నశించిపోయి పచ్చని సంసారాలే విచ్ఛిన్నమౌతున్నాయి.

ఒక మధ్యతరగతి కుటుంబీకుని ఇంటిలో హాలు. ఇందులో వస్తువులు - కుర్చీ, బల్ల, చిత్రాలు మొదలైన వేవీ గత యిరవయ్యేళ్ళలో కొన్నవి కావు. వృద్ధాప్యంతో ఉద్యోగం విరమించవలసివచ్చిన దశరథయ్య లాగే యీ వస్తువులన్నీ కడపటిరోజులు ఎలా గడుస్తాయా? అని కుమిలిపోతున్నాయి.

దశరథయ్య కళ్ళద్దాలకు దారంకట్టుతూ, అది తన తలకు సరిపోతుందో లేదో సరిచూసుకుంటున్నాడు. ఉన్న ఒక్కడే కొడుకు రామూమీద ఆశలు పెట్టుకుని బతుకుతున్నాడు. రామూ తల్లికిగూడ అదే ఆలోచన. అందుకే తల్లిదండ్రులు, కష్టార్జితమంతా రామూమీద పెట్టుబడి పెట్టి చదివించారు. లోకంలోకి వెళ్ళి కష్టనిష్ఠురాలు సహించి సంపాదించి సంసారాన్ని పోషించడం - రామూ ధర్మం.

ఇంతసేపూ వాకిట్లో ఎదురుచూస్తున్న తల్లి విచారంగా లోపలికొస్తుంది.]

తండ్రి: వచ్చాడా?

తల్లి: ఇంకా రాలేదు.

తండ్రి: వాడెందుకొస్తాడు! ఆ జీతం డబ్బులు చేతికొచ్చినయ్యేమో, తిరుగుతున్నాడు!

తల్లి: ఎందుకట్లా విసుక్కుంటారు! మీకు తెలియదూ, వాడట్లా తిరిగేవాడేనా!

తండ్రి: (కోపంగా) మూడురోజులనాడు పోయాడు, ఇంతవరకు అతీగతీ లేదు! విసుక్కుంటున్నానట, బుజ్జగించాలి గామాలు! ఇప్పు డింటి వాడొస్తాడు, నువ్వు సమాధానం చెపుతావా! వాడు నానా మాటలంటే పడాల్సిందేగా...

తల్లి: ఇంకా మాట పడటమెందుకు; అబ్బాయికి జీతం వస్తుందిగా; రాగానే వాడి మొహాన కొడితే సరిపోతుంది.

తండ్రి: వస్తుంది! వాడికి జీతంవచ్చేప్పటికే మనకు ప్రాణంమీది కొస్తుంది.

తల్లి: అబ్బ! ఎప్పుడూ వాడిమీద కసురుకోవడమే గాని ఒక్క మంచిమాట మాట్లాడరుగద! ఎంత దిగులుపడ్డాడో; వాడిసంగతి ఎప్పుడైనా ఆలోచించారూ, వాణ్ణిచూస్తేనే నాకు ఏడుపొచ్చింది, సరిగా అన్నమైనా ముట్టక సగమైపోయాడు! వాడి మూడురోజుల

నుంచి ఇంటికిరావడానికి జంకాడేమో; మీ పిచ్చికోపంచూసి...

తండ్రి : (నొచ్చుకుంటూ) కోపమా! నాకెందుకు కోపం! నాకు మాత్రం తెలియదూ? (పచార్లుచేస్తూ) ఏడీ? ఇంకా రాలేదేంమరి? ఒకటో తేదీకల్లా జీతం వస్తుందన్నాడుగా...

తల్లి : వస్తాడులెండి! రాగానే వాడితో సంతోషంగా మాట్లాడండి! ఒక ఆఫీసా, ఒక బజారా... ఆరునెలలు ఉద్యోగంకోసం కాళ్ళకి బలపంకట్టుకుని తిరిగాడే! అయినవాళ్ళనూ, కానివాళ్ళనూ అభిమానంచంపుకుని దేహీ అని అడిగాడే!

తండ్రి : (జాలిగా) అవును, తిరిగాడు...

తల్లి : నలుగురిలో తెలివిగలవాడనిపించుకుని, బి. ఏ. ఫస్టున పాస్సై, కష్టం అంటే ఏమిటో ఎరుగని బిడ్డ, పిచ్చివాలకంపడి...

తండ్రి : (జ్ఞాపకంతెచ్చుకుని ఆలోచిస్తూ, దీనంగా) అవును, తిరిగాడు... నేనైతే భరించలేను...... నేనైతే ఏబావో, చెరువో చూసుకునేవాణ్ణి...

తల్లి : (వారిస్తూ) ఊరుకోండి! ఇక మనకేం కావాలి; ఉద్యోగం వచ్చిందిగా! ఇకనుంచి నెలనెలకూ జీతంవస్తే ఈ అప్పులన్నీ తీర్చేసి, హాయిగా వాణ్ణోక ఇంటివాణ్ణిచేసి...

తండ్రి : (ఆలోచిస్తూ) అదే మరి! ఈ అప్పులన్నీ తీర్చేసి, మనల్ని చూసి నవ్వేవాళ్ళందరినీ, ఈ అప్పుల వాళ్ళందరినీ ఈగడపదాటి లోపలికి రాకుండా చేస్తే; హాయిగా మన ఇంట్లో మనం సుఖంగా... (విసుగ్గా) పెండ్లి చేసుకోరా అంటే వద్దంటాడు గద! ఎన్ని సార్లు చెప్పాలి! పెండ్లి కుదిర్చామా; వాళ్ళ మామగారిదగ్గర డబ్బుతీసుకుని చదివించామా! ఈ నెలలో ముహూర్తం నిశ్చయం చెయ్యకపోతే నా డబ్బు నాకు ఇచ్చెయ్యమని ఇంత పొడుగున ఉత్తరం రాశాడు! (చనువుగా) అసలు ఎందుకూ వీడు వద్దనేది?

తల్లి : అబ్బాయికి మనసులో ఏముందో, మనకేం తెలుసు!

తండ్రి : (కొంచెం కోపంగా) వాడి మనస్సేమిటి! ఇదంతా వాడి శ్రేయస్సు కోసం గాదూ; నాకు పెండ్లి వద్దా అంటే ఇప్పు డాగుతుందా, మాట యిచ్చిన తర్వాత—

తల్లి : మాటెందుకిచ్చారు అన్నాడు మొన్న —

తండ్రి : (ఇంకా కోపంగా) అంటాడు వాడికేం! మరి వాడి చదువుకూ, ఈ పరీక్షలకూ డబ్బెట్లా వచ్చిందో ఆలోచించాడా! నేను రిటైరై రెండేళ్ళవుతుంటే ఇన్నాళ్ళనుంచి ఇంటి ఖర్చు ఎట్లా వచ్చిందో ఆలోచించాడా! అయినా నువ్వు వాడితో ఏమీ చెప్పకుండా నాకు పెద్ద సలహా ఇవ్వొస్తావేమిటి!

తల్లి : (దిగులుగా) చెప్పాను! ప్రతిరోజూ చెపుతూనే వున్నా! వాడికేదో దిగులు పట్టుకుంది! ఇట్లా అయితే, అమ్మా! నేను వెళ్ళిపోతానన్నాడు —

తండ్రి : ఎక్కడికి? ఎందుకు?

తల్లి : ఏమో ఎందుకో —

తండ్రి : (ఆగ్రహంతో) తెలియదూ? నువ్వడగలా? ఇంకేం ఉద్యోగం

వచ్చిందిగదా, ఇష్టమొచ్చినట్టు ఊరేగాలనుకున్నాడు గాబోలు! అయినా మొన్న ఎప్పుడో పోయినవాడు ఇంత వరకు ఇంటిమొఖం చూడకపోవడమేమిటి? అసలు వస్తాడా రాడా! నేనే నీ సంసారం ఈదలేను, నేనే వెళ్ళిపోతాను. నువ్వూ, నీ అబ్బాయీ హాయిగా ఊరేగండి!

తల్లి: (దగ్గరకు వచ్చి, చేతులు పట్టుకుని) చూడండి! ఇదిగో! (కన్నీటితో గద్గద స్వరంతో) వాడిమీద కోపంవద్దు! ఎంత సుకుమారంగా పెరిగాడో, ఇప్పుడెంత కృశించి పోయాడో మీకు తెలియదూ?

తండ్రి: ఇన్నాళ్ళూ పెంచి చదివించి సంపాదించరా అంటే నీకూ, నాకూ వాడు చేసే ఉపకారం ఇదేనా!

తల్లి: ఇకనుంచీ వాడేగా మనకు! వాడు సంపాదించనన్నాడా, శక్తిలేనివాడా! అప్పుడు మీకు ఎన్నాళ్ళకూ ఉద్యోగం రాకపోతే, మీ నాన్నగారు కేకలేస్తుంటే, మీరు నాముందు కంట తడి పెట్టుకుంటూ—

తండ్రి: (దిగుళ్ళు వెళ్ళబోసుకుంటూ) అవును, అవును, నా గుండె పగిలిపోయింది! నిజమే! మరి ఇప్పుడు కూడా ఈ బాధ భరించవలసిందేనా! (జ్ఞాపకం తెచ్చుకొంటూ) చిన్నతనమంతా, పోనీ యౌవనంలో హాయిగా సుఖం అనుభవించకపోతానా అని ఆశపడ్డా! యౌవనం వచ్చింది, పోయింది! బ్రతుకీడ్వలేక ఏడుస్తూ, బండచాకిరి చేస్తూ; ఇక ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది, కన్నకొడుకు సుఖపెడతాడు గదా అని సంతోషిస్తే... ఈ అప్పులు; అవస్థలు; అవమానాలు... అబ్బ!

(బయటనుండి "అమ్మా!" అని రామూ పిలుపు వినిపిస్తుంది.)

తల్లి: (బైటికిచూసి) వద్దు, వద్దు! వాడొస్తున్నాడు! జీతం తెచ్చేవుంటాడు; (వెళ్ళబోయి మళ్ళీవచ్చి) వాడిమీద కోప్పడకండి, సంతోషంగా మాట్లాడండి! (తండ్రి జాలిగా నవ్వుతాడు. ఆమె వెళ్ళిపోతుంది. తండ్రి నిజంగానే సంతోషంగా వున్నాడు. పచార్లు చేస్తూ కుర్చీమీద వున్న వుత్తరీయం తీసిచూస్తాడు. దానినిండా చినుగులే 'నేటితో నీ ఋణం తీరింది' అన్నట్లు విసిరి ఒక మూలకు గిరాటు వేస్తాడు.

తల్లి సంతోషంగా రామూను చెయ్యి పట్టుకొని తీసుకొచ్చింది. రామూ ముఖం పాలిపోయివుంది. నిస్సారంగా లోపలికి వస్తూ, జాగ్రత్తగా తల్లిదండ్రుల మనఃస్థితిని గమనించి దుఃఖం ఆపుకోలేక ఒకసారి రెండు కణతలూ వొత్తుకుంటాడు. నిస్పృహవల్ల కలిగిన నిర్లక్ష్యం, దైన్యం కప్పిపుచ్చుకోడానికి నటించే ధైర్యం అతని ప్రతిమాటలోనూ స్ఫురిస్తాయి)

తల్లి: (ప్రేమతో) అసలే ప్రొద్దెక్కిపోయింది, కూర్చో అబ్బాయ్! నిలబడతావేం, అలిసిపోలా?

రామూ: అలిసిపోయాను, బాగా అలిసిపోయానమ్మా!

తండ్రి: (ఎంతో ఆదరంతో) వాడికి వేడినీళ్ళుపెట్టి త్వరగా భోజనం పెట్టరాదూ?

రామూ: నాన్న నామీద చాలా ప్రేమగా వున్నాడమ్మా ఈమధ్య!

తల్లి : అదేమిట్రా ! నీమీద గాక ఇంకెవరి మీద ప్రేమగా వుంటాంరా !

రాము : (ఏడ్వలేక నవ్వుతూ) ఇంత భారం నేను మోయలేనమ్మా !

తండ్రి : (భార్యతోనే) అబ్బ ! ఎలాగైనా ఉద్యోగమంటే చాలా కష్టమే ! చేస్తున్నంతకాలం ఎప్పుడు రిటైరవుతానా అనిపించేది !

రాము : (నవ్వుతూ) నేనుకూడా రిటైరు కావాలనుకుంటున్నా నమ్మా !

తండ్రి : (భార్యతో నవ్వుతూ) విన్నావా వాడి మాటలు ! (రాముతో) మొదటి నెలలో ప్రతిరోజూ అలాగే అనిపిస్తుంది ! తర్వాత తర్వాత, సెలవు వచ్చినా యింట్లో కూర్చోడానికే కష్టంగా వుంటుంది !

రాము : ఇప్పుడు కూడా యింటికి రావాలంటేనే కష్టంగావుంది నాన్నా !

తండ్రి : (ఇంకా పెద్దగా నవ్వుతూ, భార్యతో) చూశావా ! నాకు తెలుసు! డబ్బు కంటికి కనపడితే యిక ఆఫీసే వైకుంఠ మనిపిస్తుంది !

తల్లి : (సంతోషంతో) ఎన్నడూ లేదు, ఇవాళ వింటున్నా; తండ్రీ కొడుకులు పరాచికాలాడుకోవడం ! అబ్బాయి నవ్వుతుంటే యిల్లంతా కలకలలాడుతుందండీ !

రాము : నవ్వడమా ! చదువుకున్నంత కాలం బాగానే నవ్వానమ్మా ; ఆ తర్వాత నాలో నవ్వే రాము పనిపోయాడు, ఏడ్చే రాము మిగిలాడు ! (పెద్దగా నవ్వుతాడు).

తండ్రి : నీకేంరా ! హాయిగా నవ్వుకుంటూ అల్లా సరదాగా కాలం గడపా లబ్బాయ్ !

రాము : ఏడ్వలేక నవ్వుతున్నా నాన్నా! (దుఃఖం పొంగివస్తుంది. చేతులతో ముఖం మూసుకుంటాడు. తల్లి, దండ్రి ఒకరినొకరు ఆశ్చర్యంతో చూసుకుంటారు).

తల్లి : ఛీ ! ఏం మాటలురా అవి ! (రాము చేతులుతీసి మెల్లగా నవ్వుతున్నాడు)

[ ఒక్క క్షణం నిశ్శబ్దం ]

తండ్రి : (కొడుకు నుద్దేశించి భార్యతో) ఇవాళ ఒకటో తేదీ అనుకుంటాను ?

రాము : అవును. ఒకటో తేదీ అనుకుంటాను ?

తండ్రి : (నవ్వుతూ, భార్యతోనే) ఒకటో తేదీ జీతం వచ్చేరోజు !

రాము : అవును. ఒకటో తేదీ జీతంవచ్చే రోజు.

తండ్రి : (భార్యతో) అబ్బాయి త్వరగా వచ్చాడే ఇవాళ ? పోయి అన్నం పెట్టరాదూ ?

రాము : అవును. త్వరగానే వచ్చాను. ఆకలయింది. రెండు రోజులనుంచి అసలు అన్నమే తినలేదు.

తండ్రి : (ఆశ్చర్యంతో) అదేమిట్రా !

తల్లి : (బాధపడుతూ దగ్గరకొచ్చి గడ్డం పట్టుకుని) అంత ఎక్కువగా వుందా నాయనా పని?

రాము : చాలా ఎక్కువగా వుందమ్మా !

తండ్రి : ఎలాంటిపని ఇచ్చారేమిట్రా ఆఫీసులో ?

రాము : అబ్బో, చెప్పడానికి వీల్లేదు.

తండ్రి : పోని జీతం ఇచ్చారా ఇవాళ ?

తల్లి : పోనీ ముందు హోటల్ కుపోయి కాఫీతాగి రాకపోయావా ?

రాము : కాఫీకి డబ్బుంటే ఇంటికే వచ్చే వాణ్ణి కాదమ్మా!

తండ్రి : (ఆదుర్దాగా) ఏం? ఏమయింది? జీతం ఎందుకివ్వలా?

తల్లి : ఇదేం ఉద్యోగంరా? మరి ఎప్పుడిస్తామన్నారు?

రాము : (దుఃఖం భరించలేక పెద్దగా) ఎక్కడి ఉద్యోగం! ఎవరిచ్చారు?

తండ్రి : (ఆందోళనతో) లేదూ? ఉద్యోగం లేదూ? వచ్చిందన్నావుగా?

రాము : అన్నాను.

తల్లి : మరి ఇన్నాళ్లూ ఏం చేస్తున్నావబ్బాయ్!

రాము : ఆరునెలలనుంచి చేస్తున్న తప్పు దిద్దుకుంటున్నా!

తండ్రి : (కోపంగా) అంటే? నీ ఉద్దేశం? ఎక్కడున్నావ్ రా?

రాము : ఆరునెలలు తిరిగాను; కాళ్ళు బొబ్బలు పొక్కినై! ఊపిరి తిత్తులు చెడిపోయినై! నువ్వు నా స్థితిలో వుంటే ఇంతకంటే ఏం చేస్తావు నాన్నా!

తండ్రి : అయితే ఏం చేస్తున్నా నంటావోయ్?

రాము : విశ్రాంతి తీసుకుంటున్నా; విశ్రాంతి!

తల్లి : ఎక్కడరా? స్నేహితుల దగ్గరా?

రాము : నావంటివాడికి స్నేహితులెవరుంటారమ్మా! రోడ్లు ప్రక్కన, పార్కుల్లో, చెట్లకింద, అరుగుమీద! పార్కుచుట్టూ ఆఫీసులే! అందులో పనిచేస్తున్న వాళ్ళందరినీ చూస్తూ హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నా! (కౌగిలిస్తూ) ఎందుకు నాన్నా అంత కోపం?

తండ్రి : (ఇంకా ఆగ్రహంతో, భార్యతో) చూశావటే, చూశావా! నే ననుమానించినంత పనీ జరిగింది! వాడు అసలు ఉద్యోగమే లేదంటున్నాడు! ఇప్పటివరకు ఆ బాకీల వాళ్ళందరినీ కాళ్ళా వేళ్ళాపడి ఆపితే, వీడు తెస్తాడుగదా అనే ఆశతో – (రాముతో) అసలు లేదు పొమ్మంటావా?

రాము : అవును, లేదు! అవును, లేదు! అవును, లేదు!

తల్లి : (ఏడుస్తూ) మీరు ఊరుకోండి! వాడేదో పిచ్చిలో మాట్లాడుతున్నాడు. మీరు కోప్పడకండి!

తండ్రి : ఇక కోప్పడితే ఏం ప్రయోజనం! నీ కొడుకు భ్రష్టుడై పోయిన తర్వాత!

రాము : నీ కొడుకే గాదు నాన్నా, మీ నాన్న కొడుకుగూడా! మనందరం అంతే!

తండ్రి : ఛీ! వెధవా! ఇంతపని చేసివచ్చి, ఇప్పుడు నోటికొచ్చినట్టు మాట్లాడతావురా!

రాము : ఉద్యోగం కావాలని ప్రాధేయపడితే అందరూ ఎవరినోటి కొచ్చినట్లు వాళ్లు మాట్లాడారు; నేను మీతో అయినా మాట్లాడకపోతే ఎట్లా నాన్నా! (తల్లి, తండ్రి దగ్గరకు వెళ్ళి వారిస్తున్నది. అతను కోపాన్ని అణచుకుని మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు)

తండ్రి : మాట్లాడతావురా! నీకు నా కష్టాలేం తెలుస్తాయి! రేపటినుంచీ మనం వీధిలో అడుక్కుతినే గతిపడితే నలుగురిలో నా పరువేపోతుంది!

రాము : నలుగురిలో కాదు నాన్నా, నలభైకోట్ల మందిలో! పరువా!

బ్రతుకలేనివాడికి పరువేం ఒరిగిస్తుంది నాన్నా!

తల్లి : (రామూను లాలిస్తూ) వద్దు రా అయ్యా! మనం లోపలికి పోదాం రా! అన్నం తిందువు రా!

తండ్రి : (భార్యతో కోపంగా) ఇల్లా ముద్దుగించే చివరికి నెత్తి నెక్కించుకున్నావ్! పిల్లకు బువ్వ పెట్టడం మాత్రం తెలుసు! బువ్వ, బువ్వ, బువ్వ! (రామూతో) పెంచాం, చదివించాం, సంఘంలో గౌరవంగా బ్రతకాలని ఖరీదైన బట్టలు కుట్టించాం! ఆఖరికి మా అమ్మ చచ్చిపోతున్నా మందులు కొనకుండా పరీక్షకు ఫీజు కట్టాను!

తల్లి : అయ్యయ్యో! మీరూరుకోండి! (అలా వింటున్న రామూను లోపలికి తీసుకు పోతున్నది.)

తండ్రి : (అక్కడ నుంచే కేకలతోనే) నువ్వు పొట్ట ఏకారిగా తిరుగుతుంటే, పోనీ లంచం పుచ్చి ఉద్యోగం సంపాదించుకోరా అని సలహా చెప్పిస్తే, అది కూడా చాతగాక, పైగా నేను వచ్చినప్పుడే పెద్దవాళ్ళ కాళ్ళు పట్టుకుని తప్పించుకోక నా తాడు తెగింది! (ఈ మాటలు మాట్లాడుతూనే ఇంతకుముందు విని లేసి ఉద్యోగం తెచ్చి పైన వేసుకుంటాడు)

రామూ : (వెనక్కు తిరిగి చూస్తూ కోపంగా) ఎవరు పెద్దవాళ్ళు! లంచాలు తిండే వాళ్ళా? లాభాలు సంపాదించేవాళ్ళా? గొప్పగొప్ప పదవుల్లో వుండి నావంటి వాళ్ళ గొంతులు కోసేవాళ్ళా? ఎవరు పెద్దవాళ్ళు! నాకు ఉద్యోగం యివ్వని వాళ్ళా?

తండ్రి : నీకు మతి వుందా పోయిందా! ఏమిటీ మాటలు?

రామూ : మతిపోయింది నాకు గాదు, మీ అందరికీ! వాళ్ళమ్ముకుంటూనే నాన్నా, నుదుటమ్ముకుంటూనే నాన్నా వొళ్ళు పొమ్మనే ఈ లోకానికి! మనుష్యులు సెకలితో వస్తుంటే, నీతులు చెపుతూ గోతులు త్రవ్వుతున్న యీ లోకానికి! ఏం నాన్నా! నాది తప్పు కాదని నాకు తెలుసు, నీకు తెలుసు! కాని నువ్వు మాత్రం ఏం చేస్తావ్! సంసారం పోషించవలసిన వాడివి; ఇల్లు, పరువు, ప్రతిష్ఠ నిలబెట్టవలసిన వాడివి (కన్నీళ్ళు తెర వస్తుంటే, ఆపుకుంటాడు. మృదువుగా) నాన్నా! చిన్నప్పుడు అంత ముద్దుగా ఎత్తుకుని తిప్పావే, పెంచావే! ఇందుకేనా! (కోపంగా) యిల్లా చిత్రహింస చెయ్యడానికేనా! నన్ను నీ సంపాదనకు సాధనంగా వాడుకున్నావు గదూ! నీకుగూడా మతిపోయింది!

తల్లి : (కోపం పట్టలేక మళ్ళీ రామూ దగ్గరికి వచ్చి) ఏమిట్రా యిది! నాన్నగారి మీద కేకలేస్తావట్రా! (మెల్లగా) ఆయన కష్టం నీకు తెలియదురా అబ్బాయ్! (దగ్గరకు పట్టుకుని లాగుతూ) రా, లోపలికి రా! రారా!

రామూ : ఎందుకమ్మా లోపలికి! ఏముంది! ఈ లోకంలోనే నాకు కావలసింది లేదు; నువ్వు యిక్కడే వున్నావుగా! (తల్లిని కౌగిలించుకుంటాడు)

తల్లి : (కరిగిపోతూ) మరెందుకు చెప్పావేరా నాయనా! ఉద్యోగం రాలేదనే దిగులు పోయిందా! అంతే మాడతావట్రా నాన్నతో, నాతో?

రామూ : (కన్నీటితో) అవును, అబద్ధమే! ప్రతిరోజూ పట్నమంతా తిరిగివచ్చి, ఉద్యోగం దొరకలేదని చెపితే, మీరు నన్ను అసమర్థుడని నీచంగా, శత్రువుగా చూస్తుంటే, ఒక్క నాలుగు రోజులన్నా సంతోషంగా గడుపుదామని, అవునమ్మా, అబద్ధం చెప్పా! అమ్మా నన్ను క్షమించమ్మా! అమ్మా నాన్నా గూడ నన్నసహ్యం చేసుకోకపోతే ఎట్లా బ్రతకనమ్మా! (తండ్రి యిది అంతా వింటూనే తల్లివంక చూస్తాడు. తల్లి అతి దీనంగా తండ్రి వంక చూస్తుంది.)

తల్లి : ఇదిగో, (తన మెడలోవున్న ఒకే హారం తీసి రామూకు ఇస్తూ) ఉద్యోగం తప్పకుండా వస్తుంది? నా బంగారు తండ్రికి ఎంత కష్టం కలిగింది! తల్లిదండ్రులు కోప్పడితే ఎక్కడన్నా కష్టపెట్టుకుంటార్రా!

(రామూ గొలుసు అందుకో బోతున్నాడు. తండ్రి చూస్తాడు. వెంటనే వచ్చి ఆమె చేతిలోనుంచి ఆగొలుసు లాక్కుంటాడు).

తండ్రి : (కరకుగా) ఇదిగూడా పోతే ఇక వాడూ, మనమూ వీధికెక్కవచ్చు! రేపు ప్రొద్దుటికల్లా నిలువ నీడలేకుండా ఏనుయ్యో, గొయ్యో చూసుకోవచ్చు!

రామూ : (పెద్దగా) నాన్నా!

తల్లి : (ఆశ్చర్యంతో) అదేమిటండీ!

తండ్రి : (అతి కఠినంగా) ఎక్కడైనా పంపిస్తాన్ వీణ్ణి! పోయి ఎవరనుద్ధరిస్తాడు! ఈ ముఖంచూసి ఎవడు ఉద్యోగమిస్తాడు! ఇక్కడేపడి చావమను!

(తల్లి కంగారుపడుతున్నది)

రామూ : (వొళ్లు తెలియని ఆవేశంతో కేకపెడుతూ) నాన్నా! నీవు నాశత్రువువు!

తల్లి : (వారిస్తూ) రామూ! ఊరుకో!

రామూ : (కేకపెడుతూనే) అమ్మా! నీవు నా...(వెంటనే గ్రహించి, తలదించుకుని దీనంగా) క్షమించమ్మా! వెళ్ళొస్తా! (తక్షణం బైటికి వెళ్ళిపోతాడు. తల్లి, తండ్రీ నిశ్చేష్టులౌతారు).

తల్లి : (బైటికిచూస్తూ) రామూ! రామూ!

తండ్రి : (ఆజ్ఞాపిస్తూ) పిలవొద్దు!

తల్లి : ఏమిటి?

తండ్రి ॥ ఏముంది! నేను శత్రువునట!

రామూ : (తిరిగివచ్చి, సూటిగా గంభీరంగా) నీకు ఉద్యోగం లేకపోతే మీ నాన్న ఐదేళ్ళు పోషించలా? అంత మాత్రం ప్రేమ నీకులేదూ? అంత మాత్రం అన్నాత నాకులేదూ? (వెంటనే వెళ్ళిపోతాడు)

తండ్రి : (కలవరపడతాడు. సిగ్గుతో తలదించుకుంటాడు. బైటికి చూస్తాడు.) రామూ! ఓ రామూ!

(రామూ వెళ్ళిపోయినట్లు తండ్రి వైఖరి స్పష్టంచేస్తుంది. తల్లి దగ్గరకి వస్తుంది. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటారు.)

తండ్రి : (పలవరించినట్లు మెల్లగా అంటాడు) ప్రేమ!

ప్రేమగాదు శక్తి! శక్తిగాదు సంపాదన! సంపాదనలేని సంసారం శ్మశానమై పోతుందే! (తల్లి కన్నీరు తుడుచుకుంటూ, ఆయన చేయిపట్టుకుని కుర్చీలో కూర్చోపెడుతుంది.)

★

## రెండవ దృశ్యం

★

కొన్ని నెలలు గడిచింది. తల్లిదండ్రులు పూర్వంకంటె నీరసంగా బ్రతుకీడ్చుతున్నారు.

దశరథయ్య హాలులో పచార్లు చేస్తున్నాడు. ఆమె లోపలినుంచివచ్చి, అతనికి కన్నీళ్ళు కనపడకుండా కొంగుతో అద్దుకుంటున్నది. దగ్గరికి వస్తుంది. ఆమెలో ఏదో బైటపడలేని బాధ దాగివున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

తల్లి : ఏమండీ !

తండ్రి : (ఏదో ఆలోచనలో వున్నవాడు ఉలిక్కి పడుతూ) ఊఁ ఏమిటి ?

తల్లి : ఏమీ లేదు; ఎక్కడైనా కొంచెం డబ్బు చూడండి !

తండ్రి : నువ్వు నోరెత్తితే ఇది తప్ప వేరే సంగతి వుండదని నాకు తెలుసు !

తల్లి : అవసరమైనప్పుడు అడగక తప్పుతుందా మరి ?

తండ్రి : ఊహూఁ ఏమిటా అవసరం ?

తల్లి : (మాట్లాడదు)

తండ్రి : చెప్పవేం ? ఎందుకు డబ్బు ?

తల్లి : అదే...

తండ్రి : ఓహో ! వాడికి పంపించడానికేగా ! ఏం, ఎక్కడున్నాట్ట ! ఇక్కడికే రమ్మనరాదూ ?

తల్లి : వాడు చాలా కష్టాల్లో వున్నాడండీ మనం...

తండ్రి : మనం సుఖంగా వున్నామా ? ఏమిటట్లా మాట్లాడతావ్ ! ప్రొద్దున లేస్తే ఇంట్లో అడుగు పెట్టిన ప్రతీ వాడూ డబ్బుఅడిగేవాడేగా! అందుకు గాదూ, నేను లోకుల మొఖం చూడలేక ఇంట్లో కూచున్నది? పో, వాణ్ణే ఇక్కడికిరమ్మను, లేకపోతే పొమ్మను! ఏం ఉత్తరం రాశాడా? రాస్తే చించి పొయిలో పారెయ్యి !

తల్లి : మెల్లగా మాట్లాడండి ! ఉత్తరం రాయడం కాదండీ— వాడు...

తండ్రి : కబురు చేశాడా ? ఏం రాచ కార్యాలొరిగిస్తున్నాట్ట ? అసలెక్కడున్నాడూ అంటే సమాధానం చెప్పవేం ?

తల్లి : (జాలిగా) మీ కాళ్ళు పట్టుకుంటా మెల్లగా మాట్లాడండి ! వాడు మన వాడుకాడూ ? ఏమిటా మాటలు ఏమిటా పిచ్చి కోపం ?

తండ్రి : (ఒక్కక్షణం తాపీగాఆలోచించి) నేనూ వాడూ కలసి నిన్ను గూతవ పెడుతున్నాంగదూ ! లేకుంటే, మళ్ళీ అట్లా మాట్లాడనులే ! నాదగ్గర డబ్బు లేదు, మరి నేనేం చేస్తాను చెప్పు ! (తల్లి దీనంగా లోపలికి వెళ్ళబోతుంది) మాటు, ఇలారా ! (వస్తుంది, ఆమె మెడవంక తేరిపార చూస్తాడు) నీ గొలుసు ఏం చేశావ్ ?

తల్లి : అమ్మించి డబ్బు పంపించాను ! మీతో చెప్పానుగా !

తండ్రి : (కోపంగా) నీతో చెప్పానుగా, అమ్మవద్దని ! (కేకలువేస్తూ) ఎందుకు చెప్పావనుకున్నావ్ ; నేనే అమ్మేసి ఏదో వొక బాకీ తీర్చెయ్యలేకనేనా !

తల్లి : మెల్లగా మాట్లాడండి ! అబ్బ...

తండ్రి : (కోపంగానే) నాకు తెలియకుండా దొంగచాటుగా...

బైటనుండి : (తలుపుకొట్టిన చప్పుడు.) ఏమండీ! దశరథయ్యగారూ! దశరథయ్యగారూ!

తండ్రి : ఎవరో వచ్చారు. పో, నేను లేనని చెప్పి తలుపు బిగించిరా!

తల్లి : (వెళ్లి మళ్ళీ తిరిగివచ్చి లోపలికి వెళ్లిపోతుంది.)

వ్యక్తి : (ప్రవేశిస్తూ) శుభమా అని పెండ్లికొడుకుని చూద్దామని వస్తుంటే తలుపులు బిగించుకుని కూచుంటారేం! (తండ్రి ఏదో ఆలోచిస్తున్నట్టు గమనించి) ఏమిటది! వియ్యంకుడుగారేదో దీర్ఘాలోచనలో వున్నారూ?

తండ్రి : (నవ్వు నటిస్తూ) ఎప్పుడొచ్చారు? ఇంటి దగ్గర అంతా క్షేమమేనా?

వ్యక్తి : ఆహా! ఏదో కాలం గడుపుతున్నాం! మన ఇంట్లో అంతా...?

తండ్రి : ఆఁ. కులాసగానే వున్నాం.

వ్యక్తి : అంటే... చూడండి! ముందు నా రాక సంగతి చెప్పాలి!

తండ్రి : (భయంతో) ఏమిటది? భోజనమయిన తర్వాత తీరికగా మాట్లాడుకుందాం లెండి!

వ్యక్తి : అంతే లెండి! (మనసు పట్టలేక) దానికేమిటిగానీ, ఈ మధ్య ఒకవార్త విన్నానా... ముందీ ఒక్కటీ చెప్పేసెయ్యండి!

తండ్రి : (భయపడుతూనే) ఆ, అదా; అవునండి! మావాడు ఒకరి మాటవినే రకంగాదు!

వ్యక్తి : (సంతృప్తిగా) అసలెందుకు వినాలి అంటాను! ఈ రోజుల్లో కుర్రవాళ్ళకున్న తెలివితేటలు పెద్దవాళ్ళకు లేవండీ! ఏమంటారు!

తండ్రి : (అర్థంగాక నవ్వునటిస్తూ) అంటె?

వ్యక్తి : ఇంకా దానికి టీకా తాత్పర్యం చెప్పాలండీ, రెండు మూడేళ్ళలో డిప్యూటీ కలెక్టరౌతాడు చూడండి!

తండ్రి : (ఆశ్చర్యంతో భయంతో జంకుతాడు. మాట్లాడడు)

వ్యక్తి : ఆఁ కులాసగా వున్నాడా? ఏడీ, ఆఫీసు కెళ్ళాడా?

తండ్రి : (తప్పనిసరిగా చెప్పేస్తూ) లేడు! అసలు ఇంట్లోనే లేడు. ఎక్కడికో వెళ్లిపోయాడు!

వ్యక్తి : ఏం? అప్పుడే ట్రాన్స్‌ఫర్ అయిందా?

తండ్రి : అసలు ఉద్యోగ మెప్పుడొచ్చింది?

వ్యక్తి : (ఆశ్చర్యంతో) అయితే? మీరనేది?...

తండ్రి : అవును, అసలు ఉద్యోగమే రాలేదు. మాతోను పడలేక దేశాల మీదపడి పోయాడు. సంతోషించారా?

వ్యక్తి : (గాభరాగా) ఆ, ఆ, ఆ! ఇంతటి సంగతి కలదనుకుంటే మీ ఇంటికి రానుకొచ్చానండి!

తండ్రి : నేను చెప్పమనలేదు! మీరే వచ్చారు!

వ్యక్తి : నాకేం చేస్తారు లెండి! నలుగురూ మంచివాడంటుంటే ఏదో పాటు చేస్తాడనుకున్నాం. మీ దాని మొగుడవుతాడని తెలిసికూడా చదివిస్తే పైకొస్తాడుగా అని కట్నం సొమ్ము ముందే ఇచ్చుకుని చదివించాం! ఇప్పుడేం చెయ్యాలో! చెప్పండి!

తండ్రి : అదికూడా మీరే చెప్పండి!

వ్యక్తి : ఐతే ఇదేనా! ఇంత ఖర్చు పెట్టినందుకు మాకు మిగిలేది మా

కోపాలూ తాపాలూ......ఇదేనా మర్యాద!

తండ్రి: (తనలోని దుఃఖం కర్కశత్వంగా మారింది) నిజం చెప్తున్నా! నేను కూడా పెట్టుబడిపెట్టా, మీకంటే ఎక్కువగా మమ్మల్ని పోషిస్తాడుకదా అని! వాడి జీవితాన్ని మన సంపాదన కోసం వాడుకుందామని ఇష్టం ప్రయత్నించాం...

వ్యక్తి: (పెద్దగా) ఇదేం హాస్యంగాదండీ!

తండ్రి: హాస్యమని నే ననలే! వాస్తవం! వాస్తవం హాస్యంకంటే అద్భుతంగా వుంటుంది! (పెద్దగా నవ్వుతాడు)

వ్యక్తి: అదేమిటి! నేనేం నవ్వులపాలు గావడాని కొచ్చాననుకుంటున్నారా! బాగ్లేదు!

తల్లి: (లోపలనుంచి వచ్చి, కోపంగా, కాని నెమ్మదిగా) మెల్లగా మాట్లాడుకోండి! ఇరుగ్గోనేం ప్రతికాలం అక్కల్లేవా?

తండ్రి: (నవ్వు ఆపుకోలేక) తెలిసిందా! మీరు కేకలు వేసినా మెల్లగా వెయ్యాలి! ఇది ఈకాలపు మర్యాద! అవమానించినా, హత్యచేసినా అన్నీ మతి మర్యాదగా జరగాలి.

వ్యక్తి: మీ ధోరణి నాకర్థం కావడంలేదు! ఇప్పుడేం చెయ్యమంటారు? పెండ్లి కుదుర్చుకున్నతర్వాత రెండేళ్ళాగాం; చదువు పూర్తిచెయ్యాలన్నాడు; సరే: పరీక్ష పైసోవాలన్నాడు; సరే, ఉద్యోగం రావాలన్నాడు... ఇప్పుడేమో దేశాల మీదకి పోయాడంటారు...

తండ్రి: (మాట్లాడడు)

వ్యక్తి: జవాబు చెప్పరేమండీ?

తండ్రి: (విరక్తుడై) ఏం చెప్పమంటారండీ, నా ప్రాణం తీయ్యండీ!

వ్యక్తి: (ఆలోచిస్తూ) బాగానే వుంది! మీ ప్రాణం మా కెందుకు; మా డబ్బు మొత్తం రెండువేల ఐదువందలు, అంతేనా? మాది మాకు పడెయ్యండి! వెళ్ళిపోతాం!

తండ్రి: (మాట్లాడడు)

వ్యక్తి: మాట్లాడ రేమండీ! ఇంతకాలం పెళ్ళిచెయ్యకుండా అమ్మాయిని యింట్లో అట్టిపెడితే ఎంత అప్రతిష్ట వచ్చిందో మీకేం తెలుస్తుంది!

తండ్రి: (ఒక్కక్షణం నెమ్మదిగా వుండి, హుందాగా) పాపం, మీ అమ్మాయి సంగతి ఆలోచిస్తే జాలివేస్తుంది!

వ్యక్తి: ఎందుకు! ఈ కబుర్లన్నీ మా కక్కర్లేదు. ఇక మీవాళ్ళే పెండ్లి చేసుకోరూ; చేసుకుంటామన్నా మేం ఒప్పుకోం!

తండ్రి: అందుకు కాదు! అంత మంచి అమ్మాయికి మీవంటి తండ్రి వున్నందుకు -

వ్యక్తి: (ఆగ్రహంతో పెద్దగా) యేమన్నావ్! మీ యింటికొచ్చింది మీ చేత మాటలనిపించుకోడానికేనా!

తండ్రి: (ఇంకా ఆగ్రహంతో) మా దగ్గర డబ్బులేదు! ఇక మేమేం చెయ్యలేం! తర్వాత మీ ఇష్టం!

వ్యక్తి: మరి మా డబ్బు?

తండ్రి: డబ్బు! డబ్బు. ఇదో జబ్బయిపోయింది! పొండి! మావాడు వచ్చి పోయ్యాడనుకోండి! పొండి!

తల్లి: (చరచర బైటికివచ్చి కోపంగా) ఏమండీ! మమ్మల్నీ ఇంట్లో బ్రతకనిస్తారా లేదా?

తండ్రి: (తీవ్రంగా) బ్రతక్క పోతే చావండి!

తల్లి: (కోపం పట్టలేక) చచ్చే స్థితిలోనే వున్నాడు నీకొడుకు.

తండ్రి: (అమితాశ్చర్యంతో) ఏమిటి? ఎవరు?

తల్లి: (అతి జాలిగా) మన అబ్బాయే!

తండ్రి: (ఆదుర్దాగా) ఎక్కడున్నాడు?

తల్లి: లోపలే!

తండ్రి: ఏం చేస్తున్నాడు? ఎప్పుడొచ్చాడు?

తల్లి: వారం రోజులనాడు వచ్చాడు. వాడికి క్షయ జబ్బు పట్టుకుంది! ఇంటికొచ్చి మంచాన పడ్డాడు! (ఏడుస్తూ) వాణ్ణి చూస్తే ఏడుపొస్తున్నది. నెత్తురు కక్కుతున్నాడు. గొలుసమ్మి మందు ఇపిస్తున్నా...

తండ్రి: నాతో...నాతో చెప్పలేదేం?

తల్లి: వాడే వద్దన్నాడు! మిమ్మల్ని చూడ్డానికే సిగ్గుపడుతున్నాడు!

తండ్రి: (లోపలికి వెళ్ళబోతూ) పద, చూసివద్దాం!

తల్లి: (గట్టిగా) వద్దు!

తండ్రి: (తల్లిని పక్కకు తోసివేస్తూ, తీవ్రంగా) పో అవతలికి! నా కొడుకును నేనుచూసుకోగూడదూ? నేనేం అపకారం చేశాను వాడికి!

తల్లి: (అడ్డునిలిచి వారిస్తూ) వద్దు! మీరంటే భయం వాడికి! మిమ్మల్ని చూడటానికి ముఖం చెల్లటంలేదు వాడికి! వద్దు! (తండ్రి ఆమెవంక నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడతాడు. ఆమె లోపలికి వెళ్ళిపోతుంది. అతను పడక కుర్చీలో కూలబడతాడు. ఇంత సేపూ పచార్లు చేస్తూ వింటున్న వ్యక్తి 'డబ్బే ఒక జబ్బయిపోయింది' అని గొణుక్కుంటున్నాడు. తండ్రి దగ్గరకి వచ్చి దైన్యం నటిస్తూ)

వ్యక్తి: మీరన్నట్టు; లోకంలో డబ్బే ఒక జబ్బయిపోయింది! (తండ్రి తల పంకించి వూరుకుంటాడు) మీ కష్టమంతా...ఈ విధంగా...చివరికి... పాపం (తండ్రి తలయెత్తి చూడగానే అతను ఆపేస్తాడు. మళ్ళీ పచార్లు చేస్తూ) మీరన్నట్టు...పాపం...

తండ్రి: (జాలిగా) నే నేమంటే ఏం ప్రయోజనం! మేం ఏమైపోతే ఎవరిక్కావాలి!

వ్యక్తి: (సానుభూతిగా పెదవి విరుస్తూ) నిజం! నిజం! ముమ్మాటికీ నిజం! (పచారు చేస్తూ) డబ్బే జబ్బయి పోయింది...జబ్బే డబ్బయి పోయింది! (హటాత్తుగా ఏదో స్ఫురించి) జబ్బే డబ్బయి పోయింది. జబ్బే...డబ్బే... ఐపోయింది! (ఆలోచిస్తూ తండ్రిదగ్గరికి వచ్చి, తాపీగా అతన్ని పరిశీలించి, ఆత్మీయునిగా) చూడండి! ఒక్క విషయం చెపుతా, వింటారా? మిమ్మల్నే! లేవండి! (తండ్రిలేస్తాడు. ఇద్దరూ ఒకరి దగ్గర కొకరు జరుగుతారు.) ఎందుకలా దిగులు పడతారు! మన మేం చెయ్యగలం! ఒకరు కష్టపడుతుంటే నేను చూడలేను! నా మాట వినండి!...అబ్బాయికి మందులు తెప్పిస్తారా? డబ్బు కావాలా?

తండ్రి: (ఆదుర్దాగా) ఇవ్వండి! మీ ఉపకారం మరిచిపోలేను!

వ్యక్తి: (డబ్బు ఇవ్వకుండానే) అయితే ఒక పని చేద్దామా?

తండ్రి: మీరేం చెయ్యకున్నా చేస్తాను!

వ్యక్తి: మళ్ళీ కాదనకూడదు! మాట యిచ్చినట్లేనా; తప్పుతారా! (రహస్యంగా) మనిద్దరం చెరిసగం తీసుకుందాం (అదేమిటో అర్థంగాక తండ్రి ఆశ్చర్యంగా చూస్తాడు) తొందరెందుకూ, నేనుచెస్తానుగా! (అతను డబ్బు ఇస్తాడు. తండ్రి తీసుకుంటాడు.)

తండ్రి: వాణ్ణి బ్రతికించుకుంటే అదే పది వేలు!

వ్యక్తి: అంతేగాదు. (రహస్యంగా తండ్రి చెవిలో ఏదో చెపుతాడు. తండ్రి నిశ్చేష్టుడౌతాడు) ఒక వేళ చనిపోయినా పదివేలే!

తండ్రి: (నిస్సహాయుడై అటు యిటు తిరుగుతాడు) నాకిష్టం లేదు!

వ్యక్తి: (వాకచక్యంతో మృదువుగా) ఇందులో ఏముంది అష్టం గాకపోవడానికి! నాదగ్గర కాగితాలు ఉండనే వున్నై! మీవాడి లైఫ్ ఇన్స్యూర్ చేద్దాం! (హఠాత్తుగా డాక్టరు బైటినుంచి లోపలికి పోతున్నాడు. వ్యక్తి చూడలేదు. తండ్రి చూసి కంగారు పడతాడు.) చూశారూ! మీవాడిచేత చిన్న సంతకం చేయిస్తేసరి! తర్వాత ఏది ఏమైనా పదివేలు రేపు తెల్లారేటప్పటికి...(వ్యక్తి డాక్టరును చూసి సంభాషణ ఆపి నాలుక కొరుక్కుంటాడు.)

డాక్టరు: (లోపలికి వెళ్ళబోతూ తండ్రితో) నమస్కారమండి!

తండ్రి: (కంగారుగా) నమస్కారమండి! మావాడు లోప లున్నాడు!

డాక్టరు: (వ్యక్తిని గమనిస్తూ లోపలికి వెళ్లిపోతాడు)

వ్యక్తి: మీకేం భయంలేదు! కావాలంటే ఇతనిచేతనే సర్టిఫై చేయించుదాం! (డబ్బులో వుంది అన్నట్టు వేళ్ళు మీటుతూ) ఇందులో వుంది!

తండ్రి: (నోట మాటరాని మనఃస్థితిలో) ఇదా, మీ, ఆలోచన!!

వ్యక్తి: ఏం బాగుందికదూ? ఇంతవరకు ప్రపంచంలో ఎవ్వరూ...అంటే, ఈ విధంగా జబ్బును డబ్బుగా మార్చలా; ఒప్పుకుంటారా!

తండ్రి: ఒప్పుకోవడమే న్యాయమంటారు! ఊ?

తండ్రి: పోయేవాడెలాగూ పోతాడు! మనమైనా సుఖంగా బ్రతకడంలో తప్పేమిటీ అంటారు?

వ్యక్తి: (సంతోషంగా) అంతే! అంతే!

తండ్రి: (కరకుగా) ప్రాణం పోయినా ఫలితముండాలంటారు? (వెళ్ళికుర్చీలో కూర్చుని తలపట్టుకుంటాడు)

వ్యక్తి: మనం ఏదో ఒక విధంగా...

తండ్రి: (కేక వెయ్యడానికి ఓపికలేక) మీరు! మీరు మనుష్యులుగదా; తండ్రితో ఎలా చెప్పారీమాట! కన్న తండ్రితో!

వ్యక్తి: అయినా ఇందులో తప్పేముంది! మీకు కొంత డబ్బువస్తుంది, నాకూ నా డబ్బు వచ్చేస్తుందనుకోండి! రేపు ప్రొద్దుటికల్లా, అంటే మీవాడి సంగతి తేలిపోయేలోపల; అన్ని పనులూ పూర్తి చేసుకుని ఇంటికొచ్చేలోపల, అంతా సిద్ధంచేస్తా! పదివేలండీ! పదివేలు! పోయే ప్రాణాన్ని మనం పట్టుకోలేం గదా! వచ్చే భాన్యంటే ఎందుకు వదులుకోవాలి!

తండ్రి : (ఇంత సేపూ నిశ్చలంగా మౌనంగా వున్నవాడు ఇప్పుడు అతి బలహీనంగా నవ్వుతాడు) మీరు చెప్పేది ... న్యాయంలాగే కనపడుతుంది...

తల్లి : (ఇంతలో తల్లి లోపలినుంచి ఆగ్రహంతో సూటిగా వచ్చి, వ్యక్తి చెంప మీద ఈడ్చికొడుతుంది) నువ్వు మనిషివి కాదు, రాక్షసుడివి! నీ వంటి దుర్మార్గులుండబట్టే యెంత మంచివాళ్ళయినా, ఎంత చదువుకున్నవాళ్ళయినా నిలువనీడ లేక అల్లాడుతున్నారు!...

వ్యక్తి : (నివ్వెరపోయి చూస్తున్నాడు)

తండ్రి : ఏమిటది ఊరుకో!

తల్లి : (ఆమెకు ఎవరిమాటా వినిపించదు) నీ వంటి నీచులుండబట్టే వాడు దిక్కులేని పక్షిఅయి దేశమంతా తిరిగి రెక్కలు విరిగి ఇంట్లో వచ్చి పడ్డాడు! మా వాళ్ళ బతుకులతో చెలగాట మాడతావా! (తండ్రి చేతిలో డబ్బు తీసుకుని, వ్యక్తి మీద విసిరికొడుతుంది తండ్రితో) రండి! అబ్బాయి మిమ్మల్ని చూడాలంటున్నాడు!

తండ్రి : (ఇంతసేపూ సిగ్గుతో తల దించుకుని వున్న తండ్రి ఆశ్చర్యపడతాడు) నన్నా?

తల్లి : (ఆజ్ఞాపిస్తూ) అవును. మిమ్మల్నే! రండి!

తండ్రి : (లేచి నిలబడి, వెళ్ళబోయి, ఆగి) వద్దు! వద్దు! నేను రాను! వాణ్ణి కళ్ళారా చూడదగినంత మంచివాణ్ణి కాదు నేను!

తల్లి : పిలుస్తుంటే రారేం!

తండ్రి : వద్దు! వాడు నన్ను క్షమించడు!

తల్లి : మీరు రావాలి! (ప్రాధేయపడుతూ) ఒక్కసారి వచ్చిచూడండి! మీ కంటే వాడికెంత ప్రేమో మీకు తెలియదు!

తండ్రి : (తల్లి చేతులు పట్టుకుని) నేను కూడా... వాణ్ణి హింసించాను కదూ! లోకానికి బానిసనైపోయి, వాళ్ళతరఫున వాణ్ణి మాటలతోనే పొడిచాను కదూ!

(లోపలనుండి గంభీరంగా, కాని బలహీనంగా "అమ్మా! అమ్మా! అమ్మా!" అని రాము పిలుపు వినిపిస్తుంది)

తల్లి : (తండ్రి చేయి పట్టుకుని) రండి! పిలుస్తున్నాడు! మీ కోసమే! (ఇద్దరు లోపలికి వెళ్ళిపోతారు. వ్యక్తి ఏమి చెయ్యడానికీ తోచక ఒకసారి అటూ ఇటూ తిరిగి, హఠాత్తుగా లోపలికి వెళ్ళబోతున్నాడు. డాక్టరు లోపలినుంచి బైటకు వస్తూ అతనికి అడ్డు నిలబడతాడు. వ్యక్తి తలఎత్తి చూడగానే)

డాక్టరు : (గంభీరంగా) నువ్వు గూడా ఎందుకు వెళ్ళడం! చనిపోయినవాడు సంతకం ఎలా పెడతాడు!

(లోపలినుంచి తల్లి, తండ్రి "రామూ! రామూ!" అని ఏడవటం వినిపిస్తుంది. వ్యక్తి తన వస్తువులు తీసుకుని బైటికి వెళ్ళిపోతాడు. అతని వెంట డాక్టరుగూడా.)

★

## మూడవ దృశ్యం

★

[రాత్రి, హాలులో మినుకు మినుకుమని వెలుగుతున్న దీపం చుట్టూ క్రీనీడలు ఆడుతున్నాయి.

ఇల్లంతా మౌనంగా వుంది. అప్పుడప్పుడు ఎక్కడో చాలా దూరంలో కుక్కలు మొరగడం వినిపిస్తుంది. జాలిగా ఎవరో రాగమాలపించడం వినిపిస్తుంది.

తల్లి కుర్చీలో కూచుని బల్లమీదవున్న మల్లెపూలతో మాల గుచ్చుతోంది. తండ్రి నిశ్శబ్దంగా అటు ఇటు పచార్లుచేస్తున్నాడు.

తల్లి, తండ్రివంక చూస్తుంది. తండ్రి ఏదో చెప్పబోతాడు, కాని మాట్లాడడు. తల్లి చేయెత్తి ఏదో చెప్పబోయి ఆగుతుంది. కొన్ని క్షణాలు ఎవ్వరూ మాట్లాడరు.]

తండ్రి: ఏమిటాలోచిస్తున్నావ్ ?

తల్లి: (త్రుళ్లిపడి) ఆ ? అహా, ఏమీ లేదు.

తండ్రి: మరిచిపొమ్మని చెప్పానుగదూ !

తల్లి: ఏమిటి ?

తండ్రి: అదే !

తల్లి: (పేలవంగా నవ్వి) హు ! మీరు మరిచిపోగలిగారా ?

తండ్రి: (మాట్లాడలేదు)

తల్లి: నేను మరిచిపోలేను! ఈ జీవితంలో మరిచిపోలేను ! వాడు ఇంటి నిండా తిరుగుతూ... చిన్నతనంలో... హాయిగా ఆడుకుంటూ ... నిండుగా నవ్వుతూ పాడుతూ...ఇప్పటికీ వాడు ఇంట్లో తిరుగుతున్నట్టే వుంది...

తండ్రి: వారం రోజులు ! అప్పుడే వారం రోజులు ! తలుచుకుంటే ఇవాళే జరిగినట్టుంది! నా కళ్ళ ముందుగా వాడే...వాడే చనిపోవాలా; నాకా అదృష్టంలేదూ!



తల్లి: (బాధగా) ఊరుకోండి! ఏం మాటలవి !

(కొన్ని క్షణాలు నిశ్శబ్దం)

తండ్రి: నేను కూడా ... నేను కూడా వాణ్ణి పీడించాను! ఏం ఉద్యోగం చెయ్యనన్నాడా! దొరక్క పోవడం వాడితప్పా? తప్పునాది!...వాడు చనిపోవడమేమిటి. నేను బ్రతకడమేమిటి?

తల్లి: ఊరుకోండి! అట్లా మాట్లాడితే నేను భరించలేను ... మీది కాదు తప్పు!

తండ్రి: నాదే! కాదూ, నాది కాదూ ?

తల్లి: కాదు. ముమ్మాటికీ కాదు!

తండ్రి: నువ్వు మనసారా మాట్లాడుతున్నావా, నన్ను ఓదార్చడానికా?

తల్లి: మీదెలా అవుతుంది ! మీరేం చేస్తారు ! సంపాదించినంత కాలం సంసారాన్ని పోషించారు ! చదివించారు ! మీరు రిటైరు కావాలని వాళ్ళంటే మీరేం చేస్తారు !

తండ్రి: అవును ! నేను పనికిరాను ! పాలన్నీ పిండుకున్న తర్వాత పాడు ఎవరికి కావాలి ! వాడూ పనికిరాలేదు ! వాడు కష్టాలు భరించలేక కృశించి కృశించి చివరికి దిగులుతోనే ఆ జబ్బుపట్టుకుని...అబ్బాబ్బా !...

(కొన్ని క్షణాలు మౌనం)

తల్లి: (ఏదో ఆలోచనవచ్చి హుషారుగా) చూడండి ! అబ్బాయి కళ్ళు ఎంత అందంగా వున్నాయనుకున్నారు ! ధగ ధగ మెరిసిపోయినై ! ఈ వూళ్ళో యింతమంది పిల్లల్ని చూస్తున్నాం గాని, వాడికంటె అందమైన వాళ్ళ

వ్వరూ కనపడలేదు! ఆ కంఠం! వెన్నెల ముద్దల్లాగున్నై! అమ్మా! అని పిలిచాడు. చూశాను. ఆ కళ్ళల్లో వాడిదిగులు కనపడింది. వాడి ఆశ కన్పించింది. వాడి ప్రేమ కన్పించింది. 'అమ్మా!' అన్నాడు. 'ఎందుకమ్మా నాన్నకు నా మీద అంత కోపం?' అన్నాడు.

తండ్రి: వాడు చనిపోవడమేమిటి, నేను బ్రతికి వుండటమేమిటి? నేనే, నేనే వాణ్ణి వేధించుకు తిన్నాను! అబ్బ! నే నెప్పటికీ మరిచిపోలేను. "నాన్నా! నువ్వు నా శత్రువు!" అన్నాడు. (మొహాన్ని చేతులతో మూసుకుంటాడు).

తల్లి: అబ్బబ్బ! ఇప్పుడెందుకు లెండి! ఊరుకోండి! (కొన్ని క్షణాలు నిశ్శబ్దం).

తండ్రి: (పూలమాలవంక దీక్షగా చూస్తూ) చాలా బాగున్నాయి సుమా!

తల్లి: మల్లెపూలంటే వాడికెంతో ఇష్టం!

తండ్రి: వాడి జీవితమూ అలాంటిదే! సుకుమారమైన పువ్వు, ఏముంది చెప్పు కింద రాచి పారేస్తే ఎట్లా బ్రతుకుతుంది!

తల్లి: (పూలమాల చూపుతూ) బాగా లేదూ! అక్కడికి తీసుకుపోయి; ఆదే సమాధి దగ్గరికే; అలంకరించాలని...

తండ్రి: చాలా బాగుంది! (దీనంగా నవ్వుతూ) నీవు తల్లివి! వాడి మనసు నీకు తెలుసు! వాడికి తగినట్లే సన్నగా నాజూకుగా చాలా బాగుంది!... ఈ పూలెంతకు కొన్నావ్?

తల్లి: అబ్బో! చాలా ఖరీదు చెప్పాడు. ఎంతైతే నేం, ఉన్న చిల్లరంతా ఇచ్చేసి తీసుకున్నా—

తండ్రి: (హఠాత్తుగా కోపం వచ్చి) అంతా ఇచ్చేసి కొన్నావా! తర్వాతెట్లా? అప్పు పుట్టించలేక చస్తుంటే! ఏం ఇప్పుడు పూలదండ లేకపోతే! రేపు మన కష్టాలెట్లు?

తల్లి: మీరు తండ్రి! కదూ?

తండ్రి: (వెంటనే పొరపాటు గ్రహించి పశ్చాత్తాపంతో కుంగిపోతూ, బాధగా) నాదే పొరపాటు! నాదే! నాదే తప్పు! నాదే! (ఏదో ఆలోచించుకుంటున్నాడు. తల్లి కన్నీరు తుడుచుకుంటున్నది.)

(కొన్ని క్షణాలు నిశ్శబ్దం)

తండ్రి: (ఆలోచనలోనే తల్లితో) నేను కూడా... చిన్నతనంలో... మనమంతా ఎంత పవిత్రంగా వున్నాం!

తల్లి: (తల వూపుతుంది)

తండ్రి: ఏళ్లు గడిచినకొద్దీ, లోకానికీ, మనకూ జరిగిన పోరాటంలో నేనే ఓడిపోయాను! సంపూర్తిగా నా తత్వమే మారింది! మానవత్వమే పోయింది! నీవిప్పటికీ పవిత్రంగా వున్నావ్! ఎలా వున్నావో తెలుసా? నేను నిన్ను కాపాడాను!

తల్లి: ఇంటిపట్టున ఉండేదానికీ నాకు, లోకంతో ఏం సంబంధం వుంది! అవును!

తండ్రి: ఆనాడు కోపంతో నువ్వతన్ని కొడితే ఆశ్చర్యపడ్డాను! అబ్బాయి... అబ్బాయి చనిపోతే... దుఃఖం వస్తుం

దని ఆశపడ్డాను! అది న్యాయంగానే కనిపించింది; అబ్బా, ఎంత ఘోరం!

తల్లి: పోనీలెండి! ఊరుకోండి! మరిచి పోండి!

తండ్రి: మరిచిపోవాలనే ప్రయత్నం చేస్తున్నా, కాని గాయం నయమైతే మాత్రం మచ్చ మానుతుందా!

(కొన్ని క్షణాలు నిశ్శబ్దం)

తండ్రి: ఏమి ఆలోచిస్తున్నావ్?

తల్లి: (త్రుళ్లిపడి) ఆ? అహా, ఏమీ లేదు!

తండ్రి: మరిచిపొమ్మని చెప్పావుగా!

తల్లి: ఏమిటి?

తండ్రి: అదే!

తల్లి: (దుఃఖం ఆపుకోలేక) నేను మరిచి పోలేను! నేను మరిచిపోలేను! (ఉద్రేకంతో నిలబడబోతూ పూలమాల చేతిలోకి తీసుకుంటుంది. ఇంతలోనే దూరంగా గాలిగా రామూ గొంతు వినిపిస్తుంది. "అమ్మా! అమ్మా!" ఆమె విని కలవరపడుతుంది. కళ్ళు వెదుకుతాయి. పూలమాల మళ్ళీ బల్లమీద పడిపోతుంది. మెల్లగా రామూ ప్రవేశిస్తాడు. అతన్ని పోలికపట్టడం కొంచెం కష్టమే. అయినా, ముఖం యౌవన తేజంతో కలకలలాడుతున్నది. స్వచ్ఛమైన తెల్లని దుస్తులు ధరించాడు. అతి నెమ్మదిగా, మృదువుగా, గంభీరంగా అమృతత్వాన్ని స్ఫురింపజేస్తూ లోకమంతటినీ క్షమించే ఉదాత్త పురుషునివలె మాట్లాడుతాడు. ఆమె ఆశ్చర్యంతో చూస్తుంది.)

రామూ: అమ్మా! అంతా క్షేమంగా వున్నారా? (ఆమె తనను తాను నమ్మలేని స్థితిలో వుంది) నేనేనమ్మా; రామూని! మరచిపోయావా!

తల్లి: వచ్చావా, నవ్వొచ్చావా!

రామూ: నిన్ను చూసి పోదామని వచ్చానమ్మా!

తల్లి: (ఆనందం భరించలేక కన్నీరు కార్చుతూ, కౌగలించుకుంటూ) మా తండ్రి వచ్చావా! ఇదంతా కలగా వుంది! ఎక్కడనుంచి వచ్చావో; ఎలావచ్చావో!

తండ్రి: (ఆశ్చర్యపడుతూ, తల్లితో) ఎవరితో? ఏమిటది? ఎవరితో మాట్లాడుతున్నావ్?

రామూ: (తల్లితోనే) ఎక్కడున్నా ఎలా వున్నా అమ్మకోసం రాకుండా ఎలా తప్పుతుంది! (నవ్వుతూ) నీకు నేను జ్ఞాపకం వున్నంతకాలం నేను జీవించే వుంటానమ్మా!

తల్లి: (తండ్రితో) విన్నారా! మన రామూ! మాట్లాడరేం! బ్రతికే వున్నాడండీ!

తండ్రి: (ఆశ్చర్యంతో) రామూ ఆ? నీకేం మతి పోయిందా? ఏమిటా మాటలు, ఊరుకో!

తల్లి: మీకు కనపడటంలేదూ? మన రామూ మనన్ని చూసి పోవడానికొచ్చాడండీ!

తండ్రి: నాల్లే! ఏమిటీ వెర్రి! ఎట్లా వస్తాడు!

రామూ: నాన్నకు నేను కనపడటం లేదమ్మా! పాపం! అది నా తప్పు కాదు!

తల్లి: ఏం నాయనా! అయితే... నాన్నే తప్పు చేశాడా?

రామూ: కాదమ్మా, ఆయనదీ తప్పు కాదు, నాదీ తప్పు కాదు! నాన్న తనపాత్ర తాను నిర్వహించాడమ్మా! నీది విషాదం! నాది అంతం! లోకం దృష్టిలో ఇదంతా ఒక నాటకం.

తల్లి : ఏమిటో, నీ మాటలు నాకర్థం కావడంలేదు ! రా నాయనా, కూర్చోవేం!

రాము : ఇప్పుడు కూర్చున్నా, నడిచినా ఏం చేసినా నాకు దిగులు లేదమ్మా; నాకు అనంతవిశ్రాంతి దొరికింది !

తల్లి ; (తండ్రితో) విన్నారా, విన్నారా ! మనవాడు సుఖంగా వున్నాడండీ ! ఇప్పుడు వాడికి దిగులన్న మాటేలేదు ! చూడండి ! ఎలా నవ్వుతున్నాడో !

తండ్రి : (ఆశ్చర్యంతో అంతటా పరికించి చూస్తూ) అయితే నిజంగా రామూ వచ్చాడా ? నిజమేనా ? నీతో మాట్లాడుతున్నాడా ? (బాధతో) మరి నాకు కన్పించడేం !

రాము : ఎందుకమ్మా నాన్నతో చెప్పటం ! ఆయన మనస్సు నిర్మలంగా మారేవరకూ ... అంతవరకూ నన్నెలా చూస్తాడమ్మా !

తల్లి : అదేమిటిరా ! నాన్నమీద యింకా నీకు కోపమేనా రామూ !

రాము : (నవ్వుతూ) లేదు ! కోపతాపాల సోపానాలు గడిచి వచ్చానమ్మా ! పాపం ! నాన్న ఏం చేస్తాడు ! ఆయన దశరథుడు ! కైకేయి స్వార్థంవల్ల ఆయన కళ్ళుమూసుకుపోయి, మనసార ప్రేమించిన రామూను కష్టాల కారడవుల్లోకి తరిమాడు ! అమ్మా ! ఈలోకం కైకేయి !

తల్లి : (ఆనందం దుఃఖం పొంగెత్తివస్తుంటే పట్టలేక) రామూ ! నువ్వు మారిపోయావురా ! నువ్వు మా రామూవు కావు, దేవుడివి ! రామూ ! —

తండ్రి : (తల్లితో) అడుగు ! అడుగు ! నన్ను క్షమించమని అడుగు!

తల్లి : (అతి మృదువుగా) చూడు! నాన్నను క్షమించవూ ? అమ్మ కోరిక తీర్చవూ ?

రాము : నే నేం చెయ్యగలనమ్మా ! మీ అందరినీ చూస్తుంటే జాలివేస్తుంది ! ఈ యిల్లు; ఇది గోరీలు ! ఈ మనుష్యులు ఊపిరిపీల్చే శవాలు ! మీకంటె నేను నయం ! అందుకే, మిమ్మల్ని ఓదార్చి పోదామని —

తల్లి : (తండ్రితో సంతోషంగా) విన్నారా ! మన రామూకు మనమీద ఎంత ప్రేమో ! విన్నారా !

తండ్రి : (కోపం వచ్చి) ఏం ! అంతమాత్రం నామీద ప్రేమవుంటే నాకు కనపడకూడదా, నాతో మాట్లాడకూడదా ! నేనేనా అంత పనికిరానివాణ్ణి !

తల్లి : (రామూవంక చూస్తూ ఆందోళన పడుతూ) ఏమీ అనుకోవద్దు నాయనా! ఆయన కోపదారి మనిషి, నీకు తెలుసుగా !

రాము : నాకు తెలుసమ్మా ! నాన్నకు కోపంలేదు. దుఃఖమే దుర్భరమై కోపంగా మారింది ! నాకు తెలుసమ్మా !

తల్లి : (కరిగిపోతూ) నీఅంత జాలిగుండె అందరికీవుంటే ఎంత బాగుండేది నాయనా !

రాము : అందుకే వచ్చానమ్మా !

తల్లి : ఎందుకు ? చెప్పు నాయనా !

రాము : చెపితే చేస్తారా ?

తల్లి : ఏం చెయ్యమంటావో చెప్పు ! మేమేం చెయ్యగలిగితే అది చేస్తాం; నీ కోసం !

తండ్రి : ఏం చెపుతున్నాడు ! అడుగు ! తప్పకుండా చేస్తాం ! ఈ క్షణంనుంచే!

రాము : మీకు శక్తివుంటే చెయ్యండి చెయ్యమని అందరితోనూ చెప్పండి ! !

తల్లి : ఏమిటది ?

తండ్రి : అడుగు ! అడుగు !

రాము : ఏముందమ్మా ! బాధలతో కృశించిపోయే వాళ్ళకు బాధ తలచి సహాయం చెయ్యాలండి ! మనుష్యులకు కావలసింది డబ్బు, దర్పం కాదమ్మా; సంతోషం ! సుఖం ! ప్రతి మనిషీ మంచివాడైనా లోకం ఇంత దుర్మార్గంతో ఎందుకు నిండివుందో తెలుసుకుంటే, ఈ లోకాన్ని పూర్తిగా బద్దలుగా పగులగొట్టి ఆకలి, జబ్బులు, ద్వేషం, క్రోధం అన్నిటినీ పూర్తిగా నాశనం చేస్తే, మళ్ళీ పునాదులు వేస్తే, ప్రతిఇల్లూ చల్లగా, మనుష్యుల మనస్సులు కలిసి అంతా హాయిగా వుంటే అదేనమ్మా సుఖం ! అది మనుష్యులకు తగిన లోకం !

తల్లి : (పరవశమై, తండ్రితో) విన్నారా ? విన్నారా ? రాము ఏమన్నాడో విన్నారా ? వాడు దేవుడు !

తండ్రి : (ఆదుర్దాగా) ఏమన్నాడు ? ఆఁ ఆఁ ఏం చెప్పాడు ?

రాము : అమ్మా ! నేను వస్తానమ్మా !

తల్లి : (హటాత్తుగా దెబ్బతిన్నట్టు) ఆ ! ఆఁ ! వెడతావా ? వద్దు, వద్దు.

రాము: తప్పదమ్మా! మనిషికి జీవితకాలమే తక్కువ ! మరి స్మృతి ఎన్నాళ్ళు బ్రతుకుతుందమ్మా ! (నెమ్మదిగా గంభీరంగా వెళ్ళిపోతాడు)

తండ్రి : వెడుతున్నాడా ? మన రాము ! ఉండమనూ !

తల్లి : (నిశ్చేష్టురాలై చూస్తూ, భర్తవంకకు తిరిగి) రాము వెళ్ళిపోతున్నాడు ! మీరు పిలవండి !

తండ్రి : ఏడీ ?

తల్లి : (బైటికి చూపిస్తూ) అడుగో !

తండ్రి : (బైటికి చూస్తూ, ఆశ్చర్యపడుతూ, హటాత్తుగా ఆనందాతిరేకంతో పొంగిపోతూ) ఆ !, ఆ! అడుగో ! (పెద్దగా పిలుస్తూ) రాము ! ఓ రాము ! (రాము వెనుతిరిగి చూస్తున్నట్టు) అడుగో నవ్వుతున్నాడు ! (పిలుస్తూ) ఓ రాము ! (రాము వెళ్ళిపోయాడని తండ్రి ముఖకవళికల్ని బట్టి తెలుస్తుంది. భార్యతో) రాము నాకు కన్పించాడు. నా వంక చూసి నవ్వాడు. (ఈ లోపల ఆమె పూలమాల చేతిలో పట్టుకోవడం చూసి) ఎంతపని చేశావ్ ! పూల మాల వెయ్యలేదేం !

తల్లి ! (బైటికి చూస్తూ ఆ మాటలు విని [illegible], కలవరించినట్టు మాట్లాడుతుంది) ఏడీ! ఏడీ రాము ! రాము రాలేదుగా ! మన మనస్సులో కన్పించాడు ! అంతేగా !

(అతను విభ్రాంతుడై చూస్తుంటాడు ఆమె వెక్కి వెక్కి ఏడుస్తుంది.)

# పన్నెండు

## కుందుర్తి

కాలం ముళ్లకంపల తోడుగిచ్చిన బ్రతుకుదారి సందుల్లో గొందుల్లో
చెప్పలేని ఉత్తేజాలతో గెరిల్లాలు శీఘ్రంగా పరుగెత్తుతారు
వాళ్లెక్కిన ఆశయాల రథాలకు ఆయాసాల కొండలు అడ్డురావు
కష్టాల నీటిబొట్లు అంటీ అంటని మనస్సుల తామరలు వికసించిన
ఆలోచనల సరస్సుల్లో అనుదినం జలకాలాడే గెరిల్లాల మదేభాలను
ప్రాణభీతినక్రాలు పట్టుకోలేవు; బ్రతుకు శాపాలచక్రాలు ముట్టుకోలేవు

ఆశయాల అరణ్యాలు పరుగుపందెంలో వ్యాఘ్రాన్ని తప్పించినవాడే వీరుడు
చీకటి సర్కస్‌లో బాధల త్రాళ్లమీద గొడుగునడక నడిచినవాడే ధీరుడు
ప్రతిమనిషి గుండెలోని పులులను బైటికి తెచ్చి,
ఆడించి చూపేవాడు నాయకుడు
ప్రతి మనసులోని తీరని కోరికల గీతాలకు,
లయ కల్పించినవాడు గాయకుడు
బ్రతుకుబాధ బరువెత్తటంలో, తూకం పెంచినవాడే కుస్తీలపట్లలో నేర్పరి
తన ప్రాణం త్రాసుమీద ముక్కలు
సమంగా తూచినవాడే గడుసరి తీర్పరి

వారం రోజులముందు వట్టి పిరికిగుండె
నేను ముప్పేట మలచిన దారపు కండె
ప్రాణం పెళ్లాలకు దాసులైన ఒకరిద్దరుపోను
మిగిలినవారు జితేంద్రియులు; ప్రతివ్యక్తిలోని శక్తి చేను
పండిన చైతన్యసస్యం నికరతూకం, కొంచెం తక్కువ కోటిపుట్లు
వ్యక్తులు, చేతుల్లో తెగిపోయిన
గొలుసుకట్లు, మనసుల్లో తెరపిచ్చిన చీకట్లు

తన ప్రజల యోగక్షేమాలను విచారించే
పని, అధికారం, మిలిటరీకి అప్పగించింది
గెరిల్లాల వార్తలువిని తుపాకి చివరకత్తి నాలుకతో చప్పరించింది !
రివిన్యూ లెక్కల్లో పేరున్నా, నిజానికి లేని గ్రామాలుతప్ప
అన్ని గ్రామాలను మిలిటరీ ఆదరించింది.
అధికారం ఆజ్ఞలమేరకు యిదివరకే కాలినగ్రామాలు తప్ప
అన్ని గ్రామాలను మిలిటరీ దర్శించింది.

గ్రామం నాలుగువైపుల గుబురుగా పెరిగిన చెట్లకొమ్మల సందుల్లో
కాపలాదార్లు ఉంటారు;
దూరాన కనిపించేమనుష్యులారీలదని వారికి తెలుసు
అక్కడేసిన యీల గాలిలో గంతేసి చెప్పినట్లే సంగ్రామం గుప్పిస్తుంది
మనుష్యుల్లేని ఊరిమీద మనసుతీర దాడిచేస్తుంది మిలిటరీ

సూర్యుడి కిరణాలు తెలుపు; అందులో దాక్కున్న అనేక రంగులు
అద్దం అంచుగలమీద అవి పలచగా కనిపిస్తై;
సంఘం ఆశయాలుకూడా తెలుపు; అందులో ప్రజలశక్తి అనేకభంగులు
దాడిమధ్యలో అవి దళసరిగా కనిపిస్తై

సంఘం సమయంచూసి యెదురుపడింది; మిలిటరీ సంఖ్యాబలం
సిరాబుడ్డి పాళీచెక్కి రాయనికలం
ప్రజల తెల్లకాయితాలమీద రాయలేదు ఏమి ఫలం ?
ఇప్పుడు యెదురైంది ఆకలితో పదునెక్కి మెలికలుతిరిగిన హాలం
కొలిమిలో వంచిన కొడవలిలాంటి
ప్రశ్నార్థకాల బ్రతుకు టగ్గిమీద వేసిన గుగ్గిలం

ఓ అధికార దౌర్జన్యాల అంధకారమా పో, జయించలేవు నువ్వు
అదుగో పొడిచాడు సూర్యుడు; నవ్వింది తెలివి తామరపువ్వు
ఇప్పుడు యెదురైంది పొలాలనూ, ఫలాలనూ సమంగా పంచే నీతి
ఒక కోటి మహాజనులు విసిగి విసిగి చివరకు చేపట్టినరీతి !

ఇప్పుడు యెక్కువైంది ఆకలితో గుహ వెడలిన కోటికోరల పెద్దపులి
అడివిలో నాలుగు చెరుగులు ముడివేసి నిన్ను తీసుకుంటుంది లే బలి.

మనకంట్ల ముందు కనిపించే వ్యవస్థ; యిది చరిత్రకు పట్టిన అవస్థ
దీన్ని పట్టుకుని ప్రేలాడేవారు; యెన్నటికీ జయించ లేరు.
కారణం తెలీకపోవచ్చు; కార్యం జరుగుతుంది;
సంఘంలో సామాన్యులే మెండు
నీ చిర కాల వ్యసనమైన అసమానతకు చోటుండదు;
దీన్ని పరిష్కరిస్తాము ఉండు.
ఆ యుధాల అహంకార దేవిని పూజించి ప్రయోజనం లేదు;
ప్రజల్లో గర్భితమైన శక్తి
అనంతం; నీవు వేసుకునే లెక్కలకు అందదు;
కారణం నీ అనుచరుల స్వార్థభక్తి.

ఈ నేల నెవరిది ? కోటి ప్రజలసొత్తేగదా !
కొందరు వద్దంటే ఒప్పుకోని చరిత్రా ! ముందుకుపదా !

["తెలంగాణా" కావ్యంలోంచి]

# కఠిన మార్గం

## (ఏకాంకం)

## పాకల వెంకటరాజమన్నారు

కాలం : ఏసుక్రీస్తు జీవించి ఉన్న రోజులు.

[ ఇండియాలో యాకూబ్ సౌధం. పడకగదిలో యాకూబ్, అతని భార్య మార్తా. యాకూబ్ చాలా ధనవంతుడు. ఆగర్భ శ్రీమంతుడు, యౌవనం దాటని వాడు, చిన్న గడ్డం, విశాలమైన నుదురు, కోటేర్చిన ముక్కు, పెద్ద కళ్ళు, నోరూ, పెదవులూ, ఇంద్రియలోలత్వం సూచిస్తవి. మార్తా అందగత్తె యని అంటారు అందరు. ఏ ఒక్క అవయవమూ అంతగా బాగుండకపోయినా, చేష్టల్లో, మాటల్లో చూపుల్లో లాలిత్యం వుంది.

మార్తా కిటికీనుంచి తొంగిచూస్తోంది. యాకూబ్ మంచంమీద కూర్చున్నాడు. ]

యా : ఏమిటా కలకలం ?

మార్తా : ఏమి జనం ! ఏమి జనం ! కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు, వాళ్ళ వెంబడి వాళ్ళ బంధువులు, రోగంతో బాధపడే పిల్లల్ని భుజాలమీద వేసుకొని వెళ్ళే ఆడవాళ్ళు, ఒక్కక్షణం ఆగకుండా వెళ్ళిపోతున్నారు. ఏ పండగనాడూ చూడలేదు ఇట్టువంటి జనసమ్మర్దం.

యా : ఆయనదగ్గరికేనా ?

మార్తా : మరి? అయ్యో, చూడండి నా ముసలిదాది జుబేదాకూడా పది సంవత్సరాలుగా మానలేదు దాని కాలిరణం. ఎలా సర్రిగా పోతూవుందో ?

యా : ఏమిటీ మాయ !

మార్తా : (కిటికీనుంచి మంచం దగ్గరకు వచ్చి) భగవంతుని మాయ. ఇంకేం ఉంటుంది ?

యా : నేనూ చాలా విన్నాను. మొదట నమ్మకం లేకపోయింది గాని ఆయనకీర్తి రోజురోజుకూ ఎక్కువైపోతూవుంది. మొన్న గలిలీలో ఆయనచేసిన మహాత్కార్యం కళ్ళారచూచిన నా స్నేహితుడే చెప్పాడు.

మార్తా : ఏమది ?

యా : ఎలియాస్ ఎరగవూ. అతని కొడుకు పట్టి పిచ్చివాడు.

మార్తా: అవును, పాపం. ఎప్పుడూ కట్టేసి వుంచుతారు. ఒక్క క్షణం అజాగ్రత్తగా వుంటే వెర్రిగా ఎగురుతూ పోయి ఏ బావిలోనో, గోతిలోనో పడి పోయేవాడు.

యూ: కొడుకుని తీసుకు వెళ్ళారట; ఏమైనా ఉపయోగం ఉంటుందేమోనని. ఆయన కొండ మీద ఎక్కడో ప్రార్థించడానికి వెళ్ళినాడని విని, పోనీ ఆయన శిష్యులకు ఆ ఒకమాత్రం శక్తి ఉండదా అని, వారిదగ్గరికి పోయి చెప్పుకున్నాడు విషయమంతా. వాళ్ళలో ఇద్దరు ముగ్గురు అనుమానిస్తూ ప్రయత్నించి చూస్తామంటూ దగ్గరకు వస్తే, కుర్రవాడు కరవబోయాడు. భయంవేసి వారు "మావల్లకాదు నాయనా" అని ముఖం వేలవేశారు.

మార్తా: అందరికీ ఉంటాయా అలాంటి శక్తులు.

యాకూ: ఎలియాస్ ఆయనవచ్చేవరకూ ఉండి, ఆయన రావటంతో కాళ్ళమీద పడ్డాడు. ఆయన చాలా దయతో లేవనెత్తి, ఎంపాకన్నట్లు సూచించగానే జరిగిందంతా చెప్పుకున్నాడట. ఆయన భంగపడి "అయ్యో, ఇంకా ఎన్నాళ్ళకి కలుగుతుంది విశ్వాసం? నేనింకా ఎన్నాళ్ళుంటానుమీతో" అని అడిగాడు. కొడుకుని తీసుకొనివచ్చి, ఎదురుగా నిలబెట్టగానే ఆయన ఏదో మంత్రించాడు. అంతే ఎక్కడి పిచ్చి అక్కడ పారిపోయి, నిక్షేపంలాగ అయ్యాడు కుర్రవాడు. శిష్యులు సిగ్గుపడిపోయి "స్వామీ, మాచేత కాలేదెందుకో" అన్నారట. ఆయన అన్నాడట కఠినంగా "ఊరికే రాదు తపోబలం" అని. ఆశ్చర్యంగా ఉందికదూ. అయితే అంతా నిజం. చూచినవాళ్ళే చెప్పారు.

మార్తా: మహాత్ముడే నిజంగా. కానీ, 'నేనింకా ఎన్నాళ్ళుంటా'నని ఎందుకన్నాడో కదా. అందులో ఏదో రహస్యం ఉందా?

యాకూ: నీ కెప్పుడూ వింత ఊహలే. ఏదో విసుగుతో అని ఉంటాడు.

మార్తా: మీరు అలాగే అనండి. నాకుమాత్రం ఏదో విశేషార్థం ఉందనే నమ్మకం. ఆయన అట్టే కాలం ఈ లోకంలో ఉండడేమోనండి, అలాంటి వాళ్ళకి భవిష్యత్తుకూడా తెలుస్తుంది కరతలామలకంగా ... (కొంత సేపు మౌనంగా ఉండి హఠాత్తుగా) ఏమండీ!

యాకూ: ఆఁ. ఇంకేదో ఊహ పుట్టుకొచ్చిందా? చెప్పు.

మార్తా: ఆయన్ని మీరు ఒకసారి చూచి రారాదండీ?

యాకూ: (పలకడు)

మార్తా: ఇందులో తప్పేమి ఉందండీ.

యాకూ: ఊరికే చూచివస్తే ఏమి లాభం. వింటాం, వినోదమూ? ఉత్సవానికి వచ్చిన జనసమూహాన్ని నోరు తెరుచుకొని చూచే పల్లెటూరి వారి మోస్తరు చూచిరానా?

మార్తా: వద్దు. ఆయన దగ్గిరికి వెళ్ళి మాట్లాడిరండి.

యాకూ: నా వ్యర్థపు మాటలతో ఆయన్ని విసిగించనా. ఆయన చేసే మహత్కార్యాలకు అంతరాయం కలిగించమంటావా?

మార్తా: ఆయన అలా అనుకోడు. చిన్నబిడ్డల్నికూడా చేరదీస్తారటండీ. అతని సౌలభ్యాన్ని పొగడనివారు లేరు.

యాకూ: ఏమడగను?

మార్తా: దైవానుగ్రహం వల్ల మనకు సిరి సంపద లోటులేదు. పరమార్థం ప్రాప్తించే మార్గం ఉపదేశించమని ప్రార్థించండి.

యాకూ: (కొంచెం ఆలోచించి) అబ్బా! (ప్రేమతో మార్తా తల నొక్కుచు) ఈ బుర్రలో ఎంత తెలివి ఉంది!

మార్తా: భయం వేస్తూ వుందటండి? వెళ్ళి వచ్చాక మెచ్చుకోండి.

యాకూ: భయమెందుకు? నేనే పాపమూ చెయ్యలేదు. ఆయన ఏమి ఉపదేశించినా అది చెయ్యడానికి నాకేమి అభ్యంతరం ఉంటుంది? తప్పక చేస్తాను.

మార్తా: ఆయనకి మీరు శిష్యులైతే మీకు నేను శిష్యురాలనవుతానులెండి.

యాకూ: ఒంటరిగా ఉంటావా?

మార్తా: ఫరవాలేదు. కిటికీనుంచి వీధిలోకి చూస్తూంటే ఎంత కాలమైనా గడిచిపోతూ వుంటుంది.

యాకూ: సరే, వెళ్తాను.[నిష్క్రమణ] (మార్తా కిటికీనుంచి చూస్తోంటుంది భర్త వెళ్ళడం; ఇతరులు రావడం, పోవడం. ఇంతలో ఆ గుంపులో దాది జుబేదా కనబడుతుంది. మామూలుగా కష్టంలేకుండా నడిచి వస్తోంది) జుబేదా (బిగ్గరగా) జుబేదా, పైకిరా, రా! రా! అబ్బ? ఏమి ఆశ్చర్యం.

[జుబేదా ప్రవేశిస్తుంది. ౬౦ ఏండ్లు దాటిన ముసలిగాది. ముఖంలో సంతోషం, ఆవేశం, ఆశ్చర్యం తాండవిస్తూవున్నాయి.]

జుబే: అమ్మగారు! అమ్మగారు! నన్ను రక్షించారండి ఆయన. ఈ జన్మలో నాకు మానదనుకున్నాను కదండీ రణం. అంతా ఆరిపోయింది. చూడండి (కాలు చూపిస్తుంది.) ఒక మరక తప్ప ఇంకేమీ లేదు – మాయగా వుందికదూ అమ్మగారు. కాదు, కాదు. ఆయన దయ, ఆయన మహాత్మ్యం.

మార్తా: (కండ్లలో నీళ్ళు తిరుగుతున్నవి) చెప్పు, జుబేదా, చెప్పు. ఏమిజరిగింది? ఎలా జరిగింది?

జుబే: నేనీ రణంతో ఎంతబాధ పడ్డానో మీకు తెలియదండీ. ఎందరు హకీములదగ్గర మందు తిన్నాను. ఎంత ఖర్చుపెట్టాను. ఆవగింజంతా లాభం లేకపోయింది. ప్రాణం విసిగి ఇంతే నా కర్మ అనుకున్నాను. మొన్న ఆయన కథలన్నీ విన్నాను. పదిమందీ చెప్పుకుంటూ వుంటే, ఏమిటో తక్షణమే పిచ్చినమ్మకం కలిగింది. ఎలాగైనా ఆయన నా బాధ తీరుస్తాడు అని ... అంతే ... బయలుదేరాను.

మార్తా: నేనుచూచాను జుబేదా నీవు వెళ్ళడం. తదేకధ్యానంతో నీవు వెళ్ళటం చూచి వెర్రెత్తిందేమో అని కూడా అనుకొన్నాను.

జుబే: అలాగేనమ్మా. నా మనస్సులో ఒకటేభావం. వెళ్ళి ఆయన్ని ముట్టుకున్నా చాలు నారోగం కుదిరిపోతుంది అని.

మార్తా: ఎంత వెర్రినమ్మకం?

జుబే: నమ్మకమంతా వెర్రే కదమ్మా!

మార్తా: మాడ్చేశావు. ఆఁ, తరవాత ఏం జరిగింది.

జుబే: అలా, ఒకటే ధ్యానంతో వెళ్ళాను. వెళ్ళేటప్పటికి ఆయన్ని మన దేవాలయం ధర్మకర్త ఎవరో పెద్దమనిషి తన ఇంటికి పిలుచుకెళ్ళుతున్నట్లు చెప్పుకొన్నారు. దూరంగా కనబడింది ఆయన వీపు, తల. నాకూ ఆయనకూ మధ్య వందలు. గుండె జారిపోయింది. ఆయన్ని ఎదురుకొని వేడుకోవడం నావంటి దానికి వీలుగానిపని. పోనీ, ఆయన వస్త్రమైనా ముట్టితే చాలు, అనుకుని దీనంగా "బాబూ దారి తియ్యండి బాబూ" అని అడుక్కొంటూ, ఆయనదగ్గిరకి నెళ్ళడానికి ప్రయత్నం చేశాను.

మార్తా: పాపం!

జుబే: నాపుణ్యా మనమ్మా. అలా ఈదుకునివచ్చి, తీరా సమీపించేటప్పటికి, ఆయన ముందు నెళ్ళడానికి ధైర్యం చాల్లేదు. చెయ్యిచాచి ఆయన ఉత్తరీయాన్ని ముట్టుకొని ఆ చెయ్యి నాకళ్ళ కద్దుకున్నాను. ఒళ్ళు ఝల్లుమంది. చెమటలు పోసినాయి. గుండె గబగబా కొట్టుకుంది. రణంవల్ల ఎప్పుడూ పోటుపెట్టుతూవుండేది. ఆపోటు మాయమైంది. బ్రతికానను కున్నా.

మార్తా: ఆశ్చర్యమాశ్చర్యం!

జుబే: ఇంకావుంది నా కథ. వినాలి మరి. అలా నేను ముట్టుకున్నా, క్షణంలో ఆయన ఇటూ అటూ చూచి అడిగారు "ఎవరు నా వస్త్రం ముట్టినవారు?" అని. ఆయన శిష్యుల్లో ఒకడన్నాడు "స్వామీ ఈ జనసమ్మర్దం మిమ్మల్ని చుట్టుకోవటం చూస్తూ, ఇందులో ఎవరు అంటే ఎలా చెప్పగలం" అని. అప్పుడాయన గిరుక్కుమని వెనక్కి తిరిగి నన్ను చూచాడు. అమ్మయ్య! తలుచుకుంటే జలదరిస్తుంది. నాకు అమిత భయం పట్టుకుంది. గజగజలాడిపోయా. నోట్లో తడిలేదు. వేరే ఏమీ తోచక సాష్టాంగంగా పడ్డాను. "స్వామీ నేనే, మీ వస్త్రం తాకినా, నా రణం మానిపోతుందని అలాచేశాను. రక్షించండి" అని ఏడ్చాను. ఆయన తన చేతుల్తో నన్ను లేపనెత్తి అమ్మా, నీ నమ్మకమే, నీరణాన్ని నయంచేసింది.

వెళ్ళు సుఖంగా వెళ్ళు. నీకు ఇక బాధ ఉండదు" అని చల్లగా పలికారు. ఇంతలోనే ఎవరో ఆ ధర్మకర్తగారి ఇంట్లో నుంచి వచ్చి "ప్రభూ, మీ కూతురు చచ్చిపోయింది. ఎందుకు స్వామికి శ్రమ" అని దుఃఖవార్త చెప్పారు. ఆయన ధర్మకర్తని చూచి "ఏమీ భయం లేదు. నమ్మండి" అన్నారు. వారలా వెళ్ళిపోయారు, నేను సంతోషం పట్టలేకుండా గెంతుతూ వచ్చేశాను.

మార్తా: ఎటువంటి మహాత్ముడు!

జూబే: నేను వస్తూవుంటే దారిలో చెప్పుకున్నారు; ఆ ధర్మకర్త కూతుర్ని చచ్చిపోయిందాన్ని లేచి రా అని అనగానే మళ్ళీ బ్రతికి లేచిందని.

మార్తా: వెళ్ళు, దాదీ, వెళ్ళి శ్రమతీర్చుకో.

జూబే: అలాగే తల్లి. సెలవు.

[నిష్క్రమణ]

[మార్తా ఇటూ అటూ పచార్లు చేస్తుంది. ఖంగారుగా, అప్పుడప్పుడు కిటికీలోనుంచి చూస్తుంది. కొంతసేపటికి భర్త రావడం చూచి ద్వారంవద్దకు పరుగెత్తుతుంది]

[ప్రవేశం యాకూబ్. అలసినట్లుంటాడు గాని అది కేవలం శరీరం అలసట కాదు. ముఖంలో తేజస్సులేదు. ఆశాభంగంవల్ల వాడిపోయినట్లుంది.]

యాకూ: (తలమీద పాగా తీసి మంచంమీద విసిరి ఉస్సురంటూ కూర్చుంటాడు.)

మార్తా: ఏమండీ, ఆయన కనిపించనే లేదా.

యాకూ: ఓ, దర్శనానికేమీ భంగంకలగలేదు.

మార్తా: ఏమండీ అలా వున్నారు? ఆయన చులకనగా చూచారా? పరుషంగా పలికారా? దూషించారా?

యాకూ: అయ్యయ్యో, అలాంటి నిందలకి ఆయన చోటిస్తారా? ఆయన్ని అంటే పాపంతో నాలిక కుళ్ళిపోతుంది. మార్తా, అటువంటి సౌమ్యమూర్తి నేనీ జన్మలో చూడలేదు. ఇక చూడబోను. ఆయన నన్ను కాదు కదా, డబ్బుకు శరీరం అమ్ముకునే భోగస్త్రీని కూడా ఒక్కమాట పరుషంగా అనలేదు.

మార్తా: మరి?

యాకూ: వెళ్ళి, చేతులు మోడ్చి అడిగాను. "పుణ్యప్రభూ, నాకు

పరమార్థం ఎలా లభిస్తుందో సెలవియ్యండి." ఆయన విని చిరునవ్వుతో "నన్నెందుకు పుణ్యప్రభువని పిలుస్తావు. పుణ్యస్వరూపుడు ఆ భగవంతుడు ఒక్కడే. నీ ప్రశ్నకు నేనేమి జవాబు చెప్పమందువు. మన ఆచార్యులు నిర్ణయించిన నీతి మార్గాన్ని అనుసరించు అంతే" అన్నారు.

మార్తా: అంటే?

యూకూ: అదే నేనూ అడిగాను. ఆయన ప్రత్యుత్తరం ఇచ్చారు. "ప్రాణం తియ్యకు, వ్యభిచరించకు, అపహరించకు, అసత్యమాడకు, తల్లిదండ్రులను పూజించు, అందర్నీ నీతో సమంగా ప్రేమించు." ఇంతే నా అని గర్వపడ్డాను. "స్వామీ, ఇవన్నీ నా చిన్ననాటినుంచే అనుసరించాను. ఇంకా ఏమి చెయ్యమని తమ సెలవు, పరిపూర్ణమైన పారమార్థిక జీవితానికి" అని ఉత్సాహంతో అడిగాను. మార్తా, అప్పుడాయన నన్ను పరామర్శించినట్లు చూచాడు, జాలిగా, నాకు అర్థం కాలేదు. మృదువుగా, అయినా నిశితంగా, గంభీరంగా పలికిన ఆయన మాటలు విన్నప్పు డర్థమైంది.

మార్తా: (తొందరగా) ఏమన్నారు?

యూకూ: ఏమా, చెప్తాను. "నాయనా నీకు పరిపూర్ణత్వం సిద్ధించాలంటే ఇంకొకటి చెయ్యాలి. నీ వస్తు వాహనాలు, ధన ధాన్యాలు యావత్తూ బీదలకు ఇచ్చేసి బంధాలన్నీ తెంచేసి, నా వెంట వచ్చెయి" ఇవీ ఆయన మాటలు. మార్తా! మార్తా! అలా అంటారని అనుకోలేదు. నానోట మాట రాలేదు. నమస్కారం చేసి, వంచినతల పైకెత్తకుండా, వచ్చేశాను. వస్తూవుంటే శిష్యులతో ఆయన అన్నది విన్నాను. ఏమంటే "నిజం చెప్తున్నాను! ధనవంతుడు ఆధ్యాత్మిక రాజ్యంలో ప్రవేశించడం దుస్సాధ్యం. లొటిపిట్ట దొడ్డి గుమ్మంలో నుంచైనా పోవచ్చునుగాని, ధనవంతుడు ఆ రాజ్యంలోకి పోలేడు" అని.

మార్తా: అబ్బా!

యాకూ: చాలా కఠినమార్గం కదూ మార్తా?

మార్తా: (పలకదు-కాని జాలిగా భర్తవంక చూస్తోవుంటుంది.)

యాకూ: (రెండు చేతులతో ముఖం కప్పేసుకుంటాడు.)

(ఈ నాటికకు ఆధారం ప్రైబిక్)

★

# జకోస్లవేకియా రచయితల సంఘం సందేశం

"ప్రియ మిత్రులారా, ఆంధ్ర అభ్యుదయ రచయితల ఐదవ మహాసభకు, అఖండ విజయాన్ని, తత్సభ్యులకు అనేక సృజనాత్మక విజయాలను ఆకాంక్షిస్తున్నాము. మాతో మీ సంఘము స్నేహమయి సౌహార్ద సంబంధాలను ఏర్పరుచుకొంటుందని, అభ్యుదయ సంస్కృతి కొరకు, సమస్త విశ్వశాంతికొరకు మనము ఉభయులము సాగిస్తున్న కృషిలో భ్రాతృభావ ప్రేరిత సహకారాన్నికూడ స్థాపిస్తుందని నమ్ముతున్నాము".

# క్రాంతి - శాంతి

## కారుమంచి

గ్రీష్మర్తువు అపరాహ్ణం
పంకా తిరగడం మానేసింది
కడలి క్రుంగింది
లోకం కుతకుతలాడింది
ప్రకృతి స్తంభించి
క్షోభించింది
సంక్షోభం నెర్రెలు వేసింది.

♦ ♦ ♦

ప్రభంజనం పక్షాల విప్పించి
పర్వతాలకు పక్షాలూడాయి
గగనం ఉక్కిరిబిక్కిరయింది
మార్తాండుని ముఖం ఎర్రవారింది
ఆటంపై
ఎలక్ట్రానులు ఎదురు తిరిగాయి
కాలుడు గంట వాయించాడు
అనుభవించిన సౌఖ్యం
విద్యుల్లతై ఆటలాడి
పాటపాడి మాటలాడింది.
రెండోమారు గంట మ్రోగింది
పోగుచేసుకొన్న పాపం
పొగమంచై చుట్టు ముట్టి
తట్టి లేపి ఉక్కిరి బిక్కిరి చేసింది

గంట మూడోసారి మ్రోగింది
పిల్లగాలులు తల్లి ఒడిలో చేరాయి.

♦ ♦ ♦

గడ్డిపరకలు గజాన్ని బంధించాయి.
చలిచీమలు సర్పాన్ని చంపాయి
భూమి ఆకాశాన్ని వెక్కిరించింది
గప్పు గప్పుమని
పెట్రోమాక్సులైటు ఆరిపోయింది
విద్యుల్లతేమో
నిలబడి వెలుగు లాలించింది

♦ ♦ ♦

అశాంతి ముదిరితే క్రాంతి
ఆ క్రాంతి చివరన్నే శాంతి!

---

# బల్గేరియా రచయితల సంఘం సందేశం

"ప్రియమిత్రులారా, ఇవే మా హృదయపూర్వకాభినందనలు, ఘనమైన మీ దేశం ఆర్థిక, సాంస్కృతిక పురోగతికొరకు, శాంతి, సాంఘిక న్యాయంకొరకు జరిగే పోరాటంలో అభ్యుదయ రచయితలను మీ మహాసభ సంఘటితపరచి ఉత్సాహ మొసగగలదని మా నమ్మకము."

★

# హాస్య రచన

## పుచ్చా పూర్ణానందం

హాస్యం నశ్యం లాంటిది. అయితే ఆఫీసర్స్ క్వాలిటీ. ఘాటు, మంట వుండదు. నరాలు సళ్ళిస్తవి. పొడిత్రయం – కాఫీ పొడి, నక్క-పొడి, ముక్కుపొడి – సేవించనివారెవరూ. ఈ నాగరికత ప్రపంచంలో. మూర్తిత్రయం, సమిధత్రయం, కవిత్రయం, త్రయోగారుష్యం ఇంకా యెన్నో. చుట్ట, బీడీ, సిగరెట్ యేదో వొక రూపంగా ఆ ధూమపత్రాన్ని సేవించటమే మన లక్ష్యం. నశ్యం ధూమమార్గం గనుక పండితులుకూడా నిండుసభల్లో పీలుస్తూ సీట్లు ఖరాబు చేస్తుంటారు. శంకరుడంతటి వాడు పొడుండబ్బి వదలడు నిత్యాభిషేకాలకు జలుబు చేసి.

హాస్యరచనంటే చమత్కారమైన పలుకులతో కితకితలు పెట్టడం. నవ్వు పువ్వులు విసిరి చక్కిలిగింతలు పెట్టటం. దీనిలోకూడా ద్రాక్షాపాకం, నారికేళ పాకం, గచ్చకాయపాకం వున్నాయి. ఒక జాతియొక్క గొప్పతనం తెలుసుకోవాలంటే చమత్కారంగా మాట్లాడగలవాళ్ళు, వ్రాయగలవాళ్ళు యెక్కువగా వుంటుంబట్టి రుజువౌతుందని వొక చైనాకవి చెప్పాడు. హాస్యరచనలో వినోదమే కాదు; వికాసంకూడా వుంటుంది.

హాస్యమంటే బఫూనరీ కాదు. క్లౌను పాత్రకాదు. వసంతకుడి ధోరణి కాదు. కేవలం ప్రియవచనాలే కాదు. భావముండి తీరాలని లేదు. హాస్యం అనేది అనిర్వచనీయం. నిఘంటువులు అందదు. హ్యూమర్‌ను డిఫైను చేయటానికి పూనుకోవటం హ్యూమర్ లేని లోపమే. ఒక రకమైన అసంబద్ధం, అస్పష్టత, అతి సున్నితం, అర్థహీనం — వీటన్నిటిలోనుంచీ హ్యూమరు పుట్టవచ్చు. తాను నవ్వించి తనుకూడా యితరులతో పాటు ఆ ఆనందంలో సగస్వముగా పాల్గొనగలగటమే హాస్యరచన. ఇతరుల వెర్రితనాన్ని వేలెట్టి చూపి వేళాకోళం పట్టించటం. వెక్కిరించటం మాత్రం కాదు. నొప్పి కలిగించాలి; గాయపరచకూడదు. హ్యూమరిస్టు అంటాడు-పడతాడు. విట్టు పెంకు, హ్యూమర్ కొబ్బరి. హ్యూమర్‌కు విట్టు వాహనం. మన హాస్యం వుందే, విట్టు, సెటైరు, హ్యూమరు మూడూ నూరి కలిపి ముద్దకట్టు. విడదీస్తే సొగసులేదు. హాస్యం మానవ సౌందర్యానికి మంచి మెరుగు. దీనితో వొక జాతియొక్క సంస్కృతి తూకం, కొలత వేయవచ్చు. ప్రపంచంలో వున్న వాఙ్మయము లన్నిటిలోనూ యిది పెనవేసుకుంది. నవలలు, నాటకాలు, ఇతిహాసాలు, పురాణాలు, ప్రబంధాలు, ఆఖరుకు వేదాంత గ్రంథాల్లోకూడా వెతుకుతుంటే యీ మణిపూసలు విరివిగా దొరుకుతూ వుంటాయి. ఆదికావ్యం లగా నేయిటీకు పొట్టి కథలవరకూ అన్నిటి

లోనూ అంతోయింతో కనబడుతూనే వుంటుంది. ఆంగ్ల సాహిత్యంలో యీ హాస్యరచన హెచ్చు; మేలైనరకం కూడానూ. ఇతరులు కొంత వెనకబడ్డారనే చెప్పాలి.

ఒక తలకాయపంతులు విట్టు వదిలాడు. పిల్లలు నవ్వలా. బాలకులారా నేను మాట్లాడిన దాంట్లో హ్యూమరు వుంది నవ్వండి అన్నాట్ట. అప్పుడు స్టూడెంట్సు నవ్వారుట అందుకు. తిప్పిబ్బు మాటలు, స్పెల్లింగుతప్పులు, ఆగ్రహంలో, ఆవేశంలో తొట్రుపాటు, తొందర, పరధ్యానంలో తొస్సు, భోజన సమయాల్లో భంగోస్తులు, వివాహాల్లో వరుసలు పరిహాసోక్తులు, హ్యూమరిస్టులకు కావలసినంత ఫుడ్ కగక. హాస్యమంటే యిది అని చెప్పటంకంటే నా సంచికట్టులోవి మచ్చుకు కొన్ని కుప్పెలు సభికులపై వాడి చూస్తా.

హైస్కూళ్లలో చదువుతుండే అన్నదమ్ములిద్దరూ కీచులాడుకుంటూ వొకడంటాడు—మీ మాస్టారుకు నత్తి; బట్టతల; గొగ్గిపళ్ళు; వొంటినచీడ. రెండోవాడు—మీ టీచరుకు చుండుబుర్ర; బుర్రముక్కు, యేప్రొద్దూ కారాకిళ్ళీనముల్తాడు. మొదటివాడు—మీ పంతులి మొగం సొరుగులు తీసిన డ్రాయరుకు మల్లే. వృత్తి క్షామ దేవత. ఇహ రెండోవాడు—మీ మాస్టరు ముక్కు పందికొక్కు కన్నాలు. గాలికి పిలక యెగురుతూవుంటుంది. అస్తమానం గోచీ వూడిపోతూ వుంటుంది. తండ్రి వచ్చి కేకలేసేదాకా వీళ్ళిద్దరూ తమకు తెలియకుండానే తమ టీచర్లను పాడువర్ణన చేస్తుంటారు. వినేవాళ్ళకు యీ అమాయకపు భాషలలో కడుపు చెక్కలయ్యేట్టుగా నవ్వు వస్తూవుంటుంది.

నాన్నగారూ యముడు సూర్యుడి కొడుకా అని కుమారుడు తన సందేహం తీర్చుకోవాలని తండ్రిని అడిగాడు. కాదు, నాకొడుకు అని నాన్న జవాబు. 'రాముడు రావణుని చంపెను' యీ వాక్యంలో కర్మ యేదో చెప్పమని తండ్రి ప్రశ్నించాడు. చంపబడటం రావణుని కర్మ, వ్యాకరణము చదవటం తన ఖర్మ అని జవాబు. ముత్తయిను యెదురొచ్చిరా పరీక్ష తప్పితిని, శమనం పని చేయలేదని పిల్లాడు అన్నాడు. గంగా భాగీరథిలో మాజీ ముత్తయిదుతనం వుంటుంది. శ్రీమతిలో రాబోయే విధవత్వము వుంటుంది. అదీ కాక కొందరికి జీవకళ, కొందరికి ప్రేతకళ పుట్టుకతోనే వుంటవి. ఆయా వాళ్లను బట్టి పనులు అవుతూవుంటవి. ఒక్కొక్క ముత్తయిదు యెదురైతే ఆగోజు వంతెన్లు విరిగి రైళ్ళు వాగుల్లో పడ్తై. బస్సులు ఢీకొని బ్రద్దలౌతాయి. లారీలు నిర్దాక్షిణ్యంగా నారీలపై పోతై. అంచేత శకునాన్నిబట్టి ఫలితం చెప్పలేమన్నాడు తండ్రి. నాన్నగారూ ఆ ముసలాయనవి పెట్టుడు పళ్ళా, పాలపళ్ళా అని అడిగాడు. "లేదురా అబ్బీ, సహజంగా అగుపడాలని కట్టించినపళ్ళకే అక్కడక్కడ చిల్లులు, తూట్లు పొడిపించాడు. పాపం రెండు పళ్ళకు బంగారంకూడా వేయిస్తే, దారిలో దొంగలు పళ్ళూడగొట్టి ఆకాస్త బంగారం లాక్కున్నారు. చవకలో మళ్లా చేతకాని వాడి డెంటిస్టుచేత కట్టించుకుంటే నిద్రలో అవికాస్త వూడి గొంతునపడి ప్రాణం పోయినంతపని అయింది. ఈమాటు తెల్లని పాలపళ్ళు కట్టించాడు." పిల్లలు జనమేజయుడులాగా సందేహాలు అడుగుతునే వుంటారు.

మా బంధువు వొకావిడ ఆజన్మాంతం తప్పొప్పుమాటలే. ఒకమాటు పెండ్లికి వెళ్ళి వచ్చి అక్కడ ముచ్చట్లు చెబుతున్నది. పెండ్లి కుమారుడికి పట్టుచెంబులూ, వెండిబట్టలు పెట్టారూ. అయిదురోజులూ విస్తళ్ళతిని అన్నాలు పారేసే టప్పటికి తెల్లగా కోడి కూసేది. అక్కడ జబ్బుచేసింది. మందు తెచ్చుకో సీసాయిస్తానన్నాడు డాక్టరు, అంది.

మరోకాయన సినిమా ముచ్చట్లు చెబుతూ దేవికాకుమార్ అశోకరాణీలలాంటి యాక్టర్లిప్పుడు లేరన్నాడు. పోతరాజు గానము, త్యాగరాజు కవిత్వం తనకు చాలా నచ్చినవన్నాడు. స్వరరాగసుధ అనబోయి సర్వరోగసుధ తనకు చాలా యిష్టమన్నాడు. మరదల్ని పిలిచి సున్నానికి ఆకులు రాయమని ఆజ్ఞాపించాడు. బావమరుదులు వేళాకోళం పట్టిస్తే 'నే నేమంత రంభనా' అన్నాడు. ఒకమాటు అశ్వపతి వేషంవేసి 'సత్యావంతా, యేమిటా నీస్లుడు. చెబుతుంటే వినవేమిటి. నీవు కాకపోతే రేపిపాటికి నా కూతురికి సిక్షేపంలాంటి సంబంధం తెస్తానన్నాడు. పాడిసంగతి చెబుతూ గేదె యీదిందన్నాడు. చిన్నకర్రైనా, పెద్ద పాముతో కొట్టాలని సెలవిచ్చాడు.

కొందరికి యింట్లో కవిత్వపు దొగ్గుడు యెక్కువ.

'ఒరేయి వెంకటరమణా ఎంతసేపురా సవరణ?'

గుడ్డలు మాపావా, గుడ్డులు పదైనై.

పంపువద్ద సబ్బుతుంపు వుంది యిటు పంపరా.

అతివరో అతిగా వాగకు, సుకుమారి వైనాసరే తుక్కుమారి తంతా. మనకు నవ్వొస్తూ వుంటుంది వింటుంటే.

పిల్లల చదువులో వింత ఘట్టాలు వస్తూ వుంటాయి. సంధులు చెప్పరా అంటే— గుణసంధి, గూడూరుసంధి, పెనామంభూ సంధి, జిబ్రాల్టర్ జలసంధి, విజయవాడ రైల్వేసంధి, యుద్ధరాజ్యాలసంధి, ట్రెఫాయికిలో సంధి అని వొకడు దండకం. మనిషికి 'మని' లేకపోతే 'షి' క్రింద జమ అని బ్రహ్మవాక్కు. తుఫాను + వుప్పెన = తుప్పెన; గుర్రం + అశ్వం = గుశ్వం; బజ్జీ + పకోడి = బకోడి — మొదలగు కొత్తపదాల సృష్టి. అక్షరాల్లో 'ణ' కానీ తనదగ్గర అణాలేదని వొక కుర్రాడు బిగాల పట్టాడు. నాన్నగారూ సుబ్బయ్యగారికి తైలచిత్రం కాదు కేవలచిత్రం తయారు చేయించాలన్నాడు. రెండో కుర్రాడు అందుకని సెంటుములో దిమ్మెకట్టించి విగ్రహానికి బదులు వారినే నిలబెట్టితే బాగుంటుందని సలహాయిచ్చాడు. మూడోవాడు మరీ కొంటెకోణంగి. సుబ్బయ్యగారి రంగునుబట్టి యినపవిగ్రహం చేయించి పెడపూయిస్తే బాగా సరిపోతుందని చెప్పాడు. ఇహ ఆ కవినాయన కొప్పడతాడు కవిత్వంలో. తిండికీ, తినుగుడుకు వున్న హుషారు చదవడం వచ్చేసరికి చప్పబడుతుందేమిరా. పలక యెక్కడ పెట్టావురా, పలుకవేమిరా? యెక్కాలురాందే లెక్కలు రావురా, వల్లించరా, అడుక్కుతినాలన్నా అక్షరంముక్క వుండాలిరా. ఒరేఅబ్బీ నిప్పనపుచ్చింది. దాన్ని నమ్మి యెక్కకురా. అదేమిదస్తూరిరా, సాలెపురుగు సిరాబుడ్డిలోమునిగి కాగితంపై చిందరవందరగా పరుగెత్తినట్లు, కంగారుమృగం గంతేసినట్లు...లక్ష్మీ యివాళ్ళ సాజభక్ష్యం చేయవే మనసోయింది. ఆపిడతక్కువా! వెన్నకాచిన నెయ్యిలేదు; వెన్నకాచిన

నెయ్యి. కలియుగంలో కామధేనువు ఫ్యాక్టరీరూపంగా మారింది. పాలపిండి వచ్చాక నాకూడా పాడిగేత బయట పడ్డది.

కొందరు కక్షిదార్లు కోర్టుభాషలో తిట్టుకుంటారు. నిన్ను పచ్చావారు త్రాగిస్తా. గోదావరిస్నానం చేయిస్తా. ఇనపమురుగులు పెట్టిస్తా. నీకు ఆటకోదిల్లుహారు ఘుమఘుమ, నీఆస్తి యావత్తూ టుమటుమ. ఇరసాల్ సెంకెక్కిస్తా. ఆటే నిగ్గితే వుగ్యూల వూగిస్తా. ఇదీ వరస.

ఇహా నాటకాలు : బాలురు, గర్భిణీ స్త్రీలు రావొద్దని హెచ్చరిక. రాళ్లుపడినను నాటకం ఆపబడదు. విసిరిన చెప్పులు హాల్లోనే నేలం వేస్తాము. నటకులకు తగిలిన దెబ్బలకు కేసులు పెట్టము. కిరాయి తక్కువైనా నటులాడటానికి తురాయి వేసాతే. పాట్లుతక్కువైనా ప్రతి యాక్టరూ ఆట్టు చూపిస్తారు. సరుకు తక్కువైనా సంగతులు యెక్కువ వేస్తారు. గొంతు తక్కువే కావచ్చు. గంతు జాస్తి. కరగాత్రాలు కనుక బొంగురుపోవు. మంగళాంతంలో అందరికీ కఫం తెగుతుంది.

ఒక వుపన్యాసకుడ్ని వార్షికోత్సవానికి రమ్మనిపిలిస్తే శరీరస్థితి సరిగా లేదన్నాడు. కీర్తికాంత గట్టిగా కౌగిలించుకుంటే మెడ నరం పట్టిందన్నాడు. అనేక సభలలో వేసిన పూలదండల బరువుకు నడుం వంగి పోయిందన్నాడు. వ్రాసియిస్తాను అక్కడ చదువుకోండి; అక్కడ పెట్టబోయే ఫలహారాలు పొట్లంకట్టి ముందుయిచ్చి వ్రాతప్రతి తీసికెళ్ళమన్నాడు. ప్రయాణపు ఖర్చులు యిచ్చేస్తే చేబదుళ్ళు తీర్చుకుని ఋణ విముక్తి పొందుతానన్నాడు.

మరి కట్నాలు : నీకు కట్నం యెట్లా యిల్లుకూడా లేదుగా. అది పెట్టి గృహనిర్మాణంచేసి వొక యింటివాడనౌదామని కోరిక. మరో అల్లుడుగారు కట్నం జాస్తి అడిగారు. ఎందుకుట అంటే, యీసొమ్ములోనే సగం పెట్టి మొదటి పెండ్లాం మనోవర్తి తగువు పరిష్కరించుకోవాలన్నాడు.

ఇహా తిండిగోడవ: కోడి చాలా రుచిగల వస్తువుగనుక 'పకోడీ' శాకాహారులు విరివిగా వాడుతున్నారు. పేరు పెట్టినంత మాత్రాన్నే ఆ కమ్మదనం. భోజన పగులకు తృప్తి యేదో రకంగా.

మిత్రుల ఫలోక్తులు : నాకు కాలం సమీపిస్తున్నది. యముడి దున్నపోతు మెళ్లో గంటల చప్పుడూ వినవస్తున్నది. మీరు వాహకులుగా వుండాలి అని వొకాయన కోరాడు. మీ శరీరం చాలాభారం. మృతకళేబరం బరువింకా జాస్తి. నేను బక్కవాడ్ని. సిద్ధమకరధ్వజం సేవించి తయారు తింటాను. పెట్టుబడిక్రింద డబ్బివ్వండి అని జవాబు. ఆ టానిక్ నేనే పుచ్చుకుంటే మీరు మోయవలసిన అవసరం కలగదేమో అని ఆ పిసునుకట్టు.

పోట్లాటల్లో : నీ బిల్డింగ్ కంటె నా కాంపౌండుగోడ పెద్దది. నీ పెండ్లాంకంటె నా పనిమనిషి అందమైనది. నీ ఆస్తి నా అప్పంతలేదు. నీ తలపాగా కన్న నా కొల్లాయి పెద్దది. నీ పెండ్లికంటె నా వొడుగు అతి వైభవంగా జరిగింది. నేను వేసేవి చేనేతవస్త్రాలు, నీవు కట్టేవి కావి నేత గుడ్డలు. ఇహవాడు నీవు పాలెస్ లో పిల్లివి. నేను పూరింట్లో పెద్దపులిని. నీవు రామకోటి వ్రాసినా దస్తూరి కుదర్లా. నాకు జాతాలు జాస్తి. చెప్పులు జతలకు పట్టిన మన్ను తీసి కొన్ని బళ్ళు నా

మాగాణి చేలను తోలించా. నా యిస్త్రీ గుడ్డలు దులిపితే రాలిన యిసుకతో సిమెంటు రాశి తీయించా. నేను అందరి మోస్తరు కింద చావను. మేడపైనే ప్రాణం వదులుతా... అయితే నిన్ను మోయలేక వాహకులు చస్తారు. నీకు వొక చెంప చేస్తుంటే రెండో చెంప చూస్తావుంటుంది. అంచేత నిత్యక్షవరం... నీవు నాటుకత్తితో చేయించుకుంటావు. ముఖమంతా రక్తపాతం; కందపిలక చెక్కినట్టే... మా ఆవిడ కనకాంబరాలు తప్ప పెట్టుకోదు. పదువుకున్న దానికనక శిరోజాలు వ్యర్థం. నా పెళ్లాం ముద్దులంతి పూలజడ వేస్తుంది. ఆరోగ్య నిలయం... మాటకారులైన మిత్రులు చేరితే యీ గొలుసుకు గొళ్ళెం పడుతునే వుంటుంది.

మా కుర్రాడు ఆస్పత్రిలోనే పుట్టి యిక్కడే పెరిగాడు. వాడు చేలు, తోటలు చూడలా. మామిడిచెట్లకున్న సొగసు కొబ్బరి కొమ్మలకుండదు; పనసముంగాలు తాటితోనలకన్న రుచి జాస్తి; వరిచెట్టు బండతీగలాగా అల్లుకుంటుందా, పెండలం వృక్షం మాదిరిగా పూడలు వుంటవా?... నాన్నా విండ్సరు ప్రభువు పట్టాభిషేకానికి పెట్టిన ముహూర్తం మంచిది కాదు... అదేమిట్రా రాములవారి పట్టాభిషేకానికి వశిష్టుడంతటివాడు పెట్టే, ఆంధ్రరాష్ట్ర అవతరణకు దైవజ్ఞులైన జ్యోతిష్కులు పెట్టారు... కనుక యెన్నో వ్రాయవచ్చు.

సంఘానికి ప్రయోజనం, వుపయోగం కాని నిర్థక శుష్క ప్రలాపాలలోకూడా హాస్యం జనించవచ్చు. కఠినమనస్కులు, నాలిముచ్చులు, మౌనవ్రతులు — వీరిని కదిలిస్తే కటికచీకటి. హాస్యపురుషుణ్ని కదిలిస్తే నవ్వుల దొంతర్లు. వివిధ విపరీత ప్రవృత్తుల సమ్మేళనం, విచిత్ర పురుషుల చిత్రమైన సంభాషణలు, కోతలరాయుళ్ళ డబ్బాలు, కాముకుల ప్రేమగొడవలు, తేనె చంద్రుడ్ని అనుభవించగానే భగ్నప్రేమలు, ముద్దమాటలు, ముద్దుమాటలు, వున్న వొత్తులు మ్రింగి లేనిచోట వేయుట, ముక్కుధ్వనివాళ్ళమాటలు, మందపాటి చర్మంగాళ్ళ జవాబులు — యివన్నీ హ్యూమరిస్టుకు కావలసినంత ఆహారం. ప్రహస్యదృష్టి పోయి హాస్యదృష్టితో చూడాలి.

అభ్యుదయ కవయితలకు వొక మనవి. కత్తిసాధించలేని ఘన విజయం మనం చేపట్టాలి. మానవుణ్ని పశుత్వంలోంచి పైకి లాగి దైవత్వంలోంచి కించిత్తు క్రిందికి దింపాలి. ప్రపంచమంతా పైరుపచ్చలతో, పాడిపంటలతో, సిరిసంపదలతో, ధగధగాయమానముగ, జగజ్జేగీయమానంగా చేయాలి. కవులు కల్పించుకుంటున్న కాగా డదు. మనం పూనుకుంటే సప్తసాగరాలు సాంబారుగా మారి పర్వతశ్రేణులన్నీ యిడ్లీ రాసులుగా తయారౌతాయి. ఇంటింటా వరలక్ష్మి పనిమనిషై పోతుంది. సరస్వతి పంతులమ్మ, కుబేరుడు పాలేరు. హరిహరులు ద్వారపాలకులు, నారదుడు, తుంబురుడు సంగీతపు మాస్టర్లు, వాకిట్లో కామధేనువు, దొడ్లో కల్పవృక్షం, వంట చెరుకుకు సంజీవిపుల్లలు. కట్టుకోటానికి పట్టు పీతాంబరాలు. ఆత్మకింపయిన భోజనం. వేపుడు కూరలేగాని పూరగాయ పచ్చళ్ళకు స్వస్తి. అందరికీ ఆజీర్ణబాధ గాని ఆకలిమంటలు వుండవు. కర్పూరవిడెం, హంసతూలికా తల్పం. వుద్యానమంటపం. కేళీగృహ నవ్యహర్మ్యంబులలో నివాసం. విశ్వమంతా తోరణాలు. నిత్య కల్యాణం

పచ్చతోరణం. మానవులంతా సర్వమంగళ గుణ సంపూర్ణులౌతారు. నిరాశకు నిస్పృహకు తావులేదు. నవచైతన్యం. మారణాయుధాలకు భూస్థాపితం. చీలిపోయిన ప్రాకులు చిగురిస్తాయి. కావ్యవృక్షాలు భావకుసుమాలతో భూభాగమంతా బృందావనం. నెమళ్ళు పింఛాలు విప్పి మయూరీ డాన్సు. పొన్నచెట్టుపై మోహన మురళి. ఇహ బోగం మేళాలుండవు. ప్రతి పందిట్లోనూ కవిసమ్మేళనాలే. పాముపుట్టలు పోట్లాటలు కలలోకూడా కనపడవు. మానవ కుటుంబమంతా మమేకం. సర్వమానవాభ్యుదయానికి అంకురార్పణ. మానవశ్రేయస్సు, శాంతి, ధర్మనిరతి, సంస్కృతి దీప్తి. జాతి, మత, కులభేద నిర్మూలన, విశ్వప్రేమ, విశ్వకళ, విశ్వగానము, ప్రపంచ ఐక్యత, సమష్టితత్వం, సౌభ్రాతృత్వము, శాంతిపురస్కారం, ప్రేమసందేశాలు విదేశాలకు రవాణా. సామ్రాజ్యకాంక్ష, సంఘర్షణలకు తిలోదకాలు. యుద్ధానికి మంగళం. సత్యకేతనం. ప్రేమబావుటా శాంతిపథకాలే మనకు మేలుబంతి. ప్రపంచమంతా వొకే కేంద్రం. సమానం, సమత్వం, సౌజన్యం, సౌశీల్యం, సహకారం — వీటి పునాదిపై ప్రపంచ ఐక్యత సౌధనిర్మాణం. ఈ బిల్డింగుకు కంట్రాక్టర్లు అభ్యుదయ రచయితలు.

రష్యాలో మిత్రుడు మొన్న మా నెహ్రూగారు వూరికే రుచిచూపించి పోయాడు, మా ఆవిడకు వేవిళ్ళు, మామిడి పళ్ళమీద మనసోయిందన్నాడనుకో. వెంటనే మనం నూజివీడు చిన్నరసాలు, జహాంగీరు పసందు, అక్బరుపసందు, షాజహానుపసందు వేగన్లకొద్దీ శీఘ్రగా పంపటమే. మా దేశంలో ముత్తయిదులకు నగలమీద మమకారం, బంగారం కావాలని కోరామనుకో వెంటనే అమెరికానుంచి టన్నుల కనకవర్షం. జర్మనీ జపానులు మాకు యిరుకుగావుంది భూదానం కావాలన్నామనుకో ఆస్ట్రేలియావారు, ఆఫ్రికావారు దఖలు వ్రాస్తారు. ప్రతిఫలం అక్కర్లేదు. మా దేశంలో బొగ్గు, యినుముతప్ప యేమీ లేవు; యింత తిండీ గుడ్డా కావాలని ఆంగ్ల సోదరుడు అనగానే, మన దేశం నుంచి మసాలాలు, అటుకులు, అప్పడాలు, దూది వెళుతుంది. అరువూ లేదు, ఖాతాలేదు. ఇలా వుంటుంది మన అభ్యుదయ రచయితలకు పెత్తనమిస్తే. అలాంటప్పుడు తగాదాలు, యుద్ధాలు యెందుకు వస్తాయి బ్రదర్.

సతుస్సాగర పర్యంతం శుభంభవతు లోకాస్సమస్తాస్సుఖినో భవంతు. విశ్వమానవ కళ్యాణానికి మన అభ్యుదయ రచయితల మంగళవాయిద్యం.

# విక్రాంత సంక్రాంతి

## సోమసుందర్

తెలుగులకు తొలికొత్త సంక్రాంతి వచ్చింది
వెలుగులుగ విజయాల పరిమళాల్ కూర్చింది
రండిరా సంక్రాంతి వేడుకలు దండిగా...
రండిరా చూదాము పండుగుల సరదాలు...

తూర్పులో రవికాంతి తొంగిచూచక మున్నె
మేల్కాంచి కోడిపుంజులు గొంతెత్తి విదళించి
ఇంటికి పడికొళ్ళకు నెగ మోరలు నెత్తి
రెక్కలను దుప్పుకొని కొక్కొరోకో యని పిలిచె...
లెండిరా తెలుగడిగి పండుగుల ముస్తాబు
విస్తారముగ నేడు సేసికొండిరా...

గుమ్మళ్ళు పూశాయి కొమ్మరటికి కాసింది
నారింజపండ్ల గుత్తులు నేల కొరిగాయి...
జనపచేలో పసిడిపూట తలలూచాయి
మావి కొంజిగురాకు జొంపాల్ హసించాయి...
రండిరా సంక్రాంతి పుడమి తల గడిగింది...
రండిరా చూదాము పండుగుల సరదాలు...

ఆవపూవుల పసిడి, గొబ్బిపూముల మిసిమి
సెనగపూవుల జాళువాతళుకు మిలమిలలు
తెనుగు మందిర ప్రాంగణములలో గొబ్బిళ్ళు
తెనుగు ముంగసాలలో ముత్యాల ముగ్గులు...
రండిరా సంక్రాంతి వేడుకలు దండిగా...

తెలుగు పొలముల కివే పైరుపచ్చల వేలు...
తెలుగు పసువుల కివే పసుపు కుంకుమ పూలు...
తెలుగు పుడమికి నిండె నోడిలో తలంబ్రాలు ..
తెలుగు పడతుల ఎడదలో మెరయు రాగాలు
రండిరా దండిగా సంక్రాంతి సరదాలు
ఇంటింట వూగించు దానంద డోలికలు !

తెండి కన్నియలార భోగి పిడకల దండ
ఇంటిముంగిట నేడు పెట్టండి గొబ్బిళ్ళు...
బుగతగారికి కలదు గొప్పదగు కమతమ్ము...
తెండిరా పొంగలను భోగిమంటకు నేడు...
రండిరా సంక్రాంతి వేడుకలు దండిగా...

గడప గడపకు పసుపు కుంకుమలు పెట్టండి
బంతి పూవుల తోరణాల్ తెండి కట్టండి
ఇంతి చేమంతి విరిమాలలను కూర్చండి
పండు వలపుల మిటారుల కోర్కెలీనాడు ?
రండిరా చూదాము పండుగుల సరదాలు !

రస హృదయమున నుషోమజ్జనమ్ముల సేసి,
కదళీ ఫలాల పొంగలి విందులను గుడిచి,
పసికందులకు దీవనల భోగిపళ్ళోసి
చదలేటి కెరటాల కదలికల మదికూర్చి...
రండిరా సంక్రాంతి పండుగుల వేడుకలు !

దండిగా పిండివంటల మెక్కి పై పెక్కు
ప్రతి చోట బాలవీరుల మొండికెత్తాలి...
కదన కౌతూహలాయత్త చిత్తుల వోలె
బిరిగిసి చెడుగుడుకు తొడగొట్టి నడవాలి...

లెండిరా యువజనులు సంక్రాంతి నేడెరా...
రండిరా చూదాము పండుగుల సరదాలు...

తెలుగునేలలు ప్రసవమైన బాలెంతలై
వింతవింతల రంగుకళలు కంటున్నాయి...
వెలుగు సొంపులమీరు చూతతరుశాఖకలు
తొలిచూలు బరువు చూలింతలై మొకసినవి...
రండిరా చూందాము సంక్రాంతి సుందరిని
తెండిరా బంతిపూదండ లీ తరుణమున...

సింహాద్రిరప్పన్న సిరిమువ్వ లూగించి
గాండ్రుగాండ్రని రంకె వేసింది పండుగని!
గోవుమాలక్ష్మి తన గంగడోలూపుతూ
అంబా యనుచు సంక్రమణగీతిపాడింది
రండిరా సంక్రాంతి వేడుకలు దండిగా?

పెయ్యలూ గిత్తలూ లగువుతీస్తున్నాయి —
కోకతొత్తుక నురికి కాల్దువ్వుతున్నాయి,
తల్లి కలవల కోక కొరుకుతూ తువ్వాయి
పాతపండుగ వేడుకలు చెప్పమంటోంది
రండిరా చూదాము సంక్రాంతి సరదాలు!
ఎలుగెత్తిపాడండి పండుగ పదాలూ!!

దాసర్లు తలల గుమ్మడిచెంబు లానించి
తాంబురామీటి శ్రుతికలిపి గొంతులనెత్తి
హాయిగా రామకథ పాతపాటలుపాడి
పల్లెలోగిళ్ళ ముంగిళ్ళ కరుదెంచారు...
గ్రామసీమలు శోభశోభలై విరిశాయి
సామమైపోంగాయి ఈమధుర గానాలు!

కడుపులో చల్ల కదలని పెద్దకామందు —
మెదడు నరములు కదలి కంపించు కరణాలు —
గ్రామసావడిలోన సభతీర్చినా రంట —
మ్రోగుతున్నాయవే గుంజలూ వీరణాల్...
రండిరా చూదాము సంక్రాంతి విక్రాంతి?
రండిరా కనులపండువ దేశమెల్లెడల!

పిల్లకాయల గూటిబిళ్ళాట సరదాలు
కన్నెపిల్లల కేలి గోరింట కోసగోళ్ళు...
మదవతుల ఎదలలో మరగిన మరందాలు
ముత్తైదు సిగలోన మురియు మందారాలు...
రండిరా చూదాము వేడుకలు దండిగా...

రేయి ముగిసిం దిదిగో చిరువెన్నెలలు కరిసి
అప్పుడే కోడె గాళ్ళారు బైటకు చేరి
ఉప్పు పట్టెకు గొప్ప ఏర్పాటు చేశారు
మొనగాళ్ళు ఇద్దరూ ఉజ్జీలు వేశారు
రండిరా చూదాము వేడుకలు దండిగా

ఆట సాగిందిరా రణ గోలగా రేగి...
పెద్దలంతా మూతి మీసాలు మెలివేసి,
ఎలనాగ లెదురోర జటపటా లేసుకొని
ముదములో మురిపాలు మురిసిపోతున్నారు.
రండిరా చూదాము సంక్రాంతి సరదాలు.

'రాముడే గెల్చె'నని "కిట్టయ్య కొట్టె"నని
తమలోన తామేదో వాదాలు పడతారు;
ముసి ముసి పసందు చిరునవ్వు మువ్వలు మ్రోగి
ఎకసక్కెములలో కిసుక్కుమని నవ్వెదరు
రండిరా చూదాము సంక్రాంతి సరదాలు !

గొబ్బిపూవుల మెత్తనైన పొత్తిళ్ళలో
దూరి గీ పెడుతోంది చూడు తుమ్మెదజంట;
కొత్త చీరల గుబాళింపులో హత్తుకొని
తత్తరించిన దదే జవ్వనపు పంట...
రండిరా చూదాము వేడుకలు దండిగా.

ఇది దిశలనిండిన విహాయస సుహాసమో...
మోదములు కురిసిన విపంచికా స్వనమో
ఇవి నేల పొరలు వెలుగుల వెల్లువగునో...
ఎద పాలనము సేయు వలపుకలలవునో
రండిరా మనకివే తొలిపంట సరదాలు -
ఎలుగెత్తి పాడండి పండుగ వినోదాలు...

గ్రామ జీవనశోభ మధురసాలూరింది
చెరుకుపానక మందరము నోవ్యత్రాగాలి
రండిరా చూదాము సంక్రాంతి వేడుకలు -
పెద్దపండుగ సద్దులివిగో వినండిరా!



# మహాసభకు సందేశం

హైదరాబాదు,
25—7—55.

ఆర్యా, నమస్కారాలు.

తాము దయతో పంపిన ఆహ్వానము అందినది. ఇక్కడి పనుల ఒత్తిడివల్ల మహాసభలో పాల్గొనజాలనందుకు మిక్కిలి చింతిల్లుచున్నాను. గడచిన ఒకటిన్నర దశాబ్దమున తెలుగుసీమలో సారస్వతాభివృద్ధికై అభ్యుదయ రచయితల సంఘము చక్కని కృషిగావించినది. అభ్యుదయ రచయితల సంఘము అభ్యుదయ, తెలుగుతల్లి అను రెండు ఉన్నతస్థాయికి చెందిన సారస్వత మాసపత్రికలను కొంతకాలము ప్రకటించుటయేకాక, సుప్రసిద్ధ రచయితల గ్రంథాలను కూడ ప్రకటించి ప్రోత్సహించి ఆంధ్ర భాషాభివృద్ధికి అమూల్యమైన సహకారము గావించినది. కందుకూరి, గిడుగు, గురజాడ, కొమర్రాజుల వంటి యుగ పురుషుల వర్ధంతుల తెలుగుసీమ యందంతటను జరిపి, ప్రజలలో సారస్వతాభిరుచిని వ్యాపింపజేసిన దీ రచయితల సంఘము.

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగారి అధ్వర్యమున నేడు అభ్యుదయ రచయితల ఐదవ మహాసభ సమావేశము జరుగుట బంగారమునకు పరిమళ మబ్బినట్లైనది. శ్రీ శ్రీ తెలుగుసీమలోని అభ్యుదయ రచయితలకు మార్గదర్శకులైన మహాకవులు. అనేక రచయితలకు భావనా గురువు. కావున శ్రీరంగం శ్రీనివాసరావుగారి అధ్యక్షతన జరుగు యీ సభలు సకలాంధ్రమునందలి అభ్యుదయ రచయితలకు నూతనోత్తేజము కలిగించగలవని ఆశించుచున్నాను.

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగారికి నా నమస్కారాలు అందజేయండి.

సభా కార్యక్రమములు దిగ్విజయముగా జరుగగలవని ఆశించుచున్నాను.

భవదీయ,
దేవులపల్లి రామానుజరావు.

# ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసం

(8 వ పేజీ తరువాయి)

ఈ రెండూ కవితకు చీడపురుగులే. భూమిని దున్ని, ఎరువువేసి, నీరుపెట్టి, నాశిరకం విత్తులను నాటితే పడ్డకష్టం అంతా వృధా అయినట్టు విజ్ఞాన వికాసానికి కవిత్వం తోడ్పడని నాడు ఛందోబద్ధ సాంప్రదాయాల యొక్క బానిసత్వం నుంచీ, వ్యాకరణ బంధంలో నుంచీ, విముక్తి పొందడానికి పడిన ప్రయాస, వృత్తవ్యథాసే. బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

అజ్ఞాన అగాధం నుండి విజ్ఞాన శిఖరాగ్రాలని చేరుకోడానికి మానవుడు సలిపే నిరంతర ప్రయత్నాన్ని, చైతన్యాన్ని స్తుతించేందుకు బదులు నేటికవిత్వం ప్రేమజ్వరపీడితుల విలాప ప్రలాపాలతోనూ - విప్లవ జ్వరపీడితుల నినాదాలతోనూ నిండి సున్నిత లావణ్యాన్ని, గాంభీర్యాన్ని కోలుపోయి ఆదర్శవంతం కాకుండా వెలవెలబోతూంది. నేడు వెలువడుతూన్న అసంఖ్యాకములైన గేయాలనీ, గీతికలనీ ఓపికతో పరిశీలిస్తే, వాటిలో నోరు తిరగని సంస్కృతసమాసాలూ, కవికి తప్ప ఇతరులకి అర్థంకాని భావాలూ, అపరిచితములైన సాంకేతికాలూ తప్పితే - స్పష్టంగానూ, హృదయరంజకంగానూ వుండి, ఆనందాన్ని, ఆవేశాన్ని, ఉత్తేజాన్ని కలిగించే ఉత్తమ కవిత్వం వాటిలో కనిపించదు. ఈ లక్షణాలు అతి వాస్తవిక కవుల్లోనూ, భావకవుల్లోనూ, కనిపిస్తే మనం ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. కాని, విప్లవ కవులనీ, అభ్యుదయ కవులనీ, ప్రజా కవిత్వ సృష్టికర్తలనీ అనిపించుకొన్నవారు సహితం యీ వ్యసనాలకి లోనవడం మిక్కిలి విచారకరం.

మనం యిచ్చే ఉపమానాలు నిత్యజీవితంనుంచి తీసుకొనబడినవై, మనం ఉపయోగించే సాంకేతికములు అందరి అనుభవాల్లోనూ వుండే చిరపరిచితములైనప్పుడే, కవి ఉద్దేశాలు భావనాయుక్తాలంకారాల అల్లికగా పాఠకులకి గ్రాహ్యం అవుతుంది. భావాన్ని సూటిగానూ, శక్తివంతంగానూ, చదువరికి ఎరుకపరచాలంటే భావోద్రిక్తతకు అనువైన నడక కలిగి, అందరి విజ్ఞానాయులను సహజంగా స్ఫురింపచేయాలి కవితా నైక.

స్వాభావికత్వం అంటే ఎటువంటికట్టుబాట్లూ లేక విచ్చలవిడిగా కవిత్వం చెప్పడము కాదు. ఛంద సూత్రాలని విసర్జించడానికి కారణమేమంటే - విస్తృతం అయి, అభివృద్ధి పొంది పరిణామం చెందిన నేటి భాష, ఆ కాలపు వ్యాకరణసూత్రాల పరిమితిని బద్దలు చేయడానికే. ఆనాటి కవిత్వంయొక్క లక్ష్యం కేవలం ఐశ్వర్యవంతుల ఆశయాలనుభవాలని, చిత్రించి వారిని సంతోషపరచి వారి ప్రాపకాన్ని సంపాదించడమే. కాని నేటి కవిత్వాన్ని సమాజ పునర్నిర్మాణానికి అనువగు పరికరంగా రూపొందించే బాధ్యత కవిమీద వుంది. అందుకు కవిత్వం ఉపయోగపడాలంటే మునుపటిలా కాకుండా, వాడుక భాషలోనే వుండాలి. వాడుక భాషకి ఇంకా ఒక నిర్దిష్టమైన వ్యాకరణం ఏర్పడ

లేదు. కాని వ్యాకరణాన్ని సిద్ధాంతీకరింపబడినంతవరకు మనము చేతులుముడుచుకొని కూర్చోలేంకదా! భాషా పరిణామానికీ, సంఘ పరిమాణానికీ కారణభూతాలైన ప్రకృతిసిద్ధాంతాలను మనము నేడు అవగాహన చేసుకొని, వాటి కనుగుణ్యంగా కవిత్వం చెప్తూ భాషని ఉపయోగిస్తే, ఈవాళ మనం నెలకొల్పే సాంప్రదాయాలే రేపు వ్యాకరణం అవుతుంది. కవిత్వ విషయాలు, మానవాలోచనలు, ఉద్రేకాలు, ప్రక్రియలు, కొన్ని శాస్త్రీయ సిద్ధాంతాల ననుసరించి ఉన్నాయని గుర్తించి, వాటికి బద్ధమైన కవిత్వం చెప్పబడితే, అది సౌష్టవాన్ని, శైలిని పొందడమే కాకుండా కవిత్వంయొక్క ఉద్దేశం కూడా నెరవేరుతుంది.

గ్రాంథికమా, గ్రామ్యమా అనే వివాదం ఇంకా నేటికీ కొంతమంది సలుపుతున్నా ఆ వివాదం కొంతమందికి సరుకు కలిగిస్తూన్నా — ఏటంబాంబు మొదలుకుని గోవా సమస్య, చెడుగుడి పోటీ, వారఫలితాలవరకూ అన్ని సమస్యలూ వ్యావహారికభాషలోనే మన తెలుగు దినపత్రికలు ముక్కోటి ఆంధ్ర జాతికి అందజేస్తూ ఆంధ్రప్రజలో విజ్ఞానాన్ని, సంస్కృతినీ వెదజల్లుతున్నాయి. ఇంత మహోత్కృష్టమైన కార్యాన్ని ఎన్నో కష్ట నిష్టూరాలకోర్చి జయప్రదంగా నెరవేరుస్తూన్నందుకు ఆంధ్ర పాత్రికేయులకి మన మెంతో ఋణపడివున్నాం! వారికి పాండిత్య ప్రకర్ష లేదనీ, చిన్నయ సూరి వ్యాకరణం, సూర్యారాయ నిఘంటువు కంఠపాఠం రాదనీ మనం లోపాలు ఎంచినా, ఆంధ్రప్రజ మాత్రం వారికి నిత్యం తమ జోహార్లను అర్పిస్తూనేవుంది. సామాన్య వ్యావహారిక భాషలోనే ఇంత విజ్ఞానాన్ని సంస్కృతినీ, సారస్వతం ప్రజకి అందజేయబడుతూండడం వ్యావహారిక భాషయొక్క సాళీత, నాజూకుతనం, విస్పష్టత పాటవం ధారావాహినే కారణం. ఇతరదేశభాషల్లో వెలువడుతున్న, దినపత్రికలు అన్నీ కూడా గ్రాంథిక భాషనే వాడుతున్నా, మన తెలుగు పత్రికలొక్కటే ప్రజాభాషనే వాడుతూండడం మన వ్యావహారిక ఆంధ్రభాషయొక్క విశిష్టతను చాటుతూంది.

అభ్యుదయ రచయిత నవలని కాని, కావ్యాలని కాని వ్రాసేటప్పుడు ఒక ముఖ్యమైనవిషయాన్ని గమనించాల్సి వుంటుంది. అదేమిటంటే: సంఘర్షణ, సమరం, వీటిని చిత్రించడమే ప్రధానం కాదు. వీటిని చిత్రించినంత మాత్రాన ప్రగతిశీలమైన సాహిత్యాన్ని సృష్టిస్తున్నాం అనుకోవడం పొరబాటు. ఒక వ్యక్తిలో కాని, కుటుంబంలో కాని, సమాజంలో కాని, దేశంలో కాని, అంతర్జాతీయ క్షేత్రంలో కాని — సంఘర్షణ జరిగిందంటే — ఆ సంఘర్షణ ఫలితంగా అభ్యుదయ నిరోధకశక్తులు పరాజయం పొంది, పురోగామి శక్తులు విజయం సాధించి, ప్రగతిపథం సుగమం కావాలి. అలా చిత్రించడమే నిజమైన వాస్తవిక కళ, సృజనాత్మక కృషి, అభ్యుదయ రచన సంఘర్షణలను సృష్టించినపుడు జయాపజయాలనీ, సాహసకృత్యాల్నీ చిత్రించడం సహజం. సంఘర్షణను ఏ స్థాయిలో చూపించినా సరే — ప్రతీ జయానికీ మాత్రం తగిన పరమావధి ఉండాలి. ప్రతీ వీరోచిత కార్యానికీ, ప్రతీ సాహసకృత్యానికీ సమ

క్షింపదగినంత లక్ష్యం ఉండాలి. ప్రతీ త్యాగంలోను హర్షింపదగినంత ధ్యేయం, పరమార్థం వుండాలి. ప్రతీ ఆత్మబలిదానంలోనూ ప్రవర్థమానమైన ప్రజాభీష్టం ప్రస్ఫుటమై ఉండాలి. ప్రతీ ఓటమీ విజయోన్ముఖంగా దారితీయాలి. ప్రతీ అపజయం విజయసాధనానికి ద్విగుణీకృత ప్రోత్సాహం కలుగజేయాలి. ప్రతీ పరాజయం అంతిమ విజయానికి నాందీప్రస్తావనగా పరిణమించాలి. అలా రచించిననాడే మన ఆంధ్ర అభ్యుదయ సాహిత్యం పరాకాష్ఠని చెందుతుంది.

నవల అయినా సరే, కవిత అయినా వ్యాసం అయినా సరే, గేయం అయినాసరే అభ్యుదయ రచనకి ఆధునిక యుగం, దేశాభిమానం, ప్రజాకోటి-ప్రధానాంగాలు. అందులోనూ ప్రధానపాత్ర సామాన్య ప్రజదే. నేటి సమాజంలో సకల సౌభాగ్య సౌఖ్యాలనీ కష్టించి సృష్టించేవాళ్ళు సామాన్య ప్రజే. అందుచేత రచనాసృష్టి అంతా వాళ్ళపైన కేంద్రీకరించడం న్యాయం, సమంజసం, అవసరం, వాస్తవమున్నూ. వారి సామాన్య జీవితాల్లో, దైనందిన కృత్యాల్లో, వారి సృజనాత్మకమైన కృషిలో, వారి కష్టసుఖాల్లో, స్నేహ ప్రణయాల్లో, ఎంతో ధీరత్వాన్ని, వీరత్వాన్ని ప్రదర్శిస్తుంటారు. అట్టి వీరులనీ, సర్వతోముఖమైన వారి జీవితాలనీ చిత్రించడం మన అభ్యుదయ రచయితల ప్రధాన కర్తవ్యం.

అభ్యుదయ రచనలన్నీ ఒకే వక తరహాగా వుంటాయనీ, ఒక్క మూసలో పోసినట్టు ఒక్క నమూనామీద నడుస్తాంటాయనీ, విశిష్టతలేక, వ్యక్తిత్వరహితమై, పై నించి తెచ్చి నెత్తిమీద రుద్దిన సిద్ధాంతాల ప్రకారం తు-చ- తప్పకుండా వుంటాయనీ, దేశీయం కాక విజాతీయం అనీ ఒక అపవాదు కద్దు. వ్యక్తి వైవిధ్యంలేకుండా, శైలి విశిష్టతలేకుండా, కవితాధారని, కల్పనాశక్తిని, సృజనాత్మక కళని నేలమట్టానికి తుడిచిపెట్టేస్తూందని ఒక యీసడింపుకూడా వుంది. అంతేకాదు. భావకవిత్వంలో ఎలాగైతే 'ఎద', 'ప్రేయసీ', 'వియోగం', 'ఏకాంతం', 'కన్నీటి దొంతరలు' పట్టలమీద పట్టలుకొట్టి ఎలా దొర్లుతూండేవో, అలాగే అభ్యుదయకవిత్వంలో కూడా, 'ఓయి, ఓరీ, ఓసీ', 'ఓ కార్మికుడా,' 'ఓ కర్షకుడా,' 'ఓ ఆంధ్రుడా' అనే సంబోధనప్రథమతోనూ, 'మొండేం' 'తుండేం', 'పేగులు', 'పుర్రెల కుప్పలు', 'రక్తపు ధారలు', 'కుమిలిన హృదయాలు' తోనూ కొల్లలుగా నిండి వుంటుందని వీరి నింద. దీని గురించి నే నిదివరకే విమర్శించాను. కాని ఇప్పుడు అభ్యుదయ కవులని వెనక వేసుకుని రావాలి. నేటికి పదిహేనేళ్ళ దినదినాభివృద్ధి పొందుతూన్న అభ్యుదయ సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇవి వుత్త నీలాపనిందలే అని స్పష్టం అవుతుంది. అభ్యుదయ సాహిత్యం ప్రజాసాహిత్యం. ప్రజావాణి.

అందుచేతనే ప్రజాశయాలకీ, ప్రజావాంఛలకీ, ప్రజోద్రేకాలకీ సన్నిహితంగాను, చేదోడువాదోడుగాను వుండడం సహజం. కష్టజీవుల కోర్కెలతోనూ, ఆకలితో అలమటించువారి హాహాకారాలతోనూ, మురుగు పేడల కుళ్ళు దుర్గంధాలతోనూ, అందులో బతికే సామాన్యప్రజల సంసార సుఖదుఃఖాలతోనూ, ప్రేమానురాగాలతోనూ, వారి నవ్వులపువ్వులతోనూ,

ఆశాజ్యోతులతోనూ, పీడిత తాడితప్రజల కోపాగ్నితోనూ' విప్లవ జ్వాలలతోనూ, రణభేరీ రౌద్రనినాదంతోనూ, విజయానంద సంభ్రమ నినాదాలతోనూ ప్రతిధ్వనిస్తూంటుంది. అలా ప్రతిధ్వనిస్తుందని అభ్యుదయ రచయితలందరూ గర్విస్తారు. ప్రజావాహినికి తిరుగంటూ ఎలా లేదో, ప్రజోద్యమంలో నిస్పృహకి ఎక్కడా తావు లేదో, అల్లాగే ప్రజాసాహిత్యమై ప్రజాసన్నిహితమైన అభ్యుదయ సారస్వతంలో కరడుకట్టిన ఛాందసత్వానికి గాని, భావనా లోలత్వంతో కూడిన మిథ్యాశూన్యవాదాలకి కాని, మనిషిని పిచ్చి పిచ్చి చేసే నిరాశా నిరుత్సాహాలకి కాని, నిండు వ్యక్తిని శవప్రాయంగా మార్చే నిస్పృహా నిస్సహాయతలకి గాని తావు లేనే లేదు. మానవాళి గమ్యస్థానం ప్రగతి - అనే మూలసూత్రమే అభ్యుదయ సాహిత్యానికి జీవగర్ర. ప్రజాశక్తిపై అచంచలభక్తి, ప్రజాన్యాయం, ప్రజాధర్మందే అంతిమవిజయం అనే పరిపూర్ణ విశ్వాసం - ఇవే అభ్యుదయ సారస్వత పురోగమనానికి వెలుగుబాటలు.

ఇలాంటి ఆశయాలు కల్గి ఉత్సాహపూరితులు కాబట్టే అభ్యుదయ రచయితల కవితలోనూ, రచనల్లోనూ, నవలల్లోనూ, వ్యాసాల్లోనూ, గేయాల్లోనూ, అనేక విశిష్టశైలులు, పోకడలు, వ్యక్తిత్వాలూ, రచనా స్వాతంత్ర్యం, కళావస్తు వైవిధ్యం రచనారీతులు, వచనపాంకాలు, పాత్ర పోషణలు - కనిపిస్తున్నాయి. ఈ వైవిధ్య విభిన్న మార్గాలు ఎంతవరకూ విజృంభించాయంటే - అభ్యుదయ రచయితలందరూ తమ రచనల్లో ఒక్క సరిసమాన మట్టానికి దిగజారిపోతారు, దిగజారిపోతున్నారు, దిగజారక తప్పదూ - అని ఈసడించిన వారే - ఈవేళ "ఓ-నా-మః రాని ప్రతివాడూ అభ్యుదయకవేనయ్యా!" అని వకమూల అభాండం వేస్తున్నారు. అయినా దీన్ని మనం అంతగా పాటించనక్కర లేదు కదా!

అభ్యుదయ సాహిత్యం ప్రజలమధ్యనే కాని వర్ధిల్లనేరదు. ప్రజలకు ఏమాత్రం దూరం అయిపోయినా, ప్రజా సమస్యల నుంచి యే మాత్రం విడివడినా - నీటు బాసిన కమలాల్లా కుమిలిపోయి, కుళ్ళి, నిస్సారమై, నిర్జీవమై అధఃపతనానికి క్షీణించిపోయి, నాశనం అయిపోతుంది - అభ్యుదయ సాహిత్యం - దాంతోపాటు అభ్యుదయరచయితలుకూడా!

భగవల్లీల అనండి, ఈశ్వర చిద్విలాసం అనండి, శివతాండవం అనండి, ఆదిశక్తి జీవమహిమా మహాత్మ్యం అనండి అట్టహాసం అనండి, విప్లవశక్తుల చైతన్య బీభత్సం అనండి - ఏదైతే నేం; విశ్వరంగం మీద జరుగుతూన్న యీ ప్రతినాటకంలో మానవుడు ఏపాత్ర వహిస్తున్నాడు? ఉత్త ప్రేక్షకుడుగానా? కాదు కాదు. ప్రయోగశాలలో పరిశోధకుడుగానా? అదీ కాదు. అసలు నాటకంలో ప్రధానపాత్ర వహించే నాయకుడు; రంగాన్ని దేదీప్యమానంగా ప్రకాశింపజేసే తార, అంతేకాదు దర్శకుడు, సూత్రధారుడుకూడా అతనే! ప్రకృతి - పురుషుడు అన్న ద్వైధ్యానికి, అద్వైతానికి తావు లేదు. పురుషుడు అంతర్విశ్వం అయితే - ప్రకృతి బాహ్యవిశ్వం. రెంటికీ మూలకారణం పదార్థం. పదార్థమే ప్రత్యక్షసత్యం. అభ్యుదయ సాహిత్యం దృష్టిలో మనం యిప్పుడు చేసిన యీ నిర్వచనం, సుప్రసిద్ధ అభినవ భౌతిక శాస్త్రజ్ఞులు మార్క్సెంగెల్సు, ఐన్‌స్టైనుల

క్వాంటుం మెకానిక్సు, రిలెటివిటీ, న్యూక్లియర్ ఫిజిక్సుల సిద్ధాంతాలతో పూర్తిగా మేళవిస్తుంది. శివుడు పార్వతి, పురుషుడు ప్రకృతి-కర్త,కర్మ-ద్రవ్యం, శక్తి-అనే ద్వైతంలేదు. సర్వం పదార్థమే. చలన రూపములోవుండే పదార్థమే శక్తి. విశ్వంలో జరుగుతున్న ప్రకృతివిశేషాలన్నీ, బ్రహ్మాండంలో ప్రాప్తించే సంఘటనలన్నీ, జగన్నాటకంలో సంభవించే ఘట్టాలన్నీ-చైతన్యయుతమైన పదార్థం యొక్క రూపాంతరాలే, సాక్షాత్కారాలే, వివిధ స్వరూపాలే, భిన్నాభిన్నమూర్తైన చేష్టలే, చమత్కారలీలలే, నృత్యం చేస్తున్న పదార్థంయొక్క అనంతకోటి అవతారాలే. అందుచేతనే పదార్థమే ప్రప్రధానమైనదీ, ఆద్యంతాలు లేనిదీ. అన్నిటికీ మాతృక. మనస్సు, బుద్ధి, ఊహ, వికారము, జ్ఞానము-పదార్థంయొక్క ప్రతిబింబాలే ఇవన్నీ పదార్థజన్యాలే. ద్వితీయములే. పదార్థ సాక్షాత్కారంయొక్క పరావర్తనమే.

ఆ కారణంచేత కర్త, కర్మ రహితమైన యీ జగన్నాటకంలో - "నాకు దేంతోనూ సంబంధం లేదు - ప్రపంచంతో నిత్యజీవితంతో, తోటిసోదరులతో, అంటే ముట్టకుండా, తామరాకుమీద నీటిబొట్టులాగు వుంటాను" అని రచయిత అంటే - అందులో యేమీ అర్థం లేదన్నమాటే. నిజమైన కళారాధకుడు, ప్రగతిశీలుడైన కవి, అభ్యుదయకాముకుడైన రచయిత తన సృజనాత్మకకృషిలో వాస్తవాన్ని తాను సందర్శించి, పాఠకులకి సాక్షాత్కరింపజేయడమే కాకుండా, మానవజీవితం యొక్క, మానవసమాజంయొక్క పరిణామక్రమాన్ని, గమ్యస్థానాన్ని తాను గ్రహిస్తాడు. తన పాఠకులచేత గ్రహింపజేస్తాడు. ఈ శక్తి, ఈ ఉత్సాహం, ఈ ఆవేశం అతని కెలా కలుగుతుంది? తోడి కష్టజీవులతో తానూ వకడై, వారి సుఖ దుఃఖాలను పంచుకుంటూ, వారి ఆశయాలతో తానూ సంతోషపడుతూ, వారి పోరాటాల్లో ముందంజవేస్తూ, వారి సంఘర్షణల్లో సైనికుడిగాను, నమ్మిన బంటుగాను వుండి, వారితో భుజం భుజం కలిపి ఫలసిద్ధికోసం పాటుపడినప్పుడే, రచయిత ప్రజారంజకునిగా, ప్రజా సేవకునిగా, ప్రజా సైనికునిగా తన పౌరధర్మాన్ని, తన కళాధర్మాన్నికూడా నిర్వర్తించ గలుగుతాడు. ప్రజలకష్టాల్లో, త్యాగాల్లో, నికృష్ట జీవితంలో, క్రొత్త సౌందర్యాన్ని క్రొత్త సత్యాన్ని తన కళాకౌశలంవల్ల నిరూపించ గలుగుతాడు.

అందువల్లనే అభ్యుదయరచయితకి 'కళ కళ కోసమే' అన్న సిద్ధాంతం వుత్త బూటకంగా కనిపిస్తుంది. మన భారత సంప్రదాయానికి యిది విరుద్ధంకూడాను. మన భారత సారస్వతచరిత్రలో ఏ కవి కాని, ఏ రచయిత కాని, ఏ సాహితీపరుడు కాని, ఏ కళాకారుడు కాని, ఏ హిమాలయాపర్వతాల మీదకో వెళ్లిపోయి కవిత్వం చెప్పినట్టు కాని, యే దండకారణ్యంలోనో చిత్రలేఖనం చేసినట్టు కాని, సప్తసముద్రాలు దాటి ఒంటిస్తంభం దంతపుమేడలో కూచుని కంద పద్యం చెప్పినట్టు కాని ఎక్కడా కానబడదు. కళారాధన వక సాధనక్రింద పరిగణించారు మన పూర్వీకులు - కాని 'కళ కళ కోసమే'నని ఎక్కడ చెప్పలేదు. త్యాగరాజు సంగీతకళ గురించి యేం చెప్పాడో చూడండి: "సంగీత శాస్త్ర జ్ఞానము సారూప్య సౌఖ్యప్రదమే మనసా... శృంగారరసాద్యఖిలసారము......నియమ

నిష్ట యశోధనము కల్గునే... నెర్వుగల్గు త్యాగరాజు నేర్పిన సంగీతశాస్త్రజ్ఞానము" అని గానం చేశాడు. "కళ కళకోసమే" అని నమ్మిన కొంతమంది సాహితీపరులు యీనాడు తమ కవిలికట్టలను చంక బెట్టుకుని ఏ టెక్స్టుబుక్కు కమిటీసభ్యుల చుట్టునో, యే పుస్తక వ్యాపారుల నాశ్రయించో, లేకపోతే సిగరెట్టు బీడీ ప్రచారచిత్రాలకి నిదానాలు వ్రాసో, అష్టకష్టాలు పడుతూండడం మనం చూస్తూనేవున్నాం. "కళ కళకోసం" అనే సిద్ధాంతంలో ఎంత సత్యం వుందో అనుభవరీత్యా వారికి బాగా గ్రాహ్యం అవుతుంది.

అభ్యుదయ సారస్వతం సాహిత్యంలో కొన్ని వృత్తాలనీ, అభ్యుదయ రచయితలని ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలనీ సూక్ష్మంగా సూచాయగా మీ ఎదుట వివరించాను. ఈ విషయాలు, యింకా ముఖ్యమైన యితర విషయాలు ముసాయిదా ప్రణాళికలో పేర్కొనబడివుంది. వీటిని మనం ముందుముందు సావధానంగా చర్చించవలసివుంటుంది. కాబట్టి నేనింక కాలయాపనం చేయడం సమంజసం కాదు. మన సారస్వతలోకంలో నేడు ఆవరించిన నిస్తబ్దత పరిస్థితులను గమనించి, మన సాహిత్యాన్ని ప్రగతి తోవలో పెంపొందించడానికి అభ్యుదయ రచయితల సంఘాన్ని పునర్నిర్మించడం అత్యవసరమని భావిస్తూ, దూరభారమని యెంచక, వ్యయప్రయాసలకు వెనుదీయక మా ఆహ్వానాన్ని అంగీకరించి యీసభకు దయచేసినందుకు మీ కందరికీ మరోసారి ఆహ్వాన సంఘం తరఫున హృదయపూర్వకముగా నా కృతజ్ఞతను తెలుపుచున్నాను.

# అంజలి

## (అభ్యుదయ కవి మహాసభాధ్యక్ష ప్రశంస)

ఎవఁడీ
అభినవాంధ్ర జగతి
అభ్యుదయ యుగప్రగతి
కవితా ప్రస్థానములో
కలమో చలత్ ఖలీనముగ
దౌడెత్తిన
యువభావుక హృదయాశయ
జగన్నాథ రథసారథి !

ఎవఁడీ
భూతకాల వైతరణిన్
బాతువులగు జడబుద్ధుల
కులవృద్ధుల కురువృద్ధుల
కలమో గదా దండముగా
ధట్టించిన
క్రుద్ధవృకోదర ధీరుడు !

ఎవఁడీ
దంధన ధన మదాంధ ఘన
దౌర్జన్యపు టూహాలపై
కలమో ఖండపరశువుగా
దండెత్తిన
నవవిప్లవ రవభైరవ
మార్గాపర భార్గవుడు !

ఎవఁడీ
ధనికవ్రజ పరిపీడిత
ప్రజాహృదయ ప్రతినిధియై
కలమో విజయ కాహళిగా
ధ్వజమెత్తిన ధనంజయుడు !

అతఁడే
అభినవాంధ్ర మహాభ్యుదయ
శుభోదర్క సుకవి సభా
విభావసుఁడు మన శ్రీశ్రీ !

అతనికిదే
మహాభ్యుదయ సభాసమయ
సభ్యహృదయ సదా సదా –
శయ మరందమయ సరోజ
నిచయాంజలి ! నిత్యాంజలి !

—యస్వీ. జోగారావు.

# అభ్యుదయ కవిత్వము
# సవిమర్శక సమీక్ష

రమణా రెడ్డి

## ప్రవేశిక :

అభ్యుదయ సాహిత్యోద్యమము తల యెత్తక ముందునుండికూడ తెలుగునాట అభ్యుదయ సాహిత్యము పరంపరాగతమై వివర్ధిల్లుతుండినది. అభ్యుదయ రచయితల సంఘ సభ్యులచే సృష్టింపబడిన దొక్కటే అభ్యుదయ సాహిత్యమని, తత్పూర్వములూ తద్భిన్నములూ సృష్టించినది అభ్యుదయ సాహిత్యము కాదనీ అనుకోరాదు.

నింగి నీలిమనుండి పిడుగువలె ఆకస్మికంగా ఏ సాహిత్యోద్యమముకూడ విరుచుకొని పడదు. ఆ విధంగా హఠాత్తుగ అవతరించిన ప్రతిది అంతే హఠాత్తుగ అంతరిస్తుంది. అభ్యుదయ సాహిత్యం తెలుగునాట వేళ్లులేని వృక్షంకాదు. ఆంధ్ర సంస్కృతీ ప్రవాహమందు ఇదొక క్రొత్త పాయ; సాహిత్యవృక్షాన క్రొత్తశాఖ. పరదేశాలలోను, పరరాష్ట్రాలలోను యేర్పడిన ఉద్యమాలకు ఆంధ్రదేశంలో కొందరు అంటుకట్టి పొదుకొల్పినారని, లేకుంటే యీ అభ్యుదయ రచయితలకు సాహిత్యం కంటె రాజకీయాలే ప్రముఖతరాలని కొందరు ఆరోపించివున్నారు. ఈ ఆరోపణలకు ఒకే ఒక్క సమాధానం వుంది. అభ్యుదయ సాహిత్యానికి సీమాభేదాలు లేవు. అంతర్జాతీయత జాతీయతకు విరుద్ధమైనది కాదు. తర్వాత, ఉత్తమ పౌరుడు కావలెనంటే, బ్రతుకులో ప్రముఖస్థాన మాక్రమిస్తున్న రాజకీయాలనుండి రచయిత విడిపోడు. రాజకీయాలూ, సాహిత్యమూ పరస్పర బాహ్యాలుకావు.

అభ్యుదయ సాహితీపరుల దృష్టి సమగ్రమైనది. మనసు వికచమైనది. స్వప్రయోజనపరులు దేశాలమధ్య, జీవిత ఖండాల మధ్య కల్పించిన అరమరలు అభ్యుదయ సాహిత్యం గుర్తించదు. కనుక అభ్యుదయ సాహిత్యాన్ని గురించిన సమీక్షలో ఓంప్రథమంగా గుర్తించవలసిన విషయమేమిటంటే, అంతర్జాతీయంగా, జాతీయంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా యిరవయ్యో శతాబ్ది మధ్యభాగంలో మానవ జీవితంలో ఏర్పడిన చరిత్రాత్మక పరిణామాల కనుగుణంగా వేరువేరు దేశాలలో, రాష్ట్రాలలో దాదాపు ఒకే శుభసమయాన అభ్యుదయ సాహిత్యమొక సంఘటితోద్యమంగా జన్మించింది. తెలుగు సీమలో గత శతాబ్దపు చివరి కాలంలో గిడుగు – గురజాడ – వీరేశలింగాలు ప్రారంభించిన భాషా, సంఘ,

శైలీ సంస్కరణోద్యమాలు, ప్రస్తుత శతాబ్ది రెండవపాదంలో మొదలై విజృంభించిన జాతీయ, సమవాదోద్యమాలు, వీటన్నిటి ప్రభావ ఫలితంగా అభ్యుదయ సాహిత్యోద్యమం 1940 ప్రాంతాల జన్మించింది. సాహిత్యాన్ని సంపన్నం చేసిన యీ వుద్యమం సిద్ధింప చేసిన విజయాలలో మొట్టమొదట ఎన్నతగినది, సాహిత్యాన్ని మానవ జీవిత వ్యాఖ్యాతగా చేయడం. అంతకుముందే వ్యావహారిక భాషావాదం చాలామంది అంగీకారాన్ని పొందినప్పటికీ, క్రొత్తసీసాలలో పోసిన పాత ద్రాక్షాసవం వలె, క్రొత్తశైలితో పాతవస్తువే వాడుక అవుతూవచ్చింది. కాని అభ్యుదయ సాహిత్యావతరణతో, కావ్య వస్తువులో విప్లవం వచ్చింది. సామాన్య మానవుడు మాన్యుడయ్యాడు. పోరాటాలు ప్రతిబింబితాలైనవి. నిత్యజీవితముతో సాహిత్యానికి సమీపబాంధవ్యం ఏర్పడింది. సాహిత్యంపట్ల సంఘంలో ఆత్మీయతా భావం ఏర్పడింది. ఊరూర, యింటింట రచయితలు ప్రభవించారు. సాహిత్యం ప్రజా వ్యవహారాల్లో ఒకటైంది; ప్రజల చేతలో ఆయుధమైంది; ప్రజలకు వుత్సాహాన్ని యిచ్చింది; తెలియచెప్పింది; మేల్కొల్పింది; నడిపించింది; పోరాడించింది.

## 2

## శ్రీ శ్రీ అవతరణ :

ఆంధ్రాభ్యుదయ సాహిత్యానికి శ్రీశ్రీ మూలవిరాట్టు; ఏకలవ్యుని అంగుష్ఠంవంటి వాడు. కాని చాలమంది భ్రమపడినట్టుగా, అతడే ఆదీ, తుదీ కాదు. కాల్పనికోద్యమ కవిత్వంమీద విరక్తి, వెగటూ, పితూరీగా బద్ధలై శ్రీ శ్రీ అభ్యుదయ సాహిత్యోద్యమ వైతాళికుడయ్యాడు. 1930 ల నుండీ దాదాపు నలభైలవరకు తానొక్కడే యీ మహాభారాన్ని వహించాడు. కాబట్టి అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని అంతటిని శ్రీ శ్రీ ఒక్కనితో ఏకీకరింపచేయడం జరుగుతున్నది. శ్రీ శ్రీని విరాణ్మూర్తిగ, అధిమానవ ప్రమాణాలతో అతిశయోక్తి అలంకారమంతటివానిగ చిత్రించడం జరుగుతున్నది. శ్రీ శ్రీ తర్వాత అభ్యుదయ సాహిత్యంగతి చెడిపోయిందని అనడం జరుగుతున్నది. ఆవ్యక్తి చేసిన తప్పొప్పులను ఉద్యమాని కంతటికీ చెందినట్లుగా వర్ణించడం జరుగుచున్నది. అందుచేత కళ్ళు విప్పి, దుర్నిరీక్ష్యుడని పేరందిన శ్రీ శ్రీని పరీక్షించి ఆంధ్రసాహిత్యంలో అతనికిగల స్థానాన్ని వురామరికగానైనా నిర్ణయించడం చాల అవసరం.

1920 నాటికి భారత జీవితంలో భూస్వామి పలుకుబడితగ్గి, పెట్టుబడిదారుల ప్రాభవం ప్రారంభమయింది. 1915 తర్వాత గాంధీగారి అవతరణతో జాతీయోద్యమం క్రొత్తదారులు పట్టింది. ఆ సమయానికే గురజాడ-గిడుగు-కందుకూర్ల సంస్కరణాభిప్రాయాలకు పునరుజ్జీవనం కలిగి, మహా మహోపధ్యాయుల, కళాప్రపూర్ణుల శిలాశాసనాలు చెరిపినిచ్చాయి. భూస్వామ్య విధానానికి పెట్టుబడిదారీ విధానానికి జరిగిన పోరాటం స్థూలంగా కాంగ్రెస్ - జస్టిస్ పార్టీ గొడవలనవచ్చు. కాని జాతీయోద్యమాన్ని దాని సంపూర్ణ కర్తవ్యం నిర్వహించకుండా అడ్డుతగులుతూ పెట్టుబడిదారులు ఏ ఘడియలో దానిపై ప్రాభవం సంపాదింప పూనుకొన్నారో,

ఆ ఘడియలోనే పెట్టుబడిదారీ వ్యవస్థకు శవవాహకులైన కష్టజీవులు ఒక సంఘటిత శక్తిగా రూపొందసాగినారు. ఈ "ప్రభంజనం" ఈ "వర్షకాభ్రా"న్ని చూచి, పెట్టుబడిదారులు జాతీయోద్యమాలను కైవసం చేసుకొని, ప్రజావిజృంభణ సంఘటిల్లినపుడల్లా వాటిని ఆపుచేయడం జరుగుతూ వచ్చింది. కాని "త్రాచులవలెనూ, రేచులవలెనూ, ధనంజయునిలా" త్రోసుకుని ముందుకు, "కదం త్రొక్కుతూ పదం పాడుతూ" పోతున్న "నెత్తురు మండే శక్తులు నిండే" యువక శ్రామిక శక్తికి ఆనకట్టలు వేయలేకపోయారు. "ప్రభవ" పద్యాలు వ్రాసి వాటిమీద, వాటి ప్రయోజనంమీద తృప్తిలేక, కొంత కాలంపాటు, దాదాపు 1927 నుండి 1934 వరకు, శ్రీ శ్రీ సందిగ్ధంవంటి విరామం తీసుకొన్నాడు. ఈవిరామ కాలంలో అతని మానస క్షేత్రాన మహాప్రస్థాన గీతాల ధోరణి విత్తినట్లయింది. శ్రీ శ్రీ "ప్రభవ" ప్రకటించి అసంతృప్తితో క్రొత్త కాంతులు నింపుకొంటూ క్రొత్తశక్తులు నూరుకొంటూ వుండిన రోజులలోనే, అంతర్జాతీయంగానూ, దేశీయంగానూ శ్రామికశక్తి ప్రధానాంగంగా రూపుదిద్దుకోవడం జరిగింది. 1929 లో సోవియట్ సమాఖ్యతప్ప తక్కిన యూరప్ దేశాలమీద ఘోరాశనిపాతం వలె పడిన ఆర్థిక మాంద్యం తన కళ్ళువిప్పిందని, ఆయనే వ్రాశాడు. "పెట్టుబడిదారీ దేశాలన్నీ ఆర్థిక మాంద్యంలోబడి కొట్టుకులాడుతున్నాయి. ఒక్క సోవియటు యూనియను మాత్రమే, ఈ దురవస్థలు లేకుండా ఉంది. ప్రణాళికాబద్ధమైన సోషలిస్టు ఆర్థిక విధానంతో ఆ దేశంలోని ప్రజలందరి జీవన పరిమాణం నానాటికి అభివృద్ధి చెందుతోంది... దారిద్ర్యము, దురవస్థ, ఇవే 1930-40 మధ్యకాలంలో మన దేశాన్ని, ముఖ్యంగా ఆంధ్రదేశాన్ని గూర్చి చెప్పవలసిన మాటలు... ఈ పరిస్థితులలో తెలుగు రచయితలు తమచుట్టూ ఆవరించియున్న దారిద్ర్యాంధకారాన్నుంచి బైటపడి, రష్యాలోవున్నలాంటి మంచి పరిస్థితులు కావాలని ఆశించడం సహజం కాదా?" ఈ విధంగా శ్రీ శ్రీ అభ్యుదయ కవిత్వమూ, శ్రామికోద్యమమూ సహజన్ములు, సహచరులు. మహాప్రస్థాన గీతాల వాతావరణం విశ్వవ్యాప్తమైనది. చారిత్రిక పరిణామాలు శ్రీ శ్రీ కవిత్వాన్ని, శ్రామికోద్యమాలనూ సృష్టించాయి. అంటే వ్యక్తిగా శ్రీ శ్రీ నిష్ప్రతిభుడని అర్థం కాదు. నాగరికతాక్రమములో ఒక క్రొత్తఅడుగు పడినప్పుడు దానికి అనుగుణంగా తాళంవేసేందుకు అనేకులనేకులు కవులు ముందుకు రావచ్చునేమో కాని ఐరావతగజంలాగ ఒక్కడో యిద్దరో మౌలికంగా నిలువగలరు. ఎందుచేతనంటే, యితరులు అస్పష్టంగా అర్థోక్తిగా అవకతవకగా వూడిపుండి చెప్పగలిగిన దానిని యీ మహామహుడైన కవి విడమర్చి చెప్పగలడు. యుగస్వభావ అతని జిహ్వాగ్రంగనర్తకి కాగా, యీ అసాధారణనిపుణుని చుట్టూ అనేకులు గుమికూడి అనుసరించక తప్పదు. 1930 లలో జగత్ప్రళయంగా సంఘటిల్లిన ఆర్థిక, సాంస్కృతిక కల్లోల జలరాశిలో, గట్టుకు చేరగలగడమే ఘనతకు పడికట్టు అయినప్పుడు, ఆ యపూర్వ సంధ్యాకాంతిలో సరైన త్రోవను శ్రీ శ్రీ తెలిసికోగలిగినాడు. తన "గుహలో, కుటీరంలో, చీకటిలో ఒక్కడనై గ్రుక్కిన రోజులు" పోయాయి. "శ్మశానాలవంటి

నిఘంటువులు", "వ్యాకరణాల సంకెళ్లు", "ఛందస్సుల సర్పపరిష్వంగం" వెనుక విడిచి, తన రచనలలో లోకం ప్రతిఫలించాలని, తన ఆకాశాలు లోకానికి చేరువ కావలెనని, తన ఆదర్శాలను సోదరులందరూ పంచుకోనవలెనని, తనగీతం జాతి జనులు పాడుకొనే మంత్రం కావలెనని కోరుకొన్నాడు. లోకపుటన్యాయాలు, ఆకలి, ఆవేదన, దారిద్ర్యం, దౌర్జన్యం — వీటిని "పరిష్కరించే బహిష్కరించే బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ," తనలో కదలే నవ్యకవిత్వం "కార్మికలోకపు కల్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి సమర్పణంగా, సమర్చనంగా, త్రిలోకాలలో, త్రికాలాలలో, శ్రమైక జీవనసౌందర్యానికి సమానమైనది లేనేలేదని," కష్టజీవులకు స్వస్తివాక్యములు సంధానిస్తూ, "వ్యథార్త జీవిత యథార్థదృశ్యం పునాదిగా" భావివేదములు సృష్టించి, జగత్తంతా చవులిస్తామని ఆశించాడు. తన నవీన గీతికి, నవీనరీతికి "సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు... భావం, భాగ్యం, ప్రాణం ప్రణవం," అన్నాడు. ఈ విధంగా 1930 లలోనే, అభ్యుదయ రచనోద్యమం ఏర్పడక మునుపే, సామాన్య మానవాభ్యుదయ శిఖరం వైపు ప్రయాణించసాగినాడు.

మహాప్రస్థాన గీతాలు తెలుగుభాషకు మందార కుసుమమాలలు. ముఖ్యంగా వాటినింటే, వాటికవికి మహత్త్వమబ్బింది. శ్రీశ్రీ మహాశిల్పి. అతని వులి తాకిడికే తెలుగు కవిత అవక్ర విక్రమోద్ధత యవ్వన విలసితమయింది. ఉత్తర గోగ్రహణ కాలమందు బృహన్నల గాండీవిగా పరిణమించినట్లయింది. శబ్దాలమీద అసాధారణమైన ప్రభుత నెరప గలిగినందుచేత, పదాలు ఈ ఛందశ్శాసనుడికి దాసదాసీజనాలైనవి. కృష్ణశాస్త్రిలోని జాలిగాబులవంటి పదాలు, విశ్వనాథలో పాషాణాలవంటి పదాలు, శ్రీశ్రీ లో అరబ్బీ తురంగాలయ్యాయి. ఖదంత్రో క్కే సైనికులయ్యాయి. కాని శ్రీశ్రీ ఎంతో పొదుపుగా, పిసినారివలె వాడినాడుమరి! "గర్జించే హ్రాదంత రాశా"లు, "వస్తుకాభ్రముల ప్రళయఘోష"లు, శివసముద్రమూ, నయాగరా, "నరకలోకపు జాగిలాలు," "యమునిమహిషపులోహ ఘంటలు," "ఆదిసూకరుని ఘుర్ఘురధ్వనీ," "రాబందుల రెక్కల చప్పుడు, పొగగొట్టపు భూంకారధ్వని, అరణ్యమున హరీంద్రగర్జన, పయోధర ప్రచండఘోషం, ఖడ్గమృగోదగ్ర విరావం, ఝంఝానిల షడ్జధ్వానం" — "మహాన మృదంగాలు" "నక్షత్రాంతర్నినద నిఖిలగానం", "ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం" "శిశువు చిత్ర నిద్రలో ప్రాచీనస్మృతులూచే చప్పుడు," "రోగార్తుని రక్తనాళ సంస్పందన", "త్రాగుబోతు వ్యర్థ వ్యక్తాలాపన, ప్రేలాపన," "ఘూంకాం కేకా" "భేకం బాకా", "ఆకటి చీకటి చిచ్చుల హాహాకారం, ఆర్తారావం," "ఒక లక్ష నక్షత్రాల మాటలు," "ఒకకోటి జలపాతాల పాటలు, శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు" విన్నాడు. జడమూ చేతనమూ చేతకూడ పలికించగలిగాడు.

శ్రీ శ్రీలో ఉన్న దగిన రెండవగుణం విశ్వజనీనత. "ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధ," అని చలం సరిగా అన్నాడు. ఈ విషయంలో శ్రీ శ్రీ దేశీయ కవిత్వంలో గురజాడ ప్రారంభించిన సత్సంప్రదాయాన్ని కొనసాగించాడు. తెలుగు

దేశాన్ని శేషభారత దేశంనుండి కాని, భారతదేశాన్ని శేషజగత్తునుండి కాని విడదీసే హిమాలయాలను, మహాసాగరాలను శ్రీ శ్రీ గుర్తించలేను. గురజాడ వ్రాసిన "డింకు లంకను దీర్ఘయుద్ధం, ధర్మపక్షము ముల్లుచూపెను, నరుల పీనుగ పెంటపోకల, నాటి వెలయును శాంతివృక్షము" అనే గీతిక వ్రాయబడిన ఐదేళ్ళలోనే కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు, గురజాడలో లోపించిన నిశితదృష్టిని సమకూర్చుకొని, "సమరతృష్ణ" అనే మహాగీతికలో ప్రస్తుతయుద్ధాల యథార్థకారణాలను పట్టి వెలికీడ్చాడు. వలస విధానానికీ సామ్రాజ్యవాద యుద్ధాలకూ గల సంబంధాన్ని కనుగొన్నాడు: "వాణిజ్యదేవత ... పాద చిహ్నాల రాపాడికచ్చు సంగర పశుశక్తి చచ్చి చావకయు, యాత్మకృతాపరాధాంకమైనిలిచి, బహుళపశ్చాత్తాప బాష్పపూరములఁ దన మనోవికృతుల దాహంబు తీర్చు"చున్నదన్నాడు. "సమర పరాజిత శత్రువర్గముల, కొల్లద్రవ్యము పంచుకొను వేడ్కఁజెద్ద, భాగంబులకుఁ బోరు "పరమ సౌహార్ద చక్రవర్తుల" "ఖండాంతరంబుల కపట నాటకము"ను ముసుగు చీల్చి ప్రదర్శించాడు. గురజాడ, దువ్వూరి, శ్రీశ్రీలు భావిదర్శనాన్ని చేశారు.

"చూడు మునుమును మేటివారల
మాటలనియెడి మంత్రమహిమను
జాతి బంధములన్న గొలుసులు
జారి, సంపద లబ్బుడున్.
"ఎల్లలోకము వొక్క యిల్లై,
వర్ణభేదము లెల్ల కల్లై
వేల నెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియు.
"మతము లన్నియు మాసిపోవును,
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును;
అంత స్వర్గసుఖంబు లన్నవి
యవని విలసిల్లున్", అని గురజాడ;

"సకలమానవజాతి సంతతులు కలుపు
వర్ణభేదంబులఁ బాటింపఁబోక
యొక్కకడుపునఁబుట్టి యొకచన్నుఁ
బాలు
ద్రావినరీతి సౌందర్యంబుగలిగి
యన్యోన్యసాహాయ్య మర్పించువారు..."
"దేహంబు నలుపైనఁ దెలుపు పసుపైన
నాత్మబంధువులుగారె యఖిల జనంబు?
కామంబు క్రోధంబు గర్వంబు జాతి
దేశంబు భాషయున్ దొలగింపంగ
సర్వసామాన్యమై చను మానవత్వ
మొక్కటి గనఁగాక యున్నదే వేర్వేఱు?"

అని దువ్వూరి దర్శించిన సర్వమానవ సౌభ్రాతృత్వము శ్రీ శ్రీలో పరాకాష్ఠ నందుకొన్నది. తాను "భువన భవన పు బావుటా"యై పైకిలేస్తాడు; "విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధార" పోస్తాడు, "భువన ఘోషకు వెర్రిగొంతుక విచ్చి" మ్రోస్తాడు

"చీనాలో రిక్షావాలా
చెక్ దేశపు గనిపనిమనిషి
ఐర్లాండున ఓడకళాసీ
అనాగారిన ఆర్తులందరూ—
హాటెన్‌టాట్, జూలూ, నీగ్రో,
ఖండాంతర నానాజాతులు
చారిత్రక యథార్థతత్వం
చాటిస్తారొక గొంతుకతో."
"ఆసియా, అమెరికా, యూరప్,
ఆఫ్రికా, ఆస్ట్రేలియాలలో,
సముద్ర ద్వీపాలలో
ధ్రువప్రాంతాలలో

పట్టణాలలో, పల్లెలలో
ధనివో, దరిద్రుడవో
వృద్ధుడవో, యువకుడవో,
తెల్లని, నల్లని, ఎర్రని, పచ్చని రంగో,
బలవంతుడివో, బలహీనుడివో,
బ్రతికేవాడా! పాడేవాడా!
మానవుడా! మానవుడా!
అవిభక్త కుటుంబీ!
ఏకరక్తబంధూ!
మానవుడా! మానవుడా!"
"మానవుడే నా సంగీతం
మానవుడే నా సందేశం."

గురజాడ, దువ్వూరి, శ్రీ శ్రీ లలో మానవప్రపంచాన్ని కౌగిలిలో యిముడ్చుకోగల భేదరహిత మానవత్వమున్నప్పటికి, "ధర్మపక్షాన్ని" గురించి గురజాడ ప్రస్తావించినపుడు, "వాణిజ్యశక్తి"ని గురించి రామిరెడ్డి తెగడినప్పుడు, వారిలో యథార్థ దృష్టి కొరవడలేదని తెలుస్తుంది. ఈ యథార్థ దృష్టికూడా శ్రీశ్రీలో పరాకాష్ఠ నందుకొంది. ఆయన "దారుణ ద్వేషాగ్ని పెంచే దానవత్వం" నశించి, "బానిసల సంకెళ్ళు బిగిసే పాడుకాలం" లయించి, "సాధుసత్వపు సోదరత్వపు స్వాదుతత్త్వం" జయించవలెనని ఆశించాడు. కాని రెండవ ప్రపంచయుద్ధం యీ ఆశలను వమ్ముచేసింది. అభ్యుదయ మానవాళికి నాయకత్వం వహించిన సోవియట్ రష్యాలో మానవుల ఆశలను దర్శించాడు. ఎందుకంటే తన ఆశయాలు, రష్యా ఆశయాలు ఒకటే: సమానత, స్వాతంత్ర్యత అనేవి. ఇటీవల ఆంధ్రదేశంలో జరిగిన ఎన్నికలలో కట్టుకట్టిన "పెట్టుబడికూటాలు" చెలరేపిన కుట్రలూ, కూహకం ఫలితంగా శ్రీశ్రీని దేశ విరోధిగా, విదేశ భక్తుడుగా చిత్రించడం జరిగింది. "పెట్టుబడికీ కట్టుకథకీ పుట్టిన" పత్రికలు రాజకీయాలలో రంకు వేషాలు వేశాయి. దేశీయ సారస్వతంలోని ఉత్తమప్రజాతంత్ర సంప్రదాయాలలో అగ్రగణ్యమైన అంతర్జాతీయదృష్టికి శ్రీ శ్రీ వారసుడయ్యాడు. యావజ్జగత్ప్రళయాలైన ప్రపంచయుద్ధాలు రెండు వుప్పతిల్లినా, మానవ సమస్యలను పట్టించుకోనక, శిథిలాలను రాణువ కిరీటాలను ప్రేమిస్తూనో, ఊహాసుందరికి రూపు దిద్దుతూనో వ్రాసినవి వ్రాస్తూ, నెమరువేస్తూ ప్రసిద్ధులైన ఆంధ్రకవులు మూగవోయి వున్నప్పుడు, శ్రీ శ్రీ అసహాయుడై ఒంటరిగా తెలుగునాటినుండి ప్రపంచమానవ సమస్యలలో అభిమన్యునివలె దూరబారినాడు. ఆయన పెట్టిన ఒరవడిని అభ్యుదయ కవయితలందరూ శిరోధార్యంగా ఎంచి, వర్తమాన మానవ సమస్యలమీద దృష్టి నిలిపారు. అభ్యుదయ సాహితీపరుల దృష్టిలో అంతర్జాతీయదృష్టి దేశాభిమానానికి వెలి కాదు; అసలైన దేశాభిమానానికీ, జాతీయవాదానికీ నడుమగల తేడా తల్లిపట్ల బిడ్డకుగల ప్రేమకూ, స్వప్రయోజనచింతకూ కలట్టిది. జాతీయవాదానికి ఎన్నో శతాబ్దాలముందునుండి, మానవజాతిప్రాదుర్భావకాలంనుండికూడ దేశాభిమానము వుంటున్నది. నడుమంతరాన దూరిన జాతీయవాదము కాలక్రమాన దేశాభిమానంగా చెలామణీ కాసాగింది. దేశభక్తికీ, అభిమానానికీ నడుమగల తేడా చాలగొప్పది. భక్తి గ్రుడ్డినమ్మకాన్ని ప్రేరేపుతుంది; వర్తమానంకంటె గతాన్ని గోరంతలు కొండంతలు చేస్తుంది; మాలిన్యాన్ని కూడ మాన్యంచేస్తుంది; కంపును యింపు చేస్తుంది. కాగా అభిమానమనేది వివేచనాయుతమైన,

ప్రగతిశీలమైన, ఆరోగ్యవంతమైన దృష్టిని అలవరింపచేస్తుంది. దేశభక్తికి అంతర్జాతీయత వెలి. దేశాభిమానానికి అది జతి. అభ్యుదయ సాహిత్యపరులు దేశాభిమానులు; అంతర్జాతీయ వాదులున్నూ. అంతర్జాతీయ వ్యవహారాలు పట్టని మన సుప్రసిద్ధ కవి వర్యులకు వర్తమాన దేశీయ సమస్యలు కూడ అంతంతమాత్రమే. ఎంతసేపటికీ హంపీక్షేత్రాలు, ఆంధ్ర ప్రశస్తులు, ఆంధ్ర పౌరుషాలే కాని, వారికి వర్తమానంతో పని లేదు. "మంచి గతమున కొంచెమేనోయ్, మందగించక ముందు అడుగెయ్", అని గురజాడ ప్రబోధించినప్పుడూ, "గతము గతంబె, ఎన్నటికి కన్నులం గట్టదు, వర్తమానమే సతత మవశ్య భోగ్యమగు సంపద", అని కవికోకిల ఒమార్ ఖయ్యాం నెపాన ప్రవచించినప్పుడూ, "ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం ... పరస్పరాహరణోద్యోగం... రణరక్త ప్రవాహసిక్తం, బీభత్సరసప్రధానం, పిశాచగణసమవాకారం,...దరిద్రులను కాల్చుకుతినడం...గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో", నని", "వెనుకటి గొప్పలు కలపోసినలాభం బండి సున్న", అనీ శ్రీశ్రీ అన్నప్పుడూ వారు అబద్ధాలకంటె సత్యాన్ని, భ్రమలకంటె వాస్తవాన్ని ఎక్కువ మన్నించారన వచ్చును. భ్రమలపాలైన మన ప్రసిద్ధ కవులకు పూర్వాంధ్రయొక్క గొప్పతనాలే స్మరణీయాలు కాగా, వర్తమానాంధ్ర దుస్థితి వారి చూపునుండి జారిపోయింది. వారి దేశభక్తికి యిదే నిదర్శనం. కాని శ్రీ శ్రీ "విషాదాంధ్ర"ను దర్శించాడు. రాజకీయ చదరంగాలను, నక్కలు, కొంగలు, పిల్లుల వంటి నాయకులను, వారి కుమ్ములాటలను గమనించాడు. "శిశువుకు దక్కని స్తన్యంలాగా" ప్రజలకు వుపయుక్తాలు కాక సముద్రాన కలిసిపోయే నవ అఖండ వాహినీ జలాల గలగలను విన్నాడు.

స్వాతంత్ర్యోదయం మన ప్రసిద్ధకవుల దృష్టిలో సకలసమస్యా పరిష్కారంగానూ, సకలరోగ నివారిణిగానో కనుపిస్తే, శ్రీ శ్రీకి హర్షోల్లాసాల నడుమ చిరునవ్వు కనుపించని సామాన్య భారతపౌరుని నిరాసక్తవదనం కనుపించింది. వర్తమాన సమస్యలు కావ్య వస్తువులుగా చిరంజీవాలు కావని ఒక వాదం వుంది. దీనిని అభ్యుదయ సాహిత్యపరులు లెక్కించరు. జడప్రకృతిలో కంటె, వారికి జీవన్మానవ లోకమందు సౌందర్యాధిక్యత గోచరిస్తుంది. అబద్ధాలను, అప్రసక్తాలను, అనావశ్యకాలను చిత్రించడంమట్టుకే కళ యొక్క పరమ ప్రయోజనమయితే, అభ్యుదయ సాహిత్యపరులకు అటువంటి కళ అక్కరలేదు. వారు వాస్తవకళావాదులు. కాని, తక్షణ సమస్యాచిత్రణ వత్ప్రచారంలో కళాదారిద్ర్యం అడుగడుగునా బయల్పడడాన్ని ఒప్పుకోరు. సాహిత్య మూల్యాలు అడుగంటడాన్ని సహించరు. ఈ విషయంలో కూడ శ్రీ శ్రీ పెట్టిన ఒరవడి అభ్యుదయ రచయితలందరికీ అనుసరణీయమైనది. కళ లోపించకుండానే, వర్తమాన సమస్యలను కావ్యవస్తువులుగా స్వీకరించి, వస్తువునకు తగినరీతిని మేళవించాడు శ్రీ శ్రీ. ఛందస్సుల ప్రాగల్భ్యం లేకుండా, పాండిత్య ప్రస్ఫుటత్వం లేకుండా, అశ్లీ ప్రయోగాల కొత్తదనం కొట్టవచ్చేటట్లు లేకుండా శ్రీ శ్రీ ఛందోబద్ధంగా కొన్ని పర్యాయాలు, విశృంఖలంగా మరికొన్ని పర్యాయాలు స్వాత్మాభిప్రాయాలను

పండితులుకూడ జేజేలివ్వదగిన నైపుణితో వెల్లడించాడు. ఈ ప్రత్యేకగుణం పోను పోను బయల్వెడలిన అభ్యుదయ రచయితలలో రానురాను సన్నగిల్లిందని మన మంగీకరించక తప్పదు. శబ్దంమీద, శైలిమీద అధికారం తగ్గిపోసాగింది. ప్రచారంపాలు హెచ్చయింది. లేదా యీలోపాలను కప్పిపుచ్చుకోనేందుకు గాంభీర్యము ఎక్కువైనవి.

## 3

### పెడత్రోవలు :

ఈ శతాబ్దిలో మూడవ దశాబ్దినుండి అభ్యుదయ సాహిత్య వ్యవసాయాన్ని ప్రారంభించిన శ్రీ శ్రీ, మరికొందరు భారతదేశంలో అభ్యుదయ సాహిత్యోద్యమం నెలకొనేనాటికి (1936) పరిణతబుద్ధులయ్యారు. "తెలుగు రచయితలలో అగ్రగామిదళం ఒకటి అభ్యుదయ సాహిత్యం వైపు మొగ్గింది," అని శ్రీశ్రీయే వ్రాసివున్నాడు. కాని ఆంధ్రదేశంలో అభ్యుదయ సాహిత్యోద్యమం స్థిరపడి సంఘటితమయ్యేసరికి మరో ఏడేళ్ళు పట్టింది. ఈ ఏడేళ్ళలో దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ వచ్చిన అనేకాలైన మార్పులు అభ్యుదయ కవిత్వంలో ప్రతిఫలించాయి. అభ్యుదయ కవిత్వ నాయకుడుగా దేశమంతటా గుర్తింపబడిన శ్రీశ్రీ బ్రతుకులో కూడ గతుకులు, కుదుపులు వచ్చాయి. ఆనాటికే ఆయన మనస్సులో సర్రియలిజం వంటి పాశ్చాత్య సాహిత్య ధోరణులు ప్రవేశించాయి. తత్ప్రభావ ఫలితంగా శ్రీశ్రీ చేసిన ప్రయోగాలు దేశంలో ఎక్కువ ఆమోదాన్ని పొందలేదు. శ్రీ శ్రీ వ్యక్తిగతంగా త్రొక్కిన ఈ వింతత్రోవలను అభ్యుదయ సాహిత్యానికి అంటగట్టారు. ఈ ధోరణులకు దేశంలో వేళ్ళులేవు. రెండు ప్రపంచయుద్ధాల నడుమంతరాన పాశ్చాత్య సాహిత్య ప్రపంచమందు చెలరేగిన నిరాశా నిర్వేదాలు, పితూరీ తిరుగుబాటు ధోరణుల ఫలితంగా సకల సంప్రదాయ నిరసనతోటి మానసికాలైన సంబద్ధాసంబద్ధ, వ్యక్తావ్యక్త, సభ్యాసభ్య భావాలతోటి అమానుషమైన సాహిత్య మొకటి ఉప్పతిల్లింది. యుద్ధ ప్రమాదచ్ఛాయలలో మానసిక ప్రశాంతిని కోల్పోయి, అల్లకల్లోలాల పాలైన పాశ్చాత్య దేశాలలో యీ ధోరణులు పరిస్థితుల ప్రభావంచేత సహజాలై యుండవచ్చు. కాని తెలుగునాట వీటి ప్రవేశానికి కారణమేమీ లేదు – వ్యక్తుల యిచ్ఛ తప్ప. శ్రీశ్రీతో, ఆరుద్రకూడ జత కలిశాడు. ఇద్దరూ సైన్యంలో వుద్యోగం చేస్తూ, "స్థాయి" లేని జీవితాలుగడుపుతూ, "అశాంతి" చెందుతూ, సాల్వడార్ డాలీ వ్యాసాలను చదువుతూ, యీ అభిప్రాయాలను ఒంటబట్టించుకొన్నారు. తమకంటె ముందే తెలుగు పాటల్లో సర్రియలిజం వుందని, కనుక ప్రత్యేకించి తాముగా ప్రవేశపెట్టిన అనౌచిత్యాలు ఏవీ లేవని తృప్తిపడసాగినారు. "మాత" పత్రికలో ప్రకటింపబడిన శ్రీశ్రీ, ఆరుద్రల లేఖా సారస్వతంలో, "చూశావా! మనకి ముందే సర్రియలిజం పాటల్లో వుంది," అంటూ ఆరుద్ర,

"అబ్బోచ్చి రబ్బోచ్చి ఆలాగ అయితే
కురుచా కురుచా మొక్కలు పీట ?
కుందం నాయుడి కూతురు నోరయ్యా
కొయ్యాడ,"

అనేపాటును వుదహరించి, "ముక్కాలి పీటపై రెండు అగ్నిపర్వతాలు పగిలినవి అని రాశేను. ఇప్పటిదాకా ముక్కాలి పీట నా స్వంతం అనుకొన్నాను," అని శ్రీశ్రీకి వ్రాశాడు. (9-1-1943)

ఇంతకూ ఈపోకిళ్ళకు కారణాలేమిటి? తెలియవు. ఉన్నా వ్యక్తుల అభిరుచులు తప్ప, లేవు. వీరిద్దరికీ సాదా జీవితంమీద వెగటు పుట్టినట్లు పైన పేర్కొనబడిన లేఖాసాహిత్యంబట్టి తెలుస్తుంది. "దినములు పాసిపోగ ప్రతిధ్వనులు" అని శ్రీశ్రీ వెల్లిబుచ్చిన విసుగుదలకు ఆముద్రనుండి వెంటనే "యథామామూలిక మామూలికే మన పని. అనునిత్యం అదేపని. గ్రామఫోను జీవితం అన్నాను పాటలలో. ఇంకా,

పొద్దున్నే నిద్రలేవడం
మధ్యాన్నం నిద్రపోవడం
సాయంత్రం బేజారవడం
రాత్రంతా కలలుగనడం"

అని ప్రతిధ్వని వస్తుంది. రాత్రులలో నిద్రలో సాదా కలలు మజాలేదు. రాత్రి పడుకునేముందు నీరుల్లిపాయలు తింటే త్రివర్ణ స్వప్నాలను కనవచ్చునని నారాయణబాబు చిట్కా చెప్పాడట. సాధారణంనుండి అసాధారణానికి పోవలెననే యిచ్ఛ వీరిలో ప్రబలంగా వున్నట్లు కనిపిస్తుంది. విశృంఖలమైన బ్రతుకుకొరకు అర్రులు చాస్తున్నట్లు తెలుస్తుంది. "సిరిసిరిమువ్వ శతకము" (ఆంధ్ర జ్యోతి: ఫిబ్రవరి '46)లో శ్రీ శ్రీ యే చెప్పినట్లు,

"బేసరతు బ్రతుకుకోసం
శోషిల్లెడి మామకాత్మ చుట్టూ ఏవో
ఘోషలతో నియమాలా
శ్లేషిస్తే ఏది దారి?"

బ్రతుకులో విశృంఖలతను కోరినట్లే, సాహిత్య విషయాలలోనూ కోరారు. సమాజానికున్న షరతులవంటివే సాహిత్యంలో ఛందస్సు మొదలగు నియమాలు. ఈ విశృంఖలవాదులకు యీ బందోబస్తులు పనికిరావు.

"ఛందో బందోబస్తులన్నీ
ఛట్ ఫట్ మని త్రెంచి
Damn it, ఏమిట్రా ఇదంటే
Pray, it is poetry, అందాం."

అధివాస్తవిక వాదుల ఆశయాల జాబితాలో ప్రథమ స్థానగౌరవం పొందిన యీ సకలచ్ఛందోనిరసనను తప్పుపట్టినప్పుడు, "కవితా గీతం"లోని

"నా విన్నవి కన్నవి విన్నవించనా
మాటలకై వెదుకాడగబోతే—
అవి
పుంఖానుపుంఖంగా
శ్మశానాలవంటి నిఘంటువులదాటి,
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి,
ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నాయెద
నడుగిడినై."

అన్న మాటలలోకూడ తప్పుపట్టవలసి వుంటుందని కొందరనవచ్చును. కాని, 'కవితాగీతం' వ్రాసేటప్పటి మనస్థితీ, అధివాస్తవికధోరణి ఆవేశించినప్పటి మనస్థితీ వేరైనవి. ప్రవక్తృవాగింద్రజాల ప్రవాహానికీ, వున్మత్తప్రలాపధోరణికీ వున్న అంతరమే పైరెంటికీ కలదనవచ్చును. వ్యాపారనాగరికత తెచ్చిపెట్టిన దుఃఖదాయక విషయాలనుగురించి ఆలోచించినప్పుడు మహోద్రిక్తుడై, నియమోల్లంఘనం సాహిత్యంలో నేకాక, బ్రతుకులో కూడ

చేయ నుద్యమించినప్పుడు, శ్రీశ్రీ పీడితుల కందరికీ ప్రతినిధిగా వున్నాడు. కాని, వ్యక్తి మాత్రుడైన తన యిష్టానిష్టాలను ప్రపంచం మీద రుద్దచూచి, తన మానసిక కల్లోలాన్ని సాహిత్యసంప్రదాయ నిరసనగానూ, సంఘ అరాజకంగానూ తయారు చేయచూచినప్పుడు, పోకిరి పోకడలయందే అకారణమైన ఆనందాన్ని, విధ్వంసనమందు సంప్రీతిని, వైపరీత్యాలందు వైరిదాహాన్ని ప్రదర్శించే వక్రమనస్కుల (Pervents) కు మట్టుకే శ్రీశ్రీ ప్రాతినిధ్యం వహించాడు. అర్థవంతమయిన ప్రపంచంలో అర్థవంతమయిన సాహిత్యానికి స్థానమున్నప్పటికీ, అడవి వంటి ప్రపంచంలో సాహిత్యానికి అర్థంతో అవసరంలేదని కాబోలు సిద్ధాంతీకరించబోయాడు. అడవిలో మృగాలవలెనే అధివాస్తవ సాహిత్యారణ్యంలోని కవులు మృగలక్షణాలను అలవరచుకొని,

"హాక్! హాంఫ్! హూంఫ్! హాఫ్!
అని కేకలు వేసి కావ్ కావ్! మ్యావ్!
మ్యావ్! అంటాం గమ్మత్తుగా."

ఈ వ్రాతలలో చివరకు మానవుని మహాధనమూ, సంస్కృతి కంతటికీ మూలకందమూ అయిన మానవవాక్కుకుకూడ విలువ తీసివేయబడింది.

"న...న...న...న...నవ్వుమాటలు కూడా
మ...మ...మ...మ...మన వ్రాతల్లో
వుండవచ్చు."

పఠాభి వ్రాసిన "ఫిడేలు రాగాల డజను"కు "ఇంట్రో"లో శ్రీశ్రీ, "నవకవుల తిరుగుబాటు"ను వివరిస్తూ, "పదార్థాల నిరంకుశత్వం భరించలేడు నవకవి... వ్యాకరణం మాత్రం? వాక్యానికి కర్త, కర్మ, క్రియల అనుబంధం విధిస్తారు కాదూ? వీటికి నవకవి విడాకులిస్తున్నాడు. కర్త లేకుండా ఒక్క క్రియమాత్రమే నిరంకుశంగా విహరిస్తుంటే కొందరు కళ్ళు పొడుచుకుంటున్నారు. కాని కవి సర్వతోముఖ స్వాతంత్ర్యదాత. స్వేచ్ఛాదాత. అవ్యయం అనాచ్ఛాదితంగా ఆకాశమధ్యంలో ఊరేగవచ్చును. విభక్తి విశృంఖలంగా షికారు పోవచ్చును. ప్రతిఫలం విచిత్ర సౌందర్యం. విచిత్రమే సౌందర్యం! సౌందర్యమే విచిత్రం. ఛందస్సుల దండశాసనానికికూడ కాలం వెళ్ళిపోయింది. కవి హృదయంలోని రాగాలాపన ఎక్కి దిగలుగా సాగితే అదే గీతానికి ఆకారం నిర్ణయించాలి", అంటాడు. స్వాతంత్ర్యమూ, స్వేచ్ఛ అంటే వీరిదృష్టిలో అద్దూ అదుపూ గానీ, క్రమమూ నియమమూ గానీ లేని విశృంఖలత్వమని ఇంతకు ముందే తెలిపాను.

ఈ అసంబద్ధ బీభత్సకవిత్వంలో శ్రీశ్రీకంటె శ్రీరంగం నారాయణబాబు మరొక మెట్టు పైకి వెళ్ళాడు. "నల్లమందు"వంటి భావకవిత్వంపై పితూరీ లేవదీసి, దానిని వస్తు వ్యాకరణాలలో తెచ్చినమార్పులతో నిలుపక, అపరిచితాలూ, అసహ్యాలూ అయిన పదాలు సృష్టించాడు. "అతి వాస్తవికత మనకు కావాలంటే వెఱ్ఱివాళ్ళ దగ్గరకు, త్రాగినవాళ్ళ దగ్గరకు పోవాలి అంటున్నారు నిజమే. స్వచ్ఛందమైన అట్టి మనస్సు విహారం చేస్తుంది. కాని వెఱ్ఱివానికి కవికి వ్యత్యాసం వుందంటే, కవి తలచినప్పుడు వెఱ్ఱిని తెచ్చుకొని ఉపయోగం తీరాక, వదలగొట్టుకోగలడు. వెఱ్ఱివాడు అట్లా చేయలేడు," అని తన తాత్కాలికమైన వెఱ్ఱిని నారాయణబాబుగారు సమర్థించుకోజూచాడు. అది అపస్మారం కాదట, [illegible]మట. "వాస్తవికత భాగా

చిత్రంలాంటిదైతే, అది వాస్తవికత X'ray లాంటిది," అనీ, "అది వాస్తవికత సాహిత్యంలో తెలుపబడిన మాత్రకి వాటం. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, మార్క్సు సూత్రాల కలయికలో పుట్టిన క్రమగానం," అని అన్నారు. మార్క్సు సూత్రాలంటే వీరి దృష్టిలో యథార్థ వాదమేమో. కాని దీనికి ఫ్రాయిడ్ సిద్ధాంతాలకూ ఏ విధమైన బాంధవ్యమూ లేదు. బ్రతుకులోని భేద సంధాయకాలైన విషయాలను చిత్రించడమొక్కటే యథార్థవాద మనిపించుకోదు. బహుముఖమైన మానవజీవిత సమస్తాన్ని సమగ్రంగా విమర్శించి విస్పష్టత - సార్థక్యము - సౌందర్యము అనే లక్ష్యత్రయానికి కట్టుబడిన సాహిత్యాన్నే వాస్తవ వాద సాహిత్య మంటాము. జడమైన మానవప్రకృతిని సంక్షుబ్ధతిని యథాతథంగా చిత్రించడమూ, మానవ ప్రకృతిలోని నీచ గుణాలకే ప్రాముఖ్యమిచ్చి చిత్రించడమూ అప్రధానాలు, అశ్లీలాలూ అయిన ఘోరణాలను అభిమానించడమూ వాస్తవ వాదానికి భిన్నమయిన గుణాలు. అనునిత్యమూ రికి, వర్తనమందుతూవున్న సంఘమందు ప్రముఖస్థానాలాక్రమిస్తూ, అర్థవంతాలై ఒప్పారుతూవున్న జీవద్ఘోరణులనే వాస్తవ వాద కళ మన్నిస్తుంది. కాని అధి వాస్తవిక కళకు, ప్రయోజనాలతో కాక, అప్రయోజనాలతోటి, సార్థకాలతో కాక నిరర్థకాలతోటి, అనర్థదాయకాలతోటి, వ్యక్తంతో కాక అవ్యక్తంతోటి, వ్యక్తావ్యక్తంతోటి, వుచ్ఛాలతో కాక నీచాలతోటి ఎక్కువ ప్రమేయం వుంది. ఉదాహరణకు, మన శాస్త్ర పారంగతులమంటూ వీరు "కామేచ్ఛ"ను యిచ్చిన అనుచిత ప్రాముఖ్యాన్ని చూడవచ్చు. అది సహజమయినంత మాత్రాన, దానికి కావ్యాలలో పట్టంగట్టి, తద్ద్వారా తమ దాహాన్ని తీర్చుకోజూచే వారికి సభ్యాసభ్యాలు, శ్లీలాశ్లీలాలు మది కెక్కుతాయా?

ఇక నారాయణబాబు గారు శైలివిషయాలను గురించి శ్రీశ్రీ కంటె మరొక మెట్టు పైకి పోయారు. స్పష్టతకు బదులు క్లిష్టత పైనే మోజు. ఎంత సూక్ష్మంగా చెప్పగలిగితే అంత సామర్థ్యమున్నదని కొలత కాబోలు! శ్రీ గోణాంకి అప్పలస్వామి గారు "రుధిరజ్యోతి" అనే నారాయణబాబు గారి కావ్యసంపుటిని గురించి, సెప్టెంబరు 1952 భారతిలో ప్రస్తావిస్తూ "శ్రీశ్రీ స్థూలదృష్టికికూడా దొరుకుతాడు. నారాయణబాబు కొన్ని తావులలో సూక్ష్మదృష్టికి వినా, స్పష్టం కాడు. నోటికిపట్టే ఛందస్సులలో శ్రీశ్రీ పరుగులు తీస్తాడు. తన లక్ష్యాన్ని ప్రత్యక్ష పద్ధతిని వ్యక్తం చేస్తాడు. నారాయణబాబు పరుగులో శ్రీశ్రీకి గల ఉద్వేగం లేదు. అతనిది పరోక్ష పద్ధతి... భావకవిత్వానికి తిరుగుబాటు, వస్తువ్యాకరణాలలో ఆగక, విప్లవపథాలను పడుతుంది. రీతిలోను, వస్తువులోనూ, సరిక్రొత్తదనం కనిపిస్తుంది. ఎవరూ చెప్పని పద్ధతిని చెప్పడం అతనికి సరదా. ఇమేజిస్టు కవితను ఇతడు ప్రాణంపోస్తాడు. శబ్దార్థాలను కూర్చి, సాకారమైన విగ్రహాలను నిర్మించే శిల్పి. క్లిష్టత ఇతని పద్ధతి... అవ్యక్త మధుర భావాలను వ్యక్తం చేస్తూ రసనిష్పత్తి కలిగించడమే అతని లక్ష్యం...... న్యాయానికి అతని కవిత్వమే 'నిశ్శబ్ద పురాణ సంపుటముల దొంతి'... ఇంద్రియాలు గ్రహించిన అనుభూతులను ఆయా యింద్రియాలతో గాక, వానిని భిన్నభిన్న యింద్రియ సంపాదితములుగా పేర్కొనడం ఒక శిల్ప

రహస్యం. 'తెల్లని రుచి', 'రజత రావ సంగీతం' అనే యితని ప్రయోగాలు ఇలాటివి" అని నారాయణబాబుగారి కవితలోని కొన్ని లక్షణాలను పేర్కొన్నారు. కాని వారు అవలక్షణాలను విడిచిపెట్టారు. నారాయణబాబు సృష్టించిన ప్రతిభావ విగ్రహం (Image)లోనూ, ప్రతి పంక్తిలోనూ, ఆలోచలోనూ, పద్యచరణాలలోనూ అరాచకం కనుపిస్తుంది. కావాలని పదాలను వికృతపరచి ప్రయోగించడం సరదా కాబోలు, "మృణాళగీర యాక్రమణ", "ఘుటాకాళ యమునారుణ" అంటూ కొన్నిటిని వాడారు. తర్వాత, చాల అసహ్యమైన వస్తువులను వర్ణించి తృప్తిచెందడం యితని మరొకసరదా. "ప్రేయసి కాలిన దేహం కమురు కంపు యీలోకం", "తెల్లని మసూచి కుండలు గగనమ్మున తారలు," "ఒళ్ళు తెలియని పుళ్ళబాధతో వెక్కి వెక్కి ఏడ్చేటి చుక్కల ఆకాశం", "విధవ కానుపు" వంటి వర్ణనలలో యిది స్ఫుటంగా కనుపిస్తుంది.

ఈ ధోరణి ననుసరించిన వారిలో శ్రీ శ్రీ, నారాయణబాబుల తర్వాత పేర్కొనవలసినవారు దేశిరాజు కృష్ణశర్మ, పఠాభి, వీరి రచనలు తాత్కాలికంగా కొంత అలజడి కలిగించినప్పటికీ, పురిపండా అప్పలస్వామిగారి "సౌదామిని"కి వుపోద్ఘాతంలో శ్రీ శ్రీ, "అనేక ప్రపంచరంగాలలో సర్రియలిజం (అధివాస్తవికత) నేడు తిరోగమించింది. అభ్యుదయ భావుకులు దానిపట్ల అపనమ్మకాన్ని ప్రదర్శించారు", అని నిజాన్ని గుర్తించాడు. కాని యీ రకపు విపత్తులు అతని కవిత్వంలో పూర్తిగ గొడ్డుపోలేదు. అంతేకాదు – అవి ఆరుద్రవంటి యువకవుల మానసాలనుకూడ వ్యాపించాయి. ప్రత్యక్షంగా, బాహాటంగా కనుపించేందుకు భయమై, కొత్త అవతారాలు తాల్చాయి. తీవ్రంగా సంఘాన్ని పట్టి పీడిస్తున్న విషయాలను గురించి వ్రాసేటప్పుడుకూడ, కొన్నికొన్ని చోట్ల చాల తేలికగా నిర్లక్ష్యంగా చెప్పడమనేది వారిద్దరిలో ఒక గుణంగా నిలిచిపోయింది. శ్రీ శ్రీ యిటీవల వ్రాసిన "మేమే", "ప్రాసక్రీడలూ", ఆరుద్ర వ్రాసిన "జీర్ణమంగే సుభాషితం" యిందుకు సాక్ష్యాలు. ఇది కార్టూను కవిత్వమని నిర్వచించారు. హాస్యప్రధాన మన్నారు. కాని "శరచ్చంద్రిక" అనే కావ్యంలో, "రాబోయే యుగంలో" తనలోని "అరాజకం పోతుం దనుకుంటా"నని తనతప్పును గుర్తించి పశ్చాత్తప్తుడౌతాడు శ్రీ శ్రీ.

"శాఖా చంక్రమణం మాని
చెప్పేదేదో సూటిగా
బల్లగుద్దినమాదిరిగా
కుండ బద్దలు కొట్టిన బాపతుగా
ఈ నీళ్లు నమలడం లేకుండా
ఈ కాళ్ళు తడబడడం లేకుండా
స్పష్టంగానే కాకుండా శ్రావ్యంగా
స్వచ్ఛంగానే కాకుండా సమగ్రంగా
రాబోయే యుగంలో
గుండెలు విప్పి మాట్లాడుకొందాం."

కనుక శ్రీశ్రీని అనుసరించబోయే ఆగామి కవులు అతని కవిత్వంలో నీరక్షీర విభాగాలను చేసే శక్తి నలవరచుకోవాలి. అతను ఎన్నో క్రొత్త పోకడలు పోతాడు. ఎన్నో ప్రయోగాలు చేస్తాడు. అన్నీ అనుసరణీయాలు కావు. అన్నీ మాన్యాలు కూడ కావు.

"కదలేదీ కదలించేదీ
మారేదీ మార్పించేదీ

పాడేదీ పాడించేదీ
పెనునిద్దుర వదలించేదీ
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ"

ఏది అతని కవితలో వుంటుందో, అదే స్వీకార్యమని, మిగతాది "ఒక మహాకవి పోకిళ్ళు" అనే పేరున చరిత్ర చెత్త కుప్పపాలు కాక తప్పదని నేననుకొంటాను.

## 4

### అభ్యుదయకవిత్వ ప్రగతి :

అభ్యుదయ రచనోద్యమమనేది 1943 లో ఆంధ్రావనిలో స్థిరపడిన తర్వాత, యువకులనేకులు చేతనులై, సంఘశ్రేయస్సునూ, జగత్కల్యాణాన్నీ, పీడితజనులపట్ల సానుభూతినీ, అన్యాయాల యెడల ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ కవిత్వ మల్ల సాగినారు. నానాటికీ రాజకీయాలకు జాతీయజీవితంలో అత్యంత ప్రముఖస్థాన మేర్పడుతున్న రోజులలో, స్వాతంత్ర్య సంగ్రామగతి తీవ్రతరమయిన రోజులలో, జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ, కష్టజీవులశక్తి నిర్నిరోధమని తేలిపోయిన రోజులలో, సంఘచేతనులూ, ప్రయోజనాయుత సాహిత్యవాదులూ నయిన యీకవి కిశోరాలకు కావలసినంతకంటే అదనమైన కవితావస్తువు లభించింది. ఆనాటికే పరిణత మనస్కులై, సాహిత్యతపస్కులై యుండిన వారుతప్ప, తక్కినవారిలో హెచ్చుపాళ్లు సాధనచేసే ఓపికలేకనో, నిగ్రహించుకొనే శక్తిలేకనో, లేక అభ్యుదయ రచనాదర్శాలను సరిగా బోధపరచుకోనందుచేతనో, ఏకాగ్రతను పాటించనందుచేతనో, భావావేశము చొరబారినదే తడవుగా రచన కుపక్రమించినందుచేతనో, అనూరునివలె అసమగ్రాలైన, కళావిలసన దరిద్రాలయిన ప్రచారాధిక్యమే కలిగిన, భాషాసౌష్ఠవం నైదొలగిన గజిబిజి, అతివ్యాప్తి, అవ్యాప్తి, పునరుక్తిదోషాలు నిండిన రచనలు చేయసాగినారు. వీరి ఉత్సాహం మెచ్చుకోదగినదే కాని ప్రోత్సహించ దగినది కాదు. కాని యీ లోపాలన్నింటి తోటి గుణాలు లేక పోలేదు. సాహిత్యాసక్తి విస్తృతమయింది. పఠితృలోకం పెరిగింది. రచనా వ్యాసంగం ఎక్కువయింది తర్వాత, అన్నింటి కంటె పెద్దయిన మార్పు ఏమిటంటే, శ్రీ శ్రీ, సమస్తదేశాలకూ చెందగల సర్వసాధారణ సంఘటనలను, సకల మానవులు అనుభవించగల సర్వసాధారణ అనుభూతులను మట్టుకే వర్ణించి, ప్రత్యేక సంఘటనల జోలికి వెళ్ళకపోగా, యీ యువరచయితలు వాస్తవవాదదృష్టి సమగ్రమయ్యేలాగున, ప్రత్యేక విషయాలను కూడ కావ్యవస్తువులుగా స్వీకరించారు. శ్రీ శ్రీ సింహావలోకనమట్టుకే చేశాడు. గగనాన పోయే కృష్ణపక్షి కంటికి దిగువ గల అరలు విడివిడిగా కనుపించనట్లే శ్రీ శ్రీ కంటికి ముఖ్యంగా "మహాప్రస్థాన" గీతాలలో ప్రత్యేక సంఘటనలు కనపించలేదు. మరి యువకవులు శ్రీ శ్రీ అంతయెత్తున నిలిచి ప్రపంచాన్ని చూడలేదు. లోకవ్యవహారాలలో వారూ పాల్గొనసాగినారు; కష్టసుఖాలనుభవించ సాగినారు. లోకులతో మరింత సన్నిహిత బాంధవ్యం ఏర్పరచుకొన్నారు. అందుచేత శ్రీ శ్రీ దానికంటె వారి మేధస్సు మరింత సంపన్నమయింది; వారిదృష్టి మరింత సమగ్రమయింది; వారిచిత్రణ సత్యానికి మరింత

సన్నిహితమయింది; వాస్తవవాద కళా ధర్మాలకు మరింత న్యాయం జరిగింది. వీరు జనతా లోక సాక్షులయ్యారు; యుగ ఘోషను వినగలిగిన కర్ణేంద్రియాలయ్యారు; లోక వ్యవహారాలకు ప్రతిచలించగలిగిన నాడీమండలాలయ్యారు; జనమాన సానుభూతులను వెలువరించగలిగిన ముఖ ద్వారాలయ్యారు. అందుచేత అభ్యుదయ రచనారథం శ్రీశ్రీని దాటి చాలదూరం నడచివచ్చిందని చెప్పవచ్చును.

"మహాప్రస్థాన గీతాలు" పత్రికలలో విడివిడిగా ప్రచురితాలయినవి. అభ్యుదయ కవిత్వ ప్రథమ సంపుటి నిజానికి "నయాగరా." కృతికర్తలు ముగ్గురు, బెల్లంకొండ రామదాసు; ఏల్చూరి సుబ్రహ్మణ్యం; కుందుర్తి ఆంజనేయులు. కృతిభర్త అనిసెట్టి సుబ్బారావుతో కలిసి, వీరందరూ నర్సరావుపేటలో "నవ్యకళాపరిషత్తు"ను నడిపారు. వీరిని నలుగురినీ కలిపే ఏక సూత్రమొకటి వున్నప్పటికీ, యెవరిశక్తి వారిది, ఎవరిదారి వారిది. రామదాసులో పితూరీదారు, ఏల్చూరిలో సాధువు, ఆంజనేయులులో ద్రష్ట, అనిసెట్టిలో ప్రవక్త ఎక్కువ కన్పిస్తారు.

వీరందరూ తలవొకచోటకూర్చి "నయాగరా" వెలువరించారు (1944). జలపాతానికి అడ్డుఆపులు లేవు. వీరి కవిత్వానికి ఛందోనియమాలు లేవు. జలపాతంలో అంతర్లయ కద్దు. వీరి కవిత్వాన కూడ అది కద్దు. పసిఫిక్ యుద్ధరంగంనుండి మన్యం విప్లవం వరకు వీరిదృష్టి ప్రసరించింది. బర్మా అడవులూ, పారిస్ వీధులు, మాస్కో గేట్లు, చైనా లోయలు వీరి కవితలో ప్రత్యక్షమౌతాయి. సోల్జర్లూ, పైలట్లూ, టాంక్ డ్రైవర్లూ, కళ్ళకు కట్టుతారు. కర్షకులూ, కార్మికులూ, వెన్నువిరిచి పనిచేసికూడ ఆకలితో అలమటించేవారు, బిచ్చగాళ్లు, పసితనమందే పతి పోగా దిక్కుమాలిన కన్యలు – అరుస్తారు, ఓరుస్తారు, ఆక్రోశిస్తారు, ఎగబడుతారు. తిరుగబడుతారు, ధిక్కరిస్తారు, ప్రవహిస్తారు, ఘూర్ణిల్లుతారు, "మెరుపులు మింగేస్తారు." క్లుప్తంగా చెప్పాలంటే, ఇది సూత్రప్రధానమైన కావ్యసంపుటి కాదు – కావ్యప్రధానమైనట్టిది. ఈ కావ్యసంపుటి "గత లోకం కాల్చిందట, నవలోకం చూపిందట, నడకండని చెప్పిందట, నరాలు వణికించిందట, కండలు కదిలించిందట, గుండెలు మండించిందట, మేధస్సుకు రెక్కలు కట్టిందట, జీవితాన్ని విహంగం చేసిందట." సామాన్య జనానికి "నందన వన వసంతమందారం" కుసుమింపజేసింది. "సంఘానికీ వస్తు"న్న "కొత్త స్వరూపం" చూపింది. అది ఏదో కాదు – ఆత్మ విశ్వాసమూ, రాజకీయ చైతన్యమూ కైవసంగా సకలపీడిత వర్గాలనుండి ఆవిర్భవించిన శక్తి – ప్రజాశక్తి. "చీకటిలో పడి క్రుగ్గిన లోకానికి దూరపుతీరాల్లో మండే కాగడాలు" చూపించిన, "సంకెళ్ళను బందాలను త్రెంచెయ్యను నిప్పుల కత్తెరలను సృష్టించిన" నయాగరా కవులు "నియమపు రైళ్ళకు పట్టాలను" పీకేశారు. నిర్నిరోధమైన అంతర్లయతో కూడిన గద్యం పద్యంకంటె రసభసగమనంతో నడుస్తుంది. "ఆంధ్రశిల్పి" ఫిబ్రవరి '47లో తన కవిత్వం గురించి వ్రాస్తూ, శ్రీశ్రీ "ఛందోగమనం రైలుబండి నడకయితే, వచనగమనం విమాన విహారం వంటిది," అన్నమాటలు "నయాగరా"లోని నిర్నిబంధకవిత్వానికి సరిగా అన్వయిస్తాయి.

కాని తత్కాలానికి ఎట్టి సద్యోఫలితాలను కలిగించినప్పటికీ, సకల నియమోల్లంఘన శాశ్వత శ్రేయోదాయకం మట్టుకు కాదు. ఛందస్సనేది త్యాజ్యం కాదు – మాన్యమని గుర్తించడం స్వేచ్ఛను అరికట్టడం కాదు. నియమబద్ధమైన స్వేచ్ఛ నిర్నిబద్ధమైన స్వేచ్ఛకంటె వేయిరెట్లు గొప్పది. ఒకటి సుందరమానవ లోకము వంటిదయితే, వేరొకటి నిత్యము సంఘర్షించే మృగలోకం వంటిది. "నయాగరా" కవులందరిలోనూ ఈ ఆవేశపరత రామదాసును ఎక్కువగా లోగొన్నదని చెప్పవచ్చును. ఆవేశం హద్దుమీరిపోయినప్పుడు ఉన్మాదంగా పరిణమిస్తుంది. హేతుబద్ధమైన, క్రమానుసారమైన ఉద్రేకం సహజమైనది కాగా, ఫలాఫలాలను ముందు వెనుకలను గమనించక సాగే ఉద్రేకం ప్రమాదకరమైనది. దీనిలో నిర్మాణంకంటె విధ్వంసం పాళ్ళెక్కువ. ఉచితోక్తి కంటె అతిశయోక్తి పాళ్ళెక్కువ కనుకనే రామదాసుగారికి, ఆలోచించిన అలంకారాలు, రసౌచిత్యాలు, పదౌచిత్యాలు, ప్రయోజనాలు, శైలులు, బిగువులు, ఇత్యాదులన్నీ అర్థంలేని పిచ్చినమ్మకాలు; కవిత్వానికి శత్రువులు,"గా కనిపించాయి. రామదాసుగారు తెగడినవన్నీ మనపూర్వులు ఎంతో వివేకపరులై కల్పించి, మనకుగాను సంక్రమింపజేసిపోయిన నిస్తులమైన వారసత్వము. అవసరమైనదానిని గ్రహించి, అనవసరమైదానిని వర్జించడమే అభ్యుదయదృష్టిగల మేధావి కర్తవ్యంకాగా, రామదాసుగారు సమస్తాన్నీ నిరాకరించారు. అహంభావమనేది తప్పుకాదు. అది అత్యవసరమైనది. తనను సంఘంలోని యితరులనుండి వేరుచేసి, తనకూ, వ్యక్తిత్వమున్నదని తెలియజేసేదే అహంభావము. కాని యిది అతిశయించినప్పుడు, అహంకారంగా మారుతుంది. సంఘమూ, వ్యక్తీ పరస్పరాశ్రితాలు, పరస్పర పోషకాలు. వ్యష్టి సమష్టిని గౌరవించకతప్పదు. లేకుంటే వ్యక్తి సంఘశత్రువు కాగలడు. అట్లాగే వ్యక్తి ప్రత్యేకతను సమష్టి గౌరవించక తప్పదు. లేకుంటే సమష్టిపుష్టి లోపిస్తుంది. కనుక అభ్యుదయ కళాకారు డెల్లప్పుడూ వ్యష్టిని సమష్టిలో లీనపరుస్తాడు. ఈ సమ్మేళంలోనే మానవ జీవితానికి మహత్త్వమూ, సార్థక్యమూ, సంశ్రేయమూ ఘటించగలవు.

"నయాగరా" కవులు సాంఘిక వర్గకలహ సాహిత్యసృష్టి కావించారు. శ్రీ శ్రీ యెన్నుకొన్న రథచక్రాలవంటి సంస్థలను విడచి, వాస్తవంగా జరిగిన పసిఫిక్ యుద్ధం, మన్యంలో తిరుగుబాటు, ఠాకూర్ చంద్రదాసు లేవదీసిన పితూరీ వంటి ప్రత్యక్ష, సమీప సంఘటనలను వస్తువుగా గ్రహించారు. అంటే, శ్రీ శ్రీ కల్పించింది వాతావరణం మట్టుకే కాగా, "నయాగరా" కల్పించింది ఆ వాతావరణంలోని స్థూలరేఖలు (outlines). వారిచేతులలో నిలిచాయి "దూరపు తీరాల్లో నుండే కాగడాలు."

అనిశెట్టి సుబ్బారావుగారిని యీ "నయాగరా" కవుల సరసనే నిలబెట్టాలి. కాని వారందరిలోనూ లేని ప్రత్యేకగుణం అనిశెట్టి కవితలోవుంది. నిజానికి అనిశెట్టి ప్రత్యేక కూటమికి చెందినకవి. అభ్యుదయ కవులందరూ ఒకటి, అనిశెట్టి ఒకటి. ఇతరులనుండి అతనిని ప్రత్యేకించే లక్షణం యితరులకు లేని, లేదా చాలని, అతనిలో నిండుగా అంతర్వాహినిగావున్న తాత్త్విక

దృష్టి. తాత్త్వికదృష్టి అన్నంతనే అతడు భావవాది (Idealist) అనిగాని, మర్మవాది (mystic) అనిగాని, పొరబాటు పడకూడదు. తాను వర్తమాన సంఘటనలనే కావ్యవస్తువులుగా గ్రహించాడు; తాను ఆవేశముతోటి నిలువెల్ల కంపించిపోయాడు. కాని ఈసంఘటనలన్నింటిలో చిరకాలానుగతమైన సూక్ష్మవిషయాలనుకూడ దర్శించగలిగినంతగా తన మనశ్చక్షువునకు పదను పెట్టుకొన్నాడు. ఆవేశ ప్రవాహంలో కొట్టుకొనిపోయి, కుహనా ప్రచారాన్ని చేపట్టలేదు; కావ్యసౌందర్యానికి వ్యాఘాతం కలిగించలేదు. అతని ఆవేశం క్రమానుబద్ధంగా నడుస్తుంది. సత్యాగ్రహమవుతుంది. తానూ ఏఛందోనియమాలను పాటించకపోయినా అతనిగీతాలు ఒడిదుడుకులు ఎరుగవు. గొంతు ఒకసారి కీచుపోయి, మరొకసారి కొరుకుపడదు. భాష భావాన్ని, భావం భాషను అంటిపెట్టుకొని వుంటుంది. అనిశెట్టి నాడి మొద్దుబారనూలేదు, విలవిల కొట్టుకోనూలేదు. అందుచేత అతనిలో స్థిమితబుద్ధి (Calm thinking) విమర్శాశక్తి (Critical foculty), కళాదృష్టి, తత్వజిజ్ఞాస సమనిష్పత్తిలో వున్నాయని చెప్పవచ్చును. "ఆద్యంత రహితమైన ప్రాణవాహినికి మార్గాన్వేషులైన రెండు చైతన్య తరంగాలు: తత్వశాస్త్రం, కవిత్వం. ఇవి మానవుని విజ్ఞాన నేత్రాలు. ఈ సుందర నేత్రాల కాంతిలో లోక జీవిత రహస్యాలను శోధించాలి. నేను కాంతి ఒక్కటే చాలదు. ప్రచండమైన ఉష్ణోగ్రత కూడా కావాలి", అని తన కవిత్వానికి వ్యాఖ్య చెప్పుకొన్నాడు. కాని అనిశెట్టిలో పోనుపోను వేడి తక్కువై తత్త్వమెక్కువయింది. నిదర్శనంగా, కరుణ, జాలి, శాంతి, సత్యము, చైతన్యము వంటి పదప్రాబల్యం. నేటి సంఘటనలలో నిత్యధర్మాన్ని చూచిన అనిశెట్టి. క్రమంగా నిత్యధర్మాది దూరవిషయాలకే ప్రాముఖ్యాధిక్యత యిచ్చినందుచేత, అతని కవిత్వం అవాస్తవికంగా కనుపిస్తుంది. వర్తమాన కాలావసరాలను నిర్లక్ష్యం చేయుడు. కాని యీగాని మార్పు అనాదినుండి అనంత కాలంవరకు సాగిపోతుంది. విజ్ఞానోదయ వేళనుండికూడ మానవునికి లొంగక, విప్పబాటు కాని మర్మాలు, సమస్యలు యితని నాకర్షిస్తాయి. తాను మకుటం తొడుగుతున్న మానవుడు నిర్గుణుడు కాడు; శక్తివంతుడు, వివేకి, ప్రకృతి మర్మవిచ్ఛేదన దీక్షాపరుడు; పురోగమనశీలి.

అనిశెట్టి కవిత్వంలో పైన పేర్కొనబడిన గుణాలు అతిశయించినందుచేతనే, లోపం కలుగుతున్నది. పదాలను చాల పొదుపుగా వాడినందుచేత, అవ్యాప్తి ఏర్పడుతున్నది. అతివ్యాప్తికంటె అవ్యాప్తి కవిత్వానికి ఎక్కువ అన్యాయం చేస్తుంది. తాను పాఠకులకు అందచేయ దలచుకొన్న అగాధ రహస్యం వంటి అర్థంసులువుగా అందదు. మరొక లోపమేమిటంటే, అతని పదజాలం చాలమట్టుకు భావకవిత్వయుగానికి చెందినది. అందుచేత తాను చెప్పదలచుకొన్న క్రొత్త విషయాలను పాత మాటలు సరిగా తెలియచేయలేవు. వుండకది. అనిశెట్టి కావ్యవస్తువు చాలమట్టుకు సుదూరమయినది. అప్రస్తుతం అనవసరం కాకపోవచ్చు కాని వర్తమాన విషయాలపట్ల నిర్లక్ష్యాన్ని కలిగించి పెడత్రోవలకు పఠితలను మరలించ కలుగవచ్చును. అనిశెట్టి కవితలో మరొక లోపమని సాధారణంగా ఎత్తి చూప

బడుతున్న 'అహం' భావము నిజానికి స్వాతిశయం కాదు. "నేను"లో అతను మాటేది తనకే కాదు – కవులనందరినీ. కవి ధర్మాన్ని గురించి, సంఘ పురోగతిలో కవులకున్న ప్రశస్త పాత్రను గురించి, అనిశెట్టి యీ "నేను" ద్వారా వెల్లడి చేస్తాడు.

"వచ్చాను వచ్చాను వ్యాస సంతతివాణ్ణి
వెళ్ళిపోయే కోటి కోట్ల జీవుల విడచి
పుట్టవచ్చే కోటికోట్ల జీవులకొరకు...
ఈ జగతిలో నూత్న జగతి పెకలిస్తాను"
"పసిగాత్తుకొని గుండె నొత్తుకొని
ప్రజలలో
ఏకమై కదలి వచ్చాను"
"మీతో నెవ్వుంటాను మీతోనె వస్తాను
అడుగడుగునా మీకు అండగ
నిలుస్తాను."
"జీవిత సత్యజ్వాలా కీలాంగుళి స్పృశించి
నా తనువు వీణ మీటిన
నిలువెల్ల ప్రకంపిస్తున్నా."
"సమర హృదయం నేను."
"భువన భవనమున చీకటి పునాది
పెకలిస్తాము."

వంటి చరణాలను బట్టి "నేను" "మేము"కు పర్యాయపదంగా సమూహ వాచకంగా, వాడినాడని తెలుస్తుంది.

అనిశెట్టి దృష్టికి సమస్త జనతాలోకం మహాయాత్ర చేస్తున్నట్లు, దారిలో ఆకలి, రోగం, పేదరికం వంటి అవాంతరాలు అడ్డువస్తున్నట్లు, కొందరు కూలిపోతున్నట్లు, జీవచ్చైతన్యము విషాదాంతమా అనే భ్రమ కలుగుతున్నట్లు, కాని "రాత్రి మహాదంధకారము పల్చబడి" కాంతి ప్రవహించబోతున్నట్లు తోస్తుంది.

"ప్రాణముప్పొంగినది
పగలు దిగివచ్చినదిలే ప్రభలతోడ"

యావత్ప్రకృతి మానవునికి స్వాగత సంగీత మాలపిస్తుంది.

"ప్రళయంలో బద్ధలైన
భస్మశకలమైన శూన్య
క్షోణీతల ముఖికను
క్షీణ క్షీరసాగరములు
రారా ఓ మానవుడా!...
హిమశృంగోత్తుంగ ఫాల
హేమదీప్తి నీరాజన
మింద్రధనః కటకహస్త
మెత్తెనురా ధాత్రి నీకు
రారా ఓ మానవుడా...
కాడు లేని స్వర్గమిచట
కట్టితిమయ్యా నీకై !
అవతరించె శుభావని !
యవనికనై కెక్కెను రా!...
నవయుగ చైతన్యవాణి
నాంది పఠించెను నీకై
రారా ఓ మానవుడా!"

ఢమరుకమై భువి దద్దరిల్లుతూ వుంటే, బుసలిడుతూ విష ఝుంఝులు పార్లి వెళ్ళి పోతుంటే, ప్రతి ఒకడూ శివుడైన నవయుగాన, భూతకాలగళము మరిగి కాలకూట విషమూ విరుగైపోయింది; వర్తమాన కాలము ప్రళయ రుద్రుని త్రేతాగ్ని శిఖల ప్రజ్వరిల్లుతూవుంది. భావిమకుట దీప్తులు కననౌతున్నవి. పతిత ప్రజలగుండె పరిఫుల్లమయింది. ఆకాశమూ, అవనీ పుర్రూతలూగినవి. ఈ "కనులు పగులు పట్టపగలు" పూట, తాడిత భూవదనంపై నీడ నిష్క్రమించింది."

"సమధర్మం నిమ్నోన్నత
ములను కౌగలిస్తోంది!

సంగీతంగా కాలం
ప్రగతికి ప్రవహిస్తోంది"

అనిశెట్టి వ్రాసిన సమరకవిత్వం పటుతరమైనది. కూడూ, నీడా లేని "అనాథ జగత్సహోదరుల" నుద్బోధించి, లోకపు సిరిసంపదలకు, సౌందర్యానికి వారికీ హక్కు వుందని,

"శ్రామికుల శిరస్సులతో
బంతులాడు పాలకులను
ప్రగతి చక్ర ఘట్టనతో
సంహరించ వలెనురా!
"నరుల కవని చెరసాలగ
పడతికిల్లు సమాధిగా
బంధించిన కిరాతకం
పటాపంచ లౌనురా!"

అంటాడు. భూమినీ, పురుషునీ విభజించి పాలించే క్రూరులకు వ్యతిరేకంగా రైతుల నుద్బోధిస్తూ, "తొలి కాయు తొలిపోయి కలిశాయి రండి" అని పిలుస్తాడు. "నవభారతి" అనే మహాగీతికలో, కాశ్మీరు ప్రజా స్వాతంత్ర్యసంగ్రామాన్ని అభివర్ణించాడు. రంగాలు కరువుకు విలపించాడు. మతకలహాలను తెగనాడినాడు. "అణువు బాంబు" అనే మహాగీతికలో అణుశక్తిని మానవాభ్యుదయానికి వినియోగించాలని చాటాడు. గురజాడ, దువ్వూరి, శ్రీశ్రీల సమర వ్యతిరేక గీతాలకు యీ గీతిక గర్వించదగిన వారసత్వం పుచ్చుకొంది. "దుమికే మెరిసే మోగే, వివిధ రాక్షసాయుధాలు — మానవుడు సహించడింక."

"అణువులతో ప్రకృతి జీవప్రవాహాన్ని
నడుపుతోంది!
అణుసౌందర్యాద్భుతపు జీవనావ
నడుపుతోంది!...
..............నవప్రాణాగార :
వర్షాత్ వర్షాత్ వలపుల ప్రకృతి
శోభానృత్యం
అనంతమానవకోటికి ఆదర్శం
చూపుతోంది."

ఈ ప్రకృతినుండి యీ పాఠాన్ని నేర్చుకొని, అణుశక్తిని "మానవ విజ్ఞాన గోపుర కలశంగా" ఎంచి మంగళగీతిగా ప్రయోగించాలి.

"మానవుడా!
చరిత్ర పవిత్ర సంగీతంలో
అధిరోహణ దశలో
నీ అడుగులతో తప్పెటతాళం
వెయ్యకు."

◆ ◆ ◆

## 5

ఆరుద్ర వ్రాసిన "త్వమేవాహమ్" ఆంధ్ర కవిత్వంలో అపూర్వమైన కావ్యం. ఆరుద్రగారిది "విలక్షణ గొంతుక" కవి సమయాలలోను, వస్తువులలోను, ఛందోనియమాలలోనూ సాంప్రదాయాల్ని కవి ఛిద్రం చేశాడు. ప్రాచీన అలంకారాల్ని వదిలి సమకాలీన నాగరకతను అపఘాతం చేసే పదచిత్రాల్ని (Figures of Speech) విశేషంగా వాడాడు. అంతేకాదు. తాను జీవిస్తున్న యుగంలో స్ఫూర్తిగా సజీవంగా వున్న వ్యక్తిగతానుభవాల రీతుల్ని అనుభవ ప్రకారాల్ని, నవీన స్వేచ్ఛాయుత జ్ఞానేంద్రియ వ్యాపారాల్ని ఖచ్చితంగా వ్యంజించాడు. అభేదల్ని (Associations) సంజ్ఞల్ని (Allusiom) విశేషంగా వాడుతూ తన శిల్పాన్ని బలవత్తరం చేసుకొన్నాడు. చమత్కారంతో పాఠకుణ్ణి చప్పున ఆకర్షిస్తాడు. అతనిచే అర్థాన్వేషణ

చేయిస్తాడు" అంటున్నారు ప్రకాశకులు. తాను 'టెక్నిక్' లేని కవిత్వాన్ని వూహించలేడట ఆరుద్ర. తానీ వాక్యాలను నాటకరీతిలో వ్రాశాడట. "వివిధ వ్యక్తుల భావాలనీ, సందేశాలనీ ఆరుద్రీకరించి ఒక్కొక్క రీతిగా పాత్రోచిత ఛందస్సులో చెప్పించాను" అంటున్నాడు. ఆరుద్ర సంప్రదాయాల్ని ఛిద్రం చేయడమయితే సులువుగా చేశాడు కాని మరో సంప్రదాయాన్ని నిర్మించలేడు. తాను వాడిన "కవిత్వ హ్రస్వలిపి" బోధపరచుకో గలిగితే, త్వమేవాహం" బోధపడగలదు. కాని ఈ హ్రస్వలిపిని బోధపరచుకోవడ మెట్లాగనేదే చిక్కు. దీనికి పూర్వాపరాలు లేకపోయినందుచేత, యిది దురవగ్రాహ్య మవుతూంది. అదిన్నీగాక యింగ్లీషు - తెలుగు పద సాంకర్య బాహుళ్యంవల్ల ఆరుద్ర కోని తెచ్చిన తిరుగుబాటు పఠితృలోకంలో ఆమోదం పొందలేకపోయింది, నన్నయ భట్టు సంస్కృత క్రియాధాతువులను తెచ్చి కొద్ది మార్పులతో వాటికి తెలుగుదనం ఆపాదించగా తప్పు గానిది, తాను యింగ్లీషు నుండి తెచ్చి కల్పిస్తే తప్పేమిటని ఆరుద్రగారు అడుగుతున్నారు. సంస్కృత మొకప్పు డెప్పుడో తెలుగుకు పరభాష అయివుండిందేమోగాని పోను పోను అది యావద్భారత కావ్యభాష అయింది. హిందూ మతంతోటి, మహా సామ్రాజ్యాలతోటి అది అల్లుకొని పెనవేసుకొని పోయింది. దేశభాషల ఆదిమ స్వరూపానికి అది ఎంత హాని చేసిందో, అంత సంపన్మయమూ చేసింది. తెలుగు కన్నతల్లి అయితే సంస్కృతం సవతితల్లి అయింది. కాని ఇంగ్లీషునూ తెలుగునూ

రాశికీ దానికీ వున్న సంబంధమే ఎక్కువ కాని ఆత్మీయ భావ మెందునా లేదు. కాబట్టి ఆరుద్రగారి సమన్వయ సమంజసమనిపించదు. "ఏంగ్జయిటీ", "కన్ ఫ్యూషన్," "రాస్టుఁడు," "రవండి," "టూవేస్విచ్" వంటివి వర్తమాన నాగరకతా స్ఫోరకాలేమో కావచ్చు కాని అవి ఆంధ్ర జాతీయ సంస్కృతీ సంప్రదాయ విచ్ఛేదకాలైన ప్రయోగాలు మట్టుకు నిస్సందేహంగా అవును. వైచిత్రియే సౌందర్యమనుకొని చిత్రవిచిత్ర గతులన్వేషించితే ఫలితం వైచిత్రి కాదు - భాషా సంప్రదాయ వికృతి. అంతే కాదు. అధివాస్తవిక కవితారంభకులలో ఒకరైన ఆరుద్రగారికి ఆ వాసనలు పూర్తిగా పోలేదు. ఒకదానితో మరొకదానికి సంబంధంలేని ఆలోచనలు అరాజకంగా ఎగబడి కాగితాలమీదికి ఎక్కినవి.

"చెట్లు చిట్టెలుకలు
కాకి మెడ నుసిరంగు
సున్న తెలుపు దూది తెలుపు
చెట్లు చిట్టెలుకలు
చిన్న చిన్న చీమలు..."

"చెయిన్నులేని మగాళ్ళముందు నిటారుగా నించొని తనబట్టలు నింపాదిగా తాపీగా ఒలచుకొని, నిస్సిగ్గుగా నిలుచునే", నీతిమంతురాలివైనే యీ ఆలోచనలు కూడ నిరునిపాటించవు.

ఆరుద్ర చాల శక్తివంతుడైన భావుకుడు విమర్శదృష్టి సంపాదించిన మేధావి, వక్రోక్తి పరతలో మహాసమర్థుడు. కాని యీగుణాలన్నీ పెడత్రోవలు పట్టాయి. రాజకీయ వైయాకరణివలన పరిష్కారం వైకల్పిక మయినందుచేత, గణితం సమస్యాపరిష్కారానికి పనికిరాగలదంటూ, పైథాగొరాస్

ధీరం ద్వారా మార్క్సువాదాన్ని నిరూపిస్తాడు. "బలవంతమైన సర్పము చలిచీమల చేతజిక్కి చావదె" అనే నీతిని తీసుకొని, ఆశారేఖాగణితం ప్రకారం ఒక త్రికోణాకృతిని నిర్మించి, అడుగుభుజం చలిచీమల వంటి, సంఘానికి పునాదిఅయిన, సమస్తాన్నీ వుత్పత్తిచేసే, సాదా మనుషులని, ఈ వుత్పత్తిమీద ఆధారపడే సర్పాలవంటి దోపిడీవర్గాలు వున్నాయని, ఇది లంబమని, ఉత్పత్తిచేసేవారు, ఫలితాలు దోచేవారు అనే యీరెండు భుజాల సంఘర్షణవలన యేర్పడే ఫలితం యీభుజాల కర్ణంమీది చతురస్రమవుతుందని అంటాడు. ఇక్కడ గతితార్కికవాదాన్ని చేబూని, Thesis, Antithesis ల సంఘర్షణ ఫలితంగా "నూతన అవస్థ", "పునీతవ్యవస్థ", Synthesis కాబోతుందని "సింథటిక్ చింతను ధరించిన" యీకవి అంటున్నాడు. ఈ విధంగా, ఆరుద్ర, శ్రీ శ్రీ అన్నట్లు, మన ఆలోచనా విధానాలను సామ్యవాదానికి అనుకూలంగా మారుస్తున్నాడు. కాని అతని బోధనామార్గం చాల బాధాకరమయినది. ఆరుద్రగారి ఆశయాల నిజాయితీని ఎవ్వరూ శంకించరు కాని అతను చెప్పేతీరు సామాన్యులకు బోధపడనిది. ఆరుద్రకు హృదయానికంటె మేధస్సుతో ఎక్కువపని. కాని కవిత్వానికి హృదయంతోటే ఎక్కువపని. కవికోకిల రామిరెడ్డి అన్నట్లు, Heart (హృదయం) అంటే His Excellency Art. ఇది వేళాకోళంగా త్రోసిపారేయవలసిన కవిత్వం కాదన్నప్పుడు శ్రీశ్రీతో ఏకీభవించవచ్చును. కాని ... "రీతివాదులు (ఫార్మలిస్టులు) టెక్నిక్ లేని కవిత్వాన్ని ఊహించలేమంటూ- టెక్నిక్ నీ కవిత్వాన్నీ రెండుగా విడదీస్తూ - టెక్నిక్ పేర పాఠకుణ్ణి దిగ్భ్రమలో ముంచే సాముగరిడీలు చేస్తూ-అభ్యుదయ కవిత్వంలో రామరాజభూషణుణ్ణీ జేమ్సుజాయిస్ నీ పునఃస్థాపిస్తూ - అర్థప్రేరణ చేయనిమాటల కూర్పుతో కవిత్వాన్ని నింపడంవల్ల వీరుకూడా కవిత్వం సాధించే ఉత్తమ ప్రయోజనానికి దూరమయ్యారు," అన్న సోమసుందర్ తో కూడ ఏకీభవించకుండ వుండలేము. నిష్ప్రయోజకాలు అనర్థదాయకాలు అయిన యీ విచిత్ర ధోరణులు ఎవ్వరి ఆమోదాన్ని పొందలేకపోయినా, ఆరుద్రగారు "జీర్ణమంగే సుభాషితమ్" వంటి గేయ సంపుటులలో వాటిని అంటిపెట్టుకొనే వున్నారు.

"అఇ ఉణ్ బుఱ్ఱ ఋక్
అందవే హాత భుక్
క ఖ గ ఘ ఙ
కష్టాలకు సంజ్ఞ
చ ఛ జ ఝ ఞ
చావుకు అనుజ్ఞ ... "
"ఎన్నాళ్ళు?" వెంటతరమగా
"ఇంకా నా?" ఒళ్ళుకుతురుమగా
"ఎక్కడలు" వర్షించి
"ఎప్పుడులు" దట్టించి
"ఎందుకులు" రెట్టించి..."

ఇటువంటివి తాను చెప్పదలచుకొన్న దానికి సహాయకాలు వాహకాలు కాకపోగా ప్రతిబంధకాలౌతాయి. కాని వాటిమీదనే ఆయన మోజు. ముఖ్య విషయాలకు తేలికదనం ఆపాదిస్తాయి. చమత్కారాలలో అసలు బోధ అణగారిపోతుంది. వికటధోరణులతే కళ్ళను, చెవులను కొట్టవస్తాయి కాని లోపల హృదయమార్దవం ఆవేశతీవ్రత బయల్పడవు.

ఆరుద్ర తర్వాత ఎన్నదగిన అభ్యుదయ కవి సోమసుందర్. ఆయన "వజ్రాయుధం", "కాహళి", "గోదావరిజల ప్రళయం" వంటి కావ్య సంపుటులు వ్రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి సచ్ఛాత్రు డయినందు చేతనూ, పుట్టుకతోటి హృదయమార్దవం కలవా డయినందు చేతనూ, భావకవిత్వ పాఠశాలనుండి నేరుగా అభ్యుదయ కవిత్వలోకంలోకి దూకిపడినందు చేతనూ, యితని కవిత్వంలో రెండు ధోరణులు కౌగిలించుకొని వుంటాయి. హేతుబద్ధాలుకాని అరాచక పితూరీల నొల్లని సోమసుందర్ మన అనూన ప్రజాతంత్ర సాహిత్య సంప్రదాయాన్ని - ధూర్జటి, పోతన, భర్తృహరి, శ్రీనాథాదులు కొనసాగించిన దానిని - గౌరవిస్తాడు. పచ్చి రాజకీయ నినాదాలబోర్డులవంటి "ప్రజా" కవిత్వం పేర సలాముకీ అయ్యే ప్రచార సాహిత్యాన్ని గాని, రాజకీయాలను ముట్టుకొంటేనే కావ్యకన్య మైలపడుతుందనే "నిరంజన కళావాదాన్ని" కాని ఆయన ఒప్పుకోరు. పోగా, ఈ రెండుకోణాలకు భిన్నమై, సమన్వయమైన మధ్యమార్గ మొకటున్నదని, అదే కవిత్వమని ఈ రెండు ధోరణులూ విస్మరిస్తున్నాయి. కనుకనే వీరి ధోరణులవల్ల అనుస్యూతమైన మన కవితా సంప్రదాయం ఆచరణలో భగ్నమవుతున్నది; హృదయ సంబంధిగా మానవ రసావేశ ప్రేరేపకంగా ఉండాల్సిన పరమ ప్రయోజనం భంగపడుతున్నది",అని తన దృష్టిని వివరించాడు. ఇవి కాగితంమీదికి ఎక్కాయికూడ. "అలంకారాలు, కవి సమయాలు, సాంకేతికాలు, రాయప్రోలు, బసవరాజుల ధోరణులు కన్పిస్తూ, ఇతని రచనలు భావకవిత్వానికీ, అభ్యుదయ నోరణికీ వంతెన వేస్తున్నవా అనిపిస్తుంది", అని పిల్లలమర్రి హనుమంతరావుగారు వ్రాశారు. ఈ భావకవిత్వ శేషాలుచూచి, సోమసుందర్ "గతకాలపుబూర్జువా భావకవిత్వ ప్రభావాలనుంచి పూర్తిగా బైటపడలే"దని కొందరు విమర్శించారు. ఈ విమర్శ కవికి అన్యాయం చేస్తుంది. భావకవిత్వాన్ని అంతటినీ నిరాకరించడం ఆరోగ్యవంతమైన దృక్పథం కాదు. గోణంక అప్పలస్వామి గారన్నట్లు, "ప్రకృతిలో గల రామణీయకతను, ప్రణయ మాధుర్యమును, ప్రేమ మహత్తును, భావకవిత్వం రసమయం చేస్తుంది." ఇవేవీ అభ్యుదయ కావ్యవస్తువులుగా వెలికావు. కాని సోమసుందర్ కూడ వీటికి అనుచితమైన ప్రాముఖ్యమేమీ యివ్వలేదు. వర్గసంగ్రామాన్ని, అంతర్జాతీయ కల్లోలాల్ని, సంఘన్యాయాల్ని సోమసుందర్ ఎంతో పటుత్వముతోటి చిత్రించాడు. అతని కావ్యాలు కొన్ని పోరాటాలనడుమ పనిపోతున్న ధర్మవీరుల పెదిమలమీద, పోరాటాలకు కదలిపోతున్న వారి జిహ్వాలమీద, తాండవించాయి. కొన్ని కొన్నిపట్ల యితను అసాధ్యమయిన భావాన్ని అతిసులువుతోటి సాధిస్తాడు, కాని మరికొన్నిపట్ల ఆయన ఏరుకొన్న పదాలు, భావ భరాలయినప్పటికీ, వెగటు పుట్టిస్తాయి. "నీ హృదయం నెత్తురుచిందిన గడ్డ" వంటివి చెవులను బాధిస్తుంది. "ఒక మెలకువ ఒక్క వెలుగు" హాయిగొల్పుతుంది. "యుగ ధర్మం చైతన్యం, జనహృదయం పోరాటం;" "నిన్నా నేటుల కృషియే రేపై జన్మించుతుంది;" "ఉన్న దొక్క జీవితమే; మానవునిగ, వీరునిగా బ్రతుకుము నరుడా;" "తెలుగుగడ్డకు దీర్ఘ హేమంతమంతమై, నవ

యుగోజ్జ్వల సౌఖ్యావాసంత మరుదెంచు;" "ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు;" "జనగామములో జమ్మికొమ్మపై కెక్కాడు," అనే చరణాలలో భావకవిత్వ యుగ ధోరణులను నిలువున దోచుకొని అభ్యుదయ కవిత్వయుగాన్ని సోమసుందర్ ఎలా సంపన్నం చేశాడో కనిపిస్తుంది. కవులందరూ ఒకే ఒక్క తీరున ఆలోచించడం పడదు. ఎవరిదారి వారిది. అప్పుడే కవిత్వం సంపన్నం కాగలదు.

రమణారెడ్డిగారి "అడవి" అసమగ్ర ప్రయత్నం. నడకలో తేడివలె సెలయేటివలె పరుగిడినా, అతని గీతాలలో భావానికంటె పదాలకు ఎక్కువ విలువనిచ్చాడు. కొన్నిచోట్ల యీ పదాల సముదాయం క్రింద భావం నలిగిపోతుంది. భావాలకు పరిపూర్ణతకూడ రాలేదు. విప్లవాత్మకమైన మార్క్సిజాన్ని బౌద్ధమతంతోటి, క్రిస్టియన్ మతంతోటి సమాధాన పెట్టబోయినప్పుడు విఫలమనోరథుడయ్యాడు. ఈ లోపాలు ముఖ్యంగా "ధ్వని" అనే భాగంలో కనిపిస్తాయి. మొదట ఛందోనియమాలను పాటించకపోయినా, పోనుపోను వస్తువుకు అనుగుణమైన కొన్ని నియమాలను పెట్టుకొన ప్రయత్నం చేశాడు. వర్తమానకాలమందు మానవజీవితం అరణ్యప్రాయంగా వుంటున్నందుచేతనే యీ కావ్యసంపుటికి పెట్టిన పేరు సార్థకమయింది. "అడవి" అనే భాగంలో అతను వ్రాసిన గేయాలు ఫరవాలేదు. మొత్తంమీద యీ కావ్యసంపుటిలో రమణారెడ్డి శబ్దముగ్ధుడుగానూ, గాఢవర్ణ సమ్మోహితుడుగాను, గాంభీర్య మూరుడుగాను, దంభపదప్రియుడుగాను కనుపిస్తాడు. శబ్దమూ, వర్ణమూ, దంభమూ విడిచిపెట్టక, వాటికి జతగా లోపించినట్టి నిర్మాణ గాంభీర్యగుణాలకొరకు యిటీవల రచనలలో ప్రయత్నిస్తున్నాడు. ఏప్రయోజనానికయినాగాని భాషను వికృతం చేయకూడదంటాడు. కాని పాషాణపాక ప్రభువు కానిష్టంలేదు. నడిమిదారి కలదని నమ్ముతాడు. దేశిచ్ఛందోరీతులలో సులభ గ్రాంథిక శైలిని అనుసరించి కావ్యాలు వ్రాసేయెడల, పాండిత్య ప్రకర్షకుగాని, శబ్దాడంబరానికి గాని తావుండదంటాడు.

గంగినేని వెంకటేశ్వరరావుగారి "ఉదయిని" వీర విషాద రసోద్రిక్తమైన కావ్య ఖండికా సంపుటి. రమణారెడ్డిగారి "అడవి" భాగంలోను, సోమసుందర్ గారి "వానిసల దండయాత్ర" భాగంలోను, ఆరుద్రగారి "ప్రవాహదశ" భాగంలోను స్థూలరేఖా చిత్రంగా బయల్పడిన ఆంధ్ర జాతీయ మహాసంగ్రామ కవిత "ఉదయిని"లో ప్రస్ఫుటంగా సూక్ష్మాంశ చిత్రణతో సహా వెలువడుతుంది. రమణారెడ్డిగారు చిత్రించిన "పాశవిక రాత్రి" సోమసుందర్ గారిలో "ఒక మెలకువ ఒక్క వెలుగు"గా వేగి, ఆరుద్రలో కాంతి ప్రవాహ మారంభమవుతుంది. కాని "ఉదయిని"లో రక్తపతాక వలె ఎగిరిన సంగ్రామ భానూదయం దుర్నిరీక్ష్య మధ్యాహ్నవేళా మార్తాండమూర్తిగా పరిణమిస్తుంది. అందుచేత "ఉదయిని"ని యీ తరహా కవిత్వానికి శిఖరప్రాయంగా ఎంచవచ్చు. ఆ మహోద్యమంలో కవి స్వయంగా బాధలనుభవించాడు. అదే చాలదు. ఆయన చైతన్యం నిరుపమానమైనది. చిత్రణాశక్తి అపారమైనది. గుండెలు ఘూర్ణిల్లేటట్లుగా, నయనాలు జలపాతాలయ్యేటట్లుగా, ప్రతీకారదీక్ష గర్జించేటట్లుగా పాఠకులను చలింపచేయగల శక్తివుంది. ఈ ఫలితం సాధించేందుకు

కవి వుపయోగించిన సాధనాలు ఆంధ్ర కవిత్వంలో అపూర్వాలని చెప్పవచ్చును. గంగినేని చేసిన నూత్న ప్రయోగాలు ప్రయోగస్థాయి దాటి సఫలాలైనవి. "ప్రియుడు ప్రియురాలికి," "తల్లి తనయునికి, బహిరంగ లేఖలు", వంటిచోట్ల యీ క్రొత్త తెన్నులు కనుపిస్తాయి. అంతే కాదు. గంగినేని వాడుకచేసిన అలంకారాలు కూడ అపూర్వమనోహరాలని చెప్పవచ్చు. "హాత్యలు అబద్ధాల మధ్య జూలు విప్పే తూరుపుకొండ;" "పగవంటి పులి పంజావంటి ఎండ," "కొరివివంటి ఎర్రని పిడికిలి", "నాకు స్వాగతం చెప్పడానికి పధ్నాలుగు ప్రపంచాల్ని పిలిపించు;" "ఎర్రని ఆకలి కడుపులు కప్పుకొని పండుకొన్నాం;" "చిరిగిన సహోదరీ, చితికిన సహోదరా! సకిలించిన సంగ్రామం, గర్జించిన తుదిసమరం," "పారి పారి కళ్ళు ఎడారులైన చెల్లీ;" "మీ ఆశలు అల్లుకొను మీ గుండెలు నాటుండి! మీ ఆదర్శాలలుముకొను మీ కండలు చల్లండీ;" "కడ్డిం చొద్దమ్మా ఇవాళ పళ్ళెంలో కష్టాలు! గ్లాసుతో కన్నీళ్లు," వంటి పదసముచ్చయాలు ఉత్తమ కవితకు ఆలయాలు. కాని గంగినేని గారు భాషా విషయం ఎక్కువశ్రద్ధ పుచ్చుకొనలేదు. దుష్టసమాసాలు కావ్యంనిండా కనుపిస్తున్నాయి. "హృదంతర గాయాలు," "నిర్మల కన్నీటిధార," "విపరీత తుపాకి కాల్పులు," "పాలక ఏలిక," "వాంఛా వరదలు," "పాడి గోమంద," "జీవన వెన్నెల" వంటివి. విసంధులు కూడ చేశారు. "మహాదాదర్శ ఆనతి" వంటివి. కనుక భాష విషయాన తప్ప తక్కిన అన్ని అంగాలలోను పరిపుష్టతవున్న కావ్యాలను గంగినేని సృష్టించాడు.

రెంటాల గోపాలకృష్ణగారి "సంఘర్షణ" లోని భాషాప్రయోగం, ఛందస్సుల పోకడ-వీటిలో ఒకవింత గమనం, ఉద్వేగం, భావోన్నత్యం కనబడతాయని నారాయణబాబు సరిగా గమనించి చెప్పారు. కొన్ని కొన్నిచోట్ల గోపాలకృష్ణ నియమాలను పాటించి వ్రాసినప్పుడు, కవిత్వం సాఫీగా, సుందరంగా వుంటుంది. ఇతనిలో రాయప్రోలు, అనిసెట్టి ప్రభావాలు కనిపిస్తాయి. కాని పోనుపోను సొంతదారిని ఏర్పరచుకొన్నాడు. తన కావ్యమే ఒక కల్చర్; తన గేయం "జడత" మీద పగబట్టిన పెనుసర్పం, "లోకంలో శోకించే పతితుల ప్రాణాలన్నీ నాపాటల వృక్షంపై పక్షులుగా విశ్రమించు" నంటున్నాడు. సత్యాసత్యాలమధ్య అనునిత్యమూ జరుగుతున్న సంఘర్షణలో యీకవికి "సత్యంపతాక" వైపు ఎగబ్రాకుతున్నవి ఇటీవల అతను వ్రాసిన "పల్లకీ బోయీలు", "సర్వయాగం" కావ్యాలు కళాశిఖరాలు.

రాంపా వ్రాసిన "అనంతం" మరొక అభ్యుదయ కావ్యసంపుటి. అనంత చైతన్య స్రవంతికి బద్ధుడై, పూర్వకవి ప్రతిభావిశేషాలకు ముగ్ధుడై తనలో అందుచేతనే దర్పం పెరిగి, అహంకారంతో వ్రాశానని చెప్పుకొన్నాడు. సోమసుందర్ వలె రాంపాకూడ భావకవిత్వయుగ ప్రభావాలకు లోనైనవాడే కాబట్టి పదాలేమి, బాణీలేమి వాటిని మరపుకు తెస్తాయి. కాని తాను తాడిత, పీడితులకు, కర్షక కార్మికులకు, బానిసలకు 'పాపాత్ము'లకు కవి నంటాడు. "దుర్భర వర్తమానంగల మనకు ఉజ్వల భవిష్యత్తు" వుందంటాడు.

నారపరెడ్డి రామిరెడ్డిగారి "అశ్రుమాల", "నావీణ" వంటి కావ్యసంపుటులు స్వయం శక్తితో తొణికిసలాడుతుంటాయి. నాగలిపట్టేవానినుండి సెంట్రల్ స్టేషన్ గడియారాన్ని సరిదిద్దేవానివరకుగల బిచ్చగాళ్ళు, కుష్ఠురోగులు, వంచితులు, అయిన సాదాజనులు యీ కవిద్వారా తమకష్ట నిష్ఠురాలను ఎంతో తేటగాను, సూటిగాను వెలువరిస్తారు. కవి మానసోద్రేకం తెచ్చిపెట్టుకొన్నది కాక సామాన్యులుకూడ అనుభవించగలిగినట్టిది. స్వీకరించిన కావ్యవస్తువూ, చెప్పేతీరూ, జంట నాగుబాములవలె పెనవేసికొని వుంటాయి. రామిరెడ్డి ఎంతటి సున్నితమైన భావాన్ని కూడ దేటతెలుగు మాటలలో సులువుగా వ్యక్తంచేయగల శక్తివంతుడు యీయన సవ్యసాచి. కాని గేయాలకంటె యితనివి ఛందోబద్ధమైన పద్యాలే మరింత హృదయంగమాలు. దైవనిరసనతో మొదలయిన యితని అభ్యుదయ కవిత, దోపిడిగాండ్రను దొరలుగా చిత్రించిన కుకవి నిందకుదిగి, క్రమంగా దేశీయ అంతర్జాతీయ సంఘటనల వైపు మరలుతుంది. రామిరెడ్డి మహా చైతన్యవంతుడు. "ఒంటరిగాను నేను నావెంట నేడు, శుష్కకంకాళములు లేచి కోట్లకొలది, నవ్యజీవన కాంతితో నడచుచుండె, ఏ మహాశక్తి మమ్మెదిరింపగలదు?" అని ధీమాగా నిలచి, "సాగిపోవు జీవధార నానకట్టు లాపలేవు," అనుకొంటాడు. కాని పోనుపోను ఆయనలో అభ్యుదయోద్యమాలపట్ల అపనమ్మకాలు ప్రబలి, కష్టమయమయిన బ్రతుకు వలన నిరాశావాదం హెచ్చి యిటీవల పెడత్రోవలు పట్టడం విచారించదగిన విషయం. "బ్రతుకు వీణనుపట్టి లాగే బాధ పనులకు లొంగకుండా ప్రజలకోసమే పాటపాడే కవికుమారుల కంజలుల్" ఘటించిన రామిరెడ్డి, "జీవిత పోరాటంలో అలసిపోయాను. ఓడిపోయాను. నా చేతుల్లో ఏమీలేదు. అదెలా లాగితే అలా పోతున్నాను. ముందు తీరమే వుందో సుడిగుండమే వుందో," నని వ్రాశాడు. ఈ నిరాశాంధకారంలో ఆయనకు పూర్వమిత్రులు శత్రువులుగాను, పూర్వశత్రువులు మిత్రులుగాను, జీవితమే మోసపు చదరంగంగాను, రాజకీయాలు పదవుల కొట్లాటలు కులాభిమాన రణరంగాలు గాను, ఉద్యమాలు నాయకత్వపు ప్రాకులాటలు గానూ కనుపిస్తున్నందుకు ఆశ్చర్యపడనక్కరలేదు. తన పాతనీడను చూచి తానే భయపడే అవస్థపట్టింది.

"ఆదర్శపు టాశయాల
ఆవేశపు గమనంలో
నను నేనే మరచిపోయి
సర్వస్వము గోల్పోతిని.

మిగిలిన నా యభిమానము
పలుసంతల నెట్టినాను
కనులెత్తియు చూడరెవరు
కడ కదియును కరగిపోయె.

ఈ రాతిరి ఈ మబ్బులు
ఈ చీకటి చీల్చుకొంచు
వేకువ మక్క వెడలునంచు
నాకెప్పుడు భ్రాంతిలేదు..."

"హసియింపదు మోసి ఉషా
ఉదయింపదు మోయి రవీ!
చీకటిలో శోకంవలె
పడిమూల్గే నా బ్రతుకున
కాంతిజ్వాల విరజిమ్మిన
భరియించే శక్తిలేదు...

జీవన సంగ్రామంలో
అలసిపోయి నిలువలేక
పరాజయము నొప్పలేక
బాధపడే మానవుణ్ణి..."

బాధాకరమయిన యీ నిరాశా లోకం నుండి రామిరెడ్డిగారి కవితా రవి తిరిగి వుదయించే వేళ వస్తుంది. ఎప్పటికీ ఆయనను ఆహ్వానించే సోదరకవుల చేతులు చాపబడే వున్నాయి.

తర్వాత పేర్కొనదగిన అభ్యుదయ కవి 'శశాంక'. ఓలేటి పార్వతీశంగారి సరసమంజుల కవిత్వ ధోరణులకు పుత్రుడై, సోమసుందర్ రాంపాల అభ్యుదయ కవిత్వ ధోరణులకు మిత్రుడైన శశాంక "నయా జమానా", సంగీతాత్మకమైన గేయాల సంపుటి. తెనుగుల ప్రొద్దుపొడుపును మనోహరంగా వర్ణించాడు. మలయావరకూ యితనిదృష్టి సాగింది. శాంతి కపోతాన్ని చేరబిలిచింది.

"బాధాపరిసర్పిత దేశం
వర్థమాన కవితావేశం
నవమానవ స్మితసౌందర్యం
కవిశశాంక జీవనగానం"

రంగ కవిగారి "కంకర గీతాలు" తాజాగా వెలువడిన అభ్యుదయ గేయ సముచ్చయం. భువిలో వెన్నెల నిండుతుందని, ప్రజావాంఛ జయిస్తుందని రంగ కవిగారి నమ్మిక. కవుల కడగండ్లను, ప్రచురణ కర్తలు పెట్టే యిక్కట్టులను చిత్రిస్తాడు. "భోగంలో రాగరసం రగులొక్కల్ప రసరాజు"లైన కవులను హెచ్చరించి, "కనకయుగం అంతరించి కాటకయుగ మొచ్చిందని" తెలియచెప్పి, అవి వేణాల వేణులను, కేతకీ సుమసౌరభాన్ని, నులివెచ్చని కౌగిళ్ళను, చిత్రించడం మాని, స్ట్రైకర్లూ, ఫోర్మన్లూ, క్రెడిల్ మన్లూ, స్వీపర్లూ, కండక్టర్లూ, చెట్టుకింది ప్లీడర్లూ వంటివారి యథార్థ జీవితాన్ని చిత్రించమంటాడు. భాష విషయం, ఛందస్సు విషయం మరింత శ్రద్ధతీసుకుంటే రంగ కవిగారు అభ్యుదయ కవి ప్రముఖులలో ఒకరయ్యే సూచనలున్నవి.

"శార్వరి" రచించిన "రోదసి"లో కవిత్వముతోటి తత్వమూ, యదార్థ జీవిత చిత్రణతోటి కల్పనాశక్తి పెనవేసికొనిపోయి వున్నవి. శ్రీ శ్రీ ప్రక్క ప్రక్కలనే చలం, మార్క్స్ ప్రక్కన ఫ్రాయిడ్ వలె నిలుస్తాడు. శ్రీ శ్రీలోని ఆరోగ్య అనారోగ్య ధోరణులను రెంటిని శార్వరిగారు స్వీకరించారు. అక్కడక్కడ ఆరుద్రగారి గారడీపనులు రావూరి భరద్వాజగారి కామకళావిలసనాలు. ఎజ్రాపౌండ్ వంటివారిలో శ్రుతిమించిపోయిన వికటధోరణులు కూడ కనుపించక మానవు. ఉదాహరణకు, "అపాయం 3 తుంది", "6 రైటు" "7 స్తుంది", "5వ రాంత్రము"వంటి ప్రయోగాలలో కవి సాధించినది వైచిత్రి కావచ్చుకాని వికృతి కూడ కాకపోదు. శార్వరిగారు మహా సమాస ప్రియులున్నూ; శబ్దవ్యామోహితులున్నూ: "భూభృద్విపృథంబుల రోదన, బభ్రుగ్ధృతి విషాదన, ఘనాఘన పుంభిత వియత్తు" వంటివి భాషమీద ప్రభుతను చూపేందుకు మారు, దాని లోపాన్ని చూపుతాయి. "క్షితిలో సంరక్షణశూన్యం, భక్షణలూ శిక్షణలే గతి," "ఆటమ్మిని ధరిత్రిల రామ బూడిదపంట పండిస్తుంది", అని ఒక్కొక్కప్పుడు జెరిమియా ప్రవక్త వలె నిస్పృహతో ఆగామికాలాన్ని చీకటి

పుంతగా చూచినా, శార్వరి గారు సోల్జరును యుద్ధాలకు గుడ్ బై చెప్పమంటారు.

"వేసవిని సైతం కాల్చివేయగల
మంటలు మాలో మండుతోంటే
అయినా మా జీవితాలు
కొత్త చిగుళ్ళు వేస్తాయి తప్పనిసరి."

"ఉదయ కిరణాలు" అనే పేరుతో యిటీవల కళా రవిగారు తమ ఖండకావ్యాలను అచ్చువేశారు. అన్నిటికంటె యితనిలో గణనీయమైన విషయమేమిటంటే, యితడు ఎవరినీ ఎక్కువగా ప్రతిధ్వనింపడు. తనబాట వేసికొన్నాడు. పూర్వ సాహిత్య పరిచయం వున్నదని ఉపోద్ఘాతం చెప్పుతున్నది. కాని పద ప్రయోగాది విషయాలలో రచయిత యిప్పటికంటె ఎక్కువ శ్రద్ధ తీసుకోనవలసివస్తుంది.

అభ్యుదయ కావ్యాలను ప్రచురించిన వారిలో కొందరి ధోరణులను పరిశీలించాను. ఇంకా పుస్తకరూపంగా కవిత్వాన్ని ప్రచురింపకున్న వారిలో నారపరెడ్డి చంద్రారెడ్డి, వజీర్ రహమాన్, జడ్. పి. సుబ్బారావు, సుభాన్, పూర్ణచంద్రరావు, బాధర్ వంటివారున్నారు. వారి రచనలు చాలకాలంనుండి పత్రికలలో అచ్చు అవుతున్నాయి. చంద్రారెడ్డి, వజీర్ రహమాన్ బహుభాషా పరిచయమున్నందుచేత, తమ కావ్యధోరణులను సంపన్నం కావించుకొంటున్నారు.

ఒకటి రెండు పాటలుమట్టుకే ప్రచురించి వాటితోనే స్థిరపడిపోయిన ప్రతిష్ఠ గలవారిలో పి. వి. శివయ్యగారిని, వేములపల్లి శ్రీకృష్ణగారిని, కొండేపూడిని పేర్కొనాలి. "శాతవాహన తెలుగు చక్రవర్తుల శౌర్య ధైర్య" ప్రశస్తితో మొదలై, కన్నెగంటి హనుమంతు ప్రాణార్పణ వరకు, చంద్రవంక ఎత్తిపోతలతో సంబంధించిన వీరయుద్ధ చిత్రణ మీదుగా కొనసాగిన పలనాటి గీతాన్ని ప్రసాదించినందుకు పండిత పామరులందరూ ఉద్రిక్తులు కాగలిగిన పాండిత్యప్రకర్షతో వీర కథాకథన ధోరణిని జతచేర్చినందుకు శివయ్యగారికి దేశం ఋణపడివుంది. యుద్ధరంగంనుండి తిరిగి తల్లి ఒడిలోకి వస్తున్న భారతీయ సైనికుడి ఎదలోతులను తడిమి చూచే మరొక గీతంకూడా వ్రాశాడు. అదే విధంగా వేములపల్లి శ్రీకృష్ణగారి "తెలుగోడా" జాతికి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి పునర్జీవిత మొనర్చిన ఉత్తమకావ్యం.

చదలవాడ పిచ్చయ్యగారి "ఆకలిగీతాలు", వట్టికొండ రంగయ్యగారి "విప్లవ గీతాలు" మరికొన్ని ప్రచురిత అభ్యుదయకావ్య సంపుటాలు. కథకులుగా ప్రఖ్యాతులైన అవసరాల సూర్యారావుగారు వ్రాసిన పాటలలో ఉద్రేకమూ, ఆవేదనా అడుగడుగున ద్యోతకమౌతాయి. తుమ్మల వెంకటరామయ్యగారు ఏన్నో ఏళ్ళనుండి సాహిత్యవ్యవసాయం చేస్తున్నారు. చిన్ననాడే యిందులో ప్రవేశించారు. ఇటీవల ఆయన వ్రాసిన ఒకగీతం "రష్యా కన్నీరదేల?" అనేది బహుళ ప్రచారాన్ని పొంది, విదేశాలకుకూడ వ్యాపించింది: అవసరాల, తుమ్మల మొదలైనవారి గీతాలు సంపుటీకరించి ప్రకటిస్తే అభ్యుదయకవిత్వ గ్రంథంలో మరొక మెరుగు పుట ఆవిష్కరింప బడుతుంది.

నార్ల చిరంజీవిగారి "విప్లవాత్మ" నయాగరా కావ్యసంపుటి మడిమలు త్రొక్కుకుంటూ వచ్చినది. ఇప్పుడాయనలో ప్రస్ఫుటంగా కనుపించే సారళ్య సౌందర్య చిత్రణాశక్తికి నాడే బీజం పడింది. కొన్ని

గీతాలీయనవి గ్రామీణ జీవితాన్ని చిత్రించేవి అన్నీ యింకా వెలుగు చూడలేదు. "మా వూరు" అనే పెద్దగేయం కూడ వెలువడలేదు. చిరంజీవిగారు యిటీవల కాలంలో తమ శక్తులనన్నిటినీ బాలసాహిత్య సృష్టి మీద కేంద్రీకరించారు.

తెన్నేటి సూరిగారి "అరుణరేఖలు" కొంతకాలం క్రితమే వెలువడిన మరొక అభ్యుదయ కావ్యసంపుటి. పాండిత్య ప్రకర్షతో పాటు సూరిగారు మనస్సులను కల్లోలపరచగల విప్లవ కవిత్వ ధోరణులను కూడ ఆయన తనలో లీనపరచుకొన్నారు. సుంకర సత్యనారాయణగారు కూడ కొన్ని చాల పటుతరాలైన గేయాలను వ్రాశారు. ఇటీవల కాసుమంచి వెంకటేశ్వరరావుగారు రెండు మూడు కావ్యసంపుటులు ప్రకటించారు. వాటిలో ఆత్మపరత, ఆవేశపరత, వితండతర్కమో ఆతిశయించి, గుణాలు ముదిరితే అవగుణాలయ్యేటట్లుగా, కావ్యోత్కృష్ట గుణాలు కాస్త దెబ్బతిన్నాయి. కుండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పడం కావ్యాలలో వీలుపడదు. వ్యంగ్యోక్తి, వక్రోక్తి అవసరాలని గ్రహించాలి. లేకుంటే కావ్యాలలో కళ క్షీణించి, ప్రచారం అతిశయిస్తుంది. రాంభొట్ల కృష్ణమూర్తిగారి "శశవిషాణం"లో వ్యంగ్య కవిత్వం ప్రప్రథమంగా గ్రంథస్థమైంది.

ఈ విధంగా అభ్యుదయ కవిత్వం దిన దిన ప్రవర్థమవుతూవున్నది. యువకవులు కళాశిఖరాలకు యింకా చాల దూరంలోనే వున్నారు. విచ్ఛిన్నకరాలైన ధోరణులు యింకా పూర్తిగా చనిపోలేదు. ఈ లోపాలను దృష్టిలో పెట్టుకొని, అభ్యుదయ కవులు నిరంతరకృషి చేసి, అభ్యుదయ కవిత్వానికి దేశంలో ఆదరణతోపాటు మాన్యతను లభింపచేస్తారని నమ్ముతున్నాను.

వ్యాసకర్తమనవి :

ఈ వ్యాసంలో తెలంగాణంలో వెల్లివిరిసిన అభ్యుదయ కవిత్వాన్ని సమీక్ష చేయలేను. కారణం, ఆ గ్రంథాలు నాకు లభించలేదు. మరొకసారి సమగ్రంగా దానిని గురించి వ్రాస్తాను.

—రమణారెడ్డి.



# అభ్యుదయ సాహిత్యమూ – – జానపద సాహిత్యరీతులు

సోమసుందర్

తెలుగునాట సుమారు పది శతాబ్దాలనుంచి మార్గకవితారీతి సింహాసనస్థితి ననుభవిస్తున్నప్పటికీ – ప్రజల జీవనలహరిలో నవనవోన్మిషితమై రససిద్ధి పొందుతున్న దేశి కవితారీతిమాత్రం అభిరామంగా – అనుస్యూతంగా – అజరామరంగా పరిఢవిల్లుతూనేవున్నది. ముఖ్యంగా జానపదులు, నిరక్షరాస్యులైనప్పటికీ నీరసులుకాక–సజీవోల్లాసంతో తులతూగే జానపదుల మానస సరోవరాలలో ఈ దేశి కవితా పద్మం – శతపత్రశోభతో విరాజిల్లుతూ మనయుగం వరకూ వర్థిల్లినది.

చరిత్రలో మానవజాతికిఆసన్నమైన ప్రతివిపత్కర సన్నివేశాన్నీ, ప్రతి ఆనందతరంగాన్నీ, ప్రతి ప్రేమానుభూతినీ, ప్రతి ద్వేషానల జ్వాలనీ–తనలో సమైక్య మొనర్చుకొని, అవిభాజ్యంగా మన కాలం వరకూ ఈ దేశి కవితాఫణితి మోసుకు వస్తూనేవున్నది.

పరదాస్య భారంతో కృంగిన మనజాతి తన విక్షుబ్ధ హృదయంలో నవచేతనాశక్తుల పుంజుకొని పునరుజ్జీవన శోభల నందుకొంటున్న తొలివేకువలో మన తెలుగుల దేశి సంపదపై మేధోజీవుల ప్రసన్నదృష్టి లగ్నమైంది. తత్పూర్వ యుగంలో కేవలం ప్రబంధపరమేశ్వరుల రాజరికంలో – తప్పిజారి ఒకరో యిద్దరో దేశికవితా ఫణితులను తమ కవితా సృజనలో స్వీకరించినప్పటికీ – విశేషించిన దేశికవితా ఫణితులను, దేశి సారస్వతానికి కేవలగ్రామీణుల రసనాలే నివాసక్షేత్రాలయ్యాయి. ముఖ్యంగా తెలుగుల పూర్వపుణ్యంవల్ల లభించిన పాల్కురికి సోమకవీంద్రుని వల్లనో, శ్రీనాథ కవితాసనాథుల వల్లనో, జానపద కవితారీతికి

ఉన్నతాసన ప్రాప్తి కలిగినా - తదుపరి వచ్చిన తెలుగు ప్రబంధ యుగం - దేశిసారస్వతానికి ఉచితాసనాన్ని సమకూర్చలేదు. దానితో శిష్టజనుల-పండిత ప్రకాండుల మార్గ కావ్యరీతులకు భిన్నమైన నిసర్గసుందరిగా - కేవల గ్రామీణమైన భూగంధ సంభరితమైన కొండాకోన ప్రత్యేక స్రవంతిగా ప్రవహించవలసి వచ్చింది. మధ్యయుగాలనాటి సర్వకళలకూ మతమే సర్వాశ్రయం కనుక - దేశికవితా స్రవంతికూడా తదావలంబనంతోనే బ్రతికవలసి వచ్చింది. ముఖ్యంగా దేశికవితారీతులకే అగ్రతాంబూలమిచ్చిన తాళ్ళపాకం అన్నమాచార్యులవంటి భక్తకవులు లక్షలాదిగా గేయములను రచించారు. ఈ జానపద గీతాలలోగల జోలపాటలు, గొబ్బి పదాలు, కోలాటకీర్తనల వంటి ఎన్నో రూపాలు సజీవంగా పోషింపబడినవి. అన్నమాచార్యుల తదుపరివచ్చిన క్షేత్రయ్యకాని, దాక్షిణాత్యసారంగపాణికాని దాక్షిణాత్య భారత హృదయాన్ని కలకాలంగా పరిపాలించుతున్న త్యాగబ్రహ్మగాని స్వీకరించిన కవితారూపం జానపద కవితా ఫణితియే! తదనుయాయులైన కంచర్ల గోపన్ననుంచి, ఎడ్ల రామదాసు వరకూ గల భక్తకవులుగాని, పోతులూరి వీరబ్రహ్మంనుంచి - 'ఏకులమని నన్నెవ్వరడిగితే యేమని చెప్పుదు లోకులకూ పలుగాకులకూ, అని గొంతెత్తి పలవించి దుర్భరమైన కులమహాఘ్యాలపై తిరుగుబాటు ప్రకటించిన దూదేకుల సిద్ధయ్యవరకూ గల జానపదతత్వకవులుగాని స్వీకరించిన కవితాఫణితులు జానపద సారస్వతానికి మకుటాయమానములు కానటంలో సందేహమేముంది?

కరుణాప్లుతమైన గాథలతోనూ, కేవల స్త్రీ సంబంధమైన తాత్విక జిజ్ఞాసలతోనూ, ధర్మప్రబోధాలతోనూ నిండి అభ్యుదయ పరంపరాభివృద్ధిపొంది నేటివరకూ తెలుగు పడతుల కెందమ్మి హృదయాలలో మురిపాలు పొందే పాటలు ఎన్నోకదా! శృంగార కరుణరస సంపన్నమైన ఈ పాట కథలేగాక - కేవల వీర, అద్భుత రసనిష్యందాలైన అమరకావ్యాలు జానపదుల నోట ఉద్భాతమై వర్ధిల్లిన వెన్ని? శ్రీనాథ మహాకవి

విరచితమై – తెలుగుల మహాభారత మనదగిన పలనాటి వీరచరిత్రతో ప్రారంభమై, కాటమరాజు కథతో పరిణతినంది, పెద బొబ్బిలిరాజు కథతో మహావృక్షమై – పెద్దాపురం కోడిపుంజుల కథతో ఫలోన్ముఖమైన వీరగాథల సాహిత్య సంపద తెలుగుజాతి కెంతటి జీవనోత్సాహాన్ని, రసోల్లాసాన్ని కలిగించ లేదు ?

ఈవిధంగా అనంతమై – అజరామరంగా వర్థిల్లిన తెలుగుజాతి అమూల్యసంపద, జానపదుల దేశి సారస్వత విభవం – ఆధునిక యుగంలో సత్ఫలితాల నందించక నిర్జీవమవటం ఎలా సంభవిస్తుంది ? కనుకనే – గత శతాబ్దపు ద్వితీయ భరణంలోనే – భారతజాతి పునరుజ్జీవన కాంతికళిక లాకట్టుకొంటున్న తొలివేకువలోనే – దేశి సారస్వత ఫణితుల కొత్తచెల్వుతో జాతి జనుల హృత్క్షేత్రంలో నవచైతన్యానికి అంకురార్పణ జరిగింది. నవ్యాంధ్ర సారస్వత పితృపాదులు శ్రీ గురజాడ అప్పారాయ కవీంద్రులు – కేవల ఛందోబద్ధ కవితా వార్థిలోనే బొడ్డుమునకలవేసే కవివృషభుల వ్యర్థప్రయత్నాల నీసడించి – ప్రజల ఉద్యమానికి తెలుగు బావుటానెత్తి – గొంతెత్తి ఆలపించారు; "కొయ్యబొమ్మలమెచ్చు కళ్ళకు కోమలుల సౌరెక్కునా ?" అని. తత్పూర్వమే తెలుగుభాషను నాటకోచితభాషగా తయారించే కృషిలో ముందుకుపోతున్న ధర్మవరం కృష్ణమాచార్య కవివరేణ్యులు తమ నాటకాలలో ముఖ్యంగా చిత్రనళీయంవంటి వానిలో జానుతెనుగురీతులైన షట్పదీవృత్తాలను నిరభ్యంతరంగా వాడి కొత్తగొంతుక నాలపించారు. దేశికవితా సత్సంప్రదాయానికి వారసురాలుగా ముత్యాలసరం ఉద్భవించింది. కొత్త కవితారీతికి గురజాడ వాల్మీకి నాందిపలికారు. తదాదిగా దేశీయ విముక్తికి సాగిన మహోద్యమావలంబకంగా – దేశి రీతులలో కవితాగానము – ప్రజల వ్యాపికిని అనుసంధించింది. స్వర్గీయ శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ, కొండపల్లి జగన్నాథదాసుగార్ల వంటి నిస్వార్థ దేశభక్తులు బద్ధాంజలితో తమకవితా సుమాల నర్పించారు. "మాకొద్దీ తెల్లదొరతనమూ" వంటి అసంఖ్యాక గీతాలతో గరిమెళ్ళవారు ఎక్కడెక్కడి

తెలుగు హృదయంలోనూ దీపకళికలు వెలిగించి, దేశమంతటా మహాజ్వాలను లేపేరు. స్వరాజ్య బొబ్బిలి పదం వటి అసంఖ్యాక గేయ సముచ్చయంతో శ్రీ కొండపల్లి దాసుగారు స్వరాజ్యలాలసత్వాన్ని ఉద్దీపింపచేశారు. ఈ విధంగా ఎంతమందో ప్రజాకవులకు వీ రిరువురూ అగ్రగాములై - మార్గదర్శకులైనారు.

ప్రజా సామాన్యపు స్వాధీన హక్కు భుక్తమైవున్న దేశికవితా ఫణితికి గురజాడతో పునరుజ్జీవనం కలిగి - గరిమెళ్ళాదులతో పెంపు కలిగి విస్మృతినలవఱ్చుకొన్న పుటికీ - జానపద కవితారీతిలో ప్రత్యేక సౌకుమార్యంతో విలసిల్లి నశృంగార రసప్రధాన ధాతువులను యేర్చి కూర్చుకొని, తదుత్తమ సంప్రదాయావలంబకంగా 'ఎంకి నాయుడు బావల కరుణామయ శృంగార రస కావ్యంగా 'ఎంకిపాట'లను శ్రీ నండూరి సుబ్బారావుగారు తెలుగు జాతికి ప్రసాదించారు.—

జాతి జీవితంలో కేవల జాతీయ వాంఛతోనే కాలం వెళ్ళబుచ్చితే సర్వసమస్యలూ పరిష్కృతమయ్యేటట్లు కన్పించలేదు. పరదాస్య శృంఖలాలతో జాతిజనుల జీవనాధారాలను కొల్లగొట్టే స్వజాతీయ శనిగ్రహాల ఉనికిపట్లు సైతం పసిగట్టబడుతూ వచ్చినవి. దానితో జాతీయ చైతన్యానికి పరిపుష్టి కూర్చే సాంఘికమైన వర్గచైతన్యమావిర్భవించింది. చైతన్యమంటూ కలగక పోవాలికాని కలిగినదా జీవుణ్ణి నిదురపోనీయదు. అహరహమూ ఎదలో యిల్లు కట్టుకొని హెచ్చరికలరొదతో వేపుకుతింటుంది. కనుకనే తెలుగుజాతి విశ్వమానవ హృద్విపంచికా నిక్వణానికి తన క్రొంగ్రొత్త శ్రుతుల మేళవించనారంభించింది. విశ్వం సమరాంగణమై - భూతభుక్తమైపోతున్న సమయంలో సమరప్రతికూల రుతుపవనంగా ఆంధ్ర దేశంలో కవితావాతూలం వీచ నారంభించింది. తదనుకూలంగానే - భారత దేశంలో ఏతత్పూర్వమే వృద్ధిపొందుతూ వచ్చిన అభ్యుదయకవితోద్యమ శాఖలు తెలుగునాట విస్తరింప చొచ్చినవి...జాతి జనుల జీవన గానలహరులకు క్రొత్త తెరువులేర్పరచబడ్డాయి. ఆ దశలోనే జపాను వ్యతిరేకమైన బుర్రకథలూ, హిట్లరు భాగోతమనే వీధినాటకమూ

వంటి పాత కొత్తల మేళ్కలయిక లుద్భవిల్లినవి. నాటి వరకూ తందాన పదాలుగానో, బొబ్బిలి పదాలుగానో చెలామణీ అవుతున్న కవితాఘణతులు, వాద్య విశేష నామాంకములుగా 'బుర్రకథ'లనే క్రొత్త నామాన్ని ధరించాయి. వీధిభాగవతమనే రూపం జనజీవిత జన్యమై పురోపదాశ్రితమై అనంత కాలంనుంచీ అనుస్రుతమవుతున్నదే.

ఈ దశలో శ్రీయుత సుంకర సత్యనారాయణకవి పురోగామి. ఈ జానపద కళాస్వరూప పునః స్వీకార మహోద్యమానికి ఆయన ఆచార్యుడు. వీరు రచించిన 'కష్టజీవి' అనే బుర్రకథ ముక్కోటి ఆంధ్రులకూ చెవిలో యిల్లు కట్టుకొని జాతి జీవనపరిస్థితులను ప్రబోధించింది. వీర, కరుణ రససమ్మిశ్రితమైన ఈకథ ఉత్తమకావ్యంగా రూపొందుటవల్లనే తదనుసరణీయములైన ఎన్నో బుర్రకథలకు మాతృత్వం వహించి — మన సంస్కృతీ జీవనంలో బుర్రకథల రూపానికి శాశ్వతస్థితిని కల్గించింది. కేవల గ్రామీణులకే గాక, నాగరికులను సైతం ఆనందావేశాలలో ముంచెత్తినది. నిరక్షరాస్యుల నీ కథ రంజింపజేయుడంలో — మన దేశాన సంఘసంస్కరణా పతాక నెత్తిన యుగపురుషులు శ్రీ వీరేశలింగ మహనీయుల దివ్యచరిత్రాన్ని స్వీకరించిన ఈ కవి రెండవకృతి 'వీరేశలింగం' (బుర్రకథ) సర్వే సర్వత్రా ప్రజలందరినీ రంజింపచేసింది. అభిప్రాయ వైరుధ్యానికెంతటితావు గలిగినవారైనప్పటికీ కూడ, వీరేశలింగం బుర్రకథ విన్న ప్రతివారూ పారవశ్యంలో ఆనంద బాష్పాల నర్పించినవారే! ఈ గాథ తరువాత — భారతదేశంలో సాగిన ఖిలాఫత్ ఉద్యమం, గదర్ ఉద్యమము, టెర్రరిస్టు ఉద్యమంలాంటి అతివాద ఉద్యమాలకు ఆంధ్రుల పవిత్ర సమర్పణగా రూపొందిన అల్లూరి సీతారామరాజు వీరగాథను స్వీకరించి శ్రీ సుంకర రచించిన బుర్రకథ వీరరసోద్దీపకమై — ఉత్సాహజనకమై — కర్తవ్యావేశ భరితమై ప్రజలలో నూతనానుభూతులను కలిగించింది.

తరువాత 'తెలంగాణా' అన్నవారి బుర్రకథకూడా తత్పూర్వకథల కీడుజోడై రససంపుష్టమైనదే! అయితే దానిలో ఒక దశ

చరమాంకంలో పడింది. జాతి యావత్తూ కర్కశమైన నిర్బంధానికి గురైంది. ఆంధ్రుల నవ సంస్కృతీరూపాలు వికారమేఘాచ్ఛాదితములయ్యాయి...శ్రీ సుంకర సత్యనారాయణ రచించిన యీ 'బుర్రకథల'నే పునరుద్ధరింపబడిన ప్రజలదైన పాత దేశిసారస్వతరూపం జయప్రదం కావడంతోనే ఆంధ్రదేశంలో సర్వేసర్వత్రా ఎన్నెన్నో బుర్రకథలు-జనించాయి. ఎందరో కవులు కొత్త వృత్తాంతాలతో కలాలు సారించారు. ఆఖరికి ఆంగ్లేయ ప్రభుత్వమేర్పరచిన యుద్ధ ప్రచారశాఖ (War propaganda dep) సైతం – శ్రీ జాషువా కవివంటివారి యోజనమాన్యాన బుర్రకథలవంటి ప్రజాకళారూపాలను స్వీకరించి తమ ప్రచార సాధనాలుగా మార్చుకోనారంభిచారు. అంతేగాక – యీ బుర్రకథరూపం కలిగించే అనల్ప ప్రభావానికి చకితులైన ఆలిండియా రేడియో శాఖవారుసైతం తమకుగల పరిధిలో అభ్యంతరంలేని బుర్రకథలను ప్రసారంచేయ నారంభించారు. అంతకు పూర్వమే ఎందరో యువకులు – కేవలం భూదేవి బిడ్డలు – ఉత్తమ కళాకారులుగా ప్రకాశించ నారంభించారు. అట్టివారిలో అగ్రగామిగా విఖ్యాతినందిన వర్ధమానుడు నాజర్! మూడక్షరాల బుడత నామధేయుడైన యీ నాజర్ – యావదాంధ్ర ప్రజాహృదయాన్నే గాక, భారత మేధావుల హృదయాన్నీ – తదాది ప్రపంచప్రజాకళాభిమానుల అసంఖ్యాక హృదయాలను సైతం అచిరకాలంలో చూరగొన్నారు. అంతేగాక – కేవలం బుర్రకథలో ముఖ్య గాయకునిగా జీవితం ప్రారంభించిన యీతడు, అనతికాలంలో తానే ఒక క్రొంగ్రొత్త బుర్రకథకు సృష్టికర్తయై విజయంపొందారు. ముఖ్యంగా అతను రచించిన 'బెంగాల్ కరువు' గత శతాబ్దపు వైజ్ఞానిక చరిత్రలో ఆణిముత్యంగా అలరారినది. ఆ కథలో ఆతడు గొంతెత్తి గానంచేసే "వెళ్ళిపోదామా-మామా!" అనే గీతం శోకరసానికి పరాకాష్ఠ! ఈ గీతాన్ని రచించినవారు శ్రీ కొనకళ్ళ వెంకటరత్నంగారు.

శ్రీ కొనకళ్ళ – పునరుజ్జీవిత జానపద కవితా స్రష్టలలో విశిష్టమైనవారు. స్వతహాగా వీరు శ్రీ

నండూరి సుబ్బారావుగారు నిర్మించిన కరుణామయమైన అమలిన శృంగార కవితా సాంప్రదాయానికి చెందినవారే అయినప్పటికి – ప్రజా వాంఛితాలయెడల భక్తిశ్రద్ధలు కల కొత్తభావాల అలజడితో కొంత కొత్తశక్తిని పుంజుకున్నవారే! కనుకనే వీరు – ప్రజా జీవితమందలి ప్రేమేతివృత్తాన్ని మాత్రమే కాక, జీవితాంతర్వ్యాపినిగా వున్న ఆశా భావాన్నీ – శ్రామిక జీవనుల ఊర్పుల సంబాళింపులో గల శ్రమోపశమన లక్షణాన్నీ తమ కవితా వస్తువులుగా స్వీకరించి, మహాకావ్యాలనదగిన గీతాలను రచించారు. ముఖ్యంగా వీరి;

"హైలెస్సో – లాగరా...
హైలెస్సో లాగరా!
రోజ్జు రోలరు ముందడుగే సాగరా!"

వంటి గేయాలు గణనీయాలు. వీరి గేయాలు కొన్ని 'ప్రత్యేళ్ళు' అనే చిన్న పుస్తకంగా ప్రచురితమైనప్పటికీ గ్రంథస్థ గౌరవ మందవలసిన సుందరగీతాలెన్నో వున్నాయి.

ఒకసారి – వికారంగా నల్లగా వ్యాపించిన మేఘం భూమిని ఆచ్ఛాదించినదంటే – ఫలితాలను విశ్లేషించినంగా వినవ తప్పుతుందా? కనుకనే ఏతత్ విస్తృత ఫలితాల ప్రతిబింబంగానే శ్రీ సుంకర రచితమైన 'అమరజీవి' వెలువడింది. ఈసందర్భంలో యించుమించుగా అమరజీవి బుర్రకథకు సమకాలీనమైన – 'కూలీ' – కన్న కూతురు అన్న శ్రీ పి. లక్ష్మీకాంత మోహన్‌గారి బుర్రకథలూ, శ్రీ నాజర్ చిరంజీవిగారి కోటిరెడ్డి కథ సైతం గణనీయములే! ఇక పోతే గత సంవత్సరంలో ప్రచురింపబడిన శ్రీ సుంకర రచితమైన రుద్రమదేవికథ ఉత్తమ శ్రేణిలోకి చెందినది. ఇందులో అందందు సుందరమైన కీర్తనలు, దరువులు, తందాన వరుసలూ వున్నప్పటికీ – ఇందలి కథనంలో నాటకీయత కల్గిన గద్యమే యెక్కువగా వాడబడ్డం విశేషం!

ఉత్తమ ప్రజాకళా స్వరూపంగా రూపొందిన యీ 'బుర్రకథ' సంవిధానంలో ఎందరో రచయితలు ఉత్తమ కథలను రచించారు. అట్టి వారిలో ముఖ్యులు శ్రీయుతులు జంపన చంద్రశేఖరరావు, సూరిశెట్టి సాంబశివరావు శాస్త్రి మున్నగు

వారు గణనీయులు. ముఖ్యంగా బోసు జీవితం– గాంధీ జీవితచరిత్ర, ఆంధ్రకేసరి, మున్నగునవి ఖ్యాతి పొందాయి. అంతేగాక 1951, 52 సం॥రాలలో మన ఆంధ్రశ్రీ శరీరంలో ప్రముఖభాగమైన రాయలసీమగడ్డలో క్షామం స్వైరవిహారం చేసి భయంకరంగా తినివేయ నారంభించిన దశలో – ఒకప్పుడు బెంగాల్ కరువుకే హృదయమర్పించిన నాజర్ వంటి కళాశీలురు చేతులు ముడుచుకొని కూర్చోగలరని నమ్మకం ఎలాగ? కనుకనే–నాజర్ 'నేటి రాయలసీమ'–అనే చక్కని బుర్రకథ రచించారు. ఈ కథ ఎంతో కరుణార్ద్రంగా–అచ్చటి భీకర సన్నివేశాలను కన్నులకు హత్తునట్లుగా చిత్రించబడి ఉత్తమ శ్రేణికి చెందుతుంది.

జాతీయ చైతన్యంలో ఒక భాగంగా అభివృద్ధి పొందుతూ వచ్చిన ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్ర వాంఛ నలభై సంవత్సరాల ఆందోళనా చరిత్ర కలిగినప్పటికీ నీరుకారిపో నారంభించింది. అట్టి అవసరాన ఆంధ్రజాతి నోముల పంటగా ఆవిర్భవించిన త్యాగమూర్తి, శ్రీ పొట్టి శ్రీరాములు తన ప్రాణత్యాగనిరతితో–తత్ఫలితమైన ఆంధ్రయువలోకపు అచంచల కార్యదీక్షతో వచ్చిన నవచైతన్య ఫలితమై ఆంధ్రుల కోర్కె– ఈడేరినది. అయితే చరిత్రలో తన నామాక్షరాల వజ్రకాంతులు లాపాదించుకొన్న ఆ మహావీరుని త్యాగం కవితావస్తువు కావటంలో ఆశ్చర్యం లేదు. ఎందరో కవులు కావ్యాలు రాశారు. ప్రబంధాలు చెప్పారు. చాటువు లల్లారు. ఎన్ని చేసినా శిష్టకవితాస్వరూపాలే కదా! జానపద కవితారీతులు రావద్దా? వచ్చినవో–సత్కృత్తు! ఒక ప్రబల హస్తం అలాంటి కవితాఫణితిని ప్రసాదించవద్దా?—— కనుకనే – ఈ చారిత్రక ప్రేరణవల్లనే పదుగురు కవులు – కొందరు అతి నవ్య కవులుకూడ పొట్టి శ్రీరాములు జీవితానుసరణంగా బుర్రకథలు రచించారు. అన్ని ప్రాంతాలలోను ఏదో ఒక కథ ప్రచారమవుతూనే వున్నది. ఆ మహాత్యాగి – అమరజీవి – త్యాగనిరతికి ప్రతిమారూపా, ఆంధ్రజనత వేడికన్నీటితో శ్రద్ధాంజలిని ఘటియిస్తూనే వున్నది.

జానపద కళారూపాలతో వెలువడినవి కేవలము బుర్రకథలు, వీధి భాగవతములు మాత్రమే కాక – తెలుగునాట ప్రసిద్ధమై వున్న కన్యకాపరమేశ్వరి కథను స్వీకరించి శ్రీ పీసా లక్ష్మణరావుగారు జముకుల కథగా రచించారు. ఇంతేగాక పిచ్చిగుంటల కథలు – కోలాట పాటలు, భజన దరువులవంటి రూపాలను నూత్న కాంతులతో, కొత్త అనుభూతులతో – ఆలోచనలతో పునరుద్ధరించిన యువకవులెందరో వున్నారు. ఈ సాహిత్యమంతా నైమర్శిక దృష్టితో సమగ్రంగా పరిశీలింప బడవలసి వున్నది. అంతేగాక, జానపద సాహిత్యంలో మేల్బంతులనదగిన 'సైసై చెన్నాపరెడ్డి', 'ఓ గుజ్జాల గోపిరెడ్డి' వంటి అనేక ఫణితులతో కొత్తపాటలు రచించిన యువ రచయితలెందరో ఉన్నారు. అట్టివారిలో ముఖ్యులు శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య, కొత్తపల్లి రంగారావు, పూలకుంట్ల సంజీవులు, గోపాలం ప్రభృతులు ఎన్నదగినవారు. ముఖ్యంగా '54 లో ప్రచురింపబడిన శశవిషాణ గీతాలసంపుటి అనన్యమైనది. ఈ గీతాలు శ్రీ రాంభట్ల కృష్ణమూర్తిగారు తమకుగల సాహిత్యప్రౌఢిమతో చిత్రలేఖనా నైపుణ్యాన్ని మేళవించి పదాలతో చక్కని వ్యంగ్యచిత్రాలను రచించారు. ముఖ్యంగా యీ గేయాలు దేశిఫణితుల నెన్నింటినో ఆకళించుకొన్నవి. ముఖ్యంగా – "వచ్చారయ్యా వచ్చారూ, ముగ్గురు మరాఠీలొచ్చారు; తెలుగునాడు విరిసింది – సిరిసిరిమువ్వా మనకు తొలిదసరా వచ్చింది సిరిసిరి మువ్వా! – పాండవులు పాండవులు తుమ్మెదా; బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, – అనగా అనగా ముగ్గురు రాజులు – ఒకరికి ఊరూ లేదు!, చిట్టీత పండెరుపు చిలక ముక్కెరుపు –" వంటి చక్కని పాటలు జానపదగేయాల వలెనే లయాన్వితాలే కాక హృదయంగమాలు కూడ!

ఈ విధంగా – జానపద సాహితీ శాఖ అనుస్యూతమైన సత్సాంప్రదాయపు మహాస్రవంతిగా ప్రవహించుతున్నప్పటికీ – యిటీవల కొత్త కాంతి కెరటాల తీపుల్ని స్వాయత్తం చేసుకొని తెలుగునాట వరవళ్ళు త్రొక్కుతున్నది. అయితే ఆంధ్రజాతి దురదృష్టవశాత్తు

ముక్కలై వుండుటవల్ల సర్కారు ప్రాంతపు సాహితీ విభవాన్ని అవలోకించినంతమాత్రాన సంపూర్ణం కానేరదు, ఆంధ్రులలో మూడవ వంతుగావున్న తెలంగాణాంధ్రుల సాహిత్య సంస్కృతీ శాఖలలో ఆంధ్రమాతకు ఎన్నెన్నో అపురూపాలంకారాలు కైసేయబడుతునే వున్నవి. ముఖ్యంగా శ్రీ టి. రామానుజులుగారు రచించిన 'అనాథ' అనే బుర్రకథవంటి దేశీ సృజనలు బహుధారామణీయకము లేగాక సంఘ సంస్కరణాభిలాషా సహితములు కూడ. యవ్వనపు మిసిమి విలాసాలలో - నెనరు చూపిన దొంగప్రియుని మాటలు నమ్మి - అతని కోర్కెతీర్చడంతో గర్భవతై నానాయిక్కట్లకు గురైన ఒక అనాథ జీవిత వృత్తాన్ని యింపులో చక్కగా వర్ణించారు రచయిత.

తెలంగాణమునకు చెందిన ప్రముఖ కవులలో పేరెన్నికగన్న శ్రీ కాళోజీ నారాయణరావుగారు ప్రజాగళస్మరంద్రపోతస్వినులైన జానపదరీతులలో ఎన్నో గీతాలు రచించి జాతి జాగృతికి అపారమైన కృషిసల్పారు. ముఖ్యంగా వారి 'నా గొడవ' అనే గేయసంపుటిలో 'ప్రపంచం, 'లోకం, ఇంకెన్నాళ్లు ?' తీర్పు. మంచిచెడ్డల అండ, దేవత లెరుగని దివ్యానుభవం" వంటి ఎన్నో గేయాలు మంజులమ్మై, లసద్బంధురమ్మై, పుడమి పొత్తిళ్ళలో లాలింపబడిన గీతికానిస్వనములై మెరుపు తీగలవలె నవ్యాంధ్ర కవితా విహాయసంలో ఉత్తమ కాంతులందు కొంటున్నవి. ఈ కవి అనవసరపు బెడగులకు పోక, సోకుల పట్టు కుచ్చుల టోపీలు ధరించక, నిష్కల్మష హృదయంతో, నిరంజన కవితావేశంతో, నిస్తుల సారస్వత తేజంతో యెన్నెన్నో గేయాలను రచించిన జానపద కవితాపణితులలో హృద్యంగా సర్వాంగ సుందరంగా ఆధునిక కవిత వెలార్చిన వారిలో ఉత్తముడనుటకు సందేహం లేదు. వేయి మాటలకంటె అతని కవితాహృదయాన్ని తనకు తానై చాటగలిగిన దొకే ఒక్క గీతికాశకలం చాలదా ?

"హద్దుమీరి అధికారవర్గమూ
ఆడిన ఆటలు చాలింక
రాజుపేరట అరాజకమునకు
జరిగిన పూజలు చాలింక..."

రక్షసితనమును పిశాచవృత్తికి
దొరికిన రక్షణ చాలింక
పాలనపేరిట పల్లెపల్లెలో
జరిగే పాపము చాలింక.
బీదల సర్వస్వముతో ధనికులు
చేసే బేరము చాలింక
దొంగలంత దొరతనముపేరిట
చేసిన దోపిడి చాలింక.

['చాలింక' నుంచి. పుట 26 నాగోడక.]



## చైనా రచయితల సంఘాధ్యక్షుడు, మావ్ టున్ సందేశం

ప్రియమిత్రులారా!

"ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘపు ఐదవ మహాసభా ప్రారంభ సందర్భంలో, చైనీస్ రచయితలందరు అందచేస్తున్న మనః పూర్వకాభినందనలను దయతో స్వీకరించండి. మీ ప్రజాజీవితంనుండి, ప్రజా పోరాటంనుండి మీరు పుష్టినీ, పొడిమినీ పొంది, సాహిత్యమందు యశోధిక ప్రముఖ విజయాలను సాధింతురుగాక! చైనా - భారత స్నేహాన్ని దృఢపరచి అభివృద్ధి పరచుటలో మీ లేఖనులను ఉపయోగిస్తారని దృఢంగా విశ్వసిస్తున్నాం."

★

# అనంతం ..........................

## గంగినేని

రావేల ! రావేల !
రావేల చెలికాడ !
రాత్రి వచ్చెనురా !
ఏకాంత కాంతనురా !

రారా ! వేవేగ !!
రాగమాలికగా !
అనురాగ వేదికగా !
అపురూప ప్రియా !

ఆనందంరా, అది
జీవిత పర్యాయపదం !
స్వర్గంరా, అది –
మన కలయిక సంకేతం !

రావేల ఈవేళ !!
రాతిగుండెలవాడ !
విరహవేదన నిండి
మండుటెండయ్యాను !
హేమంతపతువు కప్పరా !
వసంతసంగీతం నింపరా !

రావోయి, రావోయి !
నా హృదయాధి నాథుడా !

విధికత్తుల బావిలో
బందీనయ్యాను ! రారా !
వేవేగ నను రక్షింపరా !

గుండెమీది కొండ
దించరావా నేడు !
మనసులోని ముల్లు
తీయరావా నీవు !

రావేల చెలికాడ !
రాత్రి వచ్చెనురా !
హృదయ మాకాశమాయె !
మనసు మల్లెపందిరాయె ! నా
కాంక్ష కడలియై వెన్నెదాకె !
రారా ! నక్షత్రమాల తెచ్చా !
రారా ! అమృతం వర్షించరా !

రావేమి ! రావేమి !
రామచంద్రా నీవు !
కన్నీరు పొంగెత్తె మీది
కొరిగె అశోకవృక్షం !
ఆజానుబాహుడా ! ఆదుకోరా !

రావేల, రావేల ఈ రాత్రి !
రాక్షసులు మైమరచి
నిద్రపోతున్నారు !!
నిశ్శబ్దదేవతగా
నన్ను చేరరావోయి !

తొలిప్రాణి నీవురా!
తొలినవ్వు నేనురా !
నీవు ప్రాణదాతవురా !
నేను స్వప్నరూపంరా !

నా నవ్వు వెన్నెలై
లోకాన్ని వెలిగించె !
నీవాక్కు కోరికై
లోకాన్ని స్పందించె

వూహానీవు, ఆశ నేనురా !
మనం జగతి చైతన్యం !
రావేల, రావేల ఈవేళ !
నావళ్ళో పవళింప !

రావోయి ! కృష్ణా !
రాసలీల వేళాయె !
రావోయి, రాధను !
నే నీ తీయని బాధను !

రావేల, రావేల ఆడం !
రావేల ఆదిపురుషుడా !
ఆద్యంతాలావహించిన
చైతన్యవాహిని పలికించు !
నా ఎడద మోడు పులకించ !

హేం క్రిష్ణా ! శ్రీకృష్ణా !!
అబ్బా ! దుర్యోధనులు !
అయ్యో ! దుశ్శాసనులు !
పరాభవం కాటందుతోంది !
తక్షణం ముక్తిప్రసాదించు ప్రభూ!

ఔనురా, నే నీ అర్ధాంగిని !
ఔనౌను నేను 'అవని'ని !
వినరా, ఇహానైనా నా మొర !
విని నన్ను బ్రోవ రారా వేవేగ !



# ఆంధ్ర నాటక సాహిత్య సమీక్ష

**శ్రీనివాస చక్రవర్తి**

సంస్కృతాలంకారికులు సాహిత్యరంగంలో నాటకానికి అగ్రతాంబూలమిచ్చినా, వారిననుసరించిన మన పూర్వాంధ్రకవులు దానిజోలికి పోలేదు. సంస్కృతలక్షణ గ్రంథాలను అనువదించిన తెలుగు లాక్షణికులు నాటక పరిచ్ఛేదం వదలివేస్తూ వచ్చారు. "ఉదాత్త రసాన్విత కావ్యనాటకక్రమములు పెక్కు చూచితి –" అనే భారతపద్యాన్ని బట్టి నన్నయ కాలంనాటికే నాటకాలు ప్రదర్శిస్తూండేవారని అనుమానించవలసివస్తోంది. కాని అవి నాటకాలో, యక్షగానాలో నిర్ధారణగా చెప్పలేం. తిక్కనగారి కీచకవధ ఘట్టం చదివినా, పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నం చదివినా వారికి నాటక రచనలో విశేషప్రజ్ఞ గలదని పొడగట్టుతుంది. కాని ఆ మహానుభావులకూ తెలుగులో నాటకం రాయాలని బుద్ధిపుట్టలేదు. పిల్లలమర్రి పినవీరభద్రుడు, నంది మల్లయ్య, ఘంట సింగయ్య సంస్కృత శాకుంతలం, ప్రబోధ చంద్రోదయాలను ప్రబంధాలుగా రూపొందించారేగాని నాటకాలుగా అనువదించలేదు. ఆనాటి సాహిత్యం రాజుల ఆదరాభిమానాలమీద, ఇష్టానిష్టాలమీద ఆధారపడి ఉండటం, వారికి నాటకాలమీద మోజు లేకపోవటం తెలుగులో నాటకాలు అవతరించకపోవడానికి కారణాలై వుండవచ్చు.

పూర్వకవులు నాటక సరస్వతి మీద యెంత శీతకన్ను వేసినా ఎలానో ఒకే ఒక రూపకం 14 వ శతాబ్దంలో తెలుగులో వెలువడింది. అదే క్రీడాభిరామం. దీనిని రచించింది వినుకొండ వల్లభరాయుడు. ఇందులో శ్రీనాథుని పోకడలు అనేకం కనిపించటం వల్ల దీనిని శ్రీనాథుడే రచించి వల్లభరాయుని పేరు పెట్టాడని స్వర్గీయ వేటూరి ప్రభాకరశాస్త్రి

వాదించారు. గ్రంథకర్త ఎవరైనా యిది తెలుగు భాషలోని ప్రప్రథమ రూపకమని అంగీకరించక తప్పదు. అయితే యిది పూర్తిగా స్వతంత్ర గ్రంథం కాదు. సంస్కృతంలోని ప్రేమాభిరామాన్ని అనుసరించి రచించబడింది. ఇది సంస్కృత దశ విధరూపకాలలోని వీథిజాతికి చెందింది. "నటులది నోరసముద్రము, విటులది యోగ్యల్లు, కవిది వినుకొండ..." అని నాందీ ప్రస్తావనలో చెప్పడంవల్ల దీనిని మోపూరి భైరవుని తిరునాళ్ళలో ప్రదర్శించేవారని తెలుస్తుంది. ఇందులో శృంగారం పచ్చిగా నడిచినా, ఆనాటి ఆంధ్రప్రజల సాంఘికాచారాలు, వివిధ కళారూపాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నాయి. ఆరోజులలో తెలుగువారు ఎక్కువగా యక్షగానాలు, వీధినాటకాలు, పగటి వేషాలు మొదలైన కళారూపాలతోనే తృప్తిపడుతూండేవారు.

1880 వ సంవత్సరంతో ఆంధ్ర సాహిత్య చరిత్రలో నూతనయుగం ప్రారంభమైంది. ఆ సంవత్సరమే ధార్వాడ కంపెనీవారు ఆంధ్రదేశమంతా పర్యటించి నాటకాలాడి వెళ్ళారు. ఆ ప్రదర్శనాలు చూచిన తెలుగువారికి తామూ నాటకాలాడాలనే కుతూహలం కలిగింది. నాటక సమాజాలు ప్రతి పట్టణాన స్థాపించారు. కాని ఆడడానికి నాటకాలేవీ? అందుకని ప్రతి సమాజం ఒక్కొక్క కవిని ఆశ్రయించింది. ఆ కవులు తాము చదివిన సంస్కృత నాటకాలను చూచిన ధార్వాడ నాటకాలను, ఆంధ్రలో చిరకాలంగా ప్రచారంలో ఉన్న పగటివేషాలను ఆధారంచేసుకుని తెలుగులో నాటకాలు రాయసాగారు. వారికి ఎక్కువగా పగటివేషాలు, ధార్వాడ నాటకాలు ఉపయోగించి ఉంటాయి. పగటివేషాలలో చాలా వేషాలు ఉత్తమ ప్రహసన లక్షణాలతో విరాజిల్లుతూ నాటి నాటకాలకు ప్రాతిపదికలైనాయి. ఆనాటి కవులు పూర్తిగా వచనంలోనే నాటకాలు రాశారు. ఒకటి రెండు శ్లోకాలు, ఒకటి రెండు కీర్తనలు మాత్రముండేవట. అయితే ఆనాటి వచన నాటకాలు మన కిపుడు లభ్యం కాకపోవడంవల్ల వాటిని సమీక్షించే అవకాశం లేకుండా పోయింది. వీరేశలింగం

గారి ప్రహ్లాదలో 8 పద్యాలు మాత్రమే వున్నాయి. ఆ వచన నాటక ఛాయలు ఇందులో వున్నాయేమో నని సందేహించవలసి వస్తోంది.

సర్కారు జిల్లాలలో యిలా వచన-నాటకాలు వెలువడుతూంటే బళ్ళారినించి యింకోరకం నాటకాలు బయలుదేరాయి. అక్కడి వారికీ నాటకాలాడాలని ఉత్సుకత కలిగి సరస వినోదసభ అని నాటకసమాజం స్థాపించారు. దానికి కవి, నటుడు, దర్శకుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు. ఈయనకి సంస్కృతాంధ్ర ఆంగ్లభాషలలో మంచి పాండిత్యముంది. వీరి నాటక రచనలతో నాటక సాహిత్యం యింకో దశ అందుకుంది. వీరు గద్య పద్య గేయాత్మకంగా 28 నాటకాలు రచించారు. కాని అందులో 14 మాత్రమే అచ్చులోకి వచ్చాయి. ఒక్క రోషనార తప్ప తక్కినవన్నీ పౌరాణికాలే. ఈ నాటకాలలోని పద్యాలు ప్రబంధ ఫక్కీలో నడుస్తాయి. స్వయంగా రకరకాల చందస్సులూ ప్రస్తారించుకుని కొత్త కొత్త పద్యాలు, గేయాలు, రాగ మాలికలు, ద్విపదలు రచించారు. గద్యంలోని భావమే పద్యంలో, అదేభావం కీర్తనలో రాయడం, ప్రతి చిన్న విషయాన్నీ ప్రత్యేకరంగంగా చిత్రించడం మూలంగా వీరి నాటకాలు కొంచెం పెద్దవిగా ఉంటాయి; సంస్కృత నాటకాలనుంచి పద్యాలు, ఘార్వాడవారిలాగా కీర్తనలు, ఆంగ్ల నాటకాలు చూచి రంగాలుగా అంకవిభజనా చేసి నాటకాలు రాసి ఆడించారు. పాత్రల మానసికావస్థలను, ఆంతర జీవితాన్ని చిత్రించడంలో వీరు పేజీలకు పేజీల దీర్ఘ స్వగతాలు ఉపయోగించారు. కథా సంవిధానంలోను, పాత్ర చిత్రణలోను వీరికి మంచి నేర్పుఉంది. చిత్రాంగి, హిరణ్యకశ్యప పాత్రలను, వారి మానసిక జీవితం చిత్రించడంలో వీరు కొత్తదోవలు తొక్కి, ఆ రెండు పాత్రలకు కొత్త వ్యాఖ్యానంచేసి, ఆ పాత్రలయందు పాఠకులకు సానుభూతి కలిగేలాగా చేశారు. వీరి నాటకాలు పౌరాణికములైననైనా వర్తమానకాల సాంఘిక, రాజకీయ సమస్యలపై తమ భావాలను నాటకాలద్వారా ప్రకటించారు.

చంద్రహాసలో ఉప్పుపన్ను, ప్రమీలలో స్త్రీ స్వాతంత్ర్యం, పాంచాలీ స్వయంవరంలో విదేశీవస్త్ర బహిష్కరణ ఇందుకు తార్కాణాలు. వీరు కరుణారసంలో సిద్ధహస్తులు. తొలి రచన చిత్రనళీయం, 1886. ఇదిగాక చంద్రహాస, సారంగధర, ప్రహ్లాద బహుళ ప్రచారంలోకి వచ్చాయి. సంస్కృత లాక్షణికులు నాటకం సుఖాంతంగా ఉండాలని శాసించినా విషాదాంత నాటకాలలోని గొప్పదనాన్ని గుర్తించి ఆచార్యులుగారు ధైర్యంగా సారంగధర విషాదాంతంగా రచించి తర్వాతి కవులకు మార్గదర్శకులయ్యారు.

వీరికి పోటీగా కోలాచలం శ్రీనివాసరావు బళ్ళారిలోనే ఇంకో నాటకసమాజం స్థాపించి ఆడించారు. వీరూ గద్యపద్య గేయాత్మకంగానే నాటకాలు రాశారు. వీరికి ఆంగ్లనాటకాలమీద మోజు ఎక్కువ. అందుకే వీరి నాటకాలలో ఆంగ్ల నాటక ఛాయలు ఎక్కువగా గోచరిస్తాయి. వీరి విజయనగర రాజ్య పతనం వీరికేగాక, రాఘవకు కూడా ఎక్కువ పేరు తెచ్చిపెట్టింది. ఇలాంటి గద్య పద్యాత్మక నాటకాలు ప్రజల ఆదరాభిమానాలను చూరగొనడంలో అంతవరకు వచన నాటకాలను రాయడానికి పూనుకున్న నాటక కర్తలంతా ఫక్కీ మార్చి, గద్యపద్యాత్మక నాటకాలు రాయ నారంభించారు. కందుకూరి, చిలకమర్తి, వేదం, పానుగంటి మొదలైన రచయితల నాటకాలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. వీరిలో కొందరు సంస్కృత నాటక లక్షణాలను స్థూలంగా అనుసరించి, కొందరు బళ్ళారి నాటకాల ననుసరించి నాటకాలు రాయసాగారు. నాటకాలను పద్యాలు, పాటలు అత్యావశ్యకములనే భావం రచయితలలోను, నటులలోను ప్రజలలోను పాదుకుపోయింది. చివరికి 'వెళ్ళొస్తాను' అనేదికూడా పద్యంలో రాసే స్థితికి నాటక రచన దిగజారింది. చిలకమర్తివారి గయోపాఖ్యానం, తిరుపతి కవుల పాండవ నాటకాలు యించుమించు పద్యనాటికలకింద తయారయ్యాయి.

ఈ గద్య పద్య నాటకాలలోనే కొత్తత్రోవలు త్రొక్కి మార్గదర్శకులైనవారు వేదంవారు, పానుగంటివారు. వేదంవారు సంస్కృత నాటకాలను, లక్షణ గ్రంథాలను

మథించి పాత్రోచిత భాషావాదానికి పునాదులు వేశారు. వారి వాదానికి లక్ష్యమా అన్నట్లు ప్రతాపరుద్రీయంలో పాత్రలకు తదుచితభాషనుపెట్టి ఉత్తమ నాటకాన్ని వెలువరించారు. అప్పటివరకు సేవకపాత్ర నుంచి నాయకపాత్రవరకు గ్రాంథిక భాషలో నాటకాలు వ్రాస్తున్న కృష్ణమాచార్యులుగారు మొదలైన వారంతా పాత్రోచితభాషను వాడుతూ నాటకంలో భాషావిషయంలో కొంతవరకు వాస్తవికతకు స్థానం కల్పించారు. పానుగంటి వారు ఇంకో వాదన లేవదీశారు. వీరు పచ్చి గ్రాంథికవాదులు. పాత్రోచితభాష వీరికి గిట్టలేదు. తెలుగు నాటకాలకు వృత్తాలు పనికి రావనీ తేటగీతిలాంటి తెలుగు ఛందస్సులే వాడదగినవని వాదిస్తూ తమ వాదనకు అనుగుణంగా నాటకాలనేకం రాశారు; పాదుక, రాధాకృష్ణ, విప్రనారాయణ, కంఠాభరణం ఎక్కువ ప్రచారంలోకి వచ్చాయి. వీరు హాస్యరస నిష్ణాతులు. ఆ రసమంటే మహాభిమానం. అందుచేత వీరి నాటకాలలో హాస్యం ముందుకు పరుగిడుతూంటుంది. పాత్రచిత్రణలో, కథా సంవిధానంలో వీరు అనేక నూత్న మార్గాలు తొక్కి తర్వాత రచయితలకు మార్గదర్శకులయ్యారు.

19 వ శతాబ్దం చివర, 20 వ శతాబ్దారంభంలో భారతమంతటా జాతీయతాభావం స్వాతంత్ర్యపిపాస రేకెత్తాయి. ఈ భావాల ప్రభావం వల్ల తెలుగులో రెండు సరికొత్త రకాల నాటకాలు బయలుదేరాయి ఒకటి: పూర్వచారిత్రక నాటకాలు, రెండు: సమకాలీన చారిత్రక నాటకాలు, మొదటిరకానికి చెందినవి వేదం వారి ప్రతాపరుద్రీయం, బొబ్బిలి; ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణశాస్త్రిగారి రసపుత్ర విజయం, కొప్పరపు సుబ్బారావుగారి రోషనార, పింగళి నాగేంద్రరావుగారి జేబున్నిసా, శ్రీపాదవారి బొబ్బిలి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నవి.

పింగళివారి జేబున్నిసా ద్విజేంద్రలాల్ రాయ్ నాటకాల ఫక్కీలో నడిచింది. రసపుత్ర విజయం, రోషనారలలోని పద్యాలు దేశభక్తిని పురిగొల్పుతాయి. మతకలహాలు వస్తాయనే వంకతో బ్రిటిష్ ప్రభుత్వం యీ మూడు నాటకా

లను నిషేధించింది. ప్రతాపరుద్రీయం కథా సంవిధానంలో, రసపోషణలో, పాత్రచిత్రణలో తెలుగులోని బహుకొద్ది ఉత్తమ నాటకాలలో ఒకటిగా పరిగణింపబడుతోంది. అయితే ఒక్క జేబున్నిసాలో మినహా తక్కినవాటిల్లో మామూలు పాత్రధారణలోనే గద్య పద్యాలు యథేచ్ఛగా వాడబడ్డాయి. రచనావిధానంలో పెద్ద మార్పేమీ రాలేదు. ఇక సమకాలీన చారిత్రక నాటకాలు: పంజాబుహత్యలు, బ్రిటిష్ ప్రభుత్వ దమననీతిలో భారతదేశం అట్టుడికినట్లు ఉడికిపోయింది. దాని ప్రభావంవల్లనే తెలుగులో దామరాజు పుండరీకాక్షుడుగారు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిలుగారు మొదలైనవారు పాంచాలీ పరాభవం, గాంధీ విజయంలాంటి నాటకాలు రాశారు. అయితే ఇవీ ప్రభుత్వ నిషేధానికి గురి అయినాయి.

నాటి రాజకీయాందోళనతో పాటు సాహిత్య రంగంలో, మత రంగంలో, సాంఘిక రంగంలో ఆందోళన ప్రారంభమై తత్ఫలితంగా నాటకం కొత్త కొత్త రూపాలు ధరించింది. సాహిత్య రంగంలో ఆనాడు ముందడుగు వేసింది సాహితీసమితి. అందులోని సభ్యులంతా మంచి భావుకులు, వ్యుత్పన్నులూ, వ్యావహారికభాషావాదులు. సభాపతి శివశంకరులవారు తక్కిన సాహిత్యశాఖలలోలాగానే నాటక శాఖలో నూత్న రూపాలను అందించారు. నిర్వచనంగా పద్యగేయాలతో వీరు చక్కటి నాటకాలు, నాటికలు చాలా రచించారు. వీరి పద్య నాటకాలలో భావనాశక్తి కంటె నాటకత్వం ముందుకు దూకుతూంటుంది. గ్రీకు మహాకవుల నాటకాలు వీరి నాటకాలు చదువుతూంటే స్మృతికి వస్తాయి. వీరి పద్మావతి, దీక్షిత దుహిత, కవిప్రియ సాహితీవేత్తల మన్ననలనందుకున్నాయి. అందులో దీక్షిత దుహిత గొప్ప కళాఖండం. సంభాషణలు పద్యాలలో సాగినా, చకచకా నడుస్తూ ఎంతో సొంపుగా ఉంటాయి. అప్పయ దీక్షితుల మానసికావస్థను చిత్రించడానికి వీరు నేపథ్య బృందగానాలు రచించి సరికొత్తమార్గం తొక్కారు.

గొప్ప భావనాశక్తి సంపన్నుడు విశ్వనాథ సత్యనారాయణగారు.

వీరు నర్తనశాల, అనార్కలీ, వేనరాజు మొదలైన నాటకాలు చాలా రాశారు. అయితే వీరి నాటకాలలో కవిత్వం ముందుకు ఉరకలు వేస్తూ నాటకత్వానికి అడ్డు తగులుతూంటుంది. వీరి అనార్కలీ గొప్ప 'లిరిక్' నాటకం. ఇందులో వీరు విభావాను భావ వ్యభిచారీ భావాలను పాత్రలుగా ప్రవేశపెట్టి వాటిద్వారా నాయకా నాయకుల మానసికావస్థను, పరిణామాన్ని వర్ణించారు. ఇట్టి రచన అపూర్వం. తెలుగు భాషకు ఒక అమూల్య మణి అనార్కలీ. వేనరాజులో కొంత మంది పెద్దలకి హోమోసెక్సు, మెటామార్ఫిజికల్ సెన్సు గోచరించాయి. అది గొప్ప శాస్త్రీయ నాటకమని పొగిడారు. మరికొంత మంది దృష్టిలో ఇది వట్టి అభివృద్ధి నిరోధక నాటకం. దీనిమీద గాలి దుమారం రేగింది. సత్యనారాయణగారు గొప్పగొప్ప సంస్కరణలకు పూనుకున్న వేనరాజును పెద్ద రాక్షసుడిగా చిత్రించారు. నాటక రచనా పద్ధతిలో పెద్ద మార్పేమీ ఇందులో తీసుకురాలేదు. ఇక నోరి నరసింహశాస్త్రిగారి సోమనాథ విజయం; దువ్వూరి రామిరెడ్డిగారి "మీరాబాయి" విషాదాంత నాటకంగా మన్నన పొందింది. వారిదే "కాంగ్రెస్ వాలా" హాస్యగర్భితమైన సాంఘికనాటిక. చింతాదీక్షితులుగారి శబరి, అబ్బూరి రామకృష్ణారావుగారి నదీసుందరి తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం సంపాదించుకున్నాయి. ఈమూడూపూర్తిగా వచన నాటకాలే. సోమనాథ విజయం చారిత్రాత్మకమైంది. చక్రవర్తి పాత్ర చిత్రణలో అనాటి యువకుల నెందరినో ఆకర్షించింది. శబరి చదువుతోంటే మాటర్ లింక్ మీరాబాయి జ్ఞాపకం వస్తుంది. చింతా వారు అడవులలోని వస్తువులను సైతం పాత్రలుగా చేసిన శబరి రామభక్తిని ద్యోతకం చేస్తూ ఉత్తమనాటకం రచించారు. నదీసుందరి వచనంలో ఉన్న ఖండకావ్యంలాగా నడుస్తుంది.

సాహితీరంగంలో ఆందోళనలో భాగంగా వ్యావహారిక భాషావాదం వచ్చింది. వ్యావహారిక భాష కావ్య రచనకు యోగ్యంకాదనీ అందులో ముఖ్యంగా నాటక రచనకు అసలే పనికిరాదని పండితమ్మన్యులు వాదించసాగారు. ఈ వాదనను ప్రతిఘటించడానికని గురజాడ

అప్పారావుగారు చక్కటి వ్యవహారిక భాషలో కన్యాశుల్కం రాశారు. నాటకంలో కుప్ప తెప్పలుగా పద్యాలు పాటలు రాయడం సంప్రదాయమైపోయిన తొలిరోజుల్లో (1896) పూర్తిగా వచనంలో, అందులో వ్యవహారికంలో నాటకం అవతరించడం నిజంగా చిత్రమే కాక గురజాడవారి ప్రతిభను, దూరదృష్టినీ వెల్లడిస్తాయి. కన్యాశుల్కంలో పాత్రలు జీవకళతో ఉట్టిపడుతూ తెలుగువారి హృదయాలలో పీఠం వేసుకున్నాయి. గిరీశం, రామప్పంతులు, మధురవాణి, అగ్నిహోత్రావధాన్లు, వెంకటేశం మనకి నేటికీ నిత్యం కనిపిస్తూనేవున్నారు. తెలుగు నాటక సాహిత్యంలో వాస్తవికతకు పునాదులు వేసింది అప్పారావుగారే. అందుకే నాటికీ నేటికీ సాటిలేని నాటకంగా కన్యాశుల్కం విరాజిల్లుతోంది. అయితే ప్రతిపక్షులు ఊరుకున్నారా? ఏదో చచ్చు సాంఘిక నాటకాలకి వ్యవహారికం ఉపయోగిస్తుందేమో కాని పౌరాణిక నాటకాలకు ఏమాత్రం పనికిరాదని మొదలుపెట్టారు. వారి సవాలును అందుకుని చిలుకూరి నారాయణరావుగారు రసవత్తరంగా అశ్వత్థామ, అంబ మొదలైన పౌరాణిక నాటకాలను, శుద్ధ వ్యవహారంలో రచించి చూపారు.

ఇంకోవైపునుంచి రామాయణ భారతాది పురాణాలమీద, బ్రాహ్మణ మతంమీద తిరుగుబాటు లేచింది. దీనికి నాయకుడు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. వీరు పురాణ కథలకు, పాత్రలకూ కొత్త వ్యాఖ్యానంచేసి నూత్న దృక్పథంతో శంబుకవధ, ఖూనీ అని రెండు నాటకాలు రాశారు. శంబుకవధ పాతపద్ధతిలోనే రచించినా, ఖూనీలో కొత్తపోకడలు పోయారు. వీరిదృక్పథాన్ని నుసరించి ముద్దుకృష్ణ అశోకం, గుడిపాటి వెంకటచలం గారు శశాంక, పురూరవ మొదలైన రసవత్తర నాటకాలు రచించారు. అయితే చలంగారి నాటకాలు సవ్యభావాలతో చదువుకోడానికి ఎంతో రమ్యంగా ఉంటాయి. పాత్ర చిత్రణలో కథాసంవిధానంలో నూతనత్వమే వీరినాటకాలలో గోచరిస్తుంది.

సమాజంలోనికుళ్ళును క్షాళనం చేయాలనే మహోద్దేశంతో పెద్ద ఉద్యమం లేవదీసిన వీరేశ

లింగంగారు తమకు సాధనంగా నాటక రచనను చేపట్టి విచిత్ర వివాహం, బ్రాహ్మ వివాహం, మున్సిపల్ నాటకం మొదలైన ప్రహసనాలు పూర్తి వచనంలో వ్యవహారానికి చాలా దగ్గరగా ఉండే సులభశైలిలో రచించారు. అయితే వారి ప్రధానాశయం సంఘసంస్కరణ అవడంవల్ల వారి రచనలలో శిల్పం కొంచెం దెబ్బతిన్నదనే చెప్పాలి. వీరేశలింగంగారి ఉద్యమ ఫలితంగా చాలా సాంఘిక నాటకాలు వెలువడ్డాయి. కాళ్ళకూరి నారాయణరావుగారి చింతామణి, వరవిక్రయం, మధుసేవ; సోమరాజు రామానుజరావుగారి రంగూన్ రౌడీ అమితప్రచారంలోకి వచ్చాయి. వీరు సాంఘిక సమస్యల లోతుపాతులలోకి వెళ్ళకుండా పైపై విషయాలనే పట్టుకు నాటకాలు రాయడంతో విషమఫలితాలు కలిగాయి. వీటికి 'రౌడీ నాటకాల'ని పేరు వచ్చింది. వీటిలోని కృత్రిమ సన్నివేశాలు, పాత్రచిత్రణలోట్లు ఎన్నో ఉన్నాయి. వీటిని తొలి సాంఘిక నాటకాలుగా మాత్రమే పరిగణించాల్సి వుంటుంది.

ఇంతవరకు మనం పరిశీలించిన రచయితలు, గురజాడవంటి ఏ బహుకొద్దిమందినో మినహాయిస్తే, ఆదర్శవాదులు, భావవాదులు. వీరు రచనా సంవిధానంలో ఎన్ని కొత్తపోకడలు పోయినా, ఎన్ని కళారూపాలను అందించినా, వీరి దృష్టి అంతా గతకాలం వైపే. అందుచేతనే వారి నాటకాలు పురాణకథలతోను, చారిత్రక కథలతోనూ నిండి బూజుపట్టిన సిద్ధాంతాలను ప్రసాదిస్తుంటాయి. కాని కాలం మారింది. జాతీయ అంతర్జాతీయ సాహిత్య పరసం, పరిణామాలవల్ల 1930 ప్రాంతాలకే యువకులలో నవచైతన్యం కలిగింది. మార్క్సిస్టు సిద్ధాంతాలు, అతివాదభావాలు యువకులను ఆకర్షించాయి. కనువిచ్చి చూచారు. కనిపించిందేమిటి? జీర్ణావస్థలలో ఉన్న సాంఘిక ఆర్థిక వ్యవస్థ. ధనికుడు – బీద అనే రెండు వర్గాలు. ఆ రెండు వర్గాల మధ్య నిత్యసంఘర్షణ. ఎంత నీచానికైనా ఒడిగట్టి ధనికుడు దరిద్రుణ్ణి పీల్చి పిండిచేస్తూ భోగభాగ్యాలతో తులతూగుతుంటే దరిద్రుడు తిండిలేక మాల్గడం వారి

కంటికి దృశ్యమానమైనాయి. సంఘంలో పెద్దమనుష్యులు చెద పురుగుల్లా చేరి మూఢనమ్మకాలను, మూఢాచారాలను ప్రచారం చేస్తూ మతంపేరిట, దేవుడిపేరిట దురన్యాయాలు జరుపుతూండడం గోచరించింది. నవకవి ఈ అన్యాయాలను ఎదుర్కొంటానికి వాస్తవికత దృష్టితో పరిశీలించి, వాస్తవికతను ప్రాతిపదిక చేసుకుని కలంపట్టాడు.

నాటక సాహిత్యం ఇంకో దశను, అభ్యుదయ దశను చేరుకుంది. కన్యాశుల్కం తర్వాత మళ్ళీ వాస్తవికతా దృష్టితో రచితమైన నాటకం "తప్పెవరిది". రచయిత పి. వి. రాజమన్నారు. సారంగధర ఇతివృత్తాన్నే నేటి సంఘపరంగా రచించినా యిందులో ఎన్నో కొత్తపోకడలు కనిపిస్తాయి. ఈ నాటకాన్ని బళ్లారి రాఘవ ఆంధ్రదేశంలో పలు తావుల ప్రదర్శించడంతో మన నాటక చరిత్రలో నూతనశకం ప్రారంభమైంది. యువకవులు నాటకం తిలకించి ఉత్సాహపూరితులై వాస్తవిక జగత్తును నాటకాలలో ప్రతిబింబింపజేయ పూనుకున్నారు, ఈ నూతనయుగంలో వచ్చిన నాటకాలలో విశిష్టత రెండువిధాలు. ఒకటి వస్తువు, రెండు శిల్పం.

పతనావస్థలోనున్న భూస్వామ్య విధానాన్ని ఏదోవిధంగా నిలబెట్టుకోడానికి ఎంతటి దారుణాలకైనా తయారయే ధనిక భూస్వాములకు, వారి బారినుంచి తప్పించుకుని బానిస శృంఖలాలను త్రెంచుకుని స్వేచ్ఛగా జీవించడానికి సంఘటితపడుతున్న బీదరైతు, కూలీలకు మధ్య సంఘర్షణ అభ్యుదయ నాటకాలకు మూలవస్తువైంది. ఈ ఇతివృత్తాన్ని ఆధారం చేసుకుని అనేకమంది రచయితలు నాటకాలు రాశారు. వాటిలోకల్లా ఎక్కువ ప్రచారంలోకి వచ్చినవి వాసిరెడ్డి, సుంకర రచించిన ముందడుగు, మాభూమి. ఈ రెండు నాటకాలను, అందులో ముఖ్యంగా మాభూమిని అనేక నాటకసమాజాలు ప్రదర్శించాయి. కొన్ని లక్షలమంది ప్రజలు చూచి ఆనందించి చైతన్యం పొందారు. అనేకమంది రచయితలు, నాటకసమాజాలు ఈ నాటకంవల్ల ఉత్సాహాన్ని పొందారు. ఇటీవల వాసిరెడ్డి విడిగా రచించిన పోతుగడ్డ మాభూమి నాటకానికి సవాయిలా కనిపిస్తుంది.

ఆంధ్ర ప్రజాజీవితంలో అత్యంత ప్రాధాన్యం వహిస్తున్న ఈ సంఘర్షణ రచయితలను సహజంగా ఆకర్షించింది. అనేకులు ఈసంఘర్షణలోని వివిధరూపాలను ద్యోతకం చేస్తూ నాటకాలు రాశారు. కాని సృజనాత్మకశక్తి కొరవడంవల్ల ధనికభూస్వామిలాంటి పాత్రలలో ఏమార్పు లేకుండా మూసకట్టినట్లు ప్రత్యక్షమవుతున్నాయి. ఒకే రకమైన సంఘటనలు పునరావృతమవుతున్నాయి. ఈ విషయంలో యువరచయితలు జాగ్రత్త వహిస్తే వారినాటకాలు ఇంకా రాణింపుకు వస్తాయి.

ధనిక భూస్వామే గాక ప్రజలను దోచుకుని తినే పెట్టుబడిదారీ వర్గం ఒకటి బయలుదేరింది. ఈ పెట్టుబడిదారు ఫ్యాక్టరీ యజమాని, మాస్టకు వీవకు, అద్దెకొంపల యజమాని మొదలైన అనేకరూపాలలో అవతరిస్తూ దయాదాక్షిణ్యాలు విడిచి ఎలా దరిద్రులను పీడిస్తూన్నది ద్యోతకంచేసే నాటకాలు వెలువడుతున్నాయి.

మధ్యతరగతి కుటుంబాలు అటు ధనికవర్గానికి కాక, ఇటు బీదలకు కాక ఘరానాకోసం, పరువుకోసం పాకులాడుతూ నానాబాధలూ పడుతున్నాయో అభివర్ణించే నాటకాలు కూడా బయలుదేరాయి. ఆచార్య ఆత్రేయగారి యన్. జి. ఓ. ఈ తరగతి నాటకాలలో అగ్రస్థానం వహిస్తుంది. ఆత్రేయగారి నాటకాలలోనే ఒక విశిష్టత ఉంది. మంచి చమత్కారంగా ఉండే సంభాషణలు వీరి నాటకాలకు వన్నె పెడుతున్నాయి. యన్. జి. ఓ నాటకంలోని కథాసంవిధానం, సన్నివేశాలు, పాత్ర చిత్రణా అతిసహజంగా ఉండి పఠితృప్రేక్షక హృదయాలలో నాటుకుపోయాయి.

1947 కి పూర్వం, తర్వాత భారత రాజకీయాలలో వచ్చిన పరిణామాలు ప్రజలను, రచయితలను కదిలించి వేశాయి. ఆ కదలిక ఫలితంగా ఈనాడు,. ఏకదేశం, ఇదా స్వాతంత్రం, మొదలయిన నాటకాలు నాటి రాజకీయ పరిణామాలను, వాటి ఫలితాలను ప్రతిబింబిస్తూ వెలువడినాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం యుద్ధోన్మాదులు తయారుచేస్తున్న మారణాయుధాలకు ప్రపంచం దద్దరిల్లిపోయింది. ప్రపంచప్రజలలో శాంతి కావాలనే ఆకాంక్ష మిన్ను

ముట్టింది. శాంతిఉద్యమం మహోధృతంగా లేచింది. ప్రపంచ ప్రజా శాంతి కాంక్షను ద్యోతకం చేస్తూ అనిశెట్టి "శాంతి", ఆత్రేయ "విశ్వశాంతి", పడాల "సందేశం", గిడుతూరి "చిరంజీవి మానవుడు" మొదలైన నాటికానాటకాలు వెలువడ్డాయి. అనిశెట్టి "శాంతి" తెలుగు నాటకరంగానికి ఒక క్రొత్త రూపాన్ని సమర్పించింది. "శాంతి" మూక నాటిక నేపథ్యంలో వ్యాఖ్యాత, గీతాలు పాత్రల సంభాషణలను వినిపిస్తుంటే రంగస్థల మీద పాత్రలు మూకాభినయం చేస్తాయి. ఈ నాటిక ఆంధ్ర ప్రజాన్నే కాన్నే గాక, రష్యన్ కళావేత్తలను సైతం ముగ్ధులను చేసింది. ఆత్రేయ "విశ్వశాంతి"లో క్రొత్త పోకడలు కనిపిస్తాయి.

సంఘంలోని కుళ్ళును, హేళన చేసే ఉద్దేశ్యంతో వ్రాసిన డా॥ గంగాధరరావు, భూషణబాబు, కణ్వశ్రీ, గోపాలరాయశర్మ ప్రభృతుల నాటకాలు ప్రజామన్ననలను పొందుతున్నాయి.

స్వాప్నికజగత్తు, విచిత్రమైన జగత్తు, మానవుడు కట్టుకునే గాలిమేడలు, తీరని కోరికలు ఆ జగత్తులో ప్రత్యక్షమౌతుంటాయి. ఈ విచిత్ర స్వాప్నిక జగత్తుకు నాటకరూపమిచ్చి అనిశెట్టి, శ్రీవాత్సవ నూతనపంథాలో నాటకాలు నడిపారు. వాస్తవికదృష్టితో, వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబింప చేస్తూ, రసవత్తరమైన నాటకాలు వెలువడటంతో నాటకంలో వాస్తవికతకు సుస్థిరస్థానం సంపాదించింది.

ఇక శిల్పం. జాతీయ, అంతర్జాతీయ సాహిత్య అవలోకనం వల్ల, కొత్తరూపాలు తీసుకురావాలనే ఆకాంక్ష వల్ల యువరచయితలు శిల్పంలో కొత్తదారులు పట్టారు.

1. అంకవిభజన చేయకుండా కొంతకాలం గడిచిందని సూచించటానికి ఫేడిన్, ఫేడవుట్ వాడి, టెంపోను నిలబెట్టారు. (ఈనాడు)

2. పాత్రల మానసికావస్థలను స్వగతాలతో కాకుండా, నేపథ్యగానంతో ద్యోతకమొనర్చారు. (నేతబిడ్డ, గాలిమేడలు.)

3. ప్రేక్షకులను కూడా నాటక ప్రదర్శనలో భాగస్వాములు చేయాలనే తలంపుతో పాత్రలను ప్రేక్షకుల మధ్య కూర్చోపెట్టడం, ప్రేక్షకులతో మాట్లా

డించటం (గాలిమేడలు, విశ్వ శాంతి, ఎవరు దొంగ)

4. స్వాప్నిక జగత్తును, సినిమాలలోలాగా పాత్రలఛాయలు లేచి నడిచిపోయినట్లు ప్రదర్శించటం (గాలిమేడలు, తీరనికోరికలు)

5. నాటకంలోనే ఛాయనాటకాల ప్రదర్శన (నిజానిజాలు, భూమికోసం, ఆసామి)

6. నాటకమంతా ఒక పాత్ర, ఇంకొక పాత్రకు వర్ణించి చెప్తున్నట్లు నడిపించటం. అంక అంకానికి నేపథ్యంలో పూర్ణకథను వివరించటం. (సీతారామరాజు పితూరీ)

ఈ విధంగా నూతన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకొని ప్రజాళి శాంతి సౌఖ్యాలనుభవించటానికి మార్గం సుగమమం కావాలనే మహదాశయంతో యువరచయితలు నూతన పోకడలతో ఆంధ్ర నాటక కళకు వినూత్న రూపాలను సమర్పిస్తున్నారు. ఆంధ్ర ప్రజాజీవితాన్ని సర్వతోముఖంగా చిత్రిస్తూ సమస్యల, పాత్రల లోతుపాతులను ఇంకా లోతుగా పరిశీలించి ఉత్తమ కళారూపాలను మన యువరచయితలు నెలవరించ గలరనడంలో సందేహం లేదు.



# నేటి వాడుకభాషే నేటి గ్రాంథికభాష

## గిడుగు సీతాపతి

"నేఁటి శిష్టజన వ్యవహారమందున్న భాష వచన రచనకు అర్హత గల భాష; పాఠశాలలలోను విశ్వవిద్యాలయమువారి కళాశాలలలోను ఉన్న విద్యార్థులకు ఈ వ్యావహారిక భాషలో తమ వ్యాసములున్ను పరీక్షలలో ప్రశ్నలకు సమాధానములున్ను వ్రాయుటకు అధికారులు అనుజ్ఞ ఈయవలెను; తెలుగు రచయితలు తమ వ్యాసములు, విమర్శలు, నవలలు, కథలు, కథానికలు మొదలయిన వచన రచనలు ఈ వ్యావహారిక భాషలో రచించుటకు తగిన ప్రోత్సాహము కలిగించవలెను" అని 1906–10 లో వ్యావహారిక భాషావాదులు తమ కోరికను ప్రకటించినప్పుడు దేశములో అలజడి ప్రారంభించినది.

సరిగా ఆకాలమందే విద్యావిధానములో మార్పులు కలిగినవి. మెట్రిక్యులేషన్ పరీక్షకు మారుగా స్కూల్ ఫైనల్ పరీక్ష అమలులోనికి వచ్చినది. మద్రాసు విశ్వవిద్యాలయమువారు ఎఫ్. ఏ. పరీక్షకు మారుగా ఇంటర్మీడియట్ పరీక్ష పెట్టినారు. విద్యావిషయ ప్రణాళికలలోకూడా మార్పులు కలిగినవి. "బ్రిటిష్ ప్రభుత్వమువారి హయాంలో చిన్న తరగతులనుండి ఎమ్. ఏ. పరీక్షలవరకున్ను గల సకల విషయముల పాఠములున్ను ఆంగ్ల భాషలోనే బోధించుటవల్లను తెలుగుభాషా సాహిత్య శిక్షణము నిర్బంధముగా కాక ఐచ్ఛికముగా జరుగుతుండుటచేతను ఎమ్. ఏ. పరీక్షలో నెగ్గిన తెలుగు విద్యార్థికులయినను చాలామంది తాము నేర్చుకొన్న విజ్ఞానము తెలుగు భాషలో చెప్పుటకు సమర్థులు కాలేకపోయినారు. సభలలోనైనా ఆగ్లమందేకానీ తెలుగున మాటలాడలేకపోయినారు." ఈ పరిస్థితిని తెలిసికొన్న విద్యాధికులు క్రొత్తగా ఏర్పడ్డ స్కూల్ ఫైనల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు తెలుగులో వ్యాసరచన, తెలుగులోని కితరభాషలనుండి అనువాదనము నిర్బంధము పెట్టినారు.

ఆ కాలమందు వ్యావహారిక భాషావాదులు కడు కొద్దిమందే అయినా ప్రభుత్వాధికారుల పరిచయమున్ను పలుకుబడిన్ని గలవారు కనుక, వారి సలహాల ననుసరించి స్కూల్ ఫైనల్ పరీక్షకు తెలుగు వచనరచన వ్యావహారిక భాషలో సాగించుటకు ప్రభుత్వము వారు విద్యార్థులకు అనుమతిచ్చినారు; అంతేకాక వారి రచనకు మార్గదర్శకముగా ఉండదగిన వచనగ్రంథ మొకటి – శ్రీ. శే. సెట్టి లక్ష్మీనరసింహంగారు రచించిన గ్రీకు మిత్తులు అనేది స్కూల్ ఫైనలుకు పాఠ్యగ్రంథముగా నిర్ణయించినారు. దానితో దేశమందు పుట్టిన అలజడి ఎక్కువగా వ్యాపించినది.

ఆ సమయమందే విశ్వవిద్యాలయమువారు ఇంటర్మీడియట్ పరీక్షకు నిర్ణయించిపెట్టిన వ్యాసరచన పండితులు కానలెనన్న గ్రాంథికభాషలో ఉండవలెనా? వ్యావహారిక భాషలో ఉండవచ్చునా? అనే విషయమును నిర్ణయించుటకు ఒక ఉపసంఘమును ఏర్పరచినారు. అందులో నలుగురు వ్యావహారిక భాషావాదులున్ను, నలుగురు గ్రాంథిక భాషావాదులున్ను ఇద్దరు మధ్యస్థులున్ను ఉండిరి. ఈ ఉపసంఘము కొన్ని సమావేశములు జరిపి, ఈ విషయమును గూర్చి కొంత చర్చచేసిన తర్వాత మధ్యస్థులు ఇద్దరున్ను వ్యావహారిక భాషావాదులైన నలుగురు సభ్యులతోను ఏకీభవించి "వ్యాకరణమునకు గ్రంథములందలి రూపములున్ను వాడుకలోగల రూపములున్ను ప్రయోగార్హములే" అనే తీర్మానము నెగ్గించినారు. దానితో తెలుగుభాషకు ఘోరమైన ఆపద సంభవించినదని ఘోషిస్తూ ఈ తీర్మానమును నిరర్థకము చేయుటకు సంకల్పించి పెద్దలు కొందరు విశ్వవిద్యాలయమువారికి మహజర్లు పంపినారు. వాడుకలోగల రూపములను ఎన్నుకొను నప్పుడు దేశమందంతటను గల శిష్టరూపములను ఎన్నుకొనవలసి యున్నది. ఈ ఉపసంఘములో ఉన్న సభ్యులందరున్ను సర్కారు జిల్లాలవారే: కాని ఇందులో రాయలసీమ ప్రతినిధు లెవరును లేరు కనుక రాయలసీమ ప్రతినిధులను నలుగురిని ఈ ఉపసంఘములో చేర్చుకొనవలెను

అన్న కోరిక తెలియజేస్తూ తెలుగు పెద్దలు విశ్వవిద్యాలయమును వారికి మహాజర్లుపంపి ఒత్తిడికలిగించినారు. వారి కోరిక ననుసరించి నలుగురిని రాయలసీమ ప్రతినిధులను ఈ ఉపసంఘములో చేర్చుట జరిగినది. నాను గ్రాంథిక భాషావాదులయిన సభ్యులతో ఏకమయి తీర్మానము ననుసరించి వాడుకభాషా పదములనుఎన్నుటకు మారుగా అసలు తీర్మానమునకుగల అర్థము నే తారుమారుచేయుటకు సిద్ధపడినారు. ఎన్నుకొనే రూపములలో ప్రతిదిన్ని గ్రంథములందుండవలెను వాడుకలోను ఉండవలెను అట్టి రూపములనే ఎన్నుకొనవలెనన్న అర్థము ఆ తీర్మానమునకు కలదని వాదించినారు. ఈ ఉపసంఘంలో గ్రాంథిక భాషావాదుల సంఖ్య ఎనిమిదయినది. తక్కినవారిసంఖ్య ఇద్దరు మధ్యస్థులను కలుపుకొన్నా ఆరే అయినది. అందుచేత ఆ ఎనమండ్రు చెప్పిన మాటే నిలుచుటకు ఆధారమేర్పడినది. "వస్తుంది" "పోతుంది" వంటి రూపములు వాడుకలో ఉన్నా గ్రంథములలో లేవుకనుక పనికిరావు అని ఆ ఎనమండ్రు అన్నప్పుడు 'అసవుడు' 'నావుడు' అర్థానుస్వారము శకటరేఫముగల పదములు గ్రాంథికభాషలో ఉన్నా వ్యవహారములో లేవు కనుక అవి కూడా పనికిరావని అనవద్దా అని ఈ ఆనుగుణంగా వారికి ఇదివరకే ఉనుష్క ఉన్నది అని ఆ ఎనమండ్రు అన్నారు. ఇక్కడ ఎవరి సంఖ్య అధికమో వారిమాట నగ్గవలసినదేకాని ఇది సబబు అవునా కాదా అనే మాటకే అవకాశము లేకపోయినది. దీనికితోడు దేశమందు వ్యావహారిక భాషావాదము అంగీకరించరాదన్న ఘోష ఎక్కువయినది. ఇదంతా చూచి విశ్వవిద్యాలయము వారు భయపడి "ఈ వ్యావహారిక భాషను ప్రస్తుత పరిస్థితులలో విశ్వవిద్యాలయమువారు గ్రహింపజాలరు" అని తమ నిశ్చితాభిప్రాయమును 1914లో ప్రకటించినారు. విశ్వవిద్యాలయమువారు ఒప్పుకోలేదు కనుక మేమున్ను ఒప్పుకోలేము అని విద్యాశాఖాధికారులు స్కూల్ ఫైనల్ పరీక్షల విషయములో వ్యావహారికభాషను విద్యార్థులు తమ వచన రచన సాగించవచ్చుననే అనుమతిని రద్దు

పరచినారు. దీనితో వ్యావహారిక భాషావాదమునకు పూర్తిగా అపజయము కలిగినది.

ఈ అపజయమువలన వ్యావహారిక భాషావాదులు నిరుత్సాహపడి నిస్పృహచెందినా గిడుగు వేంకటరామమూర్తిగారు ధైర్యం వహించి తాము సేకరించియుంచిన నిదర్శన పత్రికరాలతో తెలుగు దేశమందలి వివిధనగరములకున్ను, పెద్ద గ్రామాలకున్ను సంచారము గావించి, సభలు జరిపించి ఉపన్యాసము లిచ్చి వ్యావహారిక భాషకు గల సత్తా నిరూపిస్తూ ప్రమాణము లనదగిన నిదర్శనములను ప్రదర్శిస్తూ తమ వాదమును నచ్చచెప్తూ వచ్చినారు. ఆ కాలమందు అనగా 1914–1915 లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ఇంకా ఏర్పడక పూర్వము మద్రాస్ విశ్వవిద్యాలయమునకు చెందియుండిన కళాశాలలకు అనగా బరంపురం, పర్లాకిమిడి, విజయనగరము, విశాఖపట్టణము, కాకినాడ, రాజమహేంద్రవరము, మచిలీపట్నము, గుంటూరు, అనంతపురం, మద్రాస్ నగరము లందలి కళాశాలలకు వెడలి ఆ కళాశాలల ప్రిన్సిపాలులను కలిసికొని వారి యాజమాన్యమున ఉపసంఘములను ఏర్పరుపజేసి ఆ ఉపసంఘముల వారికి తమ వాద స్వరూపమును, యాథార్థ్యమును నిదర్శనములతోపాటు తెలియజెప్పి ఆ ఉపసంఘములవారి అభిప్రాయములను, నివేదికలను పుచ్చుకొని తాము సంపాదకులుగా నడపిన తమ తెలుగు పత్రిక సంచికలలో ప్రకటించినారు.

వారి వ్యావహారికభాషా వాదమంతా వారు రచించిన వ్యాసావళి, గద్యచింతామణి, పండితభిషక్కుల భాషాభేషజము, బాలకవిశరణ్యము అనే నాలుగు గ్రంథములందును స్పష్టముగాను, పూర్తిగాను నిరూపితమైయున్నది.

ఈ వాదమునకు సంబంధించిన విషయ మొకటి నేటి తరమువారికి తెలియుటకు అవకాశము లేనిదిమందుగా తెలియజేయవలసియున్నది. ఈ వ్యావహారిక భాషావాదము 1906,10 లో క్రొత్తగా పుట్టినట్లు కనబడునుగాని ఇది పూర్వ సంప్రదాయమును పునరుద్ధరింపజేసినదే కాని క్రొత్తగా పుట్టినది కాదు. తెలుగు సాహిత్య

చరిత్రలో ప్రబంధములతోపాటు వచన గ్రంథములుకూడా 16 వ శతాబ్దమునుండిన్నీ రచితములగుతూ వచ్చినవి. ఈ రచనలన్నీ—ఏవో రెండుమూడు తప్ప—వ్యావహారిక భాషలోనే రచితములయినవి. అంతేకాక లక్షణ గ్రంథములందలి వివరణములు, వ్యాఖ్యానాలు మొదలయినవికూడా వ్యావహారిక భాషలోనే రచితములయినవి. వ్యావహారికభాషలో 1850కి పూర్వము రచితములయిన వచన గ్రంథములు వందలకొలదిగా ఉండెను. అచ్చుయంత్రము వచ్చిన తర్వాత ఇందులో కొన్ని మాత్రమే ముద్రితములైనవి. రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారు (అనగా చెన్న నగర పాఠశాలలో తెలుగు పండితులుగా ఉన్నవారు) రచించిన ద్వాత్రింశత్సాలభంజిక కథలు 1819 లోను, పంచతంత్ర కథలు 1836 లోను అచ్చుపడినవి. అతనున్ను, అతనివంటి పండితులున్ను రచించిన వ్యాకరణములు కూడా వ్యావహారికభాషలోనే రచితములై ముద్రితములైనవి. ఇవిన్ని, ఇట్టివే మరికొన్ని కథలు, వాచకములున్ను ముద్రితములయి బడులలో పాఠ్యగ్రంథములుగా ఉండెను. వాడుక భాషలో రచితములయిన వచన గ్రంథములు కూడా బడులలో విద్యార్థులచేత చదివించడమున్ను, వాడుకభాషలోనే విద్యార్థులుతమ వచన రచన సాగించడమున్ను సత్సంప్రదాయానుసారముగానే ఉండెనని మనమూహించవచ్చును.

ఈ విషయము 60 సంవత్సరముల కాలము మరుగుపడి యుండుటవలన ఈ తరమువారికి తెలియలేదు. మరుగుపడి యుండుటకు కారణ మేమనగా 1863 లో పరవస్తు చిన్నయసూరిగారు పండితులయి పలుకుబడి సంపాదించి పూర్వవచన రచనా సంప్రదాయమునకు విరుద్ధముగా ప్రబంధాది పద్యకావ్యములందలి కావ్యభాషలోనే వచనరచన సాగించవలెనన్న పట్టుదలతో నిర్దుష్టముకాని నీతిచంద్రిక అనే ఒకచిన్న పుస్తకమున్ను అసమగ్రము, అనిర్ణాయకము, భ్రమ ప్రమాదములకు ఆస్పదము అయిన బాలవ్యాకరణము అనే ఒక వ్యాకరణమున్ను రచించి బడులలో పెట్టించి ప్రాచీనకావ్యభాషే పద్యకావ్యములకు మాత్రమేకాక వచనకావ్యములకు

కూడా యోగ్యమయినదన్న తన మతమును నిలబెట్టి వ్యాప్తిలోనికి తెచ్చిపెట్టి స్వర్గస్థులైనారు. నాటి నుండియిన్ని వాడుక భాషలోగల పుస్తకములు అడుగంటినవి. కొన్ని పునర్ముద్రితము లయినా కవి హృదయమునకు విరుద్ధముగా అందులోని వాడుకభాష తొలగించి దాని స్థానములో గ్రాంథిక భాషాపరివర్తనముగూర్చి పరిష్కర్తలు ప్రకటించుట జరిగినది. అంతేకాదు; అప్పకవి మొదలయిన లాక్షణికులు వచనరచనా సంప్రదాయమును పాటిస్తూ రచించిన వలినిడులు మొదలయినవికూడా ప్రాతప్రతు లన్నిటను వాడుకభాషలోనేఉన్నా అచ్చులో వాటిని కావ్యభాషలోనికి మార్చి పూర్వ సంప్రదాయమును కప్పిపుచ్చినారు.

చిన్నయసూరిగారు పూర్వ సంప్రదాయమును తొలగించి ప్రాచీనకావ్యభాషలోనే ప్రాథమిక పాఠశాలలలో చదువుకొనే పసిపిల్లలు మొదలుకొని కళాశాలలలో చదువుకొనే పెద్ద విద్యార్థుల వరకున్ను ఆబాలగోపాలం అందరున్ను కావ్యభాషలో రచితములయిన వచనగ్రంథములు చదువుకోవలెను; కావ్యభాషలో తమ రచనలన్నీ సాగించవలెను అనే నూతన సంప్రదాయమును తెచ్చిపెట్టుటవల్ల మేలుకలుగుటకు మారుగా కీడే కలిగినది.

కావ్యభాష సులువుగా పట్టుపడగల భాషకాదు. అది ఎంతో కష్టపడి నేర్చుకున్న పండితులకైనా పూర్తిగా పట్టుబడలేదని చెప్పగలము. చిన్నయసూరి మొదలుకొని నేటివరకున్ను గల రచయితలలో ఒక్కరయినా నిర్దుష్టమైన గ్రంథము రచించినవారు కనబడలేదు. పెద్ద పండితులని పేరుపొందిన వారి గ్రంథములనుండి పూర్వలక్షణ విరుద్ధము లయిన ప్రయోగములను రామమూర్తిగారు చూపించినారు. ఇట్టి దుస్థితికి కారణము లేకపోలేదు. ప్రాచీన వ్యాకరణము ఒక కాలమునాటి భాషకే లక్షణము నిరూపించినది. అదియైనా సమగ్రమయినదికాదు. కాని, అందులో భాషాతత్త్వమును, వ్యాకరణ లక్షణమును తెలియజేసే సూత్రములు—నిత్యా ప్రవాహినీ దేశ్యా; (శబ్ద) సిద్ధిర్లోకాత్ దృశ్యా; ప్రయోగమూలం

వ్యాకరణమ్ అనేవి ఉన్నవి. కనుక ఆ ప్రాచీన వైయ్యాకరణులను మనము నిందించ నక్కరలేదు. ఆ సూత్రములను సరిగా అర్థము చేసికోకుండా తప్పుదారిని మనలను నడిపించిన అర్వాచీన లాక్షణికులను, పండితులను నిందించవలెను. 'సతత ప్రవాహినీ దేశ్యా' అనుటచేతను దేశభాషయైన మన తెలుగు భాష నిత్యముగా తెలుగుభాషయే యైనా, కాలలోని సీమవలెనే మారుతూ ఉంటుందన్న భావము విశదమవుతూ ఉన్నది. శబ్దసిద్ధి లోకంబునన్ జేయును అనుట వల్లను లోకుల వాడుకనుబట్టే భాషా లక్షణము గుర్తించవలసి యున్నదనిన్ని, 'ప్రయోగమూలం వ్యాకరణమ్' అనుటవలన ప్రయోగాలను అనుసరించి వ్యాకరణ సూత్రాలను సవరిస్తూ ఉండవలెనన్ని తేలినది. ప్రయోగమంటే కవి ప్రయోగమే అని అర్థము చెప్పినా, కవి ప్రయోగించే శబ్దమునకు ప్రామాణ్యము లోకమునుండే సిద్ధిస్తున్నదని చెప్పుటచేత కవికైనా, లక్షణకర్తకైనా లోకమే ప్రమాణమని స్పష్టపడుతున్నది. అప్పకవి, చిన్నకవి, అడిదం సూరకవి మొదలయిన లాక్షణికులు కవి ప్రయోగములను ప్రదర్శిస్తూ ప్రయోగమూలం వ్యాకరణమ్ అనే ధర్మాన్ని కొంతవరకైనా అవలంబించారు. చిన్నయ సూరిగారు టిట్టు, లాట్టు, అత్తు, ఉత్తు, ముత్తు, కుక్ మొదలయిన పారిభాషిక సంజ్ఞలతో వ్యాకరణ సూత్రాలు కట్టుదిట్టముగా వాటిని రచించినారని మన పండితులు సంతోషించి మెచ్చుకొన్నారే కాని కవి ప్రయోగాలను లక్ష్యం పెట్టక సూత్రాలు సర్దించినారనిన్ని ఆ సూత్రాలనుబట్టి నన్నయాది మహాకవుల ప్రయోగాలు లక్షణ విరుద్ధములయినవిగా ఎన్నవలసి వస్తున్నదనిన్ని, పూర్వకవుల ప్రబంధాలు అచ్చువేసినప్పుడు పరిష్కర్తలయిన పండితులు చిన్నయ సూరి సూత్రాలనుబట్టి ఆ ప్రబంధాలలోని ప్రయోగములు తీసి కూర్చుంచి దిద్ది కవుల రచనలను తారుమారు చేయుచుండుట జరుగుతూ ఉన్నదన్ని గ్రహించకుండా ఉన్నారు.

ఈ స్థితి తిన్నగా గుర్తించిన వారు కనుకనే తిరుపతి వేంకటేశ్వర కవులు

"వ్యాకరణ మొక్క త్రోవ, మ
హాకవు లొక త్రోవ, కోశ
మ్ములు మఱొక త్రో
వైన కనుపట్టుడి నీ భా
షా కావ్యమ్ములను దఱచు
చదివిన కొలదిన్ ॥

"పోలిబాస యందువలె నీ
తెలుఁగు బాస నెలయించు
దీపము లేమిన్
విలువగల కవుల లక్ష్య
మ్ముల తా మీ భార మెల్ల
మోయుంగ వలయున్ ॥

అని పలికారు. అంతేగాక,

"కాలముఁబట్టి దేశమును
గాంచి ప్రభుత్వము నెంచి దేశ భా
షా లలితాంగి మారుటది
సత్యపి సమ్మతమౌట, నన్యదే
శ్యాలను నాంధ్రభాషఁ గల
వాటను నౌచితిఁబట్టి మేము క
బ్బాలను వాడుచుంటిమని
పండితు లేగతి నొప్పుకుందురో."

అని పద్యకావ్య రచన విషయములో ఔచితినిబట్టి క్రొత్తపాతల కలయిక ఎట్లు చేయనగునో విశదపరచినారు. వీరిలో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు ప్రభుత్వ ప్రథమాస్థానాంధ్ర కవిగారు తమ వచన రచనలు వ్యావహారిక భాషలో సాగించినారు.

ప్రారంభదశలో వ్యావహారిక భాషావాదాన్ని ఖండించుటకు పిఠాపురం మహారాజావారి రాజపోషణమున ఏర్పడ్డ ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ఊరూరా సభలు జరిపించి ఈ వాదాన్ని ఆమోదించరాదని తీర్మానాలు చేస్తూ ప్రభుత్వమునకు మహజర్లు పంపిస్తూఉన్న కాలములో అట్టిసమావేశములలో ఒకదానికి అధ్యక్షులుగా ఉండిన కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఈ వాదము నెట్లు అంగీకరించుట జరిగినదో ఈ తరమువారికి తెలియచేయవలసియున్నది.

1916 లో గిడుగు రామమూర్తిగారు కొవ్వూరులో జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభయందు ఈ వాదమునుగూర్చి ఉపన్యసిస్తూ ఉండగా వీరేశలింగంపంతులుగారు ఏదో తమ స్వంత పని ఉండి కొవ్వూరు రావడం దూరంగా నిలబడే రామమూర్తిగారి ఉపన్యాసం వినడం తలవని తలంపుగా సంభవించినది. ఉపన్యాస విషయం ఆకర్షకంగా ఉండడం చేత పంతులుగారు చాలాసేపు

ఆగి విని "రామమూర్తిపంతులు చెప్పినమాటలు తీసిపారేయుడానికి వీలులేదు. ఆయనవాదం అంగీకరించవలసినదే" అని అన్నారట. ఈ మాటలు ఆ మరునాడు రాజమహేంద్రవరంలో ఉండగా రామమూర్తిగారికి తెలిసినవి. ఆ సమ్మేట వీరేశలింగంపంతులుగారిని కలుసుకొని రామమూర్తిగారు తమ వాదాన్ని పూర్తిగా వివరించి చెప్పడం జరిగింది. దాని ఫలితంగా 28-2-1919 తేదీన రాజమహేంద్రవరంలో ఒక విద్వత్సభ జరిగినది. ఆ సభకు పంతులుగారే అధ్యక్షత వహించారు. ఈ క్రిందను వివరించిన తీర్మానాలతో వర్తమానాంధ్ర భాషాప్రవర్తక సమాజము అనే పేర నొక సమాజము స్థాపించడం జరిగినది. దానికి పంతులుగారు అధ్యక్షులుగాను, గిడుగు రామమూర్తిగారున్ను, జయంతిగంగన్నగారున్ను కార్యదర్శులుగాను, సభకు హాజరైనవారందరున్ను సమాజ సభ్యులుగాను నియమితులు కావడము జరిగినది. అప్పుడు సభా సమ్మతములైన తీర్మానములు:—

1. వ్యావహారిక భాషకున్ను గ్రాంథిక భాషకున్ను ఇప్పుడున్న వ్యత్యాసము సాధ్యమయినంత వరకు తగ్గించి భాష సులభము చేయుట,

2. జ్ఞానాభివృద్ధికై వ్రాయు గ్రంథములలో సాధ్యమయినంత వరకు వ్యవహారములో ఉన్న రూపాలే ఉపయోగించి వ్యవహారములో లేనివి విడిచిపెట్టుట,

3. వ్యవహారములో ఆవశ్యకములు కాకుండ ఉపయోగించుచున్న అన్యదేశ్యపదములను విడిచి ఆవశ్యకములైన పదములనే చేర్చుకొనుట.

4. పై ఉద్దేశముల ననుసరించి గ్రంథములను వ్రాయుట.

వీరేశలింగంపంతులుగారు స్వతఃసిద్ధముగా సంస్కరణప్రియులు. ఏ వాతావరణమునందైనా చెడుగు కనబడినయెడల దానిని నిర్మూలము చేసి మంచిని ఉద్ధరించుటకు చూపే పట్టుదల గలవారు. సంఘమందలి దురాచారములను లంచగొండితనమును పడుపువృత్తిని పోగొట్టుటకు చాలా కృషిచేసినవారు. తెలుగు సాహిత్య విషయములో కూడా మొట్టమొదట నలుగురు పండితులతోపాటు చిన్నయసూరి పెట్టిన వరవడిని విగ్రహతంత్రము

వ్రాసినా అట్టి రచనలవలన మేలు కలుగదని గ్రహించి సులభశైలిని గ్రంథరచన సాగించినారు. ప్రయోగములకంటెను లక్షణములకు ప్రమాణమెక్కువని కొద్దిగా భ్రమపడిన్ని వ్యావహారికభాషలో ఉత్తమ వచనరచన సాగించిన యెడల పండితలోకము తనను తక్కువగా చూచునేమోయను కొంచెము సందేహము తోచుట చేతను వాడుకభాష కేవలము ప్రహసనములకు మాత్రమే ప్రయోగించినారు. రామమూర్తి గారి వాదములో గల యాథార్థ్యమును పూర్తిగా గ్రహించిన తర్వాత వర్తమానాంధ్ర భాషా ప్రవర్తన సమాజమునకు అధ్యక్షులుగా నుండుటకు సమ్మతించుటే కాక, వ్యావహారిక భాషకు వ్యాకరణముకూడా రచించుటకు పూనుకొన్నారు. కాని దురదృష్టవశమున వారు 27-5-1919 తేదీని కాలధర్మము నొందినారు. వారి మరణమువల్ల వ్యావహారిక భాషావాదమునకు తీరనిలోటు వాటిల్లినది.

అయినా పంతులుగారు కలిగించిన ప్రోత్సాహము, వారి ప్రభావము కొంతవరకు ఫలించినవి. ఆ నాటినుండియిన్ని ఈ వాదమును అంగీకరించిన వారి సంఖ్య అధికమయినది. పంతులుగారు తమ స్వీయచరిత్రలో (పు. 156) "...పూర్వవ్యాకరణము లన్నియు పద్యకావ్య రచనకొఱకే. వచన కావ్యములు లేని కాలములో పుట్టినవగుటచేత నందలి లక్షణము లనేకములు వచనకావ్యాభివృద్ధికి తగవనియు, నిప్పటికాలమునకు దగినట్లుగా వ్యాకరణము మార్చుకొనవలయుననియు నేనను కొని ఈ కాలమునకును వచనరచనాభివృద్ధికిని తగినట్లుగా నొక నూతన వ్యాకరణమును వ్రాసి దానికి లక్ష్యముగా నొక వచన కావ్యమును జేయవలెనని పలుమారు దలపోసితిని.

అయినను వృద్ధుడను దుర్బల శరీరుడనునగుటచేత నట్టి పని నాకిప్పుడు సాధ్యము కాదేమో? కాదననేల! ఈశ్వరానుగ్రహమున్న యెడల సాధ్యము కావచ్చును"

ఈ వాక్యములవలన కలిగిన ప్రోత్సాహముచేతను రామమూర్తి గారు సంపాదకులుగా నడిపిన తెలుగు పత్రిక సంచికలలో ఈ

వాదమునకు సంబంధించిన వ్యాసములు చదువుటచేతను వారి ఉపన్యాసములు వినుటచేతను తెలుగు రచయితలు అనేకులు వ్యావహారిక భాషలో రచన సాగించుటకు సాహసించినారు.

1933 నవంబరులో రాజమహేంద్రవరమున రామమూర్తి గారి తమ సప్తతి జన్మదినోత్సవము జరిగినప్పుడు నవ్యసాహిత్యపరిషత్తు వారు రామమూర్తిగారి రచనలలో ముఖ్యమయినవన్నీ నాలుగు గ్రంథములుగా ప్రకటించినారు. వ్యాసావళి, గద్య చింతామణి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము, బాలకవి శరణ్యము. ఇది వ్యాప్తిలోకి వచ్చిన తర్వాత వ్యావహారిక భాషా వాదము తెలుగు దేశమందు బహుజనసమ్మతమైనది. ఆంధ్ర పత్రిక మొదలయిన దినపత్రికలు, మాసపత్రికలు, ఉగాది సంచికలు మొట్టమొదట వ్యావహారిక భాషా వాదమును ప్రతిఘటించినా, క్రమక్రమముగా వాడుకభాషలో రచితములయిన వ్యాసములను, కథలను, కథానికలను, ఏకాంకికలను ప్రకటిస్తూ వచ్చినవి.

1940 జనవరి 15 వ తేదీని రోగపీడితులై యుండిన్ని ఒక పత్రికా రచయితల సమావేశమందు రామమూర్తిగారు తమ తుది పలుకులు పలికి 22 వ తేదీని స్వర్గస్థులయినారు. తమ వాదము దేశములో చాలామంది అంగీకరించుటచేత సకల విషయములను గూర్చిన్ని వచన గ్రంథములు వ్యావహారిక భాషలో రచితములు అవుతూ ఉన్నందుకు తమ సంతోషమును తెలియజేస్తూ ఇంకనూ కానున్న పనిని సూచిస్తూ అందులకు పత్రికలవారిని, తక్కిన వారిని ప్రోత్సహిస్తూ వారానాటి సమావేశమందు పలికిన తుది పలుకులు మనము లెస్సగా గుర్తించ వలసి యున్నది.

"...నా వాదము అందరూ అంగీకరించ లేదన్న్ని విశ్వవిద్యాలయముల వారున్ను విద్యాశాఖ వారున్ను వ్యావహారిక భాషను గ్రహించ లేదన్ని నేనెరుగుదును. కాని, నా వాదము సరియైనదన్న విశ్వాసము నాకు పూర్తిగా ఉండుటవల్ల, ఎప్పటికైనను తెలుగువారందరూ నా వాదముపూర్తిగా అంగీకరించక పోరన్న నమ్మకం నాకు కలదు."

ఈ మాటలవలన మరికొందరు ఎక్కువగా వ్యావహారిక భాషా వాదమును గ్రహించినవారయినారు. రేడియోవారు మొదటి నుండీన్నీ తెలుగు ప్రసంగాలు వాడుక భాషలో నేజరుగనిస్తున్నారు. తుదకు కళాప్రపూర్ణులున్నూ మహామహోపాధ్యాయులును ప్రభుత్వాస్థానాంధ్ర కవులునూ్న అయిన శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు మొట్టమొదట వ్యావహారికభాషా వాదమును తమ వజ్రాయుధంతో హత్య చేయుటకు సాహసించిన వారే అయినా, కొంతవరకు ఈ వాదమును అంగీకరించిన వారే అయినారు. పత్రికలు జన సామాన్యమునకు అందుబాటులో ఉండే వాడుకభాషలోనే రచనలు సాగించవలెనని మొన్న ఉగాది నాటి రేడియో ప్రసంగము వల్ల, గాలిదుమారము చెలరేగినప్పుడు ఆంధ్రప్రభలో తమ అభిప్రాయము వెల్లడించినారు.

ఈనాటికి వందలకొలదిగా గ్రంథములు వాడుక భాషలో ప్రకటితములగుచున్నవి. 1914 లో గల పరిస్థితులకున్నూ, నేటి పరిస్థితు లకున్నూ ఈ విషయంలో చాలా తారతమ్యము కనబడుతూఉన్నది అందుచేత విశ్వవిద్యాలయముల వారున్నూ, ప్రభుత్వ విద్యాశాఖ వారున్నూ ఈ వాదమును అంగీకరించి వ్యావహారిక భాషలో సర్వతోముఖమయిన రచన సాగించవలెను.

అయితే ఒక చిన్న సందేహము కొందరిని బాధిస్తూఉన్నది. వాడుకలో గల శబ్దరూపములు వివిధ రూపములనున్నవి; ఒకొక్క సంఘం వారు ఒకొక్క మండలము వారు ఒకొక్క విధంగా శబ్ద రూపములను వాడుతున్నారుగదా వీటిలో ఏవి సాధువులనవలెను? ఏవి గ్రహించవలెను? ఏవి అగ్రామ్యములనవలెను? శిష్టజనవ్యవహారమంటే ఎవరు శిష్టులు? ఎవరు కారు? ఈ మొదలుగాగల ప్రశ్న పరంపరలు వేస్తున్నారు కొందరు. వీటికి సమాధానము ప్రకటితము లగుతూవున్న రచనలలోనే కనబడుతూవున్నది. మాండలిక భేదములు గ్రాంథికభాషకూ తప్పవు; వ్యావహారికభాషకూ తప్పవు. ప్రబంధాది ప్రాచీన కావ్యాలలో ఏ మండలమందలి వారు ఆ మండల మందలి శబ్దములను వాడినారు.

ఆంధ్రభాషార్ణవములో అన్నిమండలము లందలి రూపములను పర్యాయ పదములుగా చేర్చుకొనుట జరిగింది. పప్పు అంటే రాయలసీమవారికి తెలియదని సర్కారు జిల్లాలవారు వాడుక చేయకపోతే 'బేడలు' అంటే సర్కారు జిల్లాలవారికి తెలియదని రాయలసీమవారు వాడుక చేయకపోతే వీరికీ వారికీ సామాన్యంగా వాడుకలోగల పదము మరియొకటి లేకపోయినప్పుడు వ్యవహార హాని కలుగుతుంది. ఎవరి మండలములోని భాషవారు ప్రయోగిస్తారు. తక్కిన మండలములవారు క్రమక్రమముగా అర్థము చేసుకొంటారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, జనవాణి విశాలాంధ్ర, వాహిని మొదలయిన పత్రికలు దేశమందంతటా వ్యాప్తిలో ఉన్నవి. వాటిలోని భాష వ్యావహారిక భాషగానే ఉన్నది. అవి అందరికీ బోధపడుతూనే ఉన్నవి. రేడియో ప్రసంగాలు అందరూ వింటున్నారు. అందరికీ బోధ పడుతున్నవి.

సరే "పత్రికలు [illegible] సాహిత్యకళా ధర్మం కలవి కావు. బడులలోను, కళాశాలలలోను పాఠ్యగ్రంథములుగా ఉండవలసిన వాటిలోని భాష ఉన్నతశ్రేణిలో ఉండవలెనుగదా" అని కొందరంటున్నారు. ఇట్లనే వారి మనస్సులో చాలాకాలంనుండి అనుశ్రుతంగా వస్తూవున్న ఒక అభిప్రాయం పట్టుకొని విడవకుండా ఉన్నదనవలెను. సాహిత్యధర్మం వాడుకలో ఉన్న శబ్దరూపములకంటె పాతవడ్డ శబ్దరూపముల వల్ల ఎక్కువగా ఉంటుందనుకోవడం ఒక భ్రమ.

"పలుకులు పొందులేక రసభం
గము సేయుచు బ్రాతవడ్డ మా
టలం దమనేర్పుం జూపి యొకటన్
హృదయం బలరింపలేక యే

పొలమును గాని యుత్క్రమ
ముం దమ మెచ్చుగలోక మెల్ల న
వ్వులం బొరయం జరించు కుకవుల్
ధర దుర్నటులట్లు మూఢఁగన్"

అని తిక్కన మహాకవి చెప్పిన మాటలు ఏ కాలమందైనను పాటింపదగినవి రసజ్ఞులయిన రచయితలు సరికొత్త మాటలతో తమ కావ్యం రచిస్తున్నారు.

వ్యావహారిక భాషా లక్షణమొకటి నిర్ణయిస్తేనే కాని ఏ యో

రూపములు గ్రాహ్యములో ఏవి అగ్రాహ్యములో తెలియక ఉపాధ్యాయులు విద్యార్థులు తోట్రుపాటు పడవలసివస్తుందన్న భయము వలన విద్యాశాఖవారున్ను విశ్వవిద్యాలయమువారున్ను వ్యావహారిక భాషావాదమును అంగీకరించలేకుండా గతానుగతికంగా నిలిచి ఉన్న గ్రాంథికభాషనే ఆమోదిస్తున్నారని కొందరంటున్నారు. అందుకు తగిన సవరణేదో ఆలోచించక కాలక్షేపము చేయుటవలన ప్రయోజనము లేదు. ఇప్పుడు విద్యార్థులు బడులలోను, కళాశాలలలోను చదువుకొంటూ ఉన్న పాఠ్యగ్రంథాలు ఏదో గ్రాంథికభాషలో ఉన్నట్లు కనబడుతూ ఉన్నా ఎంతమాత్రమూ పొందని కృతకభాషలో ఉన్నవన్న విషయం విద్యాధికారులు గ్రహించకుండా ఉన్నారు. అర్థానుస్వారాలు, శకటరేఫలు ఉండవలసిన చోట్ల ఉండవు. ఉండకూడని చోట్ల ఉంటున్నవి, "కుండలు మట్టితోఁ జేసెదరు" అన్న వాక్యము గ్రాంథికభాషలో ఉన్నట్లు కనబడినా తద్ధర్మార్థక క్రియారూపమునకు మారుగా భవిష్యదర్థక క్రియారూపము వాడుటచేతను ఒకారము దుష్టమైనదన్న విషయము రచయితలుగాని, పాఠకులుగాని సాధారణముగా గుర్తింపరు. ఇట్టి దోషములు అనేకముగా పాఠ్యగ్రంథములలో కనబడుతూ ఉన్నా విద్యాధికారులు పట్టించుకోకుండా ఉన్నారు. 'మీరు వచ్చిరి' అనే ప్రయోగము పెద్దపెద్ద కవులే చేసినారు. ఇందులో గల తప్పు రచయితలు గాని, పాఠకులు గాని సాధారణముగా గుర్తింపరు. వాడుకలో ఉన్న రూపము గ్రాంథికభాషలో రచిస్తున్నామన్న సంతోషముతో గ్రంథములో ప్రయోగిస్తే అది తప్పో ఒప్పో ప్రాచీనభాషాలక్షణము. లెస్సగా చదువుకొన్న ఏ కొద్దిమంది పండితులో తప్ప తక్కువవారు గుర్తించలేరు. ఇట్టి పరిస్థితులలో విద్యార్థులు గ్రాంథికభాషలో తమ వ్యాసరచన సాగించవలెనని నిర్బంధించడం వలన వారు కృతకభాషలో రచిస్తున్నారు. వ్యావహారిక భాషలో ఇట్టి తప్పులు చిన్న పిల్లలయినా చేయరు. "మీ రేగు పెంచవలెను" "చనుదేరుటకు" అని కవులు గ్రాంథికభాషలో రచిస్తున్నామన్న కావ్యాలలో ప్రయోగిస్తున్నారు. "మీరు వచ్చవలెను" అని

బాలుడైనా అనడు. ఇప్పటి పుస్తకములలో ఉన్న గ్రాంథికభాష నిర్దుష్టమైన ప్రాచీనకావ్యభాషా కాదు; నేటి వ్యావహారిక భాషా కాదు. కనుక నేటి వాడుకభాషే. నేటి గ్రాంథిక భాషగా విశ్వవిద్యాలయములు వాడుచున్నా, విద్యాశాఖాధికారులున్నా గ్రహించి అందుకు తగిన విద్యావిధానము నిరూపించవలసియున్నది.

నేటి వ్యవహారమందలి శబ్దరూపములన్నిటికిని నేటి గ్రంథములందు దేక తగినస్థానము దొరకి ఉన్నది. "పాత్రోచితభాష నిరూపించవలసిన కథలు, కథానికలు, నవలలు, నవలికలు, నాటకములు, నాటికలు మొదలయిన రచనలలో ఏపాత్రకు తగిన భాష ఆ పాత్ర నోట పలికించినప్పుడే పాత్రోచిత భాష" అన్నది సార్థకము కాగలదు. ఏకవ్యాసములందున్నూ, విమర్శలందున్నూ వాడవలసిన భాష రచయితభాషే. కనుక రచయితలకు గల సంస్కారానుపట్టి ఉంటుంది. ఈ విషయంలో ఎవరి సంస్కారము గొప్పది? ఎవరు శిష్టులు? మొదలయిన ప్రశ్నలు వేసుకొని మచ్చనము చూపించవలసిన పనిలేదు.



వ్యవహారమందున్న శబ్దరూపములలో — అవి ఏ సంఘమువారు పలికేవైనాసరే, ఏ మండలము వారు వాడుకచేసేవైనాసరే — ఏ రూపములు పరిణమిస్తూ వచ్చిన కావ్యభాషకు చేరువగా ఉన్నవో ఆ రూపములు నేటి కాలమునకు ఉత్తమరూపములుగా ఉన్నవన్న యాథార్థ్యము గ్రహించవలెను. వ్యావహారికభాషలో వ్యాసములు రచిస్తున్నవారు ఇట్టి రూపములతోనే రచనసాగిస్తున్నారు. ఈపద్ధతి అవలంబించిన యెడల 1919 లో కందుకూరి వీరేశలింగంగారు అధ్యక్షులుగా ఏర్పడిన వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజమువారు సంకల్పించిన మొదటి ఆశయము, "వ్యావహారికభాషకున్నూ, గ్రాంథిక భాషకున్నూ ఇప్పుడున్న వ్యత్యాసము సాధ్యమయినంత వరకు తగ్గించి భాషసులభము చేయుట" అనేది నెరవేర్చగలము. నేటివరకున్నూ గల కవుల ప్రయోగములలో ఏవి లోకవ్యవహారమును బట్టి ఎట్లా మారుతూవచ్చినవో రామమూర్తి గారి బాలకవి శరణ్యము అనే గ్రంథము విపులముగా విశదీకరించి

యున్నది. దాని నాధారముగా జేసికొని నేటి వ్యవహారమందలి రూపములలో నవి ఆ రూపములకు చేరువగా నున్నవో చూచుకొన్న యెడల నేటి వాడుక భాషే. నేటి గ్రాంథికభాష కాగలదు. ఈ విషయము విశ్వవిద్యాలయముల వారి కిన్ని, ప్రభుత్వ విద్యాశాఖాధికారులకున్ను నచ్చచెప్పి రామమూర్తి గారు తమ తుదిపలుకులలో వ్యక్త పరచిన పరిశిష్టకార్యమును భాషాభిమానులు నెరవేర్తురు గాక !



" కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి "

— శ్రీ శ్రీ

# మన బాలసాహిత్యం

నార్ల చిరంజీవి

సృష్టి సౌందర్యానికీ, మానవుని ఆత్మౌన్నత్యానికీ ప్రతిబింబాలు, ప్రతిఫలాలు బాల బాలికలు! దేశం, జాతి, సమాజం వ్యవస్థల మంచిచెడ్డలను ఎన్నో రేఖలు బాలలు! మన స్తత్త్వ శాస్త్రజ్ఞులు రుజువుచేసిన సత్యాల్లో ఇదొకటి.

సంప్రదాయ బలంవల్ల కానీండి, లేదా మరే కారణంవల్లనైనా కానీ డి మన సమాజంలో పండు ముదుసలికి ఉన్న స్థానం పాల బుగ్గల పసిపాపకు లేదు. పండి, తొడిమ ఊడి రాలి ధూళిలో కలియనున్న పండుటాకుల మీది మోజులో పరవశులై పోతున్నారు. గాలికీ, వెల్తురికీ కంపించి, కళ్ళు విప్పీవిప్పక అంతలో అల్లనల్లన కొనలు సాచి నవ్వే లేచివురుల జీవన సౌందర్యాన్ని చూడని, మనస్సుకి పట్టించుకోలేని మన స్తత్త్వం మనవాళ్ళది, అంటే మన పెద్దలది.

అందుచేతనే మనలో సృష్టి సౌందర్యం లోపించింది. ఆత్మౌన్నత్యం కొరవడింది. పిల్లలపట్ల ఒక విశిష్టదృక్పథం లేని మనం బాలసాహిత్యానికి ఒక చరిత్ర కల్పించబూనడం ఉత్తర కుమారుడి సాహసమే అవుతుందిమరి!

కాని, యుగధర్మాన్ని అనుసరించి, ఆలస్యంగానైనా ఈ చరిత్ర, ఇప్పుడు ప్రారంభమవుతోంది. ఈనాడు ఏ పత్రిక తెరచినా, రేడియోను కదలించినా, రచయితల దస్త్రాలను విప్పిచూసినా బాల సాహిత్యం కోసం పొందే ఆరాటం స్పష్టంగా కన్పిస్తుంది. ఆ ఖరికి ప్రచురణకర్తల లాభసాటి బేరాలకు బాలసాహిత్యం వర ప్రసాదంగా వుంది! ఐతే, ఇందులో శుభలక్షణాలు ఎన్ని పాళ్లున్నయ్యో బేరీజు వెయ్యడంవిషయం ప్రస్తుతం వదిలేద్దాం.

సాహిత్యసంస్థలు తమ మహాసభల్లో బాలసాహిత్యప్రసంగాలకు

తావివ్వడం ఇదే తొలి కావచ్చు. ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభ కల్పించిన ఈ మహదవకాశం — బాలసాహిత్య చరిత్రకు శుభస్థితిని చేకూర్చుతుంది. అందుకు సందేహం లేదు.

## 2

సాయంత్రం, నీరెండ.

నింగీ నేలా బంగారంలా మెరిసిపోతున్నాయి. వాకిట పూల మొక్కలు గాలి తెరలకు ఊగి వింత సోయగాల్ని చూపుతున్నాయి.

పచ్చిక పరిచిన రత్న కంబళీలా ఉంది.

ఆమె - యౌవనం, ఆరోగ్యం అంచుల్ని మించి తొణికిసలాడుతున్న మాతృమూర్తి - ఆమె.

ఒడిని ఉయ్యాలగా అమర్చింది. చేదండని తలగడదిండుని చేసింది. అద్దాలలో బిడ్డకు రొమ్ము నందించింది. తను దానే పూర్ణబింబమై కదించుకుంది పసిడిబొమ్మలాగ.

తన గుండెల్లో గుండె, ప్రాణంలో ప్రాణం ఆ బిడ్డ. స్తన్య ధారల్ని - కాదు - తన ప్రాణధారల్ని వర్షిస్తోంది ఆ తల్లి. బిడ్డ పూరేకుల వంటి పిడికిళ్లు బిగించి ఆ మృత ధారల్ని గ్రోలుతూ, ఒక తీయని కుదుపులతో మెదులుతోంది!

తల్లి పెదవులపై పసిడి వెన్నెల రేక. చెక్కిళ్ళపై గులాబి ఎరుపు. కళ్లల్లో నిండారిన సంతోషం.

బిడ్డ కళ్లనిండా తల్లి మొగమే ప్రతిబింబిస్తోంది.

ఒక విద్యుదావేశం తల్లికి.

తీయని పెదవులతో బిడ్డని మునసారా స్పృశించింది ఆమె మధుర హృదయం నించి ఏవో పిలుపులు, గుసగుసలు మాటలుగా పాటలుగా పొంగాయి. అవి పెదవులమధ్యనే చిక్కుకుపోతున్నాయి. బిడ్డ గుండెల్లో చెవుల్లో అవి ప్రతిధ్వనిస్తున్నాయి. మరో చెవికీ కంటికీ తెగలని చిత్ర జలపాత ధ్వనులవి.

తల్లీబిడ్డలమధ్య ఆ నిమిషంలో, కాలాన్ని స్తంభింపచేసిన ఆ నిమిషంలో, ప్రాణకాంతిని ఒక బిందువుగా కేంద్రీకరించిన ఆ నిమిషంలో వెలువడిందే బాలసాహిత్యానికి ఆలంబనం. ఆ మాటలే, పాటలే ఏనాటికీ చెరగని తరగని మధుర నిధులు!

ఆదికావ్యానికి నాంది వాల్మీకి విషాదం :

బాలసాహిత్యానికి జీవగర్రతల్లి నిండు హృదయం.

## 3

ఇతర దేశాల్లో పిల్లలకిచ్చే శిక్షణ అత్యద్భుతమైనదని – చదివి తెలుసుకొన్న దాన్నిబట్టి – విని గ్రహించిన విషయాల్నిబట్టి మనం తెలుసుకోగలం! పిల్లల పెంపకం విషయంలో, వారికి కావలసిన విజ్ఞాన వినోద రంగాల్లో ఆ దేశాలు చేసిన అమోఘకృషి, చూపించే అపార శ్రద్ధాసక్తులు దిగ్భ్రమ కలిగించేవిగా ఉన్నాయి. కోట్లాది సంఖ్యలో పత్రికలు, పుస్తకాలు ప్రచురింపబడుతున్నాయి. ప్రత్యేక పాఠశాలలు, వివిధ శిక్షణాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, క్రీడాస్థలాలు, చలనచిత్రాలు ఒకటేమిటి వేల కొలది నిర్వహింపబడుతున్నాయి. ఇక, కూర్చిన కథలు, చేర్చిన గీతాలు, తయారుచేసిన విజ్ఞాన సర్వస్వాలు ఇన్నన్ని కావు. ప్రత్యేకంగా రైళ్ళు, జూలు, మ్యూజియమ్‌లు ఎన్నో ఉన్నాయి. తమ సంతతి మంచి చెడ్డలమీదనే తమ జాతిక్షేమం ఆధారపడి ఉందన్న సత్యాన్ని గ్రహించిన దేశాలవి! కడచిన ముప్ఫయి ఏళ్ళల్లో ఒక మహాదేశం తమసంతతిపట్లఎలాంటి అద్భుత శ్రద్ధాసక్తుల్ని కనపర్చిందో స్వయంగా చూసి మన ప్రధాని గారు గొప్పగా ప్రశంసించారు.

ఇలా చెప్పడం పరస్తుతి, ఆత్మనింద కింద జమ కట్టుకో వద్దని మనవి. పోల్చుకోవడంవల్ల మన లక్ష్య స్వరూపం మరింతవిస్పష్టంగా గ్రహించుకోడానికి వీలవుతుంది. బిడ్డలపట్ల ప్రత్యేక విశిష్ట దృక్పథం ఉండడం చేతనే అద్భుత సారస్వత సృష్టి, సంస్కరణాత్మక విద్యావిధానం వీటిల్లో ఆయా దేశాలు అమోఘవిజయాల్ని సాధించాయి.

ముఖ్యంగా మనం కర్మదాసుల కోవకు చెందినవాళ్ళం కనక సంతతి కర్మపరిపాక ఫలితమని తేల్చేశాం. పుట్టిన సంతతి ఋణగ్రస్తులు కనుక ఆ ఋణం తీరేదాక జన్మదాతల చరణాలకు అంకితమైపోవాలి. ఇదీ మన నైతిక, ఆధ్యాత్మిక దృక్పథాల విశిష్టత.

ఒక వేపు నాగరికత విస్తరిస్తున్నా, ఈ దృక్పథాల్లో విప్లవ పరిణామాలు తటస్థించనేలేదు. పిల్లలపట్ల తమకు అధికారంలేదనీ, కొన్ని విధ్యుక్తధర్మాలే ఉన్నాయనీ, తామే సంతతికి ఋణపడి ఉన్నామనీ మన పెద్దలు గ్రహించవలసి ఉంది. అప్పుడు మన సమా

జానికి సంక్రమించిన అనేక రోగాలు నయమవుతాయి. ఆరోగ్యవంతంగా, ఆనందదాయకంగా సమాజం పరిఢవిల్లాలంటే తప్పక మన దృక్పథాల్లో మార్పు రావలసి ఉంది.

అన్నిటినీ మించి మరో ఘోరమైన విషయం ఉంది. పిల్లలంటే ఉత్త మైనపుముద్దలనీ, నోరూ దారీ లేని నాదానులనీ ఒక ప్రమాదకరమైన చెడ్డ అభిప్రాయం మన పెద్దలకు అస్థిమజ్జాగతమై పోయింది. ఈ దురభిప్రాయంతోనే పిన్నల్ని అణగతొక్కుతున్నారు.

పిల్లల్లో అన్వేషణాసక్తి అనంతం. ఇట్టే కలిసి అట్టే అల్లుకొని పాతకొత్తల మేలుకలయికని సాధిస్తారు. ఎక్కడ చూస్తే అక్కడ తామై విశ్వరూపమున విహరిస్తారు. ఈ సత్యం మన పెద్దలకు తెలీడం లేదు. తెలీక, పువ్వుల్ని చిదిమినట్టు పిల్లల్ని చిదిమేస్తున్నారు. పిల్లలు నోరు తెరచి ఏవో అడుగుతారు. అందుకు జవాబులు తోచవు పెద్దలకు. తమ దుర్బలత్వాన్ని కప్పిపుచ్చుకోడానికి చీవాట్లనీ, తన్నుల్నీ జవాబుగా ఇస్తున్నారు పెద్దలు. ఏ ఒకరోజైనా, ఏ ఒకపూటైనా కూచుని, నిబ్బరంగా తమ సంతతిపట్ల తమకున్న బాధ్యతలేమిటో తీవ్రంగా ఆలోచించే పెద్దలెందరున్నారు? కనీసం తమ ఆత్మలకైనా సమాధానమిచ్చుకోవలసి ఉంది. రూపాయల సంచులమీదా, కీర్తి శృంఖలాలమీద తప్పిస్తే, ఇటు వేపు చూచేవారు లేరా?

లేకపోలేదు, ఉన్నారు కొందరు. ఉండబట్టే ఈనాడు ఈ మాత్రమైనా బాలసాహిత్యానికి ఒక తీరూ తెన్నూ ఉందనుకోగలుగుతున్నాం!

తెలుగు బాలసాహిత్యాన్ని రెండు పాయలుగా చూడవలసి ఉంది. విద్యావిధానానికి సంబంధించినంతవరకు ఒకపాయ. తదితర వాఙ్మయం అంతా ఒకపాయ.

పాఠ్యపుస్తకాల్లో సంస్కరణాత్మకమైన వన్నెలు, చిన్నెలు చేకూర్చిన ఘనత శ్రీ వీరేశలింగం పంతులుగారిదే. అటు జానపద గాథలను, ఇటు విజ్ఞానశాస్త్ర విషయాలను సంతరించి వాచక పుస్తకాల్ని తయారుచేశారు. తర్వాత తర్వాత అనేకులు అదే

వుంత తొక్కినా, అంత చక్కని పుస్తకాల్ని కొన్నేళ్ళవరకూ మరెవ్వరూ సంతరించలేకపోయారు. ఇటీవల శ్రీ చింతా దీక్షితులుగారు లీలా వాచకాల ద్వారా కొత్త తెన్నులు, రాదారులు వేశారు.

మరి కొన్నేళ్ళుగా పాఠ్యపుస్తకాలస్థితి చాల అసహ్యంగా తయారయింది. ఈ వైతెంగాన్ని శ్రద్ధగా పరిశీలించవలసిందిగా పెద్దలకు మనవిచేస్తున్నాను. పాఠ్యపుస్తకాల బ్రతుకు ప్రచురణకర్తల చేతుల్లో వుంది. వారి మహాప్రభువులు రూపాయల సంచుల్లో యిరుక్కున్నాయి. వారి చేతివాటం మీద టి. వి. సి. వారి ఆమోదముద్ర. ఇదొక బహిరంగ రహస్యం. ఇందరి దాహాలు, స్వార్థాలు పాఠ్యపుస్తకాల రూపంలో దిగి పిల్లల మనోవికాసాన్ని, నిర్మల దరహాసాల్ని కబళించి వేస్తున్నాయి. ఈ చెత్తను జీర్ణించుకోలేక, పిల్లల నోళ్ళల్లో బలవంతాన కుక్కి, ఫలితం లేక పంతుళ్ళు బెత్తాల్ని ఆశ్రయిస్తున్నారు. సగటున రోజుకు రెండు దెబ్బలు చొప్పున లెక్క వేసుకున్నా ఏడాదికి ఏడువందల పైచిలుకు దెబ్బల్ని ఆ లేత శరీరాలు భరించవలసి ఉందన్నమాట.

ఇంత మహా పాపభారం మన పిల్లల నెత్తిన పడుతూంటే — మన పెద్దలు బ్యాంకి ఎకౌంట్లు చూసుకుంటూ, మృష్టాన్నాలు కుడుస్తూ, పట్టు దుప్పట్లకింద తన్నిపెట్టుకు నిద్రపోతున్నారు మరి!

పిల్లలకు కంఠతా పట్టించడానికి కొన్ని శతకాల్ని ఎంచిపెట్టారు. ఇందులో సుమతీ శతకం, భాస్కర శతకం మున్నగునవి పేర్కొనదగినవి. విధిగా ఈ పూర్వశతకాలకున్న విలువ నేను పరిహరించడం లేదు. నెత్తిన మేకు దిగకొట్టినట్లు, ముక్కుపచ్చలారని పాపలనోట ఈ నీతి శతకాల్ని కుక్కడంలోనే చిక్కు వచ్చింది.

"పలుదోమి సేయు విడెమును
తలగడిగిన నాటి నిద్ర,
తరుణుల పొందున్
బొలయలుకనాటి కూటమి
వెలయింతని చెప్పరాదు
వినురా సుమతీ!"

"కూటంబున కేలు కపడని కోమలిరతి — ఏటికి ఎదురీదినట్లుంటుంది." ఇవీ మా ముద్దుబిడ్డలు కంఠతా పట్టుతున్న పద్యభాగాలు.

'గొల్లనికి సాహిత్యవిద్య కోమలికి నిజము' లేవట! కోమలి విశ్వాసం... బొంకు!... నమ్మకు అగసాలిని' – ఇవీ నీతులు! స్త్రీని నమ్మరాదుట! ఇది పాలు త్రాగి రొమ్ము గ్రుద్దే నీతి కాక మరేమిటి?

సరే, ఈ ప్రాచీన శతకాలమాట అలా ఉంచుదాం. కేవలం పిల్లల కోసం రచించబడిన శతకాల్లో ఉదాహరణకు రెంటిని చూపిస్తాను. ఇవి కుమారశతకం, కుమారీ శతకం. ఈ శతకాల ప్రాశస్త్యాన్ని గురించి ఆధునిక పండిత మహాశయులొకరు వాటి పీఠికల్లో ఇలా అంటున్నారు:

"ప్రతి వ్యక్తియు బాల్యమున దప్పక పఠింపవలసినది...కంఠస్థము చేయదగినది...కవికి గల లోకానుభవము ప్రశంసింపదగినది...అనుక్షణము స్మరింపదగినవాడు .. బాలికలు పుత్రవతులైన తరి కుమారులకు నీతుల కెంతయోని నొడ్వఁగలరు ..." [కుమారశతకం – మొదటిమాట: నుంచి]

"ఈ కుమారీ శతకము బాలికలకు జక్కని నీతులను దెలుపునదియు, భావికాలమున దరుణులయిన సమయమున నేమి, బిడ్డల తల్లులైన సమయమున నేమి ఈ శతకము మఱెంత యుపకరించు ననుటలో నే యతిశయోక్తియును లేదు. ఇందు గల ప్రతిపద్యము బాలికలు మాటిమాటికి బఠించుచు గంఠపాఠము చేసి మననము గావించి యాచరణయందుంచుకొన దగినదని గట్టిగా జెప్పవలయును ... బాలికలే గాక బాలురును దప్పక పఠించి కంఠపాఠము చేయదగిన శతక మియ్యది. దీనిని విద్యావంతులగు, ఉపాధ్యాయులు తగురీతి ప్రోత్సహించి బాలికలకూ, బాలురకు నేర్పి సమాజము నభివృద్ధి చేయుదురు గాక!" [కుమారీశతకం: మొదటి మాటనుండి]

ఇన్ని యోగ్యతా పత్రాల్ని సంపాదించుకొన్న ఈ శతకాలు ఈ నాటికీ ఊరూరా పాఠశాలల్లో – మీ ముద్దు బిడ్డల చేతుల్లో ఉంటున్నాయి. అవి నేర్పే నీతుల్ని వినండి.

మీ బిడ్డల వయసెంతో, వాళ్ళకు చెప్పే ఈ నీతిలో తెంతో గమనించండి:

"...పరకాంతల నే
ప్రొద్దే నెద బరికించుట

కుద్దేశింపంగ గూడ దుర్వి
గుమారా !"

అంటే, అర్థం ఆప్రబోధకులకే తెలియాలి. చదువుకునే చిన్నారి కూనలకు పడకటింటి ముచ్చట్లను వర్ణించిన వైనం చూడండి.

"తనదు కులాంగన యాలో
చనమున మంత్రియును,
భుక్తి సమయంబున దా
జననియు; రతిలో రంభా
వనజేక్షణ యయిన
బుణ్యాంగనయౌ కుమారా !"

'రంభా వనజేక్షణ విషయమేనా!' మన పిల్లలకు కావలసింది ? మగపిల్లలకు నేర్పే నీతి రీతుల సంగతి అలాఉంచి, ఆడపిల్లలకు నేర్పే నీతి బోధ వినండి :

"పదము పైపై జెయి వేయక
మదవతి ! పతి చెంత నిద్రమరగిన, జేతుల్
గదలంగనీక కట్టుచు –
గదగొని శిక్షించు యముడు
కాంతకు కుమారీ !"

ఏడేళ్ళ పసికూనను బట్టుకొని 'ఓ మదవతీ !' అని సంబోధించు తున్నాడు కవి. అర్థతాత్పర్యాలు చెప్పే పంతులూ అలాగే అనాలి కదా ! ఇలాంటి 'మదవతులను' గురించి ఆ శతకంనిండా కొల్లలు !

ఈ కంపుకి మరో సొంపు. పతి భక్తిని గురించి నేర్పే వైనం గమనించండి :

"ధనహీనుడైన, గడు దు
ర్గుణుడైన గురూపియైన జారుండైనన్
విను పాపియైన, నెవ్వడు
దన పతియే తనకు దైవతంబు
కుమారీ !"

ఇలాంటి అల్లుళ్ళను భరించగల పెద్దలున్నారని నేననుకోను. కాని, మీ పిల్లలకు నేర్పుతూన్న ఈ నీతుల విషయం కాస్త పంటపట్టించుకోవలసి వుంది.

మీ ఆడపిల్లలకు నేర్పే ఆదర్శం ఇదుగో :

"తా నమ్ముడు వడి యైనం
దీనుండగు ధవుని యాత్రి
దీర్చుట సతికిన్
మానము, చంద్రమతీ జల
జానన దలపోయ వలయు
నాత్మ కుమారీ !"

తమ బిడ్డలు ఇలాంటి నీచస్థితికి దిగజారడానికి ఏ తల్లీ తండ్రీ ఒప్పు కోరనుకొంటాను. తా నమ్ముడు

పోవడానికి, దీనుడైన భర్త అమ్మడానికకాని ఈకాలంలో లైసెన్సు లేదు. కాని, ఇవే ముద్దకట్టి మీా బిడ్డలచేత రోజూ మ్రింగిస్తున్నారు. ఇలా ఉదహరించడం అంటే గొంగళ్లో అన్నం తింటూ ఏరివేత ప్రారంభించినట్లుంది. సిగ్గుమాలిన ఈ పద్యాల్ని మతిమంతు లెవ్వరూ అంగీకరించరని నా నమ్మకం.

ఇలాంటి చదువులతో మన బిడ్డల్ని నాశనం చేసుకోవడంకంటే, బడి మాన్పించడం మేలు రెట్లు మెరుగు. కాని, అందుకు ఆత్మ ధైర్యం ఎంతో కావాలిమరి !

ఈ విషభాండంలోంచి విముక్తి కలిగించినవారు శ్రీ వెంకటపార్వతీశ్వరకవులు. వారుచక్కని గీతపద్యాలతో బాలలకు ఊపిరి పోశారు. మనస్సుకి పరిశుభ్ర వాతావరణం కల్పించారు. వారు ఆ సమయంలో బాలలకు ఆపద్బాంధవులయ్యారు. వారి పద్యాల్లో నిర్మల సుకుమార రమణీయత, తీయందనము వెల్లివిరిసింది. వారికి బాలలు కృతజ్ఞులై ఉంటారు.

ఈనాటికీ ప్రాథమిక పాఠశాల మొదలుకొని విశ్వవిద్యాలయం వరకు ఉన్న పాఠ్యపుస్తకాల్ని, ముఖ్యం తెలుగు పుస్తకాల్ని పరిశీలించి చూడండని మీాకు సవినయంగా మనవి చేస్తున్నాను. మహాకావ్యాల్లో శృంగార ఘట్టాలు, శృంగార కావ్యాల్లో రసవత్తర ఘట్టాలు రచించిన పూర్వ కవులెవరూ ఈ పాఠశాలల్లోని విద్యార్థుల్ని ఉద్దేశించి రాయలేదు.

రుక్మిణీ వివాహాత్పూర్వం శ్రీకృష్ణుణ్ణి తలచుకొని 'నీతోడ సంభోగింపని తనువెందుకు!' అని అంటుంది. పోతన్నగారు ఆరో తరగతి విద్యార్థినిమిత్తం ఈ పద్యం రచింపలేదు. కాని, ఆరోతరగతి విద్యార్థి ఆపద్యాన్ని కంఠస్థం చేసి తీరాలి ఈనాడు. ఇలాంటివిషయాలతో, కృతక భాషా బంధనాలతో ఇంకెన్నాళ్ళు బాలల్ని హింసిస్తారో ఊహించలేకుండా ఉన్నాం. ఆ పసికూనల ఉసురు, కొలిమి ఆవిరిలాగా ఇంకెన్నాళ్ళు ఈ పెద్దలకు సోకుతుండాలో ? ?

ఇలాంటి సాహిత్యాల ద్వారా పిల్లలకు కుటుంబ జీవనం అలవరుచ్చుతున్నామని జవాబు చెబుతున్నారు కొందరు. ఇంతకన్నా పచ్చి మోసం మరొకటి లేదని స్పష్టం చెయ్యవలసిన అగత్యం ఇప్పుడు

ఏర్పడింది. పిల్లల్ని బానిసల్నిగా తయారుగావించే మన సత్వం ఉన్న వాళ్ళే ఈ జవాబిస్తున్నారు.

ఈ దుస్థితినించి తప్పించగల సమర్థత ఒక్క ప్రభుత్వానికే ఉంది. వెంటనే ఎందుకు ఈ నీచ స్థితిని తొలగించడం లేదో ఆ చిదంబర రహస్యం ఏమిటో ప్రభుత్వంవారికే తెలియాలి.

మన ప్రధాని నెహ్రూజీ పిల్లలపట్ల చాల శ్రద్ధా సక్తుల్ని కనపరుస్తున్నారు. ఆయన రుచిర స్వప్నాలను ఫలింప చెయ్యడానికి మన ఈ ప్రభుత్వం ఎందుకు పూనుకోవడం లేదో దుర్గ్రాహ్యంగా ఉంది. పోనీండి, ఏంచేద్దాం ?

## 5

ఇక ఇతర విశేష వాఙ్మయం విషయం :

ఇంచుమించు జానపద వాఙ్మయంగా చెలామణీ అవుతూన్న పూర్వ బాల వాఙ్మయం గేయ రూపాత్మకమైన సాహిత్యం మాత్రము, అదైనా కొద్దిగా మిగిలి వుంది ! లాలిపాటలు, ఉయ్యాల పాటలు, ఆటపాటలు, పండగ పాటలు ఇవీ ముఖ్య రూపాలు.

జో అచ్యుతానంద
జోజో ముకుంద !
లాలి పరమానంద
రార గోవింద !

ఐతే, ఈ పాటల్లో చాల భాగం శ్రీకృష్ణపరంగా వున్నై. అందుకు కారణం లేకపోలేదు. మన పురాణ పురుషుల్లో ఎవరూ శ్రీకృష్ణునివలె బాల్యంలో సాహస కృత్యాలు చేసినవారు లేరు. బాల్యమంతా అద్భుతగాథలతో నింపుకొన్న మహావ్యక్తి. అందుచేత ఇంటింటా అతనిలీలల్ని, కథల్ని గేయాలుగా అల్లుకొన్నారు. ఆ నోటా నోటా ఈనాటికీ నిలిచి వున్నాయి. జోల పాటలు, ఉయ్యాల పాటలు ఒక టేమిటి అతని ప్రతిచర్యా పాటల్లో అల్లుకొంది. ఈ పాటల్లో ఉన్న శబ్దమైత్రి, లయ చాల ప్రధానమైనది. అందుచేతనే ఈ పాటలు స్త్రీ సొత్తు అయ్యాయి. ఈనాటికీ జోలపాడినా, ఉయ్యాల వేసినా, ఆ పాటల్నే పాడుతున్నారు.

పిల్లలకు గోటి ముద్దల్ని తినిపిస్తూ తల్లి చంద్రుణ్ణి చూపి ఊరిస్తూంటుంది.

"చందమామ రావే
జాబిల్లి రావే

కొండెక్కి రావే
గోగుపూలు తేవే !'

కాస్త కాలూ చేయీ సాగిన పిల్లలు, వరసనే కూచుని కాళ్ళార జాపుకుని పాడేపాట అందరికీవచ్చు.
"కాళ్ళా గజ్జీ కంకాళమ్మా..."

ఆట పాటలకు సంబంధించినంత వరకు వాటిలో విషయప్రాధాన్యం కంటే లయ ప్రాధాన్యం చాల ఉంది. ఆ కారణంగానే అవి నిలిచి ఉన్నాయి.

'చెమ్మ చెక్క
చారడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ
ఆరగించంగా...'
'గుడుగుడుగుంచం గుండేరాగం
పాములపట్నం పడగారాగం'

ఇలాంటివన్నీ లయాను బద్ధమై, పిల్లల మనస్సును పట్టేస్తాయి. ఇటీవల కొందరు ఈ పాటలకు ఏవేవో అర్థాలు తీయాలని ప్రయత్నిస్తున్నారు. అది అనవసరం. ఇంగ్లీషులో పిల్లలకోసం 'నాన్సెన్స్ రైమ్స్' వంటివి తెలుగులో కూడా చాల ఉన్నాయి. లయ ప్రధానంగా మాటలపోగులే ఆ పాటలు. వాటి ప్రయోజనమూ అంతే. కాని, అందులోంచి, వైద్య శాస్త్రాల్నీ, వేదాంత విషయాల్నీ లాగడం పనిలేని పని.

ఇక ఈ శతాబ్దారంభంలో, మన గురజాడ మహాకవి లోకాన్ని పరిశీలించి ఒకనిర్ణయానికివచ్చారు. ఈ లోకం ఇంకా శిశుత్వంలోనే ఉందని గ్రహించారు. అంచేత ఆయన 'ముత్యాల సరాల' వంటి దేశికవితా రీతులతో, పిల్లలతో ఆడుకొన్నట్టే - లోకంతో క్రీడించారు. ఆయన పిల్లల్ని ఆకట్టడానికి ప్రధానాలైన కరుణ, హాస్య రసాల్ని చేతబట్టారు. కితకితలు పెడుతూనే, లోకానికి పాఠం నేర్పారు. ఆయన చెప్పదలచుకొన్న మహాదాదర్శాన్ని శిశు మనస్తత్వ శాస్త్రజ్ఞునివలె లోకానికి బోధించారు. 'కన్యక' 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' ఈవిధానంలో చెప్పినవే ఆయన రచనలన్నీ అంతే కూడాను.

ఆ మార్గాన్ని ఎవరూఅందుకో లేదు. వావిలికొలను వారి 'ఆర్య కథానిధి, మున్నగునవి ఉపదేశకా మాత్రాలైనవి.

1934 లో శ్రీ శ్రీ కరంనించి ప్రచండ ఘోషలతోపాటు మహాగీతం మరొకటి వెలువడింది. పిల్లల్ని

శ్రీశ్రీ వలె ఊహించి అభిప్రాయం చేసుకొన్న రచయిత అంతకు మున్నెవ్వరూ లేరు. ఆయన పిల్లల్ని ఇలా సూటిగా ఆహ్వానించారు:

"మెరుపు మెరిస్తే
వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని ఆనందించే
కూనల్లారా!"

అని, వాళ్ళకి ఎలాంటి గట్టి హామీని ఇస్తున్నారో వినండి.

'మీదే మీదే సమస్త విశ్వం
మీరే లోకపు భాగ్యవిధాతలు
మీ హాసంలో మెరుగులు తీరును
వచ్చేనాళ్ళ విభా ప్రభాతములు'

ఈ ఋతువులు, వర్షాలు, నదులూ సమస్త ప్రపంచం పులకరించేది మీ నిమిత్తమేసుమా! అని అంటున్నారు:

ఈ ఒక్క గీతం ద్వారా శ్రీశ్రీ బాలసాహిత్య చరిత్రలో ఒకవిప్లవ ఘట్టాన్ని సృష్టించారు. ప్రభంజనంవలె హోరెత్తి, భావవేగమున ప్రసరించి వర్షుకాభ్రముల ప్రళయ ఘోషలతో పాటే—'శిశువు చిత్రనిద్రలో ప్రాచీన స్మృతులూచే చప్పుడు' ఆయన కవితలో ప్రతిధ్వనించింది. ఇది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు.

మద్రాసు రేడియో కేంద్రంలో పిల్లల కార్యక్రమాల్ని ప్రవేశపెట్టారు. ఆ కార్యక్రమాల్ని శ్రీమతి దుర్గాబాయమ్మగారు నిర్వహించారు. తర్వాత న్యాయపతి దంపతులు రేడియో అన్నయ్య, అక్కయ్యలుగా స్థిరపడ్డారు. రేడియోలోను, తాము స్వతంత్రంగా నిర్వహిస్తున్న 'బాల' పత్రిక ద్వారాను వారు ఎనలేని కృషి చేశారు. ఒక నూతన చరిత్రను స్థాపించినట్టే లెక్క.

మరో వేపు చింతా దీక్షితులు గారు పిల్లలకు కథల్ని, గేయాల్ని, సృష్టించారు. పిల్లలకు అతి పరిచితమైన పాత్రలు ఇతర దేశ బాల సాహిత్యంలో కొల్లలుగా కనిపిస్తాయి. మన పూర్వసాహిత్యంలో ప్రహ్లాదుడు, ధ్రువుడు ఇలాగ కొద్దిమంది తప్ప మరెవ్వరూ కనిపించరు. కాని, దీక్షితులుగారు కొన్ని కొత్త పాత్రల్ని తెలుగు బాలలకు పరిచయం చేశారు. అవి సజీవమైనవి. ఆయన ప్రత్యేకంగా విద్యారంగంలో ఉండడంచేత, చక్కని బాలసాహిత్యం సృష్టించగలిగారు.

ఆయన కథలు బాలల ఊహాశక్తిని రేకెత్తించేవిగా ఉంటాయి. ఆయన బాల సాహిత్యం అనేక పుస్తకాల ద్వారా లోకానికి వెల్లడైంది.

తెలుగు భాషా సమితి లోగడ 'బాలానందం' రచించిన శ్రీ గిడుగు సీతాపతిగారికి 500 రూపాయల బహుమతిని ఇచ్చి గౌరవించారు. తిరిగి ఈ ఏడాది కూడా బాలసాహిత్యానికి బహుమతి ప్రదానం ప్రకటించారు. ఇది ప్రశంసనీయమైన విషయం.

పిల్లల పత్రికా ప్రపంచంలో అద్భుత సంచలనం కలిగిస్తూ, అనేక భాషల్లో వెలువడుతూన్న 'చందమామ' మనందరికీ గర్వకారణం. అందచందాల్లో, ఆకర్షణలో ఇంతవరకూ చందమామతో సమానమైన మరో పత్రిక రాలేదు. ఎందరెందరో ఇటీవల పిల్లలపత్రికలు స్థాపించి మానివేస్తున్నారు. ఇన్ని పత్రికలు వచ్చినా, పిల్లలపేరుతో పెద్దల సాహిత్యాన్నే ప్రచురిస్తున్నారు. కాని విజయవాడనుంచి కొంతకాలం ప్రచురింపబడి ఆగిపోయిన 'బాలప్రభ' వారపత్రిక ఒక విశిష్టమైన ఉద్దేశ్యాలతో నడిచింది.

శ్రీ పాటిబండ మాధవశర్మగారు ఎన్నో ఆశయాలతో బాలప్రభ పత్రిక బాల ప్రపంచ వార్తాపత్రికగా నిర్వహించారు. కాని, అలాంటి పత్రిక నడిచే దశ ఇంకా మనకు కలక్కపోవడంచేత, అది ఆగిపోయింది.

ఆంధ్రపత్రిక, ప్రభ వారపత్రికల్లో బాలసాహిత్యానికి ప్రత్యేక శీర్షిక, స్థానంఉంది. ఆంధ్ర పత్రిక వారు బాలల నవలల్ని ఇతర భాషల్లోంచి అనువదించి తెలుగు బాలలకు అందించారు. 'టామ్‌సాయర్' మున్నగు పుస్తకాల్ని శ్రీ నండూరు రామమోహనరావుగారు అనువదించి పత్రికద్వారా అందించారు.

ఇటీవల 'విశాలాంధ్ర' దినపత్రిక 'చిన్నారిలోకం' శీర్షికను ప్రారంభించి కొత్త సంచలనం కలిగించింది

పిల్లలకు సాహిత్యాన్ని అందిస్తూన్న వారితోపాటు తమ చిత్రాల్ని అందిస్తున్న వారిని పేర్కొనడం ఉచితం. శ్రీ విశ్వాత్ముల నరసింహామూర్తిగారు పంచతంత్ర కథల్ని బొమ్మల కథగా తయారుచేశారు. ఇది కొత్తపుంత. అది పూర్తిగాకముందే ఆయనస్వర్గ

యులు కావడం బాలసాహిత్య ప్రపంచానికి తీరని లోటు. 'బుజ్జాయి' కొన్ని బొమ్మల పుస్తకాల్ని ప్రకటించారు. చిన్నపిల్లల పుస్తకాలకు ఇటీవల చిత్రాల గీస్తున్న వారిలో సోదర చిత్రకారులు శ్రీ సడిపల్లి శంకర్, సంజీవి గార్లు పేర్కొనదగినవారు. వీరు 'శాంతి కళాకేంద్రం' పేరిట పిల్లలకు చిత్రకళను నేర్పి, ప్రశంసనీయమైన కృషి చేస్తున్నారు.

గడచిన ఐదారేళ్ళల్లో బాలసాహిత్యం అనేక రకాలుగా వృద్ధి చెందుతోంది. రానురాను ఆదర్శాలు తగ్గిపోయి ఆర్జనకోసం అచ్చులుచాచడం ఎక్కువైపోయింది. బాలసాహిత్యం బాలలకే కాక, కొద్దిపాటి చదువుకున్న పెద్దలు కూడా చదువుతున్నారు. ఈ కీలకం తెలుసుకొని, ప్రచురణకర్తలు పత్రికాధిపతులు తమ దృష్టిని బాలసాహిత్యం వేపు మళ్ళించారు. ఇందుకు మన అభ్యంతరం ఏమీ లేదు. కాని ఆర్జనతో పాటు, బాలలకు ఏం కావలసి ఉంటుందో కూడా కాస్త ఆలోచించవలసిందని కోరుతున్నాం.

అటు సినిమా రంగంలో కూడా పిల్లలకొక స్థానం దొరికింది. తెలుగులో 'బాలానందం' పూర్తి బాలల చలనచిత్రం. ఈనాడు బాలలు లేని చలనచిత్రం లేదనే చెప్పవచ్చు.

ఇటీవల మన ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల క్రింద 'బాలసాహిత్యాని'కి బహుమతుల్ని ఇస్తోంది. సముచిత గౌరవాన్ని తెలుగు బాలసాహిత్యం సాధించింది. ఆంధ్ర ప్రభుత్వం స్థాపించబోయే కేంద్ర గ్రంథాలయంలో కూడా 'బాలసాహిత్య గ్రంథాలయశాఖ' కూడా ఏర్పాటు చేస్తున్నారని వినికిడి. చాల సంతోషించదగిన విషయం.

ఇంత జరిగినా హిందీ, మరాఠీ, కన్నడ, బెంగాలీ, భాషల్లోని బాలసాహిత్యంతో పోల్చి చూసుకుంటే మన తెలుగు బాలసాహిత్యం చాల కొద్ది మాత్రంగానే ఉంది. ఇంకా ఎంతెంతో పెరగవలసి ఉంది.

యువరచయితలెందరెందరో బాలసాహిత్యక్షేత్రంలో అపూర్వ కృషి చేస్తున్నారు. శ్రీ కవిరావు, మద్దులూరి, కే. సభా, ఆలపర్తి, వేజండ్ల, లవణం మున్నగు మిత్రులెందరో నడుంగట్టి కలంబట్టి బాలలకు మధుర ఫలాల్ని అందిస్తు

న్నారు. తెలంగాణా కవిమిత్రులు కూడా 'చిరు గజ్జెలు' కట్టి 'ఆంధ్ర బాల'ని మురిపించారు. అసంఖ్యాకులైన బాలరచయితలను పేర్కొనడం అసాధ్యం. వారందరికీ బాలలు కృతజ్ఞులై ఉంటారు.

తెలుగులో పిల్లలకు ఆకర్షణీయంగా రంగులతో బొమ్మలతో పుస్తకాల్ని ప్రచురించడానికి అనేకమైన ఇబ్బందులు ఉన్నాయి. ఐనా వాటిని అధిగమించి కవిరావుగారు, విజయవాడలో దేశి కవితామండలి, ఆదర్శ గ్రంథ మండలి, విశాలాంధ్ర ప్రచురణాలయం వారు, రాజమండ్రిలోని కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్ వారు ప్రకటిస్తున్నారు.

వీరందరూ, ఆకర్షణీయంగా ముద్రించి బాల సాహిత్యాన్ని అందించడానికి ప్రయత్నిస్తున్నారు.

## 6

పిల్లల్ని గురించి ఒక ప్రత్యేక విప్లవ దృష్టితో జీవితాన్ని, రచనల్ని నడిపినవారు శ్రీ గుడిపాటి వెంకటచలంగారు. వారు చేసిన అనేక రచనల్లో నైతేనేం, బిడ్డల పెంపకం విషయంలో నైతేనేం చాల గొప్ప కృషి చేశారు. అందుకోసం పుస్తకాలు రాశారుకూడా. పువ్వులవలే, నక్షత్రాల మెత్తని కాంతివలే, పిల్లల్ని చూడగల దృష్టిని ఆయన ప్రబోధించారు. ఆయన శక్తివంతమైన ఆలోచనలు స్పష్టమైన రచనలు చాల మందికి చైతన్యమిచ్చాయి.

బాలసాహిత్యం సృష్టించడం ఒక ఎత్తు: ప్రచారంలోకి తెచ్చి లోకం దృష్టిని బాలలవేపు మరలించడం మరొక ఎత్తు. ఈ కృషిలో సఫలీకృతులైనవారు శ్రీ బి. వి. నరసింహారావుగారు. వీరు విద్యాశాఖోద్యోగులు, వస్తుతః నర్తకులూ, పైగా కవులు, ఇన్ని విశేషాలతో ఆయన బాలసాహితీ రంగంలో ప్రవేశించి పట్టం కట్టుకొన్నారు. పిల్లల మనస్తత్వం బాగా తెలిసినవారుకనక విప్లవకర దృక్పథంతో అనేక గేయాల్ని రచించారు.

"పెద్దలకంటే పిన్నలె
బుద్ధిమంతులని"

చాటి, రుజువు చేశారు. అనేక చోట్ల సభల్లో పాల్గొని విద్యా విధానంలో ఉన్న అనేకలోపాల్ని చాటి చెప్పారు. పిల్లలకు ఏలాంటి

సాహిత్యం కావాలో విశదీకరించారు. అంతేకాదు. పాఠ్య పుస్తకాల్లో తరతరాలుగా' నీతికథలుగా' పేర్కొన్న హరిశ్చంద్రకథ, ప్రహ్లాదునికథ తీసుకొని ఆ కథానాయకుల్లో అసలు రంగుల్ని చూపించారు. 'అవును హరిశ్చంద్రుడు' 'ప్రహ్లాదుడు' అనే వారి గేయాలు ఎంతో గొప్పవి. తన జీవితాన్ని 'బాలల' కోసం అంకితం చేసి, బాలసాహిత్య రంగాన్ని అర్థవంతంగా ప్రచారం చేస్తున్నారు. ఆయన బాలబంధువు మాత్రమే కాక, ఆచార్యుడు కూడాను.

రేఖామాత్రమైన ఈ చిన్న వ్యాసంలో సమగ్రంగా నేను చెప్పలేకపోయిన పేర్లెన్నో ఉండి ఉండవచ్చు. అందుకు మన్నించగలరని విశ్వసిస్తూ, ఇది ముగించే ముందు రచయితలందరికీ ఒక వేడికోలు చేయవలసి ఉంది.

కేవలం పిల్లలకు కాకమ్మకథలు, దెయ్యాల కథలు చెప్పడమే బాల సాహిత్య రచన కాదు. లేదా కేవలం వాస్తవికత పేరిట 'కట్టె కొట్టె తెచ్చె' నన్నట్టు చెప్పి లాభం లేదు.

పిల్లలకు వయసుతో పాటు ఊహాశక్తితో పాటు హేతువాదం విస్తరిస్తుంది. అందుకు తగినట్లు మన రచనలు ఉండాలి. వారిలో కల్పనాశక్తిని పెంపొందించే రచనల్లో హేతుదృష్టి సమపాళ్ళుగా కొరవడకుండా పొందుపరచక తప్పదు.

కల్పన, హేతువాదం సమ్మిళితం చేసి సృష్టించినప్పుడే బాల సాహిత్యం పరిపుష్టి చెందుతుంది. అలాంటి సాహిత్యం ఇతోధికంగా రాగలదని ఆశిస్తాం.

మొదట నే మనవి చేసినట్టు బాలసాహిత్య చరిత్ర ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. దాన్ని పెంచి పెద్దదాన్ని చేయవలసిన బాధ్యత తా మందరిమీదా ఉందని మనవి చేస్తూ సెలవు తీసుకుంటాను.

★

# అభ్యుదయ రచయితల సంఘ కార్యకలాపాలు

### తుమ్మల వెంకటరామయ్య

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి పన్నెండేళ్ళు దాటింది. చరిత్రలో ఈ కాలం ఎంతో అల్పం. అయినా ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ రచయితల సంఘం విశిష్టస్థానాన్ని అందుకోగల్గింది.

1943 ఫిబ్రవరి 13, 14 వ తేదీలలో అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ శ్రీ తాపీ ధర్మారావుగారి అధ్యక్షతను తెనాలిలో జరిగింది. ఆంధ్రలో అభ్యుదయ రచయితలు ఆనాటికి సంఘీకృతం కాకపోయినా, అంతకుముందే అభ్యుదయ రచనలు సాగించుతూ వచ్చారు. ఈ విషయంలో భారత దేశంలోని ఇతర రాష్ట్రాలవారికి ఆదర్శప్రాయంగా కూడా మన రచయితలు కొందరు రచనకు ఉపక్రమించారంటే అతిశయోక్తి కాదేమో !

సంస్కృతి అంటే తుపాకి పట్టుకోవాలనే ఫాసిస్టు శక్తులు విజృంభించి అంతర్జాతీయంగా కల్లోల పరచుతున్న కాలంలో – అనగా 1930-40ల మధ్య – సంస్కృతినీ, మానవతనూ రక్షించాలనే ఆకాంక్ష వివిధ దేశాల రచయితలలో ఉద్భవించింది. ఆ ఆశయ సిద్ధికై కొందరు తమ ప్రాణాలను సైతం కోల్పోయారు.

మన దేశంలో 1936లో లక్నోలో ప్రేమచంద్ ఆధ్వర్యాన అఖిల భారత అభ్యుదయ రచయిత సంఘం ఏర్పడింది. నిర్మాణరీత్యా అఖిలభారత రచయితలు సంఘీకృతం కావడం ఇదే మొదటిసారి యైనా, ఇంతకుముందే ఇందుకు కొంత కృషి జరిగింది. కీర్తిశేషులయిన టాగూర్, సరోజినీ దేవి గారల ఆశీస్సులు ఈ ఉద్యమానికి లభించాయి.

1943 కు ముందే అభ్యుదయ రచనలు సాగుతున్నా ఉద్యమ నిర్మాణం మాత్రం ఆంధ్రలో జరగలేదు.

ప్రతి ఉద్యమానికి సాధారణంగా ఎదురయ్యే సమస్యలే మన ఉద్యమాన్ని కూడా ఎదుర్కొన్నాయి.

"అభ్యుదయం" అన్నవాదాన్ని అపార్థం చేసుకొన్నారు కొందరు. కావాలని వక్రభాష్యం చేశారు మరికొందరు. అభ్యుదయ సాహిత్యం అంటే ప్రాచీన సాహిత్యాన్ని అంతటినీ తగలబెట్టేదని కొందరు అపవాదు వేశారు. దానిని నమ్మిన వారు కొందరు లేకపోలేదు. అందుచేతనే ప్రథమదశలో "అభ్యుదయ సాహిత్యం" అంటే ఏమిటి అనేది నిర్వచించడం, ఆ సాహిత్యాన్ని సమర్థించుటలో సంఘానికి ఎక్కువ కాలం పట్టింది.

యుగపురుషులైన కందుకూరి, గురజాడ, గిడుగులను సంస్మరించుటేగాక, ఆ ప్రముఖుల సాహిత్య విశిష్టతలను, సందేశాలను, ఆదర్శాలను సాహితీ లోకంలో పరిచయం చేసింది; చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని సన్మానించి జీవితచరిత్రను ప్రకటించింది మనసంఘం.

ద్వితీయ అభ్యుదయ రచయితల మహాసభ విజయవాడలో 1944 డిసెంబర్ 29, 30, 31 తేదీలలో జరిగింది. శ్రీ తెలికిచర్ల వెంకటరత్నంగారు అధ్యక్షత వహించారు, ప్రసిద్ధ ఉర్దూ రచయిత సజ్జాద్ జహీర్ సభను ప్రారంభించారు. ఈ సభనాటికి అభ్యుదయ రచయితల కృషిని గుర్తించి అనేకమంది సాహితీపరులు తమ చేయూతనిచ్చారు. దాదాపు మూడు తరాలవారి సభలలో ప్రసంగించారు. అభ్యుదయ సాహిత్యం, ప్రజాసాహిత్యం అవసరమని ప్రబోధించారు. అభ్యుదయ సాహిత్యోద్యమానికి పూర్వతరాలకు చెందిన నవ్యసాహితీపరులూ ఇతర ప్రముఖులూ ఈ మహాసభకు విచ్చేసి ఆశీస్సులందజేశారు.

తృతీయ మహాసభ రాజమండ్రిలో 1945 డిసెంబర్ 31, 1946 జనవరి ఒకటి, రెండవ తేదీలలో జరిగింది. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. శ్రీ రంగం శ్రీనివాసరావు

గారు మహాసభను ప్రారంభించారు. 1947 లో మద్రాసులో శ్రీ రాజమన్నారుగారి అధ్యక్షతను నాల్గవ మహాసభ జరిగింది. సుప్రసిద్ధ ఉర్దూ రచయిత అబ్బాస్ మహాసభను ప్రారంభించారు. ఈ రెండు సభల మధ్యకాలంలో 1945-47ల మధ్య - తెలుగు తల్లి, అభ్యుదయ పత్రికల ద్వారాను కొన్ని ప్రచురణల ద్వారాను అభ్యుదయ సాహిత్యాన్ని వ్యాపింప చేసింది మనసంఘం. అయితే ఈ సంఘానికి బయట ఈ పత్రికలకు వెలుపల కూడా అనేక ప్రగతి రచనలు వెలువడినై. అవి అభ్యుదయ సాహిత్యోద్యమానికి పుష్టి, సంపన్నతా కల్గించాయి.

మద్రాసు మహాసభ అనంతరం ఒకటి రెండేళ్ళు అభ్యుదయ రచయితలసంఘం పనిచేసినా, తర్వాత దాని కార్యకలాపాలు కుంటుపడ్డాయి. అనేక కారణాలతో పాటు సంఘ నిర్వహణ, పత్రికా నిర్వహణలో జరిగిన లోపాలుకూడ దీనికికొంత దోహదం చేశాయి. ఈ లొసగులను సకాలంలో ఆత్మపరీక్ష చేసుకొని యుండినట్లయితే రచయితలలో తర్వాత ఏర్పడిన నిస్తబ్ధతనూ, ఉపేక్షా భావాన్నీ కొంతవరకు తొలగించ గల్గియుండేది అభ్యుదయ రచయితల సంఘం.

1948 లో ప్రభుత్వ నిర్బంధాలకు కొందరు అభ్యుదయ రచయితల సంఘకార్యకర్తలు గురి అయ్యారు. ఇట్టి పరిస్థితులలో సైతం తమశక్తికొలదీ అభ్యుదయ రచనలు సాగించుతూనే వున్నారు. "అభ్యుదయ" మాస పత్రిక ఆగిపోయినా, రచయితలు పత్రికా నిర్వహణాల్లో అష్టకష్టాలు పడ్డారు. కొన్ని కొత్త సాహిత్య పత్రికలు వెలువడినై. "విశాలాంధ్ర" (పక్షపత్రిక), "నవ సాహితి", "అరుణరేఖ", "సంధ్య"; "ఉదయిని", "దండోరా", "నగారా", "బృందావన",- ఇంకా ఇలాఎన్నో పత్రికలు వెలువడినై. ఇవి సంఘ ఆధ్వర్యాన నడుపబడక పోయినా, సంపాదకుల వ్యక్తిగత అభీష్టాలు మాత్రమే ప్రాతినిధ్యం వహించుతూ వివాదాస్పదమైన వ్యాసాలు కొన్ని ఉన్నా, ఏదోకొంత సాహిత్యసేవ- అందులోనూ అభ్యుదయ సాహిత వృ

సేవ-చేయాలనే ఆకాంక్ష వీటిలో స్పష్టమైంది.

సంఘ నిర్మాణం లేనందునా, సంఘ ఆశయాలను ప్రతిబింబించే సాహిత్య పత్రిక లేనందునా, సహజంగానే అభ్యుదయ రచయితలలో ఒకవిధమైన నిస్తబ్ధతగతఅయిదారు సంవత్సరాలుగా ఆవరించింది. కాని ఈ మధ్య కొంత కాలంగా సంఘ పునర్నిర్మాణాన్ని కాంక్షిస్తూ, రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలను పురస్కరించుకొని మహాసభ సన్నాహక సంఘం కృషి చేసింది. ఈ నాటికీ సభను జయప్రదంగా నిర్వహించకల్గింది,

అభ్యుదయ రచయితల సంఘ నిర్మాణ కార్యకలాపాలను స్థూలంగా ఇందులోసమీక్షించాను. అభ్యుదయ సాహిత్య సమీక్షకు సంబంధించిన మరికొన్ని వ్యాసాలీసంచికలోమరోచోట వున్నాయి.

సంఘ నిర్మాణంతోనే, జయప్రదంగా సభలు నిర్వర్తించుటతోనే అభ్యుదయ సాహిత్యంగాని మరో సాహిత్యంగాని సృజింపబడుతుందని నేను విశ్వసించడం లేదు. మరెవరూ అలా విశ్వసించుతారని తలచను.

జీవిత సత్యాల్ని అవగాహన చేసుకొంటూ, అభ్యుదయ దృక్పధ మలవరచుకొంటూ ఉత్తమ శిల్పమూ ఉదాత్తభావ సంపన్నతకు కృషీ, సాధనా, తపస్సూ చేసిననాడే అభ్యుదయ రచయిత తనసంఘ మహాదాశయాలను ప్రతిబింబించే ఉత్తమ సాహితీ సృష్టిని చేయగలడని నావిశ్వాసం.

అభ్యుదయ సాహిత్యోద్యమ చరిత్రలో - ఈ మహాసభ, మరో నూత్న ఘట్టాన్ని రచిస్తోందని గాఢంగా విశ్వసిస్తున్నాను.

---

మహాసభా విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రముఖు లనేక మంది తమ సందేశాలను పంపించారు. అనివార్య కారణాల వల్ల వాటిని ఇందులో ప్రచురింపలేకపోతున్నాం.

సందేశాలు పంపిన వారందరకూ మా కృతజ్ఞతలు.

— ఆహ్వాన సంఘం.

## China like India is rich in her Cultural and Literary Heritage !

| | | Rs. | As. | Ps. |
|---|---|---|---|---|
| FOLK ARTS OF NEW CHINA (With 40 Plates) | 80 Pages | 0 | 10 | 0 |
| THE DRAGON KING'S DAUGHTER (Ten Tang Dynastry Stories - 618-907 AD) | 100 Pages | 1 | 0 | 0 |
| SELECTED STORIES OF LU HSUN | 253 Pages | 1 | 4 | 0 |
| LI SAO AND OTHER POEMS OF CHU YUAN (340-278 B.C.) | 84 Pages | 1 | 0 | 0 |
| WANG KUEI AND LI HSIANG-HSIANG (Poems) | 34 Pages | 1 | 0 | 0 |
| PEACE THROUGH THE AGES (Translation from the Poets of China) BY REWI ALLEY | 204 Pages | 0 | 14 | 0 |
| THE PEOPLE SPEAK OUT (Translations of Poems and Songs of the Poeple of China) BY REWI ALLEY | 108 Pages | 0 | 8 | 0 |

( POSTAGE EXTRA )

AVAILABLE AT

**VISALAANDHRA PUBLISHING HOUSE**

BUCKINGHAMPET : : VIJAYAWADA

ఫోను నెం. 552

# స్క్రీన్ ఆర్ట్స్

గాంధినగరం — విజయవాడ.

మా వద్ద

సినిమా బేనర్సు, కటౌట్సు, స్లైడ్సు,
సైన్‌బోర్డ్సు, పోస్టరు డిజైన్సు, లైనింగ్ డిజైన్సు,
కమర్షియల్ డిజైన్సు,
పోర్ట్రైట్ ఫొటోలు, లిథో పోస్టర్లు
మరియు
ఇతర అన్నివిధములైన పబ్లిసిటీవర్కులు
మిక్కిలి అందముగా
సరసమైన ధరలకు తయారుచేసి
సకాలములో ఇవ్వబడును.

**G. V. S. SASTHRY,**

*Proprietor,*

SCREEN ARTS,
GANDHINAGAR, VIJAYAWADA.

కృష్ణా పిక్చర్సు

# విజయగౌరి



రామారావు, లలిత, పద్మిని,
రేలంగి, గుమ్మడి, బాలసరస్వతి.

డైరెక్షన్ : **యోగానంద్**

★

తెలుగు నాట వెల్లివిరిసిన
ప్రతి సాహిత్యోద్యమాన్ని
ప్రతిబింబించే గ్రంథాలను
ప్రకటించి, దేశీయులకు
సమర్పించడమే మా లక్ష్యం!

★

దేశి కవితా మండలి,
విజయవాడ-2.

## వీరమాచనేని వెంకటేశ్వరరావు

(హార్డ్‌వేర్ & పెయింట్స్ మర్చంట్)

మా వద్ద బిల్డింగులకు కావలసిన
బందులు, మరమేకులు. బోల్టులు, రంగులు, వార్నిషులు,
ఆస్ బెస్టాస్, సిమెంటు రేకులు, రంగుల అద్దములు,
సాదా అద్దములు, జి. ఐ. పైపులు, పైపు ఫిటింగులు,
సున్నపు డబ్బాలు దొరుకును.

బీసెంటురోడ్డు : : గవర్నరుపేట,
విజయవాడ-2.

ఫోన్ నెం. 599

# నేషనల్ లితో ప్రింటర్సు

**గాంధీనగరం, విజయవాడ-2**

అన్ని రంగులలోను, వివిధ సైజులలోను,

అందముగా పోస్టర్లు, లితోలు,

లేబుల్ వర్కు చేయబడును.

త్వ ర లో నే

ఫోటో ఆఫ్ సెట్టు పరికరములతో

పని ప్రారంభించబడును.

# వీరమాచనేని బ్రదర్సు,

గవర్నరుపేట - విజయవాడ-2.

ప్రొప్రయిటర్సు :

## దుర్గా ఎంపోరియం

ఫోన్ నెం. 330

అన్నిరకములైన యొవర్ సిల్వర్ పాత్రలు సరసమైన ధరలకు దొరకును.

## దుర్గా విలాస్

ఫోన్ నెం. 330–A

(మిలటరీ భోజన హోటల్)

చక్కని భోజన వసతులు చేయబడును. డిన్నరు పార్టీలకు మా ప్రత్యేకత.

## దుర్గా కేఫ్

ఫోన్ నెం. 31

కాఫీ, ఫలహారములకు ప్రసిద్ధి. టీ పార్టీలకు మా ప్రత్యేకత.

ఒకసారి దయచేసిన మీకే తెలియగలదు !

---

# మా రాబోవు చిత్రాలు

1. నారాయణ అండ్ కో వారి "పతియే ప్రత్యక్షదైవము"

అంజలి, నాగయ్య, లలిత, ఆర్. నగేశ్వరరావు మొదలగువారు నటించిన చిత్రం.

2. జూపిటర్ వారి "ఇదే దారి"

అంజలి, యన్. టి. రామారావు, జమున, జగ్గయ్య, రామశర్మ, రాజసులోచన మొదలగువారు నటించిన చిత్రం.

3. సర్వావారి "కిస్మత్" [తెలుగు]

4. రోహిణీవారి "అమృతహస్తం"

5. వినోద్ ఫిలిమ్స్‌వారి "రాజకన్య" [హిందీ]

నళినీ జయవంత్, మనోహరదేశాయ్ మొదలగువారు నటించినది.

6. ప్రొడక్షన్ నెం. 3

నిమ్మి, ప్రదీప్ కుమార్, జీవన్, కేసరి మొదలగువారు నటించినది.

## రాజశ్రీ పిక్చర్సు లిమిటెడ్, విజయవాడ-2

# జనతా పిక్చర్స్

గాంధీనగర్ : : విజయవాడ-2.

- ★ ఇల్లాలు
- ★ షంషేర్ బాజ్ (హిందీ)
- ★ పుట్టిల్లు
- ★ పల్లెటూరు
- ★ మరదలు పెళ్లి
- ★ పరివర్తన

# సాహితీపరులంతా చదవతగ్గ పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| వ్యాసచంద్రిక (వ్యాస సంపుటి) | మహాకవి గురజాడ అప్పారావు | 172 పే. | 1– 8–0 |
| కొండుభట్టీయం – బిల్హణీయం (నాటిక సంపుటి) | ,, | 168 పే. | 1– 8–0 |
| మహాకవి డైరీలు | ,, | 304 పే. | 2– 8–0 |
| ముత్యాల సరాలు (గేయ సంపుటి) | ,, | 56 పే. | 0–10–0 |
| ఆణిముత్యాలు (కథల సంపుటి) | ,, | 94 పే. | 1– 0–0 |

★

| | | | |
|---|---|---|---|
| కొత్తపాళీ | తాపీ ధర్మారావు | | |
| రచయితా–శిల్పమూ | ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ | 100 పే. | 0–12–0 |

పోస్టేజి అదనం

ప్రతులకు :

**విశాలాంధ్ర ప్రచురణాలయం**

బకింగ్‌హాంపేట, : : విజయవాడ.


Printed at Swatantra Art Printers, Vijayawada-2